# శ్రీ మాణిక్య చరితామృతము

**చతుర్థ దత్తావతారులైన**

**శ్రీ సద్గురు మాణిక్యప్రభు మహారాజులవారి**

**సమగ్ర చరిత్రాత్మక**

## నిత్య పారాయణ గ్రంథము

-0-0-0-0-


మరాఠీ మూల గ్రంథకర్త:

శ్రీ గణేశ్ రఘునాథ్ కులకర్ణి

తెలుగు అనువాదం:

సౌ. మమత ఆనందరాజ్ ప్రభు

అనువాద సహకారం:

శ్రీ జి. వి. ఎస్. మూర్తి

శ్రీమతి జి. వి. శేషమ్మ మూర్తి

ప్రకాశకులు:

శ్రీ మాణిక ప్రభు సంస్థానము
మాణికనగర్-585353, జి. బీదర్, కర్నాటక.

©
సర్వ హక్కులు ప్రకాశకులవి

ముద్రణ:
కే. జోశి అండ్ కంపని
ఆఫ్‌సెట్ ప్రింటర్స్ - పునా

మూల్యము - ₹200

॥శ్రీ॥

అథ సమర్పణమ్

ఉమాహ్లాదకరో దేవః శ్రీసాంబకులభూషణః ।
గణేశః పాతు నః సర్వాన్ సర్వకార్యార్థసిద్ధిదః ॥



వందే దత్తావధూతం విధిహరిశివరూపాత్మకం దేశికాద్యమ్।
శ్రీపాదశ్రీశవాచ్యం శ్రితవివదవహం చిద్ఘనైకం ద్వితీయమ్।
తార్తీయం శ్రీనృసింహం యతికులతిలకం భక్తకార్యామరద్రుమ్।
శ్రీమాణిక్యప్రభుం తం సకలమతగురుం శుద్ధసత్త్వం చతుర్థమ్॥

# మంగళాచరణము

శ్రీ భక్తకార్యకల్పద్రుమ
గురుసార్వభౌమ
శ్రీమద్రాజాధిరాజ యోగిమహారాజ
త్రిభువనానంద అద్వైత అభేద
నిరంజన నిర్గుణ నిరాలంబ
పరిపూర్ణ సదోదిత సకలమతస్థాపిత
శ్రీ సద్గురు మాణిక్యప్రభు
మహారాజ్ కీ జయ్!




చతుర్థ దత్తావతారులైన

శ్రీ సద్గురు మాణిక్‌ప్రభు మహారాజ్

# శ్రీ ప్రభు ఉత్తరాధికారులు




శ్రీ మనోహర్ మాణిక్‌ప్రభు మహారాజ్
(జన్మము – 1858) 1865 – 1877




శ్రీ మార్తాండ మాణిక్‌ప్రభు మహారాజ్
(జన్మము – 1861) 1877 – 1936



శ్రీ శంకర్ మాణిక్‌ప్రభు మహారాజ్
(జన్మము – 1895) 1936 – 1945




శ్రీ సిద్ధరాజ్ మాణిక్‌ప్రభు మహారాజ్
(జన్మము – 1939) 1945 – 2009



శ్రీ జ్ఞానరాజ్ మాణిక్‌ప్రభు మహారాజ్
(జన్మము – 1958) 2009 – ప్రస్తుతం



శ్రీ ప్రభు సమాధి



శ్రీ ప్రభు మందిరము



శ్రీ వెంకమ్మ దేవి



శ్రీ వెంకమ్మ దేవి సమాధి

॥ श्री प्रभु अवधूत ॥



### శ్రీ జ్ఞానరాజ్ మాణిక్యప్రభు మహారాజుగారి

# శుభాశీర్వాదములు

సకల మతాచార్య శ్రీ మాణిక్‌ప్రభు మహారాజుల సవివర నిత్య పారాయణ గ్రంథం ప్రచురింపబడటం మాకు అమితానందాన్ని కలిగిస్తుంది. ఈ ప్రపంచంలో సృష్టి-స్థితి-లయాత్మక సంఘటనలు ఏవి జరిగినా వాటన్నింటికి ప్రేరణ ప్రభువే అయి ఉన్నారు. 'కర్తుమ్ అకర్తుమ్ అన్యథాకర్తుమ్' ఈ శక్తి నిశ్చయంగా ప్రభువులోనే ఉన్నది. వారి కోరికకు విరుద్ధంగా, వారి ప్రేరణ లేకుండా చెట్టు ఆకు కూడా కదలదు. ఈ జగత్తులో జరిగింది, జరుగుతున్నది, జరుగబోయేది అంతా కేవలం శ్రీ ప్రభు ప్రేరణతోనే జరుగుతుందనడంలో సంశయం లేదు. అదంతా ప్రభు కృపయే. ప్రభు కృప ఎవరిపై కలుగుతుందో వారు ధన్యులు. ప్రభు భక్తులు ఆంధ్రప్రదేశ్‌లో చాలా మంది ఉన్నారు. ఇంతకు ముందు శ్రీ గంటి రెడ్డయ్య గారు అనువదించిన శ్రీ మాణిక్య ప్రభు చరిత్ర సంక్షిప్తముగా ఉండడం వల్ల పారాయణం కోసం తెలుగులో గ్రంథం అవసరం ఉండేది. ప్రభు యొక్క అద్భుత లీలలు వారి చరిత్ర ఎంత వర్ణించినా తక్కువే. కానీ చాలా సంవత్సరాల నుండి శ్రీ గణేశ్ రఘునాథ్ కులకర్ణిగారు వ్రాసిన సవివర మరాఠీ చరిత్రను అనువాదము చేసి అందించాలని అనేక మంది పాఠకులు కోరడం జరిగింది. వారి కోరిక మేరకు సౌ. మమత ఆనంద్‌రాజ్ ప్రభు సమగ్ర మరాఠీ చరిత్రను తెలుగుభాషలోకి అనువదించి మాణిక్య చరితామృతము అనే పేరుతో నిత్యపారాయణ గ్రంథంగా మలిచి, తెలుగు ప్రభు భక్తులకు వారి లీలలను పూర్తిగా తెలుసుకునే అవకాశం కల్పించి అమూల్య ప్రభుసేవ చేశారు. వారికి ఈ కార్యంలో శ్రీమతి జి.వి.శేషమ్మ మరియు శ్రీ జి.వి.యస్. మూర్తిగారి విశేష సహకారం లభించింది. ఈ గ్రంథం యొక్క ప్రచురణ కార్యంలో ధన సహాయాన్ని అందించిన శ్రీ గరివెళ్ల వేంకట సూర్యనారాయణ-విజయనగరం మరియు శ్రీమతి సరోజ ప్రభాకరరావ్

మాలిపటేల్-బోధన్, వీరు పరిపూర్ణ భక్తితో చేసిన సేవను స్వీకరించి చతుర్థ దత్తావతారులైన శ్రీ ప్రభువు గ్రంథ రూపంలో ప్రకటితమవుతున్నారు.

శ్రీ ప్రభు చరిత్రను ఎవరైతే చదువుతారో వారికి దానిలోని మాధుర్యం తెలుస్తుంది. దానిని మాటలలో వర్ణించలేము. ప్రభువు యొక్క లీలా మాధుర్యం యొక్క మననం మరియు శ్రవణంతోనే సంసార దుఃఖ బాధ లేకుండా అన్నివైపులా ఆనందసాక్షాత్కారం కలుగుతుంది. శ్రీ ప్రభు భక్తకార్య కల్పద్రుమములై ఉన్నారు. వారు భక్తుల మనోకామనలను పూర్తి చేయడానికి అవతరించారు. ఈ గ్రంథాన్ని భక్తితో పారాయణం చేయడంవల్ల మనోవాంఛలు పూర్తవుతాయనడంలో సంశయం లేదు.

పారాయణ పద్ధతి, పూజావిధి, నియమాలు మొదలైన విషయాలు ఇవ్వబడినాయి. భక్తులు ఆ విధంగా పారాయణ చేస్తే శ్రీ ప్రభు కృపతో సాధకుల కోరికలు తీరుస్తారనడంలో సందేహం లేదు.

శ్రీ మాణిక ప్రభువు సగుణ సాకార రూపం ధరించి దుఃఖ జీవుల ఉద్ధరణ కోసం అనేక లీలలు చూపించారు. వాటిలో కొన్ని ఈ మాణిక్య చరితామృతంలో వ్రాయబడినాయి. భక్తి భావంతోమరియు శ్రద్ధతో నియమిత ఉపాసన వల్ల మనోవాంఛిత ఫలప్రాప్తి చేసుకోవచ్చు.

పారాయణం చేస్తున్నప్పుడు వెలువడే ధ్వనితరంగాలు సృష్టిలో మనకు కావలసిన శక్తిని, లేదా ఇష్టఫలాన్ని అయస్కాంతం వలె ఆకర్షించి పారాయణం చేసే భక్తుల కోరికలను తీరుస్తాయనడంలో అతిశయోక్తి లేదు.

ఈ చరిత్ర ద్వారా ప్రభు యొక్క దైవీ సామర్థ్యం తెలిసి, ప్రభువుకు భక్తులకు మధ్య అద్వైత స్థాపనకు వారధి కాగలదు. ఈ దివ్య చరితామృతాన్ని ఆస్వాదించిన పాఠకులకు ప్రభు యొక్క దివ్యసాక్షాత్కారం కలిగి వారి కృపాశీర్వాదం పొందాలని ఆశీర్వదిస్తున్నాము.

ఫాల్గుణ కృష్ణ చతుర్థి – మాణిక శకం 197.

# పారాయణ విధానం

అత్యంత దుర్లభమైన మానవజన్మ పొందిన మనుష్యులు దానిని సార్థకం చేసుకుంటేనే జన్మనిచ్చిన ఈశ్వరుని రుణం తీర్చుకున్నట్లవుతుంది. అందుకని మానవులు అత్యంత శ్రేష్ఠమైన ఆత్మకల్యాణం చేసుకొని కృతార్థులవ్వాలి. మానవుని దైన్యావస్థ దూరమయి ఆనందమయ సామ్రాట్ పదవిపై ఆరూఢులను చేయడానికి ఈశ్వరుడు సత్పురుషులుగా జగత్తులో అవతరించి మానవులకు వారి వాస్తవిక స్వరూపాన్ని తెలియపరుస్తారు. ఇలాంటి సంత్ రూపులైన ఈశ్వరావతారంలో సర్వాంగ సుందరులైన, సర్వశ్రేష్ఠులైన, ప్రాతఃస్మరణీయులైనవారు శ్రీ సద్గురు మాణిక్ ప్రభు మహారాజ్. వీరు శ్రీ గురు దత్తాత్రేయుల చతుర్థ అవతారులని సర్వ ప్రసిద్ధమే.

భక్తి-భావనతో మరియు శ్రద్ధతో నియమిత ఉపాసన చేయడం వల్ల శ్రీ ప్రభు వద్ద మన యోగ్యత పెరగవచ్చు. శ్రద్ధ మరియు దృఢవిశ్వాసంతో మనం ఉపాసన చేసే దైవం నుండి మనోవాంఛిత ఫల ప్రాప్తి చేసుకోగలం అనడంలో సందేహం లేదు.

## పారాయణ నియమాలు:

1) పారాయణం జాతి-మత భేదం లేకుండా స్త్రీ పురుషులందరూ చేయవచ్చు.

2) ఈ పారాయణాన్ని గురువారం ప్రారంభించి బుధవారం రోజు ముగించాలి. లేదా మనకు అనుకూలమైన రోజున ప్రారంభించి ఏడవరోజు ముగించవచ్చు.

3) ఎవరైనా నెల రోజులు పారాయణం చేయాలనుకుంటే వారు 1. శ్రావణమాసం 2. మార్గశిర మాసం 3. అధిక మాసాలలో పూర్తి నెల రోజులు పారాయణం చేయాలి.

4) భక్తులెవరైనా నిస్వార్థ నిష్కామ భావనతో రోజూ కొంత కొంత పారాయణం చేయాలనుకుంటే దాని వల్ల ఆధ్యాత్మికాభివృద్ధి కలిగి వారి జీవనం సఫలమవుతుంది.

5) శ్రీ దత్తజయంతి అంటే శ్రీ మాణిక్యప్రభు జన్మోత్సవము. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుచరిత్ర పారాయణాన్ని చేయాలనుకుంటే ఏడురోజులు చేయాలి. పారాయణాన్ని జయంతికి ముందురోజు ముగించి జయంతి రోజు (మార్గశిర పౌర్ణిమ రోజు) కేవలం ప్రభుజన్మ పారాయణను చదివి శ్రీ ప్రభుజన్మోత్సవ పుష్పవృష్టి చేసి ఆనందోత్సవం చేయాలి.

6) ఏడు రోజులు నియమంతో పారాయణం చేయాలనుకుంటే మాత్రం ఒకపూట భోజనం చేయాలి. రోజూ చేసేవారు, నెల రోజులు పారాయణం చేసేవారు ఈ నియమం పాటించవలసిన అవసరం లేదు.

7) శుచిగా, శ్రద్ధాసక్తులతో పారాయణం చేయడం ముఖ్యం. తమ దేహానికి కష్టం కలిగిస్తూ చేయాల్సిన అవసరం లేదు. పారాయణ కాలంలో శ్రీ మాణిక్ ప్రభు భజనలను చేయవచ్చు.

8) పారాయణం చేయడానికి ముందు ఒక పీటపై (చౌకిపీట) శ్రీ ప్రభు చిత్రపటం పెట్టి ముందు ప్రభుచరిత్ర గ్రంథాన్ని ఉంచాలి. పుస్తకాన్ని పూజించి ప్రభు చిత్రపటానికి పూల దండ వేయాలి. కుంకుమ పెట్టి కొబ్బరి కాయ ముందు పెట్టి మరియు శ్రీ ప్రభువును మనస్సులోనే స్మరిస్తూ, ఏదైతే కోరిక ఉందో దానిని ఉచ్చరిస్తూ చేతులు జోడించి తక్కువ స్వరంతో, దాని ప్రీత్యర్థం నేను ఈ పారాయణం చేస్తున్నాను అని సంకల్పం చేసి 'భక్తకార్యకల్పద్రుమ' బిరుదావళిని పఠించి పుస్తకాన్ని ఇతరులకు వినిపించేట్లు అంటే మన పారాయణం మనకు వినిపించే విధంగా చదవుకోవాలి.

9) ఎవరైనా శాస్త్రోక్తంగా పూజ చేసి పారాయణం ప్రారంభించాలనుకుంటే శాస్త్రోక్త పూజ చేసి పారాయణం ప్రారంభించవచ్చు. తప్పకుండా శాస్త్రోక్త పూజచేసి పారాయణం చేయాలనే నియమం లేదు.

భక్తకార్యకల్పద్రుమ మంత్రం పఠించి కూడా పారాయణాన్ని ప్రారంభించవచ్చు. శాస్త్రోక్తపూజ చేయాలనుకునే వారి కోసం సంక్షిప్త పూజా మంత్రాలను క్రింద ఇస్తున్నాం. వాటిని వారు ఉపయోగించుకోవచ్చు.

వీటన్నింటిని పాటిస్తూ శ్రద్ధగల భక్తులు తమ మనోరథాన్ని పూర్తిచేసుకోవాలని ప్రభుచరణాలలో మా వినమ్ర ప్రార్థన.

# పూజా విధి

శ్రీ మాణిక్య చరితామృతం ప్రారంభించడానికి ముందు మరియు ముగిసిన తరువాత పుస్తకానికి యథావిధి పూజ చేయాలి.

ఒక పీటపై ప్రభు చిత్రపటాన్ని పెట్టి పుస్తకాన్ని ఉంచాలి. పారాయణం చేసే వారు తూర్పు ముఖంగా కూర్చుని ప్రభు ఫోటో పడమర వైపు ఉంచాలి. పూజ చేస్తున్నప్పుడు దర్భతో చేసిన, లేదా ఊలుతో చేసిన ఆసనాన్ని వేసుకోవాలి. కర్ర పీటపై కూర్చోరాదు. పూజాసామాగ్రి అంతా దగ్గర పెట్టుకోవాలి. దీపారాధన చేసి ఘంటానాదంతో పూజను ప్రారంభించాలి.

శ్రీగణేశాయ నమః॥ శ్రీసరస్వత్యై నమః॥ శ్రీగురుమాణికాయ నమః॥
శ్రీ భక్తకార్యకల్పద్రుమ గురుసార్వ భౌమ శ్రీమద్రాజాధిరాజ యోగిమహారాజ
త్రిభువనానన్ద అద్వైత అభేద నిరంజన నిర్గుణ నిరాలంబ పరిపూర్ణ సదోదిత
సకలమతస్థాపిత శ్రీ సద్గురు మాణిక్రప్రభు మహారాజ కీ జయ్।

ఓం కేశవాయ స్వాహా। నారాయణాయ స్వాహా। మాధవాయ స్వాహా।

ఈ మూడు నామాలతో ఆచమనం చేసి –

గోవిందాయ నమః।

ఈ మంత్రంతో హస్తప్రక్షాళనం చేసుకొని క్రింది విధంగా భగవన్నామస్మరణ చేయాలి.

విష్ణవే నమః। మధుసూదనాయ నమః। త్రివిక్రమాయ నమః। వామనాయ నమః।
శ్రీధరాయ నమః। హృషీకేశాయ నమః। పద్మనాభాయ నమః।
దామోదరాయ నమః। సంకర్షణాయ నమః। వాసుదేవాయ నమః।
ప్రద్యుమ్నాయ నమః। అనిరుద్ధాయ నమః। పురుషోత్తమాయ నమః।
అధోక్షజాయ నమః। నారసింహాయ నమః। అచ్యుతాయ నమః।
జనార్దనాయ నమః। ఉపేంద్రాయ నమః। హరయే నమః।
శ్రీకృష్ణపరమాత్మనే నమః।

ప్రణవస్య పరబ్రహ్మఋషిః। పరమాత్మా దేవతా। దైవీగాయత్రీచ్ఛందః।
ప్రాణాయామే వినియోగః॥

ఓం భూః ఓం భువః ఓం స్వః ఓం మహః ఓం జనః ఓం తపః ఓం సత్యం
ఓం తత్సవితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి।

ధియో యో నః ప్రచోదయాత్॥
ఓం ఆపోజ్యోతీ రసోమృతం బ్రహ్మ భూర్భువః స్వరోమ్॥

ఈ ప్రకారం ప్రాణాయామం చేసిన తరువాత దేశకాలోచ్చార పూర్వకంగా పారాయణ సంకల్పం చేయాలి.

శ్రీమద్భగవతో మహాపురుషస్య శ్రీమహావిష్ణోరాజ్ఞయా ప్రవర్తమానస్య అద్య
బ్రహ్మణః ద్వితీయే పరార్ధే శ్రీశ్వేతవారాహకల్పే వైవస్వత మన్వంతరే కలియుగే
కలిప్రథమచరణే భరతవర్షే భరతఖండే జంబూ ద్వీపే దండకారణ్యేదేశే గోదావర్యాః
దక్షిణేతీరే శాలివాహన శకే బౌద్ధావతారే రామక్షేత్రే అస్మిన్ వర్తమాన వ్యావహారికే
.....నామ సంవత్సరే ....మయనే ....ఋతౌ ....మాసే ....పక్షే .... తిథౌ
....వాసరే ....దివసే శుభనక్షత్రే శుభయోగే శుభకరణే ఏవం గుణవిశేషణ
విశిష్టాయాం శుభతిథౌ అస్మాకం సహకుటుంబానాం క్షేమస్థైర్య ఆయురారోగ్య

ఐశ్వర్యాభివృద్ధ్యర్థం సమస్తసన్మంగళావాప్త్యర్థం సమస్తదురితోపశాంత్యర్థం చ
ఆయుష్కామ్యార్థ ఫల సిద్ధ్యర్థం ....గోత్రోత్పన్నస్య ....శర్మణః మమ
ఇహజన్మజన్మని శ్రీ సద్గురు మాణిక్యప్రభు గురురాజదేవతా ప్రీతిద్వారా సర్వాపత్
శాంతిపూర్వక దీర్ఘాయుః విపులధన పుత్రపౌత్రాద్యవిచ్ఛిన్న సంతతివృద్ధి స్థిరలక్ష్మీ
కీర్తిలాభ శత్రుపరాజయ సదాభీష్టసిద్ధ్యర్థం శ్రీ సద్గురు మాణిక్యప్రభు
గురురాజదేవతాముద్దిశ్య శ్రీ సద్గురు మాణిక్యప్రభు గురురాజదేవతా ప్రీత్యర్థం ....
తిథిమారభ్య .... తిథిపర్యంతం సప్తాహపక్షమాశ్రిత్య శ్రీమాణిక్యచరితామృత
గ్రంథస్య పారాయణమహం కరిష్యే॥

అంటూ ఉద్ధరిణిలో నీరు తీసుకొని వదలాలి.

తదంగత్వేన గ్రంథరూపీ శ్రీ సద్గురు మాణిక్యప్రభు గురురాజదేవతా ప్రీత్యర్థం
శ్రీమనోహరమునివర్యవిరచిత ధ్యానావాహనాది
షోడశోపచారపూజనమహం కరిష్యే॥

పారాయణం మొదటిరోజు ఈ విధంగా మహాసంకల్పం చేసి పూజ ప్రారంభించాలి. ఇతర రోజులలో దేశకాలోచ్చారం చేసి 'శుభతిథౌ' తరువాత

పూర్వసంకల్పిత మనోకామనాసిద్ధ్యర్థం పూర్వసంకల్పితరీత్యా
శ్రీమాణికచరితామృత గ్రంథస్య పారాయణమహం కరిష్యే॥

ఈ విధంగా సంకల్పం చేసి పూజ ప్రారంభించాలి. సంకల్పం సమయంలో కుడి చేతితో అక్షింతలు మరియు నీరు విడవాలి. సంకల్పంలో ఎక్కడెక్కడైతే 'అముక' అనే శబ్దం వచ్చిందో అక్కడ యోగ్యపదం ఉదా: అముక నామ సంవత్సరే అంటే జయనామ సంవత్సరే (ఏ సంవత్సరం అయితే ఆ సంవత్సరం పేరు) అని ఉపయోగించాలి.

శ్రీయోగి-పుంగవ-సురావలి-పూజితాంఘ్రిం
మాయాంధకార-పరిభేదన-తిగ్మ-రశ్మిమ్।
ధ్యాయేత్రయీమయమచిన్త్య-మహానుభావం జ్ఞేయం సతాం

మణిగురు-ప్రభురాజ-మౌలిమ్॥
మందస్మితాననమనిందిత-సుందరాంగం
వందారు-కల్పవనమాదృత-మానుషాంగమ్।
వృందారకాలి పరి-వేష్టితమిందిరేశం వందే మణీంద్ర గురు-నామకమాద్య-తేజః॥
యోగాసనస్థం ఘనచిత్ప్రకాశం భోగాది-భక్తేప్సిత-కామధేనుమ్।
వాగాది-విద్యాకృతిమాదిదేవం సౌగుణ్యవార్ధిం శరణం ప్రజామి॥
చిన్ముద్రాంచిత-హస్త-యుగ్మమతులం సన్మార్గదం సేవతామ్।
జన్మాది-ప్రవిదూర-వీక్షణలవం తన్మాత్రలక్ష్యం సదా।

మన్మస్తాంతర-దివ్య-పద్మ-గలితం చిన్మాత్ర-గమ్యం సదా।
హృన్మాయా-వినివృత్తయేత్ర సతతం వీక్షామి సంభావితమ్॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః। ధ్యాయామి ధ్యానం సమర్పయామి॥

శ్రీ ప్రభు ధ్యానమైన పై శ్లోకాన్ని పఠిస్తూ శ్రీ ప్రభువు సగుణరూపాన్ని మనస్సులోనే ధ్యానిస్తూ అక్షింతలు వేయాలి.

ఆవాహయామీహ జగన్నివాస దేవాదిదేవాచ్యుత మాణికేంద్ర।
కో వాస్తి నేతా నత-సంతతీనాం భువి త్వదన్యః పరమం పదం త్వమ్॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః। ఆవాహయామి॥

ఈ విధంగా మనస్సులోనే శ్రీ ప్రభువును ఆవాహనం చేసుకొని శ్రీప్రభువు ప్రత్యక్షరూపంలో విరాజమానులయ్యారనే భావనతో అక్షింతలు సమర్పించాలి.

శ్రీ-రత్న-సింహాసనమేతదీశ భూరత్న తుభ్యం ప్రదదామి విష్ణో।
గురు-త్రయాకార పురత్రయేశ కురు త్రిలోకీ రమణైనమార్యమ్॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః। ఆసనం సమర్పయామి॥

ఈ శ్లోకంతో శ్రీ ప్రభువు ఆసనాన్ని సమర్పించాలి. (అక్షింతలు వేయాలి)

పాద్యం దదామి నత-సంతతి-భాగధేయ
వేద్యాయ వేద్యవచసా మణిదేశికేంద్ర।
ఆద్యాయ సర్వ-జగతాం నిజ-భక్త-లోకా-స్వాద్యం
మయా శుచి సమాహృతమచ్ఛమంబు॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః।
పాదయోః పాద్యం సమర్పయామి॥

ఈ శ్లోకంతో ఉద్ధరిణిలో నీటిని తీసుకొని సంధ్యాపాత్రలో పోస్తూ పాద్యం సమర్పించాలి.

ఉశీర-మల్లీ-కుసుమాది-దివ్య-సువాసనా-వాసితమర్ఘ్యవారి।
ప్రదీయతే హస్త-సరోజ-యుగ్మే ప్రసారయామ్యద్య గురో మణీంద్ర॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః। హస్తయోః అర్ఘ్యం సమర్పయామి॥

సుగంధద్రవ్య మిశ్రితమైన నీటితో ప్రోక్షణ చేసి అర్ఘ్యాన్ని సమర్పించాలి.

సౌవర్ణపాత్రే సలిలం మయేదం సమాహృతం భక్తివశాద్విశుద్ధమ్।
శ్రీశర్కరాద్యైరభిమిశ్రితం చ భూచక్రనాథాచమనం కురుష్వ॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః। ముఖే ఆచమనీయం సమర్పయామి॥

చెక్కర మిశ్రిత నీటి ప్రోక్షణంతో ఆచమనం సమర్పించాలి.

పంచామృతైరీశ గురో మణీంద్ర సించామి తే దివ్య మనోహరాంగమ్।
పంచాననస్త్వం నను వైరిహస్తిట్ పంచత్వకృత్యే మణిదేశికేంద్ర॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః।
పయాది పంచామృతస్నానం సమర్పయామి॥

పెరుగు, పాలు, నెయ్యి, తేనె, చెక్కర, అరటిపండు మొదలైన మధుర పదార్థాల మిశ్రమంతో ప్రోక్షణ చేసి పంచామృత స్నానం సమర్పించాలి.

శ్రీగంగాయమునాదిదివ్యతటినీసింధూత్తమాద్యాహృతైః
శుద్ధాంభోభిరిహాతనుష్వ మహిత-స్నానం మదిష్టాప్తయే।
యత్స్నానాంబుభిరేవ భూర్యఘమహో ధన్యం స్వయం మన్యతే స్వాత్మానం
హరిశంభుకంజరుహభూమూర్తే మణీట్దేశిక॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః। శుద్ధోదకస్నానం సమర్పయామి॥

కేసరి (కుంకుమపువ్వు) మిశ్రిత శుద్ధ జలంతో శ్రీ ప్రభువుకు శుద్ధోదక స్నానాన్ని సమర్పించాలి. మంత్రపఠనం వస్తే రుద్రం, మన్యుసూక్తం, పురుషసూక్తం, గణపతి అథర్వశీర్షం, శ్రీసూక్తాలు పఠిస్తూ అభిషేకం చేయాలి. మంత్ర పఠనం చేయలేకపోతే ' భక్తకార్య కల్పద్రుమ' మహామంత్రం జపిస్తూ అభిషేకం చేయవచ్చు.

పీతాంబరద్వంద్వమిదం మహేశానీతం లసద్ధాటకతంతుక్లృప్తమ్।
సమంచితం భో పరిధత్స్వ యోగిన్నుత్తరీయం చ వరం విదేహి॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః। వస్త్రయుగ్మం సమర్పయామి॥

శ్రీ ప్రభువుకు పత్తితో చేసిన వస్త్రమాల సమర్పించాలి.

కర్పూరకాలాగరుముఖ్య-గన్ధైర్ఘనం మయా చందనమేతదార్య।
లిప్తం తవాంగే వినివారణాయ మమ ప్రకృత్యా వినిలేపనస్య॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః। గంధం సమర్పయామి॥

ఈ శ్లోకంతో శ్రీ ప్రభువుకు చందనాది సుగంధ ద్రవ్యాలైన అత్తరు, పసుపు, కుంకుమ, అష్టగంధము, బుక్క (నలుపు పొడి) మొదలైనవి సమర్పించాలి.

శ్రీ-మాలతీ-జాతి-సరోజ-మల్లీ-ప్రవాల-బిల్వాతసికా-సుమాని।
సమర్పయామీహ మణీశదివ్యానుతాక్షతాన్ మౌక్తికమాలికాశ్చ॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః। పుష్పాక్షతాన్ సమర్పయామి॥

ఈ శ్లోకంతో శ్రీ ప్రభువుకు పూలహారం, అనేక రకాలైన పువ్వులు, బిల్వపత్రం, తులసీదళం మరియు అక్షింతలు సమర్పించాలి.

శ్రీమద్దశాంగాంచిత-ధూపమేనం సగోఘృతం చందనవహ్నిక్లృప్తమ్।
గృహాణ మాణిక్య-విభో దదామి స్పృహాస్తు తేఽత్ర స్పృహధీరధీశ॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః। ధూపమాఘ్రాపయామి॥

ఈ శ్లోకంతో శ్రీ ప్రభువుకు ధూప ఆరతి సమర్పించాలి. (అగరబత్తి వెలిగించి తిప్పాలి)

సమస్తిలోకాంధకనాశనాయ వైశ్వానరేణార్పితదీపమేనమ్।
గృహాణ భక్త్యా వినివేశితం చ సుగోఘృతేనాఽశ్రుతివర్తియుక్తమ్॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః। ఏకార్తిక్య దీపం దర్శయామి॥

ఈ శ్లోకంతో శ్రీ ప్రభువుకు దీపం చూపించాలి.

నానా భక్ష్యైశ్చ భోజ్యైశ్చ రసైః షడ్భిస్సమన్వితమ్।
నైవేద్యం గృహ్యతాం దేవ ప్రసీద మాణికేశ్వర॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః। నైవేద్యం సమర్పయామి॥
ఉత్తరాపోశనం సమర్పయామి॥ హస్తప్రక్షాలనముఖప్రక్షాలనం సమర్పయామి॥

ఈ శ్లోకంతో శ్రీ ప్రభువుకు అనేక రకాలైన ఫలాలు, మిఠాయి (పేడా) మొదలైనవి సమర్పించి ఉత్తరాపోషనార్థం దానితో పాటు ప్రక్షాళనార్థం నీరు విడవాలి.

ఏలా-లవంగ-కర్పూర-పూగీఫల-సమాయుతమ్।
నాగవల్లీదలైర్యుక్తం తాంబూలం స్వీకురు ప్రభో॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః।
పూగీఫల తాంబూలం సమర్పయామి॥

ఈ శ్లోకంతో శ్రీ ప్రభువుకు తాంబూలం సమర్పించాలి.

ఫలేన ఫలితం సర్వం త్రైలోక్యం సచరాచరమ్।
తస్మాత్ ఫలప్రదానేన సఫలాశ్చ మనోరథాః॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః। ఫలాని సమర్పయామి॥

ఈ శ్లోకంతో శ్రీ ప్రభువుకు అనేక రకాలైన ఫలాలు సమర్పించాలి.

హిరణ్యగర్భ-గర్భస్థం కార్తస్వర-వినిర్మితమ్।
కుసుమానాం చ యద్దివ్యం మణీంద్ర ప్రతిగృహ్యతామ్॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః। సువర్ణపుష్ప దక్షిణాం సమర్పయామి॥

ఈ శ్లోకంతో శ్రీ ప్రభువుకు యథాశక్తి దక్షిణ సమర్పించాలి.

మహాంధకార-సంమగ్నం మాం సముద్ధర తేజసా।
త్రైలోక్యముజ్జ్వలం దీవ్యమార్తిక్యం ప్రతిగృహ్యతామ్॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః।
మంగళమహానీరాజనదీపం దర్శయామి॥

ఈ విధంగా మంగళమహానిరాజనదీపం (ఆరతి) ప్రజ్వలించి క్రింద ఇచ్చిన దత్తాత్రేయుల ఆరతి అంటూ లేదా ఏదైనా తమకు వచ్చిన ఆరతి అంటూ ఆరతి ఇవ్వాలి.

జయ దేవ జయ దేవ దత్తా అవధూతా।
ఆరతీ ఓవాళూ తుజ సద్గురునాథా॥ధ్రు.॥
స్వచ్ఛందే వ్యవహారీ ఆనందభరితా। కాయా మాయాతీతా అనసూయాసూతా॥1॥
రజతమసత్వావిరహిత దత్తాత్రేయ నామా। నామాకామాతీతా చైతన్యధామా॥2॥
నానావేషధారీ సర్వాంతర్యామీ। అనన్యభావే శరణ దిన మాణిక నామీ॥3॥

ఆరామకుసుమైర్యుక్తమక్షతైశ్చ సమన్వితమ్।
మంత్రపుష్పాంజలిం దేవ గృహ్యతాం మణిదేశిక॥
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః। మంత్రపుష్పాంజలిం సమర్పయామి॥

ఈ శ్లోకంతో పువ్వులు మరియు అక్షింతలు వేయాలి.
దత్తాత్రేయాయ విద్మహే యోగిరాజాయ ధీమహి। తన్నో మాణిక: ప్రచోదయాత్।
శ్రీమాణిక్యప్రభు మహారాజాయనమః। నమస్కారాన్ సమర్పయామి॥

ఇలా అంటూ నమస్కారం చేయాలి.

యస్యస్మృత్యా చ నామోక్త్యా జప: పూజాక్రియాదిషు।
న్యూనం సంపూర్ణతాం యాతి సద్యో వందే తమచ్యుతమ్॥

మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం మహాగురో।
యత్పూజితం మయా దేవ పరిపూర్ణం తదస్తు మే॥

అనేన శ్రీమనోహరమునివర్యవిరచిత ధ్యానావాహనాది షోడశోపచారపూజనేన
శ్రీగురుమాణిక్యప్రభుమహారాజ: ప్రీయతామ్॥ ప్రీతో భవతు॥

ఈ షోడశోపచార పూజ ప్రభువుకు ప్రియమవ్వాలని భావించి అక్షింతలు నీరు విడిచి పూజను శ్రీ ప్రభువుకు నివేదించాలి.

ఎవరికైతే పై శాస్త్రోక్త పూజా విధానం కఠినమనిపిస్తే వారు కేవలం భక్తకార్య కల్పద్రుమ మహామంత్రం పఠించి మానసపూజాస్తోత్రం పఠించి మనస్సులోనే శ్రీ ప్రభువుకు నమస్కరించి పారాయణం ప్రారంభించవచ్చు. అలాంటి వారి ఉపయోగం కోసం మానస పూజా స్తోత్రం క్రింద ఇవ్వబడింది.

## శ్రీ మాణికమానసపూజా స్తోత్రం

హైమం రత్నయుతం హి చాసనమిదం స్నానం తు
గంగాజలైర్వస్త్రం పట్టదుకూల స్వర్ణసహితం కస్తూరికాచందనమ్।
కంజం కేతకిపారిజాతసహితం పుష్పం చ సౌగంధికం ధూపం
దీపమిదం గృహాణ రచితం చిత్తేన భో మాణిక॥1॥
హైమే రత్నయుతే సుమౌక్తికయుతే పాత్రే త్విదం పాయసం
దుగ్ధం శర్కరయా యుతం సుమధురం భక్ష్యం చ లేహ్యాదికం॥
తిక్తామ్లాదియుతం చ శాకసహితం కర్పూరయుక్తం జలం
తాంబూలం కదలీఫలం చ పనసం భక్త్యా కృతం స్వీకురు॥2॥

ఛత్రం స్వర్ణయుతం చ చామరమిదం చాదర్శనం సోజ్జ్వలం
వీణాశంఖమృదంగభేరినహితం నృత్యం చ గీతం తథా॥
సాష్టాంగం నమనం కృతం చ స్తవనం భక్త్యా మయా తే విభో
తాం త్వం మాణిక కల్పితాం తు మనసా పూజామిమాం స్వీకురు॥3॥
ఆత్మా త్వం గురుమాణికప్రభువర ప్రాణాస్త్వమే సేవకా:
పూజా వై విషయోపభోగరచనా దేహశ్చ గేహం తవ॥
సంచారస్తు ప్రదక్షిణాస్తవ విభో స్తోత్రం మయా భాషితం
యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం ఆరాధనం తే ప్రభో॥4॥
వచనకరకృతం వా దేహజం పాదజం వా
శ్రవణనయనజాతం మానసం మేపరాధం॥
సకలమిదమహం యత్రోక్తవాన్ తత్క్షమస్వ
జయ జయ జయ భూమన్మాణికాఖ్యేశ నాథ॥5॥
ఇతి శ్రీమన్మాణికానుజన్నృసింహతనుజమనోహరమునివర్యవిరచితా
మానస–పూజా సమాప్తా॥

సంపూర్ణ షోడశోపచారపూజ లేదా కేవలం మానసపూజ శ్రీ ప్రభువుకు సమర్పించి భక్తకార్యకల్పద్రుమాది మంగళాచరణం చేసి నిత్యపారాయణాన్ని ప్రారంభించాలి. రోజూ పారాయణం ముగిసిన తరువాత తిరిగి పసుపు, కుంకుమ, అక్షింతలు, పూలు వేసి నైవేద్యం సమర్పించి ఆరతి చేసిన తరువాత క్రింద ఇవ్వబడిన అపరాధక్షమాపణ స్తోత్రం పఠించి తెలిసి తెలియక జరిగిన అపరాధాలకు క్షమాపణలు కోరాలి.

## శ్రీ మాణికఅపరాధక్షమాపణ స్తోత్రం

న జానే హం కించిత్తవ పదనుతిర్నాస్తి హి మతిర్న
మే జ్ఞానం కించిత్తవ వరద ధ్యానం చ న హి మే॥
నజానే హం పూజావిధిమపి న జానే ప్రలపనం
త్వతో హీనే దీనే కురు కురు దయాం మయ్యభయద॥1॥
ప్రభోహ్యజ్ఞానో హం విరహితధనశ్చాపి సతతం అతో

జాతా సేవాచ్యుతిరపి తథా పాపఫలదా॥
తదేతత్క్షంతవ్యం జనక సకలోద్ధారక గురో
కుశిష్యో జాయేత క్వచిదపి గురుర్నాస్తి కుమతిః॥2॥
విభో పూజా దివ్యా నిఖిలఫలదా నైవ రచితా
న వా దత్తం దివ్యం ద్రవిణమపి భూయస్తవ మయా॥
అథాపి స్నేహం త్వం మయి నిరుపమం యద్ధి
కురుషే కుశిష్యో జాయేత క్వచిదపి గురుర్నాస్తి కుమతిః॥3॥
పృథివ్యాం తే శిష్యా జనక బహవః సంతి ఋజవః
పరం తేషాం మధ్యే విరలతరలో హం తవ సుతః॥
మదీ యో యం త్యాగః సముచితమిదం నో తవ
గురో కుశిష్యో జాయేత క్వచిదపి గురుర్నాస్తి కుమతిః॥4॥
మయా త్యక్తా దేవా వివిధపరిసేవాకులతయా
వయో నీతం వ్యర్థం హ్యుదరభరణే భోగకరణే॥
ఇదానీం భో యోగిన్ తవ యది కృపా నాపి
భవితా నిరాధారో దీనో సురజనక కం యామి శరణమ్॥5॥
మహామూఢో హీనో భవతి కృపయా వాక్పతిసమో
మహాదీనో రంకో భవతి కృపయా చైవ ధనదః॥
మహాపంగుర్లంఘ్యో భవతి కృపయా భూధరవరాన్
అతస్త్వాం యాచే హం కురు కురు కృపాం భో గురువర॥6॥
మహావిష్ణుశ్చేమాం జనక జగతీం పాతి సతతం
రజోయుక్తో బ్రహ్మా సృజతి సకలాందేవమనుజాన్॥
తమోయుక్తో రుద్రః సకలభువనాన్యత్తి సతతం
ప్రభుత్వం తేషాం వై ప్రభువరకటాక్షస్య మహిమా॥7॥
న మే ముక్తేః కాంక్షా అతివిభవవాంఛాపి న చ మే న
మే జ్ఞానాపేక్షా గురువర సుఖేచ్ఛాపి న పునః॥
అతస్త్వాం యాచే హం జనక జననం
గచ్ఛతు మమ ప్రభో మాణికేతి గురువరగురోర్నామజపనాత్॥8॥
నారాధితో సి చ కదాపి గురో మయా త్వం
నాహం స్తుతిం చ కృతవాంస్తవ మాణికేశ॥

దేవ త్వమేవ మయి కించ హి యద్యనాథే ధత్సే
దయాం చ మహతీం హ్యుచితం తవైవ॥9॥
భవాబ్ధిమగ్నః స్మరణం త్వదీయం కరోమి దత్త ప్రభుమాణికేశ।
నైతచ్ఛఠత్వం మమ భావయ త్వం మత్వా దయాలుం శరణాగతో స్మి॥10॥
అపరాధసహస్రాణి యాని కుర్వంత మానవాః।
తాన్యన్య భక్త్యా పాఠాత్తు మాణికః కురుతే క్షమామ్॥11॥
మత్సమః పాతకీ నాస్తి పాపఘ్నః త్వత్సమో న హి।
ఇతి సమంచితం మనసా యథా యోగ్యం తథా కురు॥
ఇతిశ్రీమన్మాణికానుజ నృసింహతనుజ మనోహరమునివర్యవిరచితం
అపరాధక్షమాపనస్తోత్రం సంపూర్ణమ్॥

ఈ విధంగా అపరాధాలకు క్షమాపణ కోరి సద్గదిత అంతఃకరణతో శ్రీ ప్రభువుకు నమస్కరించాలి.

చివరి రోజు పారాయణం పూర్తిగా ముగిసిన తరువాత

యస్యస్మృత్యా చ నామోక్త్యా జపః పూజాక్రియాదిషు।
న్యూనం సంపూర్ణతాం యాతి సద్యో వందే తమచ్యుతమ్॥
మంత్రహీనం క్రియాహీనం భక్తిహీనం మహాగురో।
యత్పూజితం మయా దేవ పరిపూర్ణం తదస్తు మే॥
అనేన అముక తిథిమారభ్య అముక తిథిపర్యంతం శ్రీమాణిక్యచరితామృతగ్రంథ
పారాయణేన శ్రీసద్గురు మాణికప్రభు మహారాజః ప్రీయతామ్। ప్రీతో భవతు॥

ఇలా అంటూ అక్షింతలు నీరు విడిచి చేసిన పారాయణాన్ని శ్రీ ప్రభువుకు నివేదించాలి.

ఆవాహనం న జానామి న జానమి విసర్జనమ్।
పూజాంచైవ న జానామి క్షమ్యతాం పరమేశ్వర॥
యాంతు దేవగణాః సర్వే పూజామాదాయ పార్థివీమ్।
ఇష్టకామప్రసిద్ధ్యర్థం పునరాగమనాయ చ॥

ఈ మంత్రంతో విసర్జన చేసి, శ్రీ ప్రభు సంతోషం కోసం బ్రాహ్మణ - సుహాసిని భోజనం, బీదలకు అన్నదానం, వస్త్రదానం మొదలైనవి వీలైతే యథాశక్తి చేయవచ్చు.

**పూజావిధి మొదలైన విషయాలలో ఇంకా వివరాలు కావాలనుకుంటే కార్యదర్శి, శ్రీ మాణిక్ ప్రభు సంస్థానం వారిని సంప్రదించవచ్చు.**



శ్రీమాణికేశచరణౌ మనసా స్మరామి
శ్రీమాణికేశచరణౌ వచసా గృణామి॥
శ్రీమాణికేశచరణౌ శిరసా నమామి।
శ్రీమాణికేశచరణౌ శరణం ప్రపద్యే॥

# విషయ సూచిక

## మొదటిరోజు పారాయణము


**ఉపోద్ఘాతము ......................................................1**

1. ఉపోద్ఘాతము ...................................................... 1
2. మణిచూల పర్వతం ...................................................... 5

**పూర్వ చరిత్ర మరియు జన్మము ......................................9**

3. పూర్వ చరిత్ర మరియు జన్మము ...................................... 9
4. కల్యాణి నగర చరిత్ర మరియు ఇప్పటి కల్యాణి ......................14
5. విద్యాభ్యాసము ......................................................17

**బాల్య లీలలు ......................................................24**

6. గోవిందను బతికించుట ......................................................24
7. సంతానం అనుగ్రహించుట ......................................................25
   పండ్లు అమ్మే స్త్రీ: ......................................................25
   ఎనిమిది గవ్వలు: ......................................................26
8. తెల్ల తేలు ......................................................28
9. పిల్లల దర్బారు ......................................................29
   రాతి దేవుళ్లు: ......................................................29
   ప్రభు బంధనము: ......................................................30
   అల్లరి పిల్లవాడు: ......................................................30
10. కాళంభట్టు ......................................................31
11. భాలచంద్ర దీక్షిత్ ......................................................34
12. పన్ను వసూలు చేయు ఆఫీసు ......................................35

13. హనుమంత్ దాదా పెళ్లి, తాత్యావారి ఉపనయనము ................ 36
14. మామాతో రాం! రాం! ........................................ 37

# రెండవరోజు పారాయణము

పర్యటన ........................................................ 41
15. అమృత కుండము ............................................ 41
16. తాత్యా వివాహము ............................................ 49
17. చాళకాపురము ................................................ 56
18. మైలార్‌లో భక్తురాలు వెంకమ్మ ................................ 61
19. భాల్కిలో ప్రభువు ............................................ 68
20. సంగ్రామ్‌ఖాన్ ................................................ 72
21. తీర్థాటనము .................................................. 74
22. కేతకి సంగము ................................................ 79
23. ఝరణీ నృసింహ క్షేత్రము .................................... 81
24. బీదర్ యొక్క యవనులు (ముస్లింలు) ........................ 85

# మూడవరోజు పారాయణము

మాణిక్ నగర్ ................................................... 89
25. మాణిక్ నగర స్థాపన ........................................ 89
26. మారుతి దేవాలయము మరియు ఛల్లా ........................ 109
27. గ్రామాభివృద్ధి ................................................ 110
ప్రభు దర్బార్ ................................................. 114
28. ప్రభు దర్బార్ ................................................ 114

# నాలుగవరోజు పారాయణము


ప్రభు వైభవ విస్తరణ ........................................ 127

29. దాజీసాహెబ్ భోస్లే ........................................ 127

30. కంది కిషన్‌రావ్ ........................................ 129

31. జయప్ప (సోనార్) కంసాలి ........................................ 130

32. గాజర్ పుత్రులు ........................................ 135

33. వృద్ధ బ్రాహ్మణునకు సంతానం ........................................ 137

34. ఆబారావ్ నాయబ్ ........................................ 138

35. గొల్ల తుకారం ........................................ 140

36. జాగీరు యొక్క దానం ........................................ 141

37. టర్రా హుసేన్‌ఖాన్ ........................................ 143

38. నానా నృత్యము ........................................ 145

39. అక్కల్‌కోట్ స్వామి ........................................ 147

40. విఠ్ఠల్‌రావు తాలూకుదారు ........................................ 150

41. యజ్ఞం ........................................ 150

42. మాణికనగర్‌లో శృంగేరి జగద్గురువులు ........................................ 154

43. బ్రహ్మచైతన్య గోంద్‌వలేకర్ ........................................ 158

44. 1857 స్వాతంత్ర్య సంగ్రామం ........................................ 159


# ఐదవరోజు పారాయణము


ప్రభు చమత్కార కథలు ........................................ 161

45. పడవను రక్షించడం ........................................ 161

46. దమ్మిడి చక్కర ........................................ 163

47. బాబా కాట్‌కర్ .................................................. 164
48. పాము కాటు .................................................. 165
49. టెహాళదాస్ తల్లి .................................................. 167
50. అగ్నినారాయణుడు .................................................. 168
51. పంక్తి లాభము .................................................. 169
మాణ్‌క్యా .................................................. 171
52. తుల్జాపూర్ భవాని .................................................. 172
53. పంజాబి పహిల్వాన్ .................................................. 174
54. నాందేడ్‌కర్ శాస్త్రి .................................................. 176
55. సిఖ్ మతస్థుని ముడుపు .................................................. 179
56. ప్రభు దర్బార్‌లో షిరిడి సాయిబాబా .................................................. 180
57. కాశీయాత్రకు పోయే బ్రాహ్మణుడు .................................................. 181
58. ఐనుద్దీన్ ఉస్తాద్ .................................................. 183
59. శరణాపల్లి బ్రాహ్మణుడు .................................................. 184
**ఉత్సవములు .................................................. 186**
60. దత్త జయంతి .................................................. 186
61. జంగము మేళా .................................................. 189
62. మొహర్రం మరియు గ్యారవి .................................................. 190

## ఆరవరోజు పారాయణము

**శిష్యబృందము .................................................. 193**
63. బప్పాచార్యులు .................................................. 193
64. నారాయణ్ దీక్షిత్ .................................................. 194
64. చిమణ్యా బ్రహ్మచారి .................................................. 195

66. గోపాల్ బువా .................................................. 196
67. రామ్‌భావు లంగోటీ .............................................. 196
68. దయాళ్ దాస్ .................................................. 197
69. గిరిరావ్ చౌధరి ................................................. 198
70. రామచంద్రబువా నాసిక్‌కర్ ......................................... 198
71. లక్ష్మి నృసింహ శాస్త్రి ............................................ 203
72. రామన్నవంత్ దుబుల్‌గుండి ....................................... 204
73. శరణ సాధువు ................................................. 205
74. రామకృష్ణవంత్ తహసిల్‌దార్ ....................................... 206
75. విఠ్ఠల్‌రావ్ తేర్‌పల్లి ............................................ 207
76. రావ్‌జీబువా ................................................. 208
77. చింతామణి బువా ............................................... 209
78. సంత్‌రామ్ దాదా గవండి .......................................... 209
మహాసమాధి ........................................................ 210
79. దాదా మహారాజు ............................................... 210
80. బయమ్మ ..................................................... 213
81. తాత్యామహారాజు ............................................... 214
82. వెంకమ్మ .................................................... 216
83. ప్రభు సమాధి ................................................. 219

# పదవరోజు పారాయణము

ప్రభు యొక్క ఉత్తరాధికారులు ............................................ 225
84. శ్రీ మనోహర్ మాణిక్‌ప్రభు ......................................... 225
85. మార్తండ మాణిక్ ప్రభు ........................................... 232

86. కాలాగ్నిరుద్ర మరియు వెంకమ్మ మందిరములు .................. 239
87. ఉత్సవములు మరియు ఇతర లీలలు ............................. 241
88. శ్రీ శంకర మాణిక్‌ప్రభు .............................................. 250
89. శ్రీ సిద్ధరాజ్ మాణిక్ ప్రభు ........................................... 260
విద్యాలయాలు మరియు ఇతర సంస్థలు: ......................... 262
90. శ్రీ జ్ఞానరాజ్ మాణిక్‌ప్రభు ............................................ 264
**ఫలశ్రుతి ...................................................... 266**

# మొదటిరోజు పారాయణము

## ఉపోద్ఘాతము

### 1. ఉపోద్ఘాతము

శ్రీ ప్రభువు యొక్క భక్తకార్య కల్పద్రుమ మహామంత్రాన్ని బిరుదావళి అంటారు. ఈ ఘోష ఎన్నో సంవత్సరాల నుండి అఖండంగా పఠించబడుతుంది. శ్రీ ప్రభు సంప్రదాయం యొక్క సారమంతా దీంట్లో నిక్షిప్తమై ఉన్నది. అందుకని ప్రభు సంప్రదాయికులకు ఇది అత్యంత మహత్వపూర్ణమైనది మరియు మంగళప్రదమైనది. ఏదైనా మహత్తరమైన కార్యం ప్రారంభించడానికి ముందు బిరుదావళి పఠిస్తూ ప్రభు నామం జయజయకారం చేయడం ప్రభు భక్తుల ప్రథమ కర్తవ్యం. ఈ బిరుదావళిలో మాణిక్‌ప్రభు మహారాజుగారి చరిత్ర బీజరూపంలో నిక్షిప్తమై ఉన్నది. ప్రభు యొక్క అదిభౌతిక, అధిదైవిక, అధ్యాత్మికస్వరూపం యొక్క యదార్థ వర్ణన ఈ బిరుదావళిలో ఉంది. ఈ బిరుదావళి ప్రభు గుణవర్ణన చేసి ప్రభురూపం యొక్క సాక్షాత్కారం కలిగించే మహాశక్తి. ఈ మహామంత్రం నిరంతరంగా చేసే భక్తులకు ప్రభువు యొక్క విశాలత్వం, సర్వ వ్యాపకత్వం అనుభవమై ప్రభువు ఎప్పుడూ తమతో ఉంటారని నిశ్చలమైన విశ్వాసం కలుగుతుంది. ఈ విశ్వాసంతో వారి సామర్థ్యంపై నమ్మకం కలిగిన ప్రియ భక్తులు ప్రభు స్వరూప సాక్షాత్కారం పొందేందుకు సమర్థులు. ప్రభువు అంటే ఒక సిద్ధగురువుగా సర్వ వ్యాపకులు

అని ఈ చరిత్ర చెపుతుంది. కొందరు మహనీయులు దైవాంశతో భూమిపై జన్మించి, ప్రపంచంలోని జనులను ఉద్ధరించడానికి కంకణం కట్టుకొని వచ్చారేమో అనిపిస్తుంది. వారు ప్రజా ఉద్ధరణలో తమ జీవితాన్ని ధారపోస్తారు. ఇక ముందు కూడా మహాశక్తిమంతమైన మహనీయులు ఈ భువిపై జన్మించి, ఆ దివ్యత్వంతో కీర్తిమంతులై వెలుగొందుతారని ఆ శక్తి 'ఏకమేవాద్వితీయం' అయి జగత్కళ్యాణం మరియు ఆ దేశకాల పరిస్థితులకు అనుగుణంగా ప్రజోద్ధరణ కార్యాలు చేస్తారు.

యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా।
తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోంశసంభవమ్॥

ఈ భగవత్ వాక్యాలు ఎప్పుడూ ఏది సత్యమో అదే అనుభవాన్ని చూపిస్తాయి. ఒక వెనుకబడిన దేశానికి నవచైతన్యాన్ని ఇచ్చి, ఇతర సమర్థవంతమైన రాష్ట్రాల స్థానానికి తేవడానికి, అవిశ్రాంతంగా శ్రమపడినవారు ముస్తాఫా కెమల్‌పాషా. వీరి గురించి ఒక లేఖకుడు ఇలా వ్రాశారు. 'కెమల్ పాషాలో ఉన్న సామర్థ్యానికి ఆయన చెప్పిన దానికి, చేసే దానికి ఎవ్వరూ విరోధించేవారు కాదు. వారి సహవాసంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహవంతులౌతారు. అంతేకాక అచేతనులైనవారిని కూడా చైతన్యవంతులను, ఉత్తేజితులను చేస్తారు. ఇది వారి మీద ప్రేమాతిశయంతో రాసినదైనా కూడా సత్యమైనది. ఈ శక్తి మహాకార్యాన్ని సంకల్పం చేసిన ఏ మనిషిలో అయినా కూడా ఉండేదే. ఇప్పటి విద్వాంసులకు కూడా ఇది నిజమనిపిస్తుంది. నెపోలియన్, జార్జివాషింగ్‌టన్, శివాజీమహారాజ్ ఇలా ఎంతో మంది మహనీయులు పరిపూర్ణ సామర్థ్యం కలవారు అనే విషయాన్ని ఎవరూ కాదనలేరు.

జ్ఞానేశ్వర్, తుకారాం, రామదాసు మొదలైన వారి వైదిక సామర్థ్యం కూడా మనకు ఆ నమ్మకాన్ని కలిగిస్తుంది. అందుకని మా దృఢమైన నమ్మకం ఏమిటంటే శ్రీ మాణిక్ ప్రభు మహారాజుల విషయంలో మేము వ్రాసినవి చూస్తే కూడా అవి చాలా సహజంగా అనిపిస్తాయి.

శ్రీ మాణిక్‌ప్రభు పంచభూతాలను కూడా ఆజ్ఞాపించే శక్తి కలవారని నిరూపించారు. విశ్వశ్రేయస్సు ఆయన ధ్యేయమై, వారి సన్నిధిలో, దర్శనంతో, స్మరణతో అచేతనమైనది కూడా చైతన్యవంతమై అంతా ప్రభు రూపమై ఉండేది.

దేశకాల పరిస్థితులకు అనుగుణంగా జనులకు జనన, మరణ బాధలేని ఆనందమును పొందేట్లు చేసే వాతావరణమును సృష్టించాలని వ్యక్తిగా ఒక సుక్షేత్రంలో, ఒక విశిష్ట సమాజంలో జన్మించారు. అటువంటి వారి అద్భుత చరిత్ర మేము మా ప్రియమైన పాఠకుల కోసం వ్రాస్తున్నాము.

అలౌకిక సామర్థ్యం కల వ్యక్తుల చరిత్ర మహిమాన్వితంగా ఉంటుంది. అందుకని వారు చేసే పనులు సామాన్యులకు అర్థం కాని రీతిలో ఉంటాయి. మరియు ఎవరూ ఎదురు చూడని, అనుకోని అద్భుతాలు జరుగుతాయి. ఈ ప్రకృతి నియమాలు ప్రకృతిలోని అన్ని చరాచర జీవరాసులకు వర్తిస్తాయి. ఈ నియమాలను ఉల్లంఘించటం ఎవరికీ సాధ్యం కాదు. ఈ లౌకిక దృష్టితో ఆలోచిస్తే మన కంటబడిన లోకోత్తర అద్భుత విషయాలు మనల్ని ఆశ్చర్య చకితుల్ని చేస్తాయి. కానీ, ఈ లీలలకు కూడా ఒక ప్రామాణికత ఉంటుంది.

ఈ సృష్టిలోని ప్రతి వస్తువుకు కొన్ని నియమాలు, దేహధర్మాలు ఉంటాయి. ఈ సృష్టి ఉండే వరకు వాటిలో ఏ విధమైన మార్పూ ఉండదు. ఈ సృష్టిలో పదార్థాలన్నీ ప్రకృతి నియమాలకు లోబడి ఉండవలసినదే. అందుకే భగవంతుని అవతారంగా దిగివచ్చినా కూడా, అలాగే సిద్ధ పురుషులు కూడా వారి దేహధర్మాన్ని యథావిధిగా పాటిస్తూ ఉన్నారు. వారు చూపించే మహిమలకు కారణం వారి ఆత్మశక్తి యొక్క పరిపూర్ణత లేక వారి విశ్వాత్మ భావనే దీనికి కారణం.

మాణిక్ ప్రభు చరిత్రలో మనం ఈ విషయాన్నే చూస్తాము. ప్రభువు భౌతికంగా మానవరూపంలో కనిపించినా ఆయన సర్వ వ్యాపకత్వం అనే సమాధి స్థితిని అందుకున్నారు. దీనిలో లోకవిరుద్ధం ఏమీ కనిపించదు. వేదాంతం చెప్పే షడావస్థలలో సమాధి కూడా ఒకటి. 'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నట్లుగా మానవజన్మ సర్వోత్తమమైనది. భగవంతుని అందుకోగల సామర్థ్యం కలది. ధర్మపరుడైన మానవుడు మహనీయుడౌతాడన్న వాక్యంలోని పరమార్థం ఇదే. అనేకమంది మహనీయుల జీవితచరిత్రలలో మనకు ఈ విషయం కనిపిస్తుంటుంది.

ఐశ్వర్యస్య సమగ్రస్య శౌర్యస్య యశసః శ్రియః
జ్ఞానవైరాగ్యయోశ్చైవ శణ్ణాం భగ ఇతీరణా।

సమగ్ర ఐశ్వర్యం, శౌర్యం, యశస్సు, లక్ష్మి, జ్ఞానం, వైరాగ్యం ఈ ఆరు లక్షణములు కల ఈశ్వర శక్తియే భగవంతుడని చెప్పబడుతుంది. నిర్గుణుడైన భగవంతుడు సగుణుడౌతాడు. ఈ ఆరు లక్షణములు పరిపూర్ణంగా కల మానవులు కూడా భగవదవతారులే అన్న విషయంలో ఏ మాత్రం సందేహం లేదు. ప్రభు చరిత్ర చదివిన వారికి ప్రభువు భగవంతుడని అర్థమైపోతుంది. ప్రభువు ఘటనా ఘటన సమర్థులు.

రాజులు సింహాసనాన్ని అధిష్ఠించే సమయంలో పాలకులు ఏ విధంగా పాలించాలో ఒక ప్రకటన (జహీర్‌నామా) చేస్తారు. చెప్పిన ప్రకారం నడుచుకునే బాధ్యత రాజుదే. ఆ ప్రకటన ప్రకారం పరిపాలించిన రాజు ఉత్తముడౌతాడు. లోక కళ్యాణమే రాజు కర్తవ్యం. రాజు మరియు ప్రజలు పరస్పరం కర్తవ్య బుద్ధితో నడుచుకుంటే అది రామరాజ్యమౌతుంది. ఆ విధంగా అధికారానికి పారమార్థికత లభిస్తుంది. ఆ పారమార్థిక ఔన్నత్యం అధికారానికి బయట ఉన్నది.

సృష్టి జరిగిన తరువాత దాని పోషణ, దానిని ఉన్నత స్థాయిలోకి తీసుకెళ్ళటం కోసం కృషి చేసేవారు సర్వ శక్తిమంతులూ, సర్వవ్యాపి అయిన ఈశ్వరుడే. ఇతరులెవ్వరికీ ఈ సత్తా ఉండదు. అతడే సార్వభౌముడు. ఎవరైనా ఈ పనిని చేయాలనుకున్నా చేయలేరు, సార్వభౌములు కాలేరు. ఎందుకంటే ఈశ్వరుని మించిన సార్వభౌములెవరూ లేరు. ఇకముందు ఉండరు. కానీ ఈశ్వర శక్తితో తాదాత్మ్యులైనవారు మాత్రమే శక్తిమంతులౌతారు. అటువంటి వారే ఇతరులకు ఆత్మజ్ఞానం ఇవ్వగలుగుతారు.

ప్రభు యొక్క బిరుదావళిలో ఆయన అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకునిగానూ, భక్తుల కోరికలను తీర్చేవారిగానూ, జగద్గురువుగానూ, సర్వ శక్తిమంతులుగాను, గురువులలో సార్వభౌముడిగాను, యోగులలో మహారాజువంటి వారిగాను, సర్వులకూ ఆనందాన్నిచ్చేవారిగానూ,

అద్వితీయులుగానూ, గుణాతీతులుగాను, స్థిత ప్రజ్ఞులుగా కీర్తించబడ్డారు. జ్ఞానం, వైరాగ్యం, ఐశ్వర్యం మరియు ఔదార్యం కలిగి సర్వకాలాల్లోనూ విరాజిల్లే ప్రభువై ప్రపంచంలోని సర్వ ధర్మములను ఒకే తాటిపైకి తెచ్చి జగద్గురువై మాణిక్ ప్రభు పేరుతో వచ్చిన ప్రభువుకు సదా జయమగుగాక.

ఈ మంగళా శాసనము మా ప్రియ పాఠకులకు పరమ మంగళకరము కావలెనని ప్రభు చరణాల వద్ద ప్రార్థించి ఈ సచ్చరిత్రను మీకందిస్తున్నాము.

## 2. మణిచూల పర్వతం

నిజాం సర్కార్‌లోని రాజ్యంలో గుల్బర్గా, కళ్యాణ్ మరియు బీదర్ ఈ మూడు ఇతిహాస ప్రసిద్ధ క్షేత్రాల మధ్యలో గుల్బర్గాకు తూర్పుదిశలో ఉన్న కొండ ప్రాంతాన్ని 'దరిపట్టి' అంటారు. గుల్బర్గా నుండి అరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న మాణిక్‌నగరానికి పైన చెప్పిన మూడూ ప్రదేశాలు త్రికోణాకృతిలో ఉన్నాయి. ఈ ప్రదేశంలో మట్టి రంగు ఎర్రగా ఉండి నీరు సమృద్ధిగా, గాలి స్వచ్ఛంగా ఉంటుంది. ఈ 'దరిపట్టి' లో నివసించేవారు తమ భూమిలో అన్ని రకాల ధాన్యాలు పండుతాయని గొప్పగా చెపుతారు. రెండుకొండల మధ్య భూభాగమవడం వల్ల ఈ నేలలో శక్తి ఎక్కువగా ఉంది. సృష్టిసౌందర్యంతో మూర్తివంతమైన ఈ ప్రదేశం ఇతర ప్రదేశాల కంటే అధిక శ్రేష్ఠత కలిగి ఉంది.

ఈ ప్రదేశం యొక్క మహత్యం పౌరాణిక ఇతిహాసంలో కూడా వ్రాయబడింది. మల్హారి మహత్యంలో మణిమల్లుడు రాక్షసులతో యుద్ధం చేసి, వాడిని పాదాక్రాంతుడినిగా చేసుకోవడం జరిగింది. ఈ విషయం శంకరావతార వర్ణనలో వివరించబడింది. ఏ ప్రదేశంలో యుద్ధం జరిగిందో ఆ ప్రదేశం క్షేత్రస్థానం అయింది. అది మైలార్ క్షేత్రంగా ప్రసిద్ధమైనది. మైలార్ క్షేత్రానికి సంబంధించిన వివరాలు ముందు భాగంలో వ్రాయబడ్డాయి. ప్రాచీన పౌరాణిక కాలంలో ఈ ప్రదేశాన్ని 'మణిచూల పర్వతం' అని అనేవారు. శ్రీ గురు చరిత్రలో ఈ ప్రదేశాన్ని 'మణిగిరి' అన్నారు. విశిష్ట సంప్రదాయక పరిభాషలో దీనిని 'వృషభాద్రి' అని కూడా అంటారు. మణిచూల, మణిగిరి,

వృషభాద్రి ఇలా అనేక పేర్లతో ప్రసిద్ధమైన ఈ ప్రదేశాన్ని ప్రస్తుతం 'దరిపట్టి' అని పిలుస్తారు. ఇక్కడి గాలి శుద్ధమై, ఆరోగ్యకారక లోహయుక్తమవడం వల్ల సాధారణంగా శక్తి వర్ధకమైనది. భౌగోళికంగా చూస్తే రెండు శతాబ్దాల పూర్వం ఎలా ఉందో సుమారు ప్రస్తుతం అలాగే ఉంది.

ఈ ప్రదేశంలో ప్రజలు మరాఠీ, కన్నడ, తెలుగు మూడు భాషలను మాట్లాడుతారు. నాల్గవ భాష ఉర్దూ. పశ్చిమ మరియు ఉత్తరం వైపు మరాఠీ భాష, దక్షిణం వైపు కన్నడ మరియు తూర్పు వైపు తెలుగు భాష విస్తరించాయి. మూడూ భాషలు ఈ ప్రదేశంలో పాదుకున్నాయి. ఈ భాషలు ఇక్కడ ఎలా ఉంటాయంటే ఇంద్రధనుస్సులోని రంగులు ఎక్కడ నుండి వస్తాయి మరియు ఎక్కడ మాయమవుతాయనే విషయం తెలియదో అలాగే ఈ భాషలు కూడా. ఏది ఏమైనా ఒక విషయం మాత్రం నిర్వివాదాంశం. ఈ మిశ్రమం చమత్కారం. గంగా, యమునా, సరస్వతి నదుల సంగమం ఏ ప్రదేశంలో జరిగిందో ఆ ప్రదేశాన్ని త్రివేణి సంగమం అంటారు. దానిని తీర్థరాజం అంటారు. ప్రయాగ క్షేత్రాన్ని మహత్వపూర్ణమైనదిగా గుర్తించడం ఈ త్రివేణిసంగమము వల్లనే. ఈ విధంగానే మణిచూల పర్వతం కూడా క్షేత్రరాజం అనడంలో సంశయం లేదు. ఆర్య సంస్కృతిలో నుండి ఉదయించిన మూడు వాక్ సరితా మాధురి ఈ క్షేత్రంలో సంగమమవుతాయి. ఈ విషయం మహత్వపూర్వమైనది. ఈ విశిష్ట భూభాగం ప్రత్యేక ఋతువులో తమ స్వభావాన్ని చూపిస్తూ ఎల్లప్పుడూ ఉల్లాసాన్ని కలిగిస్తుంది.

ఈ ప్రదేశంలోని భూభాగం రక్తవర్ణమైనదని ఇంతకు ముందు చెప్పడం జరిగింది. పౌరాణిక కాలంలో జరిగిన కథలో ఖండేరాయుడు, మణిమల్లుడు వారి సైనికులు యుద్ధం చేయడం వల్ల ఆ సమయంలో పడిన రాక్షసుల రక్తం మట్టిలో కలిసి నేల ఎర్రగా ఉండిపోయింది అంటారు. ఈ విషయం నిజమో కాదో చర్చించడం వల్ల ప్రయోజనం లేదు . ప్రస్తుతం కూడా భూమి వర్ణం ఎర్రగా ఉందన్న విషయం మాత్రం నిజం. ప్రేమ యొక్క వర్ణం తామ్రం. అందువల్ల ఆ రంగు సౌభాగ్య కారకంగా గుర్తింపబడుతుంది. స్త్రీల సౌభాగ్య కారక చిహ్నం కుంకుమ. అది ఎర్రగా ఉంటుంది. భూదేవి ప్రభువుపై అనురక్తయై వారిని స్వాగతించాలనే ఆతృతతో, దివ్య వస్త్రాభరణాలతో, సౌభాగ్య

కారక కుంకుమ ధరించి ఆనందంతో తయారై కూర్చున్నది అంటే సరిగ్గా సరిపోతుంది. భూమి రుధిరప్రియ అయి రక్తపశాసనంతో ఎర్రగా అయింది అంటే భూమి భయానక రూపం కళ్ళ ముందు కనిపిస్తుంది. తామ్ర వర్ణం భయానకమైనది అనేవారు విదేశీయులు.

మణిచూల పర్వతం అనేక మంది రత్నాలు జన్మించిన పావన భూమి. ఈ ప్రదేశంలో ప్రాచీన కాలం నుండి అనేక తేజోమయమైన రత్నాలు ఉద్భవించి తమ కీర్తిని అజరామరం చేశారు. ప్రసిద్ధ స్మృతికారులు విజ్ఞానేశ్వరులు ఈ భూభాగంలోనే జన్మించారు. ప్రాచీన కాలంలో పులకేశి రాజు అత్యంత ప్రభావశాలిగా ఉన్నది ఈ ప్రదేశ ప్రభావం వల్లనే. చాళుక్యులు, కళచురీ వంటి అనేక వంశాలు తమ సామ్రాజ్యాలను ఇక్కడ స్థాపించి అన్నివైపులా విస్తరించారు. బీదర్ పట్టణాన్ని ఎన్నో రాజవంశాలు పరిపాలించాయి. బీదర్ ఖిల్లా అభేద్యమై ఓటమి లేనిదై ఉండెను. ఈ ఖిల్లాలో ఇప్పటి వరకు యుద్ధంలో ఇతరులెవరూ గెలువలేదు. ఈ దరివట్టిపై చంద్రసేనజాధవ్ పుత్రులు రామచంద్రజాధవ్ యొక్క పరిపాలనా కాలం కీర్తి ఇప్పటికీ ఉంది. ఇప్పటి హుమనాబాద్ పట్టణాన్ని పూర్వం జయసింగ్‌పేట్ అనేవారు.

చరిత్రకారులైన విజ్ఞానేశ్వరుల వలెనే లింగాయత్ ధర్మం యొక్క ప్రథమ ప్రవర్తకులు బసవేశ్వరుల అభ్యుదయం ఈ ప్రదేశంలోనే జరిగింది. కళ్యాణ్ బిజ్జల్ రాజు యొక్క అమాత్యులైన బసవేశ్వరులు శివభక్తులు, కీర్తివంతులు, ప్రభావశాలురై ఉండిరని వారి చరిత్ర వల్ల తెలుస్తుంది. బసవేశ్వరులు నందికేశ్వరుల అవతారమనే లింగాయతుల భావన నిజం. మణిచూల పర్వతంలోని ఈ భాగానికి వృషభాద్రి అనే పేరు రావడానికి కారణం బసవేశ్వరులకు ప్రియమైనదై, ఆకృతిలో వృషభం వలె (నందివలె) భక్తులకు అనిపించడంవల్ల ఆ పేరు వచ్చింది.

ప్రాచీన కాలంలోని సత్పురుషులు సదానందుల వారి శిష్యులు పుర్ణానందులు లోకోత్తర రత్నాలలో ఎన్నదగినవారు. శివరామస్వామి కీర్తి సర్వత్రా వినిపించేది. వీరు సమర్థ రామదాసు ఐదుగురు శిష్యులలో ఒకరు. వీరి నివాసం కళ్యాణ్. తరువాత ఈ ప్రదేశంలో చాలామంది సత్పురుషులు జన్మించారు.

అల్లం ప్రభు, బక్కప్రభు అనే పేరుగలవారు లింగాయతులలో సత్పురుషులుగా పేరెన్నిక గన్నారు. వీరందరి చరిత్ర వ్రాయడం కష్టతరమైనది. సందర్భానుసారం కథలో వచ్చినప్పుడు వ్రాయడం జరుగుతుంది. పంతొమ్మిదవ శతాబ్ద ప్రథమ భాగంలో అవతరించిన రత్నాలలో శ్రేష్టమైనరత్నం 'మాణిక్' మాత్రమే. మాణిక్ ప్రభువుకు పెట్టిన పేరు మాణిక్ అయినా కూడా వారి నాయనమ్మ, తల్లితండ్రులు 'రత్నా' అని ముద్దుగా పిలిచేవారు. వీరు మణిచూల లేదా మణిగిరి ప్రదేశం తమ జన్మకోసం, బాలలీలల కోసం అవతారం తీసుకోవడం కోసం మరియు సంప్రదాయ స్థాపన కోసం ఇష్టంతో ఎందుకు ఎన్నుకున్నారంటే సృష్టి నియమాలు అనుసరించాలని సంకల్పించుకున్నారు. విశిష్ట కారణంతో అవతారం ధరించిన ప్రభువుకు మణిచూల పర్వతభూమి ప్రియంగా కనిపించింది. ప్రేమతో నిండిన తపోనిధుల అనుష్టానాలతో తేజోమయమైన నిసర్గ రమణీయ వనంలోని, తారులతలతో నిండిన అత్యంత ముగ్ధ మనోహరరూప ధారణ చేసిన నిర్మల పవిత్ర నానావిధ జల ప్రవాహ, జలాశయాలతో పునీతమైన, సోజ్వల, సుగంధ వాయువుతో ఉల్లాసితమై మార్గప్రతీక్ష చేస్తున్న భూమాతను చూసి 'భక్తకార్యకల్పద్రుమ' ఘోష చేయించుకునే ప్రభువు ఆ భూమాత కోసం పరిగెత్తి రావడం సహజమే.

మాణిక్ (మాణిక్యం) అనేది వ్యవహారంలో ఒక రత్నం యొక్క పేరని అందరికీ తెలుసు. ఈ రత్నం యొక్క రంగు కూడా ఎర్రగా ఉంటుంది. ఎర్ర రంగు పవిత్రమైనది. ఈ అద్వితీయ రత్నం, విశ్వం యొక్క ఎర్రరంగు సృష్టి అంతం వరకు ఇలాగే తేజోవంతంగా ఉంటుందనడం నిస్సంశయం.

ఈ విధంగా మణిచూల పర్వతం ప్రేమతో ఆకర్షించి ప్రభువు జన్మించడానికి ప్రేరణయై వారి క్రీడాస్థానం మరియు శాశ్వత నివాస స్థానమయింది. రత్నాన్ని సానబెట్టడం ఎంత అవసరమో అలాగే సానబెట్టడానికి రత్నం యొక్క అవసరం ఉంది. అందువల్ల ప్రభువు నివసించడం వల్ల ఈ పర్వతానికి మహత్యం వచ్చింది. ఈ పర్వత శిఖరంపై దత్తావతారులైన శ్రీ ప్రభువు గాదీ స్థాపన జరిగింది. సకలమత సంప్రదాయ దుంధుబి మోగిస్తూ, సమతాభావం యొక్క జెండా ఆకాశంలో ఎగురుతూ ఉంది. వీటిని ఇవ్వడం ప్రభువుకు మానవులపై ఉన్న ప్రేమకు నిదర్శనాలు. ఈ పర్వతం ప్రేమకు

పునాదిగా ఉన్నది. అన్ని ధర్మాలు, మతాలు ప్రేమ అనే పీఠంపై సమత అనే జెండా కిందకు వచ్చి అక్షయమైన ఆనందాలతో ఉండాలని ప్రభువు అనుకున్నారు. కాలప్రవాహం సమతా భావంతోనే ప్రవహిస్తుంది. ప్రేమ, శాశ్వత శాంతి మరియు ఆనందాలే విశ్వ మానవ జీవితం యొక్క ధ్యేయాలు.

ఈ సత్యం ప్రభువు రెండు వందల సంవత్సరాల పూర్వమే తెలుసుకొని తన సంప్రదాయాన్ని విస్తృతపరిచారు. పరమావధి యొక్క ఐహిక ఉత్కర్ష, పారలౌకిక నిశ్రేయస్సు సాధ్యం కావడానికి యోగ్యమైన ఈ పుణ్యభూమి అందరిని ప్రేమతో అహ్వానించడానికి ఎల్లప్పుడూ సుశోభితంగా సిద్ధమై ఉన్నది.

సకలమత స్థాపిత ప్రభువు యొక్క అధ్యాత్మిక శక్తి ప్రభావం ప్రస్తుతం స్పష్టంగా కనిపిస్తుంది. జగత్తు యొక్క ఐహిక ఐశ్వర్యానికి, మోక్షానికి, సకలమత ధర్మం ఉపకారియై ఉన్నది. సర్వధర్మాలు, మతాలు తమదే శ్రేష్టమనే విషయాన్ని విడిచి, ద్వేషభావాన్ని మరిచి ప్రేమతో ఒక తాటిపైకి వస్తారో అప్పుడు సకలమత సంస్థాపకులైన ప్రభువు సాక్షాత్కరిస్తారు. ఇలాంటి సందర్భం వచ్చేకాలం దగ్గరలోనే ఉందని ఆశిద్దాం.

# పూర్వ చరిత్ర మరియు జన్మము

## 3. పూర్వ చరిత్ర మరియు జన్మము

పంతొమ్మిదవ శతాబ్ద ప్రారంభములో నిజాం రాజ్యంలోని ఒక ఉపసంస్థానములో మనోహర నాయిక్ అనే పేరు గల బ్రాహ్మణ గృహస్థులు ఉండేవారు. ఉపసంస్థానం యొక్క రాజధానికి 'కళ్యాణి' అనే పేరు ఉండేది. ఇప్పటికీ అదేపేరు వాడుకలో ఉంది. ఈ కళ్యాణిని కొందరు కళ్యాణ్ అని కూడా అంటారు. మొదట ఇది మహరాష్ట్రలో ఉండేది. దీనిని కల్బుర్గి కళ్యాణి అనేవారు. ముంబాయికి దగ్గరలో ఒక కళ్యాణ్ అనే ఊరు ఉంది. ఆ కళ్యాణ్ నుండి ఈ కళ్యాణ్ భిన్నమైనది అని తెలపడానికి కల్బుర్గితో ముడివేశారనిపిస్తుంది.

మనోహరనాయిక్ పూర్వీకులు కళ్యాణ్‌లో నివసించేవారు కాదు. 'హర్‌కుడ్' అనే ఒక పల్లెటూరు నుండి కళ్యాణికి వచ్చి నివసించారు. తరువాత 'హర్‌కుడే' అనే ఇంటిపేరు స్థిరపడి పోయింది. పూర్వం ఇంటిపేరుతోనే పిలిచేవారు. ఈ ఇంటి పేరు ఎక్కువగా చేస్తున్న పనిని బట్టి, నివసించిన ఊరిని బట్టి వచ్చేది. మనోహరనాయిక్ కళ్యాణ్‌కి వచ్చి పెరగడం వల్ల వాళ్లు కళ్యాణ్‌లో 'హర్‌కుడే' అయ్యారు. హరికుడేలో వారి వృత్తి ఏంటో తెలియదు. నాయిక్ అనే పేరు ఎలా వచ్చిందో కూడా తెలియదు. ఆ కాలంలో సావ్‌కారి, స్వర్ణకారి వృత్తివాళ్లని నాయిక్‌లు అనేవారు. కళ్యాణ్ వచ్చిన తరువాత ఆ పనులేవి చేయలేదు కానీ 'నాయిక్' స్థిరపడి పోయింది. మనోహరనాయిక్ ఇంట్లో అందరూ ఈశ్వర భక్తులై, సాత్వికులై ఉండేవారు. మనోహరనాయిక్ తండ్రి నృసింహనాయిక్ కళ్యాణ్‌లో జన్మించారు. ఈయన కేశవ నాయిక్ పుత్రుడు. కేశవ నాయిక్ బీదర్ దగ్గరలో ఉన్న ఝరనీ నృసింహ క్షేత్రములో అనుష్ఠానము చేసిన తరువాత పుత్రుడు జన్మించారు. అందుకని నృసింహనాయిక్ అని పేరు పెట్టారు. కేశవనాయిక్ సాత్విక గుణసంపన్నులై ఉండేవారు. తండ్రి ఆర్జించిన ఆస్తిలో భాగాలు చేస్తుండగా తనకు ఏదైతే భాగం దక్కాలో అది దక్కదని తెలుసుకొని తనవూర్తి భాగం సోదరిడికి ఇచ్చివేసి కులస్వామి ఆయిన ఖండేరాయుని మూర్తిని తీసుకొని హర్‌కుడ్ గ్రామాన్ని వదిలి కళ్యాణ్‌కి వచ్చి నివసించారు. కేశవ నాయిక్ తన పుత్రుడైన నృసింహనాయిక్‌కి ఉపనయనము చేసి వివాహము చేశారు. నృసింహనాయిక్ మరియు బచ్చమ్మల పుత్రుడే మనోహరనాయిక్. బచ్చమ్మదేవి మారుతికి నైవేద్యము పెడితే, మారుతి ఆరగించిన తరువాత అన్నం తినేవారని ఒక చరిత్రకారులు వ్రాశారు.

బచ్చమ్మకు ఇద్దరు పుత్రులు. మొదట మనోహర నాయిక్ తరువాత మార్తండ నాయిక్. వీరిద్దరి బాల్యావస్థ దాటకముందే భర్త చనిపోతే కళ్యాణికి దగ్గరలో ఉన్న పుట్టిల్లు అయిన లాడవంతికి వెళ్లింది. ఈ ధైర్యశాలి అయిన స్త్రీ తన ఇద్దరు పుత్రులకు సరైన రీతిలో మంచి విద్యాబుద్ధులు నేర్పించి విద్యా ప్రవీణులను చేసింది. మనోహర నాయిక్ సాత్వికుడై విద్యావేత్తయై బాల్యమంతా లాడవంతిలోనే గడిచిన తరువాత కళ్యాణికి చెందిన అప్పారావు కులకర్ణిగారి పుత్రిక బయమ్మతో వివాహం అయిన తరువాత మళ్లీ కళ్యాణికి వచ్చి

నివసించారు. మనోహరనాయిక్ మాతృభక్తి పరాయణులు. తల్లి కనుసన్నలలో పెరగడం వల్ల వీరి జీవితమంతా ఉదాత్తమైన పనులతో గడిచిపోయింది. వీరి ప్రేమతో లబ్ధిపొందిన వారు వీరి ఉపదేశామృతం కోసం ఆతృత పడేవారు. వారిలో అన్ని జాతుల వారు ఉండేవారు. వీరి తమ్ముడైన మార్తండనాయిక్ అల్పవయస్సులోనే మరణించారు.

మనోహరుని భార్య బయాదేవి గొప్ప కుటుంబంలోనిది. సుస్వభావము కలిగి ప్రపంచాన్ని పారమార్థిక దృష్టితో చూసేది. వీరికి క్రీ. శ. 1813లో ప్రథమ పుత్రుడు జన్మించాడు. హనుమంతుని ఉపాసాసనతో జన్మించడం వల్ల 'హనుమంత్' అని పేరు పెట్టారు. వీరిని 'హనుమంత్ దాదా','దాదామహారాజ్' అని పిలిచేవారు.

చాలా మంది చరిత్రకారులు హనుమంత్ రావుని మారుతి అవతారంగా కొలిచేవారు. ఉపనయనము అయ్యే వరకు ఆయన మూగవారిగా ఉండేవారు. తరువాత మాట్లాడటం మొదలుపెట్టారు. ఆ కాలానుగుణంగా ద్వివ్యవహారిక చదువు నేర్చారు. ఎప్పుడూ ఏకాంతగా ఉండడానికి ఇష్టపడేవారు.

మనోహరనాయిక్ కుటుంబానికి వారు చేసిన అనుష్ఠానానికి ఫలం దొరికే సమయం ఆసన్నమైనదని అర్థమయి అంతఃకరణతో ఉన్నతమైన మనోవృత్తితో పారమార్థిక సంపాదన చేయాలనే తపన ఆ దంపతులకు ఉండేది. వంశం యొక్క, దేశం యొక్క, ధర్మం యొక్క లోక కల్యాణం చేసే కొడుకు కావాలని ఏ తల్లికి ఉండదు? కొంతమంది చరిత్రకారులు సర్వసంపన్నుడైన పుత్రుడు కావాలని బయమ్మ గోమూత్రంతో రొట్టెలు చేసుకొని తినే వ్రతం చేసిందని వ్రాశారు. ఏది ఏమైనా తమ కడుపులో ఉత్తమమైన కులదీపకులు జన్మించాలని గాఢమైన కోరిక ఉండేది. మనోహరనాయిక్ రామభక్తులు. వీరు రామనవమి ఉత్సవం చేసేవారు. 1817 వ సంవత్సరంలో రామనవమి ఉత్సవము పెద్ద ఎత్తున నిర్వహించారు. వీళ్ల భాగ్యోదయానికి ఈశ్వర సంకల్పం తోడయింది. ఆ రోజు వారు కర్తవ్య పరాయణులై సంతోషంగా ఉండగా మనోహరనాయిక్-బయమ్మ దంపతులకు స్వయంగా దత్తాత్రేయులు వారి ఉదరంలో జన్మిస్తామని స్వప్నంలో సాక్షాత్కరించి చెప్పారు. స్వప్నం వచ్చిన

రోజు రామనవమి కాబట్టి మాణిక్‌నగర్‌లో రామనవమి ఉత్సవం పెద్ద ఎత్తున ఇప్పటికీ నిర్వహిస్తారు. సృష్టి నియమానుసారం నవమాసాల తరువాత 1817 వ సంవత్సరం మార్గశిర శుక్ల చతుర్దశి మంగళవారం 22 డిసెంబర్ రోజు రెండవ పుత్రుడు 'మాణిక్' జన్మించారు. ఈ పుత్రుని జన్మతో మనోహర నాయిక్‌ల కుల, దేశ, ధర్మ మరియు జగత్తు యొక్క ఉద్ధరణ ఎలా జరిగిందో ఈ చరిత్ర ద్వారా తెలుస్తుంది.

ఈ అద్వితీయమైన శ్రేష్ఠులు బయమ్మ (బయాదేవి) కడుపున పుట్టడం వల్ల ఆమెను దేవీ స్వరూపంగా కొలవాలి. బచ్చమ్మ తల్లిగారి ఊరు అంటే మనోహర నాయిక్ తాతగారి ఊరైన లాడవంతిలో ప్రభువు జన్మించారు. తండ్రికి పరమానందమైనది. ఈ బాలుని జాతకం స్వయంగా తనే చూసి జయప్ప అనే స్వర్ణకారుడి దగ్గర ఆ జాతాకాన్ని ఉంచారు. బచ్చమ్మకు మనవడు పుట్టాడనే ఆనందం చెప్పనలవి కాలేదు. బచ్చమ్మ మనవడిని ముద్దుగా 'రత్నా' అని పిలిచేది. అలాగే తల్లి, తండ్రి కూడా పిలిచేవారు. ఆప్తులు లాడన్‌షా, మదన్‌షా అని పిలిచేవారు. వారి వంశంలో అద్వితీయ రత్నం ఉద్భవించిందని వీరందరి భావన. ఆ బాలుని శరీరం బ్రహ్మతేజస్సుతో వెలుగుతూ ఉండేది. విశిష్ట కారణంతో అవతారం భూమిపై ఉద్భవించినపుడు అందుకు అనువైన వంశం చూడాల్సివస్తుంది. పూర్వం ఈ వంశం సామాన్యంగా ఉండేది. ఐశ్వర్యం, సామర్థ్యం, వ్యవహారిక జ్ఞానం మొదట్లో ఉండేవి కావు. అందుకని ప్రభు ఈ వంశాన్ని ఆశ్రయంగా తీసుకొని అన్నిరకాలుగా ఆ వంశాన్ని ఉద్ధరించారు. మంచి పళ్ళు తినడానికి దొరికితే ఆ వృక్షం ఎలా శ్రేష్ఠమైనది అంటామో ఆ విధంగా ఈ వంశం అత్యంత ఉన్నతమైనది అనాలి. ప్రభు జన్మ సమయములో నాలుగు దిక్కులు ప్రకాశవంతమై సాక్షాత్ దత్తాత్రేయులు ప్రత్యక్షం అయ్యారని అందరూ చరిత్రకారులు వర్ణించారు. ముందు ప్రభు చరిత్ర చదివితే, లేక వింటే, ఈ విధమైన అసామాన్యమైన వ్యక్తి యొక్క జన్మ అసామాన్య పద్ధతిలో జరిగి ఉండవచ్చు అని తెలుస్తుంది.

ఒక సామాన్య వంశంలో జన్మించిన వ్యక్తి నిర్వికారుడై ప్రజలను ప్రేమతో ఆకర్షించుకోవడంలో సమర్థులై ఉండేవారు. వేల మంది కాదు, లక్షలాది మందికి అన్న వస్త్రాలే కాకుండా ధనం ఇచ్చి అన్ని రకాల కోరికలను నెరవేర్చే వారు

కల్పద్రుములై ఉంటారు. ఇంతేకాదు జగత్తుకు ఆదర్శమూలమైన ఒక తత్వవేత్త స్వతహాగా ఆచరణలో తెచ్చి దాన్ని స్థాపన చేశారు. హిందూ, ముస్లిం, సిఖ్, జైన్, లింగాయత్ మొదలైన అనేక జాతి లేదా ధర్మాల వారికి స్వభావ సిద్ధమైన శత్రుభావాన్ని మర్చిపోయేలా చేసి అందరినీ ప్రేమతో ఒక తాటిపైకి తెచ్చి వారినుండి 'ప్రభురేవ ప్రభుః సాక్షాత్' 'పీరానపీర్ దస్తగీర్' 'నానక్ సోహి మాణిక్' 'ధన్యప్రభు' అన్న వాటిని నిజం చేశారు. ఇది విని లేక చూసి ఏ మనుష్యుడైనా ప్రభువు యొక్క సామర్థ్యానికి ఆశ్చర్యపోతారు. లోకోద్ధరణ కోసం అవతరించిన వారి స్వభావం, పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్నట్లు ఊయలలో ఉన్నప్పుడే వారి తత్వం తెలుస్తుంది అనడం అవాస్తవికత అనిపించుకోదు. ప్రభువు యొక్క మహిమ కుమార దశ నుండే అగుపించేది. ఈ విషయం చదువరులకు ముందు పేజీలలో తెలుస్తుంది.

మాణిక్ ప్రభు జన్మతో ఇంటివారంతా సంతోషభరితులయ్యారు. తల్లి తండ్రులకు తమ రక్తం పంచుకొని పుట్టాడని చాలా ఆనందమయింది. ప్రకృతి కూడా పులకించింది. వాతావారణమంతా దివ్యమైన సంతోషంతో నిండిపోయింది. 'మాసానాం మార్గశీర్షోహం' అని గీతా వాక్యం. పన్నెండు మాసాలలో మార్గశిర మాసం శ్రేష్ఠమైనదని అర్థం. ఈశ్వరనామ సంవత్సర మార్గశిర మాసం శుక్ల చతుర్దశి చంద్రుడు రోహిణీ నక్షత్రంలో ఉన్న రాత్రి ప్రభు జన్మించారు. ఆ సంవత్సరంలో మంచి వర్షాలు పడడం వల్ల భూమి సస్యశ్యామలమయింది. నదులు, కాలువలు, బావులలో నీరు ఉండటం వల్ల పశువులు, పక్షులు, మనుష్యులు సుఖంగా ఉండేవారు. లోకోత్తర సామర్థ్య సంపన్నుడు మనుష్యుల మధ్య జన్మిస్తే కారణం తెలియకుండానే మనసు ఆనందమయవుతుంది.

భగవాన్ శ్రీకృష్ణుని జన్మ సమయంలో సృష్టి యొక్క స్వరూపం క్రింది విధంగా ఉండేది. పరమ మంగళ కారకమైన భగవంతుని జన్మకాలము సమీపించింది. ఆ సమయములో అన్ని నక్షత్రాలు గ్రహాలు శాంతమై చంద్రుడు రోహిణీ నక్షత్రంలో ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు ఆకాశంలో నిర్మలమైన నక్షత్రోదయమయింది. పృథ్విపై, గోకులంలో మంగళోత్సవం ప్రారంభమయింది. నదులలోని నీరు నిర్మలమయింది. చెరువుల్లో కమలాలు

వికసించి వింత శోభ కనిపించింది. వనంలోని పుష్పాలు, పక్షులు, ప్రాణులు భ్రమర నాదం చేయసాగాయి. పవిత్రమై సుగంధము వ్యాపించి ఆ మనోహర స్పర్శతో స్వచ్ఛమైన గాలి వ్యాపించింది. బ్రాహ్మణుల అగ్ని ప్రశాంతంగా ప్రజ్వలించి, జన్మమేలేని భగవాన్ జన్మించేటప్పుడు స్వర్గంలో దుందుభి మోగసాగింది. ఈ వర్ణన ప్రభు జన్మ సమయానికి కూడా వర్తిస్తుంది. చాలా వరకు అందరూ చరిత్ర కారులు ఈ విధంగానే వర్ణించారు.

ఆ తరువాత మనోహరనాయిక్‌కి మూడవ పుత్రుడు సర్వజిత్ నామ సంవత్సర పుష్య శుక్ల త్రయోదశి సోమవారం జన్మించారు. నృసింహ అని పేరు పెట్టారు. బచ్చమ్మ వృద్ధాప్యంతో మరణించగానే కొద్ది కాలానికి మనోహరనాయిక్ కూడా కాలం చేశారు. బయాదేవి తన ముగ్గురు పుత్రులతో కల్యాణ్‌లో నివసించేవారు. బయాదేవి అన్నగారి సహాయమే చాలా అండగా ఉండేది. ప్రభువు బాల్యం చాలావరకు కల్యాణ్‌లోనే గడిచింది. ముగ్గురు పుత్రులతో పాటు మనోహర్ నాయిక్‌కి చిమనాబాయి అనే పేరు గల కుమార్తె ఉండేది.

## 4. కల్యాణి నగర చరిత్ర మరియు ఇప్పటి కల్యాణి

కల్యాణి నగర చరిత్ర పదకొండవ శతాబ్దంలో వ్రాయబడింది. హైదరాబాద్ నవాబుల (జాగీర్‌దార్) ముఖ్య స్థానమై - చాళుక్య వంశ మొదటి సోమేశ్వర్ రాజావారు తమ రాజధాని నగరంగా చేసుకున్నారు. 11వ శతాబ్దం చివరలో ఈ రాజావారు రాజ్యపాలన చేసి సుమారు 100 సంవత్సరాలు పరిపాలించారు.

మితాక్షరకారుడైన విజ్ఞానేశ్వర్ చివరలో కళ్యాణిని పాలించారు. విజ్ఞానేశ్వరుడు భారద్వాజ గోత్రస్థులైన పద్మనాభ భట్టోపాధ్యాయుల పుత్రుడు. కళ్యాణి యొక్క విక్రమార్క రాజాకు ఆశ్రయం ఇచ్చాడు. విజ్ఞానేశ్వరుడు తరువాత సన్యాసం పుచ్చుకున్నాడు. యాజ్ఞావల్క్య స్మృతిపై 'మితాక్షరి' అనే గ్రంథం సర్వప్రసిద్ధమైనది. ప్రసిద్ధ కాశ్మీరీ కవి బిల్హణుడు 'విక్రమార్క దేవ చరిత్ర' సంస్కృత కావ్యంలో కళ్యాణి నగరాన్ని సుందరంగా వర్ణించారు. లింగాయత్ ధర్మ స్థాపకుడైన బసవేశ్వరుడు ఈ ప్రదేశంలోనే జన్మించారు.

వీరు బిజ్జల్‌రాజు యొక్క మంత్రిగా ఉండేవారని లభించిన ఆధారాల వల్ల తెలుస్తుంది. బసవేశ్వరుడు కల్యాణి తాలుకా బాగేవాడీ గ్రామంలో జన్మించారు. కృష్ణా మలప్రభ సంగమ ప్రదేశమైన 'కప్పది'లో నివసించారు. ఆయన ఆరాధ్య జాతి బ్రాహ్మణులు. ఇతడి మొదటి భార్య తండ్రి బిజ్జల్ రాజు దగ్గర మంత్రిగా ఉండేవారు. మామ మరణానంతరం మంత్రి పదవి ఆయనకు లభించింది. తన అక్క కొడుకు చెన్న బసవ మద్ధతుతో ఒక స్వతంత్ర మతాన్ని స్థాపించి జంగమ పురోహితుల వర్గాన్ని తయారు చేశారు. జంగముల జీతము రాజా యొక్క ఖజానాలోంచి ఇచ్చాడని ఉద్యోగం పోగొట్టుకొని లింగాయత్ ధర్మ సహాయంతో రాజును పరాభవించాడు. రాజు మరణించాడని రాజ కుమారుడు తన తండ్రిని చంపిన వారిపై పగ తీర్చుకోవడానికి బసవేశ్వరుడిని వెంబడించాడు. అప్పుడు ఆయన సంగమేశ్వర్‌కి చేరుకొని శివలింగంలో లీనమై మాయమయ్యాడని లింగాయత్ మతస్థుల నమ్మకం. ఆయన తరువాత చెన్నబసవ లింగాయత్ ధర్మాన్ని ఉద్ధరించారు. బసవేశ్వర్ చెల్లెలు (పద్మావతి) బిజ్జల్ రాజా యొక్క రాణి. అల్లం ప్రభు, ప్రభులింగ బసవకు సహాయంగా ఉండగా ఆయనను గణపతి అవతారంగా వర్ణిస్తారు.

నిజాం రాజ్యంలో కల్యాణి ముస్లిం జాగీర్‌దార్‌ల సంస్థానంగా ఉండేది. జాగీర్‌దార్‌లను నవాబులు అనేవారు. ఔరంగజేబ్ మరణించిన తరువాత నవాబుల పూర్వజులు ఇక్కడికే వచ్చారు. తరువాత కల్యాణి, బీదర్‌ల సుబేదార్‌లు అయ్యారు. తరువాత మరాఠీ సర్‌దార్ చంద్రసేన జాధవ్ యొక్క పుత్రుడు రామచంద్ర జాధవ్ ప్రాబల్యం పోయిన తరువాత నవాబులకు కల్యాణి జాగీర్ లభించింది. 1761 రామచంద్రజాధవ్ అంతమవగానే నవాబులు పాలించారు. ఔరంగజేబ్ మరణించగానే (1707) 60 సంవత్సరాలు కల్యాణి నగర చుట్టు ప్రక్కల మరాఠీ సర్దారులు రాజ్యమేలారు. తరువాత నవాబులు పాలించారు.

ఇప్పుడు కళ్యాణినగరం అంత ఆకర్షణీయమైనదిగా లేదు. సామాన్య ప్రజల స్థితి సంపన్నమైనదిగా కనిపించదు. నాలుగు దిక్కులా పాడుబడినదిగా కనిపిస్తుంది. పురాతనమైన పెద్ద పెద్ద భవంతులు ఉండేవి. పూర్వం ఒక కాలంలో బంగారు పుప్పొడి రేణువులు ఎగిరేవని అంటారు. గోసావి గల్లీలో హైదరాబాద్

సంస్థానంలో గోసావి వారి మూల స్థానం ఉండేది. గోసావి గల్లీలో 10 మార్గాలు ఉన్నాయి. కల్యాణి ముఖ్య మహంతులు ఈ గోసావిలు. బీదలకు అన్నదానం, దక్షిణా నడుస్తుండేది. గోసావిలు కట్టిన బావి చూస్తే ఆశ్చర్యం అనిపిస్తుంది. అది చూడదగిన ప్రదేశంగా అనిపిస్తుంది. నాలుగు మూలలుగా ఉండి ఒక పక్క మెట్లు ఉండేవి. ఈ మెట్లు యాభై ఆవులు ఒకే సారి దిగి నీళ్ళు తాగడానికి వీలుగా ఉన్నాయి. బావి అన్ని దిక్కులకూ రెండువందల అడుగుల వెడల్పు ఉంది. తరువాత ఖిల్లా కూడా చూడదగిన ప్రదేశం. ఈ ఖిల్లా పై నుండి కల్యాణి చాలా బాగా కనిపిస్తుంది. పై భాగంనుండి చూస్తే దట్టమైన చెట్ల మధ్య కళ్యాణి నగరం ఉన్నట్లనిపిస్తుంది. ఖిల్లాకి ఒక ప్రక్క ఊరు ఉంది. ఖిల్లా ఇప్పుడు పడిపోయే స్థితిలో ఉంది. అది మళ్ళీ మరమ్మత్తు చేయడం కష్టసాధ్యం. ఒక కాలంలో వైభవ యుక్తంగా ఉండేది. ఇంతకంటే ఈ ఖిల్లా గురించి వివరించలేము.

ఖిల్లా పై నుండి సూర్యోదయ సమయంలో చూస్తే పూర్వ నవాబుల ఖబరిస్తాన్ సువర్ణ కలశసహితంగా కనిపిస్తుంది. ఇప్పుడు దీన్ని 'బంగ్లా' అంటారు. అదే మశీదు. చూడదగ్గ ప్రదేశం. పూర్వపు ఆర్య సంస్కృతి యొక్క నిర్మాణాలు చూస్తే మనసు ఉద్విగ్నతకు లోనవుతుంది. సదానంద మఠము కూడా ఈ కల్యాణి నగరంలోనే చూడదగ్గ ప్రదేశం. సదానంద స్వామి రామానంద స్వామి యొక్క గురువు. కాశీ నుండి గౌడ బ్రాహ్మణులు గురువుయొక్క ఆజ్ఞతో ఇక్కడికి వచ్చారు. 'చిత్ అవదూత్ అనే ప్రశ్నకి ఎక్కడైతె సమాధానం దొరుకుతుందో అక్కడే (కల్యాణిలో దొరికింది) నివసించమని గురువు చెబితే ఉత్తరాది నుండి దక్షిణాదిలోని కల్యాణికి వచ్చి నివసించారు. ఆయన తన శిష్యులతో మఠాన్ని నిర్మించి పూర్తి చేశారు. మఠంలో క్రింద గది చేసుకొని దాంట్లోనే సమాధి అయ్యారు.

ప్రాచీన కట్టడాల్లో బసవేశ్వర మఠము కూడా చూడదగింది. లింగాయత్ ధర్మానికి ఎక్కువగా ప్రాచుర్యం ఉన్నది. ఈ ఊర్లో ప్రభు యొక్క గాదీ కూడా ఉన్నది. సంస్థానము తరపు నుండి గాది యొక్క పూజ, జోళి మొదలైన కార్యక్రమాలకు ఒక వ్యక్తి నియమించబడ్డారు. ప్రభు ఈ గ్రామంలో నివసించినప్పుడు ఏ కట్ట మీద కూర్చుని ఉండేవారో అదే ప్రదేశంలో గాది

నిర్మించబడింది. ప్రభు యొక్క బాల్యక్రీడలన్నీ ఈ గ్రామంలోనే జరగడం వల్ల ఈ గాదీ చాలా మహత్తరమైనది.

ప్రస్తుత కాలంలో కల్యాణి నగరం పడిపోయే స్థితిలో ఉన్నా కూడా ప్రాచీన పవిత్రత ఈ గ్రామానికి లభించింది. గోసావిలు కట్టిన బావిలోని నీటితో మామిడి తోటలు పెంచి వెయ్యి చెట్లు బీద సాదలకు పంచారు. కళ్యాణ్ నుంచి రెండు మైళ్ళ దూరంలో 'త్రిపురాంతక్' అనే పెద్ద చెరువు ఉంది.

బిల్హణ్ యొక్క విక్రమార్క దేవచరితంలో శ్రీతైలప్ అనే చాళుక్య రాజు పుత్రప్రాప్తికోసం త్రిపురాంతకంలో తపస్సు చేసి శివుడిని ప్రసన్నం చేసుకున్నాడని వ్రాయబడింది. ఇది రమణీయ స్థలమై ఉండవచ్చని ఊహించారు. ఈ త్రిపురాంతకం దగ్గరలో 'ఆకనాగన్నాచిగవి' (గుహ) ఉంది. ఈ గుహ చాలా ప్రాచీన కాలానిదై చూడదగ్గ ప్రదేశంగా ఉంది. ఈ చెరువు దగ్గర నిలబడి చూస్తే సృష్టిశోభ విలక్షణంగా కనిపిస్తుంది. కల్యాణి బయటి ప్రదేశం చాలా మనోహరంగా కనిపిస్తుంది. జలాశయము, గుహ, కొండలు, ఆకువచ్చని వృక్షాలు చాలా రమణీయంగా కనిపిస్తాయి. ఇలాంటి రమణీయ ప్రదేశంలో ప్రభు మహరాజ్ యొక్క బాల్యమంతా గడపడం వల్ల ఈ ప్రదేశానికి అత్యంత మహత్యం ఉంది. ఇప్పటికీ ప్రభుయొక్క దివ్యమైన లీలలు ఈ ప్రదేశమంతా వినిపిస్తాయి.

## 5. విద్యాభ్యాసము

ప్రభువు యొక్క బాల్యం చాలా వరకు కల్యాణిలోనే గడిచింది. ఇంతకు ముందు కల్యాణి చరిత్ర చదివిన పాఠకులకు నిజమైన యోగ్యత తెలిసి ఉంటుంది. ప్రభువు ఏ ప్రదేశంలో లీలలు ప్రదర్శించారో వాటి స్మరణ, సంఘటనలు మరణించే వరకూ గుర్తుకు వస్తూ ఉంటాయి.

కృష్ణుని బాల్య క్రీడలు ఏ విధంగా గోకులంలో, బృందావనంలో చిరస్మరణీయం అయ్యాయో అలాగే ప్రభు లీలలు మా ప్రియమైన భక్తులకు

కేవలం స్మరణతో వారు ఆనంద భరితం కావడానికి కారణం అయ్యాయి. ప్రభు యొక్క బాల్యంలో ముఖ్య విషయం విద్యాభ్యాసం. ప్రభువుకి వ్యవహారిక జ్ఞానం (విద్యాభ్యాసం) ఎవరి నుండి లభించిందో తెలిసే మార్గంలేదు. చరిత్రకారులకు తెలిసినంతవరకు ప్రభు ఏ బడికి వెళ్ళలేదు. ఆ రోజులలో అధ్యాపకుల ఇంట్లో అక్షర జ్ఞానం, పత్ర లేఖనం, గణితం, జమాఖర్చు లాంటి వ్యవహారిక జ్ఞానం నేర్పించేవారు. ఆ అధ్యాపకులు చిన్న పిల్లలకు యమ స్వరూపంగా కనిపించేవారు. వాళ్ళు పెట్టే శిక్షలు భయంకరంగా ఉండేవి. ఇప్పుడు అలా లేదు. ఆ కాలంలో అది తప్పితే వేరే దారి ఉండేది కాదు. అప్పట్లో నాలుగు విధాలైన శిక్షణ పద్ధతులు ఉండేవి. సాధారణ అక్షర జ్ఞానం కలుగగానే వైదిక విద్యకు పంపేవారు. రెండోది శబ్దరూపావళి, అమరకోశం నేర్చుకొని వ్యాకరణ శాస్త్రం ఔపోసన పట్టడం. వీళ్ళనే శాస్త్రి అనే వారు. మూడోది అప్పటి రాజ భాష, దర్బారిబాష పార్శీ, ఉర్దూ నేర్చుకొని సర్కారి నౌకరిలో చేరటం. నాలుగోది రాయడం, చదవడం, లెక్కలు, జమాఖర్చు నేర్చుకొని వ్యాపారం చేసే వర్గం.

ఈ నాలుగు ప్రకారాలైన విద్యాభ్యాసం ప్రభు చేసినట్లు తెలియదు. బడిలో కాని, పంతులు వద్ద కాని నేర్చుకున్నట్లు దాఖలా లేదు. ఇది మాత్రం నిజం. ఉపనయన సంస్కారం చేసి గాయిత్రి మంత్ర ఉపదేశం తండ్రి గారైన మనోహర నాయిక్ గారు చేశారు. తండ్రి అధ్వర్యంలోనే అక్షరజ్ఞానం తెలిసి ఉండాలి. వ్యవహారజ్ఞానం కూడా మనోహరనాయిక్ నుండే వచ్చి ఉండాలి. ప్రభువు యొక్క చేతివ్రాత ఒక పాత పుస్తకంలో వ్రాయబడింది. చాలా చిన్నప్పటి నుండి ప్రభువు అలౌకిక దివ్య పురుషుడని అవగతమవుతుంది. బాల్యంలో చేసిన లీలల వల్ల వారు అవతార పురుషుడని అందరికీ దృఢమైన నమ్మకం కలిగింది.

సాధు సత్పురుషులకు కూడా వ్యవహార జ్ఞానం ఇచ్చే వాళ్ళు ఉంటారు. కాని వారు నిమిత్త మాత్రులే . ఈ సత్పురుషులంతా జన్మతః జ్ఞానులై ఉంటారు. 'పుణ్యాత్మనామత్ర తథావిధానాం నిమిత్తమాత్రా గురవోభవంతి' ఇది బిల్హణుడు వ్రాసిన నీతి. మనోహర నాయిక్‌కి తన కుమారుని మహత్యం అవగతం అయింది. ఇలాంటి మహా పురుషునికి విద్యాభ్యాసం ఎవరు ఇవ్వాలి, ఏలాంటి విద్య ఇవ్వాలి అనేది పెద్ద ప్రశ్నగానే ఉండేది.

ప్రభువు యొక్క బాల్యంలోని ముఖ్యమైన సమయం స్వతంత్ర ప్రవృత్తితో అడవిలో తిరిగి మిత్రులను ప్రోగుచేసి నానా విధాలైన ఆటలు ఆడడంలోనే గడిచిపోయింది. ఈ విధమైన ఆటల్లో కూడా ప్రభు యొక్క విశిష్టత కనిపించేది. విద్యాభ్యాసం నాలుగుగోడల మధ్య వలానా చోట, వలానా వ్యక్తి నుండి నేర్చుకుంటేనే లభిస్తుందని సిద్ధాంతము. ప్రచండ జ్ఞానం, పెద్ద గ్రంథసంగ్రహం చేసి విశ్వవిద్యాలయం నుండి పట్టా పుచ్చుకొని ఆ డిగ్రీతో పదవిని సంపాదిస్తారు. ఇలాంటివి ప్రభువుకు తెలియక పోయినా నిజమైన జ్ఞానం ఏదోఅది ఎలా ప్రాప్తిస్తుందో మాత్రం ప్రభుకు ఖచ్చితంగా తెలిసేది.

జన్మతః దివ్య తేజస్సుతో జ్ఞాన సంపన్నుడైన ప్రభువుకి ఎవరి నుండి విద్య నేర్చుకొనే అవసరం ఉండేది కాదు. అయినా కూడా వ్యవహారిక దృష్టితో మానవ రూపంలో ఉండడంవల్ల అన్ని వ్యవహారాలు ఆచరించినట్లు తెలుస్తుంది. మానవ దేహం ఏ విధంగా పెరుగుతుంది? బాల్యం, యవ్వనం, వార్ధక్యం ఈ అవస్థలన్నీ అనుభవించవలసి వస్తుంది. ప్రభువు యొక్క దేహం సృష్టి క్రమానుసారంగా పెరిగేది. తను దేహభోగం విడవలేదు. అన్ని అవస్థలు ప్రభు అనుభవించవలసి వచ్చింది. బాల్యంలో విద్యాభ్యాసం ముందు చేయబోయే పనులకు అవసరం అని గుర్తించారు. ప్రభు ఎప్పుడు బడికి వెళ్ళలేదు. ఇతర పిల్లల మాదిరిగా పుస్తకాలు పట్టుకొని చదువలేదు. బాల్యమంతా మిత్రులను చేర్చుకొని వివిధ రకాలైన ఆటలు ఆడేవారు. ఎన్నోసార్లు భయంకర కీకారణ్యంలో ఒక్కరే తిరిగేవారు. వివిధ పశు పక్షులతో, వృక్షలతలతో వాటి సాన్నిధ్యంలో స్వచ్ఛందంగా ఆటలు ఆడేవారు. ఇళ్ళ మధ్యలో లేదా ఏకాంతంగా గుళ్లల్లో, తీర్థస్థానాలలో సంచరిస్తూ ఉండేవారు. వ్యవహారిక శిక్షణ ఇప్పించి ఆ శిక్షణతో ఇంటిని చూసుకోవాలని ఆప్తులకు సహజంగా అపేక్ష ఉండేది. ముఖ్యంగా ప్రభు మామ ఈ విషయంలో నిఖచ్చిగా ఉండేవారు. బలవంత్‌రావ్ అప్పారావ్ (మామ) నవాబుల ఆస్థానంలో పెద్ద అధికారిగా ఉండేవారు. వారి దగ్గర సిపాయిలు, జవానులు ఉండేవారు. ప్రభువుని బడికి పంపించే ప్రయత్నం విఫలమైనందున ప్రభువుతో సిపాయిలను కూడా బడికి పంపేవారు. వాళ్లని తప్పించుకొని ప్రభువు సహజ లీలలతో మాయమయ్యేవారు. బడికి పోకుండా ఎక్కడికి వెళ్తాడో చూద్దామని మామ ప్రభువుని రహస్యంగా వెంబడించారు. అక్కడ ఒక భయంకరమైన పులి ముందు నిలబడి ఉండడం చూసి వెనక్కి

తిరిగారు. బడికి పంపాలని చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యే సరికి చివరికి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు.

ప్రభువు యొక్క ఈ స్వతంత్ర ప్రవృత్తి చాలా మందికి ఈ పిల్లవాడు పిచ్చివాడుగా ఉండొచ్చని (వేడా భావు) పిచ్చిసోదరుడు అని పిలిచేవారు. అయితే అలా పిచ్చివాడుగా కనిపించే పిల్లవాడు మహాజ్ఞాని అని వారి గురించి తెలిసినవారికి దృఢమైన నమ్మకం. ప్రభువుకు వాక్సిద్ధి ఉందని చాలా మందికి తెలిసింది. చాలా చిన్న వయస్సులోనే అమృతమయ వాక్కుతో లోక కల్యాణం జరగడం అన్ని ఊర్లలో పాకి పోయింది. జనమంతా తమ పనులు ఎలా అవుతాయి? ఎప్పుడు అవుతాయి? ఇలాంటి ప్రశ్నలతో ప్రభువువద్దకు వచ్చేవారు. వేడాభావు వాక్కు నిజం అవుతుందని జనాల్లో నమ్మకం పెరిగిపోయింది. అందువల్ల వారి మీద ఒక రకమైన ఆదరణ పెరిగింది. ఈ వేడాభావు యొక్క రూపము మంచి దర్పంతో ఉండేది. అప్పుడప్పుడు శరీరానికి బూడిద పూసుకొని దిగంబరంగా కనిపిస్తూ ఉండేవారు. కొన్ని సమయాలలో ప్రతిష్ఠగల మనుష్యులవలె పెద్ద చర్చా గోష్ఠుల్లో మాట్లాడుతూ ఉండేవారు. చాలా సార్లు పిల్లలతో కలిసి ఆటలు ఆడేటప్పుడు ఏ ఆటైనాసరే, ఆ ఆటలో నిమగ్నమయ్యేవారు. ప్రభు భాషలో, వ్యవహారంలో ఒకరకమైన ఆకర్షణ ఉండేది. చక్కెరకు ఎలా చీమలు పడతాయో అలా పిల్లలు ఎప్పుడూ ప్రభువు చుట్టూచేరేవారు. ప్రభువుతో ఏ ప్రదేశంలో అయినా ఏ కాలంలో అయినా పిల్లలు అనందంగా ఉండేవారు. వారు ప్రభు సహవాసంలో నిర్భయంగా ఉండేవారు. ప్రభువుతో అటలాడినవారు ప్రభువు యొక్క బాల్య క్రీడలను వర్ణిస్తూ ఉద్విగ్నతకు లోనై 'హాయ్ రే ప్రభు, ఆ సమయంలోనే మాకు ముక్తిని ప్రసాదించలేదు. మేము నీ నిజ రూపాన్ని గుర్తించలేక మీతో కుస్తీ పట్టాము, చెట్లు ఎక్కాము, అనేక విధాల ఆటలు ఆడాము అంటూ ప్రేమోద్వేగానికి లోనై అశ్రుధారలు జల జల కారుతుండగా అంతఃకరణ ప్రేమతో నిండిపోయి, తమ మాట నిలిచిపోయింది అంటూ, ప్రభువుతో తమ అనుబంధాన్ని వివరిస్తూ, ప్రభు నామస్మరణ చేసేవారనీ, వారిని ప్రత్యక్షంగా కలుసుకున్న ప్రభువు యొక్క మరాఠీ చరిత్ర రచయిత శ్రీ గణేశ్ రఘునాథ్ కులకర్ణీగారు వర్ణించారు.

ప్రభువు బాల లీలలు యథాతథంగా వర్ణించడం మానవ మాత్రుల శక్తికి మించిన పని. ఆబాలగోపాలాన్ని తన ప్రేమతో ఆకర్షించే వేడాభావు ఎప్పుడూ బడికి వెళ్లలేదు, కాని బడి తనను వెంబడించింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. నాలుగు గోడల మధ్య ఉన్న ప్రదేశాన్ని బడి అని అంటున్నాం కానీ, జ్ఞానసంపాదన చేసుకొనే ప్రదేశం విశ్వమంతటా ఉంది. విశ్వవిద్యాలయం ఒక నిర్దిష్టమైన ప్రదేశంలో ఉండదు, విశ్వమే వారికి విద్యాలయము, వారికే జ్ఞాన మార్గము సులభం అవుతుంది. ఈ విషయం ప్రభు చరిత్ర ద్వారా మనకు తెలియచేశారు. ఉత్తమమైన అధికారి విద్యార్థుల వెనుక ఉండి విశ్వంలోని ప్రతి వస్తువు గురించి ఎలా జ్ఞాన సంగ్రహాన్ని ఇస్తూ ఉంటారో ఆ విషయం ప్రభు చరిత్ర ద్వారా మనకు తెలుస్తుంది.

ప్రకృతియే సరైన జ్ఞానం యొక్క తలుపు తెరిచి అందరిని ఆహ్వానిస్తూ ఆ పనిలోనే నిమగ్నమై ఉంటుంది. నిర్జీవ పదార్థం నుంచే జ్ఞానప్రాప్తి అవుతుంది. మానవ జీవితం ఎలాంటిది? తన కర్తవ్యం ఏమిటి? జ్ఞానం ఎవరి మనసులో ఉంటుందో వారికి విశ్వం జ్ఞానమయంగా కనిపిస్తుంది. జ్ఞానలాలస ఎంత తీవ్రంగా ఉంటుందో అంతే ప్రమాణంలో జ్ఞాన ప్రాప్తి అవుతుంది. దాని కోసం నిజమైన జిజ్ఞాస కావాలి. జిజ్ఞాసలో సాధన ఉత్పన్నం అవుతుంది. మానవ కర్తవ్యము జ్ఞానంతో పరిసమాప్తి అవుతుంది. ఇది సర్వ సామాన్యమైన సిద్ధాంతం. ఈ జ్ఞానం యోగ్యమైన అధికారి అయిన గురువువద్ద ఉండి నమ్రతతో సేవ చేసి జ్ఞాన సంపాదన చేయడం జగత్తులో పరిపాటి. ఈ గురు సంప్రదాయ పరంపర నడుస్తూ ఉంటుంది.

ఈ రాజమార్గాన్ని ప్రభువు ఎందుకు అవలంభించలేదు అనేది ఒక పెద్ద ప్రశ్న. వ్యవహారంలో ఉన్న మార్గాన్ని అనుసరించకుండానే ప్రభువు అత్యంత జ్ఞాన సంపన్నులై ఉండేవారు. దీంట్లో మర్మం ఏమిటి? హింది, మరాఠీ, కన్నడ, తెలుగు, ఉర్దూ, పార్శీ, అరబి, ప్రజాభాష ఇలాంటి అన్ని భాషలలో ప్రభువుకి మంచి ప్రవేశం ఉండేది. ఈ భాషలు ప్రభువు సరళంగా మాట్లాడేవారు. ఆయా భాషలలో ప్రభువు వ్రాసిన పదాలు మనసుకు హత్తుకునేవిగా ఉండేవి. వ్యవహార విషయంలో సర్వతోముఖాభివృద్ధి కనబరిచేవారు. వైరాగ్య విషయంలో ప్రభువుతో సమానంగా ఎవరూ నిలిచేవారు కాదు. అధ్యాత్మిక జ్ఞాన సంపన్నత

ప్రభువులో మూర్తివంతమై ఉండేది. ఇలాంటి విలక్షణమైన మహాత్ముడు ఏ విధమైన బడికి వెళ్లలేదు. ఏ గురువు వద్ద కూడా విద్యను అభ్యసించలేదు. ఇది ఆశ్చర్యం కాకపోతే మరేంటి?

విశ్వం యొక్క గురుస్థానం ప్రభువుకి లభించింది. దీని గుర్తులు బాల లీలలలో చేసిన పనుల ద్వారా తెలుసుకోవచ్చు. నిర్మలమైన వృక్షాలు, లతలతో అనంత పశుపక్ష్యాదుల అంతఃకరణతో సహచర్యం చేయడం ప్రభువు యొక్క సహజ లక్షణమై ఉండేది. పూర్వ ఇతిహాస పురాణాలలో ఇలాంటి ఉదాహరణలు కనిపిస్తాయి. అటువంటిదే శ్రీమద్భాగవతంలోని 11వ స్కంధములో యదురాజు మరియు అవధూతల మధ్య సంవాదములో సృష్టి యొక్క పదార్థాల నుండి జ్ఞాన సముపార్జన చేయడం అవధూతుల వృత్తి అని వర్ణించబడింది. ప్రాచీన కాలంలో అసంఖ్యాక సంత్‌లు మహాత్ములయ్యారు. వాళ్ళకంటే ప్రభువు భిన్నమైనవారు. చాలా చిన్నతనంలోనే జ్ఞాన యోగసామర్థ్యము ప్రభువుకు అబ్బింది. ప్రభువు పుట్టుకతోనే జ్ఞానులు మరియు మూర్తివంతమైన ఆదర్శపురుషులు. ఆయనను దత్తాత్రేయుని అవతారమని ప్రజలు నమ్ముతారు.

అణువునుండి, చిన్నపదార్థం నుండి, పెద్ద పదార్థం నుండి, శాస్త్రం నుండి, సృష్టిపదార్థం నుండి, అన్నం నుండి మధు అంటే సారాన్ని గ్రహించడం ఇది అవధూత విద్య యొక్క లక్షణము. మధుకరవృత్తి ప్రత్యేక పుష్పంనుండి మధువును మాత్రమే గ్రహించడం. సృష్టి యొక్క ప్రతి పదార్థం నుండి మధువు గ్రహించడం అనే అపూర్వ శైలిని మధువిద్యా అంటారు. ఈ విద్య కేవలం దత్తాత్రేయులకు సాధ్యమైంది. దత్తాత్రేయుని 'మధుమతి' విశేష శక్తి కల మధువు. ఈ పదం యొక్క అర్థం జ్ఞానం,సారం.

ప్రభువు చిన్నతనంలోనే అరణ్యావాసం సంతోషంగా స్వీకరించారు. వారికి దాంట్లోనే ఆనందం దొరికేది. ప్రభు సమక్షంలో ప్రేమ పూర్వకమైన వాతావరణం కనిపించేది. అరణ్యంలో పశువులు, పక్షులు లతలతో నిర్జీవమైన పదార్థాల హృదయగతం ప్రభువుకి తెలిసేది. ప్రతి ఒక పదార్థంలో ఉన్న సహజానందం ప్రభువు యొక్క అంతః కరణలో ప్రతిబింబించి అందులో సమరసం అయ్యేవారు. బుద్ధి పూర్వకమైన మహానుభావులకు సత్యదూరమైన విషయాలేవీ

లేవని నమ్మాల్సివస్తుంది. జగదీశ్ చంద్రబోస్ అనే ప్రొఫెసర్ ఒక యోగసాధనలో తన యోగ మహత్యంతో వృక్షాలు, లతలతో తమ యొక్క కష్ట సుఖాలు మాట్లాడేవారు. దీన్ని బట్టి ప్రభువుకు కూడా ఈ విధమైన యోగవిద్య ఉండేదని అర్థమవుతుంది. అడవిలోకి వెళ్తూ ఉండడం వల్ల అద్భుత యోగ సామర్థ్యవంతులయ్యారు. ప్రతి ఒక సజీవ నిర్జీవ ప్రాణుల అంతః కరణతో మమేకమవడం సహృదయులైన మహాత్ములకే సాధ్యం అవుతుంది. అంతఃకరణ విద్య ఏ బడిలోను, విద్యాలయంలోను దొరకదు. విద్యాలయంలో బుద్ధి వికసిస్తుంది. కానీ అంతఃకరణ శూన్యత విశాలమై, ఉదారంగా చేసే పని ప్రకృతి యొక్క కార్యము. ప్రకృతి యొక్క విద్యాలయం నిజమైన విద్యాలయం. ప్రభువుకి ఈ విద్యాలయంలోనే విద్యాభ్యాసం జరిగింది. ఈ విషయం ప్రభు స్వయంగా చెప్పేవారు.

నిత్యయుక్తమైన జ్ఞానం కోసం ఈ విశ్వంలోని అనంతమైన పదార్థాల నుండి జ్ఞానం ప్రాప్తి చేసుకోనే అవసరముంది.

"పృథ్వి, వాయు, ఆకాశం, నీరు, అగ్ని, చంద్రుడు, సూర్యుడు కపోతపక్షి, కొండచిలువ, సముద్రం, పతంగి, మధుకరము,ఏనుగు, మధుహరణం చేసే మనిషి, హరిణము, పింగళము, కుదరపక్షి,బాలకుడు, కుమారి, బాణము తయారు చేసేవారు, పాము, కోడి, కుండలు చేసేవారు ఇలా 24 రకాలైన గురువులుండేవారని అవధూత గీతలో వర్ణించబడింది. ఈ గురువులలో వర్తనాక్రమంగా ప్రత్యేక లక్ష్యంతో జ్ఞాన ప్రాప్తి దొరికేది. సృష్టిలోని సర్వ పదార్థముల నుండి ఉత్తమమైన భాగాన్ని తీసుకోవడం మొదలుపెట్టి చివరికి ప్రభువు 'సకలమత సాంప్రదాయము' ఈ ఉద్దేశ్యాన్ని స్థిరపరిచారు. జగత్తులోని అన్ని ధర్మాలలోని ఉత్తమ భాగం ఏదైతే ఉందో దాన్ని గ్రహించి దోషయుక్తమైనదాన్ని విడిచి పెట్టి సర్వాంతర్యామి ప్రభువే అయి, అందరిలో ఆ విశ్వాసము కలిగించి, అన్ని ధర్మాలను ఒక్క త్రాటిపై తేవటం, ఇదే ప్రభు సంప్రదాయము యొక్క మర్మము. 'సర్వాంతరీ ఆత్మా, నకో కుణాచి నిందా' (అందరి హృదయంలో ఒకే పరమాత్మ ఆత్మస్వరూపంలో నివాసం చేయడం వల్ల ఎవరు ఎవరిని నిందించకూడదు). ఇదీ దీని ఉద్దేశము."

ప్రభు పదకొండు సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు ఒక పరదేశి అయిన మహాత్ముడు చేసిన సృష్టిలో కలిసిపోవడం అనే కల్పన సహజంగా ఆశ్చర్యం అనిపిస్తుంది. కాంట్ లియో టాల్‌స్టాయ్ ఈ పేరు అందరికి పరిచయమే. ఆయనను రష్యా రామదాసు అని కొందరు అంటారు. ఆయన ఇలా అంటారు – ''కృత్రిమత్వం లేకుండా సృష్టియొక్క నియమానుసారం వ్యవహరించడంలో నిజమైన సుఖం ఉంది. సృష్టివైభవాన్ని అర్థం చేసుకోవడంలోనే నిజమైన ఆనందం ఉంది. సృష్టి యొక్క హితము కొరకు శ్రమించడంలోనే నిజమైన బ్రహ్మానందం ఉంది.'' ఇది ప్రభు యొక్క సమకాలీనుల మధ్య ఉన్న సంబంధము.

# బాల్య లీలలు

## 6. గోవిందను బతికించుట

ప్రభువుతో చిన్న తనంలో ఆటలాడే పిల్లలలో గోవింద అనే గొల్ల పిల్లవాడు ఉండేవాడు. వాడు గొర్రెలను మేవడానికి రోజూ అడవిలోనికి వెళ్ళేవాడు. ప్రభువుతో ఆటలు ఆడడానికి ఇంకా చాలా మంది గొల్లపిల్లలు ఉండేవారు. వారంతా ప్రభువు తమతో ఉంటే గొర్రెల గురించి చింతించేవారు కాదు. ఇతర పిల్లలతో పాటు ఈ పిల్లలు కూడా వచ్చేవారు. ఆటలు ఆడే పద్ధతి రోజూ కొత్తగా ఉండేది. గోవింద అనే పిల్లవాడు నాలుగైదు రోజులు ఆటలో కనిపించలేదు. ఆటలలో కనిపించని పిల్లలను ప్రభువు ఎప్పుడూ అడిగేవారు. అలా ఒకరోజు ప్రొద్దున ప్రభు గోవింద ఆడటానికి ఎందుకు రావట్లేదని అడగడానికి గోవింద ఇంటికి వెళ్ళారు. వాకిట్లో నిలబడి 'గోవిందా! గోవిందా' అని పిలిచారు. ఇలా పిలవగానే ఆ ఇంట్లోంచి ఏడుపు వినిపించింది. అది వినగానే ప్రభు ఏమయింది? ఎందుకు ఏడుస్తున్నారని అడిగారు. గోవింద తల్లి ఇంకా గట్టిగా ఏడుస్తూ ఉంది. నాలుగైదు రోజుల నుండి జ్వరంతో బాధపడుతూ గోవింద మరణించాడని ఎవరో ప్రభువుకి చెప్పారు. ప్రభు గోవింద తల్లి దగ్గరికి వెళ్ళి, తల్లీ, నీవు ఊరికే ఏడవకు. గోవింద చనిపోలేదు. నీవు ఒక సారి గట్టిగా పిలువు. వాడు లేచి కూర్చుంటాడు. మనిషి జీవించి ఉండగా ఏడవడం మంచిదా? అన్న ఆ పిచ్చి పిల్లవాడి మాటలు వారికి నిజం అనిపించలేదు.

వాళ్లంతా గోవింద చనిపోయాడని అంత్యక్రియలకు తయారు చేశారు. గోవింద తల్లికి మాత్రం ప్రభువుపై పూర్తి విశ్వాసం ఉండేది. అప్పుడు ఆమె 'గోవిందా' లేవు ఇంకా ఎంతసేపు పడుకుంటావు నిన్ను పిలవడానికి (భావు) ప్రభు వచ్చాడు. ఇలా అనగానే గోవింద నిద్రలోంచి లేచినట్లుగా లేచి కూర్చున్నాడు. తల్లి యొక్క ఆనందము చెప్పనలవి కాలేదు. ఇతరులైతే ఈ దృశ్యాన్ని చూసి ఆశ్చర్యచకితులయ్యారు. ఈ ఘటనకు కారణం తను కాదన్నట్లు 'ఎంత పిచ్చివాళ్ళు జీవించి ఉన్న మనుష్యుని కాల్చడానికి తీసుకెళ్తున్నారు' ఇలా అంటూ గోవిందునితో గొర్రెలను తీసుకొని అడవిలోనికి రమ్మని చెప్పి తను అక్కడి నుండి వెళ్లిపోయారు. ఈ విషయం గ్రామమంతా పాకింది. గోవిందును చూడడానికి గ్రామమంతా తరలింది. వేడాభావు మాత్రం రెండు మూడు రోజులు అదృశ్యమవడం వల్ల తన ఆచూకీ ఎవరికీ దొరకలేదు.

## 7. సంతానం అనుగ్రహించుట

### పండ్లు అమ్మే స్త్రీ:

ఒక రోజు ఒక పండ్లు అమ్మే స్త్రీ తలపై మామిడి పండ్ల బుట్ట పెట్టుకొని 'పండ్లు తీసుకుంటారా' అని అరుస్తూ వెళ్తోంది. నలుగురైదుగురు పిల్లలను వెంటపెట్టుకొని వేడాభావు (ప్రభువు) ఆ స్త్రీ వద్దకు వచ్చి ''మాకు పండ్లు కావాలి ఇస్తావా?'' అని అడిగారు. ధర అడగకుండా పండ్లు అడిగే ఆ పిచ్చి వాళ్లను చూసి పైసలు లేకుండా పండ్లు ఊరికే ఇవ్వనని వెళ్ళిపోయింది. కొంచెం దూరం వెళ్ళిన తరువాత ప్రభువు మెల్లగా పిల్లలు కావాలనుకుంటే మాకు పండ్లు ఇవ్వాల్సిందే అన్నారు. ఈ విషయం ఆ స్త్రీ చెవిన పడగానే వెనక్కి తిరిగి తన అంతరంగిక విషయం ప్రభువుకి ఎలా తెలిసిందని ఆమెకు ఆశ్చర్యం కలిగింది. పెళ్లి అయి చాలా సంవత్సరాలు అయినా పిల్లలు కలగలేదు. ఎన్నో నోములు నోచింది. పిల్లల కోసం చాలా ఆతృతగా ఉండేది. ఇలాంటి సమయంలో ప్రభువు యొక్క మాట అమృతంలా వినిపించింది. ''బాలా! నీ నోరు తీపికాని, నీకు ఎన్ని కావాలో అన్ని పండ్లు తీసుకో'' ఇలా అని పండ్ల బుట్ట ప్రభువు ముందు పెట్టింది. పదకొండు

పండ్లు తీసుకుంటాను, నీకు పదకొండు మంది పిల్లలు పుడతారు అని అనగానే ఆమెకు అమితానందం కలిగింది. ప్రభువు పిల్లలతో కలిసి ఆడుకుంటూ అక్కడి నుండి వెళ్లిపోయారు. ప్రభువు యొక్క ఈ అమృతవాక్కు వల్ల ఆ స్త్రీకి ఐదుమంది పిల్లలు కలిగారు. తరువాత పిల్లలు కావాలన్న కోరిక తగ్గింది. బాలింత కష్టాలు పడలేక ప్రభుదగ్గరికి వెళ్లి విన్నవించుకుంది. నీ ఇష్టం ఇక ముందు కూడా నీ ఇష్ట ప్రకారమే జరుగుతుందని, ఇక పిల్లలు పుట్టరని చెప్పి నవ్వుతూ ప్రభువు ఆమెను వెళ్ళమని చెప్పారు. ఇలా ప్రభువు యొక్క చమత్కారాలు అనంతమైనవి. వారి మాట అమృతమయమైనదని అందరికీ నమ్మకం ఉండేది. బాలలీలల్లోని ప్రతీ విషయం యొక్క సంక్షిప్త వివరణ తీసుకొంటే చాలా విస్తారమవుతుంది. అందుకని ముఖ్యమైన విషయాలను మాత్రమే తెలియజేస్తున్నాము.

### ఎనిమిది గవ్వలు:

అప్పారావుగారు హైదరాబాద్ నగరంలో నిజాం ప్రభుత్వ సైన్యమునకు చెందిన అరబ్బుల కంపెనీలో జమాదారుగా ఉండేవారు. ఆయన బ్రాహ్మణ జాతీయుడు. మనస్సు మంచిది. వారి భార్యపేరు భీమాబాయి. భీమాబాయి పిల్లలు కావాలని నోములు వ్రతాలు చేసింది. స్త్రీలకు ఒక సారి పుత్రేచ్ఛ కలిగిందంటే ఎలాంటి పని చేయడానికైనా వెనకా ముందు చూడరు. వ్రతాలు, ఉపవాసాలు చేయడంలో స్త్రీలకు సరిసాటి ఎవరూ లేరు. ఇలా అనేక వ్రతాలు, ఉపవాసాలు చేసినా కూడా ఉపయోగం లేక నిరాశ పడిపోయింది. అంతలో కళ్యాణ్‌లోని 'పేడాభావు' యొక్క కీర్తి ఆమె చెవిలో పడింది. పేడాభావు ఏది మాట్లాడితే అది తప్పకుండా సత్యం అవుతుందని విని ఒక సారి ప్రభువుని దర్శించుకోవాలనే ప్రబలమైన కోరిక ఆమెలో కలిగింది. ఆమె తన భర్త అంగీకారాన్ని తీసుకొని పల్లకిలో కూర్చొని హైదరాబాద్ నుండి కళ్యాణికి రావడానికి బయలుదేరింది. పల్లకితో పాటు బోయిలు, సిపాయిలు కొంతమంది గుఱ్ఱంపై స్వారిచేస్తూ దాసీ జనంతో పల్లకి వెళ్తూ ఉంది. మధ్య మధ్యలో ఆగుతూ బీదర్ పై నుండి కళ్యాణికి వస్తుండగా కళ్యాణి ఇంకా ఒక మైలు దూరంలో ఉండగా ఒక మైదానంలో పిల్లల అల్లరి వినిపించింది. సహజంగా ఆ వైపుకు చూడగానే కొంత మంది పిల్లలు ఒక పిల్ల వాడిపై పడి కొట్టసాగారు. ఆ పిల్లల కొట్లాటను విడిపించాలని పల్లకిని ఆ పిల్లల వైపుకు తీసుకు వెళ్ళాల్సిందిగా

బోయిలకు చెప్పింది. పల్లకి దగ్గరకి వస్తుండగా ఆ కొట్లాట ఇంకా ఎక్కువయింది. ఆ పిల్లవాణ్ని విడిపించాలని సిపాయిలు చాలా ప్రయత్నం చేశారు. కాని ఆ పిల్లలు 'మా కొట్లాట మీకెందుకు? మాది మేము చూసుకుంటాము. మీ దారిన మీరు వెళ్లండి' అన్నారు. ఈ చమత్కారమైన కొట్లాట చూసి వాళ్లు ఆశ్చర్యపోయారు. ఏం చేయాలో వారికి తోచలేదు. ఆ పిల్లలలో ఒకరు అరుస్తూ ముందుకు వచ్చి నన్ను విడిపించాలనుకుంటే ఎనిమిది గవ్వలు ఇచ్చి విడిపించాలి. ఒక గవ్వకి ఒక కొడుకు పుడతాడు అన్న విలక్షణమైన మాటలు విని ఆ స్త్రీ ఆశ్చర్యపోయింది. ఎవరి దగ్గర గవ్వలు ఉన్నాయో అని అందరిని అడిగింది. కానీ, అంత శ్రీమంతురాలైన స్త్రీ వద్ద గవ్వలు ఎలా ఉంటాయి? ఆ పిల్లవాడి మాటలు నిజమవచ్చని ఎనిమిది గవ్వలు ఇచ్చి ఆ మాటల్ని నిజం చేసుకోవాలని ఆతృతపడింది. గవ్వలు ఎలా దొరుకుతాయి? గవ్వల బదులు పైసలు ఇస్తే సరిపోతుందా? పిల్లలు ఆట ఆడుతుండగా ఆ పిల్లవాడు ఎనిమిది గవ్వలు ఆ పిల్లలకు ఇవ్వాల్సిందే అని ఆ పిల్లవాడిపై పడి అల్లరి చేశారు. పిల్లలు కావాలంటే గవ్వలు ఇవ్వాల్సిందే. ఎలా? ఏం చేయాలో అని నిరాశ చెందగా ఆ స్త్రీ యొక్క భాగ్యం మంచిదై ఒక బోయి యొక్క డబ్బు ఉంచే సంచికి గవ్వలు కనిపించాయి. అవి తీసి ఆ పిల్లవాడికి ఇచ్చింది. ఆ స్త్రీ వైపు సంతోషంతో చూసి నీకు ఎనిమిది మంది పుత్రులను ఇచ్చాను, వెళ్లు అని చెప్పి నడుస్తూ ఆ బాలుడు వెళ్లిపోయాడు. గవ్వలు దొరకగానే ఆ పిల్లలు సంతోషంతో అక్కడినుండి వెళ్లిపోయారు. ఆ బాలుడు ఎవరో ఏమిటో ఆ స్త్రీకి అప్పుడు తెలియలేదు.

మనం ఏ పనికైతే వెళ్తున్నామో ఆ సమయము మంచిదని ఆ స్త్రీకి అనిపించేది. సాయంత్రానికి తన మంది మార్బలంతో కళ్యాణికి చేరుకుంది. మనోహర్ నాయిక్ యొక్క పుత్రుడే దత్తాత్రేయ అవతారమని ఆయననే అందరూ వేడాభావు అంటారని ఆమెకు తెలుసు. ఆమె ఆ పిల్లవాడి గురించి అందరిని అడిగింది. దర్శనము చేసుకొని భోజనము చేయాలని ఆమె మనసులో అనుకుంది. కానీ, ఎంత రాత్రి అయినా ప్రభువు రాలేదు. ఎదురు చూసి నిరాశచెంది అలాగే ఉపవాసం ఉండిపోయింది. రెండో రోజు బ్రాహ్మణ భోజన వేళలో ఎదురు చూస్తే రాలేదు. వారి ఆచూకి దొరకలేదు. ప్రభువు రెండు మూడు రోజులు అడవిలో అదృశ్యమైపోయి కనిపించరని ఇంట్లో అందరికీ తెలుసు. మూడు రోజులు ఆ స్త్రీ (భీమాబాయి) అన్నము లేకుండా ఉపవాసం

ఉంది. చివరికి ఆమెపై ప్రభువుకి కరుణ కలిగి మూడోరోజు ఇంటికి వచ్చారు. కళ్యాణ్‌కు రాక పూర్వం గవ్వలు ఇచ్చి విడిపించిన పిల్లవాడే ఈ పిల్లవాడని తెలిసింది. ఆ స్త్రీని చూడగానే నీకు ఒకసారి ఎనిమిది మంది పిల్లలను ఇచ్చాను కదా? మళ్ళీ ఎందుకు కష్టపెడుతున్నావు? అని అంటూ ప్రభువు తల్లివైపు చూసి అమ్మా, 'ఆకలి అవుతుంది తినడానికి ఏమైనా ఇవ్వు' అనగానే తల్లి ఇచ్చినది తిని అక్కడి నుండి వెళ్లిపోయారు.

ఆ స్త్రీ చూసినప్పుడు ప్రభువు విలక్షణంగా కనిపించినా ఆయన వర్చస్సును చూసి ఆ స్త్రీకి పరమానందమయింది. తను వచ్చిన పని అయినట్లుగా ఆ స్త్రీకి అనిపించింది. ఆ స్త్రీ కల్యాణిలో ఒక రోజు ఉండి దానధర్మాలు చేసి అన్నసంతర్పణం చేయించి మాతృశ్రీ బయమ్మకు, కొడుకుకి వస్త్రాలు సమర్పించి హైదరాబాద్ వెళ్లిపోయింది. కొన్ని నెలల తరువాత ఆ స్త్రీకి పుత్రుడు కలిగాడు. ఆ స్త్రీ యొక్క ఆనందానికి హద్దు లేకుండా పోయింది. ప్రభు సాక్షాత్ దత్తాత్రేయ అవతారమనే నమ్మకం నిజమయింది. తరువాత ఆమె మొదటికంటే ఎక్కువగా దానధర్మాలు చేసి ప్రభు దర్శనము చేసుకొని తిరిగి వచ్చింది. ఆ తరువాత పుత్రులు కలుగుతూ వుంటే, తన మొక్కులు తీరుస్తూ వెళ్లింది.

## 8. తెల్ల తేలు

ప్రభు ఆటలలో ఎలాంటి విచిత్రాలు జరిగేవో వాటిని సమయాను కూలంగా పిల్లలకు అర్థమయ్యేటట్లు బోధించడంలో ప్రభు ఉత్సాహం చూపించేవారు. పాములు, తేళ్ళు హాని కలిగించే ప్రాణులు అని మనకు తెలుసు. అలాగే ఆ సమయంలో పిల్లలందరూ పాము కనిపించగానే చంపడానికి ప్రయత్నించేవారు. కాని ప్రభు అడ్డు చెప్పేవారు. వాటిని ఏమి అనకుంటే అవి కూడా మనల్ని కూడా ఏమి చేయవు అని ఎప్పుడూ అనేవారు. ఏ ప్రాణికి కష్టం కలగకూడదని ప్రభు అనుకునేవారు. అప్పుడప్పుడు పిల్లలు ఆడుతూఉంటే చూస్తూ కూర్చునేవారు. ఒక రోజు అడవిలో ఆడుతూ ఉంటే కొంత మంది పిల్లలు ఒక పుట్టలోంచి కొన్ని తేళ్లు బయటికి రావడం చూశారు. అవి కనబడగానే నాలుగైదు తేళ్లను కొట్టి చంపేశారు. అది చూసి ప్రభు 'చంపడం ఆపండి. ఇక ముందు అమాయక ప్రాణులను చంపొద్దు.

ముందు ఏమి జరుగుతుందో చూస్తూ కూర్చోండి' అని చెప్పారు. అలా అనగానే వెళ్లి దూరంగా కూర్చున్నారు. ఆ పుట్టలోంచి ఇంకా చాలా తేళ్లు బయటికి వచ్చి మళ్ళీ లోపలికి వెళ్లాయి. చివరికి ఒక నల్ల తేలుపై ఒక తెల్ల తేలు కూర్చుని బయటికి వచ్చి చచ్చిన తేళ్ల చూట్టూ తిరిగి మళ్లీ పుట్టలోనికి వెళ్లిపోయింది. తరువాత చూస్తే చచ్చిపోయిన ఒక్క తేలు కూడా పైన కనిపించలేదు. చనిపోయిన తేళ్లు ఏమయ్యాయని పిల్లలకు సందేహం కలిగింది. కొందరు మిగతా తేళ్లు వచ్చి వాటిని తీసుకెళ్లాయేమో అన్నారు. కానీ, ప్రభు వాళ్లకు అర్థమయ్యేటట్లు వివరించారు. తెల్లతేలు అన్ని తేళ్ళకు రాజు. అది ఇంకొక తేలుపై వచ్చి తన దగ్గర ఉన్న సంజీవిని మణి సహాయంతో చచ్చిన వాటిని బ్రతికించి తీసుకెళ్ళింది. రాజు యొక్క సామర్థ్యం అది. తన ప్రజలను రక్షించగలిగిన వాడే నిజమైన రాజు. ప్రభు ఈ సామర్థ్యం ప్రతి ప్రాణి యొక్క అధికారి దగ్గర ఉంచారు. ఇలా మాట్లాడుతుండగా ఒక పిల్లవాడు చనిపోయిన రామచిలుకను తీసుకు వచ్చాడు. అది చూసి పిల్లలు విలవిలలాడారు. అది ప్రభు చూడలేక చనిపోయిన పక్షిని చేతిలోకి తీసుకొని ప్రేమతో నిమురుతూ, అరె బాలా! నీకు ఏమయింది! లే, లేచి గూటిలోకి వెళ్లు. ఇలా అని ఆ మృత పక్షిని పైకి ఎగురవేశారు. పిల్లలు చూస్తూ ఉండగానే జీవించి ఉన్న పక్షిలాగే ఎగురుతూ తన గూటికి వెళ్లిపోయింది. పిల్లలు ఆశ్చర్యచకితులయ్యారు. ఈ విషయం అంతటితో మరిచి మళ్లీ ఆటలో మునిగిపోయారు. ప్రభు ఈ విషయం ఎవరితో చెప్పవద్దు అని అన్నారు. కాని పిల్లలతో ఈ రహస్యం ఇతరులకు పాకిపోయింది.

## 9. పిల్లల దర్బారు

### రాతి దేవుళ్లు:

ప్రభువుతో ఆడడం పిల్లలకు చాలా ఇష్టంగా ఉండేది. ఆటలలో వైవిధ్యం ఉండేది. రోజూ ఒక కొత్త ఆట ఆడేవారు. ఒక్కొసారి దేవుని పూజ పెద్ద ఎత్తున చేసేవారు. పిల్లల దేవుడు అంటే అడవిలోని పెద్ద రాళ్లు. మంచి ఆకారంలో ఉన్న రాళ్లను తెచ్చి వివిధ దేవతల పేర్లు పెట్టే వారు. పూజ–అర్చన పెద్ద వాళ్లు ఎలా చేస్తారో అలాగే చేసేవారు. పూజా సామాగ్రి అడవిలోని ఫలాలు, పుష్పాలు

ఉండేవి. ఆ కాలంలో ఏవి దొరికితే అవి తీసుకువచ్చేవాళ్లు. పిల్లలందరూ ఈ పూజలో పాల్గొనేవారు. పూజ, నైవేద్యం, ఆరతి అయిన తరువాత ప్రసాదం అందరికీ పంచేవారు. ఒక్కోసారి పూజలో ఎవరైనా మొక్కుకున్న సామాగ్రి ఉండేది. ప్రభువును చాలా చిన్నప్పటి నుండి మొక్కు తీర్చమని అడిగేవాళ్లు ఉండేవారు. వాళ్లు తమ మొక్కు తీరగానే ప్రభువును వెతుక్కుంటూ సామాగ్రితో అడవిలోకే వచ్చి మొక్కు తీర్చుకొనేవారు. ఇలా ఆట ఆడుకునే పిల్లలకు ప్రసాదంతో కడుపునిండి సంతోషం అయ్యేది. ప్రభువుతో ఆడుకునే పిల్లలు మీతో ఉన్న వాళ్లకు, ప్రాణులకు 'జంగల్ మే మంగళ్' (అడవిలో ఆనందోత్సవం) అవుతుందని అనేవారు. ఈ విషయం ప్రభువు సగుణ రూపంలో ఉన్నప్పుడు, ప్రభువు సమాధి తరువాత కూడా ప్రత్యక్షంగా అనుభవంలోకి వస్తుంది.

**ప్రభు బంధనము:**

ప్రభు వద్ద ఉన్న అద్భుత సామర్థ్యము వయసుతో పాటు అనుభవములోకి రాసాగింది. పిల్లలు ఆటలలో జరిగే సంఘటనలను ఆశ్చర్యచకితులై చూసేవారు. ప్రభు చేసే పనులతో వాటిని వెంటనే మర్చిపోయేవారు. ఆట ఆడుతుండగా దాగుడు మూతల ఆటలో దాక్కుని ఆడే ఆటలో ప్రభువు దాక్కొని రెండు మూడు రోజుల వరకు కనిపించేవారుకాదు. అందరు పిల్లలు కలిసి ప్రభువును చెట్టుకు కట్టివేసినా కూడా అదృశ్యమై మళ్లీ అదే చోట ప్రభువు నవ్వుతూ కనిపించేవారు. చెట్టుకు కట్టిన ధోతి, తలపాగా ముడివేసి అలాగే ఉండేది. ప్రభు మాత్రం ఆదృశ్యమై మళ్లీ కనిపించేవారు. మళ్లీ పిల్లలు కట్టడానికి ప్రయత్నిస్తే మళ్లీ ప్రభువు అలాగే చేసేవారు. ప్రభువును బంధించేవారెవరు? ఈ విషయం మాత్రం పిల్లలకు తెలిసేది కాదు.

**అల్లరి పిల్లవాడు:**

అడవిలోని పశుపక్షాదులు, క్రిమికీటకాదులకు హాని కలిగించకూడదని ప్రభు ఎప్పుడూ చెప్పేవారు. పిల్లలలాగే అన్ని జీవజాతులు నిర్భయంగా

విహరించాలని ప్రభువు ఆశించేవారు. ఇది పిల్లలకు అర్థమయ్యేది, కానీ, కొంతమంది పిల్లలు వినక అల్లరి చేసేవారు. వాళ్లకు జంతువులకు కష్టం కలిగించకూడదని అర్థమయ్యేటట్లు చెప్పే ఉపాయం ప్రభువు ఆలోచించేవారు. ఒక సారి గర్భంతో ఉన్న గేదెపై కూచొని మేపడానికి తీసుకువెళ్లే అల్లరి పిల్లవాణ్ణి శిక్షించిన విధం తమాషాగా ఉంటుంది. గేదెపై కూర్చున్న ఆ పిల్లవాణ్ణి చూసి గేదెకు కష్టం కలగనివ్వవద్దని ప్రభు ఎన్ని సార్లు వారించినా వినకపోతే చివరికి 'ఇప్పుడు గేదె మీద చేతులు పెట్టు' అని ప్రభు అనగానే పిల్లవాడు ఏమవుతుందో చూద్దామని రెండు చేతులు గేదె వీపుపై పెట్టాడు. ప్రభు నవ్వుకుంటూ ఆ గేదె చెడ్డది. నీ చేతులు తనకు అంటుకుపోతాయి. ప్రభు ఇలా అనగానే ఆ పిల్లవాడి రెండు చేతులు గేదె శరీరానికి అంటుకుపోయాయి. ఎంత ప్రయత్నించినా చేతులు తీయడానికి రాలేదు. గేదె పరిగెత్తుతూ, పిల్లవాడిని ఈడ్చుకుంటూ వెళ్లగానే పిల్లవాడు బాధపడసాగాడు. ఇది ఇతర పిల్లలకు వింతగా అనిపించింది. పిల్లవాడు ఏడుస్తూ ఇంకెప్పుడూ ఇలా చేయను అనగానే ప్రభువుకి ఆ పిల్లవాడ్ని చూసి జాలి వేసి గేదెను ఆపి, 'వాడు మళ్లీ నీకు కష్టం కలిగించడు క్షమించి వదిలేయి' అనగానే పిల్లవాడి చేతులు ఊడి వచ్చాయి. మిగతా పిల్లలకు ఆశ్చర్యం అనిపించింది. ఆ పిల్లవాడు సంతోషించాడు.

## 10. కాళంభట్టు

గుల్బర్గాకు చెందిన మేల్‌గిరి భట్ అనే ఆయన చిన్నప్పటినుండి కల్యాణిలో ప్రభు ఇంటి దగ్గరలోనే ఉండేవారు. వారు వైదిక బ్రాహ్మణులు. ఈయన ప్రభువు కంటే నాలుగు సంవత్సరాలు పెద్దవారు. కాని ప్రభువుతో అత్యంత ప్రేమగా ఉండేవారు. వారు బీదవారు కావడం వల్ల బిక్షతో కాలం గడిపేవారు. శంకరుని ఉపాసన చేస్తూ ఉండడం వల్ల, శ్రావణ మాసంలో శంకరునికి బిల్వార్చన చేసేవారు. ప్రభు ఇంటికి దగ్గరలో సోమేశ్వర దేవాలయం ఉండేది. ఆ దేవాలయంలోని లింగానికి అభిషేకం,సహస్ర బిల్వార్చన, నైవేద్యం, హారతి చేయడం దిన చర్యగా ఉండేది. ఒక రోజు బిల్వార్చన చేసిన తరువాత హారతి అవడానికి ముందు బాళంభట్ అనే బ్రాహ్మణుడు మేల్‌గిరిభట్ చేసిన పూజను భంగపరిచి శంకరుని లింగంపై నీళ్ళు కుమ్మరించాడు. మేల్‌గిరి భట్టుకి ఇది

చెడ్డగా అనిపించి అతనితో తగువులాడుచుండెను. ఈ విషయం విని ప్రభు ఇంట్లోంచి బయటకు రాగానే బాళంభట్టు అక్కడి నుండి వెళ్లిపోయాడు. మేల్‌గిరిభట్టు ప్రభువుకు జరిగిదంతా వివరించాడు. మేల్‌గిరి భట్టు మేనిఛాయ నల్లగా ఉండడం వల్ల ప్రభు ఎప్పుడు తనను ప్రేమతో కాళ్యా (ఈ శబ్దానికి అర్థం నలుపు) అని పిలిచేవారు. తరువాత ఆయనకు 'కాళంభట్టు' అనే పేరు స్థిరపడిపోయింది.

''కాళ్యా''! రాతి దేవుని పూజ భంగపరిచారని ఇంత కోపగించడం దేనికి?

''మరి నిజమైన దేవుడు మాకు ఎలా కనిపిస్తాడు?''

''నీకు నిజమైన దేవుణ్ణి చూడాలని ఉందా?''

''కోరిక అయితే ఉంది కాని ఎలా కనిపిస్తాడు? చూపించే వాళ్లు ఎవరు?''

ఆ మాట వినగానే ప్రభువు నవ్వుకున్నారు. అప్పుడు అతన్ని కళ్ళు మూసుకొని శంకరుని ముందు కూర్చోమని చెప్పారు. కొంతసేపయిన తరువాత కళ్ళు తెరువు అనగానే కాళంభట్టు కళ్ళు తెరిచాడు. ఏ స్థలంలో లింగ పూజ భంగపరచబడిందో ఆ స్థలంలో జటాధారియై, భస్మధారియై, కంఠంలో నాగదేవత, తలపై గంగతో, వక్షస్థలంపై రుద్రాక్షతో అత్యంత ప్రకాశమయమైన ముఖవర్ఛస్సుతో ఒక మహాపురుషుడు అగుపించాడు. పురాణాల్లో శంకరుని ఏ విధంగా వర్ణించారో ఆ విధంగా సాక్షాత్ శంకరుని మూర్తి కళ్లెదుట కనిపించగానే కాళంభట్టు ఆశ్చర్యపోయాడు. శరీరంపై వెంట్రుకలు నిక్కపొడుచుకున్నాయి. సాష్టాంగ నమస్కారం చేసి కళ్ళు తెరవగానే మునుపటిలాగే భంగపరిచిన శివలింగం కనిపించింది. ప్రభు ముఖం నవ్వుతూ కనిపించింది. ఆ రోజు శంకరుని సాక్షాత్కారం ప్రభు యొక్క లీల అని తెలిసింది. ప్రభువుకి పూజ చేసి హారతి చేశారు. దానితో ఆయనకు ప్రభువుపై దృఢవిశ్వాసం కలిగింది. అప్పటి నుండి ప్రభువుకి పూజ చేయడం ఇష్టంగా అనిపించేది. నైవేద్యం కూడా ప్రభువుకే తినిపించేవారు. ప్రభువు సంతోషంగా స్వీకరించేవారు. కాళంభట్టు బీదవాడు. బిక్షతో దొరికింది తృప్తిగా తినేవారు.

రోజూ భోజనం వాళ్ల మేనత్త ఇంట్లో ఉండేది. వారి వద్ద విస్తళ్ళు కుట్టుకొని భోజనం చేసేవారు. చుట్టు పక్కల దొరికిన ఆకులు తెచ్చి విస్తరాకులు కుట్టుకొని భోజనం చేసేవారు. కాళంభట్టుకు విస్తరాకులు కుట్టడం విసుగు అనిపించేది. అందుకని విస్తరాకులు కుట్టనంటే భోజనం దొరకదని మేనత్తా వాళ్లింట్లో చెప్పగానే ఆ రోజు నుండి భోజనం చేయలేదు. అత్త వాళ్లింట్లో భోజనం వదిలేశాడు. కాళంభట్టు నిగ్రహస్తుడు. స్వంతంగా చేసుకొని తినేవారు. తరువాత శ్రావణ మాసంలో బిల్వార్చన అయిన తరువాత సమారాధన చేయడానికి విస్తరాకులు అవసరం అయ్యాయి. దుకాణదారులు కూడా ఎవ్వరు విస్తరాకులు ఇవ్వలేదు. అప్పుడు కాళంభట్టుకు ఆలోచన మొదలయింది. ఇంతలో దారిలో ప్రభువు స్నేహితులతో వెళ్తూ కనిపించారు. ''ఏమిటి కాళ్యా, చింతామగ్నమై కనిపిస్తున్నావు ఏంటి విషయం? అని ప్రేమతో అడగగానే, విషయం ప్రభువుకు నివేదించాడు. నీవు ఏం భయపడకు ప్రభువు చింతను దూరం చేస్తారు అని అభయం ఇచ్చి అక్కడి నుండి వెళ్లిపోయారు.

ఏ రోజైతే సమారాధన ఉందో ఆ రోజు సుర్యోదయ సమయంలో కాళంభట్టు ఇంటికి ఇద్దరు అస్పృశ్య జాతీయులు వచ్చారు. ఇద్దరి వద్ద అరటి ఆకుల కట్టలు ఉండెను. తమ ఊరి యొక్క భావుసాహెబ్ కులకర్ణి గారు ఈ అరటి ఆకుల కట్టలు పంపించారని చెప్పి వెళ్లిపోవడానికి తయారయ్యారు. కాళంభట్టు సంతోషం చెప్పవలని కాలేదు. అయోమయ సమయంలో అత్యంత అవసరంగా ఉన్న వస్తువు అనాయాసంగా దొరికితే ఎవరికి సంతోషం కలగదు? ఆ వచ్చిన వాళ్ళు ఒకరు 'భావు' అని ఇంకొకరు 'మాణిక్య' అని చెప్పారు. కార్యము అయిన తరువాత వారు భోజనం చేసి అక్కడి నుండి వెళ్లిపోయారు. కార్యము నిర్విఘ్నంగా జరిగింది. ఆ వచ్చిన వాళ్ల గురించి ఆచూకి దొరకనేలేదు. రాత్రి నిద్ర కూడా పట్టలేదు. ప్రొద్దునే లేచి భావుసాహెబ్ కులకర్ణి వాళ్ల ఊరికి బయలుదేరాడు.

వాళ్ళ దగ్గరకి వెళ్లి, ''మీరు పంపించిన అరటి ఆకులు సమయానికి చేరుకొని నా కార్యము నిర్విఘ్నంగా జరిగింది. చాలా సంతోషం. మీ ఉపకారం (ఋణం) నుండి ఈ బీదవాడికి ఎలా విముక్తి కలుగుతుంది?'' అన్నాడు.

"అరటి ఆకులు నేను పంపించడం ఏంటి? నాకు ఆశ్చర్యంగా ఉంది. నాకేమీ అర్థం కావడం లేదు. నాకు అరటి తోట కూడా లేదు. మా ఊర్లో కూడా అరటి చెట్లు లేవు" అని కులకర్ణీగారు చెప్పగా, 'మాణిక్య' మరియు 'భావు' అనే ఇద్దరు అరటి ఆకులు తెచ్చారు. వాళ్ళు మీ పేరు చెప్పారు అని కాళ్యా బదులిచ్చాడు. అరే అలాంటి పేర్లున్న వారు మా ఊర్లో ఎవరూ లేరే అని కులకర్ణిగారు అన్నారు. ఎప్పుడైతే కులకర్ణిగారు తాము పంపించలేదని చెప్పేసరికి ఆ వచ్చిన వారి ఆచూకి దొరకక ఆశ్చర్యంతో కల్యాణికి తిరిగి వచ్చాడు. మూడు రోజులు ప్రభువు కనిపించలేదు. ప్రభువును కలవాలని మనస్సులో ఉత్సుకత ఉండేది. ఏ పని తోచేదికాదు. ప్రభువు కనిపించగానే జరిగిందంతా కాళంభట్టు వివరించాడు. ప్రభువు చిన్నగా నవ్వి, "కాళ్యా నీకోసం ప్రభు అన్న వైశ్య జాతీయుడిగా చెప్పుకొని అరటి ఆకులు తీసుకొని వచ్చి నీ చింత దూరం చేయాల్సి వచ్చింది", అనగానే కంట్లో అశ్రుధారలు కారసాగాయి. ప్రభుకాళ్ళు గట్టిగా పట్టుకొని దీనికంతటికి ప్రభువే కారణమని దృఢ పరుచుకున్నాడు. తరువాత మరణించేవరకు కాళంభట్టు మాణిక్ నగర్‌లోనే నివసించాడు. ప్రభు సమాధి తరువాత తన కొడుకులకు కూడా జరిగింది వివరించి చెప్పాడు. వారు శ్రావణ మాసంలో ప్రభు సమాధికి అభిషేకం, బిల్వార్చన చేసి సమారాధన చేసేవారు. తరువాత అదే క్రమం ఇప్పటికీ నడుస్తూంది.

## 11. భాలచంద్ర దీక్షిత్

కల్యాణ్ నుండి సుమారు ఎనిమిది క్రోసుల దూరంలో హాళీఖేడ్ అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలో భాలచంద్ర దీక్షిత్ అనే పేరుగల అగ్ని హోత్రి బ్రాహ్మణుడు నివసించేవారు. ఈ దీక్షితులు ఆకాలంలో విద్వాంసులలో అగ్రగణ్యులు. పూర్వ వైదిక పరంపరలో ఈయనకు సమానంగా ఎవరూ ఉండేవారు కాదు. ఈయన వేదశాస్త్ర సదాచార పరులై ఉండేవారు. శిష్య సముదాయం కూడా పెద్దగానే ఉండేది. ఈయన సాక్షాత్ వేదశాస్త్రపరాయణులని అందరూ పూజించేవారు. ఈయన అప్పుడప్పుడు కళ్యాణ్ వెళ్లేవారు. కళ్యాణ్‌లోని మనోహర్ నాయిక్ ఇంట్లో ఉండేవారు. వారికి బయమ్మ అతిథి సత్కారాలు చేసేవారు. మనోహరనాయిక్ కూమారుడు మాణిక్ (భావు) ని చూసి వీరు ఆశ్చర్యచకితులయ్యారు. ప్రభువు ముఖము తేజోవంతమై ఉండేది. ఒక రకమైన ఆకర్షణ ఆ ముఖంలో కనిపించేది. వారిగురించి,

వారి విద్యాభ్యాసం గురించి అడిగితే, ఎప్పుడూ అడవిలో తిరుగుతూ ఉంటాడు. చదువుపై శ్రద్ధ లేదు. అప్పుడప్పుడు దిగంబరంగా శరీరానికి బూడిద పూసుకొని ఇంట్లో ఉన్నా లేకున్నా, అన్నీ అందరికి పంచుతూ తిరుగుతాడని బయమ్మ చెప్పింది. ఇలా అనేక రకాలైన ప్రభువు యొక్క గుణాలు చెప్పి 'మీరయినా ఈబాలుణ్ని హాలీఖేడ్ తీసుకువెళ్లి మంచి దారిలో పెట్టండి' అని విన్నవించుకుంది. ప్రభువును దీక్షితులు తనతో పాటు తీసుకువెళ్లడానికి ఒప్పుకొని హాలీఖేడ్ తీసుకొని వచ్చారు. అక్కడికి వచ్చిన తరువాత కొద్దిగా కూడా నడవడిక మారలేదు. అక్కడ ఎలాగో, ఇక్కడ అలాగే ప్రవర్తించేవారు. భాలచంద్ర దీక్షిత్‌కి మాత్రం ప్రభువు యొక్క యోగ్యత తెలుసు. అందుకుని ప్రభువు ఎలా నడుచుకున్నా ఎవరూ ఏమీ అనకూడదని ఇంట్లో అందరికి ఆజ్ఞాపించారు. అక్కడ ప్రభువు ఇష్టానుసారంగా అడవులలో తిరిగి మధ్యాహ్న వేళలో ఇంటికి వస్తే, స్వయంగా దీక్షిత్‌లు మడిలో ఉన్నా కూడా ముట్టుకొని స్నానం చేయించి స్వయంగా తినిపించేవారు. అనేక రకాలుగా ప్రభువు దీక్షితుల ఇంట్లో వారి సహనానికి పరీక్ష పెట్టారు. చివరికి హోమ (అగ్ని) కుండంలో మలవిసర్జన కూడా చేశారు. అది చూసి దీక్షితుల భార్య సహించలేక దీక్షితులకు పిర్యాదు చేస్తే, అది విని అలా కాసే కాదు నిజంగా మలవిసర్జన చేస్తే అది తీసి చూపించు, అనగానే ఆ స్త్రీ అగ్ని కుండంలో చేయి వేసి చూస్తే ఒక బంగారు బంతి ఆమె చేతికి తగిలింది. దీక్షిత్ వైపు ప్రభు చూస్తూ, 'మీరు మీ అపూర్వ ప్రేమతో నన్ను కట్టి పడేశారు. మీ ఇంటిపై దత్తుని యొక్క అపూర్వ కృపాదృష్టి ఎప్పటికీ ఉంటుంది' అన్నారు. తరువాత ప్రభు యొక్క కృపతో భాలచంద్ర దీక్షిత్ ధనకనక వస్తుసంపదతో ఆనందంగా జీవించారు. ప్రభు సాక్షాత్ అగ్నినారాయణుడని దీక్షితులు అనేవారు. కొన్ని రోజులు హాలీఖేడ్‌లో ఉండి దీక్షితుల ఆజ్ఞతో సంతోషంగా ప్రభువు కల్యాణ్‌కి తిరిగి వచ్చారు.

## 12. పన్ను వసూలు చేయు ఆఫీసు

ప్రభువు కుటుంబపోషణకు వారి మేనమామ సహాయం చేసేవారు. ప్రభువు అడవిలో, గ్రామంలో చూపించిన అనేక లీలలు ప్రభువు కీర్తి (లౌకికత) తెలియడానికి కారణమైనా కుటుంబ దృష్టిలో ఏ మాత్రం తేడా కనిపించలేదు. ఏది వచ్చినా వెంటనే అది బయటికి వెళ్లి పోయేది. ఇలా ప్రతినిత్యం జరిగేది.

ఎవరైనా మంచి బట్టలు ఇస్తే ఒక రోజే ప్రభువు శరీరంపై కనిపించేవి. తరువాత త్రోవలో వెళ్ళే వారికి ఇచ్చేసేవారు. హనుమంతరావు మామ యొక్క ఇష్టానుసారంగా నడుచుకునేవారు. కానీ, సంపాదన అంతంత మాత్రంగా ఉండేది. ఈ స్థితి మామకు నచ్చేది కాదు. మామ ప్రభువుకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలనుకున్నారు. పన్ను వసూలు చేసే ఆఫీసులో ఉద్యోగం మామ చేతిలో ఉండడం వల్ల అది ప్రభువుకి ఇప్పించారు. పైసలు వసూలు చేసి, ఆ ప్రకారం జమ చేసినట్లుగా రశీదు రాయాల్సి ఉండేది. తరువాత్తరువాత ప్రభువు పైసలు సర్కారులో జమ చేయడానికి బదులుగా బీద సాదలకు పంచిపెడుతుండేవారు. మామ ఇది చూసి విసిగిపోయాడు. ప్రభువు ఆ ఉద్యోగం వదిలి పెట్టారు. ఇంటికి ఏ విధముగాను ఉపయోగపడే ఉద్యోగం చేయకపోతే మామ బాధ పడ్డారు, కానీ ప్రభు మాత్రం ప్రశాంతంగానే ఉన్నారు.

## 13. హనుమంత్ దాదా పెళ్లి, తాత్యావారి ఉపనయనము

హాళీఖేడ్ భాలచంద్ర దీక్షిత్ గారికి ప్రభువు ఇంటితో సంబంధము కలుపుకోవాలని మనసులో ఇష్టంగా ఉండేది. అందుకని బయమ్మ మరియు మామగారి యొక్క అనుమతితో తన కుమార్తె అయిన లక్ష్మీబాయిని ప్రభువు సోదరుడైన హనుమంతరావుకిచ్చి పెళ్ళి చేశారు. హనుమంతరావు మనసులో పెళ్లి చేసుకోవాలని లేకున్నా ప్రభువు చెప్పడంతో పెళ్లికి అంగీకరించారు. హనుమంత్ దాదా శాంత స్వభావంతో ఎప్పుడూ మౌనంగా ఉండేవారు. పెళ్లి సమయంలో అసంకల్పంగా పెళ్లికి కావలసినది ఏదీ తక్కువ లేకుండా సమకూరింది. భాలచంద్రదీక్షితుల మనసుకు సమాధానం కలిగింది.

ప్రభువు సామర్థ్యము, కీర్తి దినదిన ప్రవర్ధమానయ్యేది. కానీ ఇల్లు మాత్రం ఎప్పుడూ కడిగినట్లే ఉండేది. హనుమంతరావు యొక్క ఆదాయము అతి స్వల్పంగానే ఉపయోగపడేది. మామ సహాయము తప్పక తీసుకోవలసి వచ్చేది. నృసింహతాత్యా ఆరు సంవత్సరాల వారు అయ్యేసరికి ఉపనయనము చేయడం తప్పనిసరి అయింది. ఇంట్లో పైసాలేదు. బట్టలు లేవు. ఉపనయనము ఎలా చేయాలి? బయమ్మకు విచారం కలిగింది. ప్రభువు తల్లి విచారం తెలుసుకొని

ఇంటి దగ్గరలో ఉన్న సోమేశ్వర దేవాలయంలో ఆసనం వేసుకొని గణపతి ముందు పోకను ఉంచి మా తాత్యా ఉపనయనము నిర్విఘ్నంగా జరుగాలని సాయంత్రం వరకు కూర్చుని ఉండిపోయారు. సాయంత్రం సమయంలో వెంకప్ప అనే పేరుగల వైశ్యుడు అకస్మాత్తుగా ఉపనయనమునకు కావలిసిన బట్టలు, నాలుగు వందల మంది భోజనానికి సరిపోయేటట్లుగా సామాగ్రి తీసుకొని మ్రొక్కు తీర్చుకోవడానికి వచ్చి సోమేశ్వర దేవాలయంలో ఉన్న ప్రభు ముందుపెట్టాడు. వెంకప్ప పిల్లల కోసం మొక్కుకొని ఉండెను. పిల్లలు కలిగాక మొక్కు తీర్చుకోవడానికి సామాగ్రితో వచ్చెను. ఆ వస్తువులన్నీ ఉపనయనమునకు కావలసినవై ఉండెను. అది చూసి బయమ్మ అత్యంత ఆనంద భరితురాలయ్యేను. ముహూర్త సమయానికి ఉపనయనము నిర్విఘ్నంగా జరిగెను. ఇదంతా గణపతియే చేశాడని ప్రభువు అన్నారు. పుణ్యాహవాచనం చేసి దేవున్ని కూచోపెట్టడానికి హనుమంతరావు కావలిసి ఉండెను. తను హాళీఖేడ్‌కు తన భార్యను తీసుకురావడానికి వెళ్ళి ఉండెను. వారు కూడా సమయానికి వచ్చి ఉపనయనము నిర్విఘ్నంగా జరిగెను.

## 14. మామాతో రాం! రాం!

కుటుంబం యొక్క యోగ క్షేమాలు ప్రభువు యొక్క సామర్థ్యంపై నడిచేవి. కానీ, ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండేది. ప్రభువు కుటుంబ పోషణ మామకు కష్టంగా ఉండేది. ప్రభువు బాధ్యతారహితంగా వ్యవహరించడం నచ్చేది కాదు. ఏదైనా ఉద్యోగం చేయాలి, దేవునిపై భారం వేసి కాలం గడపడం సామన్యుల లక్షణం అని మామ నమ్మేవారు. వారి దృష్టిలో పురుషార్థ లక్షణమైన ఉద్యోగం చేయాలి, వ్యవహారిక జ్ఞానం సంపాదించాలని అనుకునేవారు. కానీ, ప్రభువు వీటిని ఎప్పుడూ లక్ష్యపెట్టలేదు. ఎప్పుడూ భిన్నంగా ఆలోచించేవారు. అప్పుడప్పుడు మామ ఇంట్లో ప్రభువు ఉండేవారు. ఒక రోజు మధ్యాహ్నం మామ బయటి నుండి ఇంటికి వచ్చేసరికి ప్రభువు మంచంపై శాలువా కప్పుకొని పడుకొని ఉండిరి. అప్పుడు మామకు ఆశ్చర్యం కలిగి ప్రభువుకి బుద్ధి చెప్పడానికి ఇదే సమయమని అనుకొని, ప్రభువును లేపి, జాగీర్‌దార్‌లాగా నిద్రిస్తున్నావు. కొంచెమైన సిగ్గు అనిపించదా! నీవేంటి? నీయోగ్యత ఏంటి? 16 సంవత్సరాల

గుర్రములాగా ఉన్నావు. ఇంకా పొట్టనింపుకొనే తెలివి లేదు. నీ కోసం ఇతరులు కష్టపడాలా? కొంచమైనా కాళ్లు చేతులు ఆడించాలి. శరీరంలో బుద్ధి ఉంది కాని విద్యాభ్యాసం వద్దు. అక్షరాలు అన్నీ తెలుసు కాని వ్రాయడం రాదు. శరీర సామర్థ్యం బాగుంది కానీ పని చేయకూడదు. ఇతరులపై ఆధారపడి బ్రతకకుండా ఇంటి పరిస్థితి చూడు. అమ్మ నీ కోసం కష్టపడాలి కానీ తన కోసం నీవు ఆలోచంచవు. నేనైనా మీ కుంటుంబాన్ని ఎంతని పోషిస్తాను. తన హితము తాను చూసుకోక పోతే ఇతరులు ఎవరు చూస్తారు? నా ఇంట్లో ఇకమీదట నీకు ఆసరా దొరకదని గ్రహించు. ఇన్ని రోజులు మీ పాలన పోషణ చేసింది వ్యర్థం అయిపోయింది. ఇక ముందు నీకు భోజనం దొరకదు. భోజనం పెట్టకపోతేనే నీకు కళ్ళు తెరుచుకుంటాయి. పో! నా ముందు నుండి వెళ్లిపో! అని మామ ప్రభువుని మందలించారు. ఇది విని ప్రభువులో ఏ తేడా కనిపించలేదు. తాము నిరాధారమయ్యామని కూడా అనిపించలేదు. మామ యొక్క అంతఃకరణ ప్రభువుకి తెలుసు. వ్యవహార దృష్టిలో మామ తన కర్తవ్యము చేశారు. ప్రభువు భక్తులకు మామ వ్యవహారము నచ్చేది కాదు. కానీ, ప్రభువుకి మామ ప్రాపంచిక దృష్టి కలవారని, ఆయన సహజంగా అలా వ్యవహరిస్తారని ప్రభువుకి తెలుసు. ఇది ప్రభువుకు అనుకూలంగా జరిగింది. ప్రభువు కుటుంబ బంధం నుండి విముక్తి చెంది బయట ప్రపంచం ఉద్ధరించాల్సి ఉండెను. మామ ఈ విధంగా మందలించగానే, ఇదే ఇల్లు విడిచే సమయమని ప్రభువుకి అనిపించింది. మనోహరనాయిక్‌కి దత్త సాక్షాత్కారమై స్పష్టమైన సూచన లభించింది. కుటుంబ వ్యవహారం కోసం నరసింహతాత్యా ఉన్నాడని అనుకునేవారు. ప్రభువుకి సంసారం చేసే ఆలోచన ఉండేది కాదు. ఈ విషయం మనోహర నాయిక్‌కి తెలుసు. కనుక ప్రభువు యొక్క ఏ పనిని వారు విరోధించేవారు కాదు. మామకు ఈ విషయం తెలియదు. మామ కుటుంబోద్ధరణ కోసం ఉపయోగపడతాడనుకుని ప్రభువుని మందలించారు. ఈ సమయం కోసం ఎదురు చూసిన ప్రభువుకు మామ అవకాశం కల్పించినట్లు అయింది. మామ మందలించగానే ప్రభువు ఏమి సమాధానం ఇచ్చారో అని పాఠకులకు ఉత్కంఠ కలగడం సహజం. ప్రభువు యొక్క వాస్తవిక స్వరూపం ఈ సమాధానం నుండి తెలుస్తుంది. అత్యంత శాంతంగా ఉల్లాసంతో ప్రభువు తాను ధరించిన ధోతిని చించి, దానిని లంగోటిగా ధరించి మామ కాళ్లకు నమస్కరించి బయటికి వెళ్లి పోయారు. వెళ్తూ వెళ్తూ ప్రభువు యొక్క నోటినుండి

గంగాజల నిర్మల ప్రవాహం ఏ విధంగా ఉంటుందో ఆ విధంగా ఈ క్రింది వాక్ ప్రవాహం సహజంగా వెలువడింది:

ప్రభువిణ కోణ కుణాచా వాలి?
కర్తా హర్తా తో కరవీతా 'మీ' మిథ్యా జనబోలీ।
కోణ కుణాచా చాకర్ మాలక్, వ్యర్థచి భావణ ఖాలీ।
మాణిక మ్హణె మాతేచ్యా ఉదరీ నవమాస రక్షణ కేలీ॥

"ఏ ప్రభువైతే తల్లి గర్భంలో తొమ్మిది నెలలు రక్షించినాడో ఆ ప్రభువే నాకు జన్మనిచ్చారు. ఆ ప్రభువే నాకు పోషించుకునే సామర్థ్యం ఇస్తారు. తనే నాకు సర్వస్వం" అంటూ, మామా! మీరు కారణం లేకుండా మనసుకు కష్టం కలిగించుకోకండి. మీ ఆశీర్వాదం నాకు ఎప్పుడూ ఉండనివ్వండి, నేను వెళ్తున్నాను. పై విధంగా మామ యొక్క మందలింపు తనకు అనుకూలంగా చేసుకొని ప్రభువు బయట పడ్డారు. ప్రభు చిన్నప్పటి నుండి "ప్రభు" (అంటే దత్త ప్రభువు) అని ఎప్పుడు పలికేవారు. అందుకని మాణిక్ అనే పేరు తరువాత ప్రభు అనే పదం స్థిరపడిపోయింది. ఇప్పటి వరకు ప్రభువుకి కల్యాణ్‌తో సంబంధం ఉండేది. తరువాత ప్రభువు కల్యాణి విడిచారు కాని జగత్తు యొక్క కల్యాణం ప్రభువు చేతిలోకి వచ్చింది. కానీ ప్రభువు ప్రముఖ శిష్యులు కల్యాణి గ్రామంలోనే ఉన్నారు. ప్రభువు వెళ్ళడం వల్ల ఆబాలగోపాలనికి చాలా బాధ కలిగింది. ఈ చరిత్రలో కల్యాణికి చెందిన శిష్యుల వివరణ ముందు ఇవ్వడం జరిగింది.

॥ శ్రీ దత్తాత్రేయార్పణమస్తు ॥ ॥ శ్రీ గురు మాణికార్పణమస్తు ॥

# రెండవరోజు పారాయణము

## పర్యటన

### 15. అమృత కుండము

కళ్యాణ్ నుండి సుమారు 3 కోసుల దూరంలో 'మంటాల' అనే గ్రామానికి దగ్గరలో అమృతకుండము అనే అత్యంత పురాతన తీర్థక్షేత్రం ఉంది. పూర్వం ఆర్యసంస్కృతి యొక్క వైభవకాలంలో ఎంతోమంది తపోనిధులు తపస్సు చేసి ఈ తీర్థం యొక్క మహత్యాన్ని పెంచారు. ఈ కాలంలో కూడా ఈ తీర్థం యొక్క రమణీయత కించిత్తు కూడా తగ్గలేదు. ఈ కుండము నాలుగు దిక్కుల రాళ్ళతో నిర్మించబడింది. ఏ కాలంలో అయినా ఒక నీటిధార కుండంలో నుండి బయటకు వస్తూ ఉంటుంది. ఈ నీళ్ళతో పొలాలు కూడా బాగా పండుతాయి. పచ్చని చెట్లతో విస్తారమైన జల సంపదతో ప్రశాంతమైన ఆకర్షణీయ సౌందర్యం కనిపిస్తుంది. దీనికి ఉత్తర దిశలో శంకరుని దేవాలయము ఉంది. దేవాలయ దక్షిణభాగంలో ప్రాచీన శిల్పకళలకు సాక్ష్యమైన శంకర మరియు దేవతా స్వరూపాలైన (పెద్ద పెద్ద రాళ్ళతో చెక్కినవి) శిల్పాలు కనిపిస్తాయి. ఇవన్నీ చూడగానే మనసు ఉద్విగ్నతకు లోనవుతుంది. ఇక్కడే గుహలాగా ఒక ప్రదేశం ఉంది. దానికి ఇప్పుడు తలుపులు బిగించారు. సాధు, గోసావి, బైరాగులు ఇక్కడ నివసిస్తూ ఉంటారు. పూజారి మంటాల గ్రామంలో

ఉంటారు. ఈ స్థానము నిర్జనప్రదేశము అయినందున భయం అనిపించినా ప్రకృతిసౌందర్యమును ఆరాధించేవారికి రమణీయంగా అనిపిస్తుంది. ఈ స్థానాన్ని చూడగానే తపస్సు చేయాలనే కోరిక కలుగుతుంది. ఎప్పుడూ నీరు ప్రవహిస్తూ ఉండడం వల్ల స్వచ్ఛంగా ఉండేది. కానీ ఇప్పుడు పాచి పేరుకు పోయి సరియైన నిర్వహణ లేకపోవడం వల్ల పరిసరాలు శుభ్రంగా లేవు. ఈ కుండము నుండి పావుమైలు దూరంలో తక్కి సోమన్న యొక్క దేవస్థానము ఉంది. పూర్వం ఈ ప్రదేశంలో ఉత్కృష్ట శంకర దేవాలయం ఉండేది. మంచి పనితనం కలిగినవారు ఈ మహాదేవుని లింగం తయారు చేశారనిపిస్తుంది. ఈ లింగం ఐదు అడుగుల ఎత్తు కలది. ఈ లింగమును విరగొట్టే ప్రయత్నం చేశారనిపిస్తుంది. లింగముపై గీతలు కనిపిస్తాయి. కానీ, లింగము మాత్రం చెక్కు చెదరలేదు. దీనికి ఉత్తరంగా సుమారు ఒకమైలు దూరంలో సీత యొక్క గుహ ఉంది. దాని పక్కనే నీటిధార ప్రవహిస్తూ ఉంటుంది. నీరు స్వచ్ఛంగా ఉండి అది చూడగానే పవిత్ర భావన కలుగుతుంది. గుహ చుట్టూ చెట్లు కూడా ఉన్నాయి. ఈ గుహపై ఇరవై అడుగుల పైకి ఎక్కి పోయిన తరువాత ఇంకొక గుహ కూడా ఉంది. దారి కొంచెం కష్టంగానే ఉంటుంది. గుహకు ఉత్తర దిశలో ఒక కమాన్ ఉంది. కమాన్ నుండి దిగి వెళ్ళడానికి మెట్లు ఉన్నాయి. అక్కడి నుండి కుడిపక్కకు వెళ్ళాలంటే ఇరవై ఐదు నుండి ముప్పై అడుగులు కూర్చుని వెళ్తేనే లోపలికి వెళ్లవచ్చు. దానికి ముందు ఏం ఉందో తెలియదు. అత్యంత ఏకాంతవాసంలో ఉండి తపస్సు చేసుకోవడానికి కావలిసిన ప్రదేశాలలో ఇదే సర్వోత్తమమైనది.

మంటాల గ్రామానికి చెందిన కులకర్ణీగారు నిత్యం అంబిలకుండానికి (అమృతకుండము) దైవదర్శనార్థము వచ్చేవారు. ఈయన భావుకులై ఉండేవారు. ఈయన రోజులాగే శంకరుని దర్శనానికి వచ్చి ప్రదక్షిణ చేసే దారిలో దూరంగా పదహారు-పదహేడు సంవత్సరాల వయస్సులో ఉన్న యువకుడు అతని దృష్టిలో పడ్డాడు. ఆ యువకుని శరీరవర్ఛస్సును చూసి ఆ గృహస్థు విస్మయం చెందారు. శరీరంపై లంగోటీతో భస్మధారియైన అతని స్వరూపం చూడగానే సాక్షాత్ శంకరభగవానుని దర్శనం అయినట్లు అనిపించింది. కాని నమ్మశక్యం కాలేదు. చివరికి దగ్గరికి వెళ్లి మీరు ఎవరు? ఎక్కడి నుండి వచ్చారు? ఈ భయానక నిర్జన ప్రదేశానికి ఎందుకు వచ్చారు?

అని అడగాలని ఆ బాలుని వద్దకు వెళ్లాలని ఆ వైపు నడిచాడు. ఆ యుక్త బాలకుడు ముందు ముందుకు వెళ్తున్నాడు. అతని వెనకనే మంటాల గృహస్థు వెళ్లారు. చెట్ల మధ్యలో ఆ బాలకుడు కనిపించలేదు. కానీ, ఒక భయంకరమైన పులి కనిపించింది. ఈ అడవిలో కొన్ని రోజుల నుండి పులులు సంచరిస్తున్నాయని, దొరికిన పశువులను తింటున్నాయని విని వుండడం వల్ల ముందుకు వెళ్లాలన్న ఆలోచన విరమించుకొని, ధోతిని పైకి కట్టుకుని అక్కడి నుండి పరిగెత్తుకొని మంటాలకు తిరిగి వెళ్లిపోయారు. కానీ, ఆ బాలకుని యొక్క రూపము మరవలేక పోయాడు. అతను దైవస్వరూపమేమో? అతనికి పులి భయంలేదా? మనుష్యుడైతే ఆ బాలుడు పులి అని అరిచేవాడు. ఈ రోజు శంకర భగవానుని దర్శనభాగ్యము కలిగినా కూడా పులి యొక్క భయం వల్ల అతనిని వదిలి తిరిగి రావలసి వచ్చిందని చాలా బాధపడ్డాడు. మనసులో మళ్లీ అమృతకుండముకి వెళ్లాలనిపించినా పులియొక్క భయం వల్ల మళ్లీ ఎన్నో రోజుల వరకు ఆ వైపుకు వెళ్ళలేదు. తరువాత రెండునెలలకు చెక్కగుర్రముపై కూర్చొని ఒక యుక్తవయస్సులో ఉన్న బాలుడు మాంటాల గ్రామంలో కనిపించాడు. పిల్లలకు ఈ చెక్కగుర్రము విచిత్రంగా అనిపించి అందరు పిల్లలు దాని చుట్టూ మూగారు. ఈ అందరి పిల్లలతో కలిసి ఆ బాలుడు మంటాల కులకర్ణి ఇంటికి చేరుకున్నారు. కులకర్ణి దగ్గరికి వెళ్ళగానే అతనిని కళ్యాణికి చెందిన మాణిక్ ప్రభు అని గుర్తుపట్టారు. తను రెండు నెలల క్రితం అమృత కుండము వద్ద చూసిన బాలుడు ఇతనే అని నిర్ధారించుకున్నాడు. కళ్యాణి మాణిక్ ప్రభు అనగానే దర్శనానికి ఊరంతా కదిలి వచ్చింది. కులకర్ణి ఇంట్లో ఆయన భార్య ప్రసవవేదన పడుతుండెను. ఎంతసేపయినా ప్రసవం జరగలేదు. గాభరా పడిపోయాడు. కాని మాణిక్ ప్రభువును చూడగానే ప్రాణం లేచి వచ్చినట్లయింది. అప్పుడు ప్రభువును ప్రార్థించగానే నలుగురు బ్రాహ్మణుల వద్దనుండి తీర్థం తీసుకొని వచ్చి నీ భార్యకు త్రాగిస్తే మంచి జరుగుతుంది అనగానే, ఆ అమృతవాక్కు విని ఆ విధంగా చేయగానే సుఖప్రసవం అయి పుత్రుడు జన్మించాడు. అతని ఆనందం చెప్పనలవి కాలేదు. ప్రభువు అక్కడి నుండి వెళుతుంటే బెల్లంతో చేసిన లడ్డు కులకర్ణిగారు ఇవ్వగానే ప్రభువు అది తిని సంతుష్టులయ్యారు. ఈ విషయం తెలిసి గ్రామస్థులందరు పోగయ్యారు కానీ, ప్రభు చెక్కగుర్రంపై స్వారీ చేస్తూ వెళ్లి పోయారు. ప్రభువును వెంబడించడం వారికి సాధ్యం కాలేదు. ప్రభువు

కళ్యాణి నుండి వెళ్ళిపోగానే ఇంట్లోని వారందరికీ బాధ కలిగింది. మామకు మాత్రం చాలా దుఃఖం కలిగింది. తనొకటి తలిస్తే దైవం మరొకటి తలిచింది అనిపించింది. నాలుగుదిక్కులా ప్రభు కోసం వెతికించారు. చాలా రోజులు వెతికినా ప్రయోజనం లేకపోయేసరికి అందరూ నిరాశ చెందారు. ప్రభువుతో ఆటలాడిన పిల్లలకు కూడా చాలా దుఃఖం కలిగింది. కళ్యాణ్ నుండి వెళ్లిన మూడు-నాలుగు నెలల తరువాత మంటాలలో కనిపించారు. బయమ్మ, హనుమంత్‌రావు దాదా, నృసింహతాత్యాలను తీసుకొని మామ మంటాలకు వచ్చారు. అమృతకుండమునకు వచ్చారా అని అక్కడికి వెళ్లి విచారించారు. సీత గుహదగ్గరికి కూడా వెళ్లి చూశారు కానీ, ప్రభువు కనిపించలేదు. వెతికి వెతికి అందరికి విసుగు అనిపించింది. మంటాలలో కొన్ని రోజులు ఉన్నారు. వీళ్ల మనసు తెలుసుకొని ప్రభువుకి వారి మీద దయ కలిగి అమృతకుండములో కనిపించగానే అందరూ అమృతకుండానికి వచ్చారు. ప్రభువు కనిపించగానే అందరికీ చాలా సంతోషం అయింది. అక్కడ రెండు మూడు రోజులు ఉండిపోయారు. ఆ సమయంలో అమృతకుండములో 'నిత్యశ్రీ నిత్యమంగళం'గా అనిపించింది. ప్రభుదర్శనం కోసం వేలమంది రోజూ వస్తుండేవారు. భోజన సమారంభము కూడా జరుగుతుండేది. పేడా, కర్జూరపండ్లు, కొబ్బరికాయలు, కలకండ మొదలైనవి దొరికే దుకాణాలు ఆ నిర్జన ప్రదేశంలో వెలిశాయి. పూజ, అర్చన, నైవేద్యం, బ్రాహ్మణ భోజనం ఇవన్నీ చూసి మామ ఆశ్చర్యపోయారు. ప్రభువు యొక్క సామర్థ్యం ఇప్పుడు అందరికి అర్థం అయింది. ప్రభు అందరిని సముదాయించి తిరిగి కళ్యాణ్‌కి పంపించారు. హనుమంతరావు మొదటినుండి మౌనిగా ఉండేవారు. మామ యొక్క అదుపాజ్ఞలో ఉండి జీవనం సాగించేవారు. నృసింహతాత్యా చిన్న వయస్సులో ఉండడం వల్ల విద్యాభ్యాసము చేసేవారు. విద్యాభ్యాసం మాత్రం ఉత్తమ రీతిలో అభ్యసించేవారు. కుటుంబ వ్యవహారాలలో నృసింహతాత్యా సరియైన వారు, నన్ను మాత్రం మీరు లెక్కలోకి తీసుకోవద్దు అని ప్రభువు ఖచ్చితంగా చెప్పడం వల్ల మారు మాట్లాడకుండా అందరూ సంతోషంగా కళ్యాణికి తిరిగి వెళ్ళిపోయారు.

ప్రభు నడవడికలో స్వతంత్ర ప్రవృత్తి మొదలయింది ఈ అమృతకుండము దగ్గరే. ఈ ప్రదేశంలో ప్రభు స్థిరంగా ఆరు నెలలు నివసించారు.

ఆ సమయంలో అప్పుడప్పుడు అదృశ్యమవుతూ, కనపడుతూ ఉండేవారు. ఆ నిర్జనారణ్యంలో ప్రభువు నివసించడం వల్ల దాని మహత్యం పెరిగి ఆ నిర్జనారణ్యం జనంతో నిండిపోయింది. పూజ అర్చనలు జరగడం వల్ల అక్కడ ఫలపుష్పాల దుకాణాలు వెలసి ఆ స్థలం శోభాయమానమయింది. ఆ అరణ్యంలో మంగళ వాద్యాలు మ్రోగాయి. భోజన పంక్తులు ఒకదాని తరువాత ఒకటి జరుగుతుండేవి. ప్రభువు దర్శనము కొరకు వచ్చేవారు నాలుగు రకాలుగా ఉండేవారు. కోరికలను తీర్చమనేవారు, జిజ్ఞాసువులు, ధనం అడిగేవారు మరియు జ్ఞానులు. ఈ నాలుగు రకాలైన వారు రావడం అమృతకుండము నుండే మొదలైనది. వేడాభావు ఏదైతే మాట్లాడుతాడో అది నిజమవుతుందని నమ్మి వచ్చే వారికి, వారి పనులు పూర్తయ్యేవి. కొందరు రోగాలతో, కొందరు సంకట పరిస్థితులతో, కొందరు పుత్ర అపేక్షతో ఇలా నానా రకాలైన కోరికలతో ప్రభువు వద్దకు వచ్చేవారు. ప్రభువు వద్ద ఉన్న యోగసామర్థ్యము తెలుసుకొని జ్ఞానసంగ్రహం చేసుకోవాలని వచ్చేవారు జిజ్ఞాసువులుగా ఉండేవారు. కేవలం ద్రవ్యము అడగానికి కొందరు వచ్చేవారు. కొందరు స్వతః జ్ఞాన సంపన్నులై ప్రభుదర్శనం కోసం వచ్చేవారు. ప్రభువు కీర్తి ఎలా వృద్ధి అవుతూ పోయిందో అలా ప్రభు సమక్షంలో ఈ నాలుగు రకాలైన వాళ్లు వస్తూపోతుండేవారు. దాంట్లో కోరికలు కోరేవారు, ద్రవ్యార్థులై వచ్చేవారు ఎక్కువగా ఉండేవారు. ప్రభువు సామర్థ్యం నలుదిక్కుల వ్యాపించగానే జనం దర్శనార్థులై వచ్చేవారు. అక్కడ జాతరలాగా కనిపించేది. దగ్గరలో పల్లెటూళ్లలోని జనాలు ప్రభువుకి ఇష్టమైన పదార్థాలు తెచ్చి అర్పించేవారు. ఆబాలగోపాలం అందరూ నిండి పాతే వారు తెచ్చిన పదార్థాలు తీసుకొని ప్రభు వారిని పొగిడేవారు. ఈ విధంగా ఆనందంతో ప్రభువు నివసించడం వల్ల ఆ నిర్జన ప్రవేశం ''నిత్యశ్రీ నిత్య మంగళమై'' విలసిల్లింది. మధ్యమధ్యలో ప్రభువు నాలుగు లేదా ఎనిమిది రోజులు అదృశ్యం అయ్యేవారు. అప్పుడు ఎవరికీ ఆచూకీ దొరికేది కాదు. అయినా కూడా ప్రభువు రాకకోసం ఎదురుచూస్తూ ఉండేవారు. ప్రభు సమక్షంలో ఎప్పుడూ నిర్భయంగా ఉండేవారు.

మొదట ప్రభువు కళ్యాణ్ నుండి బయట పడిన తరువాత విఠల్‌రావు తండ్రి, ఇంకొకరు ఆయన వయసువారే గృహస్తులు ప్రభువు వెంట వెళ్ళారు. వాళ్లు ప్రభువుతో ఆడుకొనేవారు. కళ్యాణ్ నుండి మూడు కోసుల దూరంలో

మంటాల దగ్గరి అరణ్యానికి నాతో పాటురండి, అని వారిని తీసుకు వెళ్లారు. వాళ్లు ఆ అరణ్యంలో భయపడుతున్నట్లు ప్రభువుకి అనిపించి, భయపడకండి నా వెంట రండి మీ భాగ్యోదయం అవుతుంది అంటే అది విని ఆ ఇద్దరు అరణ్యంలోని ఒక గుహలోకి ప్రభువుతో పాటు వెళ్ళారు. కొద్ది దూరం వెళ్ళిన తరువాత ఒక రాతి బండ కనిపించింది. దానిని ముగ్గురు తొలగించి ముందుకు వెళ్లారు. అక్కడి ప్రదేశం స్వచ్ఛంగా నిర్మలంగా కనిపించింది. ఇంకొంచెం ముందుకు వెళ్లగానే నల్లని పెద్దరాతిబండ కనిపించింది. అది తొలగించటానికి ఆ ఇద్దరు ప్రయత్నించారు కానీ, ఫలితం కనిపించలేదు. చివరికి ప్రభువు నవ్వుతూ "ఇప్పుడు ఆ ప్రయత్నం ఆపి నా ధోతి అంచుని పట్టుకొని నిలబడండి, భయపడకండి అంటూ ప్రభువు గట్టిగా ఆ రాతిబండను త్రోయగానే ఆ బండపడిపోయి ఒక భయంకరమైన గర్జన వినిపించింది. అది ఒక భయంకరమైన పులి గర్జనగా అనిపించి ఆ ఇద్దరు గాభరా పడిపోయి పట్టుకున్న ధోతి అంచును విడిచి వెనకకు చూడకుండా పరిగెత్తి వెళ్లిపోయారు. కొద్ది దూరం వెళ్లగానే పెద్ద శబ్దంతో పాటు పులి గర్జన వినిపించింది. వాళ్లు ప్రభువుపై పులి దాడిచేసి చంపి ఉంటుందని అనుమానించారు. భయంతో పరిగెత్తి కళ్యాణికి చేరుకున్నారు. ఈ విషయం ఎవరి ముందు చెప్పడానికి ధైర్యం కాలేదు. కొద్ది రోజుల తరువాత అమృతకుండము వెళ్లడానికి కళ్యాణ్‌లోని కొంతమంది వెళ్తుండగా, వారితోపాటు రొట్టెలు కట్టుకొని ఈ ఇద్దరు కూడా బయలుదేరారు. కొండ ఎక్కి అమృతకుండము వద్దకు వెళ్లగా ఆ రోజు జరిగిన సంఘటన ఇతరులకు చెప్తుండగా ప్రభువే ముందు కనిపించారు. పులి ఉన్న గుహనుండి ప్రభువు సజీవంగా బయటకి రావడం, రెండు నెలలు అన్నం లేక పోయినా ప్రభువు పూర్వంకంటే తేజోమయంగా కనిపించడం వారికి ఆశ్చర్యం కలిగించింది. ఏమి జరిగింది? అని వారు ప్రభువునే ప్రశ్నించారు. మీరు భయపడకుండా నా వెంట వచ్చి ఉంటే దాని మర్మం మీకు తెలిసేది. అక్కడికి వచ్చిన వారి స్నానాదికాలు అయిన తరువాత తీసుకువచ్చిన రొట్టెలు తినడానికి సిద్ధమయ్యారు. ఇంతలో ఒక బైరాగి వస్తూ కనిపించారు. ఆయన శరీరం కాంతివంతమై ఉంది. ఆయనతో పాటు ఇంకొకరు కూడా ఉండిరి. చేతిలో ఒక పాత్ర, భుజానికి జోలీ వ్రేలాడుతూ ఉండెను. ఈ బైరాగిని చూసి ప్రభువు "ఈ రోజు మహాప్రసాద యోగము ఉంది. ప్రసాదం తీసుకున్న తరువాత రొట్టెలు తిందాము" అని అన్నారు. ఇది ఏమి చమత్కారమో, ఆ

ఇద్దరికి అర్థం కాలేదు. బైరాగి తన దగ్గర ఉన్న పాత్రలో కుక్క పాలను పిండుకొని వాటిలో జోళిలోని రొట్టెను కలిపారు. దగ్గరలో ఉన్న ఒక చనిపోయిన పాము ను కూడా తీసుకొని పాత్రలో వేసి దానిని కూడా వాటితో కలిపారు. ఆ ఇద్దరు అసహ్యంగా, ఆశ్చర్యంతో చూడసాగారు. పూర్తిగా కలిపిన తరువాత బైరాగి ప్రభువుని పిలిచి దాంట్లో నుండి ఒక ముద్ద ప్రభువుకి ఇచ్చారు. అలాగే ఆ ఇద్దరిని పిలిచి వారికి కూడా ముద్దగా చేసి ఇచ్చారు. ప్రభువు వెంటనే ఆ ముద్దను నోట్లో పెట్టుకొని తినేశారు. ప్రత్యక్షంగా ఆ బైరాగి కలిపిన వాటిని చూడడం వల్ల ఆ ఇద్దరూ అలాగే ముద్దను చేతిలోనే పట్టుకొని నిల్చున్నారు. బైరాగి పూర్తిగా తిని అక్కడి నుండి వెళ్లిపోయారు. తరువాత ప్రభువు వారిని తిన్నారా అని అడిగితే జరిగింది చెప్పి పిడికిలి తెరిచి చూపిస్తే ఆ చేతులలో ఏమీ కనిపించలేదు. బైరాగి ఎక్కడినుండి వచ్చాడో ఎక్కడికి వెళ్లాడో చేతుల్లో ఉన్న ముద్ద ఏమయిందో వారికి అర్థం కాలేదు. మీరు అదృష్టవంతులు కారు, దానికి మీరేం చేస్తారు, ఆ బైరాగి సాక్షాత్ దత్తప్రభువులై ఉండిరని ప్రభువు చెప్పారు. పై ఉదంతం విఠల్‌రావు పేష్కారు తన తండ్రి నుండి తెలుసుకున్నారని చెపుతారు. ఈ కథనం అద్భుతమైనది. ఈ లేఖలో 'ప్రభువు ఒకసారి నోరు 'ఆ' అని తెరిచి నోటిలో దత్తాత్రేయుని రూపము తన తల్లికి చూపించారు.' అని కూడా వ్రాశారు.

ప్రభువు అమృతకుండములో ఆరు నెలలు ఉండిరి. ఆ సమయంలో ప్రభు దర్శనార్థము అనేకమంది వచ్చేవారు. ఒకసారి లింగాయతుల సముదాయము ప్రభు దర్శనార్థమై వచ్చి స్వయంపాకము చేసుకొనిరి. భోజనాలకు సిద్ధమయ్యేసరికి వండిన పదార్థాములు ఆ వచ్చిన జనానికి సరిపోవని అనిపించింది. అప్పుడు భక్తులందరు వెళ్లి ప్రభువుకు ఈ సంగతి వివరించగానే ప్రభువు 'ఏమీ చింతించకండి, అందరికి భోజనం చేయడానికి విస్తరాకులు వేయండి' అంటూ, కూర్చున్న వారు వెంటనే లేచి వండిన పదార్థాల వద్దకు వెళ్లి తన అమృతదృష్టిని ప్రసరించారు. ప్రభువు నామస్మరణ చేస్తూ ఒకే సారి అందరికి వడ్డించారు. అందరికి తృప్తిగా ప్రసాదం లభించి సంతృప్తులయ్యారు. అందరి భోజనాలు అయ్యాక కూడా మిగిలిన అన్నము వెళ్ళేవారు తీసుకొని వెళ్లారు. ఈ విధంగా ప్రభువు తన భక్తుల చింత దూరం చేసి ఆనందింపచేశారు. అమృతకుండములో ఒకసారి రాత్రివేళలో దీపం వెలిగించే

నూనె అయిపోయింది. అందుకని ఆ ప్రదేశమంతా అంధకారం అయింది. ప్రభువుకోసం ఉన్నవాళ్లంతా పాములు, వన్యప్రాణులు, దొంగల భయంతో భయపడిపోయారు. వీరి మనోగతం ప్రభువుకు తెలిసి వారిపై కరుణ కలిగింది. అంతలోనే కొందరు నెయ్యి పాత్రలు తీసుకొని అక్కడికి వచ్చారు. ప్రభువు నూనె స్థానంలో నెయ్యి వేసి దీపాలు వెలిగించండి అని ఆజ్ఞాపించారు. ఆ విధంగా గుడిలో నాలుగు దిక్కులా నెయ్యి దీపాలు వెలిగించబడ్డాయి. అలా ప్రభువు తన భక్తుల భయాన్ని పోగొట్టి సంతోషపరిచారు.

ఈ విధంగా అనేక కథలు వినదగ్గవే, కానీ, వాటిసన్నింటిని వివరించడం సాధ్యంకాదు. ప్రభువు అమృతకుండంలో ఆరు నెలలు నివసించిన తరువాత జనుల కోరికమేరకు మళ్లీ కళ్యాణికి వెళ్లారు. తరువాత ఎప్పుడూ ఎక్కువ రోజులు కళ్యాణిలో నివసించలేదు. తరువాత పన్నెండు సంవత్సరాల సంచార కాలంలో మణిచూల పర్వత చుట్టుప్రక్కల నివసించినా మధ్య మధ్య కళ్యాణికి వస్తుండేవారు. ప్రభువు ఎక్కడికి వెళ్లినా కొంత మంది శిష్యగణం వెంట ఉండేవారు. వాళ్లంతా కళ్యాణి లేదా కళ్యాణికి దగ్గరలోని ఊళ్లకు చెందినవారు. వాళ్లలో చిమ్నాజి అనేవారు ప్రభువుతో ఎప్పుడూ ఉండేవారు. నటకా (యోగదండం) మరియు జోళితో మొదటి దీక్షతీసుకున్నది ఈ బ్రహ్మచారియే. తన వెంట ఉన్న శిష్యబృందం సౌకర్యవంతంగా ఉండాలని వారికి పారమార్థికత లభించాలని ప్రభువు ఆశించేవారు. శిష్యులు ఆచరించే నియమాలు యోగ్యమైన రీతిలో ఆచరిస్తున్నారో లేదో అని ప్రభు సూక్ష్మంగా గమనించేవారు. ఎవరైనా తప్పు చేస్తే దానిని తెలియజేసి మరొకసారి అది జరగకుండా విలక్షణమైన రీతిలో తెలియజేసేవారు. శిష్యులకు మానసికంగా, శారీరకంగా ఏ కష్టం కలగకుండా చూసేవారు. ప్రభువు సమక్షంలో ఎవరికి ఎటువంటి భయం ఉండేది కాదు. ఏ కష్టం జరిగినా దానికి పరిహారం ప్రభువు నుండి అప్పటికప్పుడే లభించేది.

ఒకసారి ఒక శిష్యునికి భయంకరమైన కడుపునొప్పి వచ్చింది. ఎన్ని చికిత్సలు చేసినా తగ్గలేదు. ప్రభువుకి ఈ విషయం తెలియగానే శిష్యుని దగ్గరికి వెళ్లి కడుపుపై చేతిని తిప్పుతూ ఆ శిష్యుని దగ్గర కూర్చున్నారు. ప్రభువు చేతి స్పర్శ తగలగానే బాధ తగ్గి మనసు శాంతించింది. అలా చాలా మంది జనులకు శారీరక బాధలు తగ్గేవి. కొందరికి పిశాచ బాధలు, దారిద్ర్యం పోయేది. కొందరికి

పుత్రప్రాప్తి కలిగేది. ఈ విధంగా ఒకటా రెండా! అనేక దృష్టాంతాలు రోజూ జరిగేవి. ప్రభు మహాత్మ్యం అన్ని దిక్కులకు విస్తరించి ప్రభు దర్శనార్థం వచ్చే జనసముదాయం రోజురోజుకూ పెరిగింది. వచ్చిన భక్తులందరికి అన్నపానీయాల సదుపాయం ప్రభు సమక్షంలో లోటు లేకుండా జరిగేది. దత్తుని యొక్క జోళి, ప్రభువు వద్ద కామధేనువుగా ఉండేది. ఇది అందరి అన్నపానీయాల సదుపాయం జరుపుతుండేది. ప్రభువు సాక్షాత్ భక్త కార్యకల్పద్రుములై ఉండేవారు.

## 16. తాత్యా వివాహము

అమృత కుండములో ఆరు నెలలు నివసించిన తరువాత ప్రభువు కళ్యాణికి తిరిగి వచ్చారు. ప్రభు భక్తులు వారి మహత్యం చూపమని అడిగితే వాళ్ల ఇష్ట ప్రకారంగా నడుచుకొని అందరిని సంతృప్తి చేసేవారు. ప్రభువు యొక్క ఇంటి పరిస్థితి సాధారణంగా ఉండేది. ప్రభువు అన్నగారైన హనుమంత్‌దాదా వివాహం భాలచంద్ర దీక్షిత్ గారి కూమార్తెతో జరిగింది. ఆ సాధ్వి పరమభావికయై ఉండేది. సర్వగుణ సంపన్నురాలైన భార్య దొరకడం వల్ల హనుమంత్ దాదాకు సమాధానం కలిగింది. ప్రభువుపై ఆమెకు అనన్యమైన భక్తిభావము ఉండేది. ప్రభువుపై పూజ్యభావంతో, ప్రేమతో ఏది అడిగితే అది చేస్తూ ఆనందంగా గడిపేది. ఇంట్లో అందరి ఇష్టాలు గమనిస్తూ అందరికి అన్నీ ఉన్నంతలో అమరుస్తూ సంసారాన్ని సుఖంగా నడిపించేది. ఇంట్లో ఏది కావాలన్నా ప్రభు సామర్థ్యంతో లభించేది. కానీ, ఆ విధంగా ఎప్పుడూ ఆలోచించలేదు. స్వల్ప కాలంలోనే ఆమె మరణించింది. సుశీలయై సదాచారసంపన్నురాలైన పత్ని వియోగంతో హనుమంత్‌దాదా తీర్థయాత్ర చేయాలనే సంకల్పంతో ఇంట్లోంచి బయలుదేరి వెళ్ళారు. ఈయన చాలా రోజులు బయటనే నివసించారు. ఈయన తరువాత చెల్లెలు చిమ్నాబాయి ఉండేది. ఈమెపై తల్లికి ప్రీతి ఎక్కువగా ఉండేది. ఈమెకు ఎనిమిది సంవత్సరాల వయస్సులో వివాహం జరిగింది. మనోహర మాణిక్ ప్రభు మహారాజు వ్రాసిన పద్యభాగ చరిత్రలో వివాహము అయిన కొన్ని నెలలకే చిమ్నాబాయి చనిపోయారని వ్రాశారు. ఇతర చరిత్రకారులు ఈమె విషయం వ్రాయలేదు.

అమృతకుండము నుండి ప్రభువు కళ్యాణికి వచ్చిన తరువాత గ్రామంలోని జనులకు ప్రభువుపై భక్తి పెరిగింది. ప్రభువుతో ఆటలాడిన వాళ్లలో కొందరు ప్రియశిష్యులు అయ్యారు. అప్పుడు ఇంట్లో తల్లి మరియు నృసింహతాత్యా ఉండేవారు. హనుమంతరావు తీర్థయాత్రకు వెళ్లినపుడు మామకుడా వారివెంట వెళ్లారని అందరూ అనుకున్నారు. నృసింహతాత్యా విద్యనభ్యసించేవారు. చిన్నప్పటి నుండి తెలివైనవారు. కుటుంబ పోషణ చేసి కుటుంబం నడిపిస్తాడని తాత్యాపై బయమ్మకు అపారమైన ప్రేమ ఉండేది. కళ్యాణిలో కొంతమంది ప్రేమభావంతో ఉండే ప్రభు భక్తులు ఉండేవారు. కొందరు నిష్కారణంగా ద్వేషభావం కలవారు కూడా ఉండేవారు. సత్పురుషులపై నిష్కారణమైన ప్రేమ చూపించేవారి లాగే నిష్కారణంగా ద్వేషం చూపించేవారు కూడా ఉంటారు. ఇది సాధారణ విషయమైనా ఆ కుచేష్ట చేసేవారు అందరూ కలిసి ప్రభువు యొక్క శక్తిని పరీక్షించడానికి ఏదైనా కారణము దొరుకుతుందా అని ఎదురు చూస్తూ ఉండేవారు. కళ్యాణ్‌లో దేశ్‌పాండే వద్ద గుమాస్తా అయిన లక్ష్మణ్‌రావ్ అనే పేరుగల గృహస్థు ఉండేవారు. ఈ గ్రామసంఘంలో సభ్యుడు అయి ఉండడం వల్ల అందరితో పాటు ప్రభువువద్దకు దర్శనానికి వచ్చారు. అంతఃకరణలో శ్రద్ధ ఉండేదికాదు. గ్రామంలో ఇతర శిష్యులు ప్రభువుతో పరిచయం ఉండడం వల్ల ప్రేమ కనపరిచేవారు. ఒక రోజు ప్రభువు తన శిష్యగణంతో కూర్చుని ఉన్నప్పుడు, ఇతరులతో పాటు లక్ష్మణ్ రావు కూడా ప్రభు దర్శనార్థం వచ్చారు. అనేక విషయాలు మాట్లాడుతుండగా నృసింహతాత్యా యొక్క వివాహ విషయం చర్చకు వచ్చింది. తాత్యా ఇప్పుడు వయస్సులో ఉన్నారు, వివాహం ఎందుకు చేయరాదు? అని లక్ష్మణ్‌రావు అడిగిన ప్రశ్నకు ప్రభువు ఈ విధంగా సమాధానం చెప్పారు. 'మేము ఫకీరులము మా దగ్గర పైసాలేదు. ఊర్లో ఇల్లు లేదు పొలమూలేదు. ఇలాంటి పరిస్థితుల్లో తాత్యాకు పిల్లను ఎవరిస్తారు? అని. అది విని వెంటనే లక్ష్మణ్‌రావు అలా ఎలా అవుతుంది ? పెళ్ళికి కావలసిన ఖర్చు మీరు పెట్టగలిగితే పిల్లను ఎవరైనా ఇస్తారు అన్నారు. పెళ్ళికి కావలిసిన ఖర్చు మేము పెట్టడానికి సిద్ధంగా ఉన్నాము అని ప్రభువు అన్నారు.

అలా మీరు ఖర్చు పెట్టడానికి సుముఖంగా ఉంటే నా చెల్లెల్ని మీ తాత్యాకు ఇవ్వడానికి ఒప్పుకుంటాను అని లక్ష్మణ్ రావు అన్నారు. పదిమందిలో ఇలా లక్ష్మణ్‌రావు ఎందుకు అన్నారంటే ఆయనకు ఖచ్చితంగా ప్రభువు వద్ద అంత ధనం, సామగ్రి లేవని తెలుసు. ఆ సమయంలో ప్రభువు అన్న యాత్రకు

వెళ్ళారు. ఆపదలో ఆదుకొనే మామ కూడా కళ్యాణ్‌లో లేరు. ప్రభువు యొక్క స్వంత ఆస్తి అంటే జోలి మరియు లంగోటి. ఈ సాధువుకి అప్పు ఎవరిస్తారు మాటల్లో అపహాస్యం చేస్తే ఏమవుతుంది? అని లక్ష్మణ్‌రావు ఆలోచించి అలా అన్నారు. కానీ, ప్రభువు అతని అంతరంగం తెలుసుకున్నారు. ఏ ఉద్దేశంతో అన్నా కూడా ప్రభువు అతను అలా అడిగే పరిస్థితి కల్పించేవారు. అది విని వెంటనే ప్రభువు సరే మీ మాటల్లో నిజం ఉంటే ఇప్పటికిప్పుడు నిశ్చయం చేసేయండి. మీరు అన్న వాటికి ఒప్పుకుంటున్నాము అని అన్నారు. అదే సమావేశంలో పెళ్లి నిశ్చయమై ఇరువైపుల వాళ్లు ఆమోదం తెలిపారు. లక్ష్మణ్‌రావు స్వయంగా పెళ్ళికి కావలిసిన అన్ని వస్తువులు వ్రాసి ఇచ్చారు. పెళ్లినిశ్చయం అయింది కానీ, ప్రభువు ఇంట్లో మాత్రం ఏమీ లేదు. ఒకేసారి పెళ్ళికి కావలిసినంత సామాగ్రి ఎక్కడినుండి వస్తుంది? ప్రభువు శిష్యులకు, భక్తులకు ఏర్పాట్లు ఎలా అవుతాయో అనే ఆలోచన కలిగింది. ఏర్పాట్లు కాకపోతే ప్రభువుకు అవమానం అవుతుంది. ఈ విధంగా వారంతా ఆలోచిస్తుండగా, రాత్రి వాళ్లలో కొందరు భక్తులకు గ్రామ దేవతయైన హనుమంతుని దర్శనమై, మారుతి రాయుడు వాళ్లకు ప్రసాదం ఇచ్చినట్లుగా స్వప్నం వచ్చింది. అప్పుడు వారికి సంతోషమయింది. కాని సమస్య పరిష్కారం కాలేదని చింతిస్తుండగా బసప్ప అనే వైశ్య షావుకారు వీరి చింతకు కారణం తెలుసుకొని సమయస్ఫూర్తితో "మీరు చింతించకండి ఇలాంటి మహత్వమైన కార్యానికి కావలిసిన సామాగ్రి, ద్రవ్యము నేనొక్కడినే ఇస్తాను. ప్రభుకృపతో నాకు మంచి జరుగుతుంది" అని కావలసిన పూర్తి సామాగ్రి బండిలో తీసుకొచ్చి ప్రభు ఇంట్లో అప్పగించారు. తల్లికి ఇతర శిష్యులకు చాలా ఆనందమయింది. బస్సప్ప ప్రభువుపై అపార భక్తి కలవారై ఉండేవారు. సామాగ్రి వచ్చిన వార్త ప్రభువుకు తెలియజేయగానే ప్రభువు నవ్వుతూ ఇదంతా దత్తుని కృప అన్నారు.

పెళ్లి తయారీ విషయం లక్ష్మణ్‌రావుకి తెలియగానే తను ఇప్పుడు ఏమి చేయలేక పెళ్ళి ఏర్పాట్లు మొదలుపెట్టారు. ప్రభువు ఇంట్లో మూర్తివంతమైన కామధేనువు నివసించేది. ఎప్పుడూ ఏ వస్తువుకూ తక్కువ కాలేదు. పెళ్ళి సమారంభములో ఏదైనా విఘ్నము కలిగించాలని లక్ష్మణ్‌రావుతో పాటు, వారితో ఉన్న వారికి అనిపించింది. పెళ్లి సమయంలో ఇరవై నుండి నలభై మంది వరకు వస్తారని చెప్పి మూడు వందల నుండి నాలుగువందల మందిని

భోజనానికి తీసుకొని వచ్చారు. ప్రభు యొక్క శిష్య బృందానికి చింతయై కొంత మందికే చేసిన పదార్థాలు అందరికి ఎలా సరిపోతాయని, ఈ విషయం ప్రభువుకి చెప్పాలని వెళ్ళారు. ప్రభువు అప్పుడు నిద్రలో ఉన్నారు. నిద్రలో నుండి లేచి చింతించకండి అన్నారు. ప్రభువు ముఖంలో కొంచెం కూడా చింత కనిపించలేదు. మొత్తం గ్రామం భోజనానికి వచ్చినా సరిపోయేటట్లు చేయడానికి దత్తుడు సమర్థుడై ఉన్నాడు. ఇలా అని ప్రభు వండిన పదార్థాల దగ్గరికి వెళ్లి తన చేతిలోని యోగదండముతో వాటిపై త్రిప్పి బయటకు వచ్చి విస్తళ్లు వేయండి అని ఆజ్ఞాపించారు. "సద్గురు మాణిక్ ప్రభు మహరాజ్‌కి జై" ఇలా అంటూ వడ్డించడం ప్రారంభించారు. భోజనం అందరికీ సరిపోతుందని తెలియగానే, ఉద్దేశ పూర్వకంగా వారిని పరీక్షించాలని కొందరు వడలు కావాలని అడగగానే వారి విస్తళ్ళలో వడలు వడ్డించారు. ఇంకా ఏమి కావాలని అడిగితే అన్నీ వడ్డించారు. ఇక పరీక్షించడానికి ఏ అవకాశం దొరకలేదు. ఒకవక్క ప్రభు భక్తుల ప్రభునామ జయ జయ కారాలతో భోజనపంక్తి జరిగింది.

ఈ విధంగా అపూర్వ సంబరంతో భోజన సమారంభం జరిగింది. తర్వాత చాలా పంక్తులైనా ఇంకా అన్నం మిగిలింది. గ్రామంలోని ఆవులకు కూడా వేశారు. ఇంకా మిగిలింది జలచరాలకు కూడా దొరకాలని చెరువులో కూడా వేశారు. ఇదంతా చూసి మిగతా అందరికీ దుఃఖం కలిగింది. లక్ష్మణ్‌రావుకయితే బాధ కలిగింది ఏదైనా ప్రాయశ్చిత్తం చేసుకోవాలనుకున్నాడు. రెండోరోజు లక్ష్మణ్‌రావుకి కడుపునొప్పి వచ్చింది. నొప్పితో బాధపడుతూ నేను ప్రభు విషయంలో తప్పు చేశాను అని తెలుసుకొని ప్రభువు శరణు కోరాలని ప్రభు దగ్గరికి వచ్చారు. ప్రభు కాళ్లముందు పడి క్షమించమని అడిగారు. ప్రభు అతన్ని లేపి అతని దుఃఖాన్ని నివారించి నాలుగు విషయాలు బోధించి సంతోషంతో తిరిగి పంపించారు. ఇతరులు సిగ్గుతో తలవంచుకొని అక్కడి నుండి వెళ్లిపోయారు. ప్రభువునే ఇలా పరీక్షించే దుష్టకృత్యం గ్రామ దేవతకు ఇష్టంకాలేదు. గ్రామదేవతకు కోపం వచ్చిన విషయం తెలుసుకొని ప్రభు తన శిష్యులతో అన్నారు – జాగ్రత్త ఈ గ్రామంలో ఏదైనా అనర్థం జరగబోతోంది అని చెప్పి ప్రభు కొన్ని రోజులు అదృశ్యమయ్యారు. ప్రభువు ఎక్కడికి వెళ్ళారో ఎవరికీ తెలియలేదు. గ్రామంలో కొన్ని రోజులకు

మంటలు లేవడం, కలరా వ్యాపించడం జరిగాయి. అంతటా హాహాకారాలు నిండాయి. వృద్ధులు, పిల్లలు వ్యాధుల బారిన పడ్డారు. గ్రామంలో కలరా వ్యాపించింది. అందరూ ప్రభు నామస్మరణ చేశారు, కాని ప్రభు ఆచూకీ దొరకలేదు. నృసింహతాత్యా కూడా ఈ మహమ్మారి బారిన పడ్డారు. అప్పుడు తల్లి ప్రభువును ప్రార్థించగానే వెంటనే ప్రత్యక్షమై తాత్యాకు తీర్థం ఇచ్చిన వెంటనే జబ్బు నయమయింది. ఈయన భార్య తల్లిగారింటిలో ఉండేవారు. అక్కడ ఆమె జబ్బు బారిన పడి మరణించింది. అది విని లక్ష్మణ్‌రావుకి దుఃఖం కలిగింది. ప్రభువు యొక్క స్మరణ కలుగసాగింది, కానీ ప్రభు దర్శన యోగం కలుగలేదు. తాత్యా మహారాజు భార్య బహిణాబాయి మరణం వల్ల బయమ్మకు దుఃఖం కలిగింది. కాని ప్రభు మాతృశ్రీ యొక్క దుఃఖాన్ని తెలుసుకొని సముదాయించారు. అప్పటి నుండి లక్ష్మణ్‌రావు ప్రభువు యొక్క పరమ భక్తులు అయ్యారు. దాంతో పాటు ప్రభువును అపహాస్యం చేసేవాళ్లకు తగిన శాస్తి జరిగి ప్రభువుపై భక్తితో ఉండేవారు.

ప్రభువు యొక్క లౌకిక పారమార్థికత రోజు రోజుకు ఎక్కువ అయి అన్ని జాతుల ప్రజలు ప్రభు దర్శనార్థమై వచ్చేవారు. హిందూ జనుల వలె ముసల్మాను వ్యక్తులు కూడా ప్రభు వద్దకు వచ్చేవారు. మొదట ఆ మతంలోని (ముస్లిం) పెద్ద పెద్ద విద్వాంసులు వచ్చేవారు. వారు ప్రభువును పరీక్షించాలని తమ మతంలోని క్లిష్టమైన ప్రశ్నలు వేస్తూ వాదోపవాదాలు చేసేవారు. ప్రభువు అన్ని ధర్మాలలోని శ్రేష్టమైన తత్వంపై విడమర్చి చెప్పేవారు. పెద్ద పెద్ద మౌళీలను చకితులు చేసే జ్ఞానం ప్రభువు వద్ద ఉండడం చూసి వాళ్లంతా విస్మయులయ్యారు. ప్రభువు యొక్క అగాధమైన జ్ఞానం గురించి తెలుసుకొని ప్రభు భక్తి పరాయణులయ్యారు. కాని కొంతమంది ముస్లింలకు ఇది నచ్చక మనం ఇంత పండితులమైనా మనల్ని ఎవరు అడగట్లేదు కానీ ప్రభువుకేమో ఇంత విలువా? అని మనసులో అనుకొని ప్రభువును మంత్ర ప్రయోగంతో చంపాలనుకొని సామాగ్రిని సిద్ధం చేసుకున్నారు. ఈ విషయం ఆ ప్రయోగం చేద్దామనుకున్న వ్యక్తి అన్నకు నచ్చలేదు. ప్రభువులాంటి అసామాన్యమైన సామర్థ్యంకల వారిని చంపడానికి ప్రయత్నించడం సాధ్యంకాదు. కాని అదే వికటిస్తుందని మిగతా వారందరికి భయం కలిగింది. ఆ ముసల్మాను మంత్ర ప్రయోగం చేయాలనుకునే సరికి ఆ మంత్ర దేవతకే భయంకరమైనదిగా

అనిపించింది. ప్రభువుపై ప్రయోగించడమంటే మంటపై కట్టెపుల్ల వేస్తే అది భస్మం కావడానికి ఎక్కువ సమయం అవసరం ఉండదు కదా?

ఈ విధంగా ఆలోచించి ఆ మంత్రాధిదేవత ఆ (ముస్లిం) యవనుడిపైనే తిరగబడింది. ఏ శక్తినైతే తను అనుకూలం చేసుకుని ఆరాధించాడో అదే శక్తి అతనిపై తిరగబడింది. అతని దుర్దశను ఏలా వివరించగలం?

ఆ యవనుడి స్థితి చూసి అతని సోదరునికి ఏం చేయాలో అర్థంకాలేదు. అతనికి ప్రభుసామర్థ్యంపై పూర్తి విశ్వాసం ఉండేది. సోదరుడు దీని నుండి ముక్తి పొందడానికి ప్రభువే సమర్థుడని నమ్మి వారినే శరణు వేడుకోవాలని అనుకున్నారు.

ప్రభువు దగ్గరికి వెళ్ళి నాకు అభయం ఇవ్వండి, క్షమించండి అని అంటూ, నేను మీ దాసుణ్ణి మీ శరణు వేడుకుంటున్నాను. నాపై కృపతో మా ఇంటికి రండి, అనగానే ప్రభువు ఎంత వారించినా వినక తన ఇంటికి తీసుకెళ్లాలని పట్టుబట్టాడు. తన సోదరుడు ప్రభువుకు భయంకరమైన అపరాధం చేశాడు, అందువల్ల మృత్యుముఖంలో ఉన్నాడు. అదంతా మరిచి అతను ప్రభువుతో మా ఇంటికి వచ్చి సోదరుని కష్టం దూరం చేయాలని ప్రార్థించాడు. అది విని ప్రభువుకు అతనిపై దయ కలిగింది. ప్రభువు సహృదయంతో తన శిష్యబృందంతో వాళ్ళ ఇంటికి వెళ్లారు. ప్రభువు రాగానే ఉచితాసనము వేసి చేతులు జోడించి ఈ విధంగా విన్నవించకున్నాడు. నా సోదరునికి ప్రాణదానం చేయండి. అతను ఘోర అపరాధంచేశాడు అని, తన సోదరునికి మంత్రప్రయోగం తిరగబడి మత్యు ముఖంలో ఉన్న విషయం ప్రభువుకి వివరించాడు. ప్రభువుని చూడగానే ఆ దుష్టబద్ధి అయిన యవనుడికి సిగ్గుకలిగింది. అప్పుడు సోదరుడు తనతో 'ఇప్పటికైనా మరణద్వారంలో ఉన్నావు తప్పు ఒప్పుకొని ప్రభువుని క్షమించమని వేడుకో', అనగానే ఇప్పటి వరకు జరిగినదంతా వివరించి, ప్రభువును ఈ కష్టం నుండి కాపాడాలని వేడుకున్నాడు. నీ దేవతే నీకు తిరగబడింది, ఇక ఇప్పటి నుండి ఈ దుష్టప్రవృత్తిని వదిలేయి. ఇతరులకు చెడు జరగాలని చూస్తే తనకే చెడు జరుగుతుంది. ఈ విషయం దృష్టిలో పెట్టుకో అని బోధించి దుఃఖ విముక్తి కలిగించారు. ప్రభువుకి ఎప్పుడూ

శత్రువు-మిత్రుడు సమానమే . దుష్టజనుల క్రూరత్వం పోయి వారి నుండి ఇతరులకు ఏ ఉపద్రవం కలగకుండా చేయటం ప్రభు కర్తవ్యాలలో ఒకటి. తరువాత ప్రభువుని ద్వేషించేవారు చాలా తక్కువయ్యారు. కళ్యాణ్‌లో నివసించేటప్పుడు, ప్రభువు అప్పుడప్పుడు అదృశ్యం అయ్యేవారు. ఎక్కడికి వెళ్లేవారో ఎవరికి తెలిసేది కాదు. నృసింహతాత్యా పెళ్లి అయి అతని భార్య తొందరగానే మరణించిందని బయమ్మ మనసుకు కష్టం కలిగింది. తన ముగ్గురు పుత్రులలో కులవృద్ధి చేసేవారు ఒక్కరే ఉండడం వల్ల అతని గురించి బయమ్మకు చింత కలిగింది. ఈ విషయం బయమ్మ ప్రభువుకి తెలియజేసింది.

"పెళ్లి యోగం వస్తే తనంతటతానే జరుగుతుంది" అంటూ ప్రభువు మౌనంగా ఉండేవారు. ఇలా అనగానే తల్లికి సమాధానమయ్యేది కానీ, తల్లి అంతరంగము ప్రభువు తెలిసిన వాడై ఆ పని చేయడం కష్టం అనిపించలేదు. హాళిఖేడ్ భాలచంద్ర దీక్షితుల పరిచయస్థులు, యశ్వంత్ రావు కోరెకల్ అనేవారు హైదరాబాద్‌లో నివసించేవారు. భాలచంద్రదీక్షితుల ఇంట్లోని వారందరికి ప్రభువుపై అపారమైన భక్తి ఉండేది. ఆయన పుత్రుడు నారాయణదీక్షిత్ ప్రభుభక్తులు. అతని తల్లి (జయమ్మ) ప్రభువు పై పుత్ర ప్రేమ చూపించేవారు. ఆమె నృసంహతాత్యా భార్య, పెళ్లి కాగానే మరణించిందని విని చాలా దుఃఖించారు. జరిగింది విని మళ్లీ తాత్యాకు వివాహం జరిపించాలని పిల్లను చూసే బాధ్యతను తనపై వేసుకున్నారు. కొరెకల్ ఇంటివారు జయమ్మకు మంచి పరిచయస్తులు. యశ్వంత్‌రావు కోరెకల్‌కు ఇద్దరు పుత్రులు, ఇద్దరు కుమార్తెలు ఉండేవారు. కుమార్తెల పెళ్ళిళ్ళు ఇంకా కావలిసి ఉండెను. ఇద్దరిలో పెద్దకుమార్తె వితాబాయి, నృసింహతాత్యాకి తగిన భార్య అవుతుందని యశ్వంత్‌రావుని అడిగారు. అతని అనుమతి తీసుకొని పెళ్లి నిశ్చయం చేసుకొని ఈ విషయం ప్రభువుకి తెలియజేశారు. అప్పుడు ప్రభువు మాతృశ్రీకి పరమానందం కలిగింది. ఈ పెళ్లి వల్ల ఇరువర్గాల్లో మరియు శిష్యబృందంలో సంతోషం కలిగింది. ప్రభువు ఇంట్లోని కామధేనువు వల్ల ఎప్పటిలాగానే కార్యము నిర్విఘ్నంగా జరిగింది. మొదట జరిగిన మూర్ఖమైన పని వల్ల తగిన శాస్తి జరిగిన విషయం తెలుసుకొని మళ్లీ విఘ్నం కలిగించకూడదని నిశ్చయించుకొని, ఆ ఊరి వాళ్లు పెళ్లి యథారీతిన పెళ్ళి జరగడానికి సహాయపడ్డారు. కళ్యాణి నవాబు కూడా ధనాన్ని పంపించడం వల్ల వేల రూపాయలు ఖర్చు చేశారు. ప్రభు ఇంటి కార్యము

అంటే కళ్యాణి నగర్ కళ్యాణం కోసమని అందరికి భావన ఉండేది. ప్రభువుపై నిరుపమానమైన ప్రేమతో అందరూ ప్రభువును సంతృప్తిపరిచారు.

## 17. చాళకాపురము

ముందు చెప్పినట్లుగా ప్రభువు కొన్ని రోజులు కళ్యాణిలో నివసించి అక్కడి నుండి బయట వచ్చారు. ఎన్నో సార్లు ప్రభువు అదృశ్యమయ్యేవారు. ఇలా అప్పుడపుడు జరుగుతూ ఉండడం వల్ల అందరికి అది అలవాటయి పోయింది. అప్పటి నుండి ప్రభువు గురించి చింతించడం తక్కువయింది. హనుమంతరావుదాదా మామతోపాటు తీర్థయాత్రనుండి తిరిగి వచ్చారు. ఇంటి పరిస్థితి యథావిధిగా సాగుతుండేది. అందువల్ల ప్రభువు అక్కడ తప్పకుండా ఉండాల్సిన అవసరం కనిపించలేదు. తన మనస్సులోని కారణం ఎవరికీ చెప్పకుండా ప్రభువు అదృశ్యమయ్యేవారు. అందువల్ల చాలామంది శిష్యులు వెంట ఉండేవారు కాదు.

ప్రభువు యొక్క మహిమలు అన్ని దిక్కుల విస్తరించడం వల్ల దూరంనుండి అనేకమంది వచ్చేవారు. కళ్యాణి ఒక తీర్థక్షేత్రంగా మహత్యం సంపాదించుకుంది. ఎంతో మంది రోగులు, ఇంకా ఎంతోమంది ద్రవ్య సహాయార్థం, ఇంకొందరు పిశాచ బాధ దూరం చేసుకోవడానికి ఇలా వేలమంది నిత్యం కొత్త కొత్త కారణాలతో ప్రభువు వద్దకు వచ్చేవారు. వారికి ప్రభువు నుండి అంతో ఇంతో ప్రసాదం దొరికేది. ఎంతోమంది యోగులు సేవచేయడానికి ప్రభువు వద్ద వచ్చి ఉండేవారు. ఎంతోమంది మాధుకరి అడిగి చేసేవారు. చాలామంది ప్రభువుతో పాటు భోజనం చేసేవారు. శ్రీమంతులు ఇంటినుండి తెచ్చుకొని తినేవారు. ఇలా వేలమంది ప్రభువుతోనే ఉండేవారు. ప్రతి ఒక్కరు ఏదో విధంగా ప్రభు సేవచేసేవారే. స్త్రీలు రాగిచెట్టుకు ప్రదక్షిణ చేసి ప్రభువువద్ద ప్రసాదం తీసుకొనేవారు. ఎంతో మంది స్త్రీలు పిల్లల కోసం చేసిన మొక్కు తీరిందని ప్రభువద్దకు వచ్చి నివేదించుకొనేవారు. కొందరు బ్రాహ్మణ భోజనము చేయించి ప్రభువుకు నైవేద్యం తెచ్చిచ్చేవారు. ఏమని వర్ణించేది? వేలమంది జనుల దేహాలలో ఉన్న పిశాచాలకు ప్రభువు వద్ద ముక్తి

లభించేది. ఏ ప్రదేశంలో అయితే ప్రభువు జన్మించారో, ఏ ప్రదేశంలో ప్రభువు పెరిగారో, ఏ ఊర్లో అయితే తన సమయస్ఫూర్తితో అనేక విధాలైన ఆటలు ఆడారో, ఆ ఊర్లో (కళ్యాణ్‌లో) ప్రభు దైవమై అబాల గోపాలానికి పూజనీయులయ్యారు. ఇది ప్రభు చరిత్రలో ఒక అద్భుతమైన విశేషము. ప్రభువుతో ఆటలాడిన వారు తరువాత పరమ భక్తులు అయ్యారు. ఇంట్లోని వారు, ఆప్తమిత్రులు పరమపూజ్యంగా కొలిచేవారు. అప్పుడు ప్రభువు వయస్సు పాతిక సంవత్సరాలలోపుగానే ఉండేది. ఇంత తరుణ వయస్సులోనే ప్రభువు యొక్క దివ్య సామర్థ్యం నలుదిక్కులా వ్యాపించి జనం రావడం క్రమంగా పెరిగింది. కళ్యాణిలో జనం పెరిగి అక్కడ ఎప్పుడు ''నిత్యశ్రీ నిత్య మంగళం'' గా జనం సంతోషంతో ఉండేవారు. ఇలాంటి సమయంలో ప్రభువు హఠాత్తుగా అదృశ్యమయ్యారు. ప్రభువు ఎక్కడికి వెళ్లారో ఎందుకు వెళ్లారో ఎవరికీ అర్థం కాలేదు. ఏమి చేయలేక ఎప్పుడు దర్శనమిస్తారో అని ఎదురుచూస్తూ ఉండేవారు.

ఇక్కడ చాళకాపురంలో ప్రభువు ప్రత్యక్షం అయ్యారు. కళ్యాణ్ నుండి ఆరు ఏడు క్రోసుల దూరంలో చాళకాపూర్ అనే గ్రామం ఉంది. అక్కడ మారుతి జాజ్వల్యమైన దైవమని సర్వప్రసిద్ధమైనది. అక్కడ మారుతి ఉగ్రస్వరూపంలో ఉన్నారు. గుడి ఊరి బయట అరణ్యంలో ఉండడంవల్ల అక్కడ ఎవరూ నివసించేవారు కాదు. దగ్గరలో దట్టమైన అడవి ఉండడం వల్ల, క్రూరమృగాల భయం వల్ల, మారుతి యొక్క ఉగ్రస్వరూపం వల్ల, ఎవరైనా మనుష్యులు ఆ ప్రదేశంలో ఎలా ఉండగలరు? గుడి పూజారి ఊళ్లో ఉండేవారు. తెల్లవారగానే పూజ ముగించి ఆరతి కాగానే నందాదీపం రాత్రంతా సరిపోయేటట్లు నూనె పోసి సాయంత్రం అయ్యేసరికి ఇంటికి చేరుకునేవారు.గుడిలో సేవ చేసే వాళ్లు కూడా ఎవరూ రాత్రి ఉండేవారు కాదు. మారుతి భయంకరమైన స్వరూపంతో ఎవరిని ఉండనీయరని సామన్యులు అనుకునేవారు. కానీ నిజంగా చూస్తే ఆ నిర్జనారణ్యంలో ఎవరికీ ఉండడానికి ధైర్యం చాలేది కాదు. పగలే భయపడతారు, ఇక రాత్రివేళ ఎవరుంటారు? కానీ, ఈ మారుతిపై గ్రామంలోని వారికి భక్తి అమితంగా ఉండేది. అందుకని మధ్యాహ్నం వేళ జనం ఎక్కువగా వచ్చేవారు. మారుతి జన్మోత్సవము, పూజ సంవత్సరమంతా జరిపేవారు. ప్రతి శనివారం పల్లకి సేవ చేసేవారు. ఆ

సమయంలో జనం ఎక్కువగా పోగయ్యేవారు. చైత్రమాసంలో జన్మోత్సవము జరిపితే ఆ ప్రదేశం యాత్రాస్థలంగా కనిపించేది. ఆ సమయంలో తప్ప ఇతర వేళలో సంధ్యా సమయం తరువాత ఆ వైపుకు ఎవరూ వచ్చేవారు కాదు. మారుతి రాత్రివేళలో ఏకాంతంగా ఉండేవారు. ఆ సమయంలో మారుతిని కలవాలని ప్రభు దేవాలయంలోనికి వెళ్లారు. ప్రభువు మరియు మారుతి యొక్క అపూర్వ కలయికలో ఏం జరిగిందో తెలుసుకునే మార్గం ఏ చరిత్ర కారునికి వ్రాయడానికి సాధ్యమవుతుంది?

తెల్లవారగానే పూజారి పూజచేయడానికి దేవాయలంలోనికి వెళ్ళిచూస్తే ఒక యువకుడు ఒక మూలకి ప్రశాంతంగా నిద్రిస్తున్నట్లు కనిపించింది. మారుతి దగ్గరికి వెళ్ళగానే మారుతి తలపై ఒక మూట ఉండడం చూసి అతనికి ఆశ్చర్యం కలిగింది. మూట విప్పిచూడగా అన్ని బట్టలు కనిపించాయి. ఈ బట్టలు ఎవరివి? దేవుడిపై తన బట్టలు పెట్టిన ఆ దుష్టుడు ఎవరని వెతికెను. ప్రభువు విశ్రాంతిగా పడుకొని ఉండెను. ప్రభువును లేపి పూజారి బట్టలు ఎవరివని అడగగానే ప్రభువు తనవేనని చెప్పారు. ఈ అడవిలో దొంగలు ఉంటారు కావున నా బట్టలు ఎత్తుకు పోతారని రక్షణ చేయమని మారుతికి ఇచ్చాను, అనగానే ఆ పూజారి కోపంతో ప్రభువును కొడుతుండగా మారుతి మెడలోని హారం ప్రభువు మెడలో కనిపించింది. ప్రభువు శరీరంపై కొట్టిన గుర్తులు మారుతి శరీరంపై కనిపించగానే అందరూ భయభ్రాంతులయ్యారు. ఇదేమి చమత్కారం ? ప్రభు తనలో తాను నవ్వుతూ నిలబడ్డారు. ఈ గొడవ విని చాలామంది పోగయ్యారు. వాళ్లలో ఒకరు పరీక్షించి చూడగానే తాము కొట్టిన ఆ మనిషి ఎవరో పిచ్చివాడో, దుష్టుడో కాదని కళ్యాణ్‌కి చెందిన మాణిక్ ప్రభువని తెలుసుకున్నారు.

''కళ్యాణ్‌కి చెందిన మాణిక్ ప్రభు'' ఇది వినగానే అందరూ అతనివైపు చూశారు. నిజంగా మాణిక్ ప్రభువే. మనం అజ్ఞానంతో భయంకరమైన తప్పిదం చేశాం. ప్రభువు యొక్క సామర్థ్యం తెలుసుకొని దుఃఖంతో పశ్చాత్తాపం చెంది ప్రభువు ముందు సాష్టాంగనమస్కారం చేస్తూ ప్రభువును క్షమించమని వేడుకున్నారు. ప్రభువు దరహాసంతో వాళ్లందరిని లేపి స్వాంతన పరిచారు.

ప్రభువు చాళకపురం మారుతి దేవాలయానికి వచ్చారనే వార్త వాయువేగంతో విస్తరించి జనం తండోపతండాలుగా రాసాగారు. కర్జూరపళ్ళు, పోకలు, కొబ్బరికాయలు, పూలు, మాలలు, బత్తాసులు, పేలాలు ఇలా అనేక పదార్థాలను వెంట తీసుకువచ్చేవారు. కొందరు పూజలు చేస్తూ ప్రసాదాలు పంచసాగారు. ఆ నిర్జన ప్రదేశం పెద్ద యాత్రాస్థలంగా రూపుదిద్దుకుంది. అక్కడ ఇతర దుకాణాలు వెలిశాయి. నాలుగు దిక్కులా జనసమ్మర్దంతో నిండిపోయింది. అనేకరకాలైన మూగ, గ్రుడ్డి, చెవిటి, యాచకులతో నిండిపోయింది. భోజనసమారంభం మొదలై అన్నపూర్ణాదేవి కృపతో అందరికి భోజనం తృప్తిగా లభించింది. 'జంగల్‌మే మంగల్' మొదలవడానికి ఎక్కువ సేపు కాలేదు. ప్రభు కనిపించిన విషయం బీదర్, హైదరాబాద్, కల్‌బుర్గి (గుల్బర్గా), కళ్యాణ్ మొదలైన నగరాల్లో విస్తరించి నాలుగు దిక్కుల నుండి భక్తులు పోగయ్యారు. కళ్యాణ్‌లో ఉన్న మాతృశ్రీకి ఈ విషయం తెలియగానే ప్రభువద్దకు రావాలనే ఆతృత పెరిగింది. మాతృశ్రీ బయమ్మ నృసింహతాత్యాతో కలిసి బయలుదేరారు. బాపాచార్యులు, నారాయణ్ దీక్షిత్, చిమన్యా బ్రహ్మచారి మొదలైన శిష్యులంతా ప్రభు వద్దకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. వీళ్లే కాకుండా వేలమంది ప్రభు దర్శనార్థం బయలుదేరారు. చాళకాపురంలో ప్రభు దర్శనం చేసుకొని ఆనందభరితులయ్యారు. అలా చాళకాపురంలో నాలుగు నెలలు నివసించారు. ఆ సమయంలో నిర్జనారణ్యం సర్వసౌకర్యమైన ఆనందానికి నివాసస్థానం అయింది. ఆ సమయంలోనే హైదరాబాద్ నుండి రాజె రాయ్ రాయన్ వారి బలగంతో ప్రభు దర్శనానికి వచ్చారు. చిందబర్‌రావ్ అనే తాలూకాదారు ప్రభువు అక్కడ ఉన్నన్ని రోజులు బందోబస్తు కల్పించి అందరికి రక్షణ కల్పించారు.

హైదరాబాద్ రాజే రాయ్ రాయన్ అనే పేరుగల ప్రసిద్ధ దేశస్థ ఋగ్వేద బ్రాహ్మణ మంత్రికి నిజాముల వద్ద ఆయన పూర్వీకులు పని చేయడం వల్ల నిజాముల నుండి నాలుగైదు లక్షల విలువగల జాగీరు లభించింది. నిజాముల రాజ్యంలో వారు మంచి పదవిలో ఉండేవారు. వీళ్ల పూర్వీకులు కత్తి విద్యలో రాజకీయంలో మంచి ప్రవేశం ఉండి నిజాములకు సేవ చేశారు. అందుకని, ఆయనను రాజా రాయ్ అని పిలిచేవారు. ఈయన ప్రభు యొక్క కీర్తి తెలిసి ప్రభువుపై ప్రేమతో ప్రభు చాళకాపురం వచ్చారని వినగానే దర్శనార్థమై వచ్చి

దర్శనం చేసుకున్న తరువాత ప్రభు సన్నిధిలో కొంతకాలం నివసించి, సేవ చేసుకొని సంతోషభరితులయ్యారు. రాజాసాహెబ్ యొక్క భక్తికి ప్రభువు వశమయ్యారు. రాజాసాహెబ్ వయస్సు దాటిపోయింది. కానీ, పుత్రప్రాప్తి కలుగలేదు. తనకు పుత్రప్రాప్తి అయి తన సంస్థానము అఖండంగా నడుస్తూ ఉండాలని ప్రభువు వద్ద ప్రార్థించారు. ప్రభువు అతని సేవతో సంతుష్టులై ప్రసన్న అంతఃకరణతో పువ్వులు, కజ్జూరిపళ్ళు, విభూతి ప్రసాదంగా ఇచ్చారు. ఆ ప్రసాదం తీసుకొని హైదరాబాద్‌కు రాయ్ వెళ్ళిపోయారు. ప్రభు యొక్క ప్రసాదం అపూర్వంగా భావించి రోజూ ప్రసాదానికి పూజ చేసేవారు. కొంతకాలం తరువాత అతనికి పుత్రప్రాప్తి కలిగింది. ఆనందభరితులై ఈ విషయం ప్రభువుకి తెలిపి, వారు చెప్పినట్లు పుత్రునికి శంకరరావు అని నామకరణం చేశారు. శంకరరావు ప్రభువుపై అత్యంత భక్తితో ఉండేవారు. ఆయనకు యుక్త వయస్సు రాగానే తండ్రి మరణించారు, కాని జాగీరు విషయంలో ఏదో నిజాములు అడ్డు చెప్పడం వల్ల కొన్ని రోజులు చింతించారు. తనకు వచ్చిన కష్టం దూరం కావాలని ప్రభువును ప్రార్థించగానే తిరిగి జాగీరు లభించి, గాదిపై కుర్చున్నారు. ఆ సమయంలో ప్రభువుని విస్మరించలేదు. ప్రతి సంవత్సరం వేలరూపాయిలు ప్రభువుకి పంపించేవారు. శంకరరావు రాజు గారికి ప్రభువు చేతివ్రాత యొక్క పత్రము లభించింది. ఈ ప్రేమ సంబంధము ఇప్పటి వరకు ఇలాగే నడుస్తూవస్తుంది. ఈ రాజాసాహెబ్ హిందూ ధర్మం తరపున బ్రాహ్మణులకు మూలస్థంభమై నిజాముల కాలంలో సర్వతో ముఖాభివృద్ధి జరిగింది.

ప్రభువు చాళకాపురంలో ఉన్నప్పుడు మారుతికి పూజ, అర్చన, పల్లకీ సేవ నిర్విరామంగా జరిగేవి. ప్రభు మారుతిపై ఆరతి, కొన్ని భజనలు, అష్టకము రచించారు. ఈ ఆరతి, భజన ప్రభు సాంప్రదాయంలో భాగమై ప్రతి శనివారం ఇప్పటికీ భజన చేయబడుతుంది. ఈ విధంగా ప్రభువు చాళకాపురంలో నాలుగు నెలలు ఆనందంగా నివసించిన తరువాత మార్గశిర మాసం దగ్గరకి వస్తుండగా ప్రభువు యొక్క స్వారీ మైలార్‌కి వెళ్లడానికి సిద్ధమయింది. ప్రభువు యొక్క వియోగం అవుతుందని తెలియగానే చాళకాపూర్ గ్రామం శోకతప్తమయింది. ప్రభువు నివసించిన నాలుగునెలలు ఆనందంగా రమణీయంగా గడవడం వల్ల కాలం ఎలా గడిచిందో ఎవరికీ తెలియలేదు. ప్రభువు యొక్క సహవాసం

చిరకాలం ఉండాలని అందరికీ ఆశ ఉండేది. ఇది సాధ్యం కాదని అందరికి ప్రసాదం ఇచ్చి స్వాంతన పరిచి సంతుష్టులను చేశారు. మాతృశ్రీ బయమ్మతో తాత్యారావుని తీసుకొని ప్రభు మైలార్‌కి బయలు దేరారు.

## 18. మైలార్‌లో భక్తురాలు వెంకమ్మ

మైలార్, ఇది అతి ప్రాచీన పుణ్యక్షేత్రము. ఇక్కడ ఇతర దేవతలు కూడా ఉన్నా ఖండేరాయ్ (శంకరుడు) ప్రముఖ దైవము. ఇక్కడి భక్తులు దానిని దక్షిణ కాశి అంటారు. మల్హారి మహత్యంలో ఈ క్షేత్రం యొక్క వర్ణణ చేయడం జరిగింది. మణిచూల పర్వతంపై ఉన్న ఈ క్షేత్రం ఆ కాలంలో అత్యంత ప్రముఖమైనది. పూజార్లు కూర్మజాతి వాళ్లు ఉండేవారు. గ్రామంలోని పూజారి బ్రాహ్మణులు ఉండేవారు. పేశ్వాయిలు ఈ దేవునికి రెండు గ్రామాలు జాగీరుగా ఇచ్చారు. తరువాత మరాఠీ సర్దార్ చంద్రసేన జాధవ్ పుత్రుడు రామచంద్ర జాధవ్ ప్రాబల్యం వల్ల ఈ దేవస్థానం వైభవోపేతమయింది. ఈ ప్రదేశంలో పద్దెనిమిది తీర్థ కుండాలు సుందరంగా కట్టబడ్డాయి. దేవాలయం కూడా నైపుణ్యంతో కట్టబడింది. క్షేత్రం పురాతనమైనదవడం వల్ల శిథిలావస్థకు చేరుకుంది. ఊరు పాతదై నిర్జన ప్రదేశమయింది. పెద్ద పెద్ద ఇళ్లు చూస్తే శ్రీమంతులు నివసించారని తెలుస్తుంది. కానీ, శిథిలావస్థకు చేరుకోవడానికి కారణం మలేరియాతో జనం అందరూ మరణించి ఆ దశకు చేరుకుందని చెపుతారు.

ప్రభువు ఈ ప్రదేశానికి వచ్చినప్పుడు పూర్తి వైభవంతో ఉండేది. బ్రాహ్మణులు, వ్యాపారులు, షావుకారులు సంపన్నస్థితిలో ఉండేవారు. అన్న వస్త్రాలకు ఎవరికీ లోటు ఉండేది కాదు. ప్రభు తన మండలిని తీసుకొని ఊరు బయట ఉన్న దేవాలయంలో దిగారు. అప్పుడు మాతృశ్రీ బయమ్మ, తాత్యాసాహెబ్, చిమన్యా బ్రహ్మచారి, నారాయణ దీక్షిత్ వెంట ఉన్నారు. ప్రభు వచ్చిన విషయం తెలియగానే వేలమంది ప్రభు దర్శనానికి రాసాగారు. ప్రతి సంవత్సరం మార్గశిర శుద్ధ షష్టికి జాతర జరుగుతుంది. ఆ సమయంలో ప్రభువు కోసం జాతరలో నాలుగు దిక్కుల నుండి వచ్చిన జనంతో ఆ ప్రదేశం

నిండిపోయింది. ప్రభువు ఖండేరాయుని పూజచేసి వస్త్రాలతో అలంకరించారు. ప్రభువు ఖండేరాయునిపై భజన, ఆరతి ఈ ప్రదేశంలోనే రచించారు. తరువాత అది ఆదివారం భజనగా ప్రసిద్ధమయింది. ప్రభు ఇక్కడికి వచ్చిన తరువాత 'నిత్యశ్రీ నిత్యమంగళం' అయి ఆనంద భరితమయింది. నిత్యం వేలమంది దర్శనానికి రాసాగారు. నాలుగు దిక్కులా జయజయధ్వానాలు మిన్నంటసాగాయి. భోజన పంక్తులు జరగసాగాయి. ప్రభువు మెడలో పూలహారాలు కర్జూరపండ్లు, పూలు, పేడ, బర్ఫీ మొదలైనవి సంచుల కొద్ది జమ అవసాగాయి. లెక్కలేనంత ద్రవ్యము జమ అయ్యేది. దాంతో పాటు ఏ రోజుది ఆ రోజే ఖర్చయ్యేది. ప్రభువు వద్ద తమ కోరికలు తీర్చాలని మొక్కుకునేవారు. అలాగే కోరికలు తీరిన వారు మొక్కులు తీర్చుకునేవారు. నాట్యం, పురాణాలు, కీర్తనలు, భజనలు రోజూ జరిగేవి. పరివారంతో ఉన్న ఆ ప్రదేశం అంగరంగభరితమయింది. ఖండోబా జాతర ముగిసింది. కానీ, ప్రభువు దర్శనార్థం వచ్చిన జనం ఇంకా ఉండిపోయారు. నిత్యశ్రీ నిత్యమంగళంగా ఉన్న ప్రభు సహవాసాన్ని విడిచి ఎవరికీ వెళ్లాలనిపించేది కాదు. అతి కష్టంతో వెళ్లేవారు వెళ్లినా ప్రభువు వద్ద ప్రసాదం తీసుకొని వెళ్లేవారు. ఎంతో మంది నిరీక్షించి ప్రసాదం తీసుకొని వెళ్లేవారు. మైలార్ యాత్ర ముగిసిన తరువాత ప్రభువు వద్దకు వచ్చేవారు కూడా తక్కువయ్యారు. ఒకరోజు ప్రభువు చేతినుండి ప్రసాదం తీసుకొనే వారిలో ఒక కోమటి స్త్రీ (వైశ్య) ప్రభు దర్శనార్థం వచ్చింది. ఆమె యుక్త వయస్సురాలైన వితంతువు. శరీరం నలుపైనా కూడా ఆమె ఆభరణాలతో అలంకృతురాలై ఉండెను. అందరితో పాటు ప్రసాదం తీసుకోకుండా ఒక ప్రక్కగా నిలుచొని ఉండిపోయింది. వేలమంది ప్రసాదం తీసుకున్నా తను మాత్రం ప్రసాదం కోసం ఆలోచించలేదు. ఒక ప్రక్కగా కూర్చుని ప్రభువు తేజో స్వరూపాన్ని చూస్తూ ఉండిపోయింది. ఆమె ప్రభు స్వరూపాన్ని చూస్తూ ఎంతగా లీనమయ్యిందంటే ఆమెకు బాహ్యదేహంపై కొంచెం కూడా స్పృహ లేకుండా పోయింది. తను ఎవరో ఎక్కడి నుండి వచ్చానో? ఏమి చేయాలో ? వీటన్నిటిని మరిచి కూర్చున్న చోటే ప్రభు స్వరూపంలో లీనమయ్యింది. మొదట ఆమె వైపు ఎవరి దృష్టి మళ్లలేదు. చివరికి జనం తగ్గిన తరువాత ప్రభు శిష్యులలో ఒకరు ఆమె ప్రసాదం ఎందుకు తీసుకొవటేదని అనుకొని ముందుకు రమ్మని పిలిచారు. శిష్యుడు పిలవడంతో స్పృహలోకి వచ్చి ప్రభువు ముందు సాష్టాంగ నమస్కారం చేసి ప్రసాదం కోసం

చేయి చాచగానే ప్రభువు రెండు కర్జూర పళ్ళు, కొన్ని పేలాలు ఆమె చేతిలో పెట్టారు. ప్రసాదం తీసుకొని బయటకు వచ్చింది. ఎక్కడికి వెళ్లాలో ఆమెకి తోచలేదు. ప్రపంచమంతా శూన్యంగా అనిపించింది. బయటకు వచ్చిన తరువాత కాళ్లు ఎక్కడికి తీసుకువెళ్తే అక్కడికి వెళ్లింది. కానీ, ఆమె అంతః కరణ ప్రభువుతో ఏకమువడం వల్ల ప్రభువు మూర్తి అన్ని వైపులా కనిపించసాగింది. ఆమె ప్రభుమయుమయింది. తన స్థితి ఆమెకు తెలియడంలేదు. రెండు రోజులు తిరిగి మళ్లీ ప్రభుదర్శనానికి వచ్చింది. ఒక సారి ప్రసాదం తీసుకున్నా తిరిగి ఎందుకు వచ్చిందని కొందరికి ఆశ్చర్యం కలిగింది. మళ్లీ ప్రభువు ప్రసాదం ఇవ్వగానే అప్పటికి అక్కడి నుండి వెళ్లినా అమె మనస్సు ఇక్కడికే రావాలనిపించసాగింది. ఇలాంటి మానసిక స్థితిలో ఏం చేయాలో, ఎక్కడికి వెళ్లాలో అంతఃకరణలో బాధ ఎలా శాంతిస్తుందో తెలియలేదు. దిశానిర్దేశం తెలియక అక్కడ ఇక్కడ తిరిగి మళ్లీ ప్రభు ముందుకు వచ్చి నిలబడింది. 'ఓ అమ్మ ఇలా మళ్లీ మళ్లీ ఎందుకు వస్తున్నావు? నీకు ప్రసాదం దొరికినా నీ ఊరికి ఎందుకు వెళ్లడం లేదు? అని ప్రభువు అడిగారు.

మహారాజ్, నా ఊరేదో నాకు తెలియదు. మీరు తప్ప ఈ ప్రపంచమంతా నాకు శూన్యంగా కనిపిస్తుంది. ఈ పాదాలు వదిలి నేను ఎక్కడికి వెళ్లను అనగానే ప్రభువు, ఓ అమ్మా నీవు యవ్వనంలో ఉన్నావు. మా దగ్గరికి నిత్యం అనేక రకాలైన జనం వస్తూ ఉంటారు. నిన్ను కనిపెట్టి ఉండడం మా వల్ల కాదు. మేము ఫకీరులము. గోసాయిలము. నీకు ఈ జీవనం తగదు. వచ్చిన దారినే నీ యింటికి తిరిగి వెళ్లు, అనగానే "నా ఇల్లు ఎక్కడుందో నా తల్లిదండ్రులెవరో నాకు తెలియదు. ఇప్పుడు నాకు అన్నీ మీరే మిమ్మల్ని విడిచి ఎక్కడికీ వెళ్ళను అని ఆ స్త్రీ అనగానే మా దగ్గర ఉండాలనుకుంటే శరీరంపై ఉన్న నగలు బీదలకు పంచి శరీరానికి బూడిద పూసుకోవలసి ఉంటుందని ప్రభువు అన్నారు.

మహారాజ్, నాకు నగలంటే విరక్తి కలుగుతుంది. ఇవి తీసుకొని మీరు ఎవరికైనా పంచి పెట్టండి అని శరీరంపై ఉన్న నగలను తీసియిచ్చింది. ఆ స్త్రీ నిర్ధారించుకున్న విషయం విని ప్రభు ప్రసన్నులయ్యారు. ద్రవ్య లాలసులైన కోమటి కులంలో జన్మించిన ఆ స్త్రీ ఔదార్యం చూసి జనం

ఆశ్చర్యచకితులయ్యారు. ప్రభువుకు ఆ స్త్రీ అంతఃకరణ తెలిసియుండెను. ప్రభువుకు ఆ స్త్రీ అంతఃకరణలోని శుద్ధ, నిస్వార్థమైన దివ్యప్రేమ కనిపిస్తుండేది. ఆ ప్రేమ ముందు ద్రవ్యం మరియు దేహం యొక్క చింతలేదు. ప్రభు అంతఃదృష్టితో ఆమెవైపు చూసి, అమ్మ దగ్గరికి తీసుకుని వెళ్లమని ఒక శిష్యునికి చెప్పారు. ఆ శిష్యుడు ఆమెను మాతృశ్రీ వద్దకు తీసుకొని వెళ్ళారు. ప్రభువుపై ఉన్న ప్రేమ, భక్తి చూసి మాతృశ్రీ ఆనందించి తన బిడ్డలా ఆమెను ఆదరించారు. ఆ యువతి అంతఃకరణ తెలుసుకోవడానికి ప్రభువు వివిధ రకాలుగా పరీక్షించారు. ఎన్నో రోజులు ఆమెకు కర్జూర పండ్లు మాత్రమే తిని ఉండమనేవారు. ఆమె శరీరం సన్నబడింది. అందరికి ఆమెపై కరుణ కలిగింది. కాని ప్రభు ఆజ్ఞ ఆమె ఉల్లంఘించేది కాదు. ఒక రోజు ఆమె నగ్నంగా స్నానం చేస్తూ ఉన్న సమయంలో ఎవరో వచ్చి ప్రభువు నిన్ను ''ఎలా ఉన్నావో అలాగే రమ్మన్నారని చెప్పారు''. ఇది వినగానే దేహమోహం, జనం ముందు లజ్జ పడకుండా ఎలా ఉందో అలాగే వెళ్లడానికి తయారయింది. అందరూ ఆశ్చర్య చకితులయ్యారు. ఈ విషయం మాతృశ్రీకి తెలియగానే వెంటనే బయలుదేరింది. మధ్యలోనే ఆమెను నిలిపివేసింది. ప్రభువు ఈ విధమైన ఆజ్ఞ ఎలాచేశారు. ఈ విషయానికి కారణం స్త్రీకి నిజమైన ఆభరణం సిగ్గు. అది లేకపోతే స్త్రీత్వం ఎలా ఉంటుంది? ప్రభు ఆజ్ఞతో ఆ స్త్రీ ఆ స్థితిలో రావడానికి తయారయిందని ప్రభువుకి అర్థమవగానే ఆమె అసమాన భక్తికి ప్రభువు మనసు ప్రేమతో నిండిపోయింది. ఆమె ఇంకా ప్రభువు వద్దకు రాకముందే తన శరీరంపై ఉన్న శాలువాను (వస్త్రాన్ని) ఆమెపై వేయడానికి పంపించారు. దానితో ఆమె జన్మ ధన్యమయింది. పైన చెప్పిన ఆ యువతి వెంకమ్మ. ఈమె పూర్వజన్మలో యోగిని. ప్రారబ్ధ కర్మతో ఆమెకు వైశ్యకులంలో జన్మ ప్రాప్తించింది. ఆమె ప్రభువుకి సన్నిహితమై ప్రభువు కృపతో పరమావధి పొందింది. ఆ సమయంలో వెంకమ్మ వివస్త్రయై ఉన్నా జనులు ఏమనుకుంటారో అని కూడా ఆలోచించలేదు. ఆ అసమాన భక్తికి ప్రభువు సంతుష్టులై తన వస్త్రాన్ని ఆమెపై కప్పడానికి ఇచ్చారు.

ప్రభువు యొక్క వస్త్రం వెంకమ్మ శరీరంపై పడగానే ఆమెకు పునర్జన్మ లభించింది. ఆమె పాపాలు అన్ని దగ్ధమై కడిగిన ముత్యంలా వెలిగిపోయింది. అప్పటి నుండి ఆమె తెల్లబట్టలు కట్టుకొని నొసట విభూతి రాసుకొని చేతిలో

చేయి చాచగానే ప్రభువు రెండు కర్జూర పళ్ళు, కొన్ని పేలాలు ఆమె చేతిలో పెట్టారు. ప్రసాదం తీసుకొని బయటకు వచ్చింది. ఎక్కడికి వెళ్లాలో ఆమెకి తోచలేదు. ప్రపంచమంతా శూన్యంగా అనిపించింది. బయటకు వచ్చిన తరువాత కాళ్లు ఎక్కడికి తీసుకువెళ్తే అక్కడికి వెళ్లింది. కానీ, ఆమె అంతః కరణ ప్రభువుతో ఏకమవడం వల్ల ప్రభువు మూర్తి అన్ని వైపులా కనిపించసాగింది. ఆమె ప్రభుమయమయింది. తన స్థితి ఆమెకు తెలియడంలేదు. రెండు రోజులు తిరిగి మళ్లీ ప్రభుదర్శనానికి వచ్చింది. ఒక సారి ప్రసాదం తీసుకున్నా తిరిగి ఎందుకు వచ్చిందని కొందరికి ఆశ్చర్యం కలిగింది. మళ్లీ ప్రభువు ప్రసాదం ఇవ్వగానే అప్పటికి అక్కడి నుండి వెళ్లినా అమె మనస్సు ఇక్కడికే రావాలనిపించసాగింది. ఇలాంటి మానసిక స్థితిలో ఏం చేయాలో, ఎక్కడికి వెళ్లాలో అంతఃకరణలో బాధ ఎలా శాంతిస్తుందో తెలియలేదు. దిశానిర్దేశం తెలియక అక్కడ ఇక్కడ తిరిగి మళ్లీ ప్రభు ముందుకు వచ్చి నిలబడింది. 'ఓ అమ్మ ఇలా మళ్లీ మళ్లీ ఎందుకు వస్తున్నావు? నీకు ప్రసాదం దొరికినా నీ ఊరికి ఎందుకు వెళ్లడం లేదు? అని ప్రభువు అడిగారు.

మహారాజ్, నా ఊరేదో నాకు తెలియదు. మీరు తప్ప ఈ ప్రపంచమంతా నాకు శూన్యంగా కనిపిస్తుంది. ఈ పాదాలు వదిలి నేను ఎక్కడికి వెళ్లను అనగానే ప్రభువు, ఓ అమ్మా నీవు యవ్వనంలో ఉన్నావు. మా దగ్గరికి నిత్యం అనేక రకాలైన జనం వస్తూ ఉంటారు. నిన్ను కనిపెట్టి ఉండడం మా వల్ల కాదు. మేము ఫకీరులము. గోసాయిలము. నీకు ఈ జీవనం తగదు. వచ్చిన దారినే నీ యింటికి తిరిగి వెళ్లు, అనగానే "నా ఇల్లు ఎక్కడుందో నా తల్లిదండ్రులెవరో నాకు తెలియదు. ఇప్పుడు నాకు అన్నీ మీరే మిమ్మల్ని విడిచి ఎక్కడికీ వెళ్ళను అని ఆ స్త్రీ అనగానే మా దగ్గర ఉండాలనుకుంటే శరీరంపై ఉన్న నగలు బీదలకు పంచి శరీరానికి బూడిద పూసుకోవలసి ఉంటుందని ప్రభువు అన్నారు.

మహారాజ్, నాకు నగలంటే విరక్తి కలుగుతుంది. ఇవి తీసుకొని మీరు ఎవరికైనా పంచి పెట్టండి అని శరీరంపై ఉన్న నగలను తీసియిచ్చింది. ఆ స్త్రీ నిర్ధారించుకున్న విషయం విని ప్రభు ప్రసన్నులయ్యారు. ద్రవ్య లాలసులైన కోమటి కులంలో జన్మించిన ఆ స్త్రీ ఔదార్యం చూసి జనం

ఆశ్చర్యచకితులయ్యారు. ప్రభువుకు ఆ స్త్రీ అంతఃకరణ తెలిసియుండెను. ప్రభువుకు ఆ స్త్రీ అంతఃకరణలోని శుద్ధ, నిస్వార్థమైన దివ్యప్రేమ కనిపిస్తుండేది. ఆ ప్రేమ ముందు ద్రవ్యం మరియు దేహం యొక్క చింతలేదు. ప్రభు అంతఃదృష్టితో ఆమెవైపు చూసి, అమ్మదగ్గరికి తీసుకుని వెళ్లమని ఒక శిష్యునికి చెప్పారు. ఆ శిష్యుడు ఆమెను మాతృశ్రీ వద్దకు తీసుకొని వెళ్ళారు. ప్రభువుపై ఉన్న ప్రేమ, భక్తి చూసి మాతృశ్రీ ఆనందించి తన బిడ్డలా ఆమెను ఆదరించారు. ఆ యువతి అంతఃకరణ తెలుసుకోవడానికి ప్రభువు వివిధ రకాలుగా పరీక్షించారు. ఎన్నో రోజులు ఆమెకు కర్జూర పండ్లు మాత్రమే తిని ఉండమనేవారు. ఆమె శరీరం సన్నబడింది. అందరికి ఆమెపై కరుణ కలిగింది. కాని ప్రభు ఆజ్ఞ ఆమె ఉల్లంఘించేది కాదు. ఒక రోజు ఆమె నగ్నంగా స్నానం చేస్తూ ఉన్న సమయంలో ఎవరో వచ్చి ప్రభువు నిన్ను "ఎలా ఉన్నావో అలాగే రమ్మన్నారని చెప్పారు". ఇది వినగానే దేహమోహం, జనం ముందు లజ్జ పడకుండా ఎలా ఉందో అలాగే వెళ్లడానికి తయారయింది. అందరూ ఆశ్చర్య చకితులయ్యారు. ఈ విషయం మాతృశ్రీకి తెలియగానే వెంటనే బయలుదేరింది. మధ్యలోనే ఆమెను నిలిపివేసింది. ప్రభువు ఈ విధమైన ఆజ్ఞ ఎలాచేశారు. ఈ విషయానికి కారణం స్త్రీకి నిజమైన ఆభరణం సిగ్గు. అది లేకపోతే స్త్రీత్వం ఎలా ఉంటుంది? ప్రభు ఆజ్ఞతో ఆ స్త్రీ ఆ స్థితిలో రావడానికి తయారయిందని ప్రభువుకి అర్థమవగానే ఆమె అసమాన భక్తికి ప్రభువు మనను ప్రేమతో నిండిపోయింది. ఆమె ఇంకా ప్రభువు వద్దకు రాకముందే తన శరీరంపై ఉన్న శాలువాను (వస్త్రాన్ని) ఆమెపై వేయడానికి పంపించారు. దానితో ఆమె జన్మ ధన్యమయింది. పైన చెప్పిన ఆ యువతి వెంకమ్మ. ఈమె పూర్వజన్మలో యోగిని. ప్రారబ్ధ కర్మతో ఆమెకు వైశ్యకులంలో జన్మ ప్రాప్తించింది. ఆమె ప్రభువుకి సన్నిహితమై ప్రభువు కృపతో పరమాపధి పొందింది. ఆ సమయంలో వెంకమ్మ వివస్త్రయై ఉన్నా జనులు ఏమనుకుంటారో అని కూడా ఆలోచించలేదు. ఆ అసమాన భక్తికి ప్రభువు సంతుష్టులై తన వస్త్రాన్ని ఆమెపై కప్పడానికి ఇచ్చారు.

ప్రభువు యొక్క వస్త్రం వెంకమ్మ శరీరంపై పడగానే ఆమెకు పునర్జన్మ లభించింది. ఆమె పాపాలు అన్ని దగ్ధమై కడిగిన ముత్యంలా వెలిగిపోయింది. అప్పటి నుండి ఆమె తెల్లబట్టలు కట్టుకొని నొసట విభూతి రాసుకొని చేతిలో

జపమాలతో ప్రభు నామము జపిస్తూ ఉండేది. ఆమె కులానికి కోమటియైనా, సౌందర్యవతి, విద్యావతి కాకపోయినా వీటన్నిటిని మించి పవిత్ర అంతఃకరణతో ధ్యానించి ప్రభువును గెలిచే సామర్థ్యం ఉండేది. కోమటివారు ధర్మశాస్త్రబద్ధంగా అన్ని విధివిధానాలను పాటిస్తారు. నిజాముల కాలంలో కోమటి వాళ్లు వ్యాపారులై శ్రీమంతులుగా ఉండేవారు. వెంకమ్మ తండ్రి ధనకనక సంపన్నుడైన వ్యాపారియై భావిక భక్తుడై ఉండేవారు. వెంకమ్మ పెళ్లి ఆ కాలానికి తగినట్లు చిన్న వయస్సులోనే జరిగింది. కానీ, దురదృష్టవశాత్తు ఆమె భర్త పెళ్లి అయిన కొద్ది రోజుల్లోనే మరణించడం వల్ల ఆమెకు వైధవ్యం ప్రాప్తించింది. విధవ అవడం వల్ల సమయమంతా దైవచింతనలోనే కాలం గడిపేది. తల్లి తండ్రుల సహాయం కూడా ఆమెకు లభించింది. వ్యాపారం చేసి ధనం సంపాదించే ఆ కుటుంబం ఈశ్వర భక్తులయ్యారు. ఈశ్వర కృప ప్రాప్తించాలని ఆ కుటుంబం అహోరాత్రులు భజనచేస్తూ గడిపేవారు. దైవ సాన్నిధ్యంలో గడిపే ఆ కుటుంబాన్ని దోచుకోవాలని ఒక కపట సన్యాసి గురువుగా పరిచయం చేసుకొని పూర్తి కుటుంబాన్ని స్వదేహంతో కైలాసానికి వెళ్లే అద్భుత విద్య తన వద్ద ఉందని వెంకమ్మ తండ్రికి చెప్పాడు. అన్ని ఆధిభౌతికాలను వదిలి దేహంతో పాటు స్వర్గం ప్రాప్తిస్తుందని వెంకమ్మ తండ్రి ఆ సన్యాసి వెంట పడ్డాడు. ఆ సన్యాసి మహా చతురుడు. కొత్త కొత్త యుక్తులతో వాళ్ల ధన్నాన్ని అపహరించడం ప్రారంభించాడు. చివరికి ఒకే సారి పూర్తి కుటుంబాన్ని స్వర్గానికి పంపిస్తానని ఒక రోజు నిశ్చయించి అనుష్టానం చేయించాడు. అనుష్టానం ముగియగానే మైలారు దగ్గర ఉన్న రుద్రకుండంలో వెంకమ్మతో సహా పూర్తి కుటుంబాన్ని ఆ నీళ్లలో దూకమని ఆజ్ఞాపించాడు. గురు ఆజ్ఞతో ఆ కుటుంబమంతా అందులో దూకారు. ఈత ఎవరికీ రాకపోవడం వల్ల అందరూ చనిపోయారు. వెంకమ్మ కూడా అందరితో పాటు దూకగానే నీళ్లలో పైకి లోపలికి రెండు సార్లు మునిగి తేలగానే మూడోసారి ఎవరో చేయిపట్టుకొని పైకి లాగారు. ఆ సమయంలో ఆమె స్పృహలో లేదు. కొంచెం కళ్లు విప్పి చూడగానే పైకి తెచ్చిన ఆ పురుషుని (ప్రాణదాత) యొక్క స్వరూపం మనస్సులో ఉండిపోయింది. అందరిని స్వర్గానికి పంపించి ఆ కపట సన్యాసి పలాయనం చిత్తగించాడు. వెంకమ్మకు స్పృహలోనికి తేవడానికి అక్కడ ఉన్నవాళ్లు ప్రయత్నించారు. ఆ సన్యాసి చేసిన పనికి అందరికి బాధ కలిగింది. కాని ఇతర కుటుంబ సభ్యులను మాత్రం ఎవరూ రక్షించలేకపోయారు. ఇతర ఉపచారములు అయిన తరువాత వెంకమ్మ

పూర్తి స్ప్రహలోనికి వచ్చింది. ఆమె ధ్యానమంతా తనను బయటకు తీసిన పురుషునిపై ఉండటం వల్ల తల్లితండ్రుల వియోగం ఆమెకు గుర్తురాలేదు. ఆ జలాశయంలో ఆమెకు పునర్జన్మ లభించింది. తన స్వంత వాళ్లు ఎవరూ లేకుండా పోయారు. ఎలాంటి ఆశ ఆమెకు మిగలలేదు. తల్లితండ్రులు దేహంతో స్వర్గవాసులు అయ్యారు. ఇక ఏ ఆలోచన, గమ్యం లేకుండా తిరుగుతుంటే ప్రభువు దర్శనం కాగానే రుద్రకుండంలో నుండి బయటకు తీసిన పురుషుడు ఇతనే అని అనిపించగానే ప్రభు స్వరూపంపై మనస్సు నిలిచింది. ఆ తరువాత వెంకమ్మ ప్రభువుతో ఎలా మమేకమయ్యిందో పైన మనకు తెలిసింది.

కొంత మంది చరిత్రకారులు ఈ విషయాన్ని ఇంకో విధంగా వ్రాశారు. వెంకమ్మ తల్లి తండ్రులు ప్రభువు మైలారుకి వచ్చిన విషయం తెలిసి ప్రభుదర్శనం చేసుకోవాలని కుటుంబంతో ఎడ్లబండిలో బయలుదేరారు. మైలారు కొద్ది కోసుల దూరంలో ఉండగా, గాలి వాన మొదలై ఒక నది వద్ద వాళ్ల ఎడ్లబండి పూర్తిగా కొట్టుకొని పోయి మనుషులు కూడా నీళ్లలో మునిగి పోగా వెంకమ్మ కూడా కొట్టుకు పోతుండగా ఒక బ్రహ్మచారి తన చేత్తో ఆమెను పైకి తెచ్చి భూమిపై వేసి మాయమయ్యారు. ఇలా జరిగింది చూసి వెంకమ్మ స్పృహ కోల్పోయి కొద్ది రోజుల తరువాత మైలారుకు వచ్చి ప్రభు దర్శనము చేసుకొంది. తరువాత కథ పైన వివరించడం జరిగింది.

రెండు కథల వల్ల కూడా వెంకమ్మను మాణిక్ ప్రభు సంకట పరిస్థితి నుండి రక్షించారని తెలుస్తుంది. ఇలాంటి భయంకర పరిస్థితులనుండి రక్షించిన పురుషుడు అదృశ్యమయ్యారు. కాని ఆ అద్భుత పురుషుని కరస్పర్శ తగిలినప్పటినుండి ఆమె పిచ్చిదయింది. ఆమెకు తనను నీటి నుండి బయటకు తెచ్చిన వారు ఈ ప్రపంచ జగద్రక్షకులు. ఈ మాయాప్రపంచాన్ని ఉద్ధరించడానికి సమర్థులని ఆమెకు నమ్మకం కలిగింది. వారెవరో తెలుసుకోవాలని వెతుక్కుంటూ తిరగసాగింది.

వెంకమ్మ కు ఐహిక ఆప్తులు లేనందువల్ల పారమార్థిక ఆప్తుల కోసం వెదకడానికి నిర్ణయించుకుంది. లేగదూడ ఆవునుండి తప్పిపోతే ఎలా తిరుగుతుందో ఆ విధంగా ఆత్మబంధువును వెతికే పనిలో తిరగసాగింది. ఆమె

అంతఃకరణకు అయిన దాహం సద్గురువును కలిస్తేనే ఉపశమిస్తుంది. అందుకు అన్ని ఇంద్రియాలు ఉన్నా బయటి జ్ఞానం లేక తిరగసాగింది. ఆమె భాగ్యోదయం అయ్యే సమయం రావడం వల్ల ప్రభు దర్శనం కలిగింది. అప్పుడు ఆమెకు తల్లి, తండ్రి, బంధువులు ఒకే సారి దొరికినట్లు అయింది. ఆ సమయంలో ఆమె ఆనందం వర్ణించడం ఎవరి వల్ల కాదు. మైలార్‌లో ప్రభు చాలా రోజులు ఉన్నారు. ఇక్కడ ప్రభు గాదీ స్థాపన జరిగినప్పుడు పెద్ద ఉత్సవము జరిగింది. దేవాలయం దగ్గర ఆవరణలో ఒక చెట్టు కింద కూర్చున్నపుడు చేతిలో పట్టుకున్న ఒక కట్టెతో భూమిలో కెలకగానే నీళ్లు పడ్డాయి. అదే గంగ అని శిష్యులంతా అక్కడ తవ్వి కుండము చేశారు. దానికి 'మాణిక్ కుండము' అని పేరు పెట్టారు. ఆ కుండానికి ఇప్పటికి చాలా మహత్యం ఉంది.

దుబుల్‌గుండికి చెందిన కులకర్ణీ రామాజీపంత్ అనేవారు ఉండేవారు. వారికి ప్రభు దర్శనము మైలార్‌లోనే జరిగింది. రామన్న పంత్ బ్రహ్మచారియై ప్రభు దర్శనము తరువాత ప్రభువుపై భక్తి పెరిగింది. అది చివరివరకు అలాగే ఉంది. తన దగ్గర ఉండాలని ప్రభువు కోరినా కొన్ని పరిస్థితుల వల్ల ఉండలేక పోయారు. కాని ఆయన తండ్రి సోదరి అయిన సుందరమ్మ మాత్రం ప్రభు సన్నిధిలోనే ఉండేది. ఆమె విధవగా ఉండి అంతఃకరణ శుద్ధ భక్తితో పునీతమవడం వల్ల ప్రభు తమదగ్గర ఉండడానికి అనుమతి ఇచ్చారు. తరువాత ప్రభు ఆమెను అనుగ్రహించి ఆమెకు దివ్యదృష్టి ప్రసాదించారు. ఇలా ఎందరినో ప్రభువు అనుగ్రహించారు.

ప్రభువు నివాసం వల్ల మైలార్ క్షేత్ర మహత్యంలో ముఖ్య భాగమై నందున సకల గ్రామ ప్రజలు హర్షోల్లాసులయ్యారు. ప్రభు యొక్క సహవాసం చిరకాలం ఉండాలని వారు అపేక్షించేవారు. ఇది సాధ్యం కాదు, కారణం మణిచూల పర్వతంపై ఉన్న తీర్థాలు, క్షేత్రాలు, గుహలు తపస్సుకు అనువైన స్థానాలు, అరణ్యాలు తిరగడం ప్రభుసంకల్పంగా ఉండేది. ఆర్య రాష్ట్రంలోని ప్రముఖ తీర్థాలు, క్షేత్రాలు, యాత్ర చేయడం మనోఇచ్ఛగా ఉండేది. అలా తిరిగినా ఒకే ప్రదేశంలో ఎక్కువ రోజులు గడపడం జరిగేది కాదు. భవిష్యత్ దృష్టితో మైలార్ నుండి బయలుదేరాలని ప్రభు సంకల్పించారు. మాతృశ్రీ బయాదేవి మరియు నృసింహతాత్యాలను కళ్యాణ్‌కి పంపించి కొంతమంది

ప్రముఖ శిష్యులను వెంటతీసుకొని మిగతా వాళ్లను వాళ్ల స్వస్థలాలకు వెళ్లాలని ఆజ్ఞాపించారు. ఎలాంటి ఘోర అరణ్యంలో నివసించాల్సి వచ్చినా, ఎలాంటి ఆపద వచ్చినా ప్రభు చరణాలు విడవరాదని నిశ్చయించుకున్న వెంకమ్మను వెంట తీసుకు వెళ్ళాలని నిశ్చయించుకున్నారు. మైలార్ విడిచి వెళ్తున్న ప్రభువును చూసి మైలార్ గ్రామస్థులు ఖిన్నులయ్యారు. కాని ప్రభు తన ప్రేమ పూర్వక మాటలతో అందరికి ప్రసాదం ఇచ్చి సమాధానపరిచారు.

## 19. భాల్కిలో ప్రభువు

మైలార్ నుండి ప్రభు బయలుదేరి భాల్కికి వచ్చారు. అనుకోకుండా భాల్కికి ఎందుకు వచ్చారో ఎవరికీ తెలియలేదు. భాల్కి పూర్వం మరాఠా సేనాపతి చంద్రసేనజాధవ్ యొక్క జాగీరులో ఉండేది. చంద్రసేన జాధవ్‌కు ఖర్చు కోసం ఏడు లక్షల జాగీర్ నిజాముల నుండి లభించింది. ఈ ప్రదేశంలో ఇప్పుడు ఖిల్లా రాజవాడ జీర్ణదశలో కనిపిస్తుంది. ఈ ఊరి యొక్క ఇతిహాసం ప్రాచీనమైనది. పూర్వం దీనికి భద్రపురి లేదా భద్రావతి అనే పేరు ఉండేది. ఇక్కడ భద్రేశ్వర్ అనే పేరుగల శంకర దేవాలయం ఉంది. దాన్నే ఇపుడు భాల్కేశ్వర్ అంటారు. ఈ దేవాలయం ప్రాచీనమైనది. ప్రభు ఈ శంకర దేవాలయంలోనే దిగారు. అరుణప్ప అనే పేరుగల ఒక బ్రాహ్మణుడు ఈ శంకరుని పూజారిగా ఉండేవారు. ఆయన చాలా రోజుల నుండి కడుపు నొప్పితో బాధ పడుతుండేవారు. ఎన్ని ఔషధాలు వాడినా, మంత్రతంత్రాలతో కూడా ఉపయోగం లేకుండా పోయింది. అందుకని విసిగిపోయి ప్రాణంపై ఆశ వదులుకొని ఉండిరి. ఆ సమయంలో ప్రభువు అక్కడికి వచ్చారు. అపుడు ప్రభువుతో మహరాజా నాకు ఈ బాధ నుండి ముక్తి కలిగించండి. ఈ కష్టం నేను భరించలేను అని విన్నవించుకోగానే ప్రభువు నవ్వుతూ ''అరుణప్పా నీవు మరణిస్తే ఈ దేవుడికి దిక్కెవరు? దేవుని పూజ అర్చన ఎవరు చేస్తారు?'' అన్నారు.

ప్రభువు ఆ బ్రాహ్మణుని పరిస్థితి తెలుసుకొని ఆ బాధ నుండి విముక్తి కలిగించాలనుకున్నారు. ప్రభు యొక్క ఉపచారాలు సామాన్య వైద్యుల లాగ

ఉండేవి కావు. నువ్వులు, కొబ్బరి, అటుకులు పెరుగులో కలిపి లడ్డూలు చేసి ఒక లడ్డు తినాలని చెప్పారు. ఈ విలక్షణ ఔషధం చూసి జనం ఆశ్చర్యపోయారు. కాని ఆ బ్రాహ్మణుడు ప్రభు వాక్యంపై విశ్వాసంతో ఆ లడ్డు ఆరంగించాడు. తరువాత ప్రభు తన చేతిలోని దండముతో ఆయన కడుపుపై తిప్పగానే ఎలా ఎలా ఆ దండము తిరుగుతుందో అలా బాధ తక్కువ కాసాగింది. ప్రభు కృపతోనే తనకు నయమవుతుందని ఆ బ్రాహ్మణునికి నమ్మకం కుదిరింది. రెండుమూడు రోజులలో చాలా వరకు నయమై ప్రభు అక్కడ ఉన్నంతలో పూర్తిగా నయమయింది. యమద్వారం నుండి బయటకు తెచ్చి ప్రభు జీవదానం చేశారని ఆనందభరితుడై అతను ప్రభు భక్తుడయ్యాడు. ఆ బ్రాహ్మణుని వినతితో ప్రభు భాల్కిలో గాదీ స్థాపించారు. ఆ గాదీ యొక్క పూజ ఆ బ్రాహ్మణుడే నిర్వహించేవారు. కొన్ని రోజులు ప్రభు ఇక్కడ నివసించడం వల్ల చాలా మంది ప్రభు భక్తులు అయ్యారు. భాల్కికి చెందిన అప్పారావ్ సాహెబ్ ప్రభు భక్తులయ్యారు. ప్రభు భాల్కికి వచ్చినప్పుడు జరిగింది ఇంకో విధంగా కూడా చరిత్రకారులు చెపుతారు.

ప్రభువు భాల్కి దగ్గరలోని అరణ్యంలో కొద్ది రోజులు నివసించారు. తనతో పాటు బప్పాచార్య, నారయణ్ దీక్షిత్, చిమన్యా బ్రహ్మచారి ఇలా నలుగురు శిష్యులు ఉండిరి. మిగతా వారిని కళ్యాణ్‌లో ఉంచారు. వెంకమ్మకు మంత్రోపదేశం చేసి, ఒక రుద్రాక్షను జపం కోసం ఇచ్చి, భస్మం ధరించాలని ఆజ్ఞాపించి మాతృశ్రీ వద్ద సేవ కోసం ఉంచారు. భాల్కి అరణ్యంలో ఎనిమిది రోజుల వరకు సమాధి స్థితిలో ఉన్నారు. మధ్య మధ్యలో విరామం తీసుకుంటూ నారాయణ దీక్షిత్ మరియు బప్పాచారులతో వేదాంత చర్చ చేసే వారు. బ్రహ్మచారులు నలుగురు ఊళ్లోకి వెళ్ళి మధుకరి తెచ్చి ప్రభుతో పాటు వాళ్లు కూడా తీసుకొనేవారు. సంవత్సరంపాటు ఇలా జరుగగా అరణ్యంలో ఎవరో సిద్ధపురుషులు ఉన్నారని, భాల్కి దగ్గరలోని గ్రామాల్లో వార్త వ్యాపించగానే కొంతమంది దర్శనానికి రావడం జరిగింది. ఎవరికీ ఈయన కళ్యాణ్‌కి చెందిన ప్రభువని తెలియలేదు.

ఒకసారి ప్రభు దర్శనం కోసం ఒక యాత్రికుడు తన భార్య, ఐదు సంవత్సరాల కొడుకుతో భాల్కికి చేరుకున్నారు. మనస్సులో ప్రభు దర్శనము

చేసుకోవాలనే కోరిక దృఢంగా ఉండేది. ధనం లేకపోవడం వల్ల కొడుకును వీపుపై వేసుకొని మెల్లగా నడుచుకుంటూ వస్తున్నారు. భాల్కికి దగ్గరలో ఒక చెరువుగట్టుపై అలసిపోయి కూర్చున్నారు. ఆ స్త్రీపురుషులు రెండు రోజులుగా భోజనం చేయలేదు. కొడుకుకు పొంగు వచ్చి బాధపడుతున్నా అలాగే వీపుపై మోసుకొని నడుస్తూ వస్తున్నారు. అక్కడికి వచ్చిన తరువాత ఆ పిల్లవాడు చనిపోయాడు. అది చూసి ఆ దంపతులు మూర్ఛపోయారు. ఈ వార్త ఎవరో ప్రభువుకి తెలియజేశారు. ఈ వర్తమానం వినగానే వెంటనే ప్రభువు చెరువు వద్దకు చేరుకున్నారు. అప్పుడు ప్రభువుతో పాటు ఇతర మండలి కూడా ఉండెను. ప్రభువు క్రింద కూర్చుని ఆ పిల్ల వాడిని తొడపైకి తీసుకొని అతని శరీరంపై తన అమృత హస్తాన్ని తిప్పారు. ప్రభు కరస్పర్శ తగలగానే ఆ పిల్లవాడు కళ్లు తెరిచాడు. అది చూసి ఆ దంపతులు పరమానందభరితులయ్యారు. అప్పుడు ప్రభువు, మీరు ఎవరి దగ్గరికి వెళ్తున్నారని ఆ దంపతులను అడిగారు. అప్పుడు వారు మేము మాణిక్ ప్రభు దర్శనానికి కళ్యాణ్‌కి వెళ్తున్నాము. దేవుడు మాకు విపత్తు కలిగించాడు. ప్రభు మాపై కృప చేస్తారని ఆశతో వెళ్తుంటే తోవలో మీరు కలిశారు. కాని ప్రభువుకి మాపై కరుణ కలిగి మీ కృపా దర్శనంతో తిరిగి మా పుత్రునికి జీవదానం దొరికింది. వాళ్లు ఇలా అనగానే ప్రభు ప్రేమాశ్రువులతో ఇలా అన్నారు. 'మీకు కళ్యాణ్‌కి వెళ్లకుండానే ఇక్కడే ప్రభుదర్శనం అయితే ఎలా ఉంటుంది' ఇది విని బ్రాహ్మణుడు మాకు అంతటి భాగ్యం ఎక్కడ ఉంది? మాకు మూడు రోజుల నుండి భోజనం లేదు. అయినా ప్రభువుకి మాపై కరుణ కలుగలేదు. ఇలా ఎందుకు అంటారు. ప్రభువు మీ దర్శనం కోసం కళ్యాణ్ విడిచి మీ కోసం ఇలా వస్తే మీరు ప్రభువుకే పేరు పెడతారా? అన్నారు. దర్శనం కోసం అతురత పడ్డారని, మూడురోజుల నుండి ఉపవాసం ఉండడం వల్ల ముందు ఆ బ్రాహ్మణునికి భోజనం చేయించి తరువాత దర్శనం ఇవ్వాలని వాళ్ళను తన నివాసానికి తీసుకొని వెళ్ళారు. అక్కడ చిమన్యాతో పాటు నలుగురు మధుకరి తెచ్చియుండిరి. ఆ మధుకరి దత్తాత్రేయునికి నైవేద్యం చూపించి అక్కడికి వచ్చిన మండలిని భోజనానికి కూర్చోవలసిందిగా ఆజ్ఞాపించారు. సుమారు రెండు వందల విస్తర్లు వేయబడ్డాయి. అప్పుడు ప్రభు ఈ రోజు సమారాధన ఉంది. భాల్కికి దగ్గరలోని మూడు కోసుల వరకు ఉన్న గ్రామాల్లో అందరిని భోజనానికి పిలవండి అన్నారు. ఆ ఆజ్ఞ ప్రకారం నాలుగు దిక్కుల ఆబారావ్ నాయబ్ మనుషులను

పంపించారు. రెండు గంటలలో నాలుగు వేల మంది గుమికూడారు. అన్ని జాతుల స్త్రీలు, పిల్లలు కుంటివాళ్లు గ్రుడ్డివాళ్లు కూడా అక్కడికి చేరారు. తరువాత బ్రాహ్మణ, వైశ్య, శూద్ర ఇలా అనేక జాతులకు విడివిడిగా విస్తర్లు వేసిన తరువాత ప్రభువు తన ముందు నలుగురు బ్రహ్మచారులు జోళీలు తెచ్చి పెట్టిన తరువాత దాంట్లోని రకరకాలైన భోజనపదార్థాలు అంటే అన్నము, రొట్టెలు, నూక, చపాతీలు, కూరలు, వడలు విడిగా తీసిపెట్టమని చెప్పారు. అప్పుడు చమత్కారం ఏం జరిగిందంటే జోళీలు చిన్నవైనా వాటిలోని వివిధ రకాలైన పదార్థాలు పర్వతంలా కుప్పలుగా పడ్డాయి. ఏ విధమైన పదార్థాలు తీస్తుంటే అవి బయటకు వస్తూనే ఉన్నాయి. వివిధ జాతుల వాళ్ళు వాళ్ల స్వజాతి వాళ్లకు వడ్డిస్తూ నిలబడ్డారు. అన్ని వడ్డించగానే ''అవధూత చింతన శ్రీ గురుదేవ దత్త'' ఇలా ప్రభు నోటి నుండి వెలవడగానే భోజనానికి కూర్చోవాలని ఆజ్ఞాపించారు. అందరి భోజనాలయినా కూడా జోళీ పూర్వంలా నిండుగానే ఉంది. చివరికి ప్రభువు ఐదు ముద్దలు తీసుకొని ఆ బ్రహ్మచారులను భోజనం చేయమన్నారు. ఈ విధమైన చమత్కారం, ప్రభు సామర్థ్యం చూసి ఆబారావు తో పాటు ఉన్న మండలి ఆశ్చర్య చకితులై, కళ్యాణీక్ చెందిన మాణిక్‌ప్రభు ఈయనే అనే  దృఢసంకల్పం కలిగి కళ్యాణ్‌లో లాగే భక్తులు ఇక్కడికి రావడం మొదలై భాల్కీలో కూడా నిత్యశ్రీ నిత్యమంగళ మయింది. కళ్యాణ్ నుండి మాతృశ్రీ, తాత్యాసాహెబ్ తన మండలితో ఇక్కడికే రావడం జరిగింది. ప్రభువు చనిపోయిన బాలుని బ్రతికించటం మరియు పది మంది భోజనాన్ని నాలుగు వేలమందికి సరిపోయేటట్లు చేసిన విషయం అన్ని దిక్కులా వ్యాపించింది. దర్శనం కోసం వచ్చిన బ్రాహ్మణులకు ఇక్కడ ప్రభుదర్శనమవగానే పరమానందం కలిగింది. ప్రభువు ఆయనకు వస్త్రాలు ఇచ్చి దరిద్రం నుండి ముక్తి కలిగించారు. భాల్కి దగ్గరలోని అరణ్యంలోని గుహలో ప్రభువు ఒక సంవత్సరం వరకు సమాధి స్థితిలో ఉన్నారు. వెంకమ్మ అరణ్యంలో సమాధి స్థితిలో ఉండడం జరిగింది అనికొందరు అంటారు. వెంకమ్మకు ప్రభువు యోగాసనాలు, సమాధి గురించి చెప్పడం వల్ల ఆమెకు యోగవిద్య ప్రాప్తించింది. ఇది తెలిసి ఆమె సమాధి తీసుకుంది అంటారు. వెంకమ్మ  శాశ్వత కృప సంపాదించిన వివరణ ముందు తెలుపబడింది. వెంకమ్మ తపశ్చర్యతో రోజురోజుకు అధిక ప్రభావశాలి అవడం జరిగింది. గాలి, ఎండ, వాన, చలి వీటికి బాధపడక తపశ్చర్య ఫలప్రదం అవడం , కోరికలను జయించడం, రాగద్వేషాలను, అరిషడ్వర్గాలను

జయించడం జరిగింది. తన దృఢ నిశ్చయంతో అన్ని వికారాలను జయించి క్రమంగా ఉన్నత స్థితివైపు మెట్లు ఎక్కుతూ చివరికి పరమోన్నతమైన స్థానాన్ని అధిరోహించి దేవీపదాన్ని పొందింది. ఈ హృద్యమైన కథ ముందు వివరించబడుతుంది.

## 20. సంగ్రామ్‌ఖాన్

ముందుగా చెప్పుకున్నట్లు ప్రభుమండలి భాల్కిలో మహాదానందంగా గడిపి చిడుగుప్పకు చేరింది. ప్రభువు యొక్క రాకకు కారణమైన లింగాయత్ కులానికి చెందిన గృహస్థు చిడుగుప్పలో ఉండేవారు. ఈ గృహస్థుకి జనంలోను సర్కార్‌లోను కూడా మంచి పేరు ఉండేది. ఈయన బీదలకు సహాయం చేస్తూ జనాన్ని శాసించేవారు. ఈయన శ్రీమంతుడు. వీరి వద్ద సిపాయిలు ఉండిరి. వీరి పేరు సంగ్రామ్‌రావు ఉండెను. కానీ సిపాయిలకు అధికారిగా ఉండడం వల్ల వారిని సంగ్రామ్ ఖాన్ అని పిలిచేవారు. అందువల్ల వీరు ఈ పేరుతో ప్రసిద్ధ వ్యక్తి అయ్యారు. ఆ కాలంలో సర్కారు బందోబస్తు తక్కువ. జనమును ద్రోగు చేసుకొని అవినీతితో సంపాదించడానికి అవకాశముండేది. కాని సంగ్రామ్‌ఖాన్ అలాంటి వాడు కాదు. దుష్టుల బారి నుండి ప్రజలను రక్షించుటకు తన ప్రాబల్యం ఉపయోగించేవారు. చెడుకార్యములు ఈయన చేసేవారు కాదు. అనాథలకు, దీనులకు సహకరించేవారు. అందుకని ప్రజలకు ఈయనపై అత్యంత గౌరవం ఉండేది. కాని ఆయన దురదృష్టవశాత్తు మలేరియా జ్వరంతో శక్తిహీనులయ్యారు. అన్ని సౌఖ్యాలు ఉన్నా శారీరకంగా పీడింపబడుచుండెను. అనేక రకాలైన ఔషధాలు తీసుకున్నా తగ్గుముఖం పట్టలేదు. చివరికి ఒక మాంత్రికుడు ఇది పిశాచ బాధ ఈ బాధకి ఉపశమనంగా నిత్యం శంకరుని రుద్రాభిషేకం చేసి బీదలకు అన్న సంతర్పణ చేయమని చెబితే అలాగే మొదలుపెట్టి నిత్యం క్రమానుసారంగా శంకర ఉపాసన చేశాడు. కాని దీనివల్ల కూడా ఏ తేడా కనిపించలేదు. చివరికి శంకరుడు అతనికి స్వప్నంలో కనిపించి ఈ పీడనుండి నీవు విముక్తి పొందాలంటే మాణిక్రప్రభు చరణతీర్థం కొన్ని రోజులు తీసుకో. ఈ ఈశ్వర ఆజ్ఞపై విశ్వాసంతో మాణిక్‌ప్రభుకోసం వెతకసాగారు. తన పరివారంతో భాల్కి అరణ్యంలో ప్రభువు ఉన్నట్లుగా

తెలుసుకొని అక్కడికి బయలుదేరారు. ప్రభు సన్నిధికి వెళ్లి పూర్తి వృత్తాంతము తెలియజేయడానికి ముందే ప్రభువుకు తెలిసి, శంకరుని ఆజ్ఞ మాకు శిరోధార్యము. మీ రాక కోసమే ఇక్కడ కూర్చుని ఉన్నాము అన్నారు. ఇది విని సంగ్రామ్‌ఖాన్ ఆనందంతో తన కోరిక నిస్సంశయంగా తీరుతుందని అనుకున్నారు. ప్రభువు యొక్క సర్వోపచార పూజ చేసి ప్రభువుని చిడుగుప్ప రావలిసిందిగా విన్నవించుకోగానే ప్రభువు అతని కోరిక మన్నించి చిడుగుప్పకి బయలు దేరడానికి సిద్ధమయ్యారు. ఆ సమయంలో ప్రభువు అలంకరించిన పల్లకీలో కూర్చొని వెళ్ళేవారు. ప్రభువుకి అథితి సత్కారాలు చేసి, అపూర్వ సమారంభంతో పూజ చేశారు. పూజ అయిన తరువాత చరణతీర్థం తీసుకున్నాడు. ఆ రోజు ఆయన ఇంట్లో పెద్ద ఎత్తున భోజన సమారంభం జరిగింది. వచ్చిన బ్రాహ్మణులకు భోజనం చేయించి అందరికి రూపాయి దక్షిణగా ఇచ్చి, బ్రాహ్మణులు వండిన అన్నాన్ని తాను కూడా ప్రసాదంగా తీసుకున్నాడు. ఈ విధంగా ప్రభువు అక్కడ ఉన్నన్ని రోజులు పూజ, అన్నసంతర్పణ జరిగి సంగ్రామ్‌ఖాన్ పూర్తిగా రోగ విముక్తుడయ్యాడు. అప్పుడు అతనికి ప్రభువుపై భక్తి ఎక్కువయింది. ఇది అతని కులంలోని వారికి నచ్చలేదు. ఈ విషయమై అందరూ ఇతనిని తప్పుపట్టసాగారు. కాని అతను ఎవరినీ లెక్కచేయలేదు. ప్రభువుకూడా నీ కులం వారికి తగినట్లు నడవాలని చెప్పారు. చివరికి తనవాళ్లందరిని భోజనానికి పిలిచి వారి ఇష్ట ప్రకారంగా స్వయంపాకం చేయించాడు. తరువాత లింగాయత్ ధర్మానుసారంగా ప్రభువుకు పూజ చేయగానే అక్కడ ఉన్న అందరికీ ప్రభువుస్థానంలో బసవేశ్వరుని రూపం కనిపించింది. అప్పుడు అందరు భక్తితో ఆరతి చేసి తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. ఈ ఘటనకు గుర్తుగా ప్రభు ఆ గ్రామంలో అఖండేశ్వర మహాదేవుడిని స్థాపించారు. ఆ సమయంలో పెద్ద సమారాధన జరిగి అందరికి ఆనందం కలిగింది. శంకరుని ఆరతి ప్రభు ఈ ప్రదేశంలోనే రచించారని అంటారు. ప్రభు పూజ సమయంలో ప్రభు చేసిన బసవేశ్వరుని అష్టకము ఇక్కడ ముందుగా పాడారని చరిత్రకారులు వ్రాసారు. సంగ్రామ్‌ఖాన్ తన భూమిలో నుండి పెద్ద భాగమును ప్రభువు పేరు వ్రాసి ఇచ్చారు. ఇది ఇప్పటికీ సంస్థానము అధీనంలో ఉంది.

## 21. తీర్థాటనము

ప్రభువు కీర్తి విస్తరిస్తూ పోయింది. బెల్లానికి చీమలు ఎలా అంటుకొని ఉంటాయో అలా ప్రభుసన్నిధిలో జనసమూహము ఎప్పుడూ ఉండేది. ఈ పెరిగే జన సమూహానికి అడ్డుకట్ట వేయాలనే కారణంతో ప్రభువు దూర ప్రదేశానికి తీర్థాటనము చేయాలని నిశ్చయించుకున్నారు. తనతో పాటు ఉన్న మండలిని కళ్యాణ్‌కి పంపించి ఇద్దరు శిష్యులను మాత్రం తీసుకొని నడుచుకుంటూ దూరప్రదేశాలకు బయలుదేరారు. ఆ సమయంలో వెంట ఉన్న శిష్యుల పేర్లు ఎక్కడ కూడా వ్రాయబడలేదు. దీనివల్ల ఎవరో కొత్తవారే ఉంటారని అనిపిస్తుంది. మణిచూల పర్వతంపై ఉన్న చాళకాపురం, మైలార్ ఈ రెండు క్షేత్రాలు ప్రభువు పునీతం చేశారు. చాళకాపురంలో ప్రభు సాక్షాత్ రామదాసు మారుతిరాయుడయ్యారు. భజన, పూజ, ఆరతి హనుమంతుడిపైనే జరిగేవి. ప్రభు సహజ స్ఫూర్తితో పాడిన పదాలు, అష్టకాలు, ఆరతి కలిసి శనివారం భజన అయింది. చాళకాపురం మారుతి సామర్థ్యవర్ణన వీటిలో వివరించబడింది. మైలార్‌లో ఖండేరాయుని పూజ జరుగుతుంది. ఇక్కడ ఖండోబా యొక్క సంపూర్ణ వర్ణణ ఆదివారం భజనలో చేయడం జరిగింది. ముందు ప్రభు శంకర స్వరూపుడై ఆ స్వరూపం యొక్క భజన తయారయింది. భాల్కి నుండి ప్రభువు బయలుదేరి పర్లీ వైద్యనాథ్‌కి చేరుకున్నారు. ఇక్కడ కొన్ని రోజులు గుప్తంగా గడిపి సోమవారం భజన తయారు చేశారు. తరువాత తులజాపూర్ భవాని వద్దకు వచ్చారు. ప్రభువు భవానితో ఎలా తాదాత్మ్యం అయ్యారో మంగళవారం భజనలో సహజంగా కనిపిస్తుంది. ప్రభువు ఎంత గుప్తరూపంతో వెళ్లినా వారి తేజస్సు కప్పి ఉండేది కాదు. ప్రభువును ప్రథమంగా చూడగానే ఎవరో దివ్య శక్తిసంపన్నులైన మహాత్ముడని చూసేవాళ్లకు తెలిసేది.

చిన్నప్పటి నుండి అరణ్యంలో ఉండి ప్రకృతితో మమేకమయ్యే విద్య ప్రభువుకి అవగతమవడం వల్ల మార్గంలో ప్రభువుకి ఎప్పుడు కష్టం కలగలేదు. చలి, గాలి, ఎండా, వాన ఇలాంటి పంచభూతాల నుండి కలిగే బాధలకు భయపడలేదు. తులజాపూర్ నుండి ప్రభు మండలి పండరీపురం వెళ్లింది. ఊరి దగ్గరికి వెళ్లగానే చంద్రభాగా నది పొంగుతూ కనిపించింది. నది దాటి

అవతలికి ఎలా వెళ్లాలని శిష్యులు చింతించసాగారు. ప్రభువు నవ్వుతూ నిలబడి ఉన్నారు. ఇంతలో ఒక నావికుడు వాళ్లను పిలుస్తూ మీరు చింతించకండి మీ అందరిని నా నావలో అవతలి ఒడ్డుకు చేరుస్తాను. ఈవలి ఒడ్డున ఉండడానికి స్థలం లేదు అంటూ నావలో కూర్చోని సురక్షితంగా అందరూ ఆ తీరానికి చేరుకున్నారు. దిగిన తరువాత చూస్తే ఆ నావ లేదు నావికుడు కూడా లేడు. అందరూ ఆశ్చర్యచకితులయ్యారు.

చంద్రభాగే తీరీ జాతా। పూర్ణ ఆలీ తీ సరితా।
మగ పండరీశ్ స్వయం దత్త। మానవరూపె ఉతరోని నేయీ।

అర్థం:- చంద్రభాగా తీరానికి వెళ్లగానే నదికి వరద వస్తే పండరినాథుడే స్వయంగా దత్తుడై వచ్చి మానవ రూపం ధరించాడు. ఇలా మనోహర మాణిక్‌ప్రభు వ్రాశారు.

ఆ వైపుకి వెళ్లిన తరువాత ఇసుకతిన్నెలో భజన చేస్తూ ఐదు రోజులు నివసించిన తరువాత పండరినాథుని దర్శించుకోవడానికి, ప్రభువు ఒక్కరే ఎవరికి తెలియకుండా వెళ్లారు. మహాద్వారంలోంచి వెళ్ళే సమయంలో చండాలుని రూపంలో వెళ్లారని చరిత్రకారులు వ్రాశారు. తలకు చిరిగిన గుడ్డ పేలికతో మురికితో నిండిన శరీరం కలిగి గుడిలోనికి ప్రవేశించపోయారు. అక్కడ ఉన్న అర్చకుడు ప్రభువుని లోపలికి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. ప్రభు చొచ్చుకొని పోవడానికి ప్రయత్నిస్తే వాళ్లు కొట్టసాగారు. అంతలో పాండురంగని మెడలోని హారం ఆ చండాలుని మెడలో కన్పించింది. మరియు పాండురంగని మూర్తి గజగజ వణకింది. దాంతో పూజారి భయభీతుడయ్యాడు. ఇదేమి చమత్కారం? సమూహంలో ప్రభువుని చూసిన ఒక మనిషి అరుస్తూ చెప్పసాగారు. కళ్యాణ్‌కి చెందిన మాణిక్ ప్రభు ఈయనే అనగానే ప్రభురాక పూర్వం ప్రభువు కీర్తి విని ఉండడం వల్ల, అక్కడే ప్రభువు కనిపించగానే అందరూ ఆనంద భరితులయ్యారు. ఎవరైతే ప్రభువుని కొట్టారో ఆయన ప్రభువు కాళ్లు పట్టుకొని దండప్రాణామాలు వేశారు. తరువాత ప్రభువు పాండురంగని దర్శించుకొని ఆనందంతో కొన్ని పదాలలో ఇలా వర్ణించారు. 'కడకడోని మాణికదాస విఠ్ఠలాసి భేటలే'. ఈ కలయిక అపూర్వం. దీని వల్ల

వాతావరణం ఉల్లాసభరితమయింది. ప్రభువు ముందుగా పండరిపురంలోని గోపాలపురంలో నివసించారు. అక్కడి నుండి ప్రియమైన భక్తుల కోరిక ప్రకారంగా అనేక ప్రదేశాలలో నివసించారు. దాదా మనోహర్ బడవే అనే భక్తుడు ప్రభువును తన యింటికి భక్తితో తీసుకువెళ్లాడు. పండరిలో ఉన్నప్పుడు ప్రభువు పాండురంగని రూపంలో కన్పించేవారు. ఇక్కడ ఉన్నప్పుడు అనేక పదాలు, అష్టకాలు, ఆరతి, శేజారితి రచించి పాండురంగనికి మహాపూజ చేసేవారు. ప్రభువు కీర్తి అన్ని ఊళ్లోల్లో వ్యాపించి జనం దర్శనానికి రాసాగారు. ఈ విధంగా కొన్ని రోజులు భజనానంద క్రీడల్లో కాలం గడిచింది. సాంప్రదాయిక బుధవారం భజనలో ముఖ్యదైవము పాండురంగడై పదం, అష్టకం, ఆరతి భజనలో ప్రభు రచించడం జరిగింది.

పండరి నుండి ప్రభుమండలి పూనా మార్గంలో ఉన్న గిరినార్ పర్వతానికి వెళ్లింది. పూనాలో జంగ్లీ మహరాజ్, ప్రభువుకు ఆశ్రయం ఇచ్చారు. ప్రభువు మరియు జంగ్లీ మహరాజ్ యొక్క ఏకాంతవాసము ఎన్నో రోజులు జరిగేదని అక్కడ నివసించిన ఒక వృద్ధుడు చెప్పారు. గిరినార్ పర్వతంపై ప్రభువు కొన్ని రోజులు ఉన్నపుడు దత్తాత్రేయుని స్థానము అవడం వల్ల గురువారం భజన గిరినార్ నివాసం యొక్క స్ఫూర్తితో రచించారు. పూనా నుండి శిష్యులందరిని తిరిగి వారి నివాసాలకు పంపించి ఒక్కరే ముందుకు తీర్థాటనకు బయలుదేరారు. ఉత్తరంవైపు తీర్థయాత్ర అత్యంత కష్టతరమవడం వల్ల తనతో పాటు నడవడం ఎవరికీ సాధ్యం కాదని ఎవరికి కష్టం కలిగించకూడదని వారిని తిరిగి పంపించి ఉత్తర దిశలోని ప్రయాగ, కాశి, గయా, హరిద్వార్, గంగోత్రి, బద్రినాథ్, కేదార్‌నాథ్ మొదలైన పుణ్యక్షేత్రాలను దర్శించుకొని దక్షిణ దిక్కుగా బయలుదేరారు. దక్షిణ దిక్కున ఉన్న మాహురిక్షేత్రం, జగన్నాథపురి అయిన తరువాత దక్షిణభాగంలోని వెంకట గిరిపై వెంకటేశుని (తిరుపతి) వద్ద కొన్ని రోజులు నివసించారు. ఆ సమయంలో వెంకటేశునిపై పదాలు, అష్టకము, ఆరతి మొదలైనవి తయారై అది శుక్రవారం భజనగా రూపొందింది. ఈ విధంగా తీర్థాటనము ముగిసిన తరువాత గణగాపూర్‌కి ప్రభువు చేరుకున్నారు. నృసింహవాడి, కొల్హాపూర్, ముధోల్ సంస్థానములలో కూడా ప్రభువు నివసించారని కొందరు చరిత్రకారులు వ్రాశారు. అంటే ప్రభువు సుమారు అన్ని మహిమాన్విత క్షేత్రాలను దర్శించారు. శారీరక కష్టం సహించే శక్తి ప్రభువుకు

ఉన్నట్లు ఎవరికీ ఉండేది కాదు. గణగాపురంలో ఉన్నపుడు భక్తజన సమూహం పెరగసాగింది. ఇది చూసి ప్రభు తిరిగి కళ్యాణ్‌కి వచ్చి అక్కడ కొన్ని రోజులు ఉండాలని అనుకున్నారు. అకస్మాత్తుగా ప్రభు తిరిగి రాగానే కళ్యాణ్ గ్రామం ఆనందభరితమయింది. ఇంటివాళ్ల సంతోషం పట్టతరము కాలేదు. శిష్యులందరూ చేరుకొని పూర్వంలాగా 'నిత్యశ్రీ నిత్యమంగళం' మొదలయింది. ప్రభు తీర్థాటనము వెళ్లినపుడు ఇంటి యోగక్షేమాలు యోగ్యంగా ఉండేవి. చిదంబరరావు తాలూకుదారు యొక్క పిలుపు మేరకు తాత్యాసాహెబ్ హైదరాబాద్‌కి వెళ్లి ఉండిరి. ఆయనకు బహుమానంగా చాలా ధనం లభించింది. ప్రభు పరంపరానుసారంగా తాత్యాసాహెబ్ ఔదార్యంగా వ్యవహరించేవారు. తాత్యాసాహెబ్‌కి పార్సీ, సంస్కృత విద్యలో పాండిత్యము, వేదాంత విద్యపై అభిలాష ఉండేది. గురుగీతపై జ్ఞానశిఖ అనే పేరుగల గ్రంథము వ్రాశారు. ఇది ముద్రించడం కూడా జరిగింది. 'అనిర్వాచ్య' అనే పేరుగల గ్రంథము స్వతంత్ర వేదాంతంపై వ్రాయబడింది. సంప్రదాయిక భజన యొక్క పరంపరను వీరు ప్రారంభించారు. వీటిలో తాత్యాసాహెబ్ వ్రాసిన పదాలు కూడా ఉన్నాయి. తన విద్వత్ తో, వ్యవహార చాతుర్యంతో జనంలో ఆదరణీయులయ్యారు. దాదాసాహెబ్ మౌని, తపస్వి అందువల్ల ఇంటి బాధ్యత తాత్యాసాహెబ్‌కి అప్పజెప్పారు. ఆయన ఎలాంటి విషయాలు పట్టించుకునేవారు కాదు. శిష్య మండలికి ఏదైతే సాధనా మార్గాన్ని ప్రభువు చూపించారో దాన్ని భక్తితో పాటించి వృద్ధి చేశారు. ఆ సమయానికి వెంకవ్మ యొక్క సమాధియోగము కూడా చివరి దశకు చేరుకుంది.

తన ఇంట్లో అన్ని వ్యవహారాలు సక్రమంగా జరుగుతుండడంతో ప్రభువుకి సంతోషం కలిగింది. శిష్యబృందానికి ఏదైనా సాంప్రదాయిక పద్ధతి నేర్పించాలని ప్రభువు ఆలోచించేవారు. దానికి ఒక స్వరూపం ఇవ్వడానికి అనుకూలమైన సమయం కళ్యాణ్‌లో కలిసి వచ్చింది. ఒక రోజు మంచంపై ప్రభువు పడుకొని ఆత్మానందంలో లీనమై ఉన్న సమయంలో తాత్యాసాహెబ్ మనసులో ప్రభు బిరుదావళి రూపొందింది. తరువాత అది వ్రాసుకొని ప్రభుదర్శనార్థం వచ్చిన శాస్త్రపండితులకు చూపించారు. అందరికీ అది నచ్చి ప్రభువుకి అర్పణ చేశారు. కళ్యాణ్‌లో గాదీ స్థాపన చేసినపుడు ఈ బిరుదావళి గద్గదించిన స్వరంతో ఉల్లాసంగా స్తుతించారు. తాత్యామహరాజ్ తన దేహాన్ని మరిచి మనసులో ప్రభువుతో తాదాత్మ్యం చెందారు. ఆ స్థాపన సమయంలో

దేవతలు వచ్చి ప్రభువును బిరుదావళితో జయజయ ధ్వానాలు చేశారు. ఈ విషయం తాత్యాసాహెబ్ అంతఃకరణలో తిరగసాగింది. ఈ బిరుదావళి (భక్తకార్య కల్పద్రుమ) మాణిక్‌నగర్‌లో గాది స్థాపించిన తరువాత మొదలుపెట్టబడిందని అంటారు. కొన్ని రోజులు కళ్యాణ్‌లో నివసించిన తరువాత మణిచూల పర్వతంపై మిగిలిన స్థలాలను సందర్శించాలని ప్రభువు శిష్యులను వెంటబెట్టుకొని గొట్టంగొట్టి అరణ్యానికి వెళ్లారు. కరకనళ్ళిలో ఉన్న బక్క ప్రభువు సమాధికి పూజ చేసి ఆరతి, అష్టకం, పదాలు రచించారు. అక్కడ జన సముదాయం కూడా ఎక్కువగా ఉండేది. తొందరలో యుద్ధం జరగడానికి అవకాశం ఉందన్న వార్త వ్యాపించింది. అందరికి చింత మొదలయింది. ఆ యుద్ధ ప్రభావం మనపైవు రావచ్చని ప్రభువు భక్తులకు ధైర్యం ఇవ్వడానికి నటకాలు (యోగదండములు) తయారు చేయాలని ఆజ్ఞాపించారు. ఆజ్ఞ ప్రకారంగా యోగదండములు తయారయ్యాయి. ప్రభు చేతితో యోగదండము దొరికిందంటే సర్వ ఆపదలు దూరమవుతాయని భక్తులకు నమ్మకంగా ఉండేది. నటకా తీసుకొని పూజగదిలో పెట్టి పూజ చేయడం వలన సర్వారిష్టాలు దూరమై సౌఖ్యం లభిస్తుందని భక్తులకు నమ్మకం కలగడం వల్ల అడిగిన వాళ్ళందరికి నటకా ప్రసాదంగా ఇచ్చేవారు. సాధారణంగా అవి దొరికేవి కావు. ప్రభువు తన సామర్థ్యంతోనే ఇచ్చేవారు. అప్పుడు వారి సామర్థ్యంతో తయారయిన వేల యోగదండములు ఇప్పటికీ సంస్థానములో ఉన్నాయి. వాటిని గదిలో ఉంచి పూజింపబడుతున్నాయి. ప్రభు కరస్పర్శ తగిలిన యోగదండములు అవడం వల్ల వాటిలో సర్వ సంకటాలు దూరం చేసే సామర్థ్యం ఉందని భక్తుల భావన. కరకనళ్ళిలో కొన్ని రోజులు ఉన్న తరువాత ప్రభు రేకుళిగి వచ్చారు. గోపాల్ బువా బ్రహ్మచారి ఇక్కడే ప్రభువును కలిశారు. గోపాల్‌బువా తండ్రి బక్క ప్రభువు భక్తుడు. బక్క ప్రభువు వద్ద ఉన్న విశ్వాస పాత్రమైన రెండు కుక్కలు తనకు పుత్రులై పుట్టారని ఆయన నమ్మకం. ప్రభువే బక్క ప్రభు అవతారమని ఆయన భావన. అందుకని గోపాల్‌బువాను ప్రభువుతో శిష్యునిగా పంపించాడు. గోపాల్‌బువా దృఢకాయుడై యవ్వనంలో ఉండెను. జీవిత కాలమంతా బ్రహ్మచారిగానే ఉండెను. ఈయన వంశము ఇప్పుడు రేకుళిగిలో ఉంది. వీరికి ప్రభు భక్తి ఎక్కువ. తరువాత అన్ని పర్యటనలలో గోపాలుబువా ప్రభువుతో ఉండేవారు. ఆయన శక్తి అపారము. ఒక సారి ప్రభువుని వీపుపై ఎక్కించుకోని సుమారు ఐదు కోసులు నడిచారని చెపుతారు.

## 22. కేతకి సంగము

రేకులిగి నుండి ప్రభు కేతకి సంగమునకు వచ్చారు. ఇది ఒక ప్రాచీన క్షేత్రము. ఇక్కడ శంకరుని లింగము ఉంది. శంకరునికి మొగిలి పువ్వుతో పూజించడం నిషిద్ధం. కాని ఇక్కడ దానితోనే పూజించబడుతుంది. కేతకి అంటే మొగిలి పువ్వు. ఆ పువ్వుకి శంకరుని పూజకు స్థానం లభించిన కథ ఇలా ఉంది. ప్రభువు ఇక్కడికి వచ్చినపుడు అశ్వత్థ వృక్షము కింద లింగము ఆకులతో కప్పబడింది. దానిని ప్రభువు బయటికి తీశారు. పూర్తి కప్పబడిన లింగము ప్రభువుకి ఎలా కనిపించిందో ఎవరికి అర్థం కాలేదు. అప్పుడు ప్రభువు మొగిలి (కేతకి) పూలను తీసుకుర్మ్మని చెప్పారు. ఆ కాలం కేతకిపూలు పుష్పించే ఋతువు కాదని ఎక్కడా దొరకదని చెప్పారు. అవి లేకపోతే పూజ జరగడం అశ్యమవడం వల్ల వాటి గురించి తీవ్రంగా ప్రయత్నం చేశారు. అందరికి చింత కలుగసాగింది. అంతలోనే ఒక లింగాయతు తలపై ఒక మూటతో వచ్చి ప్రభువు ముందు కేతకి పుష్పాలను గుమ్మరించడం జరిగింది. అప్పుడు ప్రభువు ఆయనను సన్మానించి పంపివేశారు. తను ఎవరో ఎక్కడి నుండి వచ్చారో అడగాలని ఆయన వెనక వెళ్లితే ఆయన అదృశ్యమయ్యారు. ఇది అందరికి ఆశ్చర్యంగా అనిపించింది. ప్రభువు సంగములో నివసించి దేవాలయ కుండం బాగు చేయించారు. ప్రభు ఇక్కడ నివసించడం వల్ల ఆ క్షేత్రం నందనవనంలాగా శోభించింది. జన సమూహంతో నిండి ప్రభు యొక్క జయజయ ధ్వానాలు మిన్నంటాయి. ఈ విధంగా ప్రభువు లీలలు సంగములో జరుగుతుండగా, కాశీక్షేత్రంలో ఒక బ్రహ్మచారి తన గురువుకి వచ్చిన కుష్టు రోగం నివారించాలని అనేక ఉపాయాలు చేసినా ఆ వ్యాధి నయంకాలేదని చింతామగ్నుడై ఉంటే కాశీ విశ్వనాథుడు స్వప్నంలో కనిపించి "కేతకిసంగములో నా అవతారం మాణిక్ ప్రభువు రూపంలో ఉన్నారు. అక్కడికి వెళ్లి సేవచేసి తీర్థ ప్రసాదాలు తీసుకుంటే రోగనివారణ అవుతుంది" అని చెప్పారు. విశ్వేశ్వరునిపై నమ్మకంతో సంగమునకు చేరుకున్నాడు. ప్రభు దర్శనం చేసుకోగానే నమ్మకం కలుగలేదు. ఆయన ఎవరో పిచ్చివాడుగా అనిపించాడు. ఇతరులు ప్రభు యొక్క గుణవర్ణన చేసినా కూడా నమ్మకం కలుగక నిందించడం ప్రారంభించాడు. ఆ విధంగా ఇరవై రోజులు గడిచిన తరువాత ఒక రోజు ఎప్పటిలాగే ఈశ్వరుని పూజ చేస్తున్నాడు. అతనికి శంకరుని స్థానంలో ప్రభు స్వరూపం కనిపించింది. అయినా నమ్మకం కలుగక ప్రభువంటి పిచ్చివాడు తన

గురువు వ్యాధి ఎలా నయం చేస్తాడు అని సంశయించినపుడు సంగమేశ్వరుని రూపం ఉగ్రమై ''మూర్ఖా ఇలా సంశయగ్రస్తుడవైతే నీ గురువు వ్యాధి నయం కాకపోగా తిరిగి నీ ప్రాణాలు పోతాయి.'' అని వినిపించగానే పశ్చాత్తాపంతో ఏడవసాగాడు. పూజారి ఇది విని ఆయనను సమాధాన పరిచి అయిందేదో అయింది. ప్రభువును శరణు వేడుకొని అపరాధాన్ని మన్నించమని ప్రార్థించుకోమన్నాడు. ఆ ప్రార్థన విని ప్రభువు ''మాలాంటి పిచ్చివాళ్లతో వ్యాధి ఎలా నయమవుతుంది అన్నారు.'' ఇది వినగానే ఇంకా ఏడుస్తూ ప్రభువు కాళ్లు పట్టుకొని క్షమించమని వేడుకున్నాడు. ప్రభువు క్షమించక పోతే ప్రాణత్యాగం చేస్తానన్నాడు. ఇది విని ప్రభువుకి దయకలిగి క్షమించి అతనికి తీర్థప్రసాదాలు ఇచ్చారు. ఏ రోజైతే బ్రహ్మచారికి ప్రసాదం దొరికిందో ఆ రోజే కాశీ క్షేత్రంలో అతని గురువుకి వ్యాధి నయమయిందని ఉత్తరము వచ్చింది. కొన్ని రోజులు ఆ బ్రహ్మచారి ప్రభుసేవ చేసి తిరిగి కాశీక్షేత్రానికి వెళ్లిపోయాడు.

ప్రభువు సంగమేశ్వర్‌లో ఉన్నప్పుడు మిర్జా హసన్‌బేగ్ అనే ముస్లీం ప్రభువద్దకు వచ్చాడు. ప్రభు దర్శనం అవగానే ప్రభుపై గురికుదిరి ప్రభు భక్తుడయ్యాడు. ప్రభువుకి వస్త్రాలను సమర్పించి ప్రేమతో పూజ చేశారు. ఆయన భక్తికి సంతుష్టుడై తీర్థప్రసాదం ఇచ్చి ''ముందు ముందు అధికారము పెరిగి నీకు జీవితంలో సుఖప్రాప్తి కలుగుతుంది'' అన్నారు. అన్నట్లుగానే ఆయనకు ప్రమోషన్ దొరికి మంచి స్థితిలో ఉండిరి. తరువాత ఆయన ఆమరణాంతం ప్రభుసేవ చేశాడు. తన సంపాదనలో నాలుగో భాగం ప్రతి సంవత్సరం ప్రభువుకి సమర్పించేవాడు. సాంబశాస్త్రి సోమయాజితో మిగతా మండలి ప్రభువు గాది స్థాపించవలసిందిగా కోరినందున ప్రభువు గాది స్థాపన చేశారు. అప్పటి నుండి గాది పూజ జరుగుతూ జోలీ తిరుగుతుంది. ఇక్కడికి న్యాల్‌కల్‌కు చెందిన అన్నారావ్ దేశ్‌ముఖ్ ప్రభు దర్శనానికి వచ్చారు. ఆయన దేశ్‌ముఖ్ హోదా కలిగి ఉండేవారు. ప్రభువును న్యాల్‌కల్‌కు ఆహ్వానించడానికి ఈయన తనతో పాటు మేనా, పల్లకి, గుర్రాలు, ఏనుగులు తీసుకొని వచ్చారు. అది చూసి ప్రభువు మేము గోసాయిలము, మాకు ఈ ఆడంబరమంతా ఎందుకు? అన్నారు. కానీ, ఆయన మళ్ళీ విన్నవించుకోగానే పల్లకీలో కూర్చుని బయలుదేరారు. పెద్ద ఊరేగింపుతో తమ ఊరికి తీసుకొని వెళ్లి ప్రేమతో పూజ చేశారు. ఈ న్యాల్‌కల్ దేశ్‌ముఖ్ ఇంటి వాళ్లు ప్రభు భక్తులయ్యారు. వాళ్లవంశస్థులు ఇప్పటికీ ప్రతి సంవత్సరం మాణిక్‌నగర్‌కి వచ్చి సేవ చేస్తూ ఉంటారు.

## 23. ఝరణీ నృసింహ క్షేత్రము

ప్రభు మండలి న్యాల్‌కల్‌కి వచ్చిందని బీదర్ ప్రజలకు తెలియగానే ఉత్కంఠతతో ఉన్న హిందూ ముస్లీం ఇంకా అనేక ధర్మాల ప్రజలు ప్రభు దర్శనం చేసుకోవాలనుకున్నారు. అందుకని ప్రభువును బీదర్‌కు తీసుకురావాలని ఆలోచించి స్వాగత సత్కారాలు తయారు చేసి ప్రభువుని న్యాల్‌కల్ నుండి బీదర్‌కి తీసుకువెళ్లారు. అప్పుడు బీదర్‌లో చాలా మంది శ్రీమంతులు ఉండేవారు. దేశ్‌ముఖ్, సర్‌దేశ్‌ముఖ్, అనేక జాగీర్‌దార్లు, నవాబ్‌లు పీర్‌జాదేలు ప్రభువు పాదధూళి తమ నగరంలో పడాలని అనుకునేవారు. బీదర్ నగర ఇతిహాసం ప్రసిద్ధమైనది. ఒక కాలంలో ఇది నవాబ్ బాద్‌షాల ప్రముఖ రాజధాని నగరంగా ఉండేది. ప్రజలు ధార్మికంగా ఉండేవారు. బీదర్‌ను పూర్వకాలంలో విదురనగరము అనేవారు. మణిచూల పర్వతంపై ఇది ప్రముఖ నగరం. బీదర్‌కోట చూడదగ్గ ప్రదేశం. బీజాపూర్ కోటలో ఉన్నటువంటి చిన్న ఫిరంగీ బీదర్ కోటలో ఇప్పటికీ కనిపిస్తుంది.

నిజాం నవాబులు రాజ్యం చేయడం వల్ల బీదర్ జిల్లా అయింది. పూర్వవైభవం పూర్తిగా నశించడం వల్ల ఇప్పుడు దీన స్థితికి చేరుకుంది. కోటలాగే ఇతర కట్టడాలు కూడా పాడుబడి కనిపిస్తాయి. ఆ సమయంలో బీదర్ ప్రజలు ఇప్పటికంటే సంపన్నులై ధర్మపరాయణులై ఉండేవారు. ప్రభువుపై అందరికీ భక్తి ఉండేది. సజ్జనులతోపాటు దుర్జనులు కూడా ఈ ప్రదేశంలో ఉండేవారు. దుర్జనుల దుష్టప్రవర్తనను రూపుమాపే ఆలోచనతో ప్రభువు మనస్సులో బీదర్‌కి వెళ్లాలని ఉండేది. ఇంతలోనే సన్మాన పూర్వకంగా తీసుకు వెళ్తామని వాళ్లు రాగానే, వాళ్ల విన్నపాన్ని మన్నించి వారితో వెళ్లడానికి అంగీకరించారు.

న్యాల్‌కల్ నుండి మండలి బయలుదేరిన తరువాత మధ్యలో ఉన్న గ్రామాల్లో ప్రజల విన్నతి ప్రకారం విశ్రాంతి తీసుకుంటూ మండలి బీదర్ వైపు బయలు దేరింది. మేనాతో పాటు ఏనుగులు, గుర్రాలు మరియు సిపాయిలు ఉండేవారు. త్రోవలో ప్రభువు యొక్క జయజయ ధ్వానాలతో మండలి బీదర్‌కు మూడు మైళ్ల దూరానికి వచ్చింది. అక్కడి నుండి బీదర్

వైపు వెళ్లకుండా బోయిల కాళ్లు వారి ప్రమేయం లేకుండా వేరొక వైపుకు తీసుకువెళ్లాయి. ఏదైనా అదృశ్య శక్తి తమను వేరొక మార్గానికి తీసుకువెళ్తుందేమోనని బోయీలకు అనిపించింది. ఇంతలో మార్గానికి అడ్డంగా ఒక పెద్ద పాము పడి ఉండడం చూసి బోయీలు భయపడిపోయారు. వాళ్ల అడుగు ముందుకు పడలేదు. అది చూసి శిష్యులు విషయం ప్రభువుకి తెలియజేశారు. ప్రభువు ఆ భుజంగం వైపు చూసినప్పుడు ఆ భుజంగం పడగవిప్పి నిలబడి ఉంది. ప్రభువు దాని వైపు చూడగానే పడగ కిందికి వంచి ముందు నడవడం ప్రారంభించింది. శిష్యులకు భయపడవద్దని చెప్పి ఈ సర్పము ఎవరికీ ఆపద కలిగించడానికి రాలేదు. మీరు ఎవరూ దాని దారికి వెళ్లొద్దు. మీరు ఆ పాము చూపించిన దారిలోనే మేనాను తీసుకు వెళ్లండి అని ప్రభువు అన్నారు. అంతేకాక బీదర్ వెళ్లడానికి పూర్వం వారి వద్దకు తాము రావాలని ఎవరైనా సిద్ధ పురుషుడు సర్పం రూపంలో వచ్చి పిలుస్తున్నారా అనుకొని మనం ఆ దారిలోనే వెళ్దాం అని ప్రభువు అనగానే, అందరూ ధైర్యంతో మేనాతో పాటు నడుస్తుండగా, పల్లకి ఝురణీ నృసింహ క్షేత్రం వద్దకు రాగానే ఆ సర్పం మాయమయిపోయింది. అప్పుడు ప్రభువు ఝుర్ణీ వద్ద కొన్ని రోజులు ఉండాలని నిశ్చయించుకున్నారు. ఈ స్థానం ప్రేక్షణీయ స్థలం. ఇక్కడ నృ సింహస్వామి మూర్తి ఉంది. ఇది చీకటి గుహలో ఉంటుంది. గుహ ఒక ఫర్లాంగు దూరం ఉంటుంది. గుహ మార్గం సరళంగా లేదు. లోపల దీపం లేకపోతే చీకటిమయంగా ఉంటుంది. గుహలో నుండి ఎప్పటికీ నీరు బయటకు ప్రవహిస్తూ ఉంటుంది. నడుము వరకు నీరు అన్నికాలాల్లో ఉంటుంది. దేవుని వద్దకు నడుములోతు నీళ్లలో వెళ్లాల్సివస్తుంది. దేవుని వద్దకు వెళ్లగానే మెట్లు ఉన్నాయి. కూర్చోవడానికి వీలుగా కొంత స్థలం ఉంటుంది. ఎడమ కుడి దిక్కుల రెండు కమాన్‌లు ఉన్నాయి. ముందు కమాన్‌లో నృసింహ మూర్తి దాని ముందు నంది ఉంది. కొత్తవాళ్లు వెళ్తే ముందు భయపడుతారు. లోపలికి వెళ్ళి మూర్తిని చూడగానే నిర్భయులవుతారు. గుహ నుండి ఏదైతే జల ప్రవాహం ఉందో అది నృసింహుని చరణాల నుండి ప్రవహిస్తుందని అంటారు. ఈ స్థానము పవిత్రమైనది అవడం వల్ల ఎలాంటి అనుష్ఠానము అయినా వెంటనే సఫలం అవుతుందని ప్రజల నమ్మకం. ఈ పవిత్ర స్థలం యొక్క మహత్యం తెలుసుకొని ఔరంగజేబు ఈ స్థలాన్ని ధ్వంసం చేయలేకపోయాడని అంటారు. ఇక్కడ పక్కన మసీదు మాత్రం కట్టించాడని అంటారు. చుట్టుపక్కల చిన్న

చిన్న దేవాలయాలు ఉన్నాయి. రకరకాల చెట్లతో ఈ స్థలానికి విలక్షణ శోభతో పాటు నీరు పుష్కలంగా ఉంది. తపస్సుకు అనుకూల ప్రదేశం అవడం వల్ల ఎవరికైనా ప్రశాంతంగా అనిపిస్తుంది. ఈ ప్రసిద్ధ క్షేత్రంలో ప్రభువు పూర్వీకులైన కేశవ నాయకులు అనుష్టానము చేయడం వల్ల నృసింహుని కృపా ప్రసాదంగా పుత్రుడు జన్మించాడని ఆ బాలుని పేరు నృసింహా అని పెట్టారని అంటారు. బీదర్‌కి దగ్గరలోని ఝురణిలో ప్రభు ఉన్నారని బీదర్ లోని జనులందరికి తెలిసింది. వస్తారని ఆశతో ఉన్నవాళ్లకి నిరాశ కలిగింది. బీదర్‌లోని వాళ్లంతా ప్రభుదర్శనానికి ఝురణీకి రాసాగారు. ప్రభు దర్శనానికి పెద్ద క్యూ ఏర్పడింది. ప్రభు మెడలో వేల పూల దండలు వేశారు. పేడ, కొబ్బరికాయలు, చెక్కెర, వక్కలు కుప్పలుగా పడ్డాయి. ప్రభువు దర్శనమిచ్చి, మధరమైన మాటలతో జనాన్ని సంతుష్టులను చేశారు. తరువాత వారు స్నానం చేసి నృసింహుని దర్శనానికి బయలుదేరారు. పూజ, ఆరతి అయిన తరువాత అందరికి భోజన ప్రసాదం దొరికింది. ఈ చిన్న సుందరక్షేత్రం పూర్వం నిర్జనంగా ఉండేది. ప్రభు వచ్చిన రోజు నుండి ఆ ప్రదేశం జనంతో నిండి శోభాయమానమై రమణీయ స్థలం అయింది. రాజ దర్బారు స్వరూపం తో ఇక్కడ కథలు, కీర్తనలు, భజనలు, శాస్త్రచర్చ, వేదపఠనం మరియు నృత్యగానాలతో ఆ ప్రదేశం విలసిల్లింది. పూర్వం లాగా జనసమూహంతో నిండి ఆ ప్రదేశం నిత్యశ్రీ నిత్య మంగళం అయింది. చుట్టు పక్కల గ్రామాల నుండి ఆబాల గోపాలం ప్రభుదర్శనానికి నిత్యం వచ్చేవారు. బీదర్ ప్రజలు ఎక్కువ కాలం ఝురణీలో ఉండసాగారు. కాని ప్రభు తమ ఇంట్లో కాలు పెట్టి పావనం చేయాలని బీదర్ ప్రజల్లో తీవ్రమైన ఆశ ఉండేది. అందుకని అందరూ ప్రభువుతో తమ ఇంటికి వచ్చి పాదధూళితో పావనం చేయాలని విన్నవించుకున్నారు. వాళ్ల ప్రేమ తెలుసుకొని పిలిచినవారందరిళ్ళకు రేపు మధ్యాహ్నం వస్తాను, పూజ స్వీకరిస్తాను అన్నారు. అన్ని మతాల, జాతుల ప్రజలు తమ ఇంటికి రావాలని విన్నవించుకున్నారు. అప్పుడు ప్రభువు ఆత్మానందంతో అందరి ఆహ్వానాన్ని స్వీకరించి వస్తానని చెప్పారు. ప్రభువును పిలిచిన ప్రతి ఒక్కరు పూజకు తయారీ చేసుకొని ప్రభు ఆగమనాన్ని నిరీక్షిస్తూ ఉండిపోయారు.

ఇక్కడ ఝురణీలో ప్రభువు శిష్యమండలి ప్రభు వస్తానని చెప్పారని బీదర్ బయలుదేరడానికి ఏర్పాట్లు చేశారు. బోయిలు పల్లకి తీసుకు వెళ్లడానికి

సిద్ధమయ్యారు. చిమన్యా బ్రహ్మచారి, గోపాల్‌బువా అందరికి బీదర్‌కి వెళ్లాలసి ఉందని చెప్పడం వల్ల అందరు వెళ్లడానికి ఆతృత కనబరిచారు. కాని ప్రభు తన మంచంపై గాఢ నిద్రలో ఉండిపోయారు. ఎవరికి లేపడానికి ధైర్యం చాలలేదు. మధ్యాహ్నం అయిపోతుందని శిష్యులు చింతిస్తూ కూర్చున్నారు. బీదర్ ప్రజలకు మాట ఇచ్చినట్లుగా ప్రభు వెళ్లక పోతే ప్రభు కీర్తికి మచ్చ అవుతుందని అందరూ భయపడ్డారు. వెంకమ్మ ప్రభువుకి కొద్ది దూరంలో శాంత చిత్తంతో జపం చేస్తూ కూర్చుని ఉంది. మధ్యాహ్నం అయింది. ప్రభు నిద్రలోఉన్నారు. ఈ సమయంలో ప్రభువు ఎందుకు నిద్రించారో ఎవరికీ అర్థం కాలేదు. ప్రభు యొక్క నిద్ర ఒక్క క్షణం ఒక యుగంలాగా శిష్యులకు అనిపించింది. కాని ఏం చేస్తారు?

ఇక్కడ బీదర్‌లో ప్రతి ఒక్కరి ఇంట్లో అపూర్వ ఉత్సవం జరిగింది. ప్రభువు ప్రతి ఒక్కరి ఇంట్లో ఒకేసారి ఒకే సమయంలో మధ్యాహ్నం 'దత్త' అంటూ నిలుచున్నారు. ప్రభుతో పాటు ఒకరిద్దరు శిష్యులు కూడా ఉన్నారు. అంతా నిజం. పూజ జరిగింది, ఆరతి జరిగింది. ప్రభు మెడలో పూలహారాలు వేశారు. ప్రభు పేడ,ఫలాలు తింటున్నారు. భోజనాలు, తాంబూల దక్షిణలు నడుస్తున్నాయి. గానము, నాట్యం, ఆనందంతో భజనలు జరుగుతున్నాయి. శాస్త్రచర్చ, వేదపఠనం ఇలా ఆనందోత్సవాలు బీదర్ జనుల ఇళ్లలో జరుగుతున్నాయి. బీదర్ జనులు ప్రభు ఆగమనంతో హర్షితులయ్యారు. ఈ విధంగా ఆహ్వానించిన ప్రతి ఒక్కరి ఇంట్లో ఉపచారాలు చేయించుకొని వారు తమ విశ్వరూపాన్ని చూపించారు. అది చూసి ప్రజలు ఆనందంలో మునిగిపోయారు. చివరికి ప్రభు అందరికి ప్రసాదం ఇచ్చి అక్కడి నుండి నిష్క్రమించారు.

ఇక్కడ ఝరణీలో ప్రభు గాఢ నిద్రనుండి లేచారు. అప్పుడు ప్రభు శరీరం చమటతో తడిసి శ్రమించినట్లుగా శ్వాస తీసుకుంటూ కనిపించారు. ఇలా ఎందుకు జరిగిందో ఎవరికీ తెలియలేదు. శిష్యులు తొందరతొందరగా చెమట తుడిచిన తరువాత వెంకమ్మ వినయపూర్వకంగా "ప్రభు మీకు ఇలా ఎందువల్ల జరిగింది? అని అడిగింది. కానీ, ప్రభువు సమాధానం చెప్పలేదు. తరువాత బీదర్ ప్రజలు తమ ఇళ్ళ వద్దకు ప్రభువు వచ్చినట్లుగా ఒకరికొకరు

చెప్పుకున్నారు. అందరివద్దకు రెండు గంటలకు అసదీ ఒకే సమాయానికి ఎలా ఉన్నారో అర్థం కాక ప్రభువునే అడగాలని ప్రభువు వద్దకు బయలు దేరారు. అక్కడికి వచ్చిన ప్రజలకు ప్రభువు మంచంపై పడుకొని కనపడ్డారు. శిష్యులకు, బీదర్ ప్రజలు ప్రభువు అందరి వద్దకు ఒకే సమయంలో వచ్చిన విషయం చెప్పగానే, శిష్యులకు ఆశ్చర్యం అనిపించి చెమట పట్టిన విషయం అర్థం అయింది. ఈ అద్భుత చమత్కారం చూసి బీదర్ పట్టణం విస్తుపోయింది.

ప్రభువు బీదర్ వాస్తవ్యులకు విశ్వరూప దర్శనం ఇచ్చారు. దాంతో ప్రభువు యొక్క యోగమహిమ తెలుసుకొని అందరూ ఆశ్చర్యపడ్డారు.

## 24. బీదర్ యొక్క యవనులు (ముస్లింలు)

ప్రభువు యొక్క అద్భుతలీల చూసి బీదర్ నివాసులకు ప్రభువుపై శ్రద్ధ, భక్తి రెట్టింపయింది. శ్రద్ధ ఉన్న ముసల్మాను భక్తులు ఎవరు ప్రభువు అలౌకిక సామర్థ్యాన్ని చవిచూశారో వారు భక్తితో రోజూ ఝరణికి వచ్చేవారు. వాళ్లందరికి భక్తి విశ్వాసాలు పెరిగాయి. తక్కువ తరగతికి చెందిన ముస్లింలకు ప్రభు కీర్తి పెరగడం నచ్చలేదు. తమ జాతి వాళ్లు ప్రభువును ఇంతగా పూజ్యనీయులుగా భావించడం చూసి ఎలాగైనా ప్రభువును అవమానించాలని ఉపాయం ఆలోచించారు. ప్రభువు యొక్క సామర్థ్యం వాళ్లకు తెలుసు కాని ఇంతకన్నా ఎక్కువ అద్భుతశక్తిని చూపించగలరేమో పరీక్షించాలని, ఏదైనా మహిమను చూపిస్తేనే ప్రభువును సాధువుగా ముస్లీం వాళ్లు నమ్ముతారని ఆలోచించి అందరూ ప్రభువు దగ్గరికి వచ్చారు. అంతరంగంలో కపటం ఉంచుకొని పైన వినయంతో ఇతర మతాల వాళ్లను ఎలా పావనం చేశారో అలాగే తమ ఇంటికి వచ్చి పూజ స్వీకరించాలని చెప్పారు. ప్రభువుకు వాళ్ల ఆలోచన తెలుసు. కానీ, ఆనందంతో మీరు చెప్పినట్లు మీ యింటికి వచ్చి మీ సేవ స్వీకరించడానికి వస్తానని చెప్పారు. ప్రభువు ఇలా మాట ఇవ్వగానే అందరు తమ ఇళ్లకు వెళ్లి ప్రభు సత్కారానికి తయారీ ప్రారంభించారు. మరుసటి రోజు అనుకున్నట్లుగా తన శిష్యులతో కలిసి ప్రభువుని సన్మానంతో స్వాగతించి తీసుకొని వెళ్లి ఒక సింహాసనంపై కూర్చొపెట్టారు. అక్కడ ఊరిలో ఉన్న ముస్లింలందరూ

పోయ్యారు. అందరూ ప్రభుమెడలో పూలదండలువేసి చేతులలో తమకు తొచింది పెడుతూ నమస్కరించి వెళ్తున్నారు. చివరికి పళ్ళాలలో మాసంతో చేసిన పదార్థాలను కావాలనే రుమాళ్ళు మూసి ప్రభువు ముందు, వారు ముందే అనుకున్నట్లుగా అన్ని తెచ్చి సిద్ధం చేసి ఉంచారు. ప్రభువును తినమని చెపుతూ, హిందువులు ముస్లింలు ప్రభువుకి ఒకటే. అందుకని వారి పదార్థాలు కూడా ప్రభువు తినాలని వాళ్ల కోరిక. ప్రభువు ఈ మాంసం పదార్థాలు తింటే అనాయాసంగా తమ కోరిక తీరుతుంది. ఎలా అంటే తింటే ప్రభు కులం భ్రష్టమై వారి కులంలో కలుస్తారని. తినకపోతే అపరాధ భావనతో వారి కులం వాళ్ల శ్రద్ధ ప్రభువుపై తగ్గిపోతుందని అనుకున్నారు. కాని అందరు ముస్లింలలో ఈ భావన లేదు. వాళ్లలో కొందరికి ఇది ఇష్టం లేదు, కాని ఏమి చేయలేక మౌనంగా ఉండి పోయారు.

ప్రభువుకి వాళ్ల కపటం తెలుసు. అయినా స్మితహాసంతో తన శిష్యుడైన చిమన్యాకు పళ్ళాలపై మూసిన రుమాళ్ళు తొలగించమని ఆజ్ఞాపించారు. అందరూ శిష్యులు భయపడి పోయారు. వాళ్ళు కపటంతో వ్యవహరిస్తే ఏమి చేస్తారు? చిమన్యా భయంతో పళ్లెంపై నుండి రుమాళ్ళు తీస్తుండగా ఒక అద్భుతం జరిగింది. అది ఏమిటంటే ఆ పళ్ళాలలోని మాంస పదార్థాలు కనిపించలేదు. వాటిలో పువ్వులు, కజ్జురిపళ్లు మొదలైనవి చూడగానే శిష్యులకు, సజ్జనులైన ముస్లింలకు ఆనందం కలిగింది. ప్రభు అది ప్రసాదంగా అందరికి పంచమని చెప్పారు. దాంతో కపట ముస్లింలకు గర్వభంగం అయింది. ప్రభువులో దైవసామర్థ్యం ఉందని వాళ్లకు అర్థమై అందరూ ప్రభువును శరణు వేడుకొన్నారు. ప్రభువు దయతో వారిని క్షమించి భగవంతుని శక్తి పరీక్ష ఇలా చేయరాదని మధురమైన వాక్కులతో ఉపదేశించారు. ప్రభువు యొక్క దైవసామర్థ్యం మనస్సు యొక్క ఉదారస్వభావం చూసి ముస్లిందరూ ప్రభువుపై పుష్పవృష్టి కురిపించి "పీరానె పీర్ దస్తగీర్" అనే బిరుదుతో సత్కరించి ఊరేగించారు. వాళ్లంతా ప్రభు భక్తులయ్యారు. బీదర్‌లో ప్రభుగాదీ ముస్లింలు నివసించే ప్రాంతంలో ఉంది. అందుకు కారణం ప్రభువుకి ముస్లింలపై ఉన్న ప్రేమ కావచ్చు. తరువాత ప్రభు బీదర్‌లో కొంతకాలం నివసించడం వల్ల ఆ సమయంలో అక్కడ ఆనందం తాండవించింది. రామచంద్ర బువా సోలాపూర్ కర్‌గారు బీదర్‌లో జరిగిన చమత్కారకథను ఇంకోరకంగా వర్ణించారు.

"ప్రభువు యొక్క సామర్థ్యం చూసి అందరూ చకితులై ఆ విషయం హైదరాబాద్ ప్రాంతంలో కూడా వ్యాపించి అందరూ ముస్లింలు కూడా శిష్యులై భజన చేస్తుండేవారు. రెండు నెలల వరకు ప్రభువు బీదర్‌లో నివసించారు. రోజూ ఒక కొత్త సమారంభం బ్రాహ్మణ భోజనం, నాట్యం, పాటలు, కథలు, కీర్తనలు, సాప్తాహాలు, అనుష్టానాలు, భజనలు ఆరతులు ఇలా ప్రతిరోజు జరిగాయి. లక్షల రూపాయలు ప్రభువుకి అర్పించారు. అలాగే ప్రభువు దానధర్మాలు చేస్తూ వాటిని ఖర్చుపెట్టేవారు. రోజూ ప్రభువు వద్దకు వేలమంది కోరికలతో వస్తే వారి మనోవాంఛలను ప్రభువు తీరుస్తూ ఉండేవారు. కొందరు కాశీ నుండి రామేశ్వరం వరకు యాత్ర చేయడానికి డబ్బుకావాలనేవారు, కొందరు పెళ్లి చేయడాని ఐదువందల రూపాయలు కావాలని, కొందరు కష్టాలను తీర్చమని వేడుకొనేవారు ఇలా అనేక రకాలుగా ప్రభువుకి కష్టం కలిగించేవారు. ఇవేకాక హరిదాసులు, పురాణికులు, వైదికులు, యాజ్ఞికులు, శాస్త్రులు, పండితులు, బ్రాహ్మణులు, పెద్ద పెద్ద లింగాయతులు, జంగములు, ముస్లింలలో పీర్‌జాద్‌లు, ఫకీరులకు ప్రభువు వద్ద నుండి రోజూ సంభావన లభించేది. ప్రభువుతో పాటు సిపాయిలు, ఏనుగులు, గుర్రాలు, పల్లకీ, శాస్త్రులు వేదపండితులు, విద్వాన్ బ్రాహ్మణులు, అంధులు, వికలాంగులు, బైరాగులు, గోసాయిలు మొదలైనవారు ఉండేవారు.

ఈ విధంగా ప్రభువు నివసించే చోటు జనంతో నిండి ఉండేది. ఈ విధంగా ప్రభువు రాజదర్పంతో ఉండేవారు. ఎక్కడ నీటి అనుకూలత ఉంటుందో అక్కడ డేరాలు వేసుకొని ఉండేవారు. అక్కడ బర్ఫీ పేడా దుకాణాలు వెలిసేవి. ఒక్కోసారి ఒక్కరినే వెంటపెట్టుకొని లంగోటితో అడవులలో తిరిగేవారు. కళ్యాణ్, భాల్కి, చాళకాపూర్, మైలార్ ఈ ప్రదేశాలన్నింటి కంటే ప్రభువు బీదర్‌లో బస చేసిన సమయంలో అలౌకికిత్వంవల్ల విశేషమైన కీర్తి కూడా పెరిగింది. ఈ విధంగా రెండు నెలలు ఆనందోత్సాహాలతో గడిచిన తరువాత ప్రభువు అక్కడి నుండి బయలుదేరడానికి సిద్ధమయ్యారు. బీదర్‌లో నవాబుల, దేశ్ ముఖ్‌ల కోరిక మేరకు గాది స్థాపన చేసి అది నడపడానికి ఒక బ్రహ్మచారిని నియమించారు. వాళ్లకి సటకాను, ప్రసాదం ఇచ్చి అక్కడి నుండి బయలు దేరారు.

ప్రభువు బీదర్ నుండి బయలు దేరి దారిలోని ముఖ్యమైన గ్రామాల్లో భక్తుల ఇష్ట ప్రకారం బసచేస్తూ రాజురి, భాల్కి, మంగలగి దారిలో కళ్యాణికి బయలుదేరారు. తనతో పాటు శిష్యులు, నటకాలు ఉంచిన ఎడ్లబండి, వెంకమ్మను ముందు పంపించి తను మేనాలో కూర్చొని బయలుదేరారు. పల్లకి బోయిలు ప్రభువును తీసుకొని వస్తుండగా హుమనాబాదుకు దగ్గరలో రెండు నదుల సంగమ ప్రదేశం దగ్గర గడవంతికి వెళ్ళే దారి వచ్చింది. ఆ సమయంలో అక్కడ దట్టమైన అడవి ఉండేది. చెట్టుకు సాలీడు గూడుతో నిండిపోయింది. అక్కడ చెట్టు దగ్గర ప్రభు మేన చిక్కుకు పోయింది. బోయిలకు మేనాను ముందుకు తీసుకువెళ్లడానికి వీలుకాలేదు. ప్రభువును క్రిందకు దింపి తాము చెట్టుకు ఇరక్కున్న మేనాను తీయడానికి ప్రయత్నించారు. ప్రభు హూమనాబాదుకు దగ్గరలో మేనా చిక్కుకున్న ప్రదేశంలోక్రిందికి దిగి సర్వేశ్వరుని దేవాలయానికి దగ్గరలో ఉన్న కట్టపై కూర్చున్నారు. ఆ కట్ట దగ్గర రెండు బిల్వ వృక్షాలు ఉండేవి. ఆ చెట్ల నీడలో ప్రభు యొక్క మండలి ఆగిపోయింది. ప్రభు ఇక్కడికే ఎందుకు వచ్చారో ముందు ఏం జరిగిందో ముందు ముందు రమణీయంగా వర్ణించడం జరిగింది.

|| శ్రీ దత్తాత్రేయార్పణమస్తు || || శ్రీ గురు మాణికార్పణమస్తు ||

# మూడవరోజు పారాయణము

## మాణిక్ నగర్

### 25. మాణిక్ నగర స్థాపన

కల్యాణికి పూర్వదిశలో ఐదు క్రోసుల దూరంలో హుమనాబాద్ అనే పేరుగల గ్రామం ఉంది. ఈ ఊరికి పశ్చిమదిశలో ఒక మైలు దూరంలో రెండు నదుల సంగమ ప్రదేశంలో మాణిక్ నగర్ అనే గ్రామ స్థాపన జరిగింది. ప్రభువు ఇంతకుముందు రెండు మూడు సార్లు ఈ ప్రదేశానికి వచ్చి ఉండిరి. ఈ మాణిక్‌నగరానికి తూర్పున హుమనాబాద్, పడమర గడవంతి, దక్షిణానికి నది, ఉత్తరానికి ధుమన్‌సూర్ నాలుగు వైపులా ఉన్నాయి. మూడు గ్రామాల భూమి కలవడం వల్ల మాణిక్‌నగర్ స్వతంత్ర గ్రామం అయింది. కానీ ఈ గ్రామానికి హుమనాబాద్ గ్రామంతోనే వ్యాపార సంబంధం ఎక్కువగా ఉండేది. దుకాణాలు, బజార్, పోస్ట్ ఆఫీసు హుమనాబాద్‌లోనే ఉండడం వల్ల మాణిక్ నగర్ వాసులకు ఎక్కువగా దీంతో సంబంధం ఉంది.

హుమనాబాద్ గ్రామం ఇతిహాస ప్రసిద్ధమైనది. దీనిని పూర్వం జయసింగ్ నగర్‌గా పిలిచేవారు. ధనాజీ జాధవ్ యొక్క పుత్రుడు చంద్రసేన జాధవ్ ఇక్కడ నివసించారు. ధనాజీ జాధవ్ మహారాష్ట్ర రాజ్యంలోని శివాజీ మహారాజ్

యొక్క పెద్ద సేనాపతి. ఔరంగజేబ్ తో చివరి వరకు యుద్ధం చేసి రాజ్యాన్ని విడిపించిన వాళ్లలో ఈయన అగ్రగణ్యులు. ధనాజీ గుర్రపు సేనకు సేనాధిపతియై మంచి యుద్ధ వీరుడై ఉండెను. శివాజీని మొగల్ ఖైద్‌లో నుండి విడిపించు కొని వచ్చేవరకు మరాఠీ రాజ్యాన్ని సంరక్షించిన అగ్రగణ్యుడు. ఇప్పటి హుమనాబాదు ఎక్కువ భాగము రాజారామ చంద్ర సత్తాతోనే తయారయింది. హుమనాబాద్ భాగంలో రామచంద్ర పేరు ప్రసిద్ధమైనది. హుమనాబాద్ ఉరఫ్ జయసింగ్ నగర్‌లో రాజా రామచంద్ర యొక్క రాజవాడ ఉండేది. ఊరులో అన్నివైపుల ముఖద్వారంతో పెద్ద పెద్ద కట్టడాలు ఉండేవి. అవి ఇప్పటికీ కనిపిస్తాయి. జయసింగ్‌నగర్ వ్యాపారానికి కేంద్రంగా ఉండేది. ఇతిహాసం ప్రకారం హుమనాబాద్ ఉరఫ్ జయసింగ్‌నగర్ 1791 వరకు మరాఠాల చేతుల్లో ఉండేది. ప్రస్తుతం హుమనాబాద్ రాజా రామచంద్ర యొక్క రాజవాడ జీర్ణస్థితిలో ఉంది. ఇక్కడ ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయం ఉంది. పూర్వ రాజధాని యొక్క గుర్తులు స్పష్టంగా కనిపిస్తాయి. మరాఠాల ఆదాయంతో ఈ గ్రామం ఉచ్ఛస్థితిలో ఉండేది. ఇక్కడ వ్యాపారులు అత్యంత శ్రీమంతులై ఉండేవారు. దేశంలోని అన్ని ప్రదేశాల యొక్క సరుకు ఇక్కడికి పెద్ద మొత్తంలో వచ్చేది. అందుకని అన్ని రకాల వ్యాపార వ్యవహారాలు ఇక్కడ జరిగేవి. అన్ని రకాల కిరాణా సామాను ఇక్కడికి వచ్చి హైదరాబాద్‌కి రవాణా జరిగేది. మహారాష్ట్రలోని పూనా, సోలాపూర్ పట్టణాల నుండి వెళ్ళే జాతీయరహదారి హుమనాబాద్ నుండే హైదరాబాద్‌కి వెళ్తుంది. బాగా వ్యాపారం జరగడం వల్ల సహజంగానే హుమనాబాద్ లక్ష్మికి నివాసమయింది అంటారు. దీనికి సర్వోతోముఖాభివృద్ధి జరిగిన విధానము దానికి సంబంధించిన వ్యాపారుల వద్ద ఉన్న ధనాన్ని గూర్చి కథ ఈ క్రింది విధంగా వివరిస్తారు. ఇక్కడ బొప్పనవాలె, కోనేవాలె అనే పేరుగల ఇద్దరు పెద్ద వ్యాపారులు ఉండేవారు. వాళ్ల దగ్గర లెక్కలేనంత ధనం ఉండేది. కూరగాయలు తీసుకురావడానికి వాళ్ల దాసీలు వెళ్లేవారు. ఒక రోజు ఇద్దరు వ్యాపారుల దాసీలూ ఒకే సమయంలో కూరగాయల కోసం బజారుకి వెళ్లారు. ఇతర కూరగాయలు చాలా ఉన్నాయి కాని సొరకాయ మాత్రం ఒక్కటే ఉండెను. దాన్ని ఇద్దరూ తీసుకోవాలని ఒకే సారి అనుకొని దాని ధర అడిగి వేలంలాగా మొదలై ఆ సొరకాయ ధర 700 రూపాయల వరకు వెళ్లింది. చివరికి బొప్పన వాలెకు చెందిన దాసీ దానిని తీసుకొగానే ఆ విషయం గ్రామంలోని అందరికి తెలిసి జనం పోగయ్యారు. కొనేవాలా దాసి

ఓడిపోయింది. బొప్పన వాళ్ల దాసి సోరకాయను గెలిచిందనే విషయం యజమానులకు తెలిసి తమ దాసి వల్ల విజయం లభించిందని సొరకాయతో పాటు దాసిని ఊరేగించి ఇంటికి తీసుకు వచ్చారు. కొనేవాలా తన దాసిని పనిలో నుండి తీసివేశారు. ఇలాంటి సంఘటనలు లెక్కలేనంత సంపద లేక పోతే జరిగేవి కావు.

అయితే ప్రభు మహరాజ్ ఇక్కడికి వచ్చినప్పుడు వ్యాపారం బాగా నడిచేది. విశేషంగా ఇక్కడ ఆపూస్ (మామిడి పండ్లు) వ్యాపారం జోరుగా సాగేది. వీటి విత్తనం విరివిగా దొరికేది. ప్రభువు సమాధి అయ్యేవరకు ఈ గ్రామం మంచి స్థితిలో ఉండేది. తరువాత గుల్బర్గాలో రైల్వేమార్గం మొదలయిన తరువాత ఈ వ్యాపారం పెద్దగా జరిగేది కాదు. అందుకని ఇక్కడి వ్యాపారులు ఇతర ప్రదేశాలకు వెళ్లి పోయారు. వ్యాపారం పడిపోయింది. పూర్వం పెద్ద పెద్ద ప్రాకారాలు ఇప్పుడు కూడా పడిపోయి కనిపిస్తాయి. పెద్ద పెద్ద శ్రీమంతుల ఇళ్లు పడిపోయే స్థితిలో కనిపిస్తాయి. ఇక్కడి వీరభద్ర దేవాలయం దర్శనీయ స్థలము. దేవాలయంలోని దివ్యంగా నిర్మించబడిన ఒక బావిని చూస్తే సహజంగా 'అబ్బా ఏమి నిర్మాణ చాతుర్యం' అనిపిస్తుంది.

ప్రభు మహరాజ్ హుమనాబాద్ దగ్గరలోని సంగమము వద్ద నివసించినప్పుడు రాజ్యం మొగలాయిల చేతిలో ఉండేది. ఇది మొగల్ రాజ్యంలో ఒక జాగిర్‌దార్ సంస్థానము. ఆ కాలంలో వ్యవస్థ పేరే పూజ్యనీయము, ఆ కాలంలో నిజమైన నవాబు అంటే తాలూకు దారు. జిల్లా అధికారి (కలెక్టర్) లాగే పూర్వం తాలూకుదారు ఉండేవారు. ప్రజల వద్ద నుండి ఎవరు పన్నులు ముక్కుపిండి వసూలు చేస్తారో వారు తెలివిగల అధికారిగా గుర్తించబడేవారు. ఆ కాలంలో జాగీర్‌దార్లు, నవాబ్‌లు ఉండేవారు. దొంగతనాలు, హత్యలు, తప్పులు చేసిన వాళ్లను శిక్షించడానికి కోర్టులు ఇంకా స్థాపించబడలేదు. హత్య చేసిన వాళ్లను శిక్షించే చట్టాలు కూడా ఉండేవి కావు. ప్రజలు ఆత్మరక్షణ చేసుకునే సామర్థ్యంతో ఉండేవారు. చాలా వరకు షావుకార్లు, శ్రీమంతుల వ్యాపారుల వద్ద బంట్రోతులు, సిపాయిలు సిక్కువాళ్లను పెట్టుకునే వారు. దొంగతానాలు లూటీలు చేసేవారు ఆయుధాలతో తిరిగేవారు. వాళ్లను అడిగేవారు ఎవరూ లేకపోవడం వల్ల నిర్భయంగా ఉండేవారు.

తరువాత కాలంలో ఆ పరిస్థితి లేదు. రోజు రోజుకు ప్రజలతో బ్రిటిష్ వారి సంబంధాలు పెరగడం వల్ల మొగలాయిల స్వరూపం మారి పోయింది. ఈ స్వరూపం మారి ప్రభు సమాధి తరువాత ప్రగతి సాధించింది. మాణిక్ ప్రభు అనే పేరుగల యోగి అవతారం చాలించిన తరువాత పది సంవత్సరాలకు మొగలాయిల రాజ్యం నూతన రూపం సంతరించుకుంటుంది అని 300 సంవత్సరాల పూర్వం కర్నాటకలోని సర్వజ్ఞులు చెప్పి ఉండిరి. ఇది కన్నడ బాషలో అనేక మంది కన్నడిగులు అనుకుంటుండగా కూడా విన్నాము. సర్వజ్ఞులు చెప్పిన మాట అక్షరాల నిజం అయింది.

**'బసవణ్ణ హాళ్ళద మ్యాల కుసరాగి పట్టణహుట్టి, మాణిక్య ప్రభు యోగి ఆగి దేహ ఇట్టు దశ వర్షక్కే మొగలాయి కణికాణ సర్వజ్ఞ'** ఈ కన్నడ శబ్దాల అర్థం ఇలా ఉంది. బసవ అనే తీర్థ ప్రాంతంలో కొత్త నగరం ఏర్పడి ఇక్కడ మాణిక ప్రభు అనే పేరుగల యోగి పుట్టి సమాధి చెందిన తరువాత 10 సంవత్సరాలకు రాజ్యం నూతన వ్యవస్థ రూపుదిద్దుకుంటుంది. 300 సంవత్సరాలకు పూర్వం ఉన్న సర్వజ్ఞులు ప్రభు యొక్క అవతార విషయం తెలిసి ఉండడం ఆశ్చర్యం అనిపిస్తుంది. 'బసవన హాళ్ల' అంటే మాణిక్ నగర్‌కి ప్రవహించే నదులలో ఒక నది బసవ తీర్థం నుండే ప్రవహిస్తుంది. రెండవది రాజేశ్వర్ పై నుండి వస్తుంది. ఈ రెండు చిన్న నదులు వర్షాకాలంలో నిరంతరంగా ప్రవహిస్తాయి. 'గురుగంగా' 'విరజా' అనే పేర్లతో ఈ నదులను పిలుస్తారు.

ప్రభువు ఈ ప్రదేశంలో ఉండడానికి ఎందుకు ఇష్టపడ్డారో తెలుసుకోవడం కొంచెం కష్టమే. అనేక మంది చరిత్రకారులు అనేక రకాల కారణాలు తెలిపారు. వాటిలో ఏది నిజమో ఏది కాదో నిర్ణయించడం సాధ్యమయ్యే పనికాదు. ఇక్కడికి ప్రభు చాలాసార్లు వచ్చినట్లు చాలా మందికి తెలుసు. వాటిలో ఏ సమయంలో ఏ ఘటన జరిగిందో చెప్పడం సాధ్యం కాదు. కానీ రామచంద్రబువా నాశిక్‌కర్ అనేవారు పద్యరూపంలో వివరించిన చరిత్రలో ఒక అనాథ కుటుంబ రక్షణ కొరకు ప్రభువు ఇక్కడికి వచ్చినట్లు అనిపిస్తుంది. ఆ కథను ముందు వివరించడం జరిగింది. ''ఒక గృహస్థు తన భార్యా పిల్లలను వెంటపెట్టుకొని పది మంది కుటుంబ సభ్యులతో హుమనాబాద్‌కి దగ్గరలో గడవంతి గ్రామం

దాటిన తరువాత అరణ్యం మధ్యలోకి చేరుకున్నారు. అక్కడికి హుమానాబాద్ ఒక మైలు దూరం ఉంది. అక్కడ ఒక పాత శివాలయం, ఒక కుండము ఉండేవి. దట్టమైన చెట్లతో త్రోవలో వెళ్లే మనుష్యులను దోపిడీ చేయడానికి వీలుగా ఆ ప్రదేశం ఉండేది. శివాలయం చుట్టూ దట్టమైన చెట్లు ఉండడం వల్ల పూజావిధులు జరిగేవి కావు. ఇది దొంగలకు నివాసమై ఆ దారిలో వెళ్లే వాళ్లను దోచుకొని గాయపరిచేవారు. ఇలాంటి ప్రదేశానికి వచ్చిన ఆ గృహస్థు చీకటి అయిందని అక్కడ వంట చేసుకొని ఉండాలని అనుకున్నారు. కొందరు స్నానాలు చేస్తుండగా కొందరు వంటసామాగ్రి సర్దుతూ ఉన్నారు. వీళ్లు కళ్యాణ్‌కి ప్రభు దర్శనానికి వెళ్లాలనుకున్నారు. ఇంతలో దొంగలు వీళ్లపై దాడి చేశారు. దొంగలు యాభై మంది దాకా ఉండి పూర్తి ధనం దోచుకొని చివరికి వాళ్ల ప్రాణం తీయాలనుకున్నారు. దొంగలు కొట్టడం ప్రారంభించారు. అప్పుడు అందరూ ప్రభువుని ప్రార్థిస్తూ ఈ అడవిలో ప్రభువు తప్ప మమ్మల్ని రక్షించే వారెవరున్నారు? అనుకుంటూ ప్రభువుని గట్టిగా ప్రార్థించడం ప్రారంభించారు. అటువంటి సంకట పరిస్థితిలో తన భక్తులకోసం ప్రభువు ప్రత్యక్షమయ్యారు. ప్రభువు స్వరూపం ఆ సమయంలో చాలా విచిత్రంగా ఉండేది. తలపై జరీతో నిండిన హైదరాబాద్ పాగా, శరీరంపై జరీ శాలువా యొక్క జుబ్బా, నడుముపై ఆకు పచ్చ పంచె, మెడలో ముత్యాల హారం, చెవులకు పోగులు, చేతిలో ఒక కత్తి లాంటి వస్తువు, ఇంకొక చేతిలో పానీయం త్రాగే పాత్ర, వీపుపై డాలు నడుముకి తమంచా, చేతిలో తల్వార్, నుదుటిపై దివ్యమైన సుందర కేసరి గంధం మధ్యలో కస్తూరితిలకం ధరించి ఆ శివాలయంలో ప్రత్యక్షమై అక్కడ ఉన్న గద్దెపై హుక్కా త్రాగుతూ కూర్చున్నారు. వారిని చూడగానే ఆ దొంగలకు ఈ బీదవాళ్లను ఎంత దోచుకున్న ఏమి దొరకదు కానీ ఈ శ్రీమంతుడిని దోచుకుంటే చాలా దొరుకుతుందని అనుకొని అందరూ ప్రభువుపై పడి తమ ఆయుధాలను ప్రభువుపై ఎత్తి పట్టుకున్నారు. ఆ సమయంలో ఆ దొంగల చేతులు ఎలా ఎత్తారో అలాగే పైన ఉండిపోయాయి. కిందికి రావడంలేదు. కొందరి తలలు పైకెత్తినవి అలాగే ఉండిపోయాయి. దాంట్లో ముఖ్యుడైన పెద్ద దొంగకి కడుపులో శూలాలు గ్రుచ్చుకున్నట్లుగా నొప్పి ప్రారంభం అయింది. ఇంతలో ప్రభువు భయంకర రూపం ధరించి ఒక్కొక్కరి గడ్డాలు, మీసాలు తీస్తూ నేలకు కొట్టడం ప్రారంభించారు. అప్పుడు దొంగలందరూ దీనంగా ప్రభువు కాళ్లపై పడ్డారు. అప్పుడు ఆ దొంగ, మహారాజ్ క్షమించాలి, మళ్లీ

ఎప్పుడు ఈ ఆరణ్యంలో అమాయకులను దోచుకోము, మాకు ప్రాణదానం చేయండి అనగానే, ప్రభువు శాంతించి వారిపై దయతో సౌమ్య రూపాన్ని ధరించి హుక్కా త్రాగుతూ కూర్చున్నారు. అది చూసి వాళ్లలో గృహస్థుకు సంబంధించిన కళ్యాణ్‌కు చెందిన ఒకరు ఆ వచ్చిన వీరున్ని మాణిక్ ప్రభువుగా గుర్తించి ఆ విషయం చెప్పగానే ఆ గృహస్థులు ప్రభువు పాదాలపై పడ్డారు. వాళ్లలో పెద్ద దొంగ ఇప్పటి నుండి మేము, మా వంశంలోని వారంతా ప్రభువును గౌరవంగా ఆదరిస్తాము. మా తప్పుని మన్నించి ప్రభు మాపై దయ చూపించాలి అన్నాడు.

తరువాత అందరి కాళ్లు చేతులు మామూలుగా అయ్యాయి. అతని కడుపు నొప్పి కూడా తగ్గిపోయింది. అందరూ ప్రభువుకి నమస్కరించి తమ తమ ప్రదేశాలకు ఆనందంగా వెళ్లి పోయారు. ప్రభువు ఆ రోజు మొదలుకొని సమాధి అయ్యేవరకు భక్తజనోద్ధరణ చేశారు. ఏ ప్రదేశంలో అయితే దారి దోపిడి జరిగి అమాయకుల రక్తం చిందేదో తరవాత అదే స్థలంలో నిత్యం వేల మంది భోజనాలు అవుతూ నెయ్యి ప్రవహించేది. ఏ నిస్సహాయ కుటుంబ కష్ట నివారణ కోసం ప్రభువు ప్రత్యక్షమయ్యారో ఆ కుటుంబానికి దరిద్రం నుండి ముక్తి కలిగించి, ఆనందపరిచి వారిని వారి స్వస్థలానికి పంపించారు.

ఇంకొక చరిత్రకారుడు ఇంకో విధంగా వ్రాశారు. "కొన్ని రోజుల తరువాత ఝరణీ నృసింహ, బీదర్ ప్రాంతాల్ని పావనం చేసి ప్రభువు మండలి భాల్కి గ్రామం నుండి కళ్యాణ్‌కి వెళ్లాలనే ఉద్దేశంతో, తనతో ఉన్న శిష్యులందరిని పంపించి , మేనాను మోసే బోయీవాళ్లను మాత్రం తనతో ఉంచుకొని, మేనాలో వెళ్తుండగా దట్టమైన అరణ్యంలో బోయీలు అతికష్టంతో త్రోవ చేసుకుంటూ వెళ్తుండగా మేనా ఒక వేగు చెట్టు సందులో ఇరుక్కుపోయింది. అప్పుడు బోయీలు ప్రభువుతో మేనా ముందుకు వెళ్లడానికి దారిలేదు, అనగానే సరే మనం ఇప్పుడు ఇక్కడే ఉందాం, మనం నివసించే స్థలం ఇకనుండి ఇదే! అంటూ ప్రభు మేనా నుండి బయటకు వచ్చారు. అప్పుడు అక్కడికి సత్పురుషులైన నత్థుడ్‌శహ వలీ, మూల సంగప్ప, ములగీ మారప్ప అనే ముగ్గురు యోగులు వచ్చి ప్రభువుతో మహారాజా, మీకు ఈ ప్రదేశం నివాసయోగ్యమైనది, భవిష్యత్తులో మీరు ఇక్కడే ఉండాలి అని వాళ్లు ప్రభువుకు బిల్వ వృక్షాల వద్ద

ఉండడానికి స్థలం చూపించారు. ఆ విధంగా ప్రభువు అక్కడ స్థిరపడగానే ఆ రెండు బిల్వ వృక్షాలు మంటలలో కాలిపోయాయి. కొన్ని రోజుల తరువాత ఆ చెట్లు మళ్లీ చిగురించి ఆ స్థలంలో సర్వేశ్వరుని పేరుతో మహాదేవుని స్థాపించారు. ఆ ప్రదేశాన్ని మనం ఇప్పటికీ చూడవచ్చు.

ఇలా ఇద్దరూ చరిత్రకారులు ప్రభు ఈ ప్రదేశానికి రావడానికి కారణం చెపుతారు. కాని ఇద్దరి విషయంలో ప్రభు ఇక్కడికి ఇంతకు ముందు రెండుమూడు సార్లు వచ్చారని తెలుస్తుంది. అందువల్ల ప్రభువుకి ఈ స్థలం యొక్క మహాత్యం తెలును. నీటి వసతి విశాలమైన ప్రదేశం చూసి ఇష్టపడ్డారేమో! ఈ నిర్జన సుందర ప్రదేశం దొంగలకు నివాసమై, అపవిత్రం అయి పాప కార్యాలతో భయంకర రూపం సంతరించుకుంటుందని ప్రభువుకి ముందే తెలిసి ప్రభువు ఈ ప్రదేశాన్ని పావనం చేయాలని ఇక్కడే ఉండాలని అనుకున్నారు. ప్రభువుతో ఉన్న శిష్యులకు మాత్రం ఈ ప్రదేశం నచ్చలేదు. వాళ్లు అనేక విధాలుగా ప్రభువుకి ఇంకొక ప్రదేశానికి వెళ్దామని నచ్చచెప్పారు. కానీ, ప్రభువు అక్కడి నుండి కదలలేదు. ప్రభు యొక్క అవతారంలో అత్యంత మహత్తరమైన భాగం అంటే పతితోద్ధారణ చేయడానికి యోగ్యమైన ఆ ప్రదేశం పాపకృత్యాలతో నిండిపోయి ఉంది. అందుకని దానిని ఉద్ధరించడం యోగ్యమైన విషయం. ప్రదేశం మాత్రమే పవిత్రం చేయడం కాకుండా అక్కడి మనుష్యుల పాపప్రవృత్తిని కూడా నశింపజేయడం కూడా అంతే మహత్వమైన విషయం. ఇలాంటి రెండు మహత్తరమైన పనులను ప్రభువు ఏ విధంగా నిర్వహించారో ముందు కథా భాగంలో వివరించబడుతుంది.

ఏ కారణం వల్ల అయితేనేమి ప్రభువు బిల్వవృక్షం క్రింద కూర్చుని ఉన్నారన్న వర్తమానం అలా అలా అన్ని పల్లెటూళ్లతో పాటు హుమనాబాదులో కూడా వ్యాపించింది. ప్రభువు యొక్క కీర్తి ఆ సమయంలో దశదిశలా వ్యాపించి ఉండెను. ప్రభు కళ్యాణ్ నుండి వెళ్ళిన తరువాత మొదట అమృత కుండము వద్ద కొన్ని నెలలు నివసించి మణిచూల పర్వతంపై ఉన్న సుమారు అన్ని ప్రేక్షణీయ స్థలాలు, తీర్థాలు దర్శించారు. అప్పటికి పూర్తి ఒక పుష్కరం (12 సంవత్సరాలు) గడిచింది. ఆ సమయానికి ప్రభువు యొక్క వయస్సు సుమారు 28 సంవత్సరాలు ఉండేది. ప్రభువు మనస్సులో ఈ వయస్సులో ఎక్కడైనా

స్థిరంగా ఉండాలనుకొని, ఇక్కడి యోగ్యమైన అనుకూల పరిస్థితిని చూసి ప్రభువు అక్కడ ఉన్న కట్టపై కూర్చొని ఆనందంలో ఓలలాడరు. గాలి, ఎండ, వాన మొదలైన వాటి గురించి ప్రభువు ఎప్పుడూ ఆలోచించలేదు. ఇప్పుడు ఆలోచించి ప్రయోజనం లేదు. ప్రభువు ఇక్కడే నివసిస్తారని ఇతరులెవరికీ ఇంకా తెలియలేదు. ప్రభువు ఇక్కడికి వచ్చి కూర్చున్నారని తెలియగానే జనం తండోపతండాలుగా రాసాగారు. హుమనాబాద్‌కి చెందిన పెద్దపెద్ద వ్యాపారులు, నవాబులు దర్శనానికి రాసాగారు. దేవాలయ ప్రాంగణం శుభ్ర పరచడం జరిగింది. పెద్దపెద్ద దుకాణాలు వెలిశాయి. నాలుగు దిక్కులా జాతరలాగా కనిపించేది. దేవుని పూజ, అర్చన, అభిషేకం జరుగసాగాయి. చక్కెర కనిపించగానే చీమలు ఎలా మొదలవుతాయో అలా అంతటా జనం కనిపించసాగారు. ప్రభువు శిష్యులు ముందు వెళ్ళిపోయినవారు ఈ విషయం తెలియగానే తిరిగి వచ్చారు. ప్రభువు గద్దెపై కూర్చుని ఉన్నారు. జనం దర్శనం కోసం బారులు తీరారు. ఆ విధంగా పైకప్పు లేని కట్టపై ఎన్నో రోజులు కూర్చున్నారు. ఎండ, వాన మొదలైన వాటి నుండి రక్షించడానికి ఏదైన ఆసరా కల్పించాలని ప్రభువు నుండి శిష్యులు అనుమతి తీసుకున్నారు. వెంకమ్మ ఇలాగే ఇంకొక చెట్టు క్రింద కూర్చుండిపోయింది. 'నిత్యశ్రీ నిత్య మంగళం' ఎల్ల కాలం నడిచేది. భక్తులకు దర్శనం ఇచ్చి, వాళ్ల మనోవాంఛలను తీరుస్తూ మానసిక పీడలను నివారణ చేసే ప్రభువుపై భక్తులకు అపారమైన ప్రేమ ఉండేది. ప్రభువు సమక్షంలో అన్న పానీయాలు కూడా వారికి గుర్తుకు వచ్చేవి కాదు.

ప్రభు మహరాజ్ ఆ స్థలంలో వచ్చి కూర్చున్న తరువాత కొన్ని రోజుల్లోనే ఆ స్థలానికి పవిత్రత వచ్చింది. ముందు పగలు కూడా ఆ ప్రదేశానికి రావడానికి భయపడే వారు కానీ, ప్రభు మహారాజ్ వచ్చిన తరువాత జనంతో నిండిపోయి ప్రభు నామంతో ఆ ప్రదేశం ప్రతిధ్వనించిపోయింది. కళ్యాణ్ నుండి మాతృశ్రీ బయమ్మ, దాదా సాహెబ్ కూడా మాణిక్‌నగర్ వచ్చారు. చిన్న తమ్ముడైన తాత్యామహరాజ్ ఉత్తమ శిక్షణ ముగించి కళ్యాణ్ యొక్క నవాబుల సంస్థానంలో మంచి పదవిలో ఉండిరి. వారు కూడా ప్రభుదర్శనానికి వచ్చారు. దాదామహరాజ్ ప్రయత్నం ఫలించి ఆ ప్రదేశంలో అన్ని వైపుల చిన్న చిన్న గుడారాలు వేయుబడ్డాయి. ప్రభు దర్శనానికి వచ్చేవాళ్లు కొందరు హుమానాబాదులో ఉండి దర్శనానికి ఇక్కడికి వచ్చేవారు. రావడం పోవడం

కష్టం అనిపించి ఇక్కడే ఉండి పోవాలని అనుకునేవారు. రోజురోజుకు ప్రభువు ఇక్కడికి వచ్చిన విషయం అందరికి తెలిసి చాలా జనం పోగయి రద్దీ మొదలయింది. వీరిలో అన్ని కులాల, మతాల వారు ఉండేవారు. ముస్లీం అధికారులు కూడా దర్శనానికి వచ్చేవారు. ప్రభువుని ఒక సారి దర్శించగానే వారి అగాధ సామర్థ్యం తెలుసుకొని వాళ్లు కూడా ప్రభు భజన చేసేవారు.

ఆ సమయంలో హుమనాబాద్, గడవంతి, దుమ్మన్‌సూర్ ఈ మూడు ఒకే నవాబు ఆధీనంలో ఉండేవి. మూడు గ్రామాల సరిహద్దుల మధ్య ప్రభు కూర్చుని ఉండడం వల్ల ఆయా గ్రామాల ప్రజలు ప్రభువు తమ గ్రామ సరిహద్దులో ఉన్నారని అభిమానం చూపించేవారు. ప్రభువు ఈ ప్రదేశంలోనే నివసించాలని మనస్సులో సంకల్పం కలిగి అందరూ కలిసి ప్రభువుకి విన్నవించుకున్నారు. ప్రభువుతో ఉన్నవాళ్లకు మాత్రం ఈ ప్రదేశం ఇష్టమవలేదు. కానీ, ప్రభు ఇష్టానికి విరుద్ధంగా ఎవరూ ఏమీ చేయలేరు. మూడు గ్రామాల దైవప్రార్థన (గ్రామదేవత) ఫలించి ఆ గ్రామాలు తమ హద్దులోని భూమిని ప్రభువు యొక్క కొత్త నగరానికి కొంత కొంత ఇవ్వడం వల్ల మాణిక్ నగర్ స్థాపనకు సహాయపడింది. ముస్లిం అధికారులకు కూడా ఈ విషయం అంగీకారమై అందరికీ అనుకూలంగా జరిగింది.

పెద్ద సమారంభంతో నగర స్థాపన జరిగి దత్తగాదీ ఏర్పాటయింది. ఒక గుడారంలో గాదీ యొక్క స్థాపన జరిగింది. ప్రభువు కోసం ఒక గుడారం వేయబడింది. ప్రభువు కోసం శిష్యమండలి గాదీ తయారు చేయడం వల్ల అప్పటి నుండి ప్రభువు దానిపై కూర్చునేవారు. గుడారం మండపం లాగ చేయడం వల్ల దానికి దర్బార్ స్వరూపం వచ్చింది. తరువాత దర్బారు క్రమం తప్పకుండా జరుగుతూనే ఉంది. దర్బార్ యొక్క వైభవం సందర్భాన్ని బట్టి వివరించడం జరిగింది. ఏదైనా కొత్త గ్రామం తయారు కావాలంటే ఏన్నో అడ్డంకులు వస్తాయి. కానీ, ఈ మాణిక్‌నగర్ గ్రామానికి ఎలాంటి కష్టం కలగలేదు. ప్రభువు యొక్క అపార సామర్థ్యం వల్ల అన్ని పనులు నిర్విఘ్నంగా జరిగి నగరస్థాపన జరిగింది. నగర రచన కార్యక్రమము దాదామహారాజ్ ప్రభు ఆజ్ఞతో చేయడానికి సంకల్పించారు. దర్బార్ సరియైన రీతిలో జరిగే విధానాన్ని తాత్యామహారాజ్‌ల వారు రూపొందించారు. అన్ని వైపుల చౌక్‌లు ఉంచి

పహారా కాయడానికి వీలయ్యే విధంగా బందోబస్తు చేయడం జరిగింది. ప్రభు యొక్క గుడారం ముందు పహారా కాయడానికి పదమ్‌సింగ్ అనే రాజపుత్రజాతికి చెందిన వారిని నియమించగా, ఆయన మరణించేవరకు అత్యంత నిష్ఠతో ఈ కార్యం నిర్వహించాడు.

భండారుఖానా మొదలయింది. భండారుఖానా అంటే సేవ చేసేవారికి ప్రసాదం ఇచ్చే అన్నపూర్ణ గృహము. భండారు ఖానాలో మొదటినుండి మూర్తీభవించిన అన్నపూర్ణ నివసించసాగింది. అన్నపూర్ణ దేవి యొక్క సాక్షాత్కారము ఇప్పటికీ ఇక్కడ అనుభవంలోకి వస్తుంది. భండారు ఖానాలో నిత్యం వేల మందికి అన్నం వండబడేది. కానీ, ప్రభువు పంక్తిలో కూర్చుని ఎప్పుడూ భోజనం చేసేవారుకాదు. పంచభక్ష్యపరమాన్నాలతో భక్త జనులకోసం చేసినవి ప్రభువు ఎప్పుడూ తినేవారు కాదు. ప్రభువు జోలిలో వచ్చిన అన్నంలో నుండి రొట్టెను తీసుకొని ఆకలి తీర్చుకొనేవారు. ఇద్దరు బ్రహ్మచారులు హుమనాబాద్ వెళ్లి వండిన వాటిని బిక్షగా తీసుకొచ్చిన జోలిలోని పదార్థాలే గాదీ (దత్తపీఠం) కి ముఖ్య నైవేద్యం. ఆ జోళీలోని జొన్న రొట్టె, వెళ్ళుళ్ళి వేసి చేసిన పల్లీల పొడి ప్రభువుకి ఇష్టమైన పదార్థాలు. రాజైశ్వర్యాలు, అష్టసిద్ధులు ప్రభువు ముందు చేతులు కట్టుకొని నిలబడ్డా కూడా ప్రభువు వాటిని విరక్తితో చూడటంలో అవగింజంత కూడా తేడా కనిపించదు. జోళీ హుమనాబాద్‌కు మాత్రమే వెళ్లేది. హుమనాబాద్‌కు చెందిన బ్రాహ్మణులు ప్రేమతో జోళీ కోసం ఎదురు చూస్తూ రోజూ కొత్త కొత్త పదార్థాలను తయారు చేసి ప్రభువు తినాలని జోళీలో వేసేవారు. ఈ జోళీని ప్రజలు అత్యంత ఆదరంతో చూసేవారు. జోళీపై ఇప్పటికీ ప్రజలకు భక్తి అలాగే ఉంది. ఇతర గ్రామాల ప్రజలు రుచికరమైన పదార్థాలు చేసుకొని తలపై పెట్టుకొని నాలుగు క్రోసుల దూరం నుండి నడుచుకుంటూ వచ్చి ప్రభువుకి నివేదించేవారు. ప్రభువు ప్రేమతో వాటిని స్వీకరించి, తినకుండా కళ్లతో మాత్రమే చూసి చాలా బావున్నాయని అనేవారు. ప్రభు ఆజ్ఞతో వారు చెప్పిన ఇళ్లలోనే జోళీ తిరిగేది. కొత్తగా ఎవ్వైనా ఇళ్ల వాళ్లు జోళీ వేయాలనుకుంటే ప్రభువు ఆజ్ఞ తీసుకోవలసి ఉండేది. ఒక సారి అందరి దృష్టిలో ఎవరైనా దోషి అయితే శిక్షగా ఆ ఇంటికి జోళీ వెళ్ళకపోవడం తాత్కాలికంగా జరిగేది. తిరిగి ప్రభువు వద్ద ఆజ్ఞ తీసుకోవలసి వచ్చేది. దానికి సంబంధించిన ఒక సంఘటన ఇలా జరిగింది. నానాశాస్త్రి అనే ఒక పేరుగల

బ్రాహ్మణ గృహస్థుడు ప్రభు భక్తులుగా ఉండేవారు. ఎవరినో నిందించిన కారణంగా ఇంటికి జోళీ వెళ్ళలేదు. ఆయన బయటికి వెళ్లి రాగానే ఈ విషయం ఆయనకు ఇంటి ముందు బావి దగ్గర కాళ్లు కడుక్కుంటుండగా తెలిసింది. ఆయన జోళీ తిరిగి తమ ఇంటికి వచ్చేవరకు ఇంట్లో కాలుపెట్టను మరియు భోజనం చేయనని నిగ్రహంతో ఆరు రోజులు ఉపవాసం చేశారు. అది తెలిసి దీక్షిత్ మండలి తిరిగి జోళీ పునః ప్రారంభించారు. అప్పుడు ఆయన అన్నం తిన్నారు. జోళియే సంస్థానము యొక్క కామధేనువై, భండారుఖానా అన్నపూర్ణ గృహమయి ఉన్నది. ఈ జోళీయే ప్రభు సమాధికి ముఖ్య నైవేద్యము. ఈ భండారు ఖానాలోనే ఇప్పటివరకు లక్షల మంది సంతృప్తులయ్యారు, అవుతున్నారు. ప్రభువు యొక్క సమావేశ స్థలం ముఖచిత్రంలో చూపించినట్లుగా రాజవైభవంతో ఉండేది. అది ఎప్పుడూ ఆనంద సాగరంలో తేలుతున్నట్లుగా కనిపించేది. వారి మాట అత్యంత మృదు మధురంగా ఉండేది. ఎప్పుడూ వినోదభరితంగా నడిచేది. ప్రభు భాషణ ఇతర ధర్మాలపై కూడా అంతే సమానంగా ఉండేది. వారు ఎప్పుడూ వాహ్‌వా! వాహ్‌వా! అంటూ ఉండేవారు. ఆ కాలంలో హుమనాబాద్‌లో గులామ్ ముస్తఫాఖాన్ అనే తాలూకుదారు ఉండేవారు. ఆయన ఆజ్ఞలు అత్యంత కఠినంగా ఉండేవి. ఆయన ప్రభుకీర్తి విని దర్శనం కోసం వచ్చారు. చాలా సేపు ప్రభువుతో సంభాషించిన తరువాత సంతృప్తులయ్యారు. ఇలాంటి యోగి ప్రపంచంలో ఇంకొకరు దొరకడం సాధ్యం కాదని అతనికి గట్టి నమ్మకం. ఒక మౌల్వీకి ఉండాల్సిన జ్ఞానం కంటే ఉర్దూ, పార్శీలో ప్రభువుకి ఉన్న జ్ఞానం చూసి చకితుయ్యారు. ముస్లిం ధర్మం యొక్క రహస్యం ప్రభువుకే తెలిసిందని ఆయనకు అనిపించింది. ప్రభువుపై అత్యంత అభిమానం ఏర్పడింది. కానీ, తను ముస్లిం, ప్రభువు హిందువని ఆయన మరవలేదు. ప్రభువు ముస్లిం అయితే బావుండేది అని అతనికి అనిపించింది. అప్పుడు అతను ప్రభువుతో వినయంగా "మహారాజ్, మీరు ముస్లిం అయితే ఈ క్షణంలో నేను మీ శిష్యుణ్ణి అయ్యేవాణ్ణి" ఇది విని ప్రభువు నవ్వుతూ "నాకు ముస్లిం అవాలనిపిస్తుంది. కాని ఏం చేయాలి 'రబ్- ఉల్- ఆల్‌మీన్' ఇలా అల్లా ఖురాన్‌లో అన్నారు ఇది మాత్రం నాకు తెలుసు. కానీ 'రబ్-ఉల్-ముసల్‌మీన్' అన్నారని ఎక్కడా నాకు కనిపించలేదు. ఈ మాట అబద్ధమైతే నాకు తెలపండి. ఇది వినగానే ఆ ముస్లిం ఏ జవాబు ఇవ్వలేక సిగ్గుతో తలవంచుకున్నాడు. ఈ సమాధానం

అత్యంత మర్మమయింది. 'రబ్–ఉల్–అల్‌మీన్ అంటే విశ్వం యొక్క అధిపతి. రబ్–ఉల్–ముసల్‌మీన్ అంటే కేవలం ముసల్మానులకే అధిపతి. పరమేశ్వరుడు సంపూర్ణ జగత్తుకే అధిపతి. కాని హఠవాదులు తమ ధర్మ మతాభిమానంతో అంధులై తమ ధర్మమే గొప్పదని ఇతరులది కాదని నమ్ముతూ వస్తారు. ఇలాంటి వారు ప్రభువు సమాధానం విన్న తరువాత ఆలోచించాలి. గులామ్ ముస్తాఫాఖాన్ అనే ముసల్మాను ప్రభువుపై ఉన్న ఆదరాభిమానాలతో మాణిక్‌నగర్‌లో నివసించేవారికి సహాయం చేసేవారు. ప్రభువు మొదట ఏ బిల్వ చెట్ల కింద కూర్చుని ఉండిరో, అకస్మాత్తుగా ఆ చెట్లు మధ్యాహ్న సమయంలో అందరిముందే కాలిపోయాయి. పచ్చగా ఉన్న చెట్లు కాలిపోవడం చూసి అందరూ విస్మయులయ్యారు. దీని మర్మం ఎవరికీ తెలియలేదు. ముందుగా ప్రభువు ఎక్కడైతే కూర్చున్నారో ఆ చెట్లు కాలిపోవడం వల్ల ఎంతో మందికి ఇది అరిష్టంగా అనిపించి ప్రభువు ఈ ప్రదేశం విడిచి వెళ్ళాలనుకునే వారు పోగయ్యారు. ప్రభువు ఇంత సామర్థ్యులై ఉండి బిల్వవృక్షాలు కాలిపోవడం మంచిది కాదని భక్తులు దాని గురించి ప్రభువును అడిగారు. వాళ్ళ ఆలోచన ప్రభువు తెలుసుకొని, ''చూడండి, మీరంతా శంకరభక్తులు. మీరు ప్రయత్నిస్తే కాలిన ఆ బిల్వ వృక్షాలు సజీవమవుతాయి. ఎనిమిది రోజులు చెట్లు ఉన్న ప్రదేశంలో పాలతో అభిషేకం చేసి చూడండి. మీ భక్తికి శంకరునికి ప్రసన్నత కలుగుతుంది'', అన్నారు. కొంతమంది అలాగే చేశారు. ఆశ్చర్యంగా ఆ చెట్లు పూర్వంలాగా తిరిగి చిగురించాయి. ఈ సంఘటన చాలామంది సమక్షంలో జరిగింది. కొందరు చూసేవారికి వృక్షంపై ఉన్న బ్రహ్మ రాక్షసులకు ప్రభుదర్శనంతో, స్పర్శతో ముక్తి లభించిందని అర్థమయింది. ప్రభు నివాసము ఇక్కడ స్థిరమయినప్పటి నుండి శిష్యమండలికి నిత్య కార్యక్రమాలు నిర్ధారించబడ్డాయి. ప్రభువు సోదరుల ఆజ్ఞానుసారం నిత్యం పూజ, అర్చన, నైవేద్యం, ఆరతి ప్రభు ముందు మరియు గాది ముందు జరిగేవి. ఏడువారాల భజనలు తయారయ్యాయి. వారంలో రోజూ ఆ రోజు దేవత యొక్క భజన గాది ముందు చేయబడి, నిర్ధారించిన ఆరతి జరిగి శేజారతి జరిగిన తరువాత నిత్యకార్యక్రమాలు ముగిసేవి. శేజారతి నిత్యపఠన క్రమం గ్రంథస్థం చేయబడ్డాయి. భజనలో సర్వశిష్య మండలి, సేవకులు పాల్గొనేవారు. అన్నీ తాత్యామహరాజులవారు క్రమపద్ధతిలో జరగాలని చెప్పడం వల్ల అందరూ అలాగే నడుచుకునేవారు. గాదీ ముందు ఏదైతే ధనం పోగవుతుందో అది

బయమ్మ కుటుంబ యోగక్షేమాలకు వినియోగించుకునేవారు. భండారుఖానాలోని అన్నపూర్ణ అందరికి అన్నాన్ని సంపూర్తిగా అందిస్తూండేది. రెండు నదులు సమృద్ధిగా నీటివసతి కలుగజేస్తుండేవి. ఎండా కాలంలో చిన్న చిన్న బావులు తయారై త్రాగే నీరు రుచికరంగా తియ్యగా దొరికేది. అన్నోదకాల వ్యవస్థ పూర్తిగా జరిగి ప్రభు సామర్థ్యంతో వస్త్రాలకూ లోటు ఉండేది కాదు. ఈ విధంగా ప్రభువు అన్న పానీయ, వస్త్రాల లోటు లేకుండా భక్తుల యోగక్షేమాలు చూసేవారు. పాడుబడ్డ నిర్జన అరణ్య ప్రాంతంలో సంపూర్ణ స్వర్గ సౌఖ్యాలు లభించసాగాయి. ఎక్కడైతే మనుష్యుల అస్థికలు (ఎముకలు) పడుతుండేవో అక్కడ ఏనుగులు తిరుగుతున్నాయి. ఎక్కడైతే దొంగల భయంతో మెడలు తెగిపడెవో ఆ ప్రదేశంలో రాత్రింబవళ్లు ఊయలలు ఊగుతూ చంటి పిల్లల తల్లుల మధుర గానామృతాలు వినిపించసాగాయి. గాది స్థాపన జరిగిన రోజు చాలా మహత్తరమైన రోజు. దత్తాత్రేయుల ఆధిభౌతిక, ఆధిదైవిక మరియు ఆధ్యాత్మిక శక్తి శ్రీ ప్రభు, దాదామహారాజ్ మరియు తాత్యామహారాజ్ ఈ ముగ్గురు సోదరుల రూపంలో ప్రకటితమయింది . ఈ మూడు రకాలైన సామర్థ్యం ఈ సోదరుల రూపంలో భిన్నంగా ఉండి గాది రూపంలో ఏకరూపమయింది. అవధూత దత్తాత్రేయులు ప్రభువై ఉండిరి. ప్రభుగాది స్థాపన జరిగిన రోజు శ్రేష్టమైనదనడం సహజం. ఎవరో అదృశ్య పురుషుడు 'భక్తకార్య' బిరుదావళి ఉచ్ఛ స్వరంలో అన్నారు అని అంటారు. సంప్రదాయానికి ఒక మూర్తిత్వం వచ్చింది ఆ రోజే. ప్రభువు దర్శనం అవగానే భిన్న మతాల భిన్న ఆలోచనలలో ఐక్యత కనిపిస్తుంది. అది అన్నికంటే అద్భుత చమత్కారం. శైవమతవాది లోకులకు ప్రభువు శంకరరూపంలో, లింగాయత్ జనులకు బసవేశ్వరుని రూపంలో, శక్తి ఉపాసన చేసేవారికి ప్రభువు సాక్షాత్ దేవి రూపంలో కనిపించేవారు, అగ్నిహోత్రి బ్రాహ్మణులకు సాక్షాత్ అగ్నినారాణ ప్రభువు రూపంలో కనిపించారు. కొందరికి సూర్యుడుగా దేదీప్యమానంగా కనిపించేవారు. ధార్మికులకు తమ ధర్మం యొక్క ఉజ్వల స్వరూపం ప్రభువు ఉన్న ప్రదేశంలో కనిపించేది. ఇదే లోకోత్తరమైన చమత్కారం. సర్వధర్మాలవారు, మతాలవారు తమదే గొప్పదన్న మర్మాన్ని వీడి ఆత్మీయ భావనతో ప్రభువు వైపు చూసేవారు. ప్రభువుయొక్క బిరుదావళిలో ప్రథమ పదం భక్తుల యొక్క మనోకాంక్షలు పూర్తి చేయడం (భక్తకార్య కల్పద్రుమ). దీని అనుభవం ప్రభువు బాల్యంలోనే జనులకు వచ్చింది. చివరి పదం 'సకల మతస్థాపితసద్గురు' ఈ

పదం యొక్క అనుభవం ఇప్పుడు పూర్తి అవగతం అయింది. బిరుదావళిలో ప్రతి పదం ప్రభువుకి సంబంధించి అన్వయించ బడుతుంది. జనం దాని పూర్తి మహత్యం తెలుసుకున్నారు కాబట్టి అందరూ ఒకే కంఠంతో ప్రేమతో నిండిన అంతః కరణతో ఈ బిరుదావళిని అంగీకరించారు. మాణిక్‌నగర్ యొక్క స్థాపన, గాది స్థాపన ఉత్సాహభరితంగా పెద్ద సమారంభంతో జరిగి, కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. ప్రభువు యొక్క కీర్తి అన్ని వైపుల వ్యాపించి ఆసేతుహిమాచలం ప్రాకిపోయింది. బిరుదావళి యొక్క గర్జన అఖండంగా నడుస్తూనే ఉంది. మట్టితో కట్టి గోనెసంచులతో కప్పబడిన ప్రదేశంలో గాదీ స్థాపన జరిగెను. కానీ, ప్రస్తుతం ఆ ప్రదేశంలో లక్షల రూపాయల ఖర్చుతో కట్టబడిన సుందరమైన మందిరం సువర్ణ కలశంతో భువన మండలంపై మెరుస్తూ కనవడుతుంది. ప్రథమంగా గోనెసంచుల గుడిసెలతో నిండిన మాణికనగర్ ప్రస్తుతం ఆకర్షణీయమై సర్వోత్తమమైన క్షేత్రమైంది. మొదట దీనికి జనం 'ప్రభు కట్ట' అనేవారు. ఇప్పటికీ పల్లెటూరువారు 'పర్‌బున్ కట్టి' లేదా 'ప్రభు కట్ట' అనే పిలుస్తారు. ప్రభువు ఇక్కడికి రాగానే ముందుగా కట్టపై కూర్చున్నారు, అందుకని ప్రభు కట్ట అని పిలవసాగారు. అక్కడ వాడాలో ఉన్న ఒక తులసీ బృందావనం దాని పక్కన కట్టపై కూర్చున్నారని కొందరు, సర్వేశ్వరుని దేవాలయానికి దగ్గర ఉన్న బిల్వ చెట్ల క్రింద కూర్చున్నారని కొందరు అంటారు. అప్పటి బిల్వ చెట్లు ఇప్పుడు కనిపించవు. సర్వేశ్వరుని దేవాలయానికి దగ్గరలో ఇప్పుడు కట్టడాలు నిర్మించబడ్డాయి. సర్వేశ్వరుని ముందు ఉన్న కుండము మూసుకుపోయింది. ఇప్పుడు ప్రభు సమాధి ఉన్న ప్రదేశంలో ప్రభు నివసించే గది ఉండేది. అప్పటి మాణిక్ నగర్‌కి ప్రస్తుత మాణిక్ నగర్‌కి భూమికి ఆకాశానికి ఉన్నంత తేడా ఉంది. భవిష్యత్ కాలంలో ఇంత కంటే ఉజ్వలంగా ఉండవచ్చు. ఆ సమయంలో ఈ నగర స్వరూపం ఎలా ఉంటుందో ఎవరు చెప్పగలరు?

గ్రామంలో నివసించిన తరువాత గ్రామంలో తప్పకుండా ఉండాల్సిన వాటి గురించి ఆలోచించవలసివచ్చింది. అన్నివైపుల సిపాయిలు ఉండడానికి పహరా కాయడానికి స్థలాలు, చౌకులు నిర్మించడం జరిగింది. దేవస్థానంలో సౌకర్యాలు కల్పించడం జరిగింది. కళ్యాణ్ నుండి ప్రభువుతో ఆటలాడిన వారు వచ్చారు. వాళ్లకు ప్రభువు బాధ్యతాయుత పనులను అప్పచెప్పారు.

బప్పాచార్య అనే ఆయన వైష్ణవులైనా కూడా ప్రభు భక్తులై ఉండేవారు. ఈయన వస్తూ పోతూ ఉండేవారు. ప్రభువుతో నిరంతరం బ్రహ్మచారి చిమన్యా, గోపాల్‌బువా, లంగోటి రామన్న ఇంకా అనేకమంది నిత్యం ప్రభువుతో ఉండేవారు. రామన్నది దుబుల్‌గుండి. ఆయన సోదరి సుందరమ్మ ఇక్కడే ఉండేవారు. వెంకమ్మ ఉండే ప్రదేశం విడిగా ఉండేది. ఈ యోగిని యొక్క చరిత్ర ఇంతకు ముందు ఇవ్వడం జరిగింది. ఈమె సామర్థ్యము దిన దిన ప్రవర్థమానమవుతూ ఆమె పరమపదానికి చేరుకున్న విధము ముందు వచ్చే కథా భాగంలో వివరించడం జరిగింది.

తాత్యామహరాజ్ కళ్యాణ్ నవాబు వద్ద ఉద్యోగంలో ఉండెనని చెప్పబడెను. రాజదర్బార్‌కు సంబంధించిన పద్ధతులు ఈయనకు అవగతం అవడం వల్ల ప్రభు దర్బార్ రూపం క్రమ పద్ధతిలో తయారు చేశారు. ఈయన అప్పుడపుడు కళ్యాణ్ వెళ్ళి వస్తూ ఉండేవారు. ఈయనకు భక్తులు, సేవకుల నుండి గౌరవం లభించేది. ఈయన శిస్తుగా పన్నులు వసూలు చేయడం వల్ల వ్యవహారం క్రమ పద్ధతిలో జరిగేది. ఈయన చిన్న వయస్సులో ఉండడం వల్ల మాతృశ్రీ బయమ్మ అదుపాజ్ఞలలో ఉండేవారు. దాదా మహరాజ్‌గారైతే అమ్మ ఆజ్ఞ జవదాటేవారు కాదు. ఈ విధంగా కొంతకాలం మాతృశ్రీ సంతోషంగా ఈ ప్రదేశంలో గడిపారు. ఆ తల్లికి తన జన్మ సార్థకమయిందనిపించింది. జగత్తుకి వెలుగైన ఆ ముగ్గురు పుత్రులు తన అదుపాజ్ఞలో ఉండి తనను సంతోషపరుస్తుంటే ఏ తల్లికి ఆనందం కలగదు? ఇంతకంటే ఈ జన్మకు కావలిసింది ఏదీ లేదని అనుకుని మాతృశ్రీకి తమ జన్మ ధన్యమయిందనిపించింది. స్త్రీ సహజ ధర్మంగా ఇప్పటి వరకు తాను చేసిన వ్రతాల ఉద్యాపన చేయలనే కోరిక ఉందని బయమ్మ చెప్పడం జరిగింది. మాతృశ్రీ ఇష్టానుసారం వ్రత ఉద్యాపనకు కావలిసినవి సమకూర్చడం జరిగింది. రాజేశ్వర్, కళ్యాణ్, హళిఖేడ్, బోరోల్, హుమనాబాద్ మొదలైన ప్రదేశాలనుండి ప్రసిద్ధ వైదిక బ్రాహ్మణులను పిలిచారు. తాత్యామహారాజ్‌తో ఉద్యాపన పుణ్యాహవాచనం చేయించి వ్రతాల ఉద్యాపన చేయడం జరిగింది. ఆ సమయంలో బ్రాహ్మణ భోజనం, దక్షిణ, బ్రాహ్మణులకు వస్త్రాలు మొదలైన వాటి ఖర్చు తాత్యామహరాజుల వారు తాను కళ్యాణ్‌లో పనిచేసిన జీతం నుండి ఇచ్చారని కొందరు చరిత్రకారులు వ్రాశారు. వేలరూపాయలు ఖర్చు చేసి మాతృశ్రీని సంతోషపరిచే విషయంలో ముగ్గురు

సోదరులు ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. ప్రభు దాతృత్వము యొక్క కీర్తి అన్నివైపుల వ్యాపించింది. దీనికి దృష్టాంతము ఈ సమారంభంలో కనిపించింది. వీరి తపశ్శీలతను వర్ణించడం సమంజసం అనిపిస్తుంది. భోజనం మరియు దక్షిణతో బ్రాహ్మణ వర్గం సంతుష్టులయ్యారు. ఇతరులు మహాప్రసాదం దొరికిందని సంతోషపడ్డారు. ప్రభువు కుటుంబంలో మొదటిసారిగా చేసిన శుభకార్యము నిర్విఘ్నంగా, సంతోషంగా జరగడం వల్ల మాతృశ్రీ బయాదేవితో పాటు భక్త మండలి ఆనందభరితులయ్యారు.

ఈ విధంగా సాగిన కార్యక్రమంలో భాగస్తులైన భక్త జనులు ఉద్యాపనకొరకు వచ్చిన స్త్రీ-పురుషులు రోజంతా పడిన శ్రమతో రాత్రి గాఢంగా నిద్రపోగానే అక్కడ నిశ్శబ్ద వాతావరణం కనిపించింది. ప్రభు దర్బార్‌లో ఉద్యాపనలో సంభావన దొరకడం వల్ల సంతోషంతో ఏ ఇతర ఆలోచన లేక నిద్రించారు. ఇదే అదను అనుకొని కొంతమంది దొంగలు దోచుకోవడానికి ప్రయత్నం ప్రారంభించారు. అందరూ తమ భార్యా బిడ్డలతో దగ్గర ఉన్న నగదు, బంగారం మూటలో పెట్టుకొని తలక్రింద పెట్టుకొన్నారు. కృష్ణపక్షం అవడం వల్ల చాలా చెట్లు గుబురుగా ఉండడం వల్ల ఒకరికి ఒకరు తోడులేకుండా ఖాళీ స్థలంలో పడుకుని ఉండిపోయారు. అక్కడ తలుపులూ, ఇనుపపెట్టె, గది లాంటివి ఏవీ లేకపోవడం వల్ల రక్షణ లేక మూటలు కట్టుకున్నారు. ఇలాంటి ప్రదేశంలో ఆ దొంగలు వెళ్తూ చెట్ల పండ్లను తెంపినట్లు దిండు క్రింద ఉన్న మూటలు తస్కరించడం ఆరంభించారు. తెలివైన వారు ఎవరైనా మేలుకుంటే కూడా ఆ ప్రదేశం గుబురుగా ఉండడం వల్ల ఎవరికీ తెలిసే ఆస్కారం లేకపోయింది. కొందరు ఇది చూసి అరవడం వల్ల అక్కడే కొంత జనం పోగయ్యారు. నగరమంతా దొంగలు దొంగలు అంటూ అరవగానే సందడి మొదలయింది. ఎంతోమంది ప్రభువును మేల్కొలపాలని పరిగెత్తు కుంటూ వెళ్ళారు. ప్రభు బిల్వ వృక్షం క్రింద గాఢనిద్రలో మంచంపై ప్రశాంతంగా పడుకొని ఉన్నారు. విషయం తెలియగానే వెంటనే మేల్కొన్నారు. కానీ, ప్రభువు అప్పటికప్పుడు దొంగలను పట్టుకోవాలని అనుకోలేదు. ఇలా చేయాలని కూడా ఎవరికీ చెప్పలేదు. చాలా మంది తమ మూట పోయినందుకు దుఃఖంతో ఏడుస్తుండగా ప్రభువు ఇలా అన్నారు. సద్గురువుకి మీ అందరి గురించి ఆలోచన ఉంది. నిజమైన శ్రమతో న్యాయంగా దొరికిన సంపద తీసుకుపోవడానికి ఎవరు సరయినవారు కారో వారికి తగిన శాస్తి జరుగుతుంది. ఇలా అని తిరిగి దుప్పటి కప్పుకొని పడుకున్నారు.

ఇప్పుడు అయిందేదో అయింది. ఇంకా సొమ్ము పోకూడదని జాగ్రత్త చేసుకోవడానికి ప్రయత్నం ప్రారంభించారు. కొంత మంది మంట పెట్టి మేలుకున్నారు. కొంతమంది మాట్లాడుకుంటూ అర్ధ రాత్రి నుండి సూర్యోదయం వరకు ఉండిపోయారు. ఇక్కడ ప్రభువు తన మధురమైన మాటలతో అందరికి హామీ ఇచ్చి తిరిగి పడుకున్నారు. అక్కడి నుండి 700 అడుగుల దూరంలో ప్రభు ఉన్న ఈశాన్యం వైపుకు ''ప్రభూ తప్పయింది. మేము అపరాధం చేశాం! మమల్ని క్షమించండి. మా నుండి ఇలాంటి తప్పు ఇంకెప్పుడు జరగదు. ఈ ప్రదేశంలో ఇంకెప్పుడు కాలు పెట్టము'' అనే రోదించే శబ్దాలు వినిపించసాగాయి. కాని ప్రభు వద్దకు వచ్చిన వారు అటువైపుకు వెళ్లలేదు. అందుకని సూర్యోదయం అయ్యేవరకు ఎవరూ అది గమనించలేదు. తెల్లవారుతుండగానే ఆ శబ్దాలు స్పష్టంగా వినిపించసాగాయి. అప్పుడు కొంత మంది ఆ గుంతవైపు నుండి ఎందుకు విలపించే శబ్దాలు వస్తున్నాయో చూడాలని అనుకున్నారు. అంతలో ప్రభు ఇద్దరు ముగ్గురు శిష్యులను తీసుకొని ఆ వైపుకు వెళ్లడానికి తయారయ్యారు. బిల్వ వృక్షాలకు కొద్ది దూరంలో ఊబితో నిండిపోయిన ఒక గుంత ఉండి ఆ గుంతలో ఇరవై ఐదు మంది దొంగలు పడి ప్రభువును పిలుస్తూ ఉన్నారు. రాత్రి జనం వద్ద నుండి దొంగిలించిన సొమ్మంతా వారి వద్ద ఉండెను. స్వతహాగా ప్రభువు అక్కడికి వచ్చిరి. తరువాత శిష్యమండలి కూడా అక్కడికి వచ్చారు. ఈ విషయం అందరికి తెలిసింది. ప్రత్యక్షంగా ప్రభువు వచ్చి నిలబడ్డా ఆ దొంగలకు కనిపించడం లేదు. పైకి కూడా రావడం లేదు. కొందరు వారికి కళ్ళు కనిపించడం లేదనుకున్నారు. అప్పుడు ప్రభు వాళ్లను ఇలా అడిగారు. మీరెవరు? ఈ గుంతలో ఎలా పడ్డారు? ఇప్పుడు బయటికి ఎందుకు రావడం లేదు అని. అప్పుడు ఆ దొంగలు ఇలా చెప్పసాగారు. ఈ అడవిలో ఉండి వచ్చి పోయే వాళ్లను దోచుకోవడం, దగ్గరలోని గ్రామాల్లో దొంగతనం చేయడం మా పని. ఇక్కడ మాణిక్ ప్రభు అనే సాధువు ఉన్నారని, ఆయన వద్దకు నిత్యం వేలమంది వస్తారని, వాళ్లను దోచుకుంటే సహజంగా ఏమైనా దొరుకుతుందనే ఉద్దేశంతో ఇలాంటి అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉన్నాము. ప్రభువు వద్ద జనం పోగవడం చూసి ఎంతయినా రెండు నెలలు ఖర్చు దొరుకుతుంది అని ఆలోచించి అందరి దగ్గర దొరికినంత దోచుకొని పారిపోతుండగా ఎవరో కట్టివడేసినట్లుగా ఈ గుంతలో పడ్డాము. లేచి పారిపోదామనుకుంటే మాకు కళ్లు కనిపించడంలేదు. ఇక్కడి నుండి ఎలా వెళ్లాలి? ఏం చేయాలి? నిజంగా మాణిక్ ప్రభు ప్రత్యక్ష దైవం అవడం వల్ల ఆయన దర్బార్‌లో తప్పు చేయడం వల్ల, వారు మా గర్వాన్ని అణిచారు. మాపై

కృపతో మమల్ని ఇక్కడి నుండి బయటికి తీసి పంపిస్తే మంచిది. లేకపోతే మేము చనిపోవడం ఖాయం. మాకు ప్రాణదానం చేసిన పుణ్యం మీకు లభిస్తుంది అంటూ వారు గట్టిగా ఏడవసాగారు. వాళ్లలో కొందరు శిష్యమండలిని తమలాగే భావించి డబ్బులు ఇస్తామని ఆశచూపారు. మాపై కృపతో కళ్లు పూర్వం లాగా వచ్చేటట్లు చేసి, ఈ సంకట పరిస్థితి నుండి ముక్తి కలిగిస్తే మేము జీవితమంతా వారి ఉపకారం మరువము. మాణిక్‌నగర్ వైపుకు మళ్లీ రాము. కావాలంటే ఇంకోదగ్గర దోపిడీ చేసి ప్రభు దర్బార్‌కి ఇస్తాము. ఈ విషయం ఎవరైతే ప్రభువుకు చెప్తారో వాళ్లను మా నాయకుడిని చేస్తాము. ఇలా అనేక విధాలుగా వారు వేడుకోసాగారు. ఆ దొంగల దైన్యస్థితి చూసి ప్రభువు అంతఃకరణలో దయ కలిగి వారి స్థితికి నవ్వు కూడా వచ్చింది. తన శిష్యులతో మొదట వారిని గుంతలో నుండి పైకి తీసుకురమ్మన్నారు. తరువాత తన శిష్యమండలితో చూడండి, సద్గురువుకి తన భక్తుల రక్షణ చేయవలసిఉంటుంది. మనుష్యులు చింతిస్తారు కాని చేయడానికి చేయించడానికి ఆ గురుమహరాజ్ సమర్థులై ఉన్నారు. ఆయన ఎప్పుడు అన్యాయం జరుగనివ్వరు. ఈ విధంగా శిష్యమండలిని సమాధానపరిచి పాపపుణ్యాల గురించి ఆ దొంగలకు కూడా బోధించారు. ఇది విని వారికి పశ్చాత్తాపం కలిగి ఇలాంటి పనులు తిరిగి చేయమని శపథం చేశారు. తరువాత ప్రభువు వాళ్ల దగ్గర ఉన్న మూటలలో తమ తమ మూటలను గుర్తించి తీసుకోమన్నారు. తన అమృతహస్తంతో జనాన్ని నిర్భయంగా ఉండమని చెప్పారు. ఎవరి సొమ్ము వారికి చేరగానే దొంగలకు తిరిగి చూపు లభించింది. ప్రభువుకే కాకుండా పూర్తి పరివారానికి నమస్కారం చేసి తమ ఇళ్లకు దొంగలు పయనమయ్యారు. వాళ్లలో కొంతమంది ప్రభు వద్ద సేవ చేస్తూ ఉండిపోయారు. ప్రభు వాళ్లకు అన్న పానీయాల సౌకర్యం కల్పించారు. ఇంటికి వెళ్లిన వారు కూడా చెడ్డ పనులు చేయకుండా ఉద్యోగాలు చేస్తూ మంచిగా ఉండసాగారు. దొంగల యొక్క నీచత్వాన్ని ఇలా భంగం చేయడం వల్ల ఎలాంటి చింత లేకుండా పోయింది. ఏ గుంతలో అయితే దొంగలు పడ్డారో ఆ గుంతను ఎక్కువగా త్రవ్వించి దాదా సాహెబ్ మహారాజ్ గారు జనం కోసం మంచి నీళ్లు త్రాగడానికి బావి కట్టించారు. దానికి 'మాణిక్ బావి'' అని పేరు పెట్టారు. ఈ విధంగా అన్నవస్త్రాల వసతి ప్రభు యొక్క సమర్థత వల్ల జరిగింది. ఒక విషయం ఏమిటంటే ఈ ప్రదేశంలో సహకుటుంబంతో ఉండడానికి వీలులేదు. ఇక్కడ ఉండే వాళ్లు బ్రహ్మచర్యం పాటించాలి. ఈ ప్రదేశం అభివృద్ధి చెందడానికి ఇది ప్రతిబంధకంగా ఉండేది. ఏవరైనా స్త్రీ – పురుషుల సంసార ధర్మం ఈ ప్రదేశంలో

జరుగరాదని, ఇలా కోరిక ఉన్నవారు మాణిక్ నగర్ యొక్క సీమ దాటి వెళ్లాలని నియమంగా ఉండేది. ఒక భార్యాభర్తలు ఈ నియమాన్ని ఉల్లంఘించడం వల్ల ఏం జరిగిందో క్రింద వివరించడం జరిగింది. గుప్త విషయం వెలుగులోకి రావడం వల్ల జరిగే అవమానం ఎలా వివరించాలి. ఇలా 2-3 సంఘటనలు జరగడం వల్ల అందరూ ఈ విషయాన్ని చర్చించసాగారు. కానీ మాణిక్ నగర్‌లో ప్రజాభివృద్ధి ఎలా జరుగుతుంది అన్న ప్రశ్న ఉదయించి ధర్మ శాస్త్రప్రకారంగా పరస్పర బద్ధులైన స్త్రీ పురుషులు స్వాభావిక కోరికను తృప్తి చేసుకోవడానికి అనుమతి తీసుకోవడం వల్ల మాణిక్ నగర్ ఉన్నతికి సహాయకారి అవుతుందనే నమ్మకంతో ప్రభువద్ద ఈ విషయం ఎవరు అడగాలనే పెద్ద పశ్న మొదలయింది. కాని అందరికీ మంచి జరిగే సమయం రావడం వల్ల ఈ విషయం పై నిర్ణయం జరిగే సందర్భం అనుకోకుండా కలిసివచ్చింది.

తాత్యామహరాజు భార్య సౌ|| విఠాబాయి ఆ సమయంలో ఋతుమతి కావడం జరిగింది. అప్పుడే తాత్యామహరాజ్‌గారు కళ్యాణ్‌కి వెళ్లి ఉండిరి. ఆయనను పిలిపించాలని దాదా మహరాజ్‌గారు లేఖ పంపించారు. తాత్యామహరాజ్ ఇక్కడికి వచ్చే ఆలోచనలో లేరు. చివరికి లేఖ చేతికి అంది విషయం తెలియగానే తాత్యామహరాజ్ వెంటనే మాణిక్ నగర్‌కి చేరుకున్నారు. గర్భదాన సంస్కారము ఎక్కడ జరగాలనే చర్చ వచ్చినప్పుడు కొందరు హుమనాబాద్‌లో చేయాలని సలహాఇచ్చారు. ఈ ముఖ్యమైన విషయంపై మాణిక్‌నగర్ యొక్క భావితరాభివృద్ధి ఆధారపడి ఉండడం వల్ల అందరూ సమాధానం కోసం ఆతురుతతో ఎదురుచూడసాగారు. చివరికి ప్రభువు అందరికీ అనుకూలంగా "తాత్యా గురు దర్బార్‌కు తన ఆదాయం నుండి ఐదు వేల రూపాయలు ఇస్తే ఈ శుభకార్యానికి అనుమతి లభించి ఇక ముందు ఎవరైనా పత్నితో ఇక్కడ ఉండడానికి ఏ విధమైన అభ్యంతరము ఉండదు అన్నారు". ఇది విని అందరికి సంతోషమయింది. తాత్యామహరాజ్ సంతోషంతో ఒప్పుకున్నారు. ఈ విధంగా అందరికి సహకుటుంబంగా మాణిక్‌నగర్‌లో ఉండడానికి వీలుకలిగింది.

ఈ విధంగా నగరము నివాస యోగ్యమై ఇక్కడ ఉండేవాళ్లకు ఉత్సాహం కలగసాగింది. నగరానికి దగ్గరలోని గ్రామాల వారు సంతోషంతో తమ గ్రామాల

భూమిని ఇవ్వసాగారు. కాని దానికి రాజమాన్యత దొరికితే తమకు ఆ భూమి చెందుతుందని వ్యవహార దృష్టితో తాత్యామహరాజ్‌గారికి ఆలోచన కలిగింది. కాని ప్రభు సామర్థ్యంతో దీనికి పరిష్కారం లభించింది. గడవంతి, హుమనాబాద్, దుమ్మన్‌సూర్ ఈ మూడు గ్రామాలు ఆ సమయంలో శమ్‌సుల్ ఉమ్‌రా నవాబ్ సాహెబ్ యొక్క జాగీర్‌గా ఉండేవి. నవాబ్‌సాహెబ్ ప్రభు యొక్క కీర్తి విని ఉండిరి. సన్మాన పూర్వకంగా పిలిచినా కూడా ఇలాంటి మహాత్ములు తమ జాగీరుకి రావడం కష్టం. అలాంటి అవకాశం అనాయసంగా రావడం వల్ల నవాబ్‌సాహెబ్‌కి ఆనందం కలిగింది. ప్రభువు స్థిరంగా ఇక్కడే ఉండాలనే ఉద్దేశంతో పై మూడు గ్రామాల భూమిని పట్టా చేయడానికి తన క్రింది తాలూకుదారుకు ఆజ్ఞాపించారు. ఆజ్ఞ ప్రకారంగా ఆ తాలూకుదారు ప్రభు చరణాలపై ఆ పట్టాను సమర్పించారు. ప్రభు విషయంలో ఆ తాలూకుదారు భక్తితో ఉండేవారు. ఈయన సర్వేశ్వర దేవాలయ జీర్ణోద్ధరణకు సహాయం చేశారు. హిందూధర్మ ప్రమాణంగా గ్రామంలో దేవాలయం తప్పకుండా ఉండాలి. మూర్తివంతమైన దేవునిగా ప్రభువు మాట్లాడుతూ తిరుగుతూ ఉన్నా కూడా నగర కళ్యాణం కోసం ఇతర దేవాలయాల ఆవశ్యకత కూడా ఉండేది. పూర్వం ఉన్న సర్వేశ్వర దేవాలయం పునరుద్ధరింపబడింది. భక్తుల కోరిక పూర్తి చేయడానికి అన్ని విధాలుగా తయారీ జరిగింది. దాదామహరాజ్ దేవాలయ పని మొదలుపెట్టారు. ఒక వడ్రంగి తన బండిపై ఒక పెద్ద నల్లరాయిని తీసుకొని వచ్చి ప్రభు ముందు పెట్టి ''ఇలాంటి శిల దొరకడం చాలా కష్టం. నాకు దొరికింది అందుకని మీ వద్దకు తీసుకొని వచ్చాను. దీనిని దేవతా శిల్పం చేసి కూర్చోపెట్టండి, మీకు మంచి జరుగుతుంది. '' అన్నారు. అప్పుడు ప్రభువు, ఆయన శుద్ధమైన అంతఃకరణకు మెచ్చి ''తాతా నీవు చెప్పినట్టే చేస్తాను. నీ ఆశీర్వాదంతో నాకు మంచిదవుతుంది. ఈ శిలతో శంకరుని లింగము తయారు చేసేవారు వెంటనే దొరికారు. కానీ, ఆయనకు కళ్లు చాలా రోజుల నుండి కనిపించడం లేదు. అది తెలిసి ప్రభు తన అమృత హస్తం కళ్లపై తిప్పగానే కళ్లు కనిపించాయి. ఆయన ఉత్సాహంతో మంచి పనితనంతో శంకరుని లింగాన్ని తయారుచేశారు. మహా శివరాత్రి రోజు పెద్ద సమారంభంతో ఆ లింగ స్థాపన జరిగింది. మాణిక్ నగర్‌లో పూర్తి రాళ్లతో కట్ట బడిన మొదటి కట్టడము ఈ సర్వేశ్వరుని దేవాలయమే.

# 26. మారుతి దేవాలయము మరియు ఛల్లా

ఒక సాధువు తలపై ఒక మారుతి మూర్తిని పెట్టుకొని పన్నెండు సంవత్సరములు తీర్థయాత్ర చేశారు. అలా యాత్ర చేస్తుండగా ప్రభువు యొక్క కీర్తి విని మాణిక్‌నగర్‌కు వచ్చారు. అహోరాత్రులు ఆ మూర్తిని తలపై పెట్టుకొని ఉండేవారు. ఇక్కడికి రాగానే ఆ మూర్తి ఆయనకు బరువుగా అనిపించి ప్రభు ముందుకు వచ్చి ఇలా అన్నారు. 'మహారాజ్ ఈ మారుతికి మీ సన్నిధిలో ఉండాలని కోరిక. రాత్రి నాకు స్వప్నంలో కనిపించి చెప్పిన తరువాత ఇక్కడికి వచ్చాను. మీరు నా తలపై నుండి ఈ మూర్తిని దించి మీకు ఎక్కడ సరైన ప్రదేశం అనిపిస్తుందో ఆ ప్రదేశంలో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠ చేయండి.'' ఆయన వినతి ప్రకారం ప్రభు స్వహస్తాలతో ఆ మూర్తిని దించి ఆయనకు ముక్తి కలిగించారు. వాడాలో తులసీ బృందావనం ఉన్న కట్టపై మొదట మూర్తి పెట్టబడింది. తరువాత దాదామహారాజుల వారు గ్రామానికి పశ్చిమ దిక్కులో ఉన్న చిన్నదేవాలయంలో మూర్తి స్థాపన చేయడం జరిగి తరువాత సముద్ధరించారు. ఈ విధంగా చిన్న పెద్ద నిర్మాణాలు జరుపబడ్డాయి. సర్వేశ్వర్, మారుతి యొక్క పూజ వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ మారుతికి మొదటి నుండి ఉగ్ర స్వభావం కలవారని ప్రసిద్ధి. ఈ అనుభవం ప్రజలకు కలుగసాగింది. పూజారి తప్పు పని చేస్తే అతనికి శిక్ష పడేది. అందువల్ల ఏ పూజారి ఉండలేక పోయారు. చివరికి ప్రభువు మారుతిని శాంత పరిచి అందరి భయాన్ని దూరం చేశారు. మెల్ల మెల్లగా మాణిక్‌నగర్ గ్రామం విస్తరించసాగింది. కళ్యాణ్‌కు చెందిన వారు కొందరు ఇక్కడే ఉండాలని వచ్చారు. హరినాథ్ ప్రసాద్ అనే కానోజీ బ్రాహ్మణుడు ప్రభుసేవ చేయడానికి ఇక్కడికి వచ్చి ఉండిపోయారు. చిన్నతనంలో ప్రభుతో అనేక ఆటలు ఆడి వారిని చూసి ఉండడం వల్ల ప్రభు యొక్క అలౌకిక సామర్థ్యం తెలియడం వల్ల ప్రభువు తప్ప ఇతర దైవం లేదని ఆయన భావించేవారు. ప్రభువుపై ఆయనకు అమితమైన ప్రేమ ఉండేది. ఆయన కుటుంబం కూడా ఇక్కడే ఉండేది. భార్య గర్భవతి అవడం వల్ల ఇతర గ్రామంలో ఉంచాలనే ఆలోచనతో గడవంతీలో స్థలం చూడడానికి వెళ్లగానే ఇక్కడ భార్య ప్రసవించింది. తిరిగి వచ్చి చూడగానే ప్రభు మహరాజ్ ఆజ్ఞతో అన్ని ఏర్పాట్లు సరైన రీతిలో

జరిగాయి. స్వయంగా ప్రభువే ఆయన ఇంటికి వెళ్లారని అంటారు. తమ ప్రియమైన భక్తుల కొరకు ఎల్లప్పుడూ అభయ హస్తం చూపించే ప్రభు తమను విస్మరించరని భక్తులకు నమ్మకం కలిగింది.

విరజా మరియు గురుగంగా ఈ రెండు చిన్న నదులు మాణిక్ నగర్‌కి పూర్వదిశలో సంగమమయ్యాయి. ఈ స్థలం చాలా రమ్యంగా ఉంటుంది. రెండు నదుల మధ్య భూమి సస్యశ్యామలంగా ఉండడం వల్ల ఈ భూమిలో ఇతర చెట్లతో పాటు మామిడి చెట్లు నాటడం వల్ల శోభ సంతరించుకుంటుందని భావించి ఆ కార్యక్రమానికి దాదామహరాజుల వారు శ్రీకారం చుట్టారు. వాస్‌గీ కల్లప్ప అనే వైశ్య శిష్యుడు సంగములో శంకరుని మందిరము కట్టించారు. గోసాయి, బైరాగులకు, సాధువులకు ఇక్కడ ఉండడానికి స్థలం ఇవ్వబడింది. ఈ భూమి సహజంగానే తపస్సు చేయడానికి అనుకూలంగా ఉండడం వల్ల చాలామంది తపస్సు చేసేవారు ఇక్కడ ఉండసాగారు. ఈ విధంగా అన్ని రకాల భక్తులకు, జనులకు అనుకూలత ఉండడం వల్ల ఆకర్షణీయమైన స్థలంగా మాణిక్‌నగర్ కనిపించసాగింది. ముసల్మాన్ భక్తుల కోసం నగరానికి ఉత్తర దిశలో కొండపై ఒక స్థలం చూపించి ప్రభు తన టోపిని ప్రసాదంగా ఇచ్చారు. దానిపై చల్లా (పైకప్పు లేని కట్టడం) నిర్మించబడింది. తమను భక్తితో ఆరాధించే ముస్లిం భక్తులకోసం ప్రభు ఈ స్థలం నిర్మించారు. ప్రభువుని మహబూబ్ సుభానిగా భావించే ముస్లిం భక్తులు ఇప్పటికి ఇక్కడికి వచ్చి ప్రభు ఉపాసన చేస్తారు.

## 27. గ్రామాభివృద్ధి

మాణిక్‌నగర్ ఇలా అన్ని విధాలుగా అభివృద్ధి చెందసాగింది. వ్యవహారాలలో ప్రభు ఖచ్చితంగా ఉండేవారు. ముగ్గురు సోదరులు ఒకే ఆలోచనతో మాణిక్‌నగర్ అభివృద్ధి గురించి ఆలోచించేవారు. ఈ త్రిమూర్తులలో ప్రభు మహరాజ్ వద్ద పారమార్థిక శ్రేష్ఠత్వము ఉన్నా కూడా వ్యవహారిక దృష్టిలో మాత్రం మిగిలిన ఇద్దరి వ్యవహారాలు సామాన్య లోకులకు ఆమోదయోగ్యంగా ఉండేవి. వారు ప్రభుతో పాటు వారి అన్న తమ్ములను కూడా అంతే గౌరవించేవారు. వాళ్ల మధ్య బేధభావం ఎవరూ చూపించేవారు కాదు. కారణం

ఈ ముగ్గురు పరస్పరం అత్యంత ప్రేమ పూర్వక ఆదరణతో నడుచుకునేవారు. వయస్సు విషయంలో తారతమ్యం లేకుండా కృత్రిమత్వం లేకుండా ప్రేమతో మాణిక్‌నగర్ అభివృద్ధికి కృషి చేశారు. మాణిక్ నగర్ స్థాపన జరిగేటప్పుడు తాత్యామహారాజ్ గారు ఇక్కడే ఉండి సంస్థాన కార్యభారము వహిస్తారని ఎవరూ ఊహించలేదు. కారణం మొదటి నుండి ఈయన స్థితి ఇద్దరి సోదరులకంటే భిన్నంగా ఉండేది. దాదామహారాజ్ మరియు ప్రభువు వలె వీరు విరక్త బ్రహ్మచారి కాదు. దాదామహరాజ్‌ల వారు పెళ్లి చేసుకున్నా కూడా భార్య చిన్న వయస్సులోనే మరణించడం వల్ల మౌన బ్రహ్మచారిగా ఉండిపోయారు. తాత్యామహరాజులవారు గృహస్థ ఆశ్రమంలో బంధీ అయ్యారు. ఇప్పుడు పూర్తి గృహస్థు అయ్యారు. గృహస్థాశ్రమానికి కావలసిన సాధన సంపత్తి అనుకూలంగా ఉండేది. భార్య సాత్వికయై మిత భాషియై, రూప సంపన్నురాలై ఉండెను. వ్యవహారిక శిక్షణ సరైన రీతిలో జరగడం వల్ల బుద్ధిమంతురాలై ఉండిరి. తాత్యామహారాజ్ శిక్షణ ఉన్నత స్థితిలో ఉండెను. వారు రచించిన అష్టకాలు, పదాలు వారి విషయ పరిజ్ఞానానికి సాక్షిభూతాలు. వ్యవహారానికి కావలసిన కుశల పరిజ్ఞానం వారి వద్ద అపరిమితంగా ఉండేది. నవాబుల దర్బారులో వీరి గౌరవం పెరగసాగింది. మరియు అబాల వృద్ధులకు ఈయన ప్రీతి పాత్రులయ్యారు. ఈ విధమైన వైభవమును, సంపన్న స్థితిని వదిలి మాణిక్ నగర్ ఫకీరు దర్బార్‌లో వచ్చి ఉంటారని ఎవరు ఉహించగలరు? కళ్యాణ్‌లో ఉండి మాణిక్‌నగర్‌కి వస్తూ పోతూ ఇక్కడ వ్యవహారాలు నడిపిస్తారని అందరూ అనుకున్నారు. ఆయన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చినా ఆ విషయం ఎవరితోను అనలేదు. దాదామహరాజగారికి ఈ విషయం తెలియక కుటుంబాన్ని కళ్యాణ్ తీసుకువెళ్లమని చెప్పారు. అయినా కూడా ఇక్కడి నుండి వెళ్ళే విషయం మాత్రం కనిపించలేదు. ఉద్యోగానికి తొందరగా వెళ్లాలని ప్రభువుతో కూడా చెప్పిచూశారు. తాత్యా ప్రాపంచిక విషయంలో భాగం వహించాలని, కీర్తి లభించాలని మాతృశ్రీకి ఉండేది. ఇక్కడ అడవిలో ఫకీరుల కుటీరాలలో తన యవ్వనంలో ఉన్న పత్నితో తాత్యా ఐహిక సుఖాలను త్యజించి ఇక్కడ ఉండడం మాతృశ్రీకి ఇష్టంలేదు. మిగిలిన ఇద్దరు పారమార్థిక వైభవాన్ని అనుభవిస్తూనే ఉన్నారు. ఈ మూడవ కుమారుడైనా ప్రాపంచిక జ్ఞానంతో సంసారం చేయాలని ఆ తల్లికి తీవ్ర కోరిక ఉండేది. కానీ కళ్యాణ్‌కి వెళ్లకపోవడం చూసి ఆమెకు చింత మొదలయింది. అందుకని ఒకసారి దీనికి పరిష్కారం చూపించాలని

ప్రభు ముందు ఈ విషయం చెప్పగానే ప్రభు సముదాయించడానికి ప్రయత్నం చేశారు. చివరికి తాత్యామహారాజులవారు సమాధానం చెప్పారు. మీ వంటి జగద్వంద్యులైన సోదరుడిని, పరమపూజ్యులైన మాతృశ్రీని విడిచి నేను ఎక్కడికి వెళ్లాలి? మీ సేవ చేయడం నా ధర్మం. మీ సన్నిధిలో లేకపోతే సేవ చేసే భాగ్యం ఎలా కలుగుతుంది? అందుకని మీ అందరి చరణాలు విడిచి నేను ఎక్కడికీ వెళ్లను. రాజీనామా ఇంతకు ముందే ఇచ్చి వచ్చేశాను. ఈ సమాధానంతో మాతృశ్రీ నిరాశ చెందినా తాత్యా మహరాజ్‌ల వారు చిరకాలం తమతో నివసిస్తారని ఒక రకంగా సమాధానపడ్డారు.

ఇక్కడ కళ్యాణ్ నవాబుకు తాత్యామహరాజుల వారు ఉద్యోగం విడిచి వెళ్ళడం ఇష్టం ఉండేది కాదు. నవాబు తాత్యాగారు చేసే పనితో సంతృప్తిగా ఉండేవారు. ఇలా సర్వగుణ సంపన్నులైన వారు విడిచి వెళ్లడం అసంతృప్తిగా అనిపించింది. ఆయన రాజీనామా మంజూరు చేయకుండా పని ముగియగానే వెంటనే పనికి హాజరు కావాలని భావయుక్తంగా లేఖ వ్రాసి ఉద్యోగానికి తిరిగి రప్పించడానికి ప్రయత్నం చేశారు. తన ప్రయత్నం ఫలించదని తెలిసి తమ మనిషిని ఒకరిని పంపించారు. తాత్యామహరాజుల వారు తన నిర్ణయంపై స్థిరనిశ్చయంతో ఉన్నారు. ఒక్కసారైనా తాత్యామహరాజ్‌ల వారిని కళ్యాణ్‌కి రప్పిస్తే ఆయన మనసు మార్చవచ్చని అభిప్రాయపడ్డారు. కాని ఆ ప్రయత్నం ఫలించక లెక్కలు చూపించడానికి రావాలని తగాదా ప్రారంభించారు. ఈ విధంగా అన్ని ప్రయత్నాలు వ్యర్థమవడం వల్ల కోపంతో సర్కారు ఆజ్ఞ ప్రకారంగా తన వద్ద పని చేసే అధికారులను పంపించి హుకుం జారీ చేశారు. దానిని ఎలా పరిష్కారం చేయాలో వ్యవహారజ్ఞానం కలిగిన తాత్యామహరాజ్‌కి తెలుసు కనుక ఆయన నవాబు యొక్క యుక్తి తెలుసుకొని ఆ ప్రయత్నాన్ని నిష్ఫలం చేశారు. ఈ విధంగా తాత్యా మహరాజ్ నివాసం మాణిక్ నగర్‌కు మారింది. తాత్యామహరాజ్‌ల వారు మాణిక్‌నగర్‌లోనే నివసించడం వల్ల పద్ధతి ప్రకారంగా విధులు జరిగి సంస్థానము దర్బారీ శోభ సంతరించుకుంది. ఆధిభౌతికము, ఆధిదైవికము మరియు ఆధ్యాత్మిక విషయ తాపాలు భక్త జనులకు లేకుండా చేసి, వ్యవస్థాయుత పరిపాలన చేసే పని ఈ ముగ్గురు సోదరులు పంచుకున్నారు. ఆ సమయంలో అనేక రకాలైన వారు నిత్యం వచ్చేవారు. వారి అన్నపానీయాల వ్యవస్థ దాదా మహారాజ్‌ల వారే చూసేవారు. స్త్రీ-పురుషులు, పిల్లలకు కావలిసిన సదుపాయాలు కల్పించడం, చిన్న పిల్లలకు పాలు అందివ్వడం స్వయంగా తమ

పర్యవేక్షణలో చేయించేవారు. సూర్యోదయానికి ముందే లేచి పిల్లల తల్లులు రాకపోతే వాళ్లకు పాలు అందించే ఏర్పాటు చేసేవారు. అన్నము తినేవారికి ఉదయం బియ్యం సమకూర్చి మధ్యాహ్న భోజనానికి భండారుఖానాకు తీసుకువెళ్లి కడుపునిండా భోజనం చేయించేవారు. భోజనం చేయని వారికి కావలిసిన సామాగ్రి ఇవ్వడం, ధోవతులు, పంచెలు, రుమాళ్లు, గొంగళ్లు, లంగోటీలు ఇలా ఎవరికి కావలిసిన వస్త్రాలు వారికి ఇచ్చే ఏర్పాటు చేసేవారు. వచ్చి పోయే వాళ్లకు అన్న, వస్త్ర, స్థల సదుపాయాలు కలిగించడం అత్యంత శ్రద్ధతో చేయడం దాదామహరాజుల వారికి నిత్యక్రమంగా ఉండేది. గోసాయిలు, బైరాగులు, ఫకీరులు, సాధు సన్యాసులు, నిత్యం గుంపులుగా వచ్చేవారు. నిత్య దర్శనానికి వచ్చే వాళ్లకు కావలిసిన వస్తువులనిచ్చేవారు. నగరంలోని సిపాయిలు, నౌకరుదారులపై తాత్యామహరాజులవారు పర్యవేక్షించేవారు. ఈయన చిన్నప్పటినుండి రాజదర్బార్‌లో ఉండడం వల్ల పద్ధతి ప్రకారం సువ్యవస్థాయుత దర్బారు శోభ మరియు రాజ ఐశ్వర్యాలను ఇష్టపడేవారు. సంస్థానానికి దర్బారు క్రమం వీరే తయారు చేశారు. జనులకు తాత్యామహరాజుల వారిపై అభిమానంతో కూడిన భయం ఉండేది. క్రమం తప్పితే వెంటనే ఆయన పసికట్టేవారు. సరియైన శాసనం చేయడం, తప్పును సరిదిద్దడంలో ఆయన అలసత్వం ఎప్పుడూ చూపలేదు. తాత్యామహరాజ్‌ల వారి నివాసం మాణిక్‌నగర్‌లో స్థిరమైనప్పటి నుండి మాణిక్‌నగర్‌కు ఒక చిన్న రాజధాని స్వరూపం వచ్చింది. పరిపాలన వ్యవస్థ సక్రమంగా చేయడానికి ఎక్కువ రోజులు పట్టలేదు. జనంలో అభిప్రాయబేధాలు రాకుండా ఆయన మంచి దక్షతతో పని జరిపించేవారు. ఒకవేళ వచ్చినా వారిని సమాధానపరిచి సయోధ్య కుదుర్చేవారు. నగరప్రజలకు నష్టం జరగకూడదని పూర్తి బందోబస్తు చేయించారు. నగరానికి పూర్వ పశ్చిమ దిక్కులలో ఎత్తైన కట్టడాలపై చౌకులు నిర్మించి, కాపాలదారులను నియమించారు. ప్రభు యొక్క గుడారం వద్ద కాపాలా నియమించబడింది. ద్వారపాలకునిగా పదమ్‌సింగ్ ఉండేవారని ఇంతకుముందే వ్రాయబడింది. పద్దులు వ్రాసే వారిపై, సిపాయిలపై, పహరా కాసేవారిపై సరైన రీతిలో చూసి, సంస్థానము యొక్క కార్యమును ఉత్తమ రీతిలో నిర్వహించేవారు. మాణిక్‌నగర్‌లో వ్యవహారిక ఉపాధి విషయంలో ప్రభు మితంగానే ఉండేవారు. ఈ విషయంలో ఎప్పుడు చింతించే అవసరం ఆ ఇద్దరు రానివ్వలేదు. వచ్చిపోయేవాళ్ల విషయంలో వారి అవసరాల విషయంలో దర్బార్‌లో ప్రభు నిశ్చింతగా ఉండేవారు. ఆర్తుల యొక్క దుఃఖ నివారణ చేయడం, జిజ్ఞాసువు యొక్క జ్ఞాన పిపాస తృప్తి చేయడం, అర్థార్థియై వచ్చిన వారికి ద్రవ్యం ఇచ్చి సంతుష్టులను చేయడం లాంటి

మహత్త్వపూర్వమైన పనులు ప్రభువు తీసుకున్నారు. ప్రభువు యొక్క కీర్తి పరిమళం సర్వత్రా వ్యాపించి వేలమంది నిత్యం దర్శనానికి వచ్చి సంతుష్టులై వెళ్లేవారు. జనుల అంతరంగాన్ని తెలుసుకొని, ప్రభు వాళ్ల కోరికలను తీర్చడం ప్రతిరోజూ జరిగేది. ప్రభు చరిత్ర కోరికలను తీర్చే అద్భుత కథలతో నిండి ఉంది. అన్ని కథల యొక్క సంగ్రహం ఇక్కడ వివరిస్తే పెద్ద గ్రంథమే అవుతుంది. అందుకని అత్యంత మహిమగల విషయాలు, సంఘటనలు మాత్రమే వివరించబడ్డాయి. ఒక ప్రదేశంలో ప్రభు స్థిరంగా ఉండడం వల్ల వారి వద్దకు అనేక మంది జనం రాసాగారు. కాశీనుండి రామేశ్వరం వరకు ప్రభు యొక్క జయజయాకారాలు వినిపించసాగాయి. యాత్రికులు కావాలని ఇక్కడికి వచ్చి ప్రభు యొక్క దివ్య ప్రసాదం స్వీకరించి వెళ్లేవారు. ప్రభు సర్వకాలాల్లో ఆత్మయందు నిమగ్నమై ఆత్మానందంలో మునిగిపోయేవారు. ఎప్పుడు స్వరూపం మారలేదు. భక్తుల యొక్క సంకటాలను తనపై వేసుకొని అందరినీ నిర్భయంగా ఉండమనేవారు. హిందూ, ముస్లీం, సిక్కు, లింగాయాత్, జైన్ మొదలైన మతాల, ధర్మాల ప్రజలు ప్రేమ భావంతో ప్రభు వద్దకు వచ్చేవారు. ప్రభు వద్ద తారతమ్య బేధాలు ఉండేవి కావు. వారు అందరిని ప్రేమతో ఆకర్షించేవారు. శ్రేష్ఠ బీద, శ్రీమంతుడు, సామన్య ప్రజలు లేక అధికారులతో పాటు, చిన్న పిల్లలను, వృద్ధులను సమాన ఆత్మీయ భావంతో, ప్రేమతో అందరిని తనవైపు ఎలా ఆకర్షించుకున్నారో ముందు భాగంలో వివరించబడింది.

# ప్రభు దర్బార్

## 28. ప్రభు దర్బార్

దర్బార్ ఈ శబ్దానికి సామాన్య జనం మదిలో ఏ అర్థం స్ఫురిస్తుందో ప్రభునగరంలో అలా దర్బార్ స్వరూపం ఉండేదా అనే అనుమానం సహజంగా వస్తుంది. ఆధిభౌతిక శక్తి లేదా ఆధ్యాత్మిక శక్తి ఏ విధంగా భిన్నమైనవో వారి దర్బార్ స్వరూపం కూడా అలాగే భిన్నంగా ఉండేది. మాణిక్ నగర్ దర్బార్ కేవలం ఆధ్యాత్మిక స్వరూపంతో ఉండేది. దాని ముఖ్య ఉద్దేశం ప్రభు దర్శనంతో పునీతమవ్వడం, అందువల్ల దాని రచన భిన్నంగా ఉండేది. రాజదర్బార్ లోని

ఎన్నో విషయాలకు దీనికి పోలికలు ఉండడం పూర్వకాలంలోని రాజ దర్బార్‌ల యొక్క వర్ణన చదివిన వారికి తెలుస్తుంది. దీనిని తాత్యా మహారాజుల వారు రూపొందించారని ఇంతకు ముందే చదివాము. అందుకని దర్బార్‌కి రాజ దర్బార్ యొక్క స్వరూపం కనిపిస్తుంది. ఈ దర్బార్ ముఖ్య విషయం ఆధ్యాత్మిక శ్రేయస్సు సాధించాలనే కారణంతో పోగయ్యే జనసముదాయం. ప్రభు వద్దకు అనేక విధాలైన జనం వస్తారు. వాళ్లకు దర్శనం కోసం ఏర్పాటు చేయడం మండలి యొక్క విధి. దర్బార్ ఒక విశేష కారణంతో జరుగేది. ఉత్సవ కారణంగా లేదా పండుగ కారణంగా ప్రభు దర్శనం కోసం ఉత్సాహంతో వచ్చే వారికి ప్రభు దర్శనం లభించే విశేష దర్బార్ నిర్వహించబడేది.

దర్బార్ స్వరూపం రాజదర్బార్‌వలె ఏర్పాటు చేసినట్లుగా ఉండేది. ఒక పెద్ద మంటపం తయారు చేయబడేది. దానికి ఒకవైపు మధ్యభాగంలో తూర్పు ముఖంగా ఒక కట్ట తయారు చేయబడి ఆ కట్టపై ప్రభు కూర్చునే ప్రదేశం ఉండేది. మంచి నాణ్యమైన పరుపు, వీపువైపు మెత్తలు రెండు వైపులా చేతులు ఆనించి కూర్చోవడానికి దిండ్లు, కూర్చోవడానికి ఆసనం ఏర్పాటు చేయబడేవి. దీనికి దగ్గరలోనే ప్రభు కుటీరం ఉండేది. ఈ ప్రదేశంలో ప్రస్తుతం సుందరమైన సభా మండపం కనిపిస్తుంది. పూర్వం ఇదే దర్బార్ జరిగే ప్రదేశం అంటారు. కట్టముందు రెండువైపులా ఇద్దరు నిలబడేవారు. దర్బార్‌లో జనం నిండిన తరువాత 'భక్తకార్యకల్పద్రుమ' అనే బిరుదావళి యొక్క జయఘోష చేస్తుండగా ప్రభు మహరాజ్‌గారు వచ్చి ఆ పరుపు (గాది) పై కూర్చునేవారు. ప్రభువు వచ్చేటప్పుడు అందరూ నిలబడి నమస్కారం చేసి కూర్చోవాలి. ఇలా పద్ధతి ప్రకారం జరిగేది. గృహస్థుల కోసం ముందు భాగంలో స్థలం ఉండేది. సన్యాసి, శాస్త్రులు, వైదికులు, పురాణికులు, హరిదాసులు మొదలైనవారి కోసం ప్రభు కట్టకు కుడివైపున చోటు ఉంచబడేది. ఇంకోవైపు సాధువులు, బైరాగులు, గోసాయిలు, ఫకీరులు మొదలైన వారికోసం స్థలం కేటాయించబడేది. ముందువైపు పాడే వాళ్లకు, సన్నాయి డోలు వాయించేవారికి, నాట్యం చేసేవారికి ఇలా నృత్య గాన కౌశల్యం ఉన్నవారిని కూర్చోపెట్టేవారు. దర్బార్ అంటే పై అన్ని రకాల జనుల సముదాయం ఒక్క దగ్గర పోగయి తమ కళను ప్రదర్శిస్తూ ప్రభు దర్శనం మరియు ప్రసాదం పొందే మహత్తరమైన స్థానం. ఇలాంటి దర్బార్ ఇప్పటి సంస్థానాధిపతి కార్యకలాపాల్లో అనేక ప్రసంగాల్లో కూడా

చూడవచ్చు. ప్రభు యొక్క వస్త్రధారణ నిర్దిష్టమైనదిగా ఉండేదికాదు. ఆ సమయంలో ఏ ఆలోచన వస్తే ఆ విధంగా వచ్చి కూర్చునేవారు. అప్పుడప్పుడు తలపై విలువైన జరీ తలపాగాతో శరీరంపై అంతకంటే విలువైన జుబ్బా, మెడలో ముత్యాల హారం, చెవులకు కర్ణాభరణాలు, రత్నఖచిత పుష్పం తలపై పెట్టుకొని హుక్కా త్రాగుతూ కుర్చునేవారు.

ప్రభు యొక్క మూర్తిత్వం నయనమనోహరంగా ఉండేదని ప్రత్యక్షంగా దర్శించిన వారు వ్రాశారు. సాధారణ గోధుమరంగుతో ముఖం దివ్యంగా ఉండేది. శరీర శ్రద్ధ ప్రామాణికంగా ఉండేది. అత్యంత విలక్షణమైన దివ్య తేజస్సుతో అందరి మనస్సులను తనవైపుకు తిప్పుకునేవారు. మాటలు అత్యంత మృదువుగా ఉండేవి. నైసర్గిక కాంతితో వివిధ అలంకరణలతో కూడి ప్రభు యొక్క స్వరూపం దేదీప్యమానంగా ఉండేది. ఆ దర్బార్‌లో నృత్యగానాది లలిత కళల యొక్క ప్రదర్శన ఉండేది. దాంతో పాటు శాస్త్రకారుల వాదవివాదాలు నడిచేవి. వైదికుల మంత్రాలతో పాటు వేదాంత చర్చ జరిగేది. దర్శనానికి వచ్చిన వాళ్లను పరామర్శిస్తూ ప్రసాదం ఇవ్వడం జరిగేది. దర్బార్ అంటే శతావధాన ప్రయోగమని ఇప్పటి కాలంలో కూడా అనుభవంలోనికి వస్తుంది. ఒకే సమయంలో ప్రభు యొక్క దృష్టి అన్ని కార్యక్రమాలవైపు ఉండేది. శాస్త్రవాదనలో ప్రభువు దృష్టి ఉందని గాయకులు కొద్దిగా మనస్సులో అనుకొని తమ కార్యక్రమంపై దృష్టి మరల్చుతుండగా ప్రభు గానంవైపు దృష్టి నిలిపేవారు. ప్రసాదం తీసుకునేవాళ్ల ప్రతి ఒక్కరి మనసు తెలుసుకొని దాని గురించి మాట్లాడి ప్రసాదం ఇచ్చేవారు. ప్రతీ వ్యక్తి యొక్క మనసు తెలుసుకొని అందరిని సంతోష పరచడం దర్బార్‌లోని అపూర్వ విషయం.

ఈ విధంగా దర్బార్ అనియమిత కాలం వరకు నడిచేది. అన్ని వర్గాల వారికి దర్బార్‌లో మర్యాద లభించేది. అందరికి ప్రసాదం, సంభావన దొరికిన తరువాత దర్బార్ ముగిసేది. ఎన్నో సమయాల్లో మూడు రోజులు అహోరాత్రులు ఈ దర్బార్ పనులు జరిగేవి. ప్రభువు ఆసనముపై మూడు రోజుల వరకు కదలకుండా కూర్చునేవారు. ఆరురోజుల వరకు ఒకసారి దర్బార్ నడిచిందని అప్పటి వారు చెప్పేవారు. ప్రభు దర్బార్ గురించి ఇద్దరు ముగ్గురు లేఖకులు చేసిన వర్ణన పాఠకులకు తెలియాలని వారి మాటల్లో వివరించడం జరిగింది.

దాని నుండి ప్రభు దర్బార్ ఎలా ఉండేదో, సంస్థానము యొక్క వ్యవస్థ ఏ విధంగా ఉండేదో మనకు తెలుస్తుంది. ప్రభు యొక్క చరిత్ర హస్తలిఖితంగా వ్రాసిన వాటిలో వారు పడ్డ శ్రమ పొగడదగింది. వారి వ్రాతలో దర్బార్ ఏ విధంగా ఉండాలో వివరించబడింది. తాత్యాసాహెబ్ మొదటి నుండి రాజదర్బార్‌లో ఉండడం వల్ల ప్రభు దర్బార్‌లో సరైన వ్యవస్థ చేయడానికి అధిక శ్రమ పడాల్సి రాలేదు. ఎవరు ఎలా ఎప్పుడు ఏ విధంగా దర్శనం చేసుకోవాలో ఎలా మర్యాదగా కూర్చోవాలో, ఎలా వ్యవహరించాలో ఎవరైనా స్వయంగా రావడానికి అసమర్థులైతే ప్రభు వద్ద ఎవరు ఎలా వివరించాలో, ఎవరైనా అమర్యాదగా ప్రవర్తిస్తే వారిపై ఎవరు నిఘా పెట్టాలో ఇలా అన్ని రకాలైన పనుల్లో తెలివైన యోగ్యులైన మనుష్యులను తాత్యావారు నియమించారు. ప్రభు దర్శనానికి మరియు సభలో జరిగే భాషణ వినడానికి ఆటంకము కలగకుండా వాళ్లకు అనుకూలమైన ప్రదేశంలో కూర్చోవడానికి, ప్రసాదం తీసుకునే వాళ్లకు కూడా వ్యవస్థ కల్పించారు. ఆ కాలంలోదర్బార్ జరిగే ప్రదేశంలో ప్రస్తుతం దేవాలయం కట్టబడి అందమైన సభామండపం కనిపిస్తుంది. ఆ కాలంలో ఈ సుందర మందిర ప్రాంగణం లేకుండా తడికలతో చేసిన గుడిసె ఉండేది. ఇరు ప్రక్కల ప్రదేశం గోడలతో ఇరుకుగా లేకుండా విశాలంగా నాలుగు ప్రక్కల ఖాళీగా ఉండడం వల్ల వేలమంది ఒకే సారి సమావేశం అయ్యే టట్టుగా ఉండేది. మండపం మధ్యలో ఎత్తుగా ఒక కట్ట కట్టబడింది. దానిపై పరుపు వేసి ప్రభువు దిండుపై ఒరిగి విశ్రాంతిగా కూర్చునేవారు. అందుకని నాలుగు దిక్కుల అన్నివైపుల నుండి ప్రభువు కనిపించేవారు. ప్రభువద్ద ఇద్దరు మనుష్యులు ఎప్పుడు చేతులు కట్టుకొని నిలబడేవారు. ఆ విధంగా కట్టముందు దర్శనానికి వచ్చేవాళ్లకు దారిచూపేవాళ్లు ఉండేవారు. కుడి పక్కకు సన్యాసి, శాస్త్రి, వైదిక బ్రాహ్మణులు కూర్చువడానికి స్థలం కుడిప్రక్కన స్త్రీలకు కూర్చోవడానికి స్థలం ఉంచబడేది. ప్రభుముందు నానాజాతుల గృహస్థులు, సాధుసంతులు, గోసావి, ఫకీరులు అనేకమంది కూర్చునేవారు. ఎవరికి వచ్చిన కళను వారు ప్రదర్శించేవారు. కొందరు తమ గానంతో తబలా వాయించేవారు. పఖవాజ్, రుద్రవీణ, సితార్, సారంగి ఈ విధంగా తమకు వచ్చిన విద్యను ప్రదర్శించి తమ కళా కౌశల్యంతో అందరిని తన్మయులను చేసేవారు. పురాణికులు పురాణం చెప్పేవారు. వైదికులు వేదఘోష చేసేవారు. శాస్త్ర పండితులు వేదాంత గోష్టి చేసేవారు. ఈ విధంగా నానా ప్రకారాలుగా నడిచేది. ప్రభు దృష్టి అన్ని

వైపుల ఒకే రకంగా కనిపించేది. మనం ఇంతగా ప్రభు సేవ చేస్తున్నాం మనవైపు ప్రభు దృష్టి ఎప్పుడు పడుతుందో అని ఎవరికి అనిపించేది కాదు. వారు మధ్య మధ్యలో దృష్టి మరల్చినా కూడా సేవకులను లక్ష్యపెట్టవలసిందిగా సూచించేవారు. తమ పనులు నెరవేర్చుకోవడానికి, తమ సందేహాలు తీర్చుకోవడానికి ప్రతిరోజు వేలమంది ప్రభుముందు నిలబడేవారు. అంతమందిలో ఎవరు తమ సందేహాలు నివృత్తి కాలేదు అని అనేవారు కాదు. అప్పటికి కోరిక తీరకపోయినా మాణిక్‌నగర్‌లో కొన్ని రోజులు నివసించి తమ కోరిక తీర్చుకొనేవారు. అక్కడ ఉన్నవారు ప్రభు యొక్క గుణవర్ణన చేస్తూ ఆనందంగా గడిపేవారు. దర్బార్ తరువాత ప్రతి ఒక్కరు తమ విషయాలు చెపుతూ, వింటూ ఉండేవారు. ఇలా తమకు సంబంధించిన విషయాలు మాట్లాడుకుంటూ ఉండేవారు. తినడానికి ఎవరికీ దొరకలేదనే విషయం మాత్రం ఉండేది కాదు. కానీ ఏదైనా కారణంతో ఉపవాసం ఉన్నా కూడా అది ప్రభువుకు నచ్చేది కాదు. ఇలాంటి పనులలో దాదాసాహెబ్ మహరాజ్‌గారు దక్షతగా వ్యవహరించేవారు. వేలమంది ఒకే రోజు పోగయినా కూడా స్వయంగా కంబళి వేసుకొని నిలబడి అందరి భోజన, నీటివసతి చూసేవారు. కాని ఎవరైనా మొండి తనంతో లేదా ప్రభువు తమ కోరిక తీర్చడానికి ఉపవాసం చేస్తే ప్రభు గుప్తరూపంలో రాత్రి వారి వద్దకు వెళ్లి తనకు తన కోరిక నిజమయినట్లుగా ఉపదేశ వచనాలు మాట్లాడి వాళ్లు తినేటట్లు చేసేవారు. ఎన్నో సార్లు ఎవరైనా ఉపవాసంతో ఉంటే దర్బార్‌లో కూర్చుని ఉన్నా కూడా వాళ్లను పిలిచి వాళ్ల కోరికలను తెలుసుకొని వాటిని పూర్తి చేసి వారిని సమాధాన పరిచేవారు. ప్రభు దర్బార్‌లో అందరూ సంతోషంగా ఉండేవారు. కారణం ప్రభు సర్వజ్ఞులు మరియు అంతర్‌జ్ఞాని. ప్రభు సదా ఆనందంతో వినోదంతో ఉండి వారి మాటల్లో ఆ విషయం స్పష్టంగా గోచరించేది. దర్శనం కోసం దూరం నుండి ఎవరైనా గృహస్థులు వచ్చినప్పుడు దారిలోని సౌకర్యాలను గురించి ప్రభు ముందుగానే అడిగి తెలుసుకొనేవారు. ఈ విషయంలో అందరికి ఆశ్చర్యం అనిపించేది. అందుకని ప్రభు దర్బార్‌లో దుఃఖంతో, లాభాపేక్షతో వచ్చినా కూడా వాళ్ళకు తమ కోరిక పూర్తవుతుందనే నమ్మకం కలిగి తమ మానసిక వ్యధను మరిచి ఆనందంతో ప్రసన్నులయ్యేవారు. ప్రభు యొక్క కంఠం కోమలమై, రసభరితమై ఎవరితో అయితే మాట్లాడు తున్నారో వారి మనసుకు హత్తుకునేట్లుగా ఉండేది. ఎవరైనా మనస్సులో కల్మషంతో మాట్లాడినా వారితో మాట్లాడి, అవివేకంతో

తాము అడిగేది సరియైనది కాకపోయినా అడిగే వాళ్లను వాళ్ల మనస్సులో సరియైనదిగా అయేటట్లుగా చేసి సమాధానపరిచేవారు. ఈ విధంగా మహాత్ముల యొక్క పనులు మొదట '**మౌనే మౌని గుణిని గుణవాన్ పండితాః పండితేషి**' ఈ విధంగా వాళ్ల నడవడిక ఉంటుంది. ప్రభు యొక్క సగుణ అవతారం సర్వజగత్తును ఉద్ధరించడానికి జరిగింది. అందుకని వారు భక్తుల కోరికలను తీర్చడంలో ఆశ్చర్యం ఏముంది? ప్రభు ధన, పుత్ర, స్త్రీ ఇలా ఇహలోక విషయ సంపత్తి పై మోహంతో అడిగే వాళ్ల నానా విధాలైన కోరికలను తీర్చేవారు. ఐహిక సుఖాలకోసం ప్రభువు వద్ద ద్రవ్యం అడిగే వారు నిజమైన కారణం చెపితే, వారు ఎంత అడిగినా ఇవ్వడానికి ఆలోచించేవారుకాదు. వేలమంది నిత్యం వేల రూపాయలు వాళ్లు అడిగినట్లుగా వాళ్ల స్వస్థలాలకు పంపిస్తూ వాళ్ల ఉద్దేశం సరియైనదా ? కాదా అని ఆలోచించేవారుకాదు. కానీ, ఎవరైనా దుష్టబుద్ధితో ప్రభువద్ద నుండి డబ్బులు తీసుకుంటే తెలియకుండా వారికి శిక్షపడేది. ఈ విషయం చాలా మందికి అనుభవంలోకి వచ్చింది.

ఒక సారి గుర్రపు బగ్గీలు నడిపే వాడు ప్రభు కీర్తి విని ద్రవ్య లోభంతో మాణికనగర్‌కి వచ్చి తన గుర్రము అకస్మాత్తుగా మరణించడం వల్ల తను, తన భార్యాబిడ్డలు ఉపవాసం ఉండాల్సివస్తోందని కొత్త గుర్రం కొనాలంటే తనదగ్గర డబ్బులు లేవని కుటుంబాన్ని కాపాడుకోవడం కోసం మీ కీర్తి విని వచ్చానని కొత్త గుర్రం కొనుక్కోవడానికి వెయ్యి రూపాయలు నాకు మీరు ఇవ్వాలని అడిగాడు. ఈ కపటి తన గుర్రాన్ని దాచిపెట్టి కేవలం ద్రవ్య లోభంతో అబద్ధాలు చెపుతున్నాడని ప్రభువుకి ముందే తెలుసు. కానీ, ప్రభు ఏమి అనకుండా గుర్రం చనిపాయినందుకు కనికరం చూపించారు. పరబ్రహ్మ సద్గురువు యొక్క నిత్యానంద రూప జెండా మీ ముందు రెపరెపలాడుతుంటే ఇన్ని రోజులు ఎందుకు ఆలస్యం చేశావు? నా దత్తప్రభువు ఈ గుర్రమే ఏమిటి, ఈ సంపూర్ణ పృథ్వి రాజ్యం అడిగినా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు, అడిగేవాళ్లు కావాలి. ఇలాంటి ఉపదేశ వచనాలతో సంతోషపరచి రేపు ప్రొద్దున నీకు ఎంత ద్రవ్యము కావాలో అంత దొరుకుతుందని మాట ఇచ్చి రెండో రోజు కావాలని అతనికి వెయ్యి రూపాయలు లెక్కపెట్టి ఇచ్చారు. అప్పుడు ఆ బగ్గీవాడికి చాలా ఆనందమై తన బుద్ధికుశలతకు సంతోషపడుతూ, ప్రభువును స్తుతిస్తూ బయలుదేరడానికి సిద్ధమయ్యాడు. అంతలో గుర్రం దగ్గర ఉంచిన మనుష్యులు

రాత్రి అనుకోకుండా గుర్రం చనిపోయిందని ఆయనకు చెప్పాలని వెతుక్కుంటూ వస్తున్నామని దర్బార్‌లోనికి తమ యజమానిని వెతుక్కుంటూ వచ్చారు. పై విషయం అతనికి తెలియక ఏడుస్తూ జరిగిందంతా చెప్పాడు. ఇది వినగానే ఆ కపటి ముఖం నల్లబడింది. ఇప్పుడు ప్రభు ఏం శిక్ష వేస్తారో అని భయపడుతూ నిలబడ్డాడు. ప్రభు కొంచెం కూడా కోపగించకుండా మంచి మాటలతో అతన్ని సమాధానపరిచారు. వేయిరూపాయల కోసం గుర్రం చనిపోక పోయినా అబద్ధం ఎందుకు చెప్పావు? డబ్బులు కావాలని అడిగితే దర్బార్‌లో మీకు దొరికేది కదా! అయినా అయిందేదో అయింది. ఇకముందు ఇలా చేయవద్దు. మీ ఇష్ట ప్రకారంగా మీకు ఇప్పుడు ఎలా కావాలంటే అలా మళ్లీ గుర్రం కొనుక్కో అని చెప్పి తిరిగి పంపించారు. ఈ విధంగా చాలా రకాలైన అనుభవాలు జరిగాయి. ప్రభు వద్ద నిజమైన విషయం చెప్పి ఏదైనా అడిగితే తమ కోరికలు పూర్తవుతాయి అని అందరికి నిశ్చయంగా తెలిసేది. అనేక రకాలుగా ఇలా దొంగతనాలు జరగకుండా దాదాసాహెబ్ గట్టి బందోబస్తు చేస్తూ సమస్యలు పరిష్కరించేవారు. ఏ స్త్రీ కి అయినా తన మర్యాద విషయలో ఏ పురుషుని నుండైనా ఉపద్రవం కలగరాదని దాదా మహరాజుల వారు దక్షతతో వ్యవహరించేవారు. ఎవరైనా స్త్రీలతో అమర్యాదగా ప్రవర్తిస్తే సహించేవారు కాదు. అలా జరిగేతే ఇద్దరిని శిక్షించేవారు. తను ప్రత్యంక్షంగా స్త్రీలతో మాట్లాడేవారు కాదు. వాళ్లు ఎదైనా చెప్పాలను కుంటే వెంకమ్మతో చెప్పేవారు. ఈ క్రమం మొదటి నుండి అలవాటు చేశారు. ప్రభు విషయంలో కూడా వర్తనాక్రమం ఉండేది. వాళ్ల చేయవలసిన పనులన్నీ వెంకమ్మకు చెప్పి చేయించుకొనే వారు. ప్రభు ప్రత్యక్షంగా స్త్రీలతో మాట్లాడేవారు కాదు. స్త్రీ ఒక్కరే ప్రభు దర్శనానికి రావడం నిషిద్ధం. రావాలను కుంటే తన భర్తతో కలిసి రావాలి. అలా రాలేకపోతే వెంకమ్మకు విషయం తెలిపేవారు. ప్రభువుకు వెంకమ్మ ఆ విషయం చెప్పి ప్రభు ఆజ్ఞ తిరిగి వాళ్లకు చెప్పేది.

ప్రభు యొక్క భాష మృదువుగా ఉండేది. కోపం అనే శబ్దం ప్రభు విషయంలో లేదనే చెప్పాలి. జనం వారి సేవ చేయడానికి చేతులు కట్టుకొని నిలబడేవారు. కాని ప్రభు ఎప్పుడూ వెంటనే పనులు చెప్పేవారు కాదు. ఎప్పుడు ఈ పని అవుతుంది? ఇలా మాత్రమే అడిగేవారు. ఎవరైనా కపటభావనతో ప్రత్యక్షంగా తప్పుచేసి ప్రభు ముందుకు వచ్చినా కూడా శాంతంగానే

శిక్షించేవారు. ఆ శిక్ష కూడా సౌమ్యంగా ఉండి మనస్సుకు కష్టం కలిగించకుండా ఉండి, తిరిగి తాము తమ చేతులతో ఇలాంటి తప్పు చేయకూడదని మనసుకు అర్థమయేటట్లుగా బోధించేవారు.

ఈ విధంగా దర్బార్ రోజులో మూడు సార్లు జరిగేది. సాయంకాలం జరిగే దర్బార్‌లో అందరికి ప్రవేశం దొరికేది కాదు. ఉదయం ప్రాతఃవిధి ముగించి కట్టపై కూచుని ఉండగా పరిచయస్థులు, పనులు చేసేవారు ఇలాంటి వారికి మాత్రం ప్రవేశం ఉండి, తమ పనిపై వినతి చేసుకోవడానికి అవకాశం ఉండేది. లేకపోతే ప్రభు కావాలని వాళ్లను పిలిపించి వారి పని గురించి అడిగేవారు. వారు గదిలో ఉన్నప్పుడు అనుమతి లేకుండా ప్రవేశం ఉండేదికాదు. చిమన్యా, వెంకమ్మ, గోపాల్‌బావా, లంగోటి రామా, రామన్న వీరు ప్రియ శిష్యులు. వారు తమ పని తాము చేస్తూ ఇతర విషయాలలో జోక్యం కలిగించు కోకుండా తమంతటట తాము కూర్చుని ఉండేవారు. ద్వారం వద్ద తాత్యాసాహెబ్ గారు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి రాత్రి పగలు సేవకులను నియమించారు. ప్రభు సాయంకాల సమయంలో తిరుగుతూ మారుతి దేవాలయానికి వెళ్లేవారు. అక్కడ సాధుసంతులు, గోసావి, బైరాగి వాళ్లు ఉండేవారు. వాళ్లతో ఇష్టాగోష్టి మాట్లాడి తరువాత దత్త గాది వరకు వచ్చి తన ఆసనంపై కూర్చునేవారు. ఆ సమయంలో మాత్రం ఎవరికైనా దర్శనం చేసుకోవడానికి, తమ గురించి విన్నవించుకోవడానికి అనుమతి ఉండేది. ఒకసారి ప్రభు గాది పై వచ్చి కూర్చుంటే ఎంత మంది దర్శనానికి వచ్చినా వాళ్లు చెప్పేది విని వారికి సమాధానం ఇచ్చిన తరువాత మాత్రమే దర్బార్ ముగించేవారు. రాత్రి అన్ని కార్యక్రమాలు ముగిసేసరికి పది గంటలు అయ్యేది. ఒక్కోసారి జనం ఎక్కువగా ఉంటే తెల్లవారి రెండు లేక మూడు గంటలు కూడా అయ్యేది. ఆ కాలంలో ఇప్పటిలాగా గడియారాలుకూడా ఉపయోగంలో ఉండేవి కాదు. రాత్రి పగలు తెలియడానికి పూర్వం గంటల యంత్రాన్ని ఉపయోగించేవారు. ఇలాంటి యంత్రాలన్ని తాత్యాసాహెబ్‌గారు ద్వారంలో పెట్టించారు. అది రాత్రింబవళ్ళు ప్రతి నాలుగు గంటలకు ఒకసారి ప్రభు ముందుకు వచ్చి "ధర్మ అవతార్----పహెర్‌కా అమల్ హై" ఇలా అంటూ ముందు నిలబడేవారు. ప్రభు చరిత్ర వ్రాసిన వారిలో రామచంద్రబువా సోలాపూర్ కర్ అనే పేరుగల లేఖకులు ఉండేవారు. వారు ప్రభు దర్బార్‌లో చాలా రోజులు ఉన్నారు. వారు

తమ పుస్తకంలో వ్రాసి పెట్టిన ప్రభు దర్బార్ యొక్క వర్ణన చదవదగినదిగా ఉంది. అది మేము క్రింద వ్రాశాము. వారు కళ్లతో చూసిన స్థితి యొక్క వర్ణన ఇవ్వడం వల్ల అది చాలా మహత్తరమైన విషయంగా మనకు అనిపిస్తుంది. ''ప్రభు యొక్క శ్యామ సుందర మూర్తి చూసి వాళ్ల దాహార్తి తీరేది కాదు. ఎవరైనా ప్రభు వద్ద కూర్చుంటే వాళ్లకు ప్రభు వద్ద నుండి లేవాలనిపించేది కాదు. ఒక సారి ప్రభు గాదిపై కూర్చుంటే మూడు రోజుల వరకు లేచేవారు కాదు, మూడు రోజుల వరకు భోజనం, నిద్రా ఉండేవి కాదు. మలమూత్రాదులకు కూడా లేవకుండా ఒకే ఆసనంలో కూర్చునేవారు. గాది లోపల గుహలాగా ఉండేది. దాంట్లోకి వెళ్తే ఒక్కోసారి ఎనిమిది రోజుల వరకు బయటకు వచ్చేవారు కాదు. లోపలికి వెళ్లి పిలవడానికి కానీ, పడుకుంటే లేపడానికి కానీ ఎవరికీ ధైర్యం ఉండేదికాదు. ఒక్కోసారి ఎనిమిది రోజులైనా పడుకునేవారు కాదు. అప్పుడప్పుడు డప్పు వాయిస్తూ పాడుతూ కూర్చునేవారు. అప్పుడు గంధర్వుల అవతారంగా ఇతరులకు అనిపించేది. అప్పుడప్పుడు లక్షల రూపాయల విలువైన బట్టలు ధరించేవారు. ఒక్కోసారి చినిగిపోయిన వస్త్రాలతో బీదవాళ్లలాగా కనిపించేవారు. అప్పుడప్పుడు ప్రభు యొక్క దర్బార్‌లో నాయకిల గాన కార్యక్రమము, అపుడప్పుడు వేదాంత చర్చ, వైదికుల వేదఘోష ఉండేది. ఒక్కోసారి ఊరికే లోకాభిరామాయణం కూడా జరిగేది.

ఈ విధంగా ప్రభు యొక్క అనంత లీలలు ఉండేవి. వాటిని వర్ణించటం అసాధ్యం . ఎలాంటి వారు ప్రభువును కలిస్తే ప్రభు వాళ్లకు అనుగుణంగా మారిపోయేవారు. శాస్త్రులు, పురాణికులు ఎవరైనా వస్తే వాళ్లకంటే ఎక్కువ పాండిత్యం చూపేవారు. పండితులతో పండితులుగా గాయకులతో గాయకులుగా, సాధువులతో సాధువుగా, కపటులతో కపటిగా, లోభులతో లోభిగా, భైరాగులతో భైరాగిగా, గోసాయితో గోసాయిగా, గరీబులతో గరీబుగా శ్రీమంతులతో మహా శ్రీమంతునిగా, వృద్ధులతో వృద్ధునిగా ఈ విధంగా ఎవరితో వాళ్ల పాత్రలకు తగ్గట్లుగా వ్యవహరించేవారు. ఆయన స్వభావము అలాగే కనిపించేది. కోపస్తులతో కోపంగా, శాంతస్తులకు శాంతగా కనిపించేవారు. ఎప్పుడూ శ్యామసుందర శాంతమూర్తి గాదిపై కూర్చుని ఒక చేతితో నశ్యం పీల్చుకుంటూ బ్రహ్మానందంలో ఓలలాడుతూ ఉండేవారు. అలాంటి రూపంతో జనులకు దర్శనం ఇచ్చేవారు. ప్రభు గాదిపై కూర్చున్నారంటే కచ్చేరి యొక్క

రూపం కనిపించేది. శాస్త్రులు, పండితులు, ధనవంతులు, శేట్‌సావుకారులు, రాజవాడ యొక్క జనాల రద్దీ ప్రభు వద్ద ఉండేది. వీరే కాక యాత్రికుల రద్దీ ఎప్పుడూ ఉండేది. ప్రభు గాదిపై కూర్చున్నంతసేపు రద్దీ ఉండేది. రద్దీ వల్ల కొందరికి మూడు రోజుల వరకు దర్శనం అయ్యేదికాదు. దర్శనం కాకుండా అన్నం తినకూడదని జనం అనుకుంటే ఒక్కోసారి ఏడు రోజుల వరకు ఉపవాసం ఉండేవారు. ద్వారం వద్ద పదంసింగ్ అనే పేరు గల ద్వారపాలకుడు ఎప్పుడు ఉండేవారు. దర్శనం కోసం లోపలికి పంపించే పని ఆయన చేతిలో ఉండడం వల్ల పెద్ద పెద్ద శ్రీమంతులు ఆయనకు అర్జీ పెట్టుకొని ఆయనను సంతోషపరచాల్సి వచ్చేది. ఈ విధంగా హుమనాబాద్ దగ్గర నివసించడం జరిగినప్పటినుండి ప్రభు యొక్క పూర్వ ఫకీరు రూపం, అరణ్యంలో నివసించడం కాకుండా అన్ని విషయాల్లోనూ రాజదర్పం కనిపించసాగింది. ఏ స్థలంలో మహారణ్యం ఉండేదో అక్కడ ఇప్పుడు మాణిక్‌నగర్ నివాస స్థలమై రాత్రిపగలు ఏ స్థలంలో దొంగలు, ప్రవాసులను లూటీ చేసేవారో ఆ స్థలంలో ఇప్పుడు ఏనుగులు, గుఱ్ఱాలు, పల్లకీలు, మేనాలు లాంటి రాజైశ్వర్యాలు కనిపించసాగాయి.

ఈ సమయంలో శ్రీ మాణిక్ ప్రభు వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉండేది. మరియు సర్వ రాజ ఐశ్వర్యాల సంపద మాణిక్ నగరానికి వచ్చినది. ప్రభు ద్వారంలో ఏనుగులు, గుఱ్ఱాలు, మేనాలు, పల్లకీలు ఉండి రాజ వాడలా ఉండేది. ఎవరివైపు ప్రభు ఊరికే కళ్లు తెరిచి చూస్తే వారు భాగ్యవంతులవుతారని ప్రజలు నమ్మేవారు. ఇలా ఉన్నా కూడా ప్రభువు ఫకీరులాగా స్వతంత్రంగా ఆనందంగా ఉండేవారు. ఎంత ఐశ్వర్యం వచ్చినా తన నమ్రత, కరుణచూపడంలో వెంట్రుకవాసి తేడా కనిపించేదికాదు. వారి భాషణ అతి తియ్యగా దయతో కూడిన వచనాలతో వినోద భరితంగా ఉండేది. సంస్కృతం, కన్నడ, తెలుగు, ఉర్దూ, పార్శీ, హిందుస్థాని మరియు మరాఠీ ఇన్ని బాషలు ఆయనకు కరతలామలకముగా ఉండేవి. ముస్లీం వారికి అరబ్బీ గ్రంథంలోని విషయాలను వినిపించేవారు. వీటిని ఎక్కడ ఎలా నేర్చుకున్నారో మాత్రం ఎవరికీ తెలియలేదు. వారు ధర్మశాస్త్రపారంగతులు వేదజ్ఞులు. ఏ మతం వారైనా ఏ ధర్మంవారైనా ఏ జాతి వారైనా ప్రభుతో వాదించలేకపోయేవారు. ఎంత పెద్ద మహా విద్వాంసులు వచ్చినా ప్రభుముందు

ఓటమి ఒప్పుకొని ప్రభు సమాధానం విని ప్రభు చెప్పినదే నిజమని ఒప్పుకొని తిరిగి వెళ్లేవారు. ఇలా ఎన్నోసార్లు జరిగింది.

ప్రభు మనస్సులో ఇంత రాజదర్పం పెంచుకోవాలని ఎప్పుడూ అనుకోలేదు. వారికి పరోపకారం మరియు దానధర్మం చేయడం కాకుండా ఏ ఇతర విషయాలు ప్రియంగా ఉండేవి కావు. కాని తాత్యాసాహెబ్ గారికి వ్యవహారికము చాలా ఇష్టంగా ఉండేది. వీరు నాలుగు సంవత్సరాలలో మాణిక్‌నగర్‌లో ప్రభు దర్బార్‌కి చాలా వన్నె తెచ్చారు. ఇరవైఐదు వరకు చిన్న చిన్న దుకాణాలు వెలిశాయి. హల్వా, హారాలు మొదలైన దుకాణాలు ఉండేవి. హుమనాబాద్ నుండి సామాగ్రి సరఫరా అయ్యేది. హుమనాబాద్‌లో కల్లప్ప అనే ఒక షావుకారు ఉండేవారు. ఆయనకు ప్రభువుపై చాలా భక్తి ఉండేది. ఆయన నిత్యం ప్రభు దర్శనానికి వస్తూ అవసరం అయినప్పుడు యాభై వేల రూపాయల వరకు సర్దుతూ ఉండేవారు. తరువాత తాత్యాసాహెబ్ మాణిక్‌నగర్‌లో తూర్పు పడమర దిశలలో మహాద్వారాలు (వేశి) నిర్మించి సిపాయిలను యాత్రికుల బందోబస్తు కోసం నియమించారు. ఈ విధంగా తన అభిరుచికి తగినట్లు తాత్యాసాహెబ్ గారు తీర్చిదిద్దారు.

పై విషయాలు చదివిన తరువాత ప్రభు దర్బారు యొక్క సామాన్య స్వరూపం అవగాహన అయి ఉండవచ్చు. మాణిక్ నగర్ రాకపూర్వం ప్రభు సమక్షంలో "నిత్యశ్రీ నిత్యమంగళం" అయినా కూడా ప్రభు ఫకీరులా వ్యవహరించేవారు. ఇక్కడ నివాసము ఏర్పరుచుకున్నప్పటి నుండి సంస్థానంలో రాజదర్పం కనిపించసాగింది. సంపద పుష్కలంగా ఉండడం వల్ల ఏ పనులకూ ఆటంకం కలిగేది కాదు. ప్రభు వద్ద ఈ లెక్కలేనంత ద్రవ్యం ఎక్కడి నుండి వచ్చేదో తెలుసుకొనే మార్గమే లేకుండేది. కాని ఈ ద్రవ్యం ఎక్కడికి పోతుందో ప్రత్యక్షంగా అందరికీ కనిపించేది. ప్రభు ద్రవ్యాన్ని కూడబెట్టలేదు. ప్రభు కావలిసినప్పుడు ఆ ధనం చేకూరేది. దర్బార్‌లో కూర్చుని గాది క్రింద చేయి పెట్టి పిడికిలితో రూపాయల సిక్కాలు తీసేవారు. దర్బార్ ముగిసే వరకు ఆ చేత్తో అలాగే నిరాటంకంగా తీసి ఇస్తూ ఉండేవారు. వచ్చిన అందరు జనులకు ఇవ్వవలసింది ఇచ్చిన తరువాత దర్బార్ ముగిసిన తరువాత చూస్తే గాది క్రింద ఏమీ ఉండేది కాదు.

పై విధమైన వర్ణన చాలా మంది నోటి నుండి వినపడేది. పూర్వం ప్రత్యక్షంగా చూసిన వాళ్లు వ్రాసిన వర్ణన చదివితే నమ్మకుండా ఉండలేము. ఇప్పుడు కూడా ప్రభు దర్బార్‌లో అలౌకిక సామర్థ్యం యొక్క సాక్ష్యం కనిపిస్తుంది. ఇప్పుడు కూడా దర్బార్ సుమారుగా అలాగే అనిపిస్తుంది. చూసేవాళ్లకు అది అనుభవంలోనికి వస్తుంది. ప్రభు ఎలా చురుకుగా వ్యవహరించే వారో రామచంద్రబువా ఈ క్రింది తెలిపిన విధంగా వివరించారు.

ప్రభు మహరాజ్‌కు తన వద్ద ఉన్న అందరి స్వభావం తెలుసు. వారికి తెలిసినట్లుగా మనుష్యుల స్వభావంలో తేడా ఎవరికి తెలుస్తుంది? ఆయన సామాన్యులు కారు. ఎవరైనా ఏదైనా చెప్పగానే దాంట్లోని నిజమేంటో అప్పుడే ఆయనకు తెలిసిపోయేది. వారి స్వభావం చాలా శాంత, గంభీరంగా ఉండి దయామయులై ఉండడం వల్ల కపట మనుష్యుల లౌక్యం ఆయన ముందు నడిచేది కాదు. తన దగ్గర ఉన్నవాళ్లలో ఏ మనుష్యుడు ఎలాంటి యోగ్యత కలిగి ఉన్నారో వారికి తెలిసేది. ఆయన స్వభావం పులులు, మేకలు ఒకే దగ్గర నీరు త్రాగేటట్లు చేసేదిగా ఉండేది. అందుకని ప్రభు దర్బార్‌లో సర్వ జగత్తులోని దొంగతనం, లూటీ చేసేవారు వచ్చి జ్ఞాన సంపద పెంచుకొనేవారు. ప్రభు దర్బార్‌లో లూటీచేసేవారు, దొంగలు, అవిద్వాంసులు మరియు అంధులు, రోగులు, అశక్తులు, దరిద్రులే కాక సాధులు, సంతులు, బైరాగులు వైదికులు, జ్యోతిష్యులు, శాస్త్ర పండితులు, హరిదాసులు, గాయకులు, భట్టులు, నర్తకమణులు మరియు సుశీల గృహస్థులు ఇలా అనేక రకాల వారికి ఆదర సత్కారాలు జరిగేవి. రెండు పూటలా అన్నదానం జరిగేది. ఎవరికీ లేదనకుండా ఏ జాతి వారైనా ఏ కులం వారైనా ఎన్ని రోజులు నివసించినా, ఎవరిని వెళ్లమనే వారు కాదు. రెండు పూటలా మంచి పదార్థాలు దొరకక పోయినా రొట్టె, కణ్యా (గోదుమ రవ్వతో చేసింది) మాత్రం దొరికేది. అంటే అర్థం రోజూ వేలమందికి భోజనం మరియు ద్రవ్యార్థియై వచ్చిన వారికే కాక అందరి మనస్సులలోని కోరికలకు ప్రభువు వద్ద సమాధానం లభించేది.

॥ శ్రీ దత్తాత్రేయార్పణమస్తు ॥ ॥ శ్రీ గురు మాణికార్పణమస్తు ॥

# నాలుగవరోజు పారాయణము

## ప్రభు వైభవ విస్తరణ

### 29. దాజీసాహెబ్ భోస్లే

జాముకు ఒకసారి వాయించే ఢంకా (నౌబత్) ధ్వని ఇప్పటికీ మాణిక్‌నగర్‌కు వచ్చే యాత్రికులకు వినిపిస్తుంది. ఇది ఎప్పటి నుండి ప్రారంభించబడిందో తెలియదు. ప్రభు మాణిక్ నగర్‌లో నివసించడం మొదలై ప్రభు దర్బార్ శోభ సంతరించుకున్న తరువాత గణేశ్ చతుర్థి రోజు ప్రొద్దున ప్రభు కాలకృత్యాలు తీర్చుకొని ఆరుబయట కూర్చున్నప్పుడు రాజేశ్వర్ గ్రామానికి చెందిన గృహస్థు ఒక చిన్న సుందరమైన గణపతి మూర్తిని తెచ్చి ప్రభు ముందు పెట్టి ఈ రోజు గణేష్ చతుర్థి ఉన్నందువల్ల గురు దర్బార్‌లో ఈ ప్రతిమను ప్రతిష్ఠించి ఉత్సవం చేయాలని కోరికగా ఉంది అని ప్రార్థించారు. గణపతి చాలా సుందరంగా తయారుచేసినందున, అది చూసి ప్రభు చాలా సంతోషించి ఆయన కౌశల్యాన్ని మెచ్చుకొని గణపతి మా దగ్గరికి ఎలా వచ్చారో అలాగే ఢంకా (నౌబత్) కూడా తెచ్చుకుంటే పెద్ద ఉత్సవం చేయవచ్చు అన్నారు. ఇలా అనగానే రెండు మూడు గంటల తరువాత తూర్పు ద్వారం వద్ద ఢంకా వాయించబడింది. అది ఎవరు వాయించారంటే కళ్యాణ్‌కి చెందిన ఢంకా వాయించే వాళ్లు ప్రభు వద్ద కొన్ని రోజులు సేవ చేయాలని వచ్చి, తాము వచ్చిన విషయం ప్రభువుకి తెలియాలని వాయించారు.

అందరూ ఈ విషయాన్ని ప్రభువుకి తెలియజేసి గణపతి ఉత్సవానికి చేయాల్సిన ఏర్పాట్లు చేసి గణపతిని ప్రతిష్టించారు. ఢంకా వాయించే వాళ్లకు భోజన వసతి కల్పించి ఢంకా వాయించే సమయాలు వారికి తెలియజెప్పారు. ఈ విధంగా జాముకు ఒకసారి ఢంకా (నౌబత్) వాయించడం మొదలయింది. నాలుగైదు నెలల తరువాత వారు తిరిగి వెళ్ళటానికి ప్రభు అనుమతి అడిగారు. ఆ సమయంలో అక్కల్ కోట్ సంస్థానంలో కార్యనిర్వహణ చేసే దాజీసాహెబ్ భోస్లే ప్రభు దర్శనానికి వచ్చారు. సంస్థానములో మొదలైన ఢంకా వాయించడం ఆగి పోతుందన్న విషయం విని అది ఎప్పుడు వాయిస్తూనే ఉండాలన్న కోరికతో దాని ఖర్చులకోసం అక్కల్‌కోట్ సంస్థానం నుండి ప్రతి నెల ముప్పై రూపాయలు ఇచ్చే ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చారు. ఆ విధంగా అది పునః ప్రారంభించడం వారి మూలంగా జరిగింది. అది చివరి వరకు వారి వల్లనే నడుస్తుందనే నమ్మకం ప్రభువుకు కలగలేదు. అందుకని ప్రభువు ఇలా అన్నారు. ''మాది ఫకీరుల దర్బార్'' ఢంకా అవసరం లేదు. గురుదర్బార్ యొక్క ఢంకా త్రిభువనాలలో ప్రతిధ్వనిస్తుంది. అందుకని దానితో ఈ దర్బార్‌కి అవసరంలేదు. మీరు అడుగుతున్నారు కాబట్టి ఉండనివ్వండి. కానీ, ఈ బాధ్యత చివరివరకు నిలబెట్టుకోవాలి.

దాజీసాహెబ్ భోస్లేగారి ద్వారా మొదలు పెట్టబడిన ఢంకా వాయింపు మూడు నాలుగు సంవత్సరాలు అక్కల్‌కోట్ సంస్థానము ఖర్చుతోనే నడిచింది. కొంత కాలానికి ఆ ఖర్చు రావడం ఆగిపోయింది. ఎందువల్లనంటే అక్కల్‌కోట్ సంస్థానములో ఏవో గొడవలు జరిగి దాజీసాహెబ్ అక్కల్‌కోట్ సంస్థానము విడవడం జరిగింది. కాని ఒక సారి మొదలు పెట్టిన ఢంకా వాయింపు ఆగిపోకూడదని ప్రభు సంస్థానమే ఆ పద్ధతిని కొనసాగించింది. అది ఇప్పటి వరకు నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది.

అక్కల్‌కోట్ రాజావారికి పుత్రుడు కావాలన్న కోరిక బలంగా ఉండేది. సంస్థానములో కొన్ని గొడవలు కూడా జరుగుతుండేవి. వాటి నివారణ జరగాలని అక్కడి కార్యనిర్వహణ చేసేవారు ఎప్పుడు ప్రభు దర్బార్‌కు వచ్చేవారు. అలా ఒకసారి ఒకరు ప్రభుపై విశ్వాసంతో ప్రభు వద్ద ప్రార్థించడానికి వచ్చారు. ''నేను పిలిచినప్పుడు వస్తే ప్రసాదం ఇస్తాను'' అని ప్రభు తెలియజేశారు. తరువాత ప్రభువు నుండి ప్రసాదం తీసుకొవడానికి రావసిందిగా పిలువడానికి

వచ్చిన మనిషి తిరిగి ప్రభువద్దకు వెళ్లి ఆయన భోజనానికి కూర్చున్నారని చెప్పాడు. అప్పుడు ప్రభు ''అరే ప్రసాదం వేళ ఆయన పాగొట్టుకున్నారు'' అని కూర్చుని ఉండిపోయారు. తరువాత ఆ గృహస్థు ప్రసాదం తీసుకోవడానికి చాలా ప్రయత్నించారు కాని ప్రసాదం దొరకలేదు. స్వయంగా ప్రభు చేతితో ప్రసాదం దొరకడం ఎంతో అదృష్టం, ఆ యోగం వాళ్లకు లేదు. ఆ విషయం అందరికి తెలిసి ఉండెను. తరువాత బోజనానికి కూర్చున్నప్పుడు ప్రభు వద్దకు వెళ్లే విషయంలో శ్రద్ధ చూపేవారు.

## 30. కంది కిషన్‌రావ్

ఇంతకు ముందు ''ఎనిమిది గవ్వలు'' ఈ విషయానికి సంబంధించిన సంఘటన విషయంలో చరిత్రకారులందరూ ఒకే విధంగా చెపుతారు. కాని ఆ స్త్రీకి సంబంధించిన పేరు, స్థలానికి సంబంధించి భిన్న అభిప్రాయాలు కనిపిస్తాయి. సదాశివరావ్ మన్‌సబ్ అనే పేరుగల ఒక వృద్ధ గృహస్థు చిడుగుప్ప జిల్లాలో 'అకౌంటెంట్'గా ఉండేవారు. వారు చెప్పడం వల్ల ఈ విషయం తెలిసింది. దాని ప్రకారం ఆ స్త్రీ కంది కిషన్‌రావ్ అనే పేరుగల దేశ్‌ముఖ్ గారి పత్ని. నరహరికృత (అముద్రితం) చరితలో కంది కిషన్ రావ్ యొక్క పేరుతో ఈ ఘటన హాళిఖేడ్‌లోని భాలచంద్ర దీక్షిత్‌ల ఇంట్లో ప్రభు ఉన్నప్పుడు జరిగింది అంటారు. ఆ స్త్రీ పుట్టిల్లు హాళిఖేడ్. అందుకని తన వైభవాతిశయంతో మేనాలో కూర్చుని తల్లిగారింటికి వస్తుండేది. ఆమె యవ్వనవతియై ఉండెను. కానీ, సంతతి లేకపోవడం వల్ల పిల్లలకోసం ఆమె ఆశతో ఉండెను. ఆమె ప్రభు యొక్క కీర్తి విని తల్లిగారింట్లో కొన్ని రోజులు ఉండి తరువాత కళ్యాణ్‌కి వెళ్లాలని వచ్చెను. కాని ప్రభు హాళిఖేడ్‌కి వచ్చారని ఆమెకు తెలియదు. ఆమె అంతరంగం తెలుసుకొని ప్రభు త్రోవలో కూర్చుని ఉండెను. ఆమె రాగానే మొదట తెలియజేసిన భీమాబాయి కథలాగా జరిగింది.

ప్రభు దర్శనము అనుకోని రీతిలో జరిగి తన కోరిక తీరడం వల్ల ఆనందంతో ఆమె తన అత్తగారింటికి వెళ్లింది. అక్కడికి వెళ్లిన తరువాత ప్రభువుకు గవ్వలు ఇవ్వడం వల్ల గర్భవతియై పుత్రుడు కలిగాడు. పుత్రోత్సాహంతో సంతోషించి ఆ

స్త్రీ తన పుత్రునితో సహా ప్రభు సన్నిధికి వచ్చి దానధర్మాలు చేసింది. తరువాత ఆమెకు ఐదు మంది పుత్రులు జన్మించారు. ప్రభువుపై పూర్తి శ్రద్ధ ఉండడం వల్ల ఆమె ప్రతి పుత్రుణ్ణి ప్రభు కాళ్లవద్ద ఉంచి దానధర్మాలు చేసేది. ఐదవ పుత్రుని సమయంలో ప్రభు మాణిక్ నగర్‌లో ఉండిరి. ఆమె తన ఐదుగురు పుత్రులతో అక్కడికి వచ్చి అత్యంత శ్రద్ధతో ప్రభు పూజ చేసి, అన్నదానం చేసి తిరిగి వెళ్లాలని అనుమతి అడుగుతూ నాకు ఇప్పుడు పుత్రుల అవసరం లేదు. ఇప్పుడు ఉన్న ఈ ఐదుగురు పుత్రులు సంతోషంగా ఉండాలి. నాకు శరీరంలో రోజురోజుకు శక్తిహీనత అనిపిస్తుంది. ప్రసవ వేదన భరించే శక్తిలేదు. అందుకని దయచేసి పుత్రులు కాకుండా చేయమని అడిగింది. ఇలా చమత్కారంగా అడిగేసరికి ప్రభువుకి నచ్చలేదు. ప్రభువు ఆమెకు అనేక విధాలుగా నచ్చచెప్పారు. ''బాయి ఈ విధంగా నీవు కోరడం మంచిది కాదు. దత్తుడు నీకు ప్రసాదంగా ఇచ్చే దానిని నీవు తీసుకోవాలి. ఈ విషయాన్ని దూరదృష్టితో ఆలోచించు. దొరికిన వరాన్ని కాదనకు. ఈ విధంగా నచ్చ చెప్పినా ఆమె తన పట్టు విడవలేదు. అప్పుడు ప్రభు సరే నీ ఇష్టం అని తిరిగి వెళ్లడానికి అనుమతించారు. ఇంటికి వెళ్లిన తరువాత కొన్ని రోజులకు అకస్మాత్తుగా ఆమె భర్త జబ్బుపడి మరణించారు. అనుకోకుండా జరిగిన ఘటనతో ఆమెకు ప్రభువు మాటలు గుర్తుకు వచ్చి తన పట్టుదల వల్ల ఇలా జరిగిందని పశ్చాత్తాపపడింది. ఇక చేసేది ఏమీ లేక పోవడం వల్ల ధైర్యంగా సహనం చూపించింది. ఈ విధంగా ఆ సంఘటన జరిగింది. దీంట్లో పేర్లతో సంబంధంలేదు. అప్పారావు హైదరాబాద్ వారి భార్య భీమాబాయి అయితే నేమి, కంది కిషన్‌రావ్ గారి భార్య అయితే నేమి జరిగిన కథలో మాత్రం తేడా లేదు.

## 31. జయప్ప (సోనార్) కంసాలి

జయప్ప అనే కంసాలి ఒక రోజు సాయం సమయంలో ప్రభు దర్శనం కోసం వచ్చినపుడు చాలా జన సమూహం ఉంది. కారణం ఆ రోజు హుమనాబాద్ వీరభద్రేశ్వరుని జాతర. అందువల్ల ఆ చుట్టు పక్కల ప్రాంతాల జనం అక్కడ పోగయ్యారు. వారికి ప్రభు విషయం తెలిసి అక్కడికి వచ్చిన వారు మాణిక్‌నగర్‌కి రావడం మొదలయింది. ఆ రోజు వారంతా రావడం వల్ల జనం విపరీతంగా నిండిపోయారు. చీకటి పడినా జనం మాత్రం తగ్గలేదు. ఆ సమయంలో ఒక

వృద్ధ కంసాలి తన కుటుంబంతో అక్కడికి వచ్చారు. వారి వయస్సు సుమారు 79 సం||రాలు. అతను యాభై మంది కుటుంబ సభ్యులతో ప్రభు దర్శనానికి వచ్చారు. అందరూ ప్రభు దర్శనం చేసుకున్నా కానీ, ఆ వృద్ధునికి మాత్రం ప్రవేశం దొరకలేదు. వారు దూరం నుండే దర్శనం చేసుకోవాలని అనుకున్నారు. చీకటి పడుతుండగా ప్రభు దృష్టి ఆ వృద్ధ కంసాలిపై పడి వారిని ప్రభువు తమ దగ్గరికి పిలిపించుకున్నారు. ఆయన వచ్చి ప్రభు కూర్చునే కట్టకు ప్రక్కగా నిల్చుని చేతులు జోడించి నమస్కారం చేస్తుండగా ప్రభు ఆయన కుడి చేతికి కట్టబడిన పట్టు వస్త్రంలో ముడివేసిన చిన్న బంగారుపెట్టె తీసుకున్నారు. దాంట్లోంచి మడిచి పెట్టబడిన కాగితాన్ని తీసి దీపం ముందు చదవసాగారు. అందరూ ఆశ్చర్యంగా చూస్తూ ఉండగా ఆ వృద్ధ కంసాలి ప్రభు ప్రేమకు ముగ్ధుడయ్యెను. తాను లాడువంతిలో ఉండగా మనోహర మహారాజుల వారు తనకు మోక్షప్రాప్తి కలిగించే ఈ వస్తువును ఇచ్చి దానిని తన పుత్రునికి చూపించమన్నారు. కానీ, ప్రభు ఏ విషయం అడగకుండా, పరిచయం లేకుండా, సంబంధం లేకుండా తన వద్ద నుండి దానిని తీసుకున్నారని ఆయనకు ఆశ్చర్యం కలిగింది. మనోహరమహారాజుల వారు తన పుత్రునికి చూపించ వలసిందిగా చెప్పారు. కానీ, వీరే మనోహర మహారాజుల పుత్రులనే ఆలోచన కూడా కంసాలికి కలగలేదు. ఎందుకంటే ప్రభు జన్మించగానే ఆ గృహస్థు తన కుటుంబంతో సోలాపూర్‌కి వెళ్లిపోయారు. ప్రభు పేరు మాణిక్ ప్రభు అని ఆయనకు తెలియదు. మాణిక్ ప్రభు కళ్యాణ్‌లో ఉన్నారని తెలిసి కులదేవతను దర్శించుకొని వెళ్తూ వీరభద్రుని యాత్ర చేసి కళ్యాణ్‌కి వెళ్లి మనోహరమహారాజ్ గారి పుత్రుని వెతకాలని అనుకొని ఉండెను. ప్రభు పూర్తి కాగితం చదివిన తరువాత ఆశ్చర్యంగా చూస్తూ దగ్గర ఉన్న వాళ్ల ముఖాలను చూడసాగారు. అప్పుడు వాళ్లకు ఆ కాగితంలో ఏదైనా మహత్తరమైన విషయం ఉందేమో అనిపించింది. కాని ప్రభుకు విస్మయం కలిగించే విషయం ఆ కాగితంలో ఏముంది? అని అడగడానికి ఎవరికీ ధైర్యం చాలలేదు. తాత్యాసాహెబ్ గోవింద శాస్త్రి అనే పేరుగల ఒక బ్రాహ్మణునితో యోగశాస్త్రానికి సంబంధించిన వాదవివాదం చేస్తూ కూర్చుని ఉండిరి. ఆయన అప్పటికి ప్రభు వద్ద నుండి ఆ కాగితం తీసుకొని చదవసాగారు. గోవింద శాస్త్రి కూడా ఆ కాగితంలో ఏముందో అని చూడగా అది మనోహరమహారాజుల వారు ప్రభు యొక్క జన్మ పత్రిక వ్రాసి ఉంచారని దానిలో ప్రభువు యొక్క పూర్తి భవిష్యత్తు వ్రాయబడిందని వాళ్లకు తెలిసింది.

పూర్తి పత్రిక చదివిన తరువాత దాని విషయంపై చర్చ జరుగకూడదని ప్రభు ఆ కాగితాన్ని వారి చేతిలో నుండి తీసుకొని దీపానికి పైన పెట్టి బూడిద చేసి ఆ బూడిదను భస్మంగా నుదిటికి వ్రాసుకున్నారు. అది చూసి తాత్యా సాహెబ్ గారు ఏం చేస్తున్నావు? ఇలాంటి ముఖ్యమైన విషయాన్ని కావాలని ఎందుకు లేకుండా చేస్తున్నావు? అంటూ తిరిగి తీసుకోవడానికి ప్రయత్నించారు. కాని ప్రభు ఆ లేఖ ఉండకూడదని సమాధానపరిచారు.

''మన తండ్రి మన జాతకం తయారు చేసి అందరికి తెలియాలని వ్రాసిపెట్టారు. దాని ప్రకారం ఇప్పుడు జరిగితే ఆ లేఖ నిజమౌతుంది. ఒక వేళ ఏదైనా తేడా జరిగితే ఆ కారణంగా జనంలో అపవాదు వస్తుంది. మరి సద్గురువుకు మనం ఇంత ప్రతిబంధకం ఎందుకు కలిగించాలి? గుప్తంగానే ఉంటే మంచిది''. అన్న ప్రభు మాటలు వినగానే ఆ కంసాలి యొక్క సంశయాలు పటాపంచలయిపోయాయి. మనోహర నాయిక్ యొక్క పుత్రుడే ఈ మాణిక్ ప్రభు అని, వారిదే ఈ జన్మ పత్రిక అని కంసాలికి అప్పుడు తెలిసింది. తనకు మోక్ష మార్గం దొరుకుతుందో లేదో అనే శంక దూరం అవడం ప్రభు యొక్క అంతర్ జ్ఞానం యొక్క ప్రత్యక్ష అనుభవం జరగడం మరియు మనోహర మహారాజుల వారు చెప్పిన దానికంటే ఎక్కువ సమర్థత ప్రభువులో కనిపించడం వల్ల పరమార్థ సాధనయే కాకుండా ఒకే సారి మోక్షప్రాప్తి కలిగించమని అడగాలని ఆయన ఆలోచించసాగారు. అక్కడ ఏది జరగాలో అదే జరుగుతుంది. తండ్రి మీ కోసం తయారు చేసిన లేఖను మీరు ఎందుకు లేకుండా చేశారు? భక్తుడు ఏదైనా ప్రతిజ్ఞ చేస్తే, సద్గురువుగా దానిని పూర్తి చేయాల్సిన మీరు అనవసరంగా ఎందుకు శంకిస్తున్నారు? ఇలా తాత్యాసాహెబ్ గారు ప్రభుతో అంటూ బాధపడసాగారు. దానికి గోవింద శాస్త్రి మద్దతు ఇచ్చారు. ఆయన విద్వత్ బ్రాహ్మణుడై ఉండెను. వారు ఇలా అన్నారు. ''కృష్ణ పరమాత్మ శస్త్రాలు ఉపయోగించనన్న శపథాన్ని భీష్మాచార్యుల కోసం విరమించవలసి వచ్చింది. రామావతార పూర్తిచరిత్ర కోయవాడైన వాల్మీకి కల్పనతో వ్రాయబడిన గ్రంథ ప్రమాణంగా పరమేశ్వరుడైన రామునికి మానవరూపం ధరించాల్సి వచ్చింది. ఇలా యుగయుగాలుగా సంప్రదాయం నడుస్తూ వస్తూంది. మనోహర మహారాజ్ వ్రాసి పెట్టిన లేఖను కాల్చడానికి ఎవరు సమర్థులు? దానిని మీరు నిజం చేయాల్సింది. ఎందుకు కాల్చారు?

అనగానే ప్రభు ఇద్దరిని సమాధానపరిచారు. అప్పుడు ఆ కంసాలి మాట్లాడసాగాడు ''ప్రభుమహారాజ్ మీ తండ్రి వ్రాసిపెట్టిన విధంగా మీ చేతులతో ఏది కావాలో అది తనకు తానే అవుతుంది. కానీ, ఆయన ఇచ్చిన మాట మాత్రం మీరు ఇప్పుడే పూర్తి చేయాలి. వయస్సు 75 సంవత్సరాలు గడిచిపోవడం వల్ల జీవితం యొక్క భరోసా కనిపించడం లేదు. మనోహర్ మహరాజుల వారితో నా ఋణానుబంధం ఎంతటిదో నా మనస్సుకు తెలుసు. మీ మాతృశ్రీ బయమ్మకు గుర్తు ఉండే ఉండవచ్చు. ఆ తండ్రి ధన్యులు. మీ వంటి పుత్రరత్నాన్ని జగత్ కళ్యాణం కోసం ఉత్పన్నం చేసి తాను మాత్రం ఎప్పుడో స్వర్గానికి వెళ్లారు. ఇలా కంసాలి అమాయకంగా మాట్లాడింది విని ప్రభువుకు ఆయనపై ప్రేమ కలిగింది. దానికి కారణం తండ్రి ఏం చెప్పారో ప్రభువుకు ముందే తెలుసు. అయినా కూడా తండ్రి ఏం మాట ఇచ్చారో ముందు చెప్పమని అడిగారు. ఆయన ఆశీర్వాదంతో పూర్తి చేయబడుతుందేమో చూద్దాము అన్నారు. అప్పుడు ఆ వృద్ధుడు ఇలా చెప్పారు. మీ తండ్రి వల్ల మాకు ఉపకారం జరిగింది. ఆయన చెప్పడం వల్ల నేను లాడవంతి విడిచి సోలాపూర్‌కి వెళ్లి సుఖంగా సంసారం చేస్తూ ఉన్నాను. పుత్రులు, కోడళ్లు, మనుమలు, మనుమరాళ్లతో సంతోషంగా కాలం గడిపాను. పరమార్థం లభించడానికి ఏదైనా దారి చూపించండని అడిగితే ఆ రోజులు ముందు ఉన్నాయని ఎప్పుడూ అనేవారు. మీరు జన్మించిన రోజు మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఈ జన్మపత్రిక తయారు చేసి నాకు ఇచ్చి, జాగ్రత్తగా ఉంచి ఉపనయనము అయిన తరువాత నీకు వీలయినపుడు వెళ్లి కలిసి ఇది చూపించు, అప్పుడు నీ కోరిక పూర్తవుతుందని నాతో అన్నారు. నేను సోలాపూర్‌కి వెళ్లిన తరువాత ఆయన కూడా లాడవంతిని విడిచి వెళ్లిపోయి కళ్యాణ్‌లో నివసించారని అక్కడే దేహత్యాగం చేశారని విన్నాను. అప్పుడు మీ దర్శనానికి రావాలని అనుకున్నాను, కానీ, ఇంట్లో కొన్ని కారణాల వల్ల రాలేకపోయాను. తరువాత వీలు చేసుకొని రావాలనుకున్న వేళలో మీరు ఎవరినో వెంట తీసుకొని పండరిపురం వెళ్లారని తెలిసింది. అందుకని రాలేకపోయాను. అందరూ అంటే మీ తాత గారింట్లో కూడా దేశాంతరం వెళ్లారని తెలిసి నిరాశ చెందాను. తరువాత హరిపై భారం వేసి ఉండిపోయాను. వీరభద్రుడు (హుమనాబాద్) మా కులదేవత అవడం వల్ల చాలా రోజులుగా రావడం కుదరక కుటుంబసభ్యులందరితో దర్శించుకుందామని ఇలా

వచ్చాము. బాపు (మనోహరనాయిక్) యొక్క చిరంజీవులు మీరే అని నాకు తెలియదు. కళ్యాణ్‌లో మాణిక్ ప్రభు అనే పేరుగల సాధు మహానీయులు ఉత్పన్నం అయ్యారని, వారే ఈ గ్రామాన్ని తయారు చేశారని నిన్ననే నాకు తెలిసింది. నేనే తిరిగి వెళ్లేముందు కళ్యాణ్‌కి వెళ్లి మిమ్మల్ని వెతకాలని మరియు వెళ్తూ వెళ్తూ ఈ కొత్త సాధు యొక్క దర్శనం చేసుకోవాలని ఈ రోజు ప్రొద్దున ఇక్కడికి వచ్చాను, బాపుయొక్క ఆశీర్వాద ప్రభావంతో అయాచితంగా మీ దర్శనం దొరికింది. ఇదంతా చెప్పేసరికి ఆ వృద్ధుడు అలసిపోయాడు. మరియు తన తండ్రి పై ఉన్న భక్తికి ప్రభు సంతృప్తులై ముందుగా అతనిని క్రింద కూర్చోపెట్టి వారితో మృదు మధురమైన స్వరంతో, తండ్రి మిత్రుడు తండ్రితో సమానులు. మీ వంటి వారికి మా వంటి పిల్లలు ఏమి ఉపదేశం ఇవ్వాలి. వృద్ధులు జగత్తులోని మంచి, చెడు రెండు విషయాలను వేల సంఖ్యలో అనుభవించి ఉండడం వల్ల ముందు దారి దానికదే కనిపిస్తుంది. ఇప్పటి కాలంలోని మాకు జగత్తంటే ఏమిటో తెలియదు. మేమెలా ఇతరులకు పరమార్థానికి దారి చూపించాలి?

ప్రభు మాటలు విని మధ్యలో ఆ వృద్ధుడు ''మహరాజ్ ఈ సమయంలో మీరు ఏదో సత్పురుషుడని లేదా మానోహరబాపు పుత్రులని మీపై భారం వేయట్లేదు – నాకు తప్ప ఇతరులకు తెలియని ఎన్నో జరిగిన విషయాలను మీరు సరిగ్గా గుర్తు పట్టడం వల్ల మీరు సర్వ వ్యాపకమైన పరమేశ్వరులని నాకు నిశ్చయంగా తెలిసింది. మీ వాస్తవిక స్వరూపం తెలిసింది. నాకు ఒక విన్నపం చేసుకోవాలనిపిస్తుంది. నాకు ఈ వయస్సులో జపతపాలు, నియమ నిష్టలు, అనుష్టానాలు సాధ్యం కావు. అలాంటి మార్గంలో కాకుండా ఒకేసారి మోక్షప్రాప్తి కలిగే మార్గం చెప్పండి. మీ ఆజ్ఞ నేను శిరసావహిస్తాను. నేను తిరిగివెళ్లి మాత్రం ఏం చేస్తాను? ఎప్పటివరకు మీ ఈ అసామాన్య సామర్థ్యయుక్తమైన సగుణమూర్తి నా దృష్టి ముందు ఉంటుందో అప్పటివరకు మీ పాదాల వద్ద ఉండి నా దేహాన్ని అర్పిస్తాను. ఈ విధంగా ఆ వృద్ధుని పట్టుదల, అమాయకత్వం అక్కడ ఉన్న అందరికీ ఆశ్చర్యం కలిగించింది. ప్రభు మాత్రం నవ్వుతూ ఇలా అన్నారు. ఈ విధంగా తమకు కావాలని పంతంతో మోక్షప్రాప్తి కోసం పట్టు బట్టే వారికి ముక్తి నీయడం కష్టమైన పని కాదని, వారు మనస్సులో అనుకోగానే ముక్తి లభించినట్లే అంటూ ఆ తరువాత గౌరవంతో వినయపూర్వకంగా ఆ

అమాయక కంసాలితో ప్రభు ఇలా అన్నారు. "మా యొక్క తీర్థరూపంపై మీకు ఇంతటి నిష్ఠ ఉంటే ఇలా చేయండి. అయినంత తొందరలో సోలాపూర్‌కి వెళ్లి ఇప్పటివరకు సంపాదించిన సంపదను ఆప్తులకు మీ ఇష్టానుసారంగా యోగ్యత తెలుసుకొని పంచండి. వాళ్లలో మీ తరువాత మనస్పర్థలు, కొట్లాటలు రాకుండా చేసి ఒకసారి మీరు సంతృప్తులయితే మీ కోరిక కూడా పూర్తి అవుతుంది. ప్రభు ఆజ్ఞను కంసాలి ఆనందంగా ఒప్పుకున్నారు.

ఈ విధంగా ప్రభు యొక్క జన్మ విషయం సగం అయినా విశ్వసనీయ సమాచారం తెలియడం వల్ల పూర్తిగా తెలుసుకోవాలని దర్బార్‌లో జనాలకు ఉత్కంఠ కలిగింది. కాని అది తీరే దారి కనిపించలేదు. తరువాత తాత్యాసాహెబ్ ప్రభువుకు విన్న వించుకొని ఆ గృహస్థును రెండు రోజులు ఉండమన్నారు. సపరివారంతో బయమ్మ దర్శనం చేసుకొని రెండు రోజులు సంతోషంగా ఉండడానికి ఆ గృహస్థు అంగీకరించాడు. రెండోరోజు అమ్మ మరియు దాదామహారాజ్ కాళ్ళకు పిల్లలను నమస్కరించవలసిందిగా చెప్పారు. రెండు రోజులు సంతోషంగా గడిపి ప్రభు వద్ద ప్రసాదం తీసుకొని తిరిగి వెళ్లారు. తరువాత ప్రభు ఆజ్ఞ ప్రకారంగా తన సంపదను పంచి, 'ఇప్పుడు నేను నిజంగా మనోహరమహారాజు, మాణిక్ ప్రభు వచనానుసారం ముక్తుడనయ్యాను'. ఈ మాటలు ఆయన నోటినుండి వెలువడగానే బ్రహ్మరంధ్రం నుండి ప్రాణం పోయింది. ఈ సంఘటన ఆయన సంపదను పంచిన రోజే జరిగింది. ఈ విషయం ప్రభువుకు హుమనాబాద్ గృహస్థు ద్వారా వెంటనే తెలిసింది. వారి వంశంవారు ఇప్పటికి ధనకనక సంపన్నులై ప్రభు సంస్థానానికి వస్తూ వారి శక్త్యానుసారంగా సేవ చేస్తూనే ఉన్నారు.

## 32. గాజర్ పుత్రులు

ప్రభు ఒక రోజు స్నానం చేస్తుండగా ఒక వృద్ధురాలు తనతో పాటు తన ఏడుగురు పుత్రులను తీసుకొని దర్శనానికి వచ్చింది. అందరికంటే పెద్దవాడికి సుమారు ముప్పై సంవత్సరాలు ఉంటాయి. ఒక పుత్రునికి ఇంకొక పుత్రునికి మధ్య సుమారు రెండు సంవత్సరాల తేడా ఉంటుంది. ఆమె బలంగా పుష్టిగా

ఉండేది. ప్రతి ఒక్కరి తలపై గాజర్‌లను మూటగా పెట్టి తనతో తీసుకొని వచ్చారు. ఆ వృద్ధురాలికి సుమారు అరవై సంవత్సరాల వయస్సు ఉండెను. ఆమె ప్రభువును ఎప్పుడు చూస్తానా అన్న ఆతృతతో ప్రభు వద్దకు వెళ్లింది. ముఖాన్ని చేతితో స్పృశిస్తూ ప్రేమాశ్రువులతో ప్రభువుకు స్నానం చేయించింది. దగ్గర ఉన్నవాళ్లు వద్దన్నా ఆమె వారి మాట వినక పోయేసరికి ప్రభు వాళ్లందరితో ఆమెను ఏమి అనవద్దని చెప్పారు. ప్రేమాతిశయంతో నిండిన ఆమె మనసును ప్రభు తెలుసుకొని ఆనంద పరవశులయ్యారు. ఈ సన్నివేశం ఏంటో ఎవరికీ అర్థం కాలేదు. ఆమె మనస్సు శాంతించిన తరువాత దగ్గర ఉన్నవాళ్లు అడిగితే ఇలా చెప్పసాగింది. "నేను ఎన్ని సంవత్సరాల నుండో వీరిని వెతుకుతున్నాను. కానీ వీరెక్కడ ఉన్నారో తెలియలేదు. వీరు మా లాడవంతి బచ్చమ్మ యొక్క మనుమడు రత్నాభావు, ఇప్పుడు మీరు తనను ప్రభు అనండి, ఇంకా ఏమైనా పిలవండి నాకు మాత్రం రత్నాభావు అనితెలుసు. లాడవంతిలో ఉండగా చాలా చిన్నవాడు అంటే ఐదు సంవత్సరాలు ఉండేవి. అప్పుడు నా తలపై ఉన్న బుట్టలోనుండి ఏడు గాజర్‌లను తీసుకొని నాతో "నీకు ఏడుగురు పుత్రులు కలుగుతారు" అని చెప్పారు. అప్పుడు నాకు ఆశ్చర్యం అనిపించి ఇంకా తీసుకోమని బుట్ట చూపించాను. కాని తను "తీసుకున్నది చాలు" అన్నారు. తరువాత నాకు ఏడుగురు పుత్రులు జన్మించారు. ఇప్పుడు వాళ్లను దర్శనానికి తీసుకొని వచ్చాను. రత్నాభావు లాడవంతి నుండి కళ్యాణ్‌కి వెళ్లారు. నేను వారిని కలువలేకపోయాను. తరువాత ఇక్కడికి వచ్చారని తెలిసి నా పుత్రులను తీసుకొని వచ్చాను. నా కోరిక తీరింది. ఎప్పుడు వారిని కళ్లనిండా చూస్తానో అనిపించింది. బాబా నీవు నిజంగా దేవుడవే! ఆ వృద్ధురాలి అంతః కరణలో నిండిన ప్రేమామృతంపై ప్రభువుకి తృప్తి కలిగింది. భక్తుల నిష్కపట ఉజ్వల ప్రేమ ప్రభు యొక్క ఆనందసాగరంలో భర్తీ కావడానికి కారణభూతం అవుతుంది. ఇది ఈ సమయంలో అనుభవ పూర్వకమయింది. ప్రభు ఆనందంతో ఆ పుత్రులను చూస్తూ వినోదంతో అందరూ పుత్రులు గాజర్‌లాగే కనిపిస్తున్నారు కదూ! అన్నారు.

ప్రభు వారు తలపై పెట్టుకొని తెచ్చిన గాజర్‌లను భండారు ఖానాలో ఇవ్వవలసిందిగా ఆజ్ఞాపించి, వండుకోవాడానికి సామాగ్రి ఇచ్చి ఆ వృద్ధురాలిని భోజనం తయారు చేసుకోమని చెప్పారు. భోజనం అయిన తరువాత చీర, జాకెట్ బట్ట ప్రసాదం ఇచ్చి సంతుష్టమైన మనస్సుతో ఆమెను సాగనంపారు. ఈ విధంగా ప్రభు బాల్యంలో జరిగిన లీలలు సహజ సిద్ధంగా ప్రకటితం

అవసాగాయి. ఆ వృద్ధురాలికి ప్రభు యొక్క ఐశ్వర్యం చూసి ఆనందం కలిగింది. ఆమె పుత్రులపై ప్రభు కృపాదృష్టిని ప్రసాదించారు.

## 33. వృద్ధ బ్రాహ్మణునకు సంతానం

హుమనాబాద్‌లో ఒక వృద్ధ బ్రాహ్మణుడు సతీ సమేతంగా నివసించేవారు. ఆయన మంచి విద్వాంసుడై, రసికుడై మంచి మాటకారి అయి ఉండెను. అందుకని ప్రభు ఎక్కువగా ఆయనతో మాట్లాడడానికి ఇష్టపడేవారు. రాత్రి రెండు గంటల వరకు వేదాంత విషయాలు మాట్లాడుతూ ఉండేవారు. ఆయన మాటలు ప్రభువుకి మనః పూర్వకంగా ఇష్టం అవడంవల్ల అదే రీతిగా ఆ బ్రాహ్మణుడు నడుచుకొనేవారు. ఆయన పత్ని పతివ్రతయై, సుశీలయై ప్రభువుపై పుత్రప్రేమను చూపించేది. కాని ఆమెకు సంతానం లేక పోవడం వల్ల సంతానం కావాలని మనసులో కోరిక ఉండేది. అందుకని ప్రభువును అలా చూసేదని ప్రభువుకి తెలుసు. ఒక రోజు ఈ వృద్ధ దంపతులు ప్రభు ముందు కూర్చున్నప్పుడు మహాసాధ్వి వెంకమ్మ దర్శనానికి వచ్చింది. చరణాలపై తలవంచి నమస్కరించి చేతులు కట్టుకొని ముందు నిలబడింది. అప్పుడు ప్రభు ''వెంకే నాలుగు రోజులు కనిపించలేదు ఎందుకని? అని అడిగారు. అప్పుడు ఆమె ఇలా అంది. మహారాజ్ పూర్వ పాపంవల్ల నెలలోని నాలుగు రోజులు ప్రత్యక్ష పాదుక దర్శనం కలగదు. దీనికి ఏదైనా ఉపాయం చూపిస్తే నాకు ఆనందం కలుగుతుంది. వెంకమ్మ యొక్క ఈ మాటలు విని ప్రభు ఇలా అన్నారు. ''వెంకే నీకు విసుగు అనిపిస్తే మనస్సులో ఎవరికైతే కోరికగా ఉందో వాళ్ళకు ఇచ్చివేయి. అప్పుడు వెంకమ్మకు వృద్ధ బ్రాహ్మణ స్త్రీని చూపిస్తూ ఆమె చేతిపై నీటిధారను విడువు అనగానే వెంటనే వెంకమ్మ చేతిలో నీరు తీసుకొని ఆ స్త్రీ చేతిపై విడిచింది. తరువాత నెల తిరగగానే ఋతుమతి అయ్యే బాధ నుండి వెంకమ్మకు ముక్తి లభించింది. తిరిగి ఋతుమతి కావడం జరుగలేదు. ఆ వృద్ధ సాధ్వి పన్నెండు సంవత్సరాల తరువాత తిరిగి ఋతుమతి అయింది.

ఈ చర్య చూసి అందరికి ముఖ్యంగా ఆ స్త్రీకి ఆశ్చర్యం కలిగింది. కాని ఇంకా విశేషమైన విషయం తరువాత జరిగింది. ఆ స్త్రీ మూడు నెలలు

ఋతుమతి అయిన తరువాత నాలుగవ సారికి గర్భవతి అయి పది నెలలు అయిన తరువాత సుందరమైన పుత్రునికి జన్మనిచ్చింది. అప్పుడు ఆ వృద్ధ బ్రాహ్మణులు సంతోషం పట్టలేకపోయారు. ఆ స్త్రీకి సుమారు 60 సం॥రాలు. ఆ వృద్ధుడు (ప్రభు మిత్రుడు) 75 సంవత్సరాల వయస్సు కలవారై ఉండెను. అయినా ప్రభు కృపతో పుత్రుడు జన్మించాడు. వారి సంతోషం చెప్పనలవి కాలేదు. అందరికి ఆశ్చర్యం కలిగి ప్రభుసామర్థ్యం, కీర్తిని వర్ణన చేయసాగారు. ఆ స్త్రీ ఆ పుత్రునికి 'మాణిక్' అని పేరు పెట్టింది. ప్రభు వాళ్ళు సుఖజీవనం చేయడానికి సహాయం చేశారు. వెంకమ్మ తరువాత ఎప్పుడూ ఋతుమతి కాలేదు. ఎంత ఆశ్చర్యకరమైన ప్రభులీల కదా?

పై ఈ సంఘటన రామచంద్రబువా సోలాపూర్‌కర్ వ్రాసిన చరిత్ర నుండి ఎలా ఉందో అలాగే తీసుకోబడింది. ఈ అద్భుత చమత్కారం చాలామంది నోటినుండి వినడం జరిగింది. ఇంతేకాదు ఇలా జన్మించిన ఆ మనిషిని చూడడం కూడా జరిగింది. హుమనాబాద్‌లో మాణిక్ భట్ అనే పేరుగల వృద్ధ బ్రాహ్మణుడు కొన్ని సంవత్సరాల క్రింద ఉండేవారు. వారి వద్ద ప్రభు గాది ఉంది. వారు ప్రభు నవరాత్రులు చేసేవారు. వారిని అనేకమంది పూజ్యనీయులుగా చూసేవారు. ఆయనకు శిష్యులు కూడా ఉండేవారు. ఆయన స్వయంగా తన అద్భుత జన్మకథను తెలియజేశారు. ఆయన ప్రభు భక్తిలో లీనమైపోయారు. ఇప్పటికి ప్రభు గాదీ హుమనాబాద్‌లో ఉంది. ఆయన చేసిన ఏర్పాటు ప్రకారంగా పూజ అర్చన జరుగుతుంది.

## 34. ఆబారావ్ నాయబ్

భాల్కి గ్రామం గురించి ఇంతకు ముందు మీరు చదివారు. భాల్కి గ్రామ నాయబ్ తహసిల్దారు ఆబారావ్ పరమ భక్తులు ఎలా అయ్యారో వివరిస్తున్నాం. ఆబారావ్ ఎప్పుడు ప్రభు దర్శనానికి వస్తూ విశేషమైన రోజులలో మాణిక్ నగర్‌లో నివసించేవారు. ఒకసారి భాల్కి తాలుకాలో వసూలు నిమిత్తం జమ అయిన పదివేల రూపాయలు హైదరాబాద్‌లోని నవాబ్‌కి ముట్టచెప్పడానికి తానే ఒంటెపై తీసుకువెళ్ళవలసి వచ్చింది. హైదరాబాద్ వెళ్లడానికి ముందు ప్రభు దర్శనం చేసుకొని

ప్రసాదం తీసుకొని వెళ్లాలనే ఉద్దేశంతో మాణిక్‌నగర్‌కి వచ్చారు. ఆ రోజు ముస్లీంల 'గ్యారవి' పండగ ఉండెను. అందుకని దానం చేయడానికి ప్రభు దర్బార్‌లో కూర్చుని ఉండిరి. ప్రభు వద్ద అడిగే వారు ఫకీరులు, మౌల్వీలు చాలా మంది పోగయి ఉండిరి. ప్రభు ఎప్పటిలాగే దర్బార్‌లో దర్పంతో గాదిపై కూర్చుని దానం చేస్తూ ఉన్నారు. అతి కష్టంతో ప్రభు వద్దకు దారి చేసుకొని అబారాబ్ నాయబ్ గాది దగ్గరికి వెళ్ళి ప్రభువుకి నమస్కరించారు. అప్పుడు రావడానికి గల కారణం ఖజానాను హైదరాబాద్‌కి తీసుకు వెళ్తున్నానని చెప్పారు. అప్పుడు ప్రభు ఒంటెపై ఉన్న పూర్తి నగదును తనవద్దకు తీసుకొని రావాలని ఆజ్ఞాపించారు. ఆజ్ఞ ప్రకారం పూర్తి నగదును ప్రభు ముందు గుమ్మరించారు. సంతుష్టమనస్సుతో ప్రభు నవ్వుతూ ఆ పూర్తి నగదును దానం చేసి ఖర్చు చేశారు. ఇది ఆబారావ్ నాయబ్‌కు పరీక్ష అయ్యెను. ఖజనాకు సంబంధించిన నగదును ఇతర ఉపయోగాలకు తీసుకుంటే దాని పరిణామం ఆయనకు తెలుసు. కానీ ఆయన జంకలేదు. తన భక్తులను ప్రభు ఉరికంబం ఎక్కిస్తారని ఆ నిర్మలమైన మనస్సుకు అనిపంచలేదు. సర్వ సంకట పరిస్థితుల నుండి రక్షించడానికి సమర్థుడు ప్రభువే అని దృఢ నమ్మకం ఉండడం వలన మాట్లాడకుండా నిశ్చింతగా కూర్చున్నారు. కరుణామయుడైన ప్రభువు ఆయన నిష్ఠను చూసి సంతుష్టులయ్యారు. కాని నిజమైన పరీక్షా సమయం తరువాత ఉండడం వల్ల ప్రభు ఏమీ మాట్లాడలేదు. మరుసటి రోజు ప్రభు వద్ద ప్రసాదం తీసుకొని తిరిగి భాల్కి వెళ్ళారు. ఆ సమయంలో ఇప్పటి లాగా కాగితాలలో వ్రాసేవారు కాదు అయినా ఇలా సర్కారు నగదును ఖర్చు చేయడం చాలా తప్పు. ఈ విషయం ఆయనకు తెలుసు. పూర్వం ప్రతి ఒక సర్కారు కచేరీలో 'అఖబార్ నవీస్' అనే వారిని నియమించేవారు. ఆ విధంగా భాల్కిలోను ఉండిరి. ప్రతిరోజు జరిగిన విషయాలను నవాబ్‌సాహెకు తపాలలో తెలియజేయడం వారి పనిగా ఉండేది. ఆ విధంగా పై పూర్తి విషయాన్ని వ్రాసి పంపించారు. రోజు సర్కారి తపాల గుర్రంపై పంపించడం జరిగేది. నవాబ్ సాహెబ్ తన దర్బార్‌లో కూర్చుని ఉన్నప్పుడు 'అఖబార్ నవీస్ ' వ్రాసిన విషయం తెలిసింది.

అప్పుడు ఏమని చెప్పాలి? నవాబు కోపంతో 'ఇప్పటికిప్పుడే నాయబ్‌ను బంధించి తన ముందుకు తీసుకురావలసిందని, అందుకోసం గుర్రమును పంపించవలసిందిగా ఆజ్ఞాపించారు. ఇతర జనం అబారావ్‌ను దూషించ సాగారు. ఇలాంటి విషమ పరిస్థితిలో ఆయన ఏలా జీవిస్తారో అని

మాట్లాడుకోసాగారు. ఇంతలో ఇంకో తపాలా వస్తే దానిని తీసి చూస్తే తెలిసిందేమిటంటే ఖాల్కి యొక్క నాయబ్ పది వేల రూపాయల హుండీ పంపిస్తూ వ్యాపారికి అలవాటు ప్రకారంగా హుండిబత్తా యాభై రూపాయలను కూడా పంపిస్తున్నాము అని వ్రాసి ఉంది.

ఇది విని నవాబుసాహెబ్ చల్లబడ్డారు. అఖబార్‌నవీస్ బద్‌మాష్ లా ఉన్నాడు. అతన్ని పని నుండి తొలగించండి మరియు అబారావ్ నాయబ్‌ను సర్కార్ యొక్క ఖర్చు మిగిల్చి లాభం కలిగించడం వల్ల అతనిని పై పదవికి పంపించి జీతం పెంచవలసిందిగా ఆ క్షణమే నవాబు ఆదేశించారు. ఆ విషయాన్ని తెలపడానికి వెంటనే ఏర్పాటు కూడా జరిగింది. ఇక్కడ ఆబారావ్ మనస్సులో భయపడినా కూడా ప్రభుమందు నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఆబారావ్‌ను ప్రభువు 'కచేరికి వెళ్లు భయపడకు', అని చెప్పి పంపించారు. ప్రభు ఆజ్ఞ ప్రకారం నిర్భయంగా కచేరికి వెళ్లారు. ఆరోజు హైదరాబాద్ నుండి శాలువా మరియు ఉత్తమ ప్రశంశాపత్రము రావడం వల్ల ఆయనకు ఎంత ఆనందం కలిగిందో మాటలలో వివరించలేము. ఈ విధంగా భక్తుల సంకటాలను దూరం చేస్తూ ఉండడం వల్ల వారు ప్రభువుకు ధన్యవాదాలు తెలిపారు.

## 35. గొల్ల తుకారం

తుకారం అనే పేరుగల ఒక గొల్లవాడు ప్రభు భక్తుడై ఉండెను. తనకు వ్రాయడానికి, చదవడానికి కొద్దిగా వచ్చేది. ఆయనకు ఆత్మసాక్షాత్కారం కావాలని కోరికగా ఉండేది. అదే విషయం ప్రభువద్ద విన్నవించుకున్నాడు. వాడి అమాయకత్వానికి ప్రభువుకు సంతోషమై తనకు 'ఆత్మరూప ప్రతీతి' అనే పుస్తకాన్ని ఇచ్చి దానిని అనేక సార్లు పారాయణం చేయవలసిందిగా చెప్పారు. ఈ 'ఆత్మరూపప్రతీతి' అతిచిన్నగా ఉండెను. అది తుకారామ్ కోసమే ప్రభు వ్రాశారని కొందరు అంటారు. తను ఆ గ్రంథాన్ని ఇష్టంగా తీసుకొని చదవడానికి ప్రారంభించాడు. కాని ఎన్ని రోజులు పారాయణం చేసినా ఆత్మరూప సాక్షాత్కారం జరగడం లేదని ఒకరోజు ప్రభు సన్నిధికి ఆ గ్రంథాన్ని తిరిగి తీసుకొని వచ్చి మహారాజ్, ఈ గ్రంథం యొక్క అర్థం నాకు తెలియడం

లేదు. మీరు చెప్పినట్లుగా పారాయణం చేసి నాకు కంఠస్థం అయింది. కానీ, ఆత్మరూపసాక్షాత్కారం జరుగలేదు. ఇలా నన్ను ఎందుకు పారాయణం చేయమని విసిగిస్తున్నారు. దీంతో నాకు పనిలేదు, మీరు సాక్షాత్ దేవుడు. నేను ఈ గ్రంథం వెంట పడను. మీరే ఈ గ్రంథాన్ని జాగ్రత్త చేయండి.

ఆయన అమాయకత్వానికి ప్రభువుకి నవ్వు వచ్చింది. అప్పుడు తీయని మాటలతో సముదాయించి భండారుఖానాకు వెళ్ళి జోళీ ప్రసాదం తీసుకొని రావలిసిందిగా చెప్పారు. ఆ విధంగా ప్రసాదం తీసుకోవడానికి భండారుఖానాకు వెళ్తూ తన కంబళిని ప్రభు వద్ద ఉంచి వెళ్ళాడు. ఆయన వెళ్ళిన తరవాత ప్రభు దాన్ని తన శరీరంపై కొద్దిసేపు వేసుకున్నారు. ఆయన ప్రసాదం తీసుకొని వచ్చిన తరువాత తిరిగి కంబళిని అతనికి ఇచ్చి వేశారు. తుకారం కంబళిని తన శరీరంపై వేసుకొని కూర్చోగానే ఆయన చిత్తవృత్తి లయమై సమాధి స్థితికి చేరుకున్నాడు. స్వరూపసాక్షాత్కారం అంటే ఏమిటో దాని ప్రత్యక్షఅనుభవం ఒకక్షణంలో తుకారాంకి కలిగింది. కంబళి కప్పుకొని ఆనందానుభూతిలో లీనమై తన్మయత్వ స్థితిలో ఉండిపోయాడు. ప్రభు అడిగారు, 'తుకారం నీకు ఏమయింది?'. ''మహరాజ్ నాకు ఏం కావలసి ఉండెనో, అది దొరికింది అన్నారు. ఇలాంటిది ఎద్దైనా కావాలని కోరిక ఉండేది. ఆ కోరిక ఈ రోజు ఫలించింది. నేను ధన్యుడనయ్యాను'' ప్రభు స్పర్శలో ఎంత సామర్థ్యం ఉందో దాని అనుభవం భక్తులకు తెలిసింది. తుకారం తరువాత తురీయ స్థితిలో ఉండి ముక్తుడయ్యాడని వేరే చెప్పే అవసరం లేదు. పై సంఘటన విఠ్ఠల్‌రావ్ తాలూక్‌దార్ తేర్‌పల్లి సమక్షంలో జరగడం వల్ల ఆయనే చెప్పడం జరిగింది. ఇలా ఎన్నో జరిగిన ఘటనలు ఈ గ్రంథంలో వ్రాయడం అశక్యం. ఆ కాలంలోని విశ్వసనీయ గృహస్థుల నుండి దొరికిన మహత్తరమైన విషయాలు ఈ గ్రంథంలో వివరించబడినాయి.

## 36. జాగీరు యొక్క దానం

ప్రభు మాణిక్‌నగర్‌లో నివసిస్తున్నారనే విషయం అన్ని దిక్కులకు వ్యాపించింది. హైదరాబాద్‌కు చెందిన శ్రీమంతులకు ప్రభు యొక్క కీర్తి తెలిసింది. పెద్ద పెద్ద రాజ దర్బార్‌లలో దొరకని సంభావన ప్రభుదర్బార్‌లో

దొరుకుతుందని తెలిసింది. ప్రభువును దర్శించుకోవాలనే కోరికతో రాజపరివారాలు, శ్రీమంతులు వచ్చేవారు. తమ రాజ్యానికి భూషణంగా ఉన్న ఈ మహనీయుని కీర్తి అప్పటి శహన్‌షా ఆలహజరత్ అఫజల్ ఉద్దౌలా చెవినపడెను. కాని ఆయనకు ప్రభువును దర్శించుకోవాలని ఉన్న కోరిక ఎలా తీరుతుంది? ప్రభు అయినా హైదరాబాద్‌కి వెళ్ళాలి లేదా హుజూర్ అయినా ప్రభువద్దకు రావాలి. ఈ రెండింటిలో ప్రభువునే హైదరాబాద్‌కి తీసుకురావాలనే ఉద్దేశంతో నిజామ్ ప్రధానియైన సర్ సాలార్ జంగ్ బహాదూర్ గారు, నిజామ్ సైన్యంలో అరబ్బుల కంపెనీలో నమ్మకస్తుడైన యశ్వంత్‌రావ్ అనే బ్రాహ్మణ గృహస్థును ప్రభు వద్దకు పంపించారు. ప్రభువుకు విన్న వించుకొని హైదరాబాద్‌కి తీసుకురావాలని వారితో పాటు గుఱ్ఱాల స్వారీ, మేనాలు, పల్లకీలు మొదలైన సరంజామా అంతటిని ఇచ్చి ప్రభువు హైదరాబాద్ వస్తే అరవై వేల విలువైన జాగీరు ఇస్తామని చెప్పిపంపారు.

యశ్వంతరావ్ సరంజామా తీసుకొని ప్రభు దర్బార్‌లో హాజరు అయ్యారు. ఆయన సన్మాన పూర్వకంగా ప్రభు ముందు దండప్రమాణాలు చేసి తాను వచ్చిన కారణాన్ని నివేదించి, పంపించిన కానుకలను ప్రభు చరణాల వద్ద ఉంచాడు. మరియు జాగీరు ఇస్తానన్న విషయాన్ని కూడా తెలియజేశారు. మేము ఫకీరులము, జాగీరు తీసుకొని ఏం చేస్తాము? మేము ఏ వైపుకు చూస్తే అదే మా జాగీరు. విశ్వమంతా ప్రభువుకు రాజ్యం. మీ యజమాని ఇచ్చిన దానికంటే పదిరెట్లు కావాలనుకుంటే ఆయనను ఇక్కడికే రమ్మని చెప్పండి. ఏది అడిగితే అది దొరుకుతుంది, నేను ఇక్కడ ఉండడం తన రాజ్యమునకు రక్ష అని నిజాముతో చెప్పండి అన్నారు.

ప్రభు యొక్క ఈ స్పష్టమైన జవాబు అందరికి ఆశ్చర్యం కలిగించింది. కానీ, ఆ జవాబులో ప్రభు యొక్క దైవత్వం ఉంది. ప్రభు యొక్క సర్వతంత్ర, స్వతంత్ర ప్రవృత్తి జనులందరికి తెలిసింది. బంగారు సంకెళ్ళతో ప్రభువుని కట్టి వేయడం సాధ్యమవుతుందా?. ఒకసారి గొల్లవాడు తన అమాయక ప్రేమతో ప్రభువుని వశపరచుకోవచ్చు. కానీ, శహన్‌షా ధనం ఆశ చూపించి దూరంగానే ఉండిపోయాడు. ఇలాంటి వారు ప్రభువు నుండి దూరంగానే ఉంటారని పై సంఘటన నుండి మనకు తెలుస్తుంది. ప్రభు ప్రసాదంతో అఫజలుద్దౌలాకి

పుత్రప్రాప్తి అయి ప్రభు యొక్క ఆజ్ఞతో ఆ పుత్రునికి 'మహబూబ్' అని నామకరణం చేశారు. ముందు ఈయన 'మహబూబ్ అలీ పాషా' పేరుతో హైదరాబాద్ నిజామ్ అయ్యారు.

## 37. టర్రా హుసేన్‌ఖాన్

ప్రభు దర్బార్‌లో హిందుస్థాన్‌లోని చాలా వరకు ప్రసిద్ధులైన కళాకారులు వచ్చేవారు. దాంట్లో పేరుపొందిన గాయకులు ఎక్కువగా వచ్చేవారు. ప్రభు గానప్రియులై శాస్త్ర మర్మం తెలిసిన వారని అన్ని వైపుల ఖ్యాతి గడించి ఉండిరి. రాజు నుండి భరణం దొరికినా కూడా సంగీత జ్ఞానం రాజులకు అంతంత మాత్రం అవడం వల్ల నిజమైన గాయకుల ప్రతిభ తెలిసేది కాదు. వారి ప్రతిభను ప్రదర్శించడానికి అనువైన ప్రదేశం ప్రభు వద్దనే అని తెలియడం వల్ల హైదరాబాద్ నుండి మాణిక్‌నగర్‌కి వచ్చేవారు. ఇతర ప్రదేశాలకు చెందినవారు కావాలని ప్రభువద్ద హాజరీ వేయడానికి వచ్చేవారు. ఒకసారి ఇలాగే ప్రఖ్యాత గాయకులలో ఒకరైన హుస్సేన్‌ఖాన్ అనే పేరుగల గాయకుడు ప్రభు కీర్తి విని రావడం జరిగింది. ఆయనకు ఇంతకుముందు సంస్థానాలలో ఆదరణ పొంది ఉండిరి. వీరికి తన విద్యపై, గాత్రంపై చాలా గర్వంగా ఉండేది. రాజదర్బార్‌లో బహుమానం ఎంత దొరికినా సమాధానం కలుగలేదు. తన పాండిత్యం తెలుసుకునే వారు ఎవరూ దొరకట్లేదని ఆయనకు అనిపించేది. ఒక రోజు దర్బారులో ఆయన పాట పాడుతుండగా రాజావారు ఆయనను మెచ్చుకున్నారు. కాని ఆయనకు దానికి కోపం వచ్చింది. ''మహారాజా మీరు ఏం తెలుసుకొని నన్ను పొగిడారు? ఇలా పిచ్చి ప్రశ్నలతో తన పాటను త్వరగా ముగించాడు. రాజుకు సంగీత జ్ఞానము లేదని 'అలాంటి' గాడిదల ముందు సంగీతము పాడకూడదని నిశ్చయించుకున్నాడు. మంచి గాయకుడు కానీ, ఇలా ఫకీరు బుద్ధితో అధిక ఉన్మత్తుడై విద్యను గుర్తించేవారు ఎవరైనా దొరుకుతారా అని వెతుకుతూ ఉండగా ప్రభువు కీర్తి విని మాణిక్‌నగర్ వచ్చి ఉండిపోయారు. అక్కడ దర్బార్‌లో ఎందరో విద్వత్తుకల గాయకులను కలుసుకున్నారు. ఇతరుల సంగీత కార్యక్రమము ప్రభు ముందు జరిగి భరణం కూడా దొరికింది. రోజూ భోజనం చేస్తూ భత్తా దొరికి పడి ఉన్నా కూడా హాజరీ వేసే సమయం రాలేదు.

మాణిక్‌నగర్‌కు వచ్చిన తరువాత ప్రభువుకి తన సంగీత ప్రతిభ తెలుస్తుందని అనిపించింది. కానీ నమ్మకం కలుగలేదు. ప్రభు ముందు పాడితేనే తెలుస్తుంది లేకపోతే తన విద్య ప్రభువుకి ఎలా తెలుస్తుంది. ఇలా అనుకుంటూ నాలుగు రోజులు గడిచిన తరువాత ఎలాగైనా ప్రభు ముందు పాడాలని అనుకొని అలాంటి సమయం కోసం ఎదురు చూస్తుండగా చివరికి ప్రభు అనుమతి లభించింది. అప్పుడు ఆయన పాడడం ప్రారంభించాడు. ఆయన పాడుతుండగా ప్రభు ఆ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ప్రభు తన పాట వినడం లేదని ప్రభు శ్రద్ధగా వినాలని తన పాటను ఆ రోజు తన విద్వత్తునంతా ఉపయోగించి పాడాడు. నాలుగు వైపులా కళాకారులు నిండి ఉన్నారు. అందరు 'వహ్‌వా' అనసాగారు. ప్రభు మాత్రం ఆయన వైపు చూడకుండా ఇతరులతో మాట్లాడుతూ ఉండిరి. తన ప్రతిభ చూపించి ప్రభువును ఆకర్షించాలని ఆయనకు ఉత్కంఠత కలగసాగింది. ఇలాంటి మానసిక సంఘర్షణలో ఒక దగ్గర పాట లయ-శృతి తప్పింది. ఆయన మనస్సుకి తెలుసు తాను తప్పు చేశానని, సరిగ్గా అదే సమయంలో ప్రభు 'వాహ్‌వా' ఖాన్ సాహెబ్ అన్నారు. అప్పుడు సిగ్గనిపించింది. ఇతరులకు దాని మర్మం తెలియలేదు. కాని ప్రభువుకి పాటలోని రహస్య మంతయు తెలుసిందని ఆయనకు గర్వభంగము అయ్యింది. దాంతో ప్రభువుకి సంతోషమయింది. హుసేన్‌ఖాన్ కళ్ళ నుండి ఆనందాశ్రువులు రాసాగాయి. పాటను ముగించి ప్రభు ముందు దండప్రమాణాలు చేసి మహారాజ్, నా విద్య మరియు జన్మ సార్థకం అయింది. నేను విద్యపై అహంకారంతో గర్వితుడను (టర్ర) అయ్యాను. అందువల్ల నన్ను టర్రాహుసేన్‌ఖాన్ అంటారు. ఇక్కడ నాకు గర్వభంగం అయింది. ఇప్పటి నుండి మీ కాళ్ళ దగ్గరే ఉండి పాడతాను ఎక్కడికి వెళ్ళనని దృఢనిశ్చయం చేసుకున్నానన్నాడు.

ప్రభు ఆయన్ని గౌరవించి తన దర్బారులో ఉంచుకున్నారు. ఆయనకు ప్రభు పాడితే వినాలని చాలా కోరికగా ఉండేది. ప్రభు పాట దర్బార్‌లో మాత్రం వినిపించేది కాదు. ఎప్పుడైనా పుంగి తీసుకొని పాడుతారని విన్నాడు కాని పాట వినే సందర్భం మాత్రం రాలేదు.

ఒక రోజు ప్రభు నివసించే గుడారం వద్ద తిరుగుతుండగా ఒక మధురమైన స్వరం వినిపించసాగింది. దగ్గరికి వెళ్ళి వింటే ప్రభు ఏవో పదాలు అంటూ పాడుతున్నారని అనిపించింది. ఎక్కడినుండి ధ్వని వినిపిస్తుందో అక్కడ ప్రభు

శౌచాలయం ఉండేది. గోడ ఆ వైపు నుండి ప్రభు పాడే పాట విని ఆయన అవాక్కయిపోయాడు. ఆయన కళ్ళ నుండి ఆనందాశ్రువులు కారుతున్నాయి. ఆయన తన దేహాన్ని మరిచి తన్మయత్వంలో ఉండిపోయాడు. చాలా సేపు పాట నడిచింది. పాట అంటే ఎలా ఉంటుందో ఆ అనుభవం ఆయనకు అప్పుడు కలిగింది. దాని ముందు తన పాట విలువ ఏ పాటిదో తనకు అప్పుడు తెలిసి వచ్చింది. తరువాత ప్రభువుకి సన్నిహితుడై, ఎక్కడికీ వెళ్ళక ఇక్కడే దేహం చాలించాడు.

సంగీతానికి సంబంధించిన విషయంలో ప్రభు దర్బార్ కీర్తి ఇప్పటికీ వదిలంగా ఉండి మార్తండమాణిక్ ప్రభువుల యొక్క సంగీత శాస్త్ర - ఖ్యాతి ఇంతగా పెరిగిందంటే అప్పటి పేరుపొందిన కళాకారులు మహారాజుల ముందు తమ విద్యను ప్రదర్శించారు. అసేతు హిమాచలంలోని అన్ని వైపుల నుండి కళాకారులు ఇక్కడికి వచ్చివెళ్ళారు. గాయకుల నిజమైన ప్రతిభ ఈ స్థలంలో తెలిసి ఉత్కృష్ట గౌరవం కూడా ఇక్కడ దొరుకేది. కాశినాథ్‌వంత్ ఛత్రే వద్ద ఉన్న రహిమత్‌ఖాన్ అనే గాయకుడు ఇలాగే తిరుగుతూ ఇక్కడికి వచ్చారు. వీరు మంచి శుద్ధ తత్వంలో పాడేవారు, వారికి పూర్తి జగత్తులో మాణిక్ నగర్‌లోనే ముక్త కంఠంతో పాడగలనని అనిపించింది. ఒక నెలరోజులు ప్రభు దర్బార్‌లో ఆయన పాడారు. రోజు మూడు నాలుగు గంటలు ఆయన సంగీత కచ్చేరీ జరిగేది. వారి గానం ముగిసిన తరువాత కాశినాథ్ ఛత్రే ఇలా అన్నారు "రహిమత్‌ఖాన్ ఇంత ఉత్సాహంతో ఎక్కడా పాడలేదు. ఆయన ఇప్పటివరకు సంపాదించిన విద్యకు సార్థకత ప్రభుమహరాజ్ దర్బార్‌లో పాడడం వల్ల వచ్చింది" .

## 38. నానా నృత్యము

ఖందార్‌కర్ దేశ్‌పాండే యొక్క కొడుకు పేరు నానా. ఈయన జమిందారు ఇంటికి చెందిన యువకుడు. సౌందర్యవంతుడై గాత్రం చాలా మధురంగా ఉండేది. శ్రీమంతుల ఇంట్లో జన్మించడం వల్ల జనం ఆయనని నానాసాహెబ్ అని పిలిచేవారు. ఆయనకు చిన్నప్పటినుండి నృత్యగీతముల వలన ధనమార్జించు మేళ గాండ్లను పరిచయము చేసుకొని వారి నృత్య గానాల యందు ఆసక్తి కలవాడై మేళగాండ్రతో స్త్రీ వేషము వేసుకొని నాట్యము చేయుటకు ఇష్టపడేవారు. జాతిలో తెలివిగలవాడై,

స్వరూపంలో సుందరుడై, కంఠము మధురమై ఉన్న ఆ బాలకుడు యుక్తవయస్కుడై ఉండి ఆ మేళగాండ్రతో పరిచయం చేసుకొని తిరిగేవాడు. కొన్ని రోజులు ఎవరికి తెలియకుండా జరిగేది. తరువాత బహిరంగంగానే ఆ నాట్యం చేసే స్త్రీలతో తిరగడం, నాట్యం చేయడం జరిగేది. ఆ రోజులలో దేశ్‌పాండే అంటే గ్రామానికి పెద్ద వారు. వయస్సులో ఉండి సంపత్తికి వారసుడైనా కూడా ఆ మేళగాండ్రతో తిరుగుతూ నృత్యం చేయడం మానలేదు. గ్రామస్థులకు ఈ విషయం తెలిసినా ఏమి చేయలేకపోయారు. చివరికి అందరు కలిసి బ్రాహ్మణ జాతినుండి అతనిని వెలివేశారు. వెలివేసినా కూడా నాట్యంపై అభిలాష తక్కువ కాకుండా అదే స్వభావంతోనే ఉండడంవల్ల జనం తప్పుపడుతుంటే చివరికి మాణిక్‌నగర్‌కి వచ్చి చేరుకున్నాడు.

ప్రభు దర్బార్‌లో నిత్యం గాన, నాట్య కార్యక్రమాలు జరిగేవి. నానాకు స్వభావసిద్ధంగా ఇష్టమైన నృత్యము చేసే కోరిక తీరక, ప్రభు దర్బార్‌లో ఉండి ప్రభు దర్శనం చేసుకొని తన పూర్తి కథను తెలియచేసి, ప్రభు చరణాలకు శరణు కోరుతూ నన్ను పావనము చేయండి అని వేడుకున్నాడు. మహారాజా నేను అనాచారిని. నా ప్రవృత్తి మారడం లేదు, నాకు నర్తించాలనే అనిపిస్తుంది. తన పాపకర్మలను చెపుతూ ఎంత ప్రయత్నించినా కూడా నర్తించాలనే కోరిక పోవడం లేదు. దీనికి నేను ఏం చేయాలి? అని అడిగాడు. అప్పుడు ప్రభువుకి అతనిపై దయ కలిగింది. ఆయన అంతః కరణ ప్రభువుకి తెలుసు కనుక ఆయనకు ఇష్టమైన నాట్యాన్ని సరైన మార్గంలో చూపిస్తే అతను ఉద్ధరింపబడుతారని, ఆయనకు జన్మత ఇష్టమైన కోరికకు భంగం కలిగించకుండా తిరిగి ఉత్తేజం కలిగింపజేశారు. నీవు ఎలా నాట్యం చేస్తావో ముందు నాకు చూపించు, తరువాత ఏం చేయాలో నేను చెపుతాను. అలా ప్రభు అనగానే నానాకు అమితమైన ఆనందం కలిగింది.అన్ని సిద్ధం చేసుకొని ప్రభు ముందు స్త్రీ వేషధారణలో నాట్యం చేశాడు. అతని ప్రతిభ అద్భుతమైనది. అతని స్వరూపం చూసి అతని పాటను విని జనులు మోహితులయ్యారు. ఆరోజు నానా చాలా బాగా నాట్యం చేశాడు. అతని కళను గౌరవించి ప్రభు తన వద్ద ఉంచుకొని స్వయంగా కొన్ని పద్యాలు నేర్పించి కృష్ణునిపై ఉన్న భక్తిని పెంచి ఎలా అభినయించాలో నేర్పించారు.

ఈ విధంగా కృష్ణ భక్తిని నాట్యం ద్వారా తనకు అలవాటు చేసిన తరువాత కృష్ణునికి సంబంధించి నాట్యం చేస్తూ దానిలో నిమగ్నమయ్యేవారు. ప్రభు

కృష్ణునిపై వ్రాసిన పదాలను నానా కారణంగానే వ్రాయబడి ఆయన సమక్షంలో విద్య తేజస్సు ఉత్పన్నం అయింది. నానాను ద్వేషించేవారు ప్రభువు నానాకు ఆశ్రయం ఇచ్చారని తెలుసుకొని నానాను కులమునుండి బహిష్కరించవలసిందని హంపి జగద్గురువులకు పిర్యాదు చేశారు. ఇది తెలుసుకొని జగద్గురువులు నానాకు సంజాయిషీ ఇవ్వవలసిందిగా లేఖ వ్రాశారు. నానా ఆ లేఖను ప్రభువుకి చూపించగా, ప్రభువు నానాకు కొన్ని సలహాలు ఇచ్చి జగద్గురువుల వద్దకు పంపారు. తాను పాపినని తనకు శిక్ష విధించుటకు పూర్వం తన నృత్య గీతములను ఒకసారి చూడమని చెప్పగా జగద్గురువులు అంగీకరించిరి. నృత్యమును చూసి జగద్గురువులు ఆనందించి ప్రభువు ఈయనను ఇప్పటికే పరిశుద్ధుని చేశారు. తాను చేసేది ఏమి లేదని చెప్పి నానాను పిలిచి ప్రసాదం ఇచ్చి పంపించారు. ప్రసాదం తీసుకొని తిరిగి మాణిక్‌నగర్ చేరిన నానా ఆఖరి శ్వాస వరకు ఇక్కడే ఉండిపోయారు.

ఈ విధంగా తన భక్తులకు వాళ్ళకు ఇష్టమైన మార్గంలో దారి చూపించి వారిని ఉద్ధరించడం ప్రభు యొక్క సమర్థత. ప్రభువుది సకలమత సంప్రదాయము. ఇదే ప్రభు యొక్క విశేషము. ఎవరికైనా వారి కర్మలపై దోషం చూపించ కుండా వారిలో ఉన్న ప్రతిభను బయటకు తెచ్చి మోక్షం యొక్క దారి చూపించేది నిజమైన సద్గురువుల శక్తి. వీరికి తప్పించి ఎవరికి ఆ శక్తి ఉంటుంది? ప్రభు చేతిలో ఉన్న వారికి అధోగతి కల్గించే శక్తి ఎవరికీ ఉండదు. ఇలా ప్రభు వద్దకు వెళ్ళిన భక్తులను ఎప్పుడు ఉపేక్ష చేయలేదు. 'మాకు పట్టుకోవడానికి వస్తుంది కాని విడచిపెట్టడం రాదు' ఇది ప్రభు వాక్యం. భక్తులకు ఇది ఎంత ఆశాజనకమైనది. ఇంత దృఢమైన, స్పష్టమైన మాట ఏ ఇతర సంత్‌మహాత్ములు ఇచ్చినట్టుగా మాకు కనిపించలేదు.

## 39. అక్కల్‌కోట్ స్వామి

ప్రభు యొక్క నివాసము మాణినగర్‌లో స్థిరమైనతరువాత, అన్ని రకాల ప్రజలు ప్రభు యొక్క దర్శనానికి రావడం ప్రారంభమయింది. రాజవంశానికి చెందిన వారు, శ్రీమంతులు, షావుకారులు, దేశ్‌ముఖ్ - దేశ్‌పాండే ఇలా

పెద్దవారే కాకుండా సాధువులు, సంతులు, బైరాగులు, గోసాయిలు, బ్రహ్మచారులు, సన్యాసులు, శాస్త్రులు, వైదికులు, పురాణికులు, హరిదాసులు, గాయకులు, నాయకులు అన్ని రకాలవారు రాసాగారు. అక్కల్‌కోట్ స్వామి సచ్చరిత్రలో ప్రభువు గురించి పద్యరూపంలో ఇచ్చిన వివరాలు మేము భక్తులకు వివరంగా మాటల్లో వ్రాస్తున్నాము.

''మొగలాయిల కాలంలో హుమనాబాద్‌కి దగ్గరలో మాణిక్‌నగర్ అనే సుందరమైన ప్రదేశం ఉంది. అక్కడ మాణిక్ ప్రభు అనే సిద్ధపురుషుడు నివాసము ఉండేవారు. దయ, క్షమ, శాంతి, భక్తి, జ్ఞానసహిత విరాగియై రాగద్వేషాలను పరిత్యజించి, బాల్యావస్థ నుండి సంసారాన్ని పరిత్యజించి, బ్రహ్మానందంలో మునిగి కళ్యాణినగరాన్ని ఉద్ధరించి, మాణిక్‌నగరాన్ని నిర్మించి, దానిని తప స్థానంగా చేసుకొని శుద్ధ భావనతో వేలమందికి దర్శనం ఇచ్చేవారు. వారి వద్దకు వైదికులు, పండితులు, హరిదాసులు, గాయకులు, జ్యోతిష్యులు, శ్రీమంతులు, గృహస్థులు, షావుకారులు, వ్యాపారులు మొదలైన వారు వచ్చేవారు. పైన వివరించిన విధంగా పెద్ద పెద్ద సాధువులు సంతులు, మహంతులు సన్యాసులు నిరంతరాయంగా వస్తూండేవారు''.

మహారాష్ట్రలో ఆ కాలంలో సత్పురుషులకు ఇతర సత్పురుషులతో సంబంధాలు ఉండేవి. ఆ కాలంలో మహారాష్ట్రలోని ప్రముఖ సత్పురుషులలో అక్కలకోట్ స్వామి, మీరజ్‌కి చెందిన అన్నాబువా మహరాజ్, కోల్హాపూర్‌కి చెందిన కృష్ణస్వామి ఉరఫ్ కుంభార్ స్వామి మరియు యశ్వంత్‌రావ్ దేవ్‌మామ్‌లేదార్ ఈ నలుగురు ప్రముఖులు ప్రభు యొక్క సమకాలీనులు. ఆ ఐదుగురిలో ప్రభువు అగ్రగణ్యులనడానికి ఏ విధమైన సందేహం లేదు. ప్రభువు చిన్ననాటినుండి ఉన్న అలౌకిక సామర్థ్యం దివ్యతేజస్సు, కఠినమైన వైరాగ్యము, అసామాన్యమైన జ్ఞానము, అప్రతిహతమైన కర్తృత్వశక్తిని చూస్తే సహజంగానే పై విషయం నిజమనిపిస్తుంది. సమర్థుల కాలంలో ఏ విధంగా సమర్థులవారు శ్రేష్టమైన వారో అలాగే ప్రభు కాలంలో ప్రభు శ్రేష్టమైన వారుగా గౌరవించబడేవారు. ప్రభు దర్శనం కోసం ఆ కాలంలో అందరు సత్పురుషులూ వచ్చేవారు.

అక్కల్ కోట్ ప్రజలకు, అక్కడి రాజదర్బార్‌కు చెందిన అధికారులకు మాణిక్‌నగర్‌తో విశేషమైన సంబంధం ఉండేది. ఆ దర్బార్ లోని, గ్రామంలోని చాలా మంది ప్రభుదర్బార్‌కు వస్తూపోతూ ఉండేవారు. అక్కడి రాజా వారు ప్రభువద్దకు ఛత్రం, పల్లకి పంపారు. ప్రభు అక్కల్‌కోట్‌కు రావాలని వారికి కోరికగా ఉండేది. అందుకని ఆ సామాను పంపించారు. ప్రభు ఇకముందు ఎప్పుడైనా వస్తానని చెప్పి వారిని తిరిగి పంపించారు. అక్కల్‌కోట్ జనంతో పాటు రాజుగారికి కూడా ప్రభువు అక్కల్‌కోట్ రావాలని ఆతురతగా ఉండేది. తరువాత తమ ఊరికి వస్తానని మాట ఇవ్వడం వల్ల ప్రభు రాకకోసం నిరీక్షిస్తూ ఉండిపోయారు.

అక్కల్‌కోట్ సంస్థాన ప్రతినిధి అయిన బాబా సబ్‌నీస్ ప్రభువును తమ గురువుగా అక్కల్‌కోట్ తీసుకువెళ్ళేందుకు వచ్చిరి. అదే సమయంలో ఒక తేజోమయ సత్పురుషులు ప్రభు దర్శనానికి మాణిక్‌నగర్ వచ్చి ఉండిరి. వీరు దిగంబరులై, దృఢకాయులై ఉండిరి. వారు ఇక్కడికి వచ్చినప్పుడు ఎవరితో మాట్లాడేవారు కాదు. ప్రభు మహారాజు గారు వారితో మూడు రోజులు ఏకాంత చర్చ జరిపారు. ప్రభు వారిని తమ సోదరులుగా భావించేవారు. ప్రభు ప్రేమకు స్వామీ ముగ్ధులై తను మాణిక్‌నగర్‌లో ఉంటామని తమ ఇష్టాన్ని తెలియజేశారు. అప్పుడు ప్రభు వృక్షం క్రింద వృక్షం పెరగదని చెపుతూ బాబా సబ్‌నీస్ గారికి వీరే మీ సద్గురువులు, మీకు మంచి జరుగుతుంది అని ఆశీర్వదించి వారిని అక్కల్‌కోట్‌కు తీసుకువెళ్ళమని చెప్పి పంపించారు. ఈ సత్పురుషులే అక్కల్‌కోట్ స్వామీ సమర్థులు.

అక్కల్‌కోట్ నుండి పల్లకి, ఛత్రం మొదలైనవి వచ్చిన సమయంలో శంకరప్ప ఉద్‌గీర్ అనే పేరుగల భక్తుడు ప్రభుసన్నిధిలో ఉండిరి. ఆయన్ని పిలిచి ప్రభువు సామాగ్రి ఇచ్చి మా వంటి ఫకీరులు ఇవి తీసుకొని ఏమి చేయాలి? మీరు తీసుకు వెళ్లండి అని ప్రభువు చెప్పగానే అతను నమస్కారం చేసి, ప్రభూ నేను బీదవాణ్ని తీసుకువెళ్లడానికి నా వద్ద మనుష్యులు లేరు. వాటిని నేను ఏమి చేసుకోవాలి అన్నారు. అప్పుడు ప్రభు ముందు తీసుకొని వెళ్లండి, మిగతాది అదే సర్దుకుంటుంది. నీవు చింతించకు అన్నారు. ప్రభు ప్రీతితో ఇస్తున్న దానిని ప్రసాదంగా భావించి తీసుకున్నాడు. తరువాత ప్రభు కృపతో వారి కీర్తి, ఐశ్వర్యం పెరిగి

ధనవంతులయ్యారు. ఈ శంకరప్పను ప్రభు నాలుగు కోసుల దూరంలో ఏదైనా కనిపించేటట్లు దివ్యదృష్టి ఇచ్చారని చెబుతారు. ఇప్పటి వరకు ఈ వంశానికి చెందిన వారు సత్పురుషులై ఉన్నత స్థితిలో ఉన్నారు.

## 40. విఠ్ఠల్‌రావు తాలూకుదారు

మాణిక్‌నగర్‌లో ప్రభు నివాసం స్థిరమైన తరువాత ప్రభు కృప లభించిన భక్తులలో విఠ్ఠల్‌రావ్‌తాలూకుదారు అగ్రగణ్యులుగా లెక్కింపబడుతారు. విఠ్ఠల్‌రావు చాంగ్‌లేర్‌కు చెందిన కులకర్ణి వంశస్థులు. చాంగ్‌లేర్ చిటుగుప్పా తాలూకాలో ఉంది. హుమనాబాద్‌కి చెందిన నవాబుల సంస్థానములో శేందరి పనిలో నియమించబడ్డారు. ఆ సమయంలో పదిహేను రూపాయల జీతం మాత్రమే ఉండేది. విఠ్ఠల్‌రావు ఏ విధంగా పై పదవికి వెళ్లారో వివిధ చరిత్ర కారులు వివిధరకాలుగా వ్రాశారు. విఠ్ఠల్‌రావు భార్య బయినాబాయి మాణిక్‌నగర్‌కి వచ్చి తీర్థం తీసుకోకుండా, ప్రభు దర్శనం చేసుకోకుండా భోజనం చేసేదికాదు. బీద స్థితి నుండి పైకి రావాలని ప్రభు వద్ద ఈ నియమముతో ఉండేది. చివరికి ప్రభు ప్రభు కృపతో పదహేను రూపాయల జీతం, వంద రూపాయలుగా, తరువాత ఏడు వందల రూపాయలకు పెరిగి వారి దారిద్ర్యం పూర్తిగా రూపుమాసి ఆయన పెద్ద తాలూకుదారు అయ్యారు. ఏ విఠ్ఠల్‌రావ్ ఇంట్లో అయితే రెండు పూటలా తినడానికి తిండి కూడా దొరకలేదో ఆ ఇంట్లో సాక్షాత్ లక్ష్మి నివసించసాగింది. విఠ్ఠల్‌రావు ప్రభువుని తన ఆఖరి శ్వాసవరకు విస్మరించలేదు. తరువాత ఆయన లక్షల రూపాయలను ప్రభువుకు సమర్పించుకున్నారు.

టోల్ అనే చరిత్రకారులు కొంచెం భిన్నంగా వ్రాసినా తాత్పర్యం మాత్రం ఇదే.

## 41. యజ్ఞం

శ్రీ ప్రభువు హాళిఖేడ్‌కు చెందిన యజ్ఞేశ్వర దీక్షతులతో మాణిక్‌నగర్‌లో 'సర్వతోముఖ' అనే పేరుగల యజ్ఞం చేయించారు. ఈ యజ్ఞం విషయంలో చరిత్రకారులందరూ కొద్ది తేడాతో వ్రాశారు. ఆ సమయంలో ఆ యజ్ఞం 'స

భూతో న భవిష్యతి' అన్న విధంగా జరిగిందని అంటారు. అత్యద్భుతంగా యజ్ఞం జరగడం వల్ల అది చూసిన వృద్ధులు ఆ యజ్ఞం ఇప్పటికీ జ్ఞాపకం ఉంది అంటారు. ప్రభు యజ్ఞం కోసం లక్షల రూపాయలు ఖర్చు చేశారు. వేలమంది నివాస, భోజన సదుపాయం ఉత్తమ రీతిలో చేయబడింది. అంతమంది జనానికి నివాసం, భోజన ఏర్పాట్లు చేయడం ఎంత కష్టం. ఈ యజ్ఞానికి ఏర్పాట్లు ఒక సంవత్సరం ముందునుండి జరుగుతూ వచ్చాయి. అవి పూర్తి అయిన తరువాత మంచిరోజు చూసి యజ్ఞం ప్రారంభించబడింది. భాలచంద్రదీక్షిత్ ఇంటివారిపై ప్రభువుకి ప్రేమతో కూడిన మర్యాద ఉండేది. దీక్షితులు కాలం చేసిన తరువాత ఆయన ముగ్గురు పుత్రులలో పెద్ద కొడుకు యజ్ఞేశ్వర్ దీక్షిత్ హాళ్లిఖేడ్‌లో నిత్యాగ్నిహోత్రులై ఉండేవారు. మధ్యవారు నారాయణ దీక్షిత్ ప్రభు సన్నిధిలో ఉండి ప్రభుభక్తులలో అగ్రగణ్యులై ఉండిరి. దిగంబర్ దీక్షిత్ విషయంలో ఎక్కువగా వ్రాయబడలేదు. ఈ ముగ్గురు అన్నదమ్ములలో యజ్ఞేశ్వర్ దీక్షిత్ వంశము హాళ్లిఖేడ్‌లో నివసిస్తూ కీర్తి సంపాదించి ఇప్పటికీ మంచి వంశస్థులై ఉన్నారు.

ప్రభు ఆ యింటివారిపై అత్యంత అభిమానం చూపేవారు. యజ్ఞేశ్వర్ దీక్షిత్ ఉత్కంటత చూసి ప్రభువు ఆయనకు యజ్ఞం చేయడానికి అనుమతి ఇచ్చారు. స్వయంగా పూర్తి ఖర్చు భరించారు. ప్రభువు ఆశ్రయం దొరికిన తరువాత సర్వదేవతల సమాగమం జరిగిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. యజ్ఞం చేయాలని నిశ్చయించిన తరువాత సాక్షాత్ లక్ష్మి నివసించసాగింది. అన్నపూర్ణదేవి ప్రసన్నురాలై సర్వత్రా సంతోషం అలుముకొంది. కొంతమంది విద్వాంసులకు యజ్ఞంలో పాలు పంచుకునే అవకాశం కలిగింది. విఘ్నం కలిగించేవారికి కూడా ప్రభు ఉచితరీతిలో సంతృప్తపరిచారు. సత్పురుషులకే కాకుండా దుష్టులను సమాధానపరచడం మహాత్ములకే సాధ్యమవుతుంది.

ఈ యజ్ఞానికి కావలసిన ద్రవ్యనిధి ప్రభు ఎక్కడినుండి తెచ్చారు అనే విషయం ప్రభు చరిత్రలో ఎక్కడా కనిపించదు. యజ్ఞానికి ఖర్చు ఎంత అవసరం అవుతుందో ఊహించడం కూడా కష్టమే. ఎన్నో వేల రూపాయలు దక్షిణగా ఇవ్వడం జరిగింది.

సోలాపూర్‌కి చెందిన ఒకరు ఈ యజ్ఞానికి సంబంధించిన విషయంలో ఇలా వ్రాశారు. యజ్ఞ నిర్విఘ్నంగా జరుగుతుండడంతో ప్రభు కీర్తి నలుదిక్కులా వ్యాపించింది. యజ్ఞం నడుస్తుండగా మధ్యలో మహావిఘ్నం కలిగినప్పుడు ప్రభు సామర్థ్యంతో అది దూరమయి యజ్ఞం ఎలా నిర్విఘ్నంగా జరిగిందో క్రింద వ్రాయడం జరిగింది. ఒక బ్రాహ్మణుని 13-14 సంవత్సరాల కుమారుడు ఒక రోజు చపాతీలు తింటూ అజీర్ణం అయి ఎక్కిళ్లతో మరణించాడు. ఆ శరీరాన్ని యజ్ఞ మండపంలోకి తీసుకువచ్చి ఆ బ్రాహ్మణుడు ప్రభు ముందు ఏడుస్తూ కూర్చున్నాడు. ప్రభు ఎన్నో రకాలుగా సముదాయించారు. ఇకముందు నన్ను మీ కుమారుడిగా భావించి మీరు ఇక్కడే ఉండండి. మిమ్మల్ని చివరివరకు పోషిస్తాను. మీకు కావలిసిన ద్రవ్యం ఇస్తాను అని ఎన్ని రకాలుగా సముదాయించినా ఆ బ్రాహ్మణుడు వినలేదు. చివరికి ఆ బ్రాహ్మణుడు తన ప్రాణాలను కూడా ఇవ్వడానికి సిద్ధమయ్యాడు. ఇక్కడ యజ్ఞ మండపంలో శవం ఉండడం వల్ల యజ్ఞ కార్యానికి విఘ్నం కలుగడంతో బ్రాహ్మణులకు బాధ కలిగింది. చివరికి ప్రభు తాత్యా సాహెబ్‌గారితో ఒక డొప్పలో బ్రాహ్మణులందరి వద్ద తీర్థం తీసుకొని ఆ పిల్లవాడి నోట్లో పోయమని ఆజ్ఞాపించగానే తాత్యాసాహెబ్ బ్రాహ్మణులందరి వద్ద తీర్థం తీసుకొని శవం నోట్లో పోయగానే ఆ బాలుడు వెంటనేలేచి కూర్చున్నాడు. అందరూ ఆనంద భరితులై పూర్ణాహుతి గావించారు. పైన జరిగిన వృత్తాంత్తం యజ్ఞం జరుగుతుండగా వచ్చిన విఘ్నాన్ని ఎలా తొలగించారో తెలుపుతుంది. టోల్ అనే ఆయన ఇంకా విస్తారంగా కింది విధంగా వ్రాశారు.

యజ్ఞం కోసం విశాలమైన మండప నిర్మాణం జరిగింది. దేశంలోని విద్వాంసులైన బ్రాహ్మణులు పోగయ్యారు. ధాన్యసామాగ్రి, ఎన్నో కోట్ల రూపాయలు ప్రోగుచేయబడ్డాయి. మాణిక క్షేత్రంలో, ప్రభు దర్బార్‌లో యజ్ఞం జరుగుతుందన్న విషయం నాలుగుదిక్కుల వ్యాపించి వేలమంది ప్రోగుసాగారు. అనేక దేశాలకు చెందిన వారు ఎప్పుడూ ప్రభు దర్శనానికి వచ్చేవారు. యజ్ఞం ఉందని తెలియగానే శాస్త్రపురాణికులు, నర్తకిమణులు, ఆటలాడువారు, గోసాయిలు, బైరాగులు మొదలైనవారికి అవసరమయ్యే పదార్థాల బందోబస్తు చేయడం జరిగింది. వచ్చిన వారెవరు ఉపవాసం ఉండేవారు కాదు. ఎవరికి అప్పగించిన పని వారు సక్రమంగా చేస్తున్నారో లేదో వచ్చిన వారికి ఏమి

కావాలో ఎపుడూ గమనిస్తూ ఉండేవారు. చిన్న పిల్లలు, స్త్రీల పై ప్రత్యేక దృష్టి పెట్టమనేవారు. యోగ్యతను అనుసరించి, వస్త్రాలు, నగదు ఇచ్చేవారు. ఏ జాతి వారినైనా సరే సంతృప్తి పరచి పంపించేవారు. ఎవరైనా, ఎన్ని రోజులైనా ఉండి, ఇష్టం వచ్చినపుడు వెళ్లవచ్చు. గోసాయి, బైరాగులు వచ్చేవారు. వారిలో గుర్రాల్ని, ఎద్దుల్ని ఎవరు ఏది అడిగితే వారికి అది ఇచ్చేవారు. ఎవరైనా ధనం అడిగితే ఇచ్చి వారిని సంతృప్తి పరచి పంపించేవారు.

సకల ఐశ్వర్యం యొక్క మూలస్థానం ఏదైతే నిత్యశ్రీ నిత్య మంగళం అవుతుందో దానిని ఏమని వర్ణించాలి? సృష్టి కర్త యొక్క ఏదైనా కృత్యాన్ని తన మనస్సుతో చేస్తే ఎలా ఉంటుందో దాన్ని వర్ణించనలవి కాదు. యజ్ఞం యొక్క పనులు పండితులైన బ్రాహ్మణుల చేతులపై నడుస్తూండగా ప్రభు రోజులో కొంత సేపు యజ్ఞశాలలో వెళ్లి కూర్చునేవారు. ముందుగా పూర్తి యజ్ఞశాల ప్రదక్షిణం చేసి లోపలికి ప్రవేశించేవారు. కొంతసేపు స్థిరంగా కూర్చుని ప్రభు తమ కుటీరానికి వెళ్లేవారు. ఈ విధంగా యజ్ఞం అయిన తరువాత మండలితో ప్రభు సంగము వైపు స్నానానికి వెళ్లేవారు.

సంగమ ప్రదేశంలో అవభృథ స్నానం కోసం నీరు నింపి ఉంచబడేది. ఈ సమారంభము చూడడానికి దగ్గరలోని గ్రామాల ప్రజలు పోగయ్యారు. రుత్విక్కులతో ప్రభు యొక్క స్నానానంతరము స్త్రీలకు వాయనదాన సమారంభము జరిగేది. తరువాత ఫలాహార పంక్తి జరిగేది. అనేక పదార్థాలు బండ్ల నిండా తీసుకొని రాబడి, శ్రీ కృష్ణ పరమాత్మ గోపాలబాలలతో కలిసి యమునా తీరంలో ఏ విధంగా ఆనంద క్రీడ చూపించారో ఆ విధంగా ఈ కలియుగంలో దత్తావతారి శ్రీ మాణిక ప్రభువులు శ్రీ కృష్ణ అవతార కాలంలో చూపిన స్వరూపం సంగమ ప్రదేశంలో చేరిన వేలమంది జనసమూహంలో ఫలహారాల పంక్తిలో చూపించారు. యజ్ఞ విషయంలో ఒక ప్రభు భక్తుడు పద్యరూపంలో ఇలా అన్నారు. ఎవరైతే మాణిక్‌నగర్‌లో ఒక సంవత్సరం నివసిస్తే, లేకపోతే దత్తజయంతి వంటి మహోత్సవము చూసే మహాభాగ్యం ఒక సారి అయినా లభిస్తే, అలాంటి మనుష్యులకు జన్మ సార్థకమవుతుంది. ఈ యజ్ఞ సమారంభములో భోజన వ్యవస్థను ఇప్పటికీ వృద్ధులు పొగుడుతారు. విఠల్‌రావ్ తాలూకుదారు పూర్తి ఏర్పాట్లు దగ్గర ఉండి చేయించారు. ఆయన ఆధీనంలోని

చిన్న పెద్ద అధికారులు, పనివారు స్వయంగా శ్రమదానం చేశారు. నాలుగుకోసుల దూరం నుండి మడితో వడియాలు, అప్పడాలు, చట్నీలు, ఆవకాయలు తీసుకొచ్చే ఏర్పాటు చేశారు. వడ్డించే విషయంలో అత్యంత శ్రద్ధ చూపించబడేది. భోజనం చేయని వారికి వంట సామాగ్రి ఇచ్చేవారు. చిన్నపిల్లలకు పాలు ఇంటింటికి తిరిగి అందించబడేవి. సారాంశం ఏమిటంటే ఏర్పాట్లలో కించిత్తు కూడా లోపం కనిపించకూడదనే దీక్షతో పనిచేసేవారు. ప్రభునుండి ఎప్పుడు తమకు ఆజ్ఞ వస్తుందో అని అందరూ ఎదురు చూసేవారు. ఒకసారి ప్రభువద్ద నుండి ఆజ్ఞ వచ్చిందంటే ఆ ప్రకారంగా నడుచుకొని ప్రభుని సంతోషపరచడం అందరికి ముఖ్యమైన పనిగా ఉండేది.

యజ్ఞవిషయంలో జరిగే పశువధ విషయంలో ఆ రోజుల్లో చర్చ జరిగేది. ఈ విషయంలో మనం ఏమి చేయలేము. సకలమత స్థాపకుడైన సద్గురువుకు వైదిక మార్గంలో ఉన్న జనాలను ఒక దగ్గరికి చేర్చడం అవసరంగా ఉండేది. అందుకని ప్రభు ఈ యజ్ఞం తలపెట్టారు. ఒక పశుహత్య విడిచి, ఇలాంటి యజ్ఞం వంటి ఉత్తమవిధి ఇంకోటి లేదు. పశుహత్య చెడ్డది కానీ, అది విడిచి మిగతా అంతా మంచి జరుగుతుంది. వైదిక ధర్మ ప్రకారం ఇది హత్య కాదని అనిపించడం వల్ల తప్పకుండా యజ్ఞంలో పశువధ చేయాలనే వారు వేల మంది ఉన్నారు. ప్రభు దర్బార్‌లో అన్ని రకాల జనాలకు లాభం చేకూర్చాలనే ఉద్దేశంతో చేయబడింది. ఇలాంటి యజ్ఞం ఆర్యదేశం మొత్తంలో ఎక్కడా జరుగలేదని అనిపిస్తుంది. పెద్ద పెద్ద రాజులు ద్రవ్యం ఉన్నా చేయలేని వారు ఉంటారు కానీ, ప్రభు దర్బార్‌లో 'న భూతో న భవిష్యతి' అన్న విధంగా జరిగింది.

## 42. మాణిక్‌నగర్‌లో శృంగేరి జగద్గురువులు

మాణిక్‌నగర్‌లో ప్రభు సంస్థానమునకు ఒక రూపము వచ్చిన తరువాత ప్రభు ఔదార్యము, అనేక లోకోత్తర గుణాల కీర్తి పరిమళం ఏ విధంగా విస్తరించిందో దాని వృత్తాంతం ఇప్పటివరకు తెలుపబడింది. రాజవాడకు చెందిన వారు, జాగీర్‌దార్‌లు పీఠాధిపతుల వద్దకు వెళ్లి ప్రభుని కీర్తిచడంతో

వారికి కూడా ప్రభుని చూడాలని ఉత్కంఠ కలిగింది. ఆ సమయంలోనే శృంగేరి మరియు హంపి ఆచార్యపీఠాల మధ్య సంచార క్షేత విషయంలో వాదన మొదలయింది. ఈ వాదన లేకుండా చేసే సామర్థ్యం ఎవరికి ఉందో అని రెండు పీఠాల వారికి దిగులు మొదలయింది. శృంగేరి పీఠ ఆచార్యుల గొప్పదనాన్ని ఒప్పుకొని హంపి పీఠం నిజాంరాజ్యంలో సంచార క్షేత్రం కావాలని హంపి పీఠానికి ఉండేది.

శృంగేరి మరియు హంపి ఈ రెండు పీఠాల అధికారులు లేదా పండితులు వస్తూ ఉండేవారు. ఈ విషయాన్ని ప్రభువుకి చెప్పి తీర్పు చెప్పమని అడగాలని వారికి ఉండేది. హంపి పీఠం జగద్గురువులు ప్రభు వద్దకు వచ్చారు. వీరు వచ్చి వెళ్లిన తరువాత నిజాం రాజ్యంలోని స్థలాలు వారి సంచారక్షేత్రాలు అయ్యాయి. ప్రభువు హంపి పీఠం జగద్గురువును అత్యంత ఆదరణ పూర్వకంగా ఎదురు వెళ్ళి మాణిక్ నగర్‌కు తీసుకొని వచ్చారు. మరియు యథాయోగ్యంగా తాత్యా మహారాజగారు గుడిలో పూజ జరిపించి లెక్కలేనంత ద్రవ్యాన్ని దక్షిణగా సమర్పించుకున్నారు. తరువాత శృంగేరి శంకరాచార్య మఠం నుండి ప్రభు మహరాజ్ వద్దకు వారి సంస్థానమునకు చెందిన రామశాస్త్రి నుండి లేఖ రావడం జరిగింది. మాఘమాసంలో జగద్గురువు తన పరివారంతో స్వయంగా మిమ్మలను కలవడానికి వస్తున్నారు అని ఆ లేఖ సారాంశం. ఈ విషయం చదివి చాలా ఆనందించి రెండు నెలల ముందు నుండి స్వాగత సమారంభము ప్రారంభించారు. అరవై వేల రూపాయల రత్నఖచిత హారాన్ని స్వర్ణకారులతో చేయించి, ఒక లక్ష రూపాయల విలువగల రత్నఖచిత ముకుటం మరియు అమూల్యమైన వస్త్రాలను, వారి మండలిలోని ప్రతి ఒక్కరికి యోగ్య వస్త్రాలను తయారు చేయించారు. స్వామి నివసించే ప్రదేశం తయారు చేయించి నాలుగు నెలలు ఉంటారని తెలిసి అన్ని రోజులకు సరిపడా భోజన, నివాస సదుపాయాలు చేయించి ఒక ఏనుగు, పది మంచి గుర్రాలు, ఒక పల్లకి, మేనా, ఇరవై ఐదు స్వచ్ఛమైన ఆవులు, పది మంచి జాతి గేదెలను సిద్ధం చేయించారు. జగద్గురువులు సంచారం చేస్తూ దగ్గర దగ్గర నారాయణపేట్‌కి వచ్చారని తెలిసింది. జగద్గురువుతో పాటు సుమారు ఐదువందల మంది జనం, ఐదు ఏనుగులు, ఇరవైఐదు గుర్రాలు, రెండు పల్లకిలు, నాలుగు మేనాలు, పది మంది పాదచారులు, శాస్త్రపండితులు, ఆవులు, గేదెలు, ఒంటె, ఎద్దు

బండ్లతో చౌకీదారులు, ఛడీదారులు ఇలా అనేకమైన వాటితో శృంగేరీ జగద్గురువులు ఉత్సవంగా వస్తున్నారని తెలసి ఆ రోజు రాత్రంతా ఎవరూ నిద్రపోలేదు. గ్రామంలోవీధులు పూర్తిగా కళాపి చల్లి రంగవల్లులు వేయబడ్డాయి. గ్రామంలో ప్రతి మూలలో మరియు మహాద్వారం వద్ద అరటి, మామిడి ఆకులతో అలంకరించి స్వాగతసన్నాహాలు వైభవోపేతంగా కనింపించాయి.

అష్టమి రోజు పొద్దున జగద్గురువు, వారి పరివారం హుమనాబాద్ నుండి బయలుదేరగానే ఇక్కడ ఎదురు వెళ్లడానికి ప్రభు పరివారం బయలుదేరింది. ముందుగా ఏనుగు, గుర్రాలను తీసుకొని తాత్యా సాహేబ్ తన ఇద్దరు పుత్రులతో ఎదురు వెళ్ళి పాదాభివందనం చేసి రెండు వేల రూపాయలను కానుకగా సమర్పించుకొని స్వాగతించారు. రామశాస్త్రి వారి ఇద్దరు పుత్రులను జగద్గురువుల పాదాల దగ్గర ఉంచి తాత్యావారిని వీరు ప్రభు యొక్క కనిష్ట సోదరుడు అని పరిచయం చేశారు. తరువాత వారు తాత్యాసాహెబ్‌ను ఆలింగనం చేసుకొని తన మెడలో ఉన్న అమూల్య హారాలను తాత్యావారికి వేసి ఇద్దరు పుత్రులకు పుష్పహారం, కొబ్బరిని ప్రసాదంగా ఇచ్చి ప్రభు వద్దకు వెళ్లడానికి పల్లకీలో కూర్చున్నారు. హుమనాబాద్ నుండి స్వామి బయలుదేరగానే ఇక్కడ ప్రభు పాదయాత్రగా తనతో రెండు వేల మంది బ్రాహ్మణులను, రెండు ఏనుగులను, రెండు వేల మంది వెనుక ముందు నడుస్తుండగా, తుపాకులతో నిజాంరాజ్యం యొక్క సిపాయిలు పేలుస్తూ నడుస్తుంటే పొగతో ఆ ప్రదేశం నిండిపోయి, సంతులు, సాధువులు, బైరాగుల భజనతో నడుస్తూ పదివేల మందితో ప్రభువు రుమాలు కట్టుకొని పీఠాధిపతులను స్వాగతించడానికి పల్లకీ బయలుదేరింది. ఇక్కడినుండి ప్రభుపల్లకీ అటువైపు నుండి జగద్గురువుల పల్లకీ మధ్య దారిలో కలిశాయి. ఆ సమయంలో ఒకే స్వరంతో జయజయధ్వానాలు చేశారు. ముందుగానే ప్రభువు 'భక్తకార్య కల్పదృమ' అని ఎవరు అనకూడదని జనులకు ఆజ్ఞాపించారు. కారణం ఆయన మన గురువు. ఆయనకు ఈ విధంగా మనం జయకారం చేస్తే వారికి అమర్యాద అవుతుంది. ఇద్దరి పల్లకీలు దగ్గరికి రాగనే ముందుగా స్వామి వారి గర్జన వినిపించింది. ఇక్కడ ప్రభు బృందం ప్రభు ఆజ్ఞాపించిన విషయం మరిచి వెంట ఉన్న రెండు వేల మంది ఒకే సారిగ ''భకక్తార్య కల్ప్రదుమ గురు సార్వభౌమ శ్రీమత్ రాజాధిరాజ యోగి మహారాజ్ త్రిభువన ఆనంద అధ్వైత, అబేద నిరంజన నిర్గుణ నిరాలంబ పరిపూర్ణ

సదోదిత సకలమత స్థాపిత శ్రీ సద్గురు మాణిక ప్రభు మహారాజ్‌కీ జై''. అని ఉచ్ఛస్వరంలో అనగానే అన్ని దిక్కులా ఆనంద పారవశ్యమైంది. ప్రభు వచ్చిన విషయం స్వామికి తెలిసి అంత మందిలో బ్రాహ్మణులతో రుమాలు కట్టుకొని సాదా టోపీ వేసుకొని శరీరంపై కేవలం జుబ్బాతో చేతులు కట్టుకొని ఉన్న ప్రభు స్వరూపాన్ని చూసి పల్లకి నుండి దిగి ప్రభు వద్దకు వచ్చారు. ప్రభు నమస్కారం చేయగానే, స్వామి గట్టిగా ప్రభువుని ఆలింగనం చేసుకొగానే స్వామివారి నేత్రాలనుండి ఆనంద అశ్రువులు రాసాగాయి. ఈ విధంగా ఇద్దరు మహా పురుషుల కలయిక అధ్భుతంగా జరిగింది. ఈ ఆనందక్షణాలను వర్ణించడం ఎవరి తరము కాలేదు.

ఆ క్షణంలో మరొకసారి ప్రభు బృందం భక్తకార్య ఉచ్ఛరించగానే ఆ ఆనంద క్షణంలో అందరు మైమరిచిపోయారు. కాని స్వామి మహారాజ్ యొక్క పూర్వా శ్రమసోదరుడు అహోబల శాస్త్రి పెద్ద విద్వాంసులు, స్వాభిమానియై ఉండిరి. ఆయనకు ఈ ''భక్తకార్య '' వినగానే అమర్యాదగా అనిపించి కోపం వచ్చింది. కాని తమాయించుకున్నారు. తరువాత ఇద్దరూ పల్లకీలో కూర్చుందామని స్వామి ప్రభువుకు నివేదించుకున్నారు. కానీ, ప్రభువు తిరస్కరించి స్వామి యొక్క పల్లకీ మోయడానికి భుజాన్ని అందించారు. కానీ, ఏదైనా వాహనంలో కూర్చోవాలని స్వామీ కోరగా ప్రభు మేనాలో కూర్చున్నారు. మరియు తాత్యాసాహెబ్ కుమారులు ఏనుగు సవారిపై, తాత్యామహారాజ్ నడుస్తూ మాణిక్‌నగర్‌లోని దత్త గాది వద్దకు వచ్చారు. ప్రభు స్వయంగా స్వామిని తీసుకొని వచ్చి వారికి ఏర్పాటు చేసిన రత్నఖచిత సింహాసనంపై కూర్చోపెట్టారు. స్వామి యొక్క పూజ, పాదపూజ తాత్యామహారాజ్ చేసిన తరువాత, వస్త్రభూషణాలను సమర్పించుకున్నారు. ధూప దీప ఆరతితో పూజ ముగిసిన తరువాత అందరికి ప్రసాదం పంచబడి జయజయ కారాలు చేయబడ్డాయి. తరువాత స్వామివారి భోజన కార్యక్రమం మొదలయింది. భోజనంలోకి పంచభక్ష్య పరమాన్నాలు చేయబడ్డాయి. అందరికి ప్రభు దక్షిణ పంచారు. ప్రభు చేసిన ఆదర సత్కారాలు చూసి జగద్గురువులు సంతోషించారు. తరువాత ప్రభువు వద్ద నుండి వెళ్ళడానికి స్వామి అనుమతి కోరుతూ ముత్యాలహారం, ఒక ఏనుగు, నాలుగు ఉత్తమ జాతి అశ్వాలను, ఒక పల్లకీ, శాలువ, దుప్పటి ఇలా అనేక వస్తువులు ప్రసాదంగా,

ప్రభు ఎంత వద్దని వారించినా కానుకగా ఇచ్చారు. అలాగే వారి కుమారులకు వస్త్రాలను ఇచ్చారు. చివరికి బయలు దేరే సమయంలో మీరు 'సకలమత స్థాపిత భక్తకార్య' అనడం మానకండి. నాతో వచ్చిన మా సోదరుడు, ఇతర పండితులు ఈ అధికారం ఎవరిచ్చారో అడగమని అన్నారు. మీ గాదికి అమర్యాద అవుతుందని అన్నారు. దానికి నేను సమాధానం ఇస్తాను. కానీ, మీకు మాత్రం నేను మనస్ఫూర్తిగా ఆజ్ఞాపిస్తున్నాను. 'భక్త కార్య' యోగ్యమైనది. సకలమత కళ్యాణం చేయండి అని ఆజ్ఞాపించి జగద్గురువులు బయలుదేరి ముందు సంచారానికి వెళ్ళిపోయారు.

## 43. బ్రహ్మచైతన్య గోంద్‌వలేకర్

ప్రభు కృపాకటాక్షం కోసం అనేక మంది సంతులు, మహంతులు, యోగులు, ఫకీరులు ఎప్పుడూ మాణిక్‌నగర్‌కు వస్తూ ఉండేవారు. సమర్థ రామదాసు సంప్రదాయంలోని భక్తి యుతులైన బ్రహ్మచైతన్య గోంద్‌వలేకర్ చిన్న వయస్సులో సద్గురువులను వెతుక్కుంటూ మాణిక్ నగర్‌కి వచ్చారు. శ్రీ బేల్‌సరే వ్రాసిన బ్రహ్మచైతన్య గోందవలేకర్ - చరిత్ర మరియు వాంఙ్మయంలో ఇలా వ్రాయబడింది. 'అక్కల్ కోట్ నుండి శ్రీమహారాజ్ బయలు దేరి మాణిక్ ప్రభు దర్శనంకోసం హుమనాబాద్‌కి వెళ్ళారు. శ్రీమహారాజ్ ఏ రోజైతే మాణిక్ నగర్‌కి వస్తున్నారో ఆ రోజు మాణిక్ ప్రభు ఊరిబయట ఎదురుచూస్తూ కూర్చున్నారు. భోజన సమయం కావడంవల్ల శిష్యబృందం ప్రభువును భోజనానికి వెళ్దామని అడిగారు. ''అరె భోజనం ఏమిటి? రోజూ భోజనం చేస్తాము కానీ, ఈ రోజు నా సోదరుడు వస్తారు, దాని ముందు మీ భోజనం ఒక లెక్కా అన్నారు. శ్రీ మహారాజ్ వచ్చిన తరువాత ఇంటికి తీసుకువెళ్ళి కొన్ని రోజులు ఉంచుకొని పని జరుగుతుందని చెప్పి తిరిగి పంపించారు'.

## 44. 1857 స్వాతంత్ర్య సంగ్రామం

1857 వ సంవత్సరంలో ఉత్తర భారతంలో బ్రిటీష్ వారికి విరుద్ధంగా నానాసాహెబ్ పేష్వా, ఝాన్సిరాణి లక్ష్మిబాయి, తాంత్యా తోపే మొదలైన వారు పోరాడారు. నిజాములకు, బ్రిటీష్ వారికి మైత్రి ఉండడం వల్ల దక్షిణ భారతదేశంలో ఈ విషయంపై ఏ ప్రభావం చూపలేదు. కాని ప్రభు యొక్క కీర్తి విని నానాసాహెబ్ పేష్వా తన పని నిర్విఘ్నంగా జరగడానికి ప్రభు ఆశీర్వాదం, సహాయం లభించాలని రంగారావు అనే మనిషితో రహస్యంగా పత్రాన్ని ప్రభువద్దకు పంపించారు. ఆయన ప్రభువద్దకు వచ్చి ఆ పత్రాన్ని ఇచ్చి మాటల రూపంలో కూడా నివేదించారు. ప్రభు ప్రేమతో రంగారావుని ఎనిమిది రోజులు మాణిక్ నగర్‌లో ఉంచుకొని చివరికి ప్రసాదంతో పాటు సంగ్రామం కోసం చాలా ధనాన్ని ఇచ్చి "నానాకు నా తరఫు నుండి చెప్పండి. కార్యం సంసిద్ధం కావడానికి ఇంకా చాలా సమయం ఉన్నా కూడా మీ ప్రయత్నాన్ని ఆపవద్దు. విజయవంతం చేయడానికి దత్త ప్రభు సమర్థులై ఉన్నారు" అని చెప్పారు.

॥ శ్రీ దత్తాత్రేయార్పణమస్తు ॥ ॥ శ్రీ గురు మాణికార్పణమస్తు ॥

# ఐదవరోజు పారాయణము

## ప్రభు చమత్కార కథలు

ప్రభు చరిత్ర చమత్కారాలతో నిండి ఉంది. ప్రభు చమత్కార కథలు ఇప్పటి వరకు జనుల స్మృతిలో ఉండి వృద్ధులు ఆ విషయాలను శ్రద్ధతో చెపుతూ ఉంటారు. వాటన్నింటిని ఇక్కడ వ్రాయడం సాధ్యం కాదు. కొన్ని ముఖ్యమైన సంఘటనలు అనుభవంలోకి వచ్చినవి, మరియు విన్నవి ఇక్కడ రాయడం జరిగింది. ఇంకా వృద్ధులు చెప్పిన విషయాలు వివరంగా ఉండి అముద్రితంగా ఉండిపోయాయి. ఒక్కో కథ ప్రభు యొక్క సర్వసామర్థ్యత్వాన్ని నిరూపిస్తాయి. ప్రభు వంటి మహనీయుల చమత్కారాలు సహజంగా ఉంటాయి. సామాన్య జనులను చమత్కారంతో చకితులను చేయాలనే కారణంతో వారు కావాలని ఎప్పుడూ చమత్కారాలను ప్రదర్శించరు. వారి యోగ సామర్థ్యంతో అద్భుతాలు జరుగుతాయి. అంటే అవి ప్రభువు సహజమైన లీలలు అని శాస్త్రాలు తెలిసిన వారు కూడా ఒప్పుకుంటారు.

### 45. పడవను రక్షించడం

ఒకసారి ప్రభువు దర్బారులో గాదిపై కూర్చున్నప్పుడు అకస్మాత్తుగా రెండు చేతులు పైకి ఎత్తి కూర్చున్నారు. ఆ సమయంలో ఆయన శరీరంపై

జుబ్బా మాత్రమే ఉంది. ఏదో అజ్ఞాత వస్తువును చేతితో ఆధారం ఇవ్వడానికి అన్నట్లుగా కనిపించింది. ప్రభు ఇలా ఎందుకు చేస్తున్నారో అడిగే ధైర్యం ఎవ్వరికీ కలుగలేదు. అక్కడున్న వారందరూ ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయారు. కొంత సమయం తరువాత ప్రభువు తన చేతులను క్రిందికి దించారు. అప్పుడు ప్రభు చేతిలో నుండి నీళ్ళు రాసాగాయి. శరీరంపై ఉన్న జుబ్బా పూర్తిగా తడిసిపోయింది. జనులకు ఇలా ఎందుకు జరిగిందో, ప్రభు ఇంత చెమటతో ఎందుకు తడిసిపోయారో ఎవరికీ అర్థం కాలేదు. ప్రభు శరీరంపై నుండి జుబ్బా తీసివేశారు. శిష్యులలో ఒకరు దానిని పిండగానే చాలా ఉప్పు నీరు వచ్చింది. కొద్ది మంది ఆ నీటిని రుచి చూశారు. వారు ప్రభువుతో మహారాజా నీరు సముద్రం నీటిలాగా ఉప్పగా ఉన్నాయన్నారు. సర్ కిషన్‌సింగ్ ప్రసాద్ బహదుర్ తను వ్రాసిన పుస్తకంలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. అలాషా నాచావరమ్ అనే ఒక ముసల్మాను సత్పురుషులు రాజా బహాదుర్ కి ఇలా చెప్పారు. 'నేను చూశాను, ప్రభు చేతులు పైకి ఎత్తారు. అంతే కాదు జుబ్బా పిండగానే నీరు ఉప్పగా సముద్రం నీటిలాగే అనిపించింది' అని చెప్పడం వల్ల దానికి అధిక మహత్యం ఉంది. తరువాత ఆయన పెద్ద సత్పురుషుడయ్యారు. ప్రభు యొక్క యోగసామర్థ్యం ఎంత విచిత్రమైనదో చూపడానికే పై విషయం అలీషా అనే ముసల్మాను, రాజా బహాదుర్ తో చెప్పింది పుస్తకంలో వ్రాసి ఉంచారు.

కానీ, ప్రభువుకు ఏం జరిగిందో కారణం ఎవరికీ తెలియలేదు. ప్రతిసారిలాగే ఎవరూ అడిగే ధైర్యం చేయలేదు. కొన్ని నెలల తరువాత ముంబయికి చెందిన ఒక పెద్ద వ్యాపారి ప్రభు దర్బార్‌కు వచ్చారు. పూర్వం చేసుకున్న మొక్కు తీర్చడానికి అతను తీసుకువచ్చిన డబ్బును ప్రభువు ముందు గుమ్మరించారు. అప్పుడు పైన జరిగిన సంఘటన గుర్తుకు వచ్చి అందరూ ఆశ్చర్యపోయారు. లక్షలలో వ్యాపారం చేసే ఒక వ్యాపారి తన పడవలో లక్షల రూపాయల సరుకు నింపుకొని పోరుబందరు నుండి ముంబయి వస్తుండగా అకస్మాతుగా గాలివాన మొదలై, పడవ మునిగిపోయే స్థితికి వచ్చింది. ఆ సంకట స్థితిలో తనకు ప్రమాదంతో పాటు నష్టం జరుగుతుందని భయపడి ఏం చేయాలో వ్యాపారికి తోచలేదు. పడవ మునిగిపోతే ప్రాణం పోయినట్లే. అప్పుడు దేవుణ్ణి ప్రార్థించడం మొదలుపెట్టారు. అందరు దేవుళ్లను ప్రార్థించారు కానీ, ఎవరూ రక్షించలేకపోయారు. ఇంతలో ఒక గృహస్థు, హుమనాబాద్ మాణిక్

ప్రభువుకు మొక్కుకోండి. ప్రస్తుతం నడుస్తూ మాట్లాడే ప్రత్యక్షదైవం, భక్త కార్య కల్పద్రుమ బిరుదును కలిగినవారు. వారు మాత్రమే ఈ సంకట స్థితి నుండి కాపాడగలరన్నారు. అది విని విశ్వాసంతో ప్రభువును తలుచుకొని మొక్కుకున్నారు. అలా తలవగానే ఇక్కడ ప్రభువుకు ఎవరో అర్థిస్తున్నట్లుగా అనిపించింది. అంతఃకరణ నుండి వచ్చిన తన భక్తుని పిలుపుకు ప్రభువు మనసు ద్రవించి కూర్చున్న దగ్గరే చేతులు పైకెత్తి పడవను మునగకుండా కాపాడారు.

ప్రభువు ముందు రూపాయలు కట్టలుగా వేసి పూజ చేయడానికి ముందు, జరిగింది వివరించి, ప్రేమతో పూజ, ఆరతి చేశారు. మీరు మొక్కుకున్న పూర్తి ధనం ఉందా? అని ప్రభువు అడిగారు. వ్యాపారి గాభరా పడిపోయారు. తక్కువ ఉన్నట్లు తెలుసుకొని ధనాన్ని భర్తీ చేసి సంతృప్తిగా ప్రభు పూజ చేశారు. లెక్క విషయంలో ప్రభువుకు ఎలా తెలిసిందో అని అందరికి ఆశ్చర్యం కలిగింది.

రామచంద్రబువా సోలాపూర్‌కర్ వ్రాసిన చరిత్రలో పడవ మునిగిపోతుంటే అతను గాభరా పడిపోయి పండరిపుర విఠోబా, తులజాపూర్ భవానిని తలచుకుంటే ఒక ముసల్మాను వ్యక్తి ప్రభు పేరును సూచించారు. విఠోబా, అంబాబాయి మొదలైన రాతి దేవుళ్లను ప్రార్థించే కంటే నడిచే, మాట్లాడే ప్రత్యక్షదైవాన్ని ప్రార్థిస్తే మంచిది అని ఆ వ్యక్తి సూచించారు. అప్పుడు నడుస్తూ మాట్లాడే దేవుడు ఎవరు? అని అడగగానే, ఆయన ప్రభువు పేరు సూచించారు. దీని వల్ల ఆ సమయంలో ముస్లిం సమాజంలో కూడా ప్రభు సామర్థ్యంపై దృఢ నమ్మకం ఉండేదని తెలుస్తుంది.

## 46. దమ్మిడి చక్కర

ప్రభువు భక్తుల కోరికలను తీర్చి, భక్తులు మొక్కుకున్న మొక్కులు తీర్చడం కోసం ఎదురు చూస్తారని అందరికీ తెలిసింది. ఆ కాలంలో కొందరు ప్రభువు వద్దకు వెళ్లే భక్తులను అపహాస్యం చేసేవారు. అలా హుమనాబాదులో ఒక గృహస్థు ఉండేవారు. ఆయన స్వయంగాఎప్పుడూ ప్రభు వద్దకు రాలేదు.

కాని ఎవరైనా ఇతరులు ప్రభు వద్దకు వెళ్తుంటే అపహాస్యం చేసేవారు. ఒక సారి ఆ గృహస్థు చెప్పులు పోయాయి. అవి కొత్తవి కావడం వల్ల ఆయనకు బాధ కలిగింది. అప్పుడు ఆయనకు, జనం ఆపద సమయంలో ప్రభువును స్మరిస్తూ మొక్కుకుంటారని గుర్తుకు వచ్చింది. చెప్పులు నాకు ఇప్పటికిప్పుడే దొరికితే నేను ఒక దమ్మిడీ చక్కెర సమర్పిస్తాను అని మొక్కుకున్నాడు. అనుకోకుండా అదే రోజు చెప్పులు దొరికాయి. తాను ప్రభువుకి ఒక దమ్మిడి చక్కెర మొక్కుకున్నందుకు అతనికి సిగ్గుగా అనిపించి, నాలుగు అణాలకు చక్కెర తీసుకొని ప్రభువు దర్శనానికి బయలుదేరాడు.

ఎప్పటిలాగే ప్రభు దర్బార్ లో రద్ది ఉండెను. దాంట్లోంచి దారి చేసుకొని ప్రభు ముందుకు వెళ్లి తనదగ్గర ఉన్న చక్కెర పొట్లం ప్రభు ముందు పెట్టి నమస్కారం చేయగానే, ప్రభు తన శిష్యులలో ఒకరిని తక్కెడ తీసుకురమ్మన్నారు. వారు తక్కెడ తీసుకొని రాగానే ప్రభు గృహస్థుతో మీరు తెచ్చిన చక్కెరలో ఒక దమ్మిడి చక్కెర మాత్రమే నాది. అంత మాత్రమే తీసి నా పంచలో వేయండి. మిగతాది నాకెందుకు? అనగానే అతని శరీరం చల్లబడి, అవాక్కయ్యాడు. నమస్కారం చేసి ప్రభువుని క్షమించమని అడిగాడు.

అప్పుడు ప్రభు అన్నారు. అరే బాబా, దేవుడిని పరీక్షించొద్దు. దమ్మిడీ చక్కెర కోసం ప్రభువుకు ఎంత కష్టపడాల్సి వచ్చిందో ఆలోచించు. గృహస్థునికి ప్రభువు ఆంతర్యం ప్రత్యక్షంగా కనిపిస్తుండగా ఆయన ప్రభు ముందు సాష్టాంగ దండప్రమాణం చేసి ఇక ఎప్పుడూ ఇలాంటి అపరాధం చేయను, నన్ను క్షమించండి అని విన్నవించుకున్నాడు. ప్రభువుకు దయ కలిగి క్షమించారు. తరువాత ఆ గృహస్థు ప్రభువుకు ప్రియమైన భక్తుడు అయ్యాడు.

## 47. బాబా కాట్‌కర్

ఇంతకు ముందు చెప్పినట్లుగానే మొక్కుకు సంబంధించిన ఘటన టోల్ అనే ఆయన తన చరిత్రలో ఇలా వ్రాశారు. లాతూర్‌కు చెందిన బాబా కాట్‌కర్ అనే పేరుగల గృహస్థు ప్రతి సంవత్సరం కట్టెలు తీసుకొని వెంకటగిరి వెళ్ళేవారు.

ఒక సారి ఆయన ప్రభు నగరికి దర్శనానికి వచ్చినప్పుడు ప్రభు వెంకటేశ్వరుని రూపంలో దర్శనమిచ్చారు. బాబా సంతోషంతో ప్రభువుతో ఇలా అన్నారు. మహారాజ్ ఇకముందు నేను వెంకటగిరి వెళ్ళే అవసరం లేదనిపిస్తుంది. కారణం మీ దర్శనంతో నా కోర్కెలన్నీ తీరాయి. ప్రభు ఆయనను సముదాయించి మీరు మీ తండ్రిలాగా నడుచుకోండి. అక్కడికి వెళ్తూ ఇక్కడికి క్రమం తప్పకుండా రండి. ప్రభు ఆజ్ఞానుసారం ప్రతి సంవత్సరం మాణిక్ నగర్‌కు వచ్చేవారు. ఒకసారి మాణిక్ నగర్‌కు వస్తుండగా దారిలో నీరు త్రాగడానికి ఒక బావిలో దిగారు. నీరు త్రాగి తొందరగా పైకి వస్తుండగా తన నశ్యండబ్బాను బావి మెట్లపై పెట్టి మర్చిపోయారు. మాణిక్ నగర్ వచ్చిన తరువాత చూస్తే కనిపించలేదు. వెదికారు కానీ దొరకలేదు. చివరికి ఆయన ప్రభువుకు మొక్కుకున్నారు. డబ్బా దొరికితే శాహి పైసా పంచదార ఇస్తానని మొక్కుకున్నారు. తరువాత ప్రభు వద్దకు దర్శనానికి వెళ్లగానే ప్రభు యొక్క సన్నిధిలో గాదిపై తన నశ్యం డబ్బా కనిపించింది. డబ్బా కనిపించగానే శాహి పైసా పంచదార గుర్తుకు వచ్చి సిగ్గుగా అనిపించసాగింది. ఆయన అంతరంగాన్ని ప్రభు గుర్తించి గిరి పైకి ఎక్కేటప్పుడు కాళ్లు నొప్పకూడదని జనం ఏమని మొక్కుకుంటారు అని అడిగారు. అప్పుడు బాబా చేతులు జోడించి కాళ్లు నొప్పి కావద్దని గిరినాథునికి 1 పైసా మొక్కుకుంటాం అన్నారు. మరి మాకైతే శాహి మాత్రమే. శాహి పైసా పంచదార ఇచ్చి మీ డబ్బా మీరు తీసుకోండి అన్నారు.

## 48. పాము కాటు

ప్రభు దర్బార్ లో సహాయం కోసం వచ్చేవారు ఎల్లప్పుడూ ఉండేవారు. వారిలో డబ్బు అడిగేవారే చాలా మంది ఉండేవారు. అడగటంలో జాతిబేధం ఉండేదికాదు. హిందు, ముస్లిం, సిఖ్, లింగాయత్ ఇలా అన్ని మతాలవారు ప్రతిరోజూ దర్శనానికి వచ్చేవారు.

అలాగే ఒకరోజు ఒక బీద బ్రాహ్మణుడు తన తమ్ముడిని వెంటబెట్టుకొని ప్రభు దర్బార్‌కి వచ్చాడు. తమ్ముని వివాహం కోసం 400 రూపాయలు

అవసరమై ప్రభువును అడగడానికి వచ్చారు. ప్రభువు వారిని ఉండమని చెప్పారు. రోజూ భండారుఖానాలో భోజనం చేస్తూ చాలా రోజులు ఉండిపోయారు. తనలాగే వేల మంది వస్తున్నారు తమ కోరికలు తీర్చుకొని వెళ్తున్నారు. తనను ప్రభువు ఎందుకు కరుణించట్లేదో ఆయనకు అర్థం కాలేదు. కాని ప్రభు వద్ద చేసుకున్న విన్నపం వ్యర్థం కాదనే నమ్మకంతో ఉన్నాడు. కానీ, ఎలాగైనా తను వచ్చిన పని ముగించుకోవాలని అనుకుంటుండగా ఒక రోజు పాముతోకపై పొరపాటున కాలు పెట్టడం వల్ల అతని తమ్మునికి పాము కరిచింది. అది నాగుపాము కావడం వల్ల ఎన్ని ఉపచారాలు చేసినా అతనికి మృత్యువు తప్పలేదు. అందరూ అయ్యో పాపం అనసాగారు. అన్న ఏడవసాగాడు. ఎవరి వివాహం కోసమైతే ప్రభు దర్బార్‌లో ఇన్ని రోజులు పడి ఉన్నాడో అతను చనిపోవడం వల్ల దుఃఖం ఆపుకోలేక పోయాడు. చివరికి సాయంత్రం ఈ విషయం ప్రభువుకు తెలియజేశారు. ప్రభు దయతో, వివాహం కోసం ఇక్కడ ఉన్నారు. వివాహం కాకుండానే మరణించాడా అంటూ జరిగిన విషయం విని శిష్యులతో బ్రాహ్మణుని కరిచిన పామును పిలుచుకొని రమ్మని ఆజ్ఞాపించారు. ప్రభు యొక్క ఈ చమత్కారమైన ఆజ్ఞను విని జనులందరూ ఆశ్చర్యంతో ఒకరి ముఖాలు ఒకరు చూసుకోసాగారు. చివరికి కాగడా పట్టుకొనే దత్తునితో పామును పిలుచుకొని రమ్మని చెప్పారు. అతను భయపడుతూనే చేతిలో మండుతున్న కాగడా తీసుకొని సంగమము వద్దకు వెళ్ళి 'ఓ బ్రహ్మణుని కరిచిన పామా! నిన్ను ప్రభు రమ్మన్నారు, తొందరగా రా అని' గట్టిగా పిలవసాగాడు. అతని స్వరం వినగానే ఆ కాలనాగు అతనివైపు రాసాగింది. అది చూసి దత్తు భయంతో ప్రభు వద్దకు ప్రాణభయంతో పరిగెత్తుకు వచ్చాడు. ఆ సర్పం అతని వెనకాలే వచ్చింది. అతని వెనకాల పాము రావడం చూసి జనమంతా గాభరా పడిపోయారు. అది చూసి ప్రభు నవ్వుతూ ఇలా అన్నారు. 'సర్వం ఖల్విదంబ్రహ్మ' అనే విషయం తెలిసిన పండితులు కూడా భయపడటంలో అర్థం లేదు. అలా ఎందుకన్నారంటే ఆ సమయంలో అక్కడ పండితుల బృందం కూర్చుని వేదాంత చర్చలో ఉండిరి. అంతలోనే ఈ నాగుపాము విషయం వచ్చింది. ఆ సర్పం ప్రభు ముందుకు రాగానే ప్రభు తనపై ఉన్న వస్త్రాన్ని ఆ పాముపై వేయగానే ఆ సర్పం పడగ విప్పి ఉండిపోయింది. ప్రభు ఆ నాగుతో ఇలా అన్నారు. మా దగ్గరికి వేల మంది వస్తారు వారిని రక్షించడం వదిలి వారికి ముప్పు కలిగించడం మంచిదికాదు. మీరు ఇకముందు ఎప్పుడూ

ఇలా చేయవద్దు అన్నారు. ఆ సర్పం చూస్తుండగానే ప్రభు తన ముందు ఉన్న కర్జూరపండ్లలో నుండి ఒకటి తీసుకోని తన నోట్లో వేసుకోని తిరిగి నోట్లో నుండి తీసి ఆ బ్రాహ్మణునికి ఇచ్చి దానిని అరగదీసి రసాన్ని తమ్ముడి నోట్లో పోయండి, అతను లేస్తాడు అని చెప్పారు.

ఇంకోసారి ఇలాంటి పనులు చేయవద్దని చెప్పి ఆ సర్పాన్ని అక్కడి నుండి వెళ్లమన్నారు. ఇక్కడ అరగదీసిన ఆ కర్జూర పండురసం చనిపోయిన తమ్ముని నోట్లో పోయగానే నిద్రలో నుండి లేచినట్లుగా ఆ బ్రాహ్మణ యువకుడు లేచి కూర్చున్నాడు. ఇది చూసి అక్కడ కూర్చున్న వారందరూ ఆశ్చర్య చకితులై ప్రభు అద్భుత సామర్థ్యాన్ని ప్రశంసించసాగారు.

వారిని మృత్యువు నుండి బయటకు తెచ్చిన తరువాత వారు అడిగినంత ధనం ఇచ్చి సంతోషపరిచారు. తన తమ్ముడికి మృత్యు గండం ఉందని ముందే తెలిసి ప్రభువు తన వద్దనే ఉండమన్నారని అన్నకు తరవాత అర్థమయింది. ఈ ఆపద నుండి సురక్షితంగా బయట పడ్డామని ప్రభువుకు ఆ బ్రాహ్మణుడు ఎన్ని ధన్యవాదాలు తెలియజేశారో పాఠకులే ఊహించాలి.

## 49. టెహళదాస్ తల్లి

మారుతి గుడి వద్ద టెహళదాస్ అనే పేరుగల సాధువు తన తల్లితో ఒక గుడిసెలో ఉండేవారు. ఆమె వయస్సు 125 సంవత్సరాలు. ప్రభువు రోజులో ఏదో ఒక సమయంలో గంట కాని రెండు గంటలు కాని ఆమె వద్ద మాట్లాడుతూ కూర్చునేవారు. తనతో మాట్లాడుతూ కూర్చుంటే ఇతరులెవ్వరిని అక్కడ కూర్చోనిచ్చేవారు కాదు. గుడిసె బయట కావలా కాసేవారు ఉండేవారు. టెహళదాస్ ఆ గుడిసె ముందు చెట్లు పెంచి రమణీయంగా తయారుచేశారు. అది చూసి ఇతర సాధువులు గుడిసెలు వేసుకొని చుట్టుపక్కల ఉండసాగారు. రోజూ భండారుఖానా నుండి ఆ ముసలామెకు మూడు రొట్టెలు తెచ్చి ఇచ్చేవారు. ఒక రోజు ప్రభు ఆ ముసలామె దగ్గర కూర్చున్నప్పుడు ఆ గుడిసె అకస్మాత్తుగా తగలబడింది. కొద్ది సేపట్లో ఇతర గుడిసెలకు మంటలు వ్యాపించి ఆ ప్రదేశమంతా

పొగతో నిండిపోయింది. గుడిసెకు నిప్పంటుకుందని ఆ గుడిసెలో ముసలామెతో పాటుగా ప్రభువు కూడా ఉన్నారని తెలిసి జనం హాహాకారాలు చేయసాగారు. బిందెలతో, హండాలతో, తాపెలాలతో బావిలో నుండి నీరు తెస్తూ మంటలపై పోయసాగారు. కొందరు ప్రభువు కోసం గుండె బాదుకొని ఏడ్వసాగారు. ఆ మంటల్లోనే సిపాయి, పరదేశి జనం ప్రభువును వెదకసాగారు. తాత్యాసాహెబ్ వారి కుటుంబంతో పాటు ఆ ప్రదేశమంతా రోదనలతో నిండిపోయింది. ఆ ముసలామె కూడా ఎక్కడా కనిపించడం లేదు. ప్రభు ఆ ముసలామెతో పాటు కాలిపోయారని ఊహించి ఏడ్వసాగారు. అక్కడ వాతావరణం భయంకరంగా తయారయింది. ఒక్క వెంకమ్మ మాత్రం గాది వద్ద ప్రశాంతంగా కూర్చుండిపోయింది. ఆమె మనస్సులో ఏ రకమైన బాధ కనిపించలేదు. అంతలో ప్రభు ఆ ముసలామెను వీపుపై ఎక్కించుకొని గాది వద్దకు వచ్చారు. వారు ఎక్కడినుండి వచ్చారో ఎవరికీ అర్థం కాలేదు. ప్రభు జీవించే ఉన్నారని చూసిన వారి ఆనందం వర్ణించతరం కాదు. కానీ, ప్రభు ఇంత అగ్నిలో ఎవరికీ కనిపించకుండా బయటకు ఎలా వచ్చారో ఎవరికీ తెలియలేదు. తరువాత కొన్ని రోజులకు ప్రభు ఆజ్ఞతో ఆమె ప్రభు సన్నిధిలో మరణించింది.

## 50. అగ్నినారాయణుడు

ఇంతకు పూర్వ అధ్యాయంలో యజ్ఞానికి సంబంధించిన వివరణ ఇవ్వడం జరిగింది. ఆ యజ్ఞానికని తీసుకువచ్చిన సామాగ్రి ఆ యజ్ఞంలోనే ఉపయోగించాలి. అందులో ఏమీ మిగల్చరాదు అని ప్రభు ఆజ్ఞాపించినా కూడా వంటసామాగ్రి గది చూసుకునే వారు తమ అలవాటు ప్రకారం నెయ్యి బిందెలు, కొంత సామాగ్రి తీసి ఉంచారు. ఈ విషయం తాత్యాసాహెబ్ గారికి తెలుసు. ఒక రోజు తాత్యాసాహెబ్ ప్రభు సన్నిధిలో కూర్చున్నప్పుడు అకస్మాత్తుగా గోసాయి-బైరాగుల సమూహం ప్రభు దర్బార్‌లో ప్రవేశించారు. వారికి వండుకోవడానికి సామాగ్రి అందజేయవలసిందిగా ప్రభు ఆజ్ఞాపించారు.

వంటసామాన్ల గదిలో నెయ్యి ఉందా? అని ప్రభు ప్రశ్నించగానే, లేదు అని తాత్యాసాహెబ్ గారు అన్నారు. వంటసామాగ్రి గదిలో ఉండే మనిషి కూడా

లేదు అనగానే హుమనాబాద్ నుండి తీసుకొని రావలసిందిగా హుకుం జారీ చేశారు. ఇది జరిగి అర్ధ గంట, గంట తరువాత అదే గదిలో నిప్పంటుకుందనే సమాచారం అందింది. ఇది విని తాత్యాసాహెబ్‌గారు లేచి తొందర తొందరగా వెళ్లబోయారు. కానీ, ప్రభు ఆయనను అక్కడే కూర్చోబెట్టుకున్నారు. తాత్యా వంట సామాగ్రి గదిలో ఏ సామాను మిగలలేదు అన్నారు కదా, నిప్పంటుకుంటే ఏమవుతుంది? దానిని ఆర్పడానికి ఎందుకంత తొందర? యజ్ఞంలో అగ్నినారాయణుడు తృప్తి చెందలేదనిపిస్తుంది. అందుకని నెయ్యి మంచిగా వేసి ఆయనను తృప్తి పరచాలి. అందువల్ల దాంతో పాటు హుమనాబాద్ నుండి తెచ్చిన నెయ్యి కూడా వేసి అగ్ని నారాయణున్ని శాంత పరిచండి. గదిలో ఉంచిన మొత్తం నెయ్యి అగ్ని నారాయణుడు మొదలే కొంత శాంతపరచుకున్నాడు. గది చూసేవాడు కొంచెం సామగ్రి ముందు తీసిపెట్టుకున్నాడు. అది మంచి ఉద్దేశమే. ఆ సామాగ్రి ఏదైనా మంచి కార్యానికి ఉపయెగించాలని తాత్యాసాహెబ్ అనుమతితో తీసి ఉంచారు. ప్రభు దృష్టి లౌకికంగా ఉండేది కాదు. రేపటి కోసం తీసి ఉంచాలని ఎప్పుడూ అనుకునేవారు కాదు. తీసిపెట్టుకొని పని చేసే అలవాటు ప్రభువుకు ఉండేది కాదు. ప్రభు సమాధి అయి ఇప్పటికి 70 సంవత్సరాలు (మరాఠీ చరిత్ర మొదట వ్రాసినప్పుడు) అయినా సంస్థానంలో అదే ప్రకారం నడుస్తూంది.

రేపటి గురించి ఆలోచన ఈ రోజు చేయడంలో అర్థం లేదు. ఈ సత్యం పై సంస్థానం యొక్క మహత్తరమైన పనులు జరుగుతాయి. రేపటి గురించి చింత లేకపోవడం వల్ల ప్రతి సంవత్సరం లక్షల రూపాయలు ప్రోగవుతూ వస్తూంది.

## 51. పంక్తి లాభము

ఒకసారి మహావిద్వాంసులైన శాస్త్రి ప్రభు దర్బార్‌కు వచ్చారు. దర్బార్ మర్యాదానుసారంగా వారికి భోజన, నివాస ఏర్పాట్లు చేయబడి ప్రభు దర్శనం కూడా అయింది. ప్రభువుతో రోజూ కొంతసేపు సంభాషించే యోగం కలిగింది. ప్రభు దర్బార్ నడిచే విధము, నిత్యం వేలమంది దర్శనానికి రావటం, బ్రాహ్మణ

భోజనం జరుగుతూ ఉండటం, ప్రతిరోజు 'నిత్యశ్రీ నిత్య మంగళం' కనిపించగానే శాస్త్రిగారు ఖంగు తిన్నారు. ఎవరి వల్ల అయితే ఇలా జరుగుతుందో ఆ ప్రభువు విషయంలో వారికి ఆదరభావం పెరుగసాగింది. నిత్యం మాట్లాడే అవకాశం ఉండడం వల్ల ఒకరోజు జనం తగ్గిన తరువాత ప్రభు వద్దకు వెళ్ళి శాస్త్రిగారు ఇలా విన్నవించుకున్నారు. 'మహారాజ్ నేను వచ్చినప్పటి నుండి పంక్తిభోజనం నాకు దొరకలేదు. పంక్తి ప్రసాదం తీసుకోవాలని నాకు కోరికగా ఉంది' అని ప్రార్థించారు. అప్పుడు ప్రభువు శాస్త్రిగారూ, మేము ఫకీరులం మాకు పంక్తి అంటూ ఉండదు. మీకు అది నచ్చుతుందో లేదో ఎవరికి తెలుసు? అయినా మాకు ఖచ్చితమైన సమయం అనేది లేదు. అయినా కూడా మీరు కావాలనుకుంటే నేను మిమ్మల్ని పిలుస్తాను అన్నారు. మీరు ఎప్పుడు పిలిస్తే అప్పుడు మీ ముందు హాజరవుతాను అంటూ ఆనందంతో శాస్త్రిగారు వెళ్ళిపోయారు. ఇలా చెప్పిన తరువాత మరుసటిరోజే మిమ్మల్ని పంక్తికి పిలుస్తాను అని ప్రభువు శాస్త్రికి తెలియజేశారు. శాస్త్రిగారు ప్రభు పంక్తి భోజనం కోసం ఆశతో రోజంతా ఎదురుచూస్తూ కూర్చున్నారు. ఇంత పెద్ద దర్బార్ నిత్యం నడుస్తుందంటే ప్రభు యొక్క పంక్తి ఎంత అపూర్వంగా ఉంటుందో అని శాస్త్రిగారికి అనిపించేది. ప్రభు స్వయంపాకం యొక్క ప్రసాదం దొరికితే ధన్యుడనవుతానని అనుకుంటూ ప్రభు పిలుపు కోసం ఎదురుచూస్తూ ఉండిపోయారు. చివరికి రాత్రి పదకొండు గంటల సమయంలో ప్రభు వద్ద నుండి మనుష్యుడు రాగానే శాస్త్రిగారు ప్రభు సన్నిధికి వెళ్ళారు. అక్కడికి వెళ్ళి చూస్తే పంక్తి కనిపించలేదు. పంచపక్వాన్నాల వాసన కూడా రావడం లేదు. ప్రభు ఒక చేతిలో సాదా జొన్న రొట్టె దానిపై వెల్లుల్లి వేసి చేసిన పల్లీల పొడి వేసుకొని కూర్చుని ఉండిరి. ప్రభు నవ్వుతూ శాస్త్రిగారిని స్వాగతించారు. అలాగే తనకు ఇచ్చినట్లుగా జోళి రొట్టెను శాస్త్రిగారికి ఇవ్వవలసిందిగా శిష్యులకు చెప్పారు. అలాగే పల్లీల కారం పొడి రొట్టెపై వేసి ఇవ్వగానే ప్రభు తినడం మొదలుపెట్టి శాస్త్రి బువాను తినవలసినదిగా చెప్పారు. మాట్లాడుతూ ప్రభు ఆనందంగా ఆ రొట్టెను తిని నీళ్ళు త్రాగి తృప్తిగా కూర్చున్నారు. శాస్త్రిగారికి కంట్లో నుండి ముక్కులో నుండి నీళ్ళు రాసాగాయి. అలవాటు లేకపోవడం వల్ల సగం రొట్టెకూడా తినలేక వారు అవస్థ పడ్డారు. ఇది చూసి ప్రభు శాస్త్రీగారూ దత్తునిజోళీ మహాప్రసాదం, మహాద్భాగ్యంతో మాత్రమే దొరుకుతుంది, కానీ మీకు అలవాటు లేని కారణంగా మీకు పడడం లేదు అన్నారు.

ఇది శాస్త్రిగారికి అవమానంగా అనిపించి తన దౌర్బల్యానికి ప్రభువును క్షమించమని వేడుకున్నారు. ప్రభు ఆయనను క్షమించి పంపించేశారు. పై విషయం నుండి ప్రభు భోజనపద్ధతి ఊహించవచ్చు. ప్రభు నిత్యం నియమానుసారంగా భోజనం చేసేవారు కాదు. రెండు మూడు రోజులకొకసారి ఏదైనా కొద్దిగా తినేవారు. విశేషంగా ఆయనకు జోళిలోని రొట్టె, వెల్లుల్లి వేసిన పల్లీల పొడి తప్ప ఏ అవసరం ఉండేది కాదు. జిహ్వాచాపల్యం ఉన్న జనానికి ప్రభు భోజనం సరిపోయేది కాదు. అలాంటి వారి కోసం విడిగా భోజన ఏర్పాటు చేయడం వల్ల ఎవరికీ ఏ విధమైన కష్టం కలిగేది కాదు.

**మాణిక్యా**

ప్రభువుకు చిన్నపిల్లలంటే ఇష్టంగా ఉండేది. తను కూడా వాళ్ళతో ఆడడం, చిన్న పిల్లల్లాగా మాట్లాడటం, నవ్వడం ఇలా అనేక విధాలైన ఆటలు ఆడుతుండేవారు. పిల్లలతో పిల్లలలాగా, యువకులతో యువకుడిగా, వృద్ధులతో వృద్ధుల్లాగా తాత్కాలికంగా ప్రవర్తించేవారు. వారి మాటలలో మృదుత్వం, వినోదం, ప్రేమతత్వం నిండి ఉండేది. అందువల్ల ప్రభువు పిల్లలకు ఇష్టమయ్యేవారు. చిన్న పిల్లలతో సమానంగా ఆడేవారు. పిల్లల గొంతు ఎవరిదైనా బావుంటే వారికి పదాలు (గీతాలు) నేర్పించేవారు. విఠోబా కోమటి అనే పేరుగల వృద్ధ గృహస్థు చాలారోజుల క్రింద మాణిక్ నగర్‌లో ఉండేవారు. వారు మరాఠీ చరిత్రకారులైన గణేశ్ రఘునాథ్ కులకర్ణీగారితో వారికి ప్రభు నోటినుండి పదాలను (గీతాలు) వినేభాగ్యం చాలా సార్లు కలిగిందని ప్రభువు గాయకుడు కాకపోయినా, చిన్నతనంలో ప్రభు వారిని దగ్గర కూర్చోపెట్టుకొని గీతాలు నేర్పించేవారని వారు పాడుతుండగా దివ్యత్వం యొక్క ఆనవాళ్ళు కనిపించేవని తెలిపారు.

ఇలాంటి చిన్నపిల్లల్లో మాణిక్యా అనే పేరుగల పాటిల్ గారి కుమారుడు ప్రభువుతో సన్నిహితంగా ఉండేవాడు. ప్రభువు ఆశీర్వాదంతో కొడుకు జన్మించడం వల్ల ఆయన కొడుకుకు మాణిక్యా అని పేరు పెట్టుకున్నాడు. మాణిక్‌నగర్ నుండి పాటిల్ వాళ్ల ఊరు నాలుగు క్రోసుల దూరంలో ఉండేది.

కానీ, ప్రతి గురువారం కొడుకును తీసుకొని ప్రభు దర్శనానికి వచ్చేవారు. మాణిక్యా ప్రభు ఆకర్షణలో చిక్కుకున్నాడు. ప్రభు అంటే తన సర్వస్వంగా భావించేవాడు. ప్రభు వద్ద నుండి తిరిగి గ్రామానికి వాడిని తీసుకుపోవడం ఆ తండ్రికి చాలా కష్టమయ్యేది.

ఒక రోజు ఆ చిన్న మాణిక్యా తన పొలంలో ఆడుకుంటుండగా ఒక లోతైన బావిలో పడ్డాడు. పడుతుండగా మాణిక్యకు ప్రభు గుర్తుకు వచ్చి ప్రభూ అని పిలిచాడు. భక్తుల మరియు అందులో మాణిక్య వంటి ముగ్ధ బాలునికి కలిగిన ముప్పుకు ప్రభు వెంటనే స్పందించి వెళ్ళి రక్షించారు. ఎలాంటి దెబ్బ తగలలేదు. అంతేకాదు నిత్యం ప్రభు వద్ద ఆడుతున్నట్లుగానే ఆ బావిలో వాడికి అనిపించసాగింది. ఇక్కడ మాణిక్య తల్లితండ్రులకు వాడు బావిలో పడిన విషయం తెలిసి భయంతో పరిగెత్తుకొచ్చారు. తల్లి స్వరం విని మాణిక్య మాట్లడసాగాడు. అందరికీ ఆశ్చర్యం కలిగింది. ఇంత లోతైన బావిలో పడ్డ పిల్లవాడు ఎలా బతికాడు. అప్పుడు తల్లి బాలా! ఇంకా నీవు ఎలా బతికి ఉన్నావు? అని అడిగితే మాణిక్య నేను ప్రభువుతో ఇక్కడ ఆడుకుంటున్నాను అన్నాడు.

ఇది ఎలాంటి వింతో ఎవరికీ అర్థం కాకపోవడం వల్ల ఆశ్చర్యంతో జనం తాడును కిందకి విడిచారు. వారిలోఒకరు బావిలో దిగి వాడిని సురక్షితంగా పైకి తీసుకువచ్చారు. పైకి వచ్చిన తరువాత ప్రభు లోపల ఉన్నారని వారి తలకు కట్టిన పగడాను కూడా (రుమాలు) గుర్తుగా చూపించాడు. ప్రభు తన అద్భుత సామర్థ్యంతో మాణిక్యను రక్షించారని అందరికీ దృఢనమ్మకం కలిగి వాడిని ప్రభువు పాదాలపై వేయడానికి మాణిక్ నగర్‌కి తీసుకొని వచ్చారు. ప్రభు వాడిని దగ్గరికి తీసుకొని వీపుపై చేతితో నిమురుతూ ప్రేమతో నేను బావిలోకి వచ్చానని ఎందుకు చెప్పావు? అన్నారు.

## 52. తుల్జాపూర్ భవాని

ప్రభు దర్శన భాగ్యం కలిగిన తరువాత మనుష్యుని ఆలోచనా పద్ధతిలో, ప్రవర్తనలో తేడా కనపడకుండా ఉండదు. ముస్లింలు తమ సంకుచిత దృష్టికి

సిగ్గుపడి, ప్రభు యొక్క ప్రభావంతో హిందువులపై ద్వేషభావం పోయేది. వైష్ణవులకు ప్రభువులో సాక్షాత్ విష్ణురూపం కనిపించేది. శైవులకు ప్రభువు శంకర రూపంలో దర్శనం ఇచ్చేవారు. ముస్లిం, హిందు, సిక్కు, జైన్, లింగాయత్ ఇలా అన్ని మతాలవారికి ప్రభు తమ ఇష్ట దైవంగా కనిపించేవారు. ప్రభు సన్నిధిలో ప్రేమతో నిండిన వాతావరణంలో జనులందరికి ఒకరే సర్వవ్యాపి అనే భావనతో ప్రభు యొక్క విశాలతత్వంలో అందరూ ఆనందభరితులయ్యేవారు.

హిందూ ధర్మంలో అనేక విధాలైన ఉపాసనా దేవతలు ఉన్నారు. వారి భక్తులు తమ ఇష్టదైవాన్ని ప్రభువులోచూచుకొని ఆ పద్ధతిలో ప్రభువుకే పూజ, అర్చన చేసేవారు. ప్రభువు కూడా ఆ భావంతో వచ్చే భక్తుల పూజను స్వీకరించేవారు. ఒకసారి ఒక దేవీభక్తునికి తులజాపూర్ భవానిని కోరుకున్న కార్యము అవడం వల్ల అతను మొక్కుకున్నట్లు దేవికి సమర్పించే వస్త్రాలు తీసుకొని తుల్జాపూర్ వెళ్లడానికి బయలుదేరాడు. దారిలో అతనికి స్వప్నంలో ఎవరో 'నీవు తుల్జాపూర్‌కు వెళ్లకుండా మాణిక్ నగర్ వెళ్ళి మొక్కు ప్రభు వద్ద తీర్చుకో' అని చెప్పినట్లు అనిపించింది. ఆ స్వప్నంపై తనకు నమ్మకం కుదరక అలాగే ముందుకు వెళ్లసాగాడు. చివరికి దారిలో తుల్జాపూర్‌కు చెందిన పూజారి ఆయనకు కనిపించి తుల్జాపూర్ వెళ్లకుండా నీవు మాణిక్‌నగర్ వెళ్లు అని చెప్పాడు. అందుకని అతను మాణిక్ నగర్ బయలుదేరాడు. ప్రభు దర్శనం అయిన తరువాత తనకు వచ్చిన స్వప్న విషయం ప్రభువుకు చెప్పాడు. దేవి ఆజ్ఞ అయితే నేను పూజ స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాను అని ప్రభువు అన్నారు. ఇది విని సంతోషంగా పూజ ప్రారంభించారు.

ఆ భక్తుడు అత్యంత శ్రద్ధతో దేవిగా భావించి ప్రభువుకు పూజ చేశారు. ప్రభువు కూడా ఆ సమయంలో దేవి యొక్క రూపధారణలో ఉండిరి. భక్తుడు తెచ్చిన పైఠనీ పట్టుచీర ప్రభువుకు కట్టి పూర్తి అలంకారం చేస్తూ కళ్లకు కాటుక పెట్టి నుదిటిపై భండారుతో నింపారు. ఆ సమయంలో ప్రభువు భవానిరూపంలో కనిపించారు. పూజ పూర్తి అయిన తరువాత ఆరతి జరుగుతుండగా అక్కడ ఉన్నవాళ్లకు కూడా ప్రభు సాక్షాత్ భవాని రూపంలో కనిపించసాగారు. ఆ భక్తుడు తన మొక్కు పూర్తి అయినట్లుగా భావించి ప్రభు ముందు సాష్టాంగ

నమస్కారం చేశారు. ఆ పూజను ప్రత్యక్షంగా చూసిన వారికి ప్రభు తేజస్సుతో కళ్ళు జిగేలుమన్నాయి.

## 53. పంజాబి పహిల్వాన్

'గర్వంతో ఉన్న వాళ్ల ఇల్లు ఖాళీగా ఉంటుంది'. ఈ సామెత యొక్క అనుభవం ప్రభు దర్బార్‌లో నిత్యం జరుగుతుండేది. ప్రభు చరిత్రలో ఒక చరిత్రకారుడు స్వయంగా వ్రాసిన దానిని క్రింద వివరిస్తున్నాము.

ఒకసారి ఒక అద్భుతం జరిగింది. అది ఏమిటంటే పంజాబి పహిల్వానులతో కూడిన గుంపు ప్రభు వద్దకు వచ్చారు. వారు ఇతర చాలా రాజ దర్బార్‌లలో తమతో గెలిచేవారు ఎవరూ లేరని వారి వద్ద జయించినట్లుగా పత్రం రాసుకొని వచ్చేవారు. వారిలో ముఖ్యునికి ఒక కాలికి బంగారు కడియం ఇంకొక కాలికి పహిల్వాన్ బిరుదుతో వ్రాసిన వెండి కడియం కట్టబడి ఉన్నాయి. వారు ముందుగా ప్రభువు వద్దకు వచ్చినప్పుడు దాదాసాహెబ్ వారికి నిత్యం పది రూపాయలు ఇస్తూ సౌకర్యం కల్పించారు. ప్రభు దర్శనం చేసుకొని, మాతో ఎవరైనా కుస్తీ చేసి వారితో మేము గెలిచినట్లుగా ప్రమాణ పత్రం రాసి ఇవ్వాలని పట్టు పట్టారు. కానీ, ప్రభు మాది ఫకీరుల దర్బార్. బిక్ష చేస్తూ, గురుభజన చేసే మా వద్ద పహిల్వాన్‌లు ఎక్కడ ఉంటారు? మరియు మా ప్రమాణ పత్రంతో మీకు ఉపయోగం ఏమిటి? ఒక రోజు గురు దర్బార్ యొక్క రొట్టె ప్రసాదంగా తీసుకొని మీ దారిన మీరు వెళ్లండి. సద్గురు కృపతో నాలుగు దిక్కులా మీ పేరు వ్యాపిస్తుంది. ఇలా మొదటిసారి దర్శనానికి వచ్చినప్పుడు వాళ్లకు సముదాయించి చెప్పారు. కానీ, వారు తమ పట్టు విడవలేదు. జయించినట్లుగా ప్రమాణపత్రం దొరికేవరకు ఇక్కడి నుండి కదిలేదిలేదని భీష్మించుకుని కూర్చున్నారు. మేము ఫకీరులము మేము ఇచ్చిన ప్రమాణ పత్రంతో ఏం ఉపయోగం అనగానే, వారు గర్వంతో ఫకీరులైతే మరి రాజాధిరాజు అంటూ జయ జయ కారాలు, బిరుదులు ఎందుకు? వేల మందిని తమవైపు ఎందుకు ఆకర్షించుకుంటున్నారు. రాజులయితే మాకు ప్రమాణ పత్రం ఇవ్వండి. ఫకీరులయితే మా నుండి ఏమీ కాదని స్వదస్తూరితో పత్రం రాసి ఇవ్వండి.

అది లేకుండా మేము ఇక్కడినుండి కదలమని చెప్పారు. ఇది చూసి ప్రభు భక్తులు వారి దురవస్థను చూసి నవ్వుకున్నారు. ప్రభు ముందు మాత్రం నిశబ్దంగా కూర్చున్నారు.

పహిల్వానులు సంగము వద్ద ఉండేవారు. వారికి దాదాసాహెబ్‌గారు రోజూ పది రూపాయలు బోజనం కోసం ఇచ్చేవారు. దాదాపు పది రోజుల తరువాత ఒక రోజు సాయం సమయంలో ప్రభు నడుచుకుంటూ సంగము వద్దకు వెళ్లారు. వారు ప్రభు వద్ద చివరగా మాట్లాడాలనుకుంటుండగా ఇంతలో ఆరుగురు దొమ్మరివాళ్లు ప్రభు ముందుకు వచ్చి నిలబడ్డారు. వారు తమ కసరత్తు విద్యను ప్రభు చూడవలసిందిగా విన్నవించుకున్నారు. అప్పుడు ప్రభు నవ్వుతూ మీ కసరత్తు తరువాత చూస్తాను కానీ ముందు ఈ పహిల్వాన్‌లు ఏమంటారో వినండి. వారితో మీరు కుస్తీ పట్టండి. ఎవరి కౌశల్యం ఎలాంటిదో చూద్దాం.

ప్రభు యొక్క ఈ ఆజ్ఞ వినగానే ఒక దొమ్మరి వాడు చేతులు జోడించి మహారాజా ఇది ఎలా సాధ్యం? కసరత్తు వేరు కుస్తీ విషయం వేరు, మీకంతా తెలుసు. ప్రభు అది వినక, అయితే ఏమిటి రెండూ శరీరపు శక్తి ప్రదర్శనలే. అసలైతే పహిల్వాన్ కంటే మీ కసరత్తు కఠినం. ఎందుకంటే పహిల్వాన్‌లకు శక్తి మాత్రమే ఉంటే చాలు. మీకు శక్తితో పాటు యుక్తి కూడా కావాలి. మీకు శక్తి యుక్తి రెండూ ఉన్నప్పుడు ఇంకా వెనుకడుగు ఎందుకు వేయాలి? గురు సన్నిధిలో ఉన్న భక్త మండలికి కాసేపు వినోదం పంచితే ఏమవుతుంది? ఇది రాజు లేక నవాబు లేక బాద్‌షా దర్బార్ అవునా కాదా కూడా చూద్దాం. సద్గురు సామర్థ్యంతో ఏదైనా అద్భుతం జరుగుతుందేమో చూద్దాం అని అన్నారు.

ఆ దొమ్మరి భక్తుడు ప్రభు గురించి విని ఉన్నాడు. కావున ప్రభు సామర్థ్యం అతనికి తెలుసు. అందుకని ఏ విధమైన సంశయం లేకుండా ప్రభు ఆజ్ఞ స్వీకరించాడు. నేను సిద్ధంగా ఉన్నాను అని ఆ పహిల్వాన్‌కు తెలిసేటట్లు ప్రభు ముందు రెండు చేతులు కట్టుకొని నిలబడ్డాడు. ఆ పహిల్వాన్ ముందే గర్వంతో ఉన్నాడు. వారికి తన బల సామర్థ్యం తెలియదని అనుకుని ఎదుటివానిని తక్కువ చేసి చూపించాలని ఆ దొమ్మరితో ఇలా అన్నాడు. పులి నక్కతో తలపడడానికి

ఎంత శక్తి కావాలి ? నీవు నీ విద్యను ప్రదర్శించు. నేను పంజా విసిరితే చస్తావు అంటూ నవ్వుతూ అన్ని వైపులా చూస్తూ నిలబడ్డాడు. అప్పుడు ప్రభు దొమ్మరితో ఇలా అన్నారు. చూడు పహిల్వాన్ సిద్ధంగా ఉన్నారు. నీవు చూపించు గురువు నటకా యొక్క పరాక్రమం, అని ప్రభు తన నటకాను భూమి పై తాకించారు. అప్పుడు దొమ్మరి 'ఆజ్ఞ ప్రభూ' అంటూ తన చడ్డీ పైకి చేసుకుంటూ పహిల్వాన్‌తో తలపడడానికి వెళ్లారు. పైల్వాన్ తన బలగర్వంతో నవ్వుతూ నిలబడి ఇలాంటి దొమ్మరులు ఎంతమంది వచ్చినా తన కాలును కూడా కదప లేరనే నమ్మకం ఉండేది. దొమ్మరి తనపై వచ్చి వడ్డా చేతిని కూడా కదప లేడు అనుకున్నాడు. కాని ఏమి చమత్కారం? దొమ్మరి ఆ పహిల్వాన్ భుజాలు పట్టుకొని వేగంతో వెనక్కి త్రోయగానే పత్తి సంచి పడ్డట్లుగా అతను కింద పడిపోయాడు. అప్పుడు కళ్లలో ఉన్న మైకం దిగిపోయి దొమ్మరి శరీరం కూడా తనలాగే బలమైనదని తెలిసివచ్చింది. తరువాత దొమ్మరి ఆ పహిల్వాన్ ఛాతిపై కూర్చుని నేలకు నొక్కిపట్టుకొని అదిమిపట్టుకున్నాడు. ఎంత ప్రయత్నించినా కదలడానికి కూడా వీలు లేకపోయింది. చివరికి ఏ ఉపాయం లేక తను ఓడిపోయానని దొమ్మరికి విజయం లభించిందని ఒప్పుకోవటం తప్ప వేరే దారి లేదనుకున్నాడు. చివరికి ప్రభు దొమ్మరితో అతనిని విడువ వలసిందిగా చెప్పారు. అప్పుడు విడిచి ప్రభువుకు నమస్కరించి నిలబడ్డాడు. ఈ పహిల్వాన్ గెలవడం అయితే వదిలేయండి. వారికి మీ ఆజ్ఞతో తలపడ్డారు కనుక ఇలా విజయం లభించింది. మీరు ఎవరికి కావాలంటే వారికి సామర్థ్యం ఇవ్వగలుగుతారు. ఈ విషయంలో మాత్రం సంశయం లేదు. అని అనగానే ఎప్పటిలాగే నగదు ఇచ్చి సంతోషపరిచి వారిని పంపించారు. గర్వభంగమైన ఆ పహిల్వాన్‌కు కూడా ధనం, మిగతా వారికి డబ్బుతో పాటు బట్టలు కూడా ఇచ్చి గురు దర్బార్‌లో ఇలా గర్వం చూపించరాదు అని చెప్పి వారిని తిరిగి పంపించారు.

## 54. నాందేడ్‌కర్ శాస్త్రి

రామచంద్రబువా సోలాపుర్‌కర్ గారు వ్రాసిన చరిత్రలో ఒక గర్విష్టి అయిన శాస్త్రికి గర్వభంగము ఎలా అయిందో ఆ కథ ఇవ్వడం జరిగింది. ఇది చదివి ఎంతో మంది శాస్త్రులకు కోపం వస్తుందని తెలుసు. ఈ విషయం ఇక్కడ ఇవ్వడం వల్ల అలాంటి ప్రసంగం రావచ్చని మాకు తెలుసు. అందుకని శాస్త్రి

బంధువులకు మా వినతి ఏమిటంటే ఉన్మత్తతతో గర్వం అధికమయితే ఎక్కడయినా నిందింపబడుతారు. విద్వత్తుతో, గర్వంతో వీర్రవీగుతున్న ఒక శాస్త్రిని ప్రభు ప్రేరణతో ఒక సామాన్య మనుష్యుడు సరియైన దారికి తెచ్చి మార్చడం జరిగింది. కథలోని నీతిని గ్రహించాలనే ఉద్దేశ్యంతో ఈ కథ సారాంశం మా పాఠకుల కొరకు ఇవ్వడం జరిగింది.

నాందేడ్‌కు చెందిన ఒక బ్రాహ్మణుడు శాస్త్రాలు అధ్యయనం చేసి వైదికం, యాజ్ఞికం మరియు వేదాంత శాస్త్రములో నిపుణుడై ఉండెను. ఆయన ప్రభు కీర్తి విని ఉండడం వల్ల ప్రభు ఎలా ఉన్నారో చూద్దామని ప్రభు నగరానికి వచ్చారు. వచ్చిన తరువాత గర్వంతో ప్రభు దర్శనానికి వెళ్లకుండా ఇరవై రోజుల వరకు ఊర్లో తిరుగుతూ ఉండిపోయాడు. ఆయనకు తానే తెలివిగల వాడననే గర్వం ఉండి, ప్రభు కూడా తన ముందు తక్కువే అని జనుల ముందు అనే వారు. నేను ప్రభువును గెలవడానికి వచ్చాను. ప్రభువుకు ఏమి వస్తుంది, మట్టి అంటూ ఊర్లోని విద్వాంసులయిన బ్రాహ్మణులను విసిగించేవారు. ప్రభువు తమ వద్ద వారితో తలపడేవారు లేరని కాదు కానీ, తమాషా చూద్దామని ఊరికే కూర్చుండిపోయారు. ఈ విధంగా ఇరవై రోజులు గడిచి బప్పాచార్యతో పాటు ఇతర విద్వాంసులైన బ్రాహ్మణులు ఆయనతో విసిగిపోయారు. కారణం ఆ శాస్త్రి నిత్యం లేవగానే ఎవరితోనైనా వితండవాదన చేస్తూ, ఎవరికీ ఏమీ రాదని అందరికంటే సర్వశ్రేష్టమైన విద్వాంసుడను తానేనని తనకు ప్రభు వద్ద నుండి గెలిచినట్లు జయపత్రం ఇవ్వాలి అనే వారు. ఈ విషయం భక్త మండలి ప్రభువుకు చెప్పారు. కానీ, ప్రభు ఎవరికీ ఏ సమాధానం ఇవ్వలేదు. కొంచెం నశ్యం తీసుకొని ముక్కుతో పీలుస్తూ ఆనందంగా కూర్చునేవారు. ఈ విధంగా ఇరవై రోజులు అయిన తరువాత ఒక రోజు పొద్దున ఈ నాందెడ్‌కర్ శాస్త్రి గ్రామంలోని విద్వాంసులైన బ్రాహ్మణులను పోగుచేసుకొని వాదిస్తూ కూర్చున్నప్పుడు ప్రభు సేవకుడైన మంగలివాడు దత్తు, చేతిలో దుప్పటితో వచ్చి అక్కడ నిలబడినాడు. వాడిని చూడగానే నాందెడ్‌కర్ శాస్త్రి తన క్షవరం గుర్తుకు వచ్చి నాకు ఈ రోజు క్షవరం చేస్తావా? అని అడిగాడు. అప్పుడు దత్తు చేతులు జోడిస్తూ అవును మహారాజా, మీ క్షవరం చేయాలనే నేను ఇక్కడికి వచ్చాను అనగానే ఒక చిరిగిన గొంగడిపై కూర్చొని దత్తుని తన ముందు కూర్చోపెట్టుకున్నాడు. అప్పుడు క్షవరం కోసం శాస్త్రి గారు చల్లనీరు

తీసుకున్నారు. అది చూసి దత్తు, మహారాజా వాతావరణం చల్లగా ఉంది, నీరు కొంచెం వేడి చేసుకోండి అన్నాడు.

శాస్త్రిబువా చేసేవాణ్ణే కానీ, నిప్పు రాజేసింది లేదు అన్నారు. అప్పుడు దత్తు, అరె మహారాజా ఏం మాట్లాడుతున్నారు? మీ కడుపులో జఠరాగ్ని అనే అగ్ని మండించింది లేదా? రాత్రి పగలు మండుతూనే ఉన్న అగ్ని దగ్గర ఉన్నా కూడా క్షవరం కోసం నీరు వేడి చేయలేరా? ఇదేనా మీ విద్వత్తు? నోటితో పెద్ద మాటలు మాట్లాడుతారు. ఇన్ని నీళ్లు వేడి చేయడానికి అగ్ని లేదంటారా? మీకు విద్య యొక్క అనుభవం శూన్యం అనిపిస్తుంది. విద్య, బ్రాహ్మణ తేజస్సు ఉంటే జఠరాగ్నిపై ఈ నీరు వేడి చేయండి అని దత్తు అనగానే, శాస్త్రిబువా కోపంతో మూర్ఖా! చిన్న నోటితో పెద్ద ముద్దను తీసుకుంటావా? నా వంటి విద్వాంసుడైన బ్రాహ్మణునిడిని మంగలివాడివైన నీవు అవమానం చేస్తావా? నోటిని అదుపులో ఉంచుకొని మాట్లాడు. లేదంటే ఈ నీటి గిన్నె నీ జఠరాగ్నిపై వేడి చేయి చూద్దాం, అని శాస్త్రిబువా అనగానే దత్తు వెంటనే వెల్లకిలా పడుకొని తన కడుపుపై బొడ్డు వద్ద సుమారు ఐదు నిమిషాలు నీటిని పెట్టుకున్నాడు. ఇంతలో నీరు చాలా వేడితో సలసల మరిగి పోయాయి. అది చూసి శాస్త్రిబువాకు ఆశ్చర్యం కలిగి గర్వం దిగిపోయింది. అవమానభారంతో పశ్చాత్తాపపడి ఎవరైతే ప్రభు వాడలోని మంగలి వాని వద్దనే ఇంత యోగ ప్రావిణ్యత ఉంటే ప్రభు సామర్థ్యం ఎలా ఉంటుందోఅనుకొని, తప్పయిపోయింది నేను ఇక్కడికి వచ్చి ప్రభువును దర్శించకుండా వ్యర్థంగా ఇరవై రోజులు గడిపి బ్రాహ్మణులతో ద్వేషాన్ని పెంచుకొని వారిలో ఆగ్రహం పెంచడంలోనే సమయం వెచ్చించాను. నా అంత మూర్ఖులు ఈప్రపంచంలో ఎవరూ ఉండరు అని అనుకొని, దత్తు కాళ్లు పట్టుకొని, 'నన్ను ప్రభు వద్దకు తీసుకొని వెళ్ళు' అన్నాడు. అప్పుడు దత్తు, శాస్త్రిగారి కాళ్లు పట్టుకొని మీ వంటి విద్వాంసులైన బ్రాహ్మణులను ప్రభు వద్దకు తీసుకొని వెళ్ళే యోగ్యత నాకు లేదు. ఈ పని బప్పాచార్యులు మొదలైన బ్రాహ్మణబృందంలోనివారు చేస్తారు, అంటూ శాస్త్రి గారిని బప్పాచార్యులకు అప్పగించారు. బప్పాచార్యులు శాస్త్రిగారిని ప్రభు వద్దకు తీసుకువెళ్తే వారికి ఆదర సత్కారాలు చేసి శాలువా, దోతులజోడు, పగిడి మరియు రెండువందల రూపాయలు ఇచ్చి సంతృప్తి పరిచి సన్మానించి పంపించారు.

# 55. సిఖ్ మతస్థుని ముడుపు

గోపన్‌పల్లి అనే గ్రామంలో ఒక సిఖ్‌మతానికి చెందిన గృహస్థు నివసిస్తుండేవారు. ఆయన ప్రభువుపై భక్తి ఉండి గురునానక్ లాగే ప్రభువును కూడా పూజనీయులుగా భావిస్తుండేవారు. ఆయన భార్య కూడా ప్రభు భక్తురాలే. వారిద్దరూ అపుడప్పుడు మొక్కుకున్న ముడుపు పదిహేను రూపాయలు అయ్యాయి. ప్రభు దర్శనం అయిన తరువాతే పూజ–అరతి చేసి ఈ ముడుపు ప్రభు ముందు పెట్టాలని వారి సంకల్పం. సంకల్పానుసారంగా ఇద్దరూ మాణిక్ నగర్‌కు చేరుకున్నారు. సంగమములో స్నానం చేసి ప్రభు పూజ కోసం సామాగ్రిని సమకూర్చుకొని పూజకు పేడా కావాలని ఆ సిఖ్ ఒక రూపాయి పేడా కొనుక్కొని రావాడానికి హుమనాబాద్‌కు వెళ్లాడు. సంగమములో ఆయన భార్య ఎండలో కూర్చొని ఉంది. భర్త హుమ్నాబాద్ నుండి పేడా తెచ్చిన తరువాత పూజ చేసి ముడుపు అర్పించాలని వారిద్దరి కోరిక. ముడుపు కట్టింది భార్య వద్ద ఉంచి భర్త హుమ్నాబాద్‌కు వెళ్ళాడు. ఇంతలో ప్రభు వద్ద ఉండే ఒక బ్రహ్మచారి ఈ సిఖ్ స్త్రీ ని వెతుక్కుంటూ సంగమ ప్రదేశానికి వచ్చాడు. నేనే ఆ సిఖ్ స్త్రీ ని అని అమె చెప్పగానే ఆ బ్రహ్మచారి, 'నీ దగ్గర ఉన్న పదిహేను రూపాయల ముడుపు నాకు ఇవ్వు. ప్రభు ఈ ముడుపు కోసం నన్ను ఇక్కడికి పంపించారు', అన్నాడు. తామైతే ఈ ముడుపు విషయం ఎవరికీ చెప్పలేదు, ప్రభు యొక్క ఈ ఆజ్ఞ విని ఆమె ఆశ్చర్య చకితురాలయింది. భర్త ఇంకా రావలిసి ఉందనీ, అతను వచ్చిన తరువాత ఆయనను అడిగి ఇవ్వాలి అనిపించింది. కానీ, అలా అనడానికి నోటి నుండి మాట రాలేదు. భర్త ఏమన్నా సరే, ప్రభు ఆజ్ఞ శిరసావహించాలనిపించి బట్టలో కట్టిన ముడుపును ఆ బ్రహ్మచారికి ఇచ్చి వేసింది. ముడుపు తీసుకొని బ్రహ్మచారి వెళ్లిపోయాడు. హుమ్నాబాద్ నుండి భర్త వచ్చిన తరువాత జరిగింది చెప్పడం మరచిపోయి తొందర తొందరగా పూజ సామాగ్రి తీసుకొని ప్రభు వద్దకు వెళ్లారు. ఇద్దరూ ఆనందంగా పూజ చేశారు. పూలమాల మెడలో వేసి తెచ్చిన పేడా ప్రభు ముందు ఉంచారు. అప్పుడు తనకి ముడుపు విషయం గుర్తుకు వచ్చి పేడాతో పాటు పెట్టాలని భార్యను ఆ విషయం అడిగాడు. అంతలో ప్రభు తానే ఇలా అన్నారు. పదిహేను

రూపాయల ముడుపు మాకు ముందుగానే ముట్టింది. మేము ఆ రూపాయలు ఈ యాత్రికులకు ఇచ్చామని వారిని చూపించారు.

ఏం జరిగిందో ముందు సిఖ్‌కి తెలియలేదు. పూజ అయిన తరువాత జరిగిన విషయం భార్య చెపితే చాలా సంతోషించాడు. ప్రభు కృప తమపై ఉండడం వల్లనే అలా జరిగిందని తన భార్య చేసిన మంచి పనికి భార్యకు కృతజ్ఞత తెలిపాడు.

## 56. ప్రభు దర్బార్‌లో షిరిడి సాయిబాబా

ఒకసారి ప్రభువు దర్బార్‌లో కూర్చున్నప్పుడు తేజోవంతమైన శరీరకాంతి కలిగిన పదమూడు నుండి పదునాలుగు సంవత్సరాల కిశోరావస్థలో ఉన్న ఒక ఫకీరు ప్రభు వద్దకు వచ్చారు. ఆయన తలకు పటకా (రుమాలు) కట్టుకొని శరీరంపై జుబ్బా వేసుకొని ఉన్నారు. వారి చేతిలో ఒక చిన్న లోటా ఉండెను. అది ప్రభు ముందు పట్టుకొని ప్రభువును ఉద్దేశించి "**సాయీ, మేరా లోటా భర్‌దే!**" అన్నారు ( సాయీ, నా లోటా నింపి ఇవ్వండి). ప్రభు వద్ద తాత్యా మహారాజులవారు కూర్చొని వేదాంత చర్చ చేస్తూ ఉండిరి. వారి దృష్టి ఆ ఫకీరు వైపుకు వెళ్లలేదు. అందుకని ప్రభు ఆయనను పిలిచి ఆ ఫకీరు చేతిలోని లోటా తీసుకొని రూపాయలతో నింపి ఇవ్వవలసినదిగా చెప్పారు. తాత్యామహారాజులవారు చర్చలో నిమగ్నమవడం వల్ల ఆ లోటాను తీసుకొని కుప్పగా ఉన్న రూపాయలను మాట్లాడుతూనే ఆ లోటాలో నింపసాగారు. ఎంత సమయం గడిచినా లోటా మాత్రం నిండడంలేదు. దగ్గర ఉన్న అన్ని రూపాయలు అయిపోవడం చూసి ఆయన ఆ లోటాను అలాగే ప్రభువుకు ఇచ్చి మళ్లీ వేదాంత చర్చలో మునిగిపోయారు. ఫకీరు అలాగే నిశబ్దంగా చూస్తూ నిలబడ్డారు. ప్రభు ఆ లోటాను తీసుకొని రెండు కర్జూరపండ్లు కొన్ని పూలు వేయగానే లోటా నిండిపోయింది. ప్రభు నవ్వుతూ సాయీ! తీసుకోండి అంటూ ఫకీరుకు ఆ లోటాను ఇచ్చారు. ఫకీరు ఆ రెండు కర్జూరపండ్లు, పూలు మాత్రం తీసుకొని, ఇంతే చాలు అంటూ లోటాను ప్రభు ముందు బోర్లించారు. అందులో నుండి లోటాలో ఉన్న దానికంటే ఎన్నో రెట్ల రుపాయిలు కుప్పలాగా

పడ్డాయి. ఫకీరు ప్రభు వద్ద తల వంచి నమస్కరించి వెళ్లిపోయారు. తాత్యామహారాజుల వారు మాట్లాడడంలో నిమగ్నమయి ఉండిరి. జరిగిన విషయం ఆయనకు అర్థం కాలేదు. అప్పుడు ప్రభువు, 'తాత్యా, ఎలాంటి మనుష్యులు ఇక్కడికి వస్తారో, ఎందుకు వస్తారో చూడకుండా అర్థంలేని చర్చ చేస్తూ కూర్చున్నావు. ఆ ఫకీరు లోటా నింపడం రాలేదు కానీ, తను గుమ్మరించిన రూపాయిల కుప్పను చూడు', అన్నారు. ఇది వినగానే తాత్యా మహారాజ్ ఆ కుప్పపైపు చూశారు. అది చూసి ఆశ్చర్యపోయి ఆ ఫకీరు ఎవరో తెలుసుకోవాలని ప్రయత్నం చేశారు. ఫకీరును వెదకడానికి నాలుగు దిక్కులా మనుష్యులను పంపించారు. కానీ, ఎక్కడా ఆ ఫకీరు కనిపించలేదు.

ఆ ప్రభు దర్బార్‌లో ఫకీరు వేషంలో వచ్చిన తేజోవంతమైన యువకుడు వేరెవరో కాకుండా సాక్షాత్ శ్రీ షిరిడీ సాయిబాబా అయి ఉండిరి.

సాయిబాబా సంస్థాన్, షిరిడీ నుండి ప్రకాశింపబడిన అచ్యుత్ యశ్వంత్ దోండే వ్రాసిన 'శ్రీ సాయిబాబా అవతార్ వ కార్య' గ్రంథము యొక్క ఆధారముగా ఫకీరుల వేషంలో స్వయంగా సాయిబాబా యే ప్రభు దర్బార్‌కు వచ్చి ఉండిరని ఖచ్చితంగా తెలుస్తుంది.

ముస్లిం ధర్మంలోని పెద్ద పెద్ద ధర్మాధికారులు ప్రభు దర్శనానికి వచ్చేవారని పై విషయం వివరించిన రామకృష్ణపంత్ తహసిల్‌దారు అనే వారు. ఈ కథకు ముందు సిఖ్ మతస్థుని ముడుపుకు ముందు వచ్చే రెండు విషయ కథలు రామకృష్ణ పంత్ గారి నుండి తెలిసినవి.

## 57. కాశీయాత్రకు పోయే బ్రాహ్మణుడు

ఒక బీదవాడైన బ్రాహ్మణుడు తన భార్యతో కలిసి కాశీయాత్రకు వెళ్లాలనే కోరికతో మాణిక్ నగర్‌కు వచ్చాడు. ప్రభు దర్శనం చేసుకొని ప్రసాదం ఇవ్వమని అడిగాడు. ప్రభువు ఒక శిష్యుడికి వంట సరకులు ఉంచే గదిలో ఏమైనా ఉందేమో చూసి రమ్మని పంపించారు. శిష్యుడు ఆ గదికి వెళ్లి చూసి ఏమీ లేదని తిరిగి

వచ్చాడు. ఎన్నిసార్లు అడిగినా ఏమీ లేదని చెప్పసాగాడు. తరువాత ఇంకో శిష్యుడిని పిలిచి ఆ గదిలో నుండి చేతికి ఏది వస్తే అది తీసుకోని రావలసిందిగా చెప్పారు. ఈయనకు పది పదహేను మినుముల గింజలు కనిపించాయి. అవి తీసుకొని ప్రభు వద్దకు వచ్చాడు. ప్రభు వాటిని తీసుకొని ఒక కాగితంలో వేసి, ఒక పువ్వు వేసి పొట్లం కట్టి బ్రాహ్మణుని చేతికి ఇస్తూ, ఇది ఒక డబ్బాలో వేసి నిత్యం పూజ చేయండి అని చెప్పారు. అలాగే కాశీయాత్రకు బయలుదేరవలసిందిగా చెప్పారు. ప్రభు వద్దనుండి దారి ఖర్చులకు డబ్బు దొరుకుతుందని ఆ బ్రాహ్మణుడు ఆశపడ్డాడు. కానీ, అది దొరకక ఆ బ్రాహ్మణుడు నిరాశ చెందాడు. ఆయన భార్య మాత్రం తెలివిగలదై ఉండెను. ప్రభువుపై ఆమెకు భక్తి ఉండెను. ప్రభు చేతి ప్రసాదంతో తమ కార్యం సఫలమవుతుందని పూర్తి నమ్మకం ఉండడం వల్ల దొరికిన దానితో సంతోషపడింది. ఆ దంపతులు ప్రసాదం తీసుకొని కాశీ వెళ్లడానికి ప్రయాణమయ్యారు. రెండు కోసులు నడిచిన తరువాత దారిలో ఉన్న గ్రామంలో ఆదరసత్కారాలతో పాటు పది రూపాయలు కూడా దొరికాయి. ప్రభు ప్రసాదం యొక్క మహిమ (ప్రథమ అనుభవం) చూసి ఆయన భార్య ఆనందించింది. ఆమె ఎప్పుడూ ప్రభు స్మరణ చేస్తూ ఉండేది. తరువాత కూడా ద్రవ్యప్రాప్తి, భోజన ప్రాప్తి కలిగి యాత్ర నిర్విఘ్నంగా జరిగింది. దారిలో ఎలాంటి కష్టం కలగకుండా, ద్రవ్యలోటు కూడా ఎక్కడా రాకుండా ఆనందంగా యాత్ర పూర్తి చేసుకొని తమ గ్రామానికి వెళ్లడానికి ముందు ప్రభువును దర్శించుకోవాలని మాణిక్ నగర్‌కు వచ్చారు. దర్శనం చేసుకొని పూజచేశారు. ఆరతి అయిన తరువాత ప్రభు మెల్లగా మా వస్తువు ఒకటి మీ వద్ద ఉంది అది తిరిగి ఇవ్వండి మీ పని నిర్విఘ్నంగా అయిపోయింది కదా! అది ఉంచుకొని ఏం చేస్తారు? అని ప్రభు అనగానే డబ్బాలోని పొట్లం తీసి ఇచ్చారు. ప్రభు అది విప్పగానే మినుములకు మొలకలు వచ్చి ఉన్నాయి. కొద్దిసేపు వాటివైపు చూసి వాటిని దూరంగా పారేశారు. ఒకరోజు ఉండి మరుసటిరోజు తమ ఊరికి వెళ్ళారు. దారిలో ఎక్కడా ముందు జరిగినట్లు భోజన వసతి దొరకలేదు. అంత దూరం కాశీయాత్ర నిర్విఘ్నంగా జరిగి ఇంత దగ్గరగా ఉన్న తమ ఊరికి వెళ్తుంటే ఇలా ఎందుకు జరుగుతుందో అని ఆ స్త్రీకి ఆశ్చర్యం కలిగింది. భర్త వద్ద ఈ విషయం ప్రస్తావిస్తుండగా ఇదంతా ఆ ప్రభు ఇచ్చిన పొట్లం మహత్యం అని అర్థమయింది. ప్రభు తమ మహిమను ఆ పొట్లంతో చూపించారు. ప్రభు దయతో తమ కాశీయాత్ర కోరిక ఫలప్రదమయిందని అనుకున్నారు.

## 58. ఐనుద్దీన్ ఉస్తాద్

చిటుగుప్ప అనే గ్రామంలో ఐనుద్దీన్ సాహెబ్ అనే పేరుగల ఒక ముస్లిం పండితుడు ఉండేవారు. ఈయన ఉపాధ్యాయుడు. సర్కారి కచేరీలో పూర్వకాలంలో అరబ్బీ నేర్పించేవారిని నియమించేవారు. ఐనుద్దీన్‌కు తన విద్యపై చాలా గర్వంగా ఉండేది. చిటుగుప్పలో కొంత మంది బ్రాహ్మణుల పిల్లలు వీరి వద్ద పార్శి నేర్చుకోవడానికి వెళ్లేవారు. ఆ విధంగా రామకృష్ణ పంత్ కూడా వెళ్లేవారు. ఐనుద్దీన్ బ్రాహ్మణులను నిందిస్తూ ఉండేవాడు. పిల్లలకు అది తప్పుగా అనిపించేది. కానీ, వారికి వాదన చేసే శక్తి లేకపోవడం వల్ల నిశబ్దంగా ఆయన అనేది భరించేవారు. ప్రభువుకు సంబంధించిన విషయంలో కూడా అసంబద్ధంగా మాట్లాడేవాడు. మనుష్యులు ఇతర మనుష్యుల పూజచేయడం, నమస్కరించడం తప్పు. ఇలా చేసేవారందరూ మూర్ఖులు అని ఎప్పుడూ అంటూ ఉండేవాడు. ఒక సారి రామకృష్ణపంత్ తన తండ్రి, మామతో ప్రభు దర్శనానికి వెళ్తుండగా ఐనుద్దీన్, ప్రభు ఎలాంటి వారో చూద్దామని మాణిక్‌నగర్‌కు వాళ్లతో పాటు వచ్చాడు. ప్రభువు దగ్గరికి వెళ్లగానే ముఖంలో తేడా కనిపించింది. తన సమక్షంలో వేల మంది పూజ చేయడం, సాష్టాంగ నమస్కారం చేయడం కనిపించింది. ఈ విషయంలో మాత్రం మనుష్యులు మనుష్యులకు పూజ చేయడం పరమేశ్వరునికి విరుద్ధంగా పెద్ద తప్పు చేయడం అవుతుందని దాని ఆధారమైన ఖురాన్‌లోని వాక్యాన్ని చెప్పాడు. అది విని ప్రభు వారి జ్ఞానానికి మెచ్చుకున్నారు. అప్పుడు ఆయన అక్కడ కూర్చున్న వారి వైపు గర్వంగా చూశాడు. అలా మాట్లాడుతూనే తనకు విరుద్ధంగా ప్రభువు ఖురాన్‌లోని ఏడెనిమిది వాక్యాలు అని చూపించారు. తమ పవిత్ర గ్రంథం యొక్క ఇంత సూక్ష్మజ్ఞానం ప్రభువుకు ఉండడం చూసి అతని గర్వం పూర్తిగా దిగిపోయింది. ప్రభు ముందు మాట్లాడే ధైర్యం కూడా పోయింది. ప్రభుకున్న జ్ఞానంలో రూపాయిలో అణాపైసా వంతు కూడా తనకున్న జ్ఞానం సరిపోదని ఒప్పుకున్నాడు. ఇంకా తాను జ్ఞానం యొక్క తలుపు దగ్గరే ఉండి లోపలికి వెళ్లలేకపోయానని ప్రభులాంటి సర్వజ్ఞులతో వాదం చేసే మూర్ఖమైన పని చేశానని పశ్చాత్తాపపడి ప్రభు కాళ్లు పట్టుకున్నాడు. ఇప్పటివరకు తాను అపరాధం చేశాననీ, క్షమించమని వేడుకున్నాడు. అప్పుడు ప్రభు మాటలతో

ఆయనను సమాధాన పరిచి నిజమైన ధర్మరహస్యం చెప్పారు. అప్పటి నుండి ఐనుద్దీన్ నడవడికలో తేడా కనిపించింది. హిందువులపై ద్వేషాన్ని విడిచిపెట్టాడు.

'దునియా మే ఏక్ పరబు సచ్ హై, బాకి సబ్ ఝూఠ్ హై' (ఈ ప్రపంచంలో ప్రభువు ఒక్కరే సత్యమైనవారు, మిగిలిందంతా మిథ్యా) ఇలా ఎప్పుడూ అంటూ ఉండేవారు. ఐనుద్దీన్ స్వభావంలో, ప్రవర్తనలో వచ్చిన మార్పు చూసి రామకృష్ణపంత్ మరియు ఆయన తండ్రి చాలా సంతోషపడ్డారు. ఈ సంఘటన జరిగిన తరువాత ఐనుద్దీన్ సాహెబ్ ప్రభుకు పరమ భక్తుడై తరువాత ఎప్పుడూ హిందూ ధర్మాన్ని దూషించలేదు.

## 59. శరణాపల్లి బ్రాహ్మణుడు

శరణాపల్లి నాందేడ్‌కు దగ్గరలో నిజాం సంస్థానానికి చెందిన పురాతన సంస్థానము. నిజాం రాకముందు ఇది స్వతంత్రంగా ఉండేది. ఈ సంస్థాన ప్రాంతంలో నివసించే కుటుంబానికి చెందిన ఒక బ్రాహ్మణుడు ప్రభు యొక్క కీర్తి విని దర్శనానికి వచ్చాడు. ఆ కాలంలో ప్రయాణ సాధనాలు అంటే ఎడ్ల బండ్లపై లేదా గుర్రంపై స్వారీ చేస్తూ వచ్చేవారు. ఆ బీద బ్రాహ్మణుడు గుర్రంపై స్వారీ చేస్తూ వచ్చాడు. దారిద్ర్యంతో తినడానికి ఏమీలేక గుర్రానికి ఏమీ పెట్టలేక పదిహేను రోజులు గడిపి ప్రభు కృప కలుగక, విసిగిపోయి నిరాశతో తన ఊరికి తిరిగి వెళ్ళాలనుకున్నాడు.

అది తన దౌర్భాగ్యం అనుకొని విసిగిపోయి వెనుతిరిగాడు. ఇక్కడ ప్రభు నిద్రనుండి లేచి ఒక మనిషిని పిలిచి శరణాపల్లికి చెందిన బ్రాహ్మణుడు అతనితో పాటు ఒక గుర్రం ఉంది. ఇప్పుడే ఇక్కడి నుండి వెళ్లాడు. చాలా దూరం వెళ్లకుంటే ఆయనను పిలుచుకొని రా అన్నారు.

ప్రభు ఆజ్ఞ ప్రకారం ఆ బ్రాహ్మణుని ప్రభు వద్దకు తీసుకొని వచ్చాడు. ప్రభు దర్శనం కాగానే ఆనందాశ్రువులు రాలసాగాయి. సాష్టాంగ ప్రణామాలు చేశాడు. ప్రభు అంతర్ జ్ఞాని అని చేతులు జోడించి ఇలా విన్నవించుకున్నారు. హే ప్రభూ,

మీకు అంతా తెలుసు. బిడ్డల శుభకార్యం చేయడానికి నా దగ్గర పైసా లేదు. విధి చేతిలో ఓడిపోయాను అంటూ దుఃఖపడసాగాడు. ప్రభు అతనిని స్వాంతన పరిచి, బాబా! పూర్వ కర్మానుసారంగా సుఖదుఃఖాలు ప్రాప్తిస్తాయి. మీ పూర్వ చరిత్ర శోధించాను ఎంత కఠినంగా ఉంది అంటే ఏడు జన్మలు దారిద్ర్యం అనుభవించాలి. దానికి నేను మాత్రం ఏమి చేయగలను?.

అప్పుడు బ్రాహ్మణుడు ఇలా అన్నాడు. పూర్వ పాపంతో దారిద్ర్యం అనుభవించాను. అలాగే పూర్వ సుకృతంతో మీ దర్శనభాగ్యం కలిగింది. అందుకని పాప ప్రక్షాళన జరిగింది. ఈ జన్మకు ఈ సంసారబాధ్యతలు చాలు. మళ్లీ ఇంటికి వెళ్తే ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తుంది. అందుకని తీర్థయాత్ర చేసి ప్రారబ్ధపాపం తీర్చుకోవడమే మార్గమనిపిస్తుంది.

ప్రభువుకు ఆయనపై దయ కలిగింది. తన కాళ్లపై ఉన్న తులసీ దళాలను హుండీ అని ఇస్తూ ఇది బాలాజీకి ఇవ్వు. వారు నీకు రెండు వేల రూపాయలు ఇస్తారు అని చెప్పారు. ప్రభు ఆజ్ఞ ప్రకారం ఆయన తిరుపతి బాలజీ వద్దకు వెళ్లారు. మరుసటి రోజు బాలాజీ రథం ఊరేగింపుగా బయలుదేరింది. ఆ బ్రాహ్మణుడు ప్రభు ఇచ్చిన తులసీ దళాన్ని బాలాజీ కాళ్ళపై ఉంచి దూరం నుండే ప్రార్థించాడు. రథం ఆగిపోయి ముందుకు పోవడంలేదు. సేవకులు అన్ని ప్రయత్నాలు చేసి అలసిపోయారు. చివరికి మహంతులు భక్తులందరిని ఉద్దేశించి ఇలా అన్నారు 'ఎవరైనా బాలాజీకి తమ సంకెళ్ళు వేశారా?' అలా ఎవరైనా వేస్తే ముందుకు వచ్చి తెలియజేయండి. ఇది విని ఆయన ప్రభు ఇచ్చిన తులసీ దళ రూపంలో ఉన్న హుండీ కథ నివేదించాడు. మహంతులు ఆ బ్రాహ్మణుని పంచలో ధనం వేయగానే శ్రీ వెంకటేశుని రథం ముందుకు నడవసాగింది. మహంతులు ఆ బ్రాహ్మణునికి ఆదర సత్కారాలు చేసి పంపించారు.

తన ఇంటికి వెళ్ళిన తరువాత బంధువులకు, మిత్రులకు ప్రభువు యొక్క అద్భుత లీల సవివరంగా వర్ణించి చెప్పాడు. గ్రామంలో అందరి నోళ్ళలో ఇదే మాట. చివరికి శరణాపల్లి రాజా చెవిలో ఈ విషయం చేరి వారి మనస్సులో ప్రభువుపై భక్తి కలిగింది. ఇలాంటి ఎన్నో ప్రభు యొక్క లీలాభరితమైన ఘటనలు ఉన్నాయి. వాటికి అంతం అనేదే లేదు.

# ఉత్సవములు

## 60. దత్త జయంతి

ప్రభువు యొక్క నివాసం మాణిక్‌నగర్‌లో స్థిరమైన తరువాత వివిధరకాల ఉత్సవాలు ప్రత్యేక భక్తితో, ఉల్లాసంతో జరుగసాగాయి.

సంవత్సరంలో వచ్చే అన్ని పండుగల సమయాలలో ఆ పండుగను అనుసరించి దర్బార్ సమారంభం చేయబడేది. అన్ని జయంతులు ఉత్సవంగా చేయబడేవి. దాంట్లో రామనవమి ఉత్సవము పెద్ద ఎత్తున జరుగసాగింది. దానికి కారణం ఆ రోజు ప్రభువు బయాదేవి గర్భంలో ప్రవేశించిన రోజు. ఈనాటికి ఈ జన్మోత్సవము మహత్తరమైనదై వేల మంది భక్తులు శ్రీజీ పూజ చేసి కానుకలు సమర్పించుకుంటారు. శ్రీ కృష్ణ జయంతీ కూడా అలాగే పెద్ద ఎత్తున జరుపబడుతుంది. గణేశ చతుర్థి రోజు గణపతి పూజతో ఉత్సవము ప్రారంభమై అనంత చతుర్దశి వరకు జరుగుతుంది. మహాశివరాత్రి ఇతర పండుగలు, జయంతులు ఇలాగే చేయబడుతాయి. ఇప్పుడు కూడా అదే పద్ధతి ప్రకారం జరుగుతూ వస్తున్నాయి. ఇంకా కొన్ని ఉత్సవములు ముందు కంటే గొప్పగా జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి.

సంవత్సరంలో అన్నిటికంటే ముఖ్యమైనది దత్త జయంతి. ఇది పెద్ద ఉత్సవము. ఇప్పటికీ ఇది పెద్ద ఎత్తున చేయబడుతుంది. దత్త జయంతి ఉత్సవము యొక్క వర్ణన రామచంద్రబువా సోలాపూర్‌కర్ గారు వివరించారు. రామచంద్రాబువా ప్రభు శిష్యులై స్వయంగా కళ్లతో చూసి ఉండడం వల్ల వారి వర్ణనలో వాస్తవం ఉంటుంది. వారు దత్తజయంతి ప్రతి సంవత్సరమూ చేసేవారు. ప్రభువు వారి నియమానుసారంగా నవ రాత్రి ఉత్సవము ప్రారంభించి బ్రాహ్మణ భోజన కార్యక్రమానికి అయిన ఖర్చు చేశారు అని ఆయన వ్రాసారు. ఉత్సవానికి సంబంధించిన ఘటనలు వారి మాటల్లో క్రింద ఇవ్వడం జరిగింది.

ప్రభు వద్ద దత్తజయంతి సమారంభములో పూర్ణిమ రోజు పెద్ద ఎత్తున అన్నదానం జరిగేది. సుమారు ముప్పై నుండి నలభై వేల మందికి భోజనం, అందరికీ దక్షిణ కూడా దొరికేది. ఈ విధంగా ఒక రోజే పెద్ద ఎత్తున జరిగేది. కానీ, నాసిక్‌కర్ అనే శిష్యుల ఇంట్లో ఒకరోజు ఉండేది కాదు. వారు ప్రభు గురించి చెపుతూ, మా ఉత్సవము మార్గశిర శుక్ల సప్తమి నుండి పది రోజులు జరిగేది. రోజూ అభిషేకము కొరకు పదకొండు మంది గురుచరిత్ర పారాయణము, బ్రాహ్మణ భోజనము, హరికథా జరిగేవి. కాని ఈ సంవత్సరం మేము ప్రభు యొక్క స్వాధీనములో ఉండడం వల్ల మేము ఏమీ చేయలేకపోయాము. ఉత్సవానికి ఇక ఒక రోజే మిగిలింది అనే ఆలోచన వచ్చింది. ఇంతలో ప్రభు నన్ను దగ్గరకు పిలుచుకొని అప్పాచార్యులకు, దయాళుదాస్‌లకు నా సమక్షంలో కార్యభారాన్ని అప్పగిస్తూ రేపటినుండి నాసిక్‌కర్ వాళ్ల ఇంట్లో దత్తోత్సవము ఉంది. అభిషేకం చేయడానికి పదకొండు మంది బ్రాహ్మణులు, ఒకరు గురుచరిత్ర పారాయణము కొరకు, ఒకరు తులసి సమర్పించుటకు ఇలా పదమూడు మంది బ్రాహ్మణులను నియమించి రోజూ మూడు వందల మంది భోజనం చేసేటట్లు పది రోజులకు సరిపోయే సరుకులను సమకూర్చాలి. అవసరమైనంత వంట పాత్రలు, ఇంకా ఇతర వస్తు సామాగ్రి, దేవుడిని నిలవడానికి అవసరమైన సుశోభితమైన స్థలం తయారు చేసి ఇవ్వాలని చెప్పి, మూడు వందల రూపాయలు ఇచ్చి దక్షిణ మొదలైన వాటికి ఖర్చు చేయాలని ఆజ్ఞాపించారు. నాలుగు నిమిషాలలో మా ఉత్సవానికి సర్వం సిద్ధమయింది. ఈ విషయం నాలుగు నెలల క్రింద చర్చించి ఉండిరి. ఆ విషయం ప్రభు గుర్తు పెట్టుకొని రేపు ఉత్సవము ప్రారంభం అవుతుందని తెలిసి అన్ని విధాలా తయారు చేశారు. దీని వల్ల ప్రభు యొక్క దూరదృష్టి, స్మరణశక్తి మరియు నమ్మిన వారిపై అభిమానం ఎంతటిదో కూడా తెలుస్తుంది. ఇలా పది రోజులు దత్త జయంతి ఉత్సవము చాలా బ్రహ్మాండంగా జరిగేది. ఎక్కడైతే సాక్షాత్ ప్రభు యొక్క సహకారం దొరుకుతుందో అక్కడ లోటు ఉండేది కాదు. తొమ్మిది రోజులు కీర్తనలు, సంగీత కార్యక్రమాలు, నాట్యం, వేదఘోష, బ్రాహ్మణ భోజనము మొదలైనవి ఆనందంగా జరిగేవి. జన్మదినం రోజు చాలా ఆహ్లాదంగా అనిపించింది. వేలమంది నిండి ఉన్నారు, ప్రభు మహరాజ్ స్వయంగా వచ్చి గాది పై ఆసీనులయ్యారు. ఆ వైభవము ఏమని వర్ణించగలం?

'ఈ విధంగా దత్తాత్రేయుల జన్మదినం జరిగిన తరువాత మరుసటి రోజున పెద్ద ఎత్తున భోజన ఏర్పాటు జరిగేది. కాని ఆ రోజు మా వద్ద ఏ విధమైన

సామాగ్రి లేదు. మరియు స్వయం పాకం కూడా లేదు. అప్పుడు నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ' తొమ్మిది రోజుల వరకు మూడు వందల నుండి నాలుగువందల మందికి మహారాజు భోజన ఏర్పాట్లు చేశారు. చివరికి భోజన సంతర్పణ రోజు ఏమీ లేకుండా ఎలా ఉంది? అన్న ఆలోచనతో ఉన్నాను. ఇంతలో ప్రభు వైపు పెద్ద వంక్తి కూర్చునే ఏర్పాటు జరిగింది. సుమారు ఇరవైఐదువేల మంది బ్రాహ్మణులు పోగయ్యారు. అంతేకాక భండారుఖానాలో నూట యాభై మంది స్వయంపాకం చేస్తూ ఉండిపోయారు. రెండు వందల పాత్రలలో భోజనం తయారు చేయబడింది. రొట్టెల దొంతరలు పర్వతం లాగా పడసాగాయి. నాలుగు దిక్కులా ముగ్గులు వేసి పాత్రలు వాటిపై పెట్టారు. దాంట్లో చట్నీ, కూరలు, రొట్టెలు, వడలు, పులుసు మొదలైనవి వడ్డనకు తయారు చేయబడ్డాయి. రద్దీలో ఎవరు ఎవరితో మాట్లాడుతున్నారో తెలిసేది కాదు. కొందరు మడి కట్టుకొని తమ చెంబులు తీసుకొని పంచపాత్ర మొదలైనవి వెతుక్కుంటూ కనిపించారు. కొందరు తమ పిల్లలను రామా, గోపీ, చిన్నా అంటూ విస్తళ్ళ దగ్గర కూర్చోవడానికి పిలవసాగారు. ఒకవైపు పురుషుల పంక్తి మరోవైపు స్త్రీల పంక్తి కూర్చున్నారు. పసిపిల్లలు ఏడ్వడం వల్ల ఒకటే రద్దీ అయిపోయింది. ఇదంతా నేను నిశబ్దంగా చూస్తూ నిలబడి ఉండిపోయాను. ఇంతలో గాదీ వద్ద నైవేద్యం–వైశ్వదేవం తయారీ జరిగి ఆరతికి సమయం అయ్యింది. అందుకని ఉపాధ్యే బువా ప్రభు ఆజ్ఞతో పంచపాత్రను చేతిలో పట్టుకొని వచ్చి నన్ను తీసుకెళ్లాడు. అప్పుడు ప్రభువు నా సమక్షంలో ఉపాధ్యేబువాకు ఈ రోజు నైవేద్యం, వైశ్వదేవం ఈ నాసిక్‌కర్ వాళ్లచేత్తో చేయించండి అని ఆజ్ఞాపించారు. అప్పుడు మా అందరికి ఆశ్చర్యం అనిపించి నా కళ్లు ఆనందాశ్రువులతో నిండిపోయాయి. నైవేద్యం– వైశోదేవం అయి వడ్డించడం అయిన తరువాత గాది మరియు ప్రభు యొక్క ఆరతి నా చేత్తోనే జరుపబడి, బాజా, తాళాలు, మృందంగము, శంఖము, నగారా ఇలాంటి వాద్యాలతో చివరికి ఇరవైవేల మంది భోజనాలకు ఉదకం ప్రభు నా చేత్తో విడిపించారు. అప్పుడు బ్రాహ్మణులు భోజనానికి కూర్చున్నారు. ఇలా భోజనాలు జరగడం చూసి నేను ధన్యుడనై మహాభారతంలో ధర్మరాజు చేసిన రాజసూయ యాగం గుర్తుకు వచ్చింది. నిజంగా ఇలాంటి సంతర్పణ ఊరికే చూడడం కూడా మహా భాగ్యంగా అనుకోవాలి. ఆహా! ప్రభు యొక్క లీల అగాధమైనది. భోజనానికి కూర్చున్న వారికి, మరియు కడుపులో పెరుగుతున్న బిడ్డకు కూడా దక్షిణ ఇవ్వబడింది. మాణిక్‌నగర్‌లో అన్నిటి కంటే పెద్ద ఉత్సవము ఇదే. ముస్లింలు కూడా ఇందులో భాగం వహిస్తారు. అన్ని మతాల

వారు ఉత్సవం తమ ఉత్సవంగా భావిస్తారు. విఠ్ఠల్‌రావ్ తాలూకుదారు, ఆయన క్రింద పని చేసే వారంతా ఈ ఉత్సవ సమయములో వచ్చి శారీరక కష్టం చేసేవారు. పంక్తి ఏర్పాట్లు వీరి బాధ్యతగా ఉండేది. వేలమందికి అన్నం వండడానికి కావలసిన పెద్ద పెద్ద వస్తువులు భండారుఖానాలో అన్నీ ఉత్సవానికి ముందే తయారుచేసిపెట్టేవారు. ఉత్సవానికి వచ్చేవారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకొనేవారు. చిన్న పిల్లలకోసం ఆ ప్రదేశమంతా తిరిగి వెదికి పాలను అందించేవారు. ఈ ఉత్సవము ఇప్పటికీ ఇలాగే జరుగుతుంది. తరువాత ఈ ఉత్సవము 5 రోజులుగా జరిగేది. కాని 15 రోజుల వరకు ఆ ప్రభావం ఉంటుందనడానికి ఏ విధమైన సంశయం లేదు. మార్గశిర శుక్ల ఏకాదశి నుండి పౌర్ణిమ వరకు ఇప్పటికీ ఈ ఉత్సవము నియమానుసారంగా జరుగుతుంది. పూర్వం దత్త జయంతి ఉత్సవము ఎలా ఉండేదో ఇప్పుడు జరిగే దత్తజయంతి ఉత్సవము చూస్తే తెలుస్తుంది. రకరకాలైన ప్రజలు ఈ ఉత్సవ సమయంలో ఒక చోట చేరేవారు. దేశం మొత్తం నుండి అనేక రకాలైన జనులను ప్రతి సంవత్సరం ఈ ప్రదేశంలో చూడవచ్చు. విద్వాంసులైన జనులకు వారి విద్వత్తుకు తగిన మూల్యం ఇక్కడ దొరికేది. పూర్వకాలంలో కూడా నాలుగు దిక్కుల నుండి జనం ఇక్కడ చేరేవారు. అనేక విధాలైన భాషలు మాట్లాడేవారు. అనేక రకాలైన విద్యలు నేర్చిన, గుణసంపన్నులైన జనులు ఈ ప్రదేశంలో చేరి ఒకేభావంతో సేవ చేస్తుండేవారు. అది చూసి దగ్గరలోని చాలా మంది పెద్ద అధికారులు ఈ ఉత్సవానికి హాజరై యథాశక్తిగా సహాయము చేసేవారు. ఈ మంగళ ప్రదమైన ఉత్సవవర్ణన చదివి ఊరుకునే కంటే ఒకసారి చూసి తరించాలని మేము మా ప్రియమైన పాఠకులను కోరుతున్నాము.

## 61. జంగమ మేళా

శ్రీ దత్తజయంతి ఉత్సవము వంటి మహత్తరమైన ఉత్సవము లేదని ముందే తెలియ జేయడం జరిగింది. ఇతర సందర్భాలలో వచ్చే పండుగలు, ఉత్సవాలు ఆయా సమయాలలో జరుగుతాయి. అలాంటి ఉత్సవాలలో జంగము మేళా ఒకటి. సంక్రాంతి తరువాత ఈ మేళా మాణిక్‌నగర్‌లో వస్తుంది. హుమ్నాబాద్‌లో సంక్రాంతి అయిన తరువాత సుమారు కొన్ని రోజులకు వీరభద్రుని రథోత్సవము జరుగుతుంది.

అలా పూర్వం కూడా జరిగేది. 'తేర్ మరియు అగ్గి' ఇది ఉత్సవానికి ప్రచారంలో ఉన్న పేరు. తేర్ అంటే రథము. అగ్గి అంటే జంగమవాళ్లలో ముఖ్యులైన వారు అగ్గి (అగ్నికుండం)లో ముందుగా వెళ్తే ఆయన వెనుక అనేకమంది దానిని తొక్కుతూ వెళ్తారు. ఈ రథము మరియు అగ్ని అయిన తరువాత అందరు జంగములు ప్రసాదాన్ని తీసుకుంటారు. ఈ జంగము వాళ్ల విచిత్రమైన నాట్యం అనేక ప్రకారాలైన వాద్యాలతో పాటలు ఈ మేళాలో కనులవిందుగా ఉంటాయి. ఇప్పటికి కూడా ఇక్కడ ఈ విధమైనవి చూడవచ్చు. ఇలాంటి సందర్భాలలో అనేకమంది జంగములు పోగవుతారు. మాణిక్‌నగర్ చుట్టుపక్కల పూర్వం బసవేశ్వరుని అనుయాయులు ఉండి చాలా చోట్ల వాళ్ల మఠాలను కూడా స్థాపించారు. ఇప్పటికీ మఠాల శిథిలాలు కనిపిస్తాయి. కొన్ని చోట్ల మఠాధిపతులు తమ స్థానములను పటిష్ట పరిచి రక్షించినట్లుగా కనిపిస్తుంది. ఇప్పటి కంటే ప్రభు కాలంలో జంగములు భావుకులై ప్రభువుపై భక్తితో ఉండే వారు. అది చూసి ప్రభువుకి సంతోషమై జంగములకు ఎక్కువగా రొక్కం ఇచ్చేవారు. వాళ్లలాగే గోసాయి, బైరాగుల మేళాకూడా ఉంటుంది. కాని వారు వచ్చే సమయం (జరిగే) నిశ్చయమై ఉండేది కాదు. ఏ ధర్మం లేదా మతం వాళ్ల మేళా ప్రభువద్దకు వస్తే వారికి మంచి సంభావన దొరికేది.

## 62. మొహర్రం మరియు గ్యారవి

హిందూ ధర్మములో సమాజానికి అనుగుణంగా మేళాలు ఏ విధంగా వస్తాయో, ఆ విధంగా ముసల్మానుల మేళా కూడా ప్రభు సన్నిధికి వచ్చేది. వాళ్ల ముఖ్యమైన పండుగ లేదా ఉత్సవము మొహర్రం. ఆ సమయంలో వారు మాణిక్‌నగర్‌కి వచ్చేవారు. కాని దీనికంటే గ్యారవి సమయంలో వచ్చే జనం ఎక్కువగా ఉండేవారు. గ్యారవి అంటే ముస్లింల రజ్జబ్ నెలలోని పదకొండవ రోజు. వారి విశిష్టమైన సంప్రదాయంలోని ముఖ్యమైన రోజు. మన ధర్మంలో అవధూతను వర్ణన చేసినట్లుగా, అదే స్థితిలో ఉన్న మహబూబ్‌సుభాని అనే పేరుగల ఒక ప్రసిద్ధ సత్పురుషుని పుణ్యతిథిగా గ్యారవిని జరుపుకునేవారు. ప్రభువుని ముస్లింలు ఆ మహాపురుషుని అవతారంగా భావించేవారు. బీదర్‌లోని ముస్లింలు ప్రభువుని 'పీరానెపీర్ దస్తగీర్' అనేవారనే వృత్తాంతము ఇంతకు ముందే వ్రాయబడింది. జ్ఞాన ప్రధాన సంప్రదాయ అగ్రగణ్యునిగా మహబూబ్ సుభానిగా భావించి, వారు దత్తాత్రేయుని వలె స్మర్తృ

గామి అని ముస్లిం మతస్థుల భావన. హిందువులు ప్రభువును దత్త అవతారంగా భావిస్తారు. అందువల్ల గ్యారవి సందర్భంగా వేలమంది ముస్లింలు ప్రభు దర్శనానికి వచ్చి ఇక్కడ ఒక దగ్గర చేరుతారు. ఫకీరులకు, యాచక వృత్తిలో ఉన్నవారికి సంతోషపడేంత ద్రవ్యం ప్రభువు ఇచ్చేవారు. దానిని ఖైరాత్ అనేవారు. ఈ ఖైరాత్ గ్యారవి కంటే ఒకటి రెండు రోజుల ముందు జరిగేది. ఈ సమయంలో ప్రభు దర్బార్‌లో గాదిపై కూర్చొని లోపలికి వచ్చే ఫకీరులకు గాదికింద చేతినిపెట్టి పిడికిలిలో ఎంత ద్రవ్యం వస్తే అంత వారికి ఇచ్చే వారు. వేలమంది ఫకీరులు వచ్చినా ప్రభు గాది క్రింది నుండి ద్రవ్యం చేతితో తీస్తూ ఆపకుండా ఇస్తూనే ఉండేవారు. ఫకీరులు ఆశించినంత వారికి సరిపోయేటట్లు ఇవ్వడం వల్ల ఎవరూ అసంతృప్తి పడేవారు కాదు. ఇలా గ్యారవి యొక్క ఖైరాత్ ఒక్కోసారి రాత్రి పన్నెండు గంటల వరకు అఖండంగా జరిగేది. ఒక్కోసారి ఇంతకంటే ఎక్కువ సమయం కూడా నడిచిందని ఇతర చరిత్రకారులు వ్రాశారు.

మహబూబ్‌సుభాని యొక్క గ్యారవి చేయడానికి ప్రభువుకి ప్రేరణ కలిగించిన వారు మహ్మద్‌ను పూజనీయులుగా భావించే ఖాదరీ సత్పురుషులు అని హైదరాబాద్ నిజామ్ రాజ్య ప్రధానమంత్రి రాజా కిషన్ ప్రసాద్ బహదూర్ ఒక గ్రంథంలో వ్రాశారు. ఇతను ఒక శ్రేష్ఠ పురుషుడు. వారి కృపతో స్థితప్రజ్ఞుడిని చేసి దృశ్య ప్రాపంచిక తేడా లేకుండా ఆత్మచింతన తో వారి మనసును పారదర్శకం చేశాడు. ఈ శ్రేష్ఠపురుషుడు కాదరియ పంథ పీఠాన్ని నడిపించేవారు. ఆయన తన హితైషి మరియు సన్మార్గదర్శి అయిన శిష్యుడికి (ప్రభువుకు) ఇలా ఉపదేశం చేసారు. 'ఉత్తమమైన సరుకు ఏ దుకాణం నుండి తీసుకున్నా పరవాలేదు. హజరత్ మహబూబ్ సుభానీ యొక్క సేవ చేయడం తమ భాగ్యంగా భావించాలి'. గ్యారవి చేస్తూ ఉండాలి. సర్ మహరాజ్ బహదూర్ వారికి ఈ అద్భుతమైన సంఘటన ఎలా తెలిసిందో అని మాకు ఆశ్చర్యం వేసింది. ఆయన అనుసరించే ఈ విధానం సర్వధర్మగ్రంథం అభ్యసించినట్లుగా కనిపించదు. ముసల్మాను ధర్మ పరిశీలన ఆయన ఎలా చేశారో అలాగే మన ఆర్య సంస్కృతి లేదా ఆర్య ధర్మగ్రంథం పరిశీలన చేసి ఉండవచ్చు. పార్సి మరియు అరబ్బి భాషలతో పరిచయం ఎలా ఉందో అలా సంస్కృతి పరిజ్ఞానం ఉంటే మన గ్రంథ భండారం యొక్క మహత్యం ఆయనకు తెలిసేది. ' ఉత్తమ్ మాల్ కౌన్‌త్యాహి దుకాణాతున్ ఘ్యావా '. మంచి సామాను ఏ దుకాణంలో ఉన్నా తీసుకోవాలి. ఈ నియమంతో జ్ఞానం దొరికే సాధనంగా

ప్రాచీన కాలంనుండి మన పవిత్ర గ్రంథంలో విశ్వవ్యాప్త జ్ఞానభండారం నిక్షిప్తమై ఉందో దానిని ఒకక్షణం ఆలోచించి చూస్తే ప్రభు సంప్రదాయం చాలా పురాతనమైనదిగా అనిపిస్తుంది. ప్రభు చరిత్ర బాల్య వయస్సు నుండి సమాధి అయ్యే వరకు సూక్ష్మంగా పరిశీలిస్తే, మూర్తివంతమైన జ్ఞానానికి పరమ పవిత్రమైన శ్రేష్ఠత్వం కలుగుతుందనడంలో ఏ విధమైన సందేహము లేదు. హిందు, ముస్లిం, సిఖ్, జైన్, లింగాయత్, బౌద్ధ, క్రీస్తు ఇలా అనేక ధర్మగ్రంథాలలోని సర్వోత్తమమైన విషయాలను గ్రహించి తన అనుయాయులకు ఉన్నతమైన స్థానాన్ని కల్పించాలనే ఉద్దేశంతో సకల మత స్థాపిత సంప్రదాయమును స్థాపించారు. 'ఉత్తమ్ మాల్ కొన్‌తాహి దుకాణాంతున్ గ్యావి' ఈ తత్వం భాగవతంలో కూడా చెప్పబడింది. ఇది అవధూత పలికిన వాక్యం అనవచ్చు. భాగవత గ్రంథం వ్రాసినప్పుడు ముస్లిం ధర్మమే లేదు. ఉత్తమ సరకు ఏ దుకాణం నుండైనా తీసుకోవచ్చు. దీనికంటే వ్యాపక తత్వం 'అణుభ్యశ్చ మహద్భ్యశ్చ సర్వేభ్యః కుశలో నరః। సర్వతః సారమాదద్యాత్ పుష్పేభ్య ఇవ షట్పదః।' ఈ శ్లోకం ప్రత్యక్షంగా అవధూతుని ముఖం నుండి వెలువడిందని భాగవతం చెపుతుంది.

ముసల్మాను ధర్మాన్ని అభిమానించే వ్యక్తి నుండి మహారాజా బహదూర్‌కు ఈ విషయం తెలిసి ఉండవచ్చు. ఆయన వ్రాసిన పుస్తకం ప్రసిద్ధమై చాలా రోజులు అయింది.

ప్రభువుని ఉదారమతవాది ముస్లింలు మహబూబ్‌సుభానిగా భావిస్తారు. ముసల్మాను సమాజానికి వారి ధర్మ ప్రకారంగా ప్రభు ఆరాధన చేయడం సులభమవ్వాలని ప్రభు మాణిక్‌నగర్‌కి ఉత్తరాన ఛల్లా కట్టబడిందని ఇంతకుముందు తెలియ చేయడం జరిగింది. ఈ ఛల్లాలో పెట్టడానికి ప్రభు ముందుగా తన తల పాగా ఇచ్చారు. వారు దానిని పెట్టి దానిపై ఛత్తు వేశారని అందరికి తెలుసు. ముస్లిం ధర్మానికి అనుగుణంగా అయ్యే ఉత్సవాలు, సమారంభాలు ఈ ఛల్లా దగ్గరే జరుగుతాయి. ముస్లింల కోసం ప్రభు ముస్లిం అయ్యారు. దీంట్లో ఆయన సర్వవ్యాపక దృష్టి కనిపిస్తుంది కదా?

॥ శ్రీ దత్తాత్రేయార్పణమస్తు ॥ ॥ శ్రీ గురు మాణికార్పణమస్తు ॥

# ఆరవరోజు పారాయణము

## శిష్యబృందము

### 63. బప్పాచార్యులు

ప్రభు యొక్క శిష్యగణ సముదాయం చాలా పెద్దదిగా ఉండేది. వాళ్లందరి గురించి వ్రాయడం అసాధ్యం. కొంతమంది ప్రముఖ శిష్యుల గురించి మాత్రం ఇక్కడ తెలియజేస్తున్నాము. ఇంతకు ముందు అధ్యాయాలలో సందర్భోచితంగా శిష్యులలో చాలా మంది గురించి తెలియజేయబడింది. వారితో పాటు ఇంకా ఇతర శిష్యుల గురించిన వివరణ ఈ అధ్యాయంలో ఇవ్వబడింది. అందరు శిష్యులలో అత్యంత శ్రద్ధగా పని చేసినవారు బప్పాచార్యులనే చెప్పుకోవచ్చు. ఈయన కళ్యాణ్‌లో నివసించేవారు. వీరి వంశంలోని వారందరూ పేరుపొందిన విద్వాంసులు. వీరి తండ్రి కళ్యాణ్‌లో ఆబాచార్యులనే పేరుతో అత్యంత కీర్తిగడించిన విద్వాన్ బ్రాహ్మణులై ఆ కాలంలో ప్రజలకు పూజనీయులుగా ఉండేవారు. ఆబాచార్యులు ప్రభువుపై అత్యంత భక్తితో ఉండి పుత్రప్రేమను చూపించేవారు. ప్రభు వద్ద ఉన్న మహత్తర సామర్థ్యం ఆయనకు తెలుసు. తాము ఉపాసన చేసే శ్రీ వెంకటేశుడు ప్రభువులో ఉన్నారనే అనుభవం ఆయనకు కలిగింది. అందుకని ప్రభువుకు సమవయస్కులైన తన ఏకైక పుత్రుడు బప్పాచార్యుని ఎల్లప్పుడూ ప్రభువద్ద ఉండడానికి ఆజ్ఞాపించారు. అందుకని

బప్పాచార్యుడు ప్రభుసన్నిధిలో ఎప్పుడూ ఉండేవారు. బప్పాచార్యులు రెండు శాస్త్రాల అధ్యయనం చేసి వాటిలో ప్రావీణ్యులై ఉండిరి. ఎప్పుడూ నిస్వార్థంగా ఉండడం వల్ల ఆయనపై అందరికి గౌరవం ఉండేది.

దాదామహరాజ్ మరియు తాత్యా మహరాజుల వారు దేహం విడిచిన తరువాత సంస్థానము యొక్క పూర్తి కార్యభారము బప్పాచార్యులు వహించి దానిని ఆయన అత్యంత చాతుర్యంతో నడిపించి కీర్తి తెచ్చారు. ప్రభు సన్నిధిలో ఉండే అత్యంత విశ్వాస పాత్రులైన శిష్యులలో ఈయన అగ్రగణ్యుడు. ప్రభుసమాధి తరువాత అత్యంత సంకట పరిస్థితుల వల్ల సంస్థానములో కలిగే సమస్యలను బుద్ధికుశలతతో తప్పించి పరిస్థితులను చక్కదిద్దారనడంలో ఎలాంటి సంశయము లేదు. ఈయన లాగే ఈయన కొడుకు అత్యంత విద్వాంసులు అయినారు. బప్పాచార్యులు 'మాణిక్య ప్రభాకర్' అనే పేరుగల సంస్కృత గ్రంథములో ప్రభు లీలలను గ్రంథస్థము చేశారు. ఆయన తన కూతురును మార్తండ మాణిక్ ప్రభువులకు ఇవ్వడం వల్ల సహజంగానే ప్రభు వంశము యొక్క ఆప్తవర్గములో వారిగా లెక్కించబడుతారు.

## 64. నారాయణ్ దీక్షిత్

బప్పాచార్యుల వలె ఎల్లప్పుడూ ప్రభుసన్నిధిలో నివసించినవారు నారాయణ దీక్షితులు. హాళిఖేడ్ బాలచంద్ర దీక్షితుల పుత్రుడు. బాలచంద్ర దీక్షితులకు సంబంధించిన విషయాలు ఇంతకు ముందు భాగంలో చెప్పడం జరిగింది. ప్రభు ప్రేమకు ఆకర్షితులై ప్రభుసన్నిధి తీయదనం తనకు లభించడం వల్ల, తండ్రి ప్రభు సేవ చేయడానికి ఆజ్ఞాపించారు. నారప్ప దీక్షిత్ ప్రభు సన్నిధిలో ఉన్నప్పుడు అక్కడ బాలచంద్ర దీక్షితుల అంత్యకాలం సమీపించిన సమయంలో పుత్రుని స్మరణకు ముందు ప్రభు యొక్క స్మరణ కలిగింది. ప్రభు అంతర్ జ్ఞానంతో ఇది తెలుసుకొని నారప్పకు వెంటనే హాళిఖేడ్‌కు వెళ్లాల్సిందిగా ఆజ్ఞాపించారు. ప్రభు ఆజ్ఞానుసారంగా హాళిఖేడ్‌కి వెళ్లి తండ్రిని కలిశాడు. కాని 'ప్రభు ఎక్కడ?' అని తండ్రి ప్రశ్నించారు. అప్పుడు నారప్ప సంశయంలో పడ్డాడు. ప్రభుని విడిచి ఎలా వచ్చావు? అని దీక్షితులు ప్రభువుని

గురించి అడిగారు. ఆయన ప్రభువుని ప్రార్థించారు. అప్పుడు అగ్నికుండము నుండి అగ్నిజ్వాలతో పాటు ప్రభు బయటకు వచ్చి దీక్షితులను కలిశారని ఒక చరిత్రకారుడు వ్రాశారు. అంత్యకాలంలో ప్రభువుతో కలిసే భాగ్యం కలిగిందని దీక్షితులు సమాధానపడిన తరువాత ప్రణవోచ్చారణ చేసి దేహాన్ని విడిచారు. తరువాత నారాయణ దీక్షితులు చివరివరకు ప్రభువద్దనే ఉన్నారు. బాలచంద్ర దీక్షితుల సోదరుడైన యజ్ఞేశ్వర దీక్షితులతో ప్రభు యజ్ఞం చేయించి ఆ యింటి యొక్క కీర్తిని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లారు. ఇది పాఠకులకు తెలుసు. నారాయణ్ దీక్షిత్ కర్మ మార్గంలో (వైదిక నిర్వహణ) వెళ్లేవారు. సంస్థానము యొక్క ఇతర కార్యభారాన్ని ఆయన లక్ష్యపెట్టలేదు. అయినా కూడా ప్రభు సేవ చాలా ఉన్నతంగా చేశారు. ఇప్పటికీ వృద్ధులు ఆయన పేరు గుర్తు చేసుకుంటూ ఉంటారు.

## 64. చిమణ్యా బ్రహ్మచారి

శిష్యవర్గంలో చిమణ్యా ప్రథమ శిష్యుడు. ఆయన అత్యంత యోగ్యత కలవారై ఉండిరి. అంబిలకుండము నుండి ప్రభు సహవాసము చేయడానికి నిశ్చయించుకొని చివరివరకు ప్రభువును విడువలేదు. కొందరు చరిత్రకారులు చిమణ్యా కళ్యాణ్‌లో నివసించేవారని చెపుతారు. వారు అత్యంత బీదవారు. ప్రభు చిమణ్యాకు ఉన్న ద్రవ్య సంపాదన యొక్క ఆశ క్రమంగా తగ్గించి మంచి మార్గంలో నడిపించారు. దత్తుని జోళికోసం తిరిగే మొదటి గౌరవం ప్రభు ముందుగా ఇతనికే ఇచ్చారు. మాణిక్‌నగర్‌కు రావడానికి పూర్వమే జోళి ఇవ్వబడింది. దానిని ఆయన నిష్ఠతో చేసేవారు. ప్రభువుతో ఆయన అత్యంత ప్రేమతో, గారాబంతో వ్యవహరించేవారు. ఆయనకు చాలా దుర్గుణాలు ఉండేవి. కాని ప్రభువుతో మాత్రం నిజం చెప్పే సద్గుణం మాత్రం ఉండేది. ఈ విషయం ప్రభు కూడా ఎప్పుడూ అనే వారు. బ్రహ్మచారి అయినా కూడా స్త్రీ విషయంలో మోహం అనివార్యంగా ఉండేది. అలాంటి సందర్భంలో కూడా ప్రభువద్ద సత్యం చెప్పడానికి భయపడేవారుకాదు. ఒక చరిత్రకారులు ఇలా వ్రాశారు. చిమణ్యా చనిపోయిన తరువాత పిశాచంగా సంగములోని చెట్టుపై ఉండి, కొన్ని రోజుల తరువాత ప్రభు సంగమము వద్దకు వెళ్లినప్పుడు ప్రభు దర్శనముతో ముక్తుడై

దివ్యలోకాలకు వెళ్లాడు. ప్రభు స్పర్శ అవగానే సంగమములోని మామిడిచెట్లు అనుకోకుండా కాలిపోయిన సంఘటన చాలామంది చూశారు. మరియు శివదూతలు పెద్ద సన్మానంతో చిమణ్యాను విమానంలో ప్రభు వద్దకు తీసుకువచ్చారని అక్కడ ఉన్న భక్తునికి కనిపించిందని ఆయన ఈ సంఘటన అందరికి తెలియజేశారని అంటారు.

## 66. గోపాల్ బువా

గోపాల్ బువా బ్రహ్మచారి. ఈయన రేకులిగి నివాసి. వీరి తండ్రికి బక్కప్రభువుపై అపారమైన భక్తి ఉండేది. కరకనల్లి అరణ్యంలో బక్కప్రభు నివసించేవారు. జనం ఆయనను శంకరుని అవతారంగా భావించేవారు. ప్రభు ఆ బక్కప్రభువుల అవతారమని గోపాల్బువా తండ్రి భావించేవారు. ప్రభు పర్యటనలో రేకులిగిలోని గోపాల్బువా ఇంటికి వచ్చినప్పుడు గోపాల్ బువా తండ్రి ప్రభువును బక్కప్రభువుగా భావించి పూజ చేశారు. బక్కప్రభు వద్ద రెండు విశ్వాస పాత్రమైన కుక్కలు ఉండేవి. అవే తన కడుపులో పుట్టాయని గోపాల్బువా తండ్రి విశ్వసించేవారు. అందుకని ప్రభు గోపాలుని తనకు ఇవ్వు అనగానే చాలా ఆనందంతో గోపాలుని ప్రభువుకి ఇచ్చారు. గోపాల్ బువా వర్ణం నల్లగా ఉండి, శరీరం చాలా లావుగా ఉండేది. ప్రభు వద్దకు వచ్చిన తరువాత ఆయన అత్యంత భక్తితో ప్రభుసేవ చేశారు. తన ప్రాణాన్ని లక్ష్య పెట్టకుండా ఎల్లప్పుడూ ప్రభుసేవలో ఉండేవారు. ఈయన ఆజన్మ బ్రహ్మచారియై ఉండిరి. ఆయన తండ్రి సోదరుని వంశస్థులు రేకులిగిలో ఇప్పటికీ ఉన్నారు. వారంతా కూడా ప్రభుభక్తి పారాయణులై ఉన్నారు.

## 67. రామ్భావు లంగోటీ

ఈ బ్రహ్మచారి దినమంతా లంగోటీ వేసుకొని తిరిగేవారు. అందుకని ఈయన పేరులో లంగోటి అని స్థిరపడి పోయింది. ఈయన ప్రభు మహారాజ్ మాణిక్నగర్లో ఉన్నప్పుడే వచ్చారు. ఈయన ఎక్కువగా తాత్యామహరాజుల

వారిని అభిమానించేవారు. వీరి కుటుంబం వ్యవసాయంపై నడిచేది. తాత్యా మహరాజుల తరువాత ఆయన ఇద్దరు పుత్రులను చూసుకొనే పని కూడా రాంభావు పైనే ఉండేది. ఈయన దీర్ఘాయుష్కులై ఉండిరి. కనుక ఆయన నోటినుండి ప్రభు చరిత్ర వినే భాగ్యం చాలా మందికి కలిగింది. టోల్ అనే చరిత్రకారుడు వ్రాసిన ప్రభు చరిత్ర వీరు చెప్పిన విషయాల ఆధారంగానే వ్రాయబడింది. నరహరికృత (అముద్రితమైన) చరిత్ర కూడా ఈయన సహాయంతోనే తయారయింది. ఇంట్లోని చిన్న పిల్లలను వీరు గారాబం చేసేవారు. శ్రీమార్తండ మాణిక్ ప్రభు యొక్క ఇద్దరు పుత్రులకు బాల్యంలో ఈయన చాలా సేవ చేశారు. చాలావరకు చిన్నపిల్లలందరిని వీరే చూశారనడంలో ఏ సంశయమూలేదు. ఇంట్లోని చిన్న పిల్లలందరికి లంగోటిరామ కావలసి వచ్చేది. మాణిక్‌నగర్‌కి వచ్చే గోసావి, బైరాగులను పరామర్శ చేసేవారు. వాళ్లకు కావలసిన సౌకర్యాలు కలిగించేవారు. ప్రభు చరిత్రలో ఎన్నో కథలు ఈ రచయితకు వారినుండే తెలిశాయి. ఆయన ప్రభు వంశంలోని పిల్లల బాగోగులు చూస్తూ ప్రభుసేవలోజీవితం గడిపి చివరికి ఇక్కడే తన పవిత్ర దేహాన్ని విడిచారు.

## 68. దయాళ్ దాస్

దయాళ్ దాస్ అనే ఒక శ్రీమంతుడైన వ్యాపారి ఉండిరి. మద్రాస్‌లో ఈయనకు పెద్దవ్యాపారం ఉండేది. ఈయన భాటియా జాతీయుడు. భాటే జాతీయుల స్వభావానికి అనుగుణంగా పెద్ద వ్యాపారం చేసి చాలా ధనం సంపాదించి ఉండెను. వృద్ధాప్యంలో కొంత కాలం తీర్థాటన చేసిన తరువాత ప్రభు కీర్తి విని ప్రభు దర్శనానికి మాణిక్‌నగర్‌కు వచ్చాడు. ఇక్కడికి వచ్చిన తరువాత ప్రభువు యొక్క లీలలు చూసి విస్మయం చెందాడు. ప్రభువులో సాక్షాత్ ఈశ్వరుడే ఉన్నారని నమ్మాడు. కానీ, తనకు రామరూపం కనిపించాలని ఆయన ప్రభువుకి విన్నవించుకున్నాడు. ప్రభు అప్పుడు ఇలా చెప్పారు. బాబా, రాముని రూపం కనిపించడం చాలా కష్టం. ఆయనను చూడాలనుకుంటే మన సర్వస్వాన్ని విడిచిపెట్టాల్సి వస్తుంది. నీ వంటి ధనం వెంటపడే మనుష్యులు ఈ దేవ ధర్మం వెంట పడకపోతేనే మంచిది. ఇది చాలా చెడ్డది అని చెప్పినా వినక పోతే ఇంటికి వెళ్లి భార్యా పిల్లల ఆలోచన ఏమిటో తెలుసుకోమని చెప్పి

పంపించారు. అలాగే ఆయన వెళ్లి ప్రాపంచిక వ్యవహారాలను పుత్రులకు అప్పగించి భార్యను తీసుకొని వచ్చి ఇక్కడ ఉండిపోయారు. ఆయన దృఢ నిశ్చయం చూసి ప్రభు ఆయనకు రామ రూపంలో కనిపించి ఆయన జన్మ పావనం చేసారు. అప్పుడు సంతృప్తి నిండిన మనస్సుతో ప్రభు పూజ చేసి ప్రభు కూర్చున్న గాది క్రింద ఒక లక్ష ఇరవై వేల రూపాయలు ఉంచారని అంటారు. తరువాత ఆయన ప్రభు సంస్థానములోఖజానాను సంరక్షించే ఖజీన్‌దార్ అయ్యారు. తన వద్ద ఉన్న సర్వసం ఖర్చు చేసి ప్రభు క్షేత్రంలో దేహం విడిచారు. ఆయన భార్య కూడా బతికినంతకాలం సంస్థానంలో ఉండి ప్రభు సేవ చేశారు. ఈ సాత్వికమైన మనస్సుకల ఈమెను మూల మరాఠీ గ్రంథ రచయిత కూడా చూశారు. ప్రభు వంశంలోని వారిపై వీరికి చాలా ప్రేమ ఉండేది.

## 69. గిరిరావ్ చౌధరి

మాణిక్ నగర్‌లోని గృహాల నిర్మాణ పనిని గిరిరావ్ చూసేవారు. ప్రభు వాడ, ఆశ్రిత జనం కోసం తయారు చేసిన చిన్న చిన్న గృహాలు ఈయన అధ్వర్యంలోనే కట్టబడ్డాయి. గిరిరావ్ కళ్యాణ్‌కి చెందిన వారై అక్కడ నివసిస్తూ చౌధరి వృత్తి చేసేవారు. ప్రభువు ఈయనకు సమవయస్కులై ఉండడం వల్ల ప్రభు సామర్థ్యమును అనుభవంతో తెలుసుకున్నారు. అందుకని ప్రభు నివాసము మాణిక్‌నగర్‌లో స్థిరమవగానే ఇక్కడికి వచ్చి ఉండిపోయారు. తరువాత మరణించే వరకు ఇక్కడే ఉండి ప్రభు సేవలో తన జీవితాన్ని ధార పోశారు. ఇప్పటికి ఈయన మనమడు మాణిక్‌నగర్‌లోనే ఉన్నారు.

## 70. రామచంద్రబువా నాసిక్‌కర్

రామచంద్ర బువా ముందుగా మాణిక్‌నగర్‌కి వచ్చినప్పుడు నాసిక్‌కర్ పేరుతో పిలవబడ్డారు. ఇక్కడనుండి వెళ్లిన తరువాత సోలాపూర్‌లో నివసించడం వల్ల సోలాపూర్‌కర్ అయ్యారు. ఈయన ప్రభు సన్నిధిలో కొంతకాలం పని

చేశారు. ఈయన ప్రభు చరిత్ర పద్య రూపంలో వ్రాశారు. అలాగే పుస్తక రూపంలో కూడా ఒక చరిత్ర వీరి పేరుతో ప్రసిద్ధమైనది. దాంట్లో తాము మాణిక్‌నగర్‌కి ఎలా వచ్చామో తెలియజేస్తూ తమ వంశంలో జరిగిన సంఘటనలు వ్రాశారు. ఈయన పూర్వీకులు నాసిక్ దగ్గరలోని త్రయంబకేశ్వర్‌లో ఉండేవారు. యజుర్వేదంలోని మాధ్యందిన శాఖకు చెందిన ఈ కుటుంబం వేదశాస్త్ర అధ్యయనం చేశారు. ఈయన పూర్వజులు పది తరాల నుండి దత్త ఉపాసన చేసేవారు. అందువల్ల ఈయన కూడా దత్త ఉపాసకులై ఉండిరి.

రామచంద్రబువా గురువు బాబాదీక్షిత్ హర్‌డీకర్ తమ సమాధి సమయంలో ఆజ్ఞాపించారని చార్‌ధామ్ యాత్ర చేయడానికి బయలు దేరారు. మూడు ధామాల యాత్ర చేసిన తరువాత రామేశ్వరం వెళ్లడానికి సోలాపూర్‌కు వచ్చారు. అక్కడ ప్రభు గురించి విన్నారు. ముందు విషయాలు వారి మాటల్లోనే క్రింద ఇస్తున్నాము.

''సోలాపూర్‌లో శుభ్రభోవుల మఠంలో విడిది చేశాము. అక్కడ నా భార్యకు అనారోగ్యం కలిగింది. అందుకని అక్కడ బాబాగారు ఔషధాలు ఇచ్చారు. మఠంలో మోర్భట పురాణం నడిచేది. అది నేను వింటూ కూర్చునేవాణ్ణి. ఒకరోజు పురాణం అయిపోయిన తరువాత మఠాధిపతితో మాట్లాడుతుండగా ప్రభు కీర్తి వారి ద్వారా తెలిసింది. రామేశ్వరానికి వెళ్లే దారి లోనే ప్రభు ఉన్నారు. అంటే మార్గంలో ఆయనను దర్శించుకొని తరువాత రామేశ్వరానికి వెళ్లాలని నిశ్చయించుకున్నాను.

తరువాత భార్య ఆరోగ్యం కొంచెం బాగయిన తరువాత సోలాపూర్ నుండి రామేశ్వరానికి వెళ్లాలని అనుకొని అద్దెకు ఒక బండి తీసుకొని దాంట్లో భార్య సీతాబాయిని కూర్చోబెట్టి ఒక బ్రాహ్మణ నౌకరును కూడా బండిలో కూర్చోబెట్టి గంగాజలం తలపై పెట్టుకొని నడుస్తూ బయలుదేరాము. నలదుర్గ దాటిన తరువాత ఉమ్మర్గ గ్రామం దగ్గర అరణ్యంలోనికి వచ్చాము. ఉమ్మర్గ ఇంకా రెండు కోసుల దూరం ఉండగా అనుకోకుండా మబ్బులు క్రమ్మి ప్రళయం వచ్చినట్లుగా పెద్ద ధారలతో భూమి ఈ రోజే జలమయమవుతుందన్నట్లుగా వర్షం కురవసాగింది. మేము బండి నడిపే వాడితో పాటు ఐదుగురం ఉన్నాము.

అందరం తడిసిపోయాం. నేల అంతా బురదమయమైంది. మేము అడవిలో చిక్కుకుపోయాం.

ముందు వెనుక రెండు కోసుల వరకు గ్రామం లేదు. అప్పుడు చీకటిపడింది. కొంతసేపటికి వచ్చిన చల్లని గాలికి నా భార్యకి మళ్లీ ఆరోగ్యం వికటించింది. ప్రాణాలు పోతాయేమో అన్నంత భయం వేసింది. అందరం కూర్చొని మనస్సులోనే శ్రీ ప్రభువుని ప్రార్థిస్తూ ఆయనను పిలుస్తూ ఉండిపోయాము. ప్రభువుకి నేను ఇలా విన్నవించుకున్నాను. నీవు నడుస్తూ మాట్లాడే పరమేశ్వరుడివని తెలిసి దర్శనానికి వస్తుండగా మార్గంలో ఇదేమి కష్టం. నీవే కనికరించి ఈ సంకట స్థితి నుండి నా భార్యను రక్షించు. ఇలా అనేక రకాలుగా ప్రార్థిస్తూ మొక్కు కూడా మొక్కుకున్నాను. అప్పుడు ప్రభు మా మొక్కుకు కనికరించారు. కొద్దిసేపట్లో వర్షం నిలిచి చంద్రోదయమయింది. అంతేకాక బండిలో కూర్చున్న భార్య ఆరోగ్యం కూడా నయమయింది. తరువాత సూర్యోదయం కూడా అయింది. అప్పుడు మాకు చాలా ఆనందం కలిగింది. మేము మా బండితో రెండు కోసులు నడిచి ఊరికి చేరుకున్నాము. అక్కడ ఆగి బట్టలు ఎండిన తరువాత ప్రభువుకు చేసిన మొదటి మొక్కు ఐదుగురు బ్రాహ్మణులకు, సువాసినికి భోజనం పెట్టి, బయలుదేరి తొందరగానే మాణిక్‌నగర్‌కి చేరుకున్నాము.

అక్కడ ఉండడానికి స్థలం దొరకలేదు. దత్తాత్రేయుల పక్కన ఖాళీస్థలం దొరికితే అక్కడే దిగి, సంగమంలో స్నానం చేసుకొని ప్రభు దర్శనానికి వెళ్లడానికి తయారయ్యాము. దర్శనము ఎప్పుడు అవుతుందా అనిపించింది. పూజ సామాగ్రి, పెద్ద పూలహారము తీసుకొని భార్యాభర్తలం ప్రభు యొక్క ద్వారం దగ్గరకు వెళ్లి నిలబడ్డాం. అక్కడ లోపలికి వెళ్లడానికి దారి కనిపించలేదు. ద్వారంలో వేలమంది మనుష్యులు ఉన్నారు. దర్శనం అవుతుందన్న ఆశ కనిపించలేదు. మేము చాలాసేపటి వరకు ద్వారంలో నిలబడ్డాము. ఇంతలో అంతర్‌సాక్షి అయిన ప్రభువుకు మేము వచ్చిన విషయం తెలిసింది. ఆ సమయంలో ప్రభువుకు మాపై కరుణ కలిగిందనే చెప్పాలి. లేకపోతే మూడురోజులు నిలబడ్డా ప్రభు వద్దకు వెళ్ళగలిగేవాళ్లం కాదు. పదమ్‌సింగ్ అనే ద్వారపాలకునికి లోపలి నుండి నాసిక్‌కర్ భార్యభర్తలు ఇద్దరినీ లోపలికి

పంపించండని చెప్పి పంపారు. ఇలా లోపలి నుండి ఆజ్ఞ రాగానే మమ్మల్ని లోపలికి విడవాల్సి వచ్చింది. మేము ఇద్దరము లోపలికి వెళ్లి ప్రభు చరణాలపై తల పెట్టి నమస్కరించాం. మాకు కళ్ళ వెంట ఆనందాశ్రువులు రాసాగాయి. ఆ సమయంలో గంధం ఎక్కడ? ధూపదీపాలెక్కడ? పుష్పహారం మాత్రమే తీసుకున్నాం. హారం వేసుకోవడానికి తానైముందుకు వంగారు. మేమిద్దరం హారం మెడలో వేశాం. ఆ సమయంలో ప్రభు నన్ను అడిగారు. నీవు త్రయంబకేశ్వర్‌లోని పూర్ణానందుని మునిమనవడివి కదా? అచ్యుతానందుని మనవడివి, సదానందుని పుత్రుడివి కదా? అప్పుడు నాకు చాలా ఆశ్చర్యం వేసి, అవును అన్నాను. 'సోలాపూర్ నుండి మా దగ్గరికి వచ్చేటప్పుడు మార్గంలో మీకు సంకట పరిస్థితి కలిగింది కదా? కానీ, ఆ సందర్భాన్ని ఇక్కడ ఎవరి వద్ద ప్రస్తావించవద్దు అనిచెపితే, నేను ఒప్పుకున్నాను. ఒక గంట ప్రభువు సన్నిధిలో కూర్చున్న తరువాత ఇక మీరు మీ వసతి గృహానికి వెళ్ళండి. భండారుఖానాలో జోళీ ప్రసాదాన్ని తీసుకొని విశ్రమించండి. మేము రాత్రి కబురు చేస్తాము అప్పుడు మళ్ళీ రండి అని ప్రభువు చెప్పగానే మేము వసతి గృహానికి తిరిగి వచ్చాము.

వసతి గృహానికి రాగానే నా భార్య సామాను తీసి స్వయంపాకం తయారు చేసింది. ఇంతలో ప్రభు ఆజ్ఞతో మంచి సరుకులతో వంటకు కావలిసిన సామాగ్రి వచ్చింది. భోజనం చేసి ఆనందంగా విశ్రమించాము. రాత్రి ఒంటి గంటకు ప్రభు ఆజ్ఞతో ద్వారపాలకుడు వచ్చి మమ్మల్ని ప్రభు కుటీరానికి తీసుకువెళ్ళాడు. ఆ సమయంలో ప్రభు దర్శనం నిరాటంకంగా జరిగింది. చాలా సేపటి వరకు మాట్లాడుతూ కూర్చున్నప్పుడు ఇకముందు రామేశ్వరం వెళ్ళకుండా ఇక్కడే కాలక్షేపం చేయాల్సిందిగా ప్రభు ఆజ్ఞాపించారు. తరువాత వసతి గృహానికి వచ్చి పడుకున్నాను. అప్పుడు మనసులో సంశయం మొదలయింది. ప్రభు ఇక ముందు రామేశ్వరం వెళ్ళవద్దు ఇక్కడే ఉండాలని అంటున్నారు మరి గంగాజలాన్ని ఏం చేయాలి? అని ఆలోచిస్తూ ఉండగా నిద్ర పట్టింది. అప్పుడు కలలో ఒక వెలుగు గోసాయి రూపంలో సాక్షాత్ రామనాథుని మూర్తి వచ్చి త్రిశూలంతో పొడుస్తూ మేలుకొలిపి ఇలా అన్నారు. ఇక ముందు ఇక్కడికి (రామేశ్వరానికి) ఐదువందల కోసుల దూరం వచ్చే అవసరం లేదు. నీవు తెచ్చిన గంగాజలాన్ని మాణిక్ ప్రభుపై పోస్తే అది నాకే చేరుతుంది. కారణం

నేను, ప్రభువు ఒక్కటే. మెలకువ వచ్చిన తరువాత చూస్తే గోసాయి కనిపించలేదు. కానీ గంగాజలం గురించిన ఆలోచన దూరం అయింది. తరువాత ప్రభు దర్శనానికి వెళ్ళినపుడు 'మీరు గంగాజలాన్ని తీసుకొని రామేశ్వరానికి ఎప్పుడు వెళ్తారు అని అడిగారు. అప్పుడు నేను నడుస్తూ మాట్లాడుతూ ఉండే ప్రభు ఉన్న రామేశ్వరం విడిచి ఐదువందల కోసుల దూరంలో ఉన్న రామేశ్వరం వెతుకుతూ ఎందుకు వెళ్తాను? ప్రభు చరణాలే మాకు రామేశ్వరం అన్నాను.

''తరువాత రెండు రోజులకు ఏకాదశి ఉండెను. ఆ రోజు ప్రభువుపై గంగాజలం పోసే కార్యక్రమం వైభవంగా శివాలయంలో జరిగింది. వేలమంది బ్రాహ్మణులు అక్కడ చేరారు. వైదిక మంత్రాల ఘోషతో నాలుగు దిక్కులా ఆనందం నిండిపోయింది. పెద్ద పెద్ద అధికారులు శివాలయంలో ప్రభుతో అవభ్రుథ స్నానంలో పాలుపంచుకున్నారు. మిగతా వాళ్ళంతా బయట ఉండిరి. ప్రభు స్నానం సమయంలో శివాలయంలో బ్రాహ్మణులు వేదఘోష చేస్తూ ఉండిరి. ప్రభు స్నానం జరిగిన తరువాత ఎంతో మంది తీర్థంతో స్నానం చేశారు. వేల మంది ప్రక్షాళన చేసుకున్నారు. రెండోరోజు ద్వాదశి రోజు సహస్ర బ్రాహ్మణ భోజన ఏర్పాటు చేయబడి భోజనం చేసిన ప్రతి ఒక్కరికి దక్షిణ ఇవ్వడం జరిగింది. ఈ విధంగా కార్యక్రమం వైభవంగా సమాప్తమై మా నాల్గవ ధామం రామేశ్వర యాత్ర ప్రభుచరణాలలో సంపూర్ణమై, ప్రభు ఆజ్ఞతో వారి వద్దనే ఉండిపోయాను.''

ఇవన్నీ రామచంద్రబువా సోలాపూర్‌కర్ వ్రాసిన పుస్తకంలో స్వయంగా వారికి సంబంధించిన విషయాలు. ప్రభు సమాధి అయ్యేవరకు వీరు మాణిక్‌నగర్‌లోనే నివసించారు. తరువాత ప్రభు ఆజ్ఞతో సోలాపూర్‌కు వెళ్లి పోయారు. అక్కడ ప్రభు గాది స్థాపన చేసి మిగిలిన జీవితాన్ని ప్రభుసేవలో వినియోగించారు. ఆయన వ్రాసిన ప్రభు చరిత్ర పుస్తక రూపంలోకి పండిత్ అనే పేరుగల గృహస్థు తీసుకు వచ్చారు. ఆ పండితుడు ఈ పుస్తకాన్ని 1889 సంవత్సరంలో ప్రచురించారు. ఆ సమయంలో రామచంద్రబువాకు సంబంధించి ఆయన చాలా కొద్దిగా వివరణ ఇచ్చారు.

'ఈయన మాణిక్‌ప్రభువుకి ప్రియమైన శిష్యులై సత్పురుషులై ఉండిరి. ఈయన వయస్సు 85 సంవత్సరాలైనా ఇంద్రియాలు 25 సంవత్సరాల తరుణ వయస్సులో ఉన్నట్లుగా ఉండిరి. వీరు ఉత్తమ కవితలు రాసేవారు. ఇప్పటి వరకు పద్యరూపంలో 3-4 గ్రంథాలు, పద్యాలు, అభంగాలు, పాటలు, శ్లోకాలు, అష్టకాలు వేల సంఖ్యలో వ్రాశారు.'

## 71. లక్ష్మి నృసింహ శాస్త్రి

ప్రభు భక్తిలో మమేకమైన ఈ శాస్త్రి ఆంధ్రప్రాంతంలో నివసించేవారు. ప్రభు యొక్క కీర్తి మహారాష్ట్ర, కర్నాటకలోనే కాక ఆంధ్రలో కూడా వ్యాపించింది. లక్ష్మి నృసింహ శాస్త్రి ప్రభు కీర్తి విని మాణిక్‌నగర్‌కి వెళ్ళి ప్రభు దర్శనము అయిన తరువాత ఈయన వ్యవహారంలో మార్పు కలిగి ప్రియమైన భక్తులు అయ్యారు. అప్పటి నుండి ఆయన జీవనం ప్రభు చింతనలో నిమగ్నమై ఐహిక వ్యవహారంతో పారమార్థికతను సంపాదించారు. ఆంధ్రలో వీరు ప్రభు సంప్రదాయాన్ని ప్రచారం చేశారు. ఆయన శిష్యవర్గం పెరిగింది. అనుచరులలో సుబ్బయ్య అనే పేరుగల ఆయన తన మిగిలిన జీవితాన్ని మాణిక్ నగర్‌లో గడిపారు. ఆయన తపశ్చర్య ప్రచండమైనది. ఈయన దృఢనిశ్చయం గల మూర్తివంతమైన వ్యక్తి. సుబ్బయ్య మహరాజ్ అందరితో చాలా ప్రేమతో వ్యవహరించేవారు. వీరి జ్ఞానం మాకు చాలా సార్లు అనుభవమయింది. ఇప్పుడు ఆంధ్ర నుండి వేల మంది శిష్యులు రావడానికి కారణం వీరే. లక్ష్మి నృసింహ శాస్త్రిలాగే సుబ్బయ్య మహరాజ్ తమ ప్రాంతంలో ఎంతో కీర్తి సంపాదించారు.

సుబ్బయ్య కోరిక ప్రకారం, వీరు మాణిక్‌నగర్‌లో తమ ప్రాణాలు విడువడం వల్ల వారి దేహాన్ని మాణిక్‌నగర్‌లో ప్రభుమందిరానికి ఉత్తర దిశలో మామిడితోటలో సమాధి చేయబడి నిత్యపూజ కూడా చేయబడుతూంది. సమాధిపై గోడలతో గదులను నిర్మించడం వల్ల భక్తుల కోసం ధర్మశాలగా ఉపయోగపడింది. ఇక్కడ నీరు సమృద్ధిగా ఉండి చుట్టుప్రక్కల పచ్చని చెట్ల వల్ల ఆ ప్రదేశానికి రమణీయత చేకూరింది.

## 72. రామన్నపంత్ దుబుల్‌గుండి

రామన్నపంత్ తన పన్నెండు సంవత్సరాల వయస్సులో ప్రభు దర్శనానికి వెళ్లినప్పుడు ప్రభు దృష్టివీరి వైపుకు మళ్లింది. అప్పుడు ప్రభు నా దగ్గర ఉంటావా ? అని అడిగారు. ఋణానుబంధం ఉంటే అలాగే కానివ్వండి అని సమాధానం ఇచ్చాడు. తరువాత మళ్లీ మైలార్‌లో ప్రభు దర్శనం అయ్యింది. ఆ సమయంలో ప్రభువైపు మనస్సు లాగసాగింది. ఈయన ఎప్పుడూ ప్రభుపాదుకలను సంరక్షించేవారు. రామన్నపంత్ తండ్రి సోదరి సుందరాబాయి కూడా ప్రభు సేవలోనే గడప సాగింది. రామన్నపంత్ దుబుల్‌గుండికి కులకర్ణీలు. వీరి యుక్త వయస్సు చాలావరకు ప్రభు సన్నిధిలో గడిచింది. అందు వల్ల సర్కారు పనులపై వీరికి శ్రద్ధ ఉండేది కాదు. ఒకసారి తాలూకుదారుకు వీరిపై కోపం వచ్చి విచారించడానికి భాల్కికి తీసుకువెళ్లారు. ఆ సమయంలో తాలూకుదారు సర్వాధికారులై ఉండిరి. వీరిపై ఎలాంటి అర్జీ నడిచేది కాదు. రామన్నపంత్‌కి తన భవిష్యత్తు తెలిసి వచ్చింది. కానీ, నిరాశ పడకుండా ప్రభువును ప్రార్థించారు. రాత్రి ఆయనకు స్వప్నంలో 'తాము ఒక భయంకరమైన అరణ్యంలో ఉండగా వేలమంది వచ్చి శుభ్రపరచసాగారు. ఆ స్థలంలో ప్రభు దర్బార్ రామచంద్రుని దర్బార్‌వలె ఐశ్వర్యంతో నిండిపోయి ఉండడం చూసి రామన్నపంత్ ఆశ్చర్యపోయారు. ఇంతలో తాలూకుదారుని ముసుగు వేసి ప్రభు ముందు తెచ్చి నిలబెట్టారు. ఆయనతో పాటు దుబుల్‌గుండికి చెందిన వ్యక్తులు కూడా ఉన్నారు. ఇంతలో మెలుకువ వచ్చింది. మరునటి రోజు తాలూకుదారు ముందు నడుస్తుండగా హైదరాబాద్ నుండి స్వారీ చేస్తూ ఒకరు వచ్చారు. తాలూకుదారును హైదరాబాద్‌కు పిలిచారు. అలా పిలుపు రాగానే తాలూకుదారుకు హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చింది. ఈ విధంగా రామన్నపంత్‌కి వచ్చిన కష్టము అనాయాసంగా తొలిగిపోయింది. తరువాత తాలూకుదారును నవాబు తీసి వేసి ఆయన స్థలంలో విఠల్‌రావ్‌ను నియమించారు.

రామన్నపంత్ మాణిక్‌నగర్‌లో చాలా రోజులు ఉన్నారు. ఒకసారి ఒక దురాచరణ విషయంలో సంకట నివారణార్థం ప్రభుని స్మరిస్తే అది దూరమయింది. కానీ, మళ్లీ ఇలాంటి పనులు ఎప్పుడూ చేయవద్దని గట్టిగా

మందలించారు. ఆయన కూడా ప్రభు విషయంలో నిస్వార్థ సేవ చేస్తూ జీవితం గడిపారు. ఈయన గృహస్థులై ఉండిరి. వీరి వంశం ఇప్పటికీ దుబుల్‌గుండిలో నివసిస్తూ ప్రభునవరాత్రులు చేస్తూ సంప్రదాయాన్ని నడిపిస్తున్నారు.

## 73. శరణ సాధువు

శరణ అనే పేరుగల ఒక వైశ్య సాధువు ప్రభు భక్తులై ఉండిరి. ఆయన చిటుగుప్పలో ఉన్నప్పుడు ఒకసారి సంకట పరిస్థితి వచ్చింది. అతనిని ఒక దొంగతనం విషయంలో జైలులో వేశారు. వాస్తవంగా ఆయనకు ఆ దొంగతనంతో ఏ సంబంధము లేదు. కాని ఆ సాధువును ద్వేషించే కాశీనాథ్ పాప్‌డే అను పేరు గల మాంత్రికుడు రాజేశ్వర్‌కర్ నవాబ్‌కు చాడీలు చెప్పి సంకటంలో ఇరికించారు. కాశీనాథ్ మాంత్రికునికి ఆ నవాబ్‌పై చాలా నమ్మకం ఉండేది. కారణం వారు శిష్యులై ఉండిరి. నిరపరాధి అయిన శరణ్ జైల్లో నుండే ప్రభువును ప్రార్థించాడు.

అప్పుడు ప్రభు స్వయంగా చిటుగుప్పకు వెళ్లారు. మాణిక్‌నగర్‌లో నివసిస్తున్నప్పుడు ఈ ఘటన జరిగిందని కొందరు అంటారు. ఇంకొందరు మాణిక్‌నగర్ రావడానికి పూర్వం ప్రభు కొద్దికాలం అక్కడ ఉన్నప్పుడు ఈ ఘటన జరిగింది అంటారు. మాణిక్‌నగర్‌లో నివాసం ఏర్పరుచుకున్న తరువాత ప్రభు ఎక్కడికీ వెళ్లలేదు అని చాలా మంది అనేవారు. ప్రభు చిటుగుప్పకు స్వయంగా వెళ్లి రామ మందిరంలో దిగి నవాబుకు కబురు పంపించారు. శరణు నిరపరాధి అందుకని ఆయనను విడిచిపెట్టమని చెప్పారు. నవాబుకు మాంత్రికునితో ముందే విషయం (చెడ్డగా) తెలియడం వల్ల ప్రభు చెప్పిన దానిని నిర్లక్ష్యం చేశారు. శరణును విడిపించకుండా అక్కడి నుండి కదలకూడదని ప్రభు ఆలోచన. అందుకని అక్కడ ప్రభు మూడు రోజులు బస చేశారు. రాత్రి నవాబుకు స్వప్నంలో శరణుని విడవవలసిందిగా ఆజ్ఞ అయింది. ఆ ఆజ్ఞ ప్రకారంగా తాలూకుదారుకి ఆయన హుకం జారీ చేశారు. కానీ ఆ రోజు శరణుని విడవలేదు. ఇక్కడ నవాబుకి మళ్లీ స్వప్నంలో ఒక సాధువు కర్రతో కొడుతూఆయన్ను పడవేశారు. వెంటనే నవాబు భయపడి

మహమ్మద్ అనే తాలూకు దారుకు వెంటనే కబురు చేసి శరణ్‌సాధుని విడవవలసిందిగా ఆజ్ఞాపించారు. అప్పుడు తాలూకుదారు స్వయంగా చిడుగుప్పకు వచ్చి శరణును విడిచిపెట్టారు. మరియు ఆ మాంత్రికునికి మునుగువేసి, బేడీలు వేసి ఆయనను హైదరాబాద్ పంపించారు. శరణసాధువుకు వచ్చిన సంకట పరిస్థితిని ఈ విధంగా దూరం చేసి ప్రభు అఖండేశ్వరానికి వెళ్లారు.

## 74. రామకృష్ణపంత్ తహసిల్‌దార్

రామకృష్ణపంత్ తండ్రి శ్యామ్‌రావ్. ఈయన మంగళగి మొదలైన గ్రామాల శేక్‌దార్‌గా ఉండిరి. వీరు ప్రభువుపై చాలా భక్తితో ఉండేవారు. ప్రభు ఒకసారి మంగళగి తోటలో కూర్చుని ఉన్నప్పుడు శ్యామ్‌రావ్ కొడుకు రామకృష్ణపంత్ తండ్రితో పాటు ప్రభు దర్శనం చేసుకున్నారు. అప్పుడు చిన్న వారిగా ఉండిరి. ప్రభుతో పాటు ఎప్పుడూ వేల సట్కాలు (యోగదండములు) ఉండేవి. ఆ సమయంలో అవి ముందు బసచేసే హళిఖేడ్‌కు రవాణా అయ్యాయి. అప్పుడు రామకృష్ణపంత్ ప్రభువుని ఒక సటకా ఇవ్వవలసిందిగా అడిగారు. తమ ఇంట్లో సర్వారిష్టాలు నివారించుటకు భక్తులు ప్రభు వద్ద సటకా అడిగి తీసుకొని ఎప్పుడూ తమ పూజలో పెట్టుకునేవారు. పిల్లవాడు సటకా అడిగాడని శ్యామ్‌రావ్ రామకృష్ణపంత్‌ను కోపగించసాగారు. కానీ, ప్రభు కరుణించి పిల్లవానిని పక్కకు తీసుకొని వెళ్ళి జామచెట్టు కొమ్మ తీసుకొని సటకా చేయించి ఇచ్చారు. ఆ సటకా ఇప్పటికీ రామకృష్ణపంత్ వాళ్ల వంశీకులు పూజలో పెట్టి ఉంచడం వల్ల వారి వంశాభివృద్ధి జరిగింది. ఈ సటకాకు నిత్యపూజ జరగడంవల్ల రామకృష్ణపంత్‌కు ఉన్న విద్యార్హతతో ఒక చిన్న ఉద్యోగం దొరికింది. ఈయన తరువాత తహసిల్‌దార్‌గా కూడా అయ్యారు. హసనాబాద్, నారాయణఖేడ్ కు నానామీయా అనే ముసల్మాన్ తాలూకుదారుగా ఉండిరి. అయన వద్ద ముందుగా పదిహేను రూపాయలకు ఉద్యోగం లభించింది. ఉద్యోగానికి వెళ్లే ముందు రామకృష్ణపంత్ ప్రభు దర్శనానికి వచ్చారు. ప్రభు ప్రసాదం ఇచ్చేటప్పుడు ఖచ్చితంగా ఇలా చెప్పారు. ఎవరికీ అపకారం చేయకుండా ఎప్పుడూ మన శక్తివంచన లేకుండా ఉపకారం చేస్తూండు. బాలా! నీకు ముందు పెద్ద ఉద్యోగం

దొరుకుతుంది. ఎవరికీ చెడు మాత్రం చేయకు. ఈ ప్రభు వాక్యాలు జీవితాంతం వారి స్మృతిలో ఉండేవి. వృద్ధుడై పని చేయడానికి చేతకానంతవరకు వరకు చాలా చోట్ల తహసిల్‌దార్‌గా పని చేశారు. వీరి పనికి నవాబు సంతోషించి ఆయన పుత్రునికి కూడా తహసిల్‌దారు పని యిచ్చారు. ఈయన వంశీయులు ఇప్పుడు చిటుగుప్పలో ఉంటున్నారు.

## 75. విఠ్ఠల్‌రావ్ తేర్‌పల్లి

చాలా సామాన్య స్థితి నుండి తాలూకుదారయి చివరి వరకు ప్రభుసేవ భక్తితో చేసిన వారిలో ఇంకొక విఠ్ఠల్‌రావు ఈయన. ఈయన మారుపేరు తేర్‌పల్లి. ఈయన తండ్రి ధోండోపంత్. ఈయన అహ్మద్ నగర్‌కి చెందిన వారు కానీ, నౌకరీ కోసం నవాబ్‌పేట్ జాగిరిదార్ వద్దకు వచ్చి ఉన్నారు. తేర్‌పల్లికి చెందిన కన్యతో ధోండోపంత్‌కి వివాహం జరగడం వల్ల ఆయన ఇక్కడికి వచ్చారు. అప్పటి నుండి ఆయనకు తేర్‌పల్లి మారుపేరు (ఇంటిపేరు) అయింది. ధోండోపంత్‌కు ఇద్దరు కుమారులు. ఒకరు విఠ్ఠల్‌రావు ఇంకొకరు గోవింద్‌రావ్. ఇద్దరూ ఉద్యోగం కోసం హైదరాబాద్ వెళ్లారు. మహమ్మద్ మియా ఇలాఖాలో మహమ్మద్ సాహెబ్ తాలూకుదారు కచేరిలో విఠ్ఠల్‌రావ్‌కు ఉద్యోగం దొరికింది. తరువాత సర్కార్‌లో ఉద్యోగం దొరికింది. కానీ విఠ్ఠల్‌రావ్‌కు ప్రభువుపై భక్తి ఉండడం వల్ల విషయం ప్రభువుకు చెప్పారు. 'ఉన్న సగం రొట్టెను విడిచి పెట్టకు. దాంట్లోనే దత్తాత్రేయుడు యశస్సు కలిగిస్తారు' అని ప్రభు చెప్పారు. ప్రభు ఆజ్ఞ ప్రకారంగా సర్కార్‌లో వచ్చిన నౌకరి విడవకుండా పూర్వం చేసిన ప్రదేశంలోనే ఉండిపోయారు. ఆయనకు ముందుగా ముప్పై రూపాయల జీతం లభించేది. తరువాత ఆయన సమర్థత తెలిసి రుకుమొద్దీన్ ఖాగ్ తన మద్దతుదారునిగా చేసుకున్నారు. ఆ సమయంలో ఆయనకు జీతం 100 రూపాయలతో పాటు మేనాకూడా ఇచ్చారు. ఈయన తాలూకుదారుగా 25 సంవత్సరాలు పని చేశారు. ఈయన ప్రభు భక్తులలో అగ్రగణ్యులైరి. వీరు మరణించే వరకు ఐశ్వర్యవంతులై ఉండి చివరికి ప్రభువులో లీనమయ్యారు. మాణిక్‌నగర్‌కు ప్రతి సంవత్సరం వచ్చి వేల రూపాయలు దానధర్మాలు చేసేవారు. తన హయాంలో దత్తజయంతి పౌర్ణిమ యొక్క పూర్తి ఖర్చు

స్వయంగా వారే చేసేవారు. ఇహలోకంలో ఐశ్వర్యం పొంది ప్రభు కృపతో ఉత్తమలోక గతులై తన జన్మను సార్థకం చేసుకున్నారు.

## 76. రావ్‌జీబువా

గోపాల్‌రావ్‌జీ అనే యువకుడైన బ్రహ్మచారి ప్రభు సన్నిధికి వచ్చారు. ఇంతకు ముందు ఎక్కడ నివసించేవారో ఎవరికీ తెలియదు. కొల్హాపూర్ ప్రాంతంలోని ఒక గ్రామానికి చెందిన వారని అనుకుంటాం. ప్రభు దర్శనానికి గోపాల్ రావ్‌జీ వచ్చారు. వీరి పేరు చివరలో రావ్‌జీ అని పేరు ఉండడం వల్ల అది వారి ఇంటి పేరు అయి ఉండవచ్చని అందరూ ఆయను రావ్‌జీబువా అనేవారు. రావ్‌జీబువా యొక్క బుద్ధికౌశల్యం చూసి ప్రభు ఆయనకు సమర్థ రామదాసు విరచిత దాసబోధలోని కొన్ని ప్రకరణలు అర్థయుక్తంగా చెప్పారు. రావ్‌జీబువాకు దాసబోధ మనసుకు నచ్చి చివరి వరకు ఆ గ్రంథ పరిశీలన చేస్తూ ఉండిపోయారు. ముంబాయిలో ఉద్యోగం చేస్తున్న రఘునాథ్‌రావ్ నాయిక్ అనే పేరుగల ఒక గృహస్థు ప్రభు గురించి విని మాణిక్‌నగర్‌కు వచ్చారు. ప్రభుదర్శనం అయిన తరువాత ప్రభుచరణాల వైపు మనసు లాగి ప్రభుభక్తులయ్యారు. అక్కడ ఇంజనీరుగా మొదట రఘునాథ్ బువాకి 15 రూపాయల జీతం దొరికేది. కాని ప్రభు కృపతో వారి పనిలో నైపుణ్యం పెరిగి లక్షల రూపాయలు సంపాదించి ప్రభు సేవ చేశారు. ఒకసారి ఒక చోట భవంతి నిర్మించడానికి పునాదులు తీసి, పని జరుగుతున్నప్పుడు ఒక చిన్న దత్తుని మూర్తి దొరికింది. దానిని ప్రభువద్దకు తెచ్చి ఇచ్చారు. ప్రభు ఆ మూర్తిని తొడమీద కూర్చొపెట్టుకొని పేడా తినిపించారని ఆ వంశంలోని వారు చెపుతారు. ఈ మూర్తి ఇప్పటికీ రఘునాథ్‌రావ్‌జీ వంశంలోని వారి పూజలో ఉంది. ఈ యింటి వారు ఇప్పుడు ముంబాయిలో ఇతర ఆప్తుల సహాయంతో ప్రభు కార్యం సేవాతత్పరతతో చేస్తారు. ప్రభు ఆజ్ఞ ప్రకారంగా రావ్‌జీబువాను ముంబాయికి తీసుకొని వెళ్లారు. రావ్‌జీ బువా ముంబాయిలోమరణించేవరకు ఆయన ఇంట్లోనే ఉండేవారు. అక్కడ ఆయన కీర్తి సంపాదించి తమ శిష్యవర్గాన్ని ప్రభు సంప్రదాయంలో విలీనం చేశారు. రావ్‌జీ బువా వ్రాసిన వీలునామా ఆధారంగా మాణిక్‌రావ్ ములగావ్‌కర్ గారి ఇంట్లో ప్రతీ సంవత్సరం ప్రభు జయంతి

ఉత్సవం ముంబాయిలో జరుగుతుంది. రావ్‌జీ బువా వల్ల ప్రభు యొక్క సంప్రదాయం ముంబాయిలో ప్రథమంగా గుర్తింపు వచ్చి ఇప్పటి వరకు దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది.

## 77. చింతామణి బువా

ప్రభు భక్తులలో చింతామణిబువా ఒక పేరుగొన్న వర్గానికి చెందిన భక్తులు. ఈయన ఏ ప్రదేశానికి చెందినవారు అనే విషయం తెలియలేదు. వైరాగ్య స్థితిలో ఉండి సామర్థ్య సంపాదన చేసిన తరువాత ఈయన మాణిక్ నగర్ విడిచి పెట్టారు. రాయచూర్ నుండి సోలాపూర్ రైలుమార్గంలో స్టేషన్ ఉన్న అన్ని ప్రదేశాలలో వీరికి చాలా మంది భక్తులు ఉండేవారు. ఈయన ప్రభు నామ స్మరణ చేస్తూ ఎక్కడెక్కడో తిరిగేవారు. ఈయన ప్రవృత్తి చూసి చాలా మంది వీరి అనుగ్రహం పొందారు. వీరుఎక్కడి వారో, వీరికి సంబంధించిన విషయాలు ఏవీ ఎవరికీ తెలియలేదు ప్రభుసమాధి తరువాత ఈయన కొంత కాలం మాణిక్‌నగర్‌కు వచ్చి ఉన్నారు. అప్పుడు అద్దం, ముంత మరియు పొగత్రాగే చిన్న గొట్టం ఎప్పుడూ ఈయన వద్ద ఉండేవి. కానీ కోపం వస్తే ఆ మూడు వస్తువులను క్షణంలో ధ్వంసం చేసేవారు. ఇక్కడ ఉన్నప్పుడు ఈ వస్తువులకు కావలసిన డబ్బు సంస్థానం నుండి దొరికేది. ఈయన నుండి ఎవరికీ హాని జరిగేది కాదు. అందరితో అత్యంత ప్రేమతో వ్యవహరించేవారు. వీరి స్వభావం తెలిసిన తరువాత వీరి విషయంలో సహజంగానే పూజ్యభావం కలిగేది. ఆయన తన శిష్యగణాన్ని పెంచుకొని ప్రభు సంప్రదాయాన్ని వ్యాపింప చేశారు.

## 78. సంత్‌రామ్ దాదా గవండి

చింతామణిబువాలాగే బయట తిరుగుతూ శిష్యగణాన్ని వృద్ధి చేయడంలో సంత్‌రామ్‌దాదా అత్యంత మహత్తరమైన పని చేశారు. వీరి గురించి తెలిసిందేమిటంటే, ప్రభు సమాధి తరువాత సమాధి దేవాలయం కట్టే పని

మొదలయినప్పుడు ఆ పని చేయడానికి సంత్‌రామ్ నియమించబడ్డారు. దేవాలయం పని చేసే నాగోబా నాయక్ అనే ఆయనను సంత్‌రామ్ తీసుకొని వచ్చారు. సంత్‌రామ్‌కి జీతం ప్రతీ నెల 16 నుండి 17 రూపాయలు ఉండెను. సంత్‌రామ్ మరియు నాగోబానాయక్ దగ్గరి బంధువులై ఉండిరి. సంత్‌రామ్ పుత్రుడు కూడా ఆ సమయంలో ఇదే పనిలో ఉండెను. దేవాలయ పని నిమిత్తం సంత్‌రామ్ మాణిక్‌నగర్ వచ్చారని అందరికి తెలిసెను. అంతకు ముందు ప్రభు దర్శనం ఎప్పుడు అయిందో అనుగ్రహం ఎప్పుడు కలిగిందో వివరాలు తెలియదు. ముంబాయిలో ఈయన అనుయాయులు చాలామంది ఉన్నారు. ప్రభు యొక్క బిరుదావళి ముంబాయిలోని సంత్‌రామ్‌దాదా మందిరములో పెద్ద అక్షరాలతో వ్రాయబడినది మరాఠీ రచయితకు కనిపించింది. దీనినుండి ప్రభుసాంప్రదాయాన్ని వ్యాపింప చేసే పని వారు ఉత్తమరీతిలో చేశారని తెలుస్తుంది. శ్రీ ఏకనాథ్ గణేశ్ బండారీ అనే ఆయన వ్రాసిన సంత్‌రామ్‌దాదా యొక్క చిన్న చరిత్రలో ప్రభువుతో ఆయనకు ఎంత ఆప్తసంబంధం ఉండేదో తెలుస్తుంది. ఈ లఘుచరిత్రలో చివరికి సంతరామ్‌దాదా అనుభవాలైన కొన్ని ప్రభు చమత్కారాలు కూడా ఇవ్వబడ్డాయి.

# మహాసమాధి

## 79. దాదా మహారాజు

ఇప్పటివరకు మేము మా ప్రియ పాఠకులకు ప్రభు చరిత్రలోని అద్భుత రమణీయ కథను నివేదించాము. ప్రభు అవతారలీల రసవత్తరమైన ఘటనలతో నిండిపోయింది. అవి అన్నీ ప్రస్తుత చరిత్రలో ఇవ్వడం అసాధ్యం. ఇప్పటివరకు వచ్చిన భాగం నుండి ప్రభు చరిత్ర మా పాఠకులకు అర్థమయ్యే ఉంటుంది. ప్రభు చరిత్ర విశాలమై సముద్రం వలె ఉండడం వల్ల అది ఎంత పెద్దదో దాని లోతు తెలుసుకోవడం అసాధ్యం. అందుకని ప్రభు సేవగా అని మా శక్తివంచన లేకుండా చాలావరకు కథా భాగాలు మేము మా ప్రియ పాఠకులకు అందించాము. ఈ కథాభాగం నుండి ప్రభు యొక్క అద్భుత యోగసామర్థ్యము లోకోత్తరమైన గుణాలు

తెలిశాయి. అందుకని ఎక్కువ విస్తరించకుండా ప్రభు చరిత్రలో ఈ చివరి అప్రియమైన అంశం ఇవ్వడం జరిగింది. ప్రభు దర్బార్ సామాన్య దర్బార్ కంటే పూర్తి భిన్నంగా ఉండేది. ఈ దర్బార్‌లో ఐదుగురు ప్రముఖులు ఉండిరి. ఈ ఐదుగురు బయటికి భిన్నంగా కనిపించినా అంతర్యామి వారిని ఒక దివ్య శక్తితో బంధించడం వల్ల ఏకరూపమై ఉండిరి. ప్రభు, దేవి బయమ్మా, దాదామహారాజ్, తాత్యామహారాజ్ మరియు వెంకమ్మ వీరే ఆ పంచ మూర్తులు. వీరందరు ఒకే ఆలోచనలో ఉండి తాము పరచిన బజారును ఇక్కడికిక్కడే విడిచి వెళ్లడానికి నిశ్చయించుకున్నారు. ఈ పంచమూర్తులు ఒక్కక్కరే అదృశ్యమవుతూ నిజధామానికి ఎలా వెళ్లారో ఈ కథాబాగంలో తెలియజేయబడింది.

ఈ భాగం అప్రియమైనది. అంతఃకరణకు దుఃఖం కలిగించేది అనే విషయంలో సంశయంలేదు. అయినా బుద్ధిని జాగృతపరిచి ధైర్యంతో కథను రాయడం తప్ప గత్యంతరం లేదు. పాఠకులు కూడా మనస్సు గట్టి చేసుకొని శాంత మనస్సుతో చదవాలని విన్నవించుకుంటున్నాము.

పై పంచమూర్తులలో దాదామహారాజులవారు ప్రథమ ప్రయాణానికి సిద్ధమయ్యారు. కొన్ని రోజులు ప్రభువు మరియు దాదామహారాజులవారు ఏకాంతంలో గడిపిన తరువాత ఇద్దరు ఆలోచించి దేహమును వీడటానికి నిశ్చయించి చతుర్థాశ్రమమును దాదామహారాజులవారు స్వీకరించారు. శాస్త్రయుక్తంగా చతుర్థాశ్రమము (సన్యాసం) తీసుకొని తల్లికి అభివాదం చేశారు. తల్లి రుణం నుండి ముక్తి కావడానికి ఇది ఒక మార్గమని శాస్త్రంలో చెప్పారు. ఆ విధంగా ఆయన ఆచరించారు. మాతృ హృదయానికి కలిగిన బాధను సమాధాన పరచటం అసాధ్యం. తన పుత్రుడు తన ముందే వెళ్లిపోవడం చూడడం ఏ తల్లికైనా అశక్యం. అయినా కూడా ప్రభువు మరియు దాదామహారాజులవారు తల్లిని సాంత్వన మాటలతో సముదాయించారు. ప్రభు ప్రేరణతో మాతృశ్రీ అనుమతి ఇచ్చిన తరువాత దాదామహారాజు యోగ మార్గంతో తమ దేహాన్ని 1861 వ సంవత్సరం ఫాల్గుణశుక్ల పాడ్యమి రోజు విడిచారు. వీరు పరమ యోగులై మౌనవృత్తిలో ఉండేవారు. బీదలపై, దీనులపై, గోసాయి, ఫకీరు, బైరాగి మొదలైన వారిపై వీరు ప్రేమ కలిగి ఉండేవారు. మాణిక్‌నగర్‌లోని అనాథలకు సహాయకారులుగా కూడా ఉండేవారు.

ఆజ్ఞ ప్రకారం నడుచుకుంటూ సోదరులతో ప్రియమైన సోదరునిగా ఉండేవారు. అందుకని ఆయన అదృశ్యంతో మాణిక్‌నగర్‌లోని ఆబాలగోపాలం శోకతప్తులయ్యారు. తల్లి గట్టిగా ఏడ్వసాగింది, సోదరులకు కూడా అమితమైన దుఃఖం కల్గింది. కాని ప్రభు వీరందరికి ఆధార చక్రం అవడం వల్ల ప్రభువును చూసి అందరూ దుఃఖాన్ని దిగమింగుకొని మాణిక్‌నగర్‌లోని కార్యక్రమాలన్నీ యథా ప్రకారం నడిపి దాదామహారాజ్‌లను స్మృతిశేషులను చేశారు. వీరి సమాధి సంగము ప్రదేశంలో చేసి దానిపై చిన్న దేవాలయం కూడా నిర్మించారు. ఆయన సమాధికి నిత్యం పూజ జరుగడమే కాక వార్షిక అరాధన కూడా జరుపబడుతుంది.

దాదామహారాజుల సమాధికి సంబంధించిన విషయం ఇతర చరిత్రకారుల కంటే సోలాపుర్‌కర్ గారు వివరంగా ఇచ్చారు. ఆయన ఇలా అంటారు–దాదామహారాజ్ ఏ కార్యంలోను పాల్గొనకుండా ఎవరితో మాట్లాడకుండా ఎప్పుడూ ధ్యానస్థులై తమ ఆత్మానందంలో లీనమై ఏకాంతంగా కూర్చునేవారు. మొదట ఏ స్వభావం ఐతే ఉందో అది చివరి వరకూ ఉండేది. సమాధికి పూర్వం దాదాసాహెబ్ మరియు ప్రభువు మూడు రోజులు రాత్రింబవళ్లు ఏకాంతంలో ఉన్నారు. లోపల ఇద్దరే ఉండేవారు. గడియ పెట్టబడి ఉండేది. మలమూత్రాలు, స్నానం, నీరు, భోజనం ఏమీ లేకుండేది. లోపల వారి సంభాషణ ఏమిటో, ఏం జరిగేదో వాళ్లకే తెలుసు. నాలుగో రోజు బయటకు వచ్చిన తరువాత ప్రభు దాదామహారాజ్ యొక్క సమాధి ఏర్పాట్లు చేయసాగారు. సంగమములో స్థలం తయారు చేశారు. ఏ రోజైతే సమాధి అవుతారో ఆ రోజు పూజ, అర్చన, నైవేద్యం, ప్రసాదం మొదలైన విధులు తొందరగా ముగించవలసిందిగా ఆజ్ఞాపించారు. దాదాసాహెబ్ యొక్క సమాధి అయ్యే సమయం దగ్గరపడినప్పుడు ప్రభు అమ్మకు మరియు తాత్యాసాహెబ్‌కు తెలియజేశారు. అప్పుడు మాతృశ్రీకి చాలా బాధ అనిపించింది. అది చూసి దాదాసాహెబ్ మాతృశ్రీని తనవద్ద కొంత సమయం ఏకాంతంలో కూర్చోపెట్టుకొని సమాధాన పరిచారు. ప్రభువు కూడా మాతృశ్రీ మరియు తాత్యా సాహెబ్‌ను సమాధాన పరిచి భ్రాంతి నుండి దూరం చేశారు. తరువాత బ్రాహ్మణులు వేదఘోష చేస్తుండగా సంతుల, సాధువుల, భైరాగుల గళం గట్టిగా భువనమంతా వినిపిస్తుండగా అందరి సమక్షంలో మాతృశ్రీ మరియు

ప్రభు సన్నిధానంలో దాదాసాహెబ్ యొక్క ప్రాణ జ్యోతి బ్రహ్మరంధ్రం నుండి వెడలి పంచభూతాలలో లీనమయింది. తరువాత అన్నీ విధి ప్రకారం జరిగి ధర్మశాస్త్రరీతిలో ప్రభు మహరాజు వేల రూపాయలు దానధర్మాలు చేశారు. టోల్ అనే ఆయన హనుమంత్‌రావ్ దాదా హఠయోగం ప్రకారం దేహాన్ని విడిచారు అనే విషయాన్ని మాత్రమే వ్రాశారు.

## ౩0. బయమ్మ

దేవి బయమ్మ గొప్పగుణం వర్ణించడం అశక్యం. ఎవరయితే అసామాన్య దివ్య పురుషునికి జన్మ ఇచ్చారో ఆమె గొప్పతనం ఎలా వర్ణించగలం ? బయమ్మ లౌకిక వ్యవహారంలో అమాయకురాలై చాలా మృదు స్వభావం కలిగి ఉండేవారు. తాత్యామహరాజ్‌పై బయమ్మకు చాలా ప్రేమ ఉండేది. ఆయన ఇద్దరు పుత్రులపై మరియు పెద్దకుమార్తెపై బయమ్మకు అనిర్వచనీయమైన ప్రేమ ఉండి కోడలైన వితాబాయి అమ్మను కూడా కూతురిలా చూసుకొని కుటుంబ సభ్యుల ప్రేమను సంపాదించారు. తాత్యామహారాజ్ అందరివలె ద్రవ్య సంపాదన చేయాలని బయమ్మకు అనిపించేది. ప్రభువుకు నిత్యం వేల రూపాయలు వచ్చేవి. అలాగే బంగారు నగలు కూడా వచ్చేవి. ఒక మంచి నాణ్యమైన చంద్రహారం ఎవరో ప్రభు మెడలో వేశారు. అది తన ఆధీనంలో ఉండాలని బయమ్మకు అనిపించి, తన వద్ద ఉంచుకుంది. తాత్యా పిల్లలకు ఉపయోగపడతాయని నగలు సమకూర్చాలని ఆ తల్లికి కోరికగా ఉండేది. కానీ ప్రభు ఎలాంటివి కూడబెట్టనిచ్చేవారు కాదు. ఏదైనా కారణంతో కూడబెట్టిన ద్రవ్యాన్ని, నగలను ప్రభు తీసుకునేవారు. అలా ఎప్పుడూ జరిగేది. పై చంద్రహారం చాలా రోజులు బయమ్మ వద్దనే ఉన్నది. అందుకని ఆమెకు తృప్తిగా ఉండేది. ఒక రోజు ఆమె కడుపునొప్పితో బాధపడసాగింది. ఎన్ని మందులు తీసుకున్నా తగ్గలేదు. చివరికి ప్రభువుకు విషయం తెలిసింది. అమ్మ దగ్గరికి వచ్చి కడుపునొప్పి విషయం అడుగుతూ మెల్లగా ఇలా అన్నారు. అమ్మా, ఆ చంద్రహారం దత్తునికి ఇచ్చివేయు, లేకపోతే ఈ కడుపునొప్పి తగ్గేటట్లు కనిపించటంలేదు. అప్పుడు బయమ్మ, తీసుకో బాబా! తాత్యా పిల్లల కోసం తీసిపెట్టాను. నేను తీసుకొని ఏం చేస్తాను? అంటూ చంద్రహారాన్ని ప్రభువుకు ఇవ్వగానే కడుపు నొప్పి తగ్గింది. ప్రభువుపై

అమ్మకు అనిర్వచనీయమైన ప్రేమ ఉండేది. వారికోసం ఫలాహారం నిత్యం తయారు చేసేది. అది చాలా ప్రేమతో తినేవారు. ఇద్దరు పుత్రుల కీర్తిని ప్రత్యక్షంగా చూసిన ఆ తల్లి ధన్యురాలయింది. ప్రభు దర్శనం కోసం వచ్చిన భక్త సమూహం అమ్మకు పూజ్యభావంతో నమస్కారం చేయకుండా వెళ్లేవారు కాదు. ఈ విధంగా అమ్మ ప్రేమతో, ఆనందదాయక వాతావరణంలో చాలాకాలం గడచిన తరువాత అవతార సమాప్తి సమయం దగ్గరపడింది. అప్పుడు కొన్ని కారణాల వల్ల అమ్మ ఆరోగ్యంలో కూడా తేడా కనిపించింది. ప్రభు రాత్రింబవళ్లు అమ్మదగ్గర కూర్చొని సమాధాన పరిచారు. అమ్మ మాయామోహాన్ని పక్కకు నెట్టి ముందు జరిగే ఘటనను ఎదుర్కోవడానికి సిద్ధమయ్యారు. ప్రభు సమక్షంలో శాంతంగా దేహాన్ని విడిచి ఇహలోకయాత్ర పూర్తి చేశారు. ఈ తల్లి వంటి భాగ్యం కోట్ల మంది స్త్రీలలో ఒక్కరికే లభిస్తుంది. అమ్మ యొక్క చితా సమాధి సంగమంలో ఉంది. ఆ సమయంలో ధర్మశాస్త్ర ప్రకారం ప్రభు గుండు చేయించుకున్నారు. కానీ, ఈ విషయం ఎంతో మంది ముస్లింలకు నచ్చలేదు. ప్రభు సర్వశ్రేష్టులైనా బ్రాహ్మణులు గడ్డం తీయించారని వాళ్లకు కోపం వచ్చింది. కానీ, ప్రభు సామర్థ్యం వల్ల ఏ గొడవ జరుగలేదని కొందరు చరిత్రకారులు వ్రాశారు. వెంకమ్మ సమాధి తరువాత ఒక సంవత్సరం లోపలే అమ్మ నిర్యాణము కూడా జరిగింది. ఉత్తరక్రియలు తాత్యా మహారాజులచే చేయించి ప్రభు వేల రూపాయలు దానధర్మాలు చేశారు.

## 81. తాత్యామహారాజు

మాణిక్‌నగర్‌లోని ఐదు దేవతా మూర్తులలో మూడు మూర్తులు ఇహలోకం విడిచి వెళ్లిన తర్వాత తాత్యామహారాజులవారు తమ అవతారం ముగించే ఆలోచన చేయసాగారు. ఒకసారి వారి ఆరోగ్యం వికటించి అస్వస్థులై చాలా భయపడ్డారు. కొంతమంది శిష్యులు ప్రభువుకు విన్నవించుకున్నారు. కానీ, అప్పుడు ప్రభువు, భయపడే అవసరం లేదు తాత్యా ఇప్పుడే ఏమీ వెళ్లరు, ఈ నటకా తీసుకోని వెళ్లి తాత్యా దిండు దగ్గర పెట్టండి. ఆయనకు బాగవుతుంది అన్నారు. శిష్యులు అలా చేసిన తరువాత తాత్యామహారాజు ఆరోగ్యవంతులయ్యారు. ప్రభువు తాత్యామహారాజుల పెద్ద కొడుకు

ఉపనయనము చాలా వైభవంగా చేయించారు. ప్రభు వంశంలో, మాణిక్‌నగర్‌లో జరిగే మొదటి వేడుక అవడం వల్ల చాలా ఉత్సాహంతో జరుపబడింది. ఆ సమయంలో 5 నుండి10 మంది బీద పిల్లల ఉపనయనము కూడా చేయబడింది. ఈ సందర్భంగా అన్నదానం, దక్షిణ యథాప్రకారం జరిగి 30 వేల రూపాయలు ఖర్చు చేయబడ్డాయి. ఈ సమారంభము జరిగిన కొంతకాలము తరువాత తాత్యామహారాజ్ యొక్క అవతారసమాప్తి సమయం దగ్గరికి వచ్చింది. దీని తరువాతి విషయాలు సోలాపుర్‌కర్‌గారు క్రింది విధముగా వివరించారు.

''ఉపనయన మహోత్సవము జరిగిన తరువాత ఒక నెల వరకు ప్రభువు మరియు తాత్యాసాహెబ్ ఏకాంతంలో కూర్చుని ఆత్మ విచారణ చేశారు. ఒక నెల వరకు శౌచ్యం, మూత్రం, భోజనము లేకుండా జనానికి ప్రభు దర్శనము కాలేదు. బయటికి వచ్చిన తరువాత నిత్యకర్మ మొదలయింది. ముందు తాత్యా సాహెబ్ స్వయంగా గురుచరిత్ర పారాయణం చేసి దానధర్మాలు, భజన, పూజ, కార్యక్రమములు చేసి ఒక రోజు, అందరితో ఆనందంగా మాట్లాడుతూ, అందరి అనుమతి తీసుకొని ప్రభు చరణాలపై తల వంచి నమస్కరించి తరువాత యోగ సమాధి తీసుకున్నారు. అప్పుడు భక్తకార్య మహామంత్రం అన్ని వైపులా వినిపిస్తుండగా తాళాలు, మృదంగ, శంఖనాదాలతో, భజనలతో వేలమంది జాతరలా నడుస్తుండగా పెద్ద ఉత్సవంలాగా తాత్యాసాహెబ్ యొక్క సమాధి పూర్తయింది. స్వయంగా ప్రభువు తన కనిష్ఠ బంధువు చివరి విధికోసం సమాధి వద్దకు వచ్చి చివరి వరకు ఉన్నారు. జ్యేష్ఠ పుత్రులైన మనోహర ప్రభు గారితో విధి అంతా ధర్మశాస్త్రనుసారంగా చేయించి వేల రూపాయలు దాన ధర్మాలు చేసి తాత్యాసాహెబ్ యొక్క పేరు ప్రభు తనతో పాటు అజరామరం చేశారు. తాత్యాసాహెబ్ కోసం రోదించని మనుషి అక్కడ లేడు. ప్రభు వాడ, హూమనాబాద్‌తో పాటు సర్వ నిజాం సర్కార్‌లోని వారు తాత్యాసాహెబ్ కోసం రోదిస్తూ ఉదాసీనులయ్యారు. పై వివరణలో సమాధి అంటే ప్రాణోత్క్రమణ సమయంలో యోగ సాధనతో నిర్యాణము అయ్యారని తెలుస్తుంది. తాత్యాసాహెబ్ గృహస్థాశ్రమంలో ఉండిరి. అందుకని వారికి సర్వ సంస్కారాలతో అంత్యవిధి జరిగింది. వీరి అస్తికల సమాధి సంగమములో మాతృశ్రీ సన్నిధిలో ఉన్నది. తాత్యామహారాజ్ ప్రభు సమక్షంలో ధీరోదాత్తతతో దేహ విసర్జన చేశారని

వృద్ధులు అంటారు. చివరివరకు ప్రభు వారికి ధైర్యం చెపుతూ వచ్చారు. చూడు తాత్యా, చలించకుండా ధైర్యం తెచ్చుకో అంటూ మస్తకభేధం అయ్యేవరకు ప్రభు ఇలా అంటూనే ఉన్నారని చాలా మంది అంటారు.''

ఈ విషయంలో టోల్ అనే ఆయన ఇలా వ్రాశారు. ఆ రోజు ప్రభువు రాంభావు లంగోటీతో ఇలా అన్నారు–'రావనూ, తాత్యా ఈ రోజు వెళ్తానంటున్నాడు. చూద్దాం, ఇప్పుడే ముక్తినిద్దాం అంటూ తాత్యా వద్దకు వెళ్లి కాలు బొటనవేలు ఒత్తిపట్టుకొని పంచప్రాణాలు నాభి వద్దకు వచ్చేట్లు చేసి ముక్తి నిచ్చారని రామ్‌భావ్ లంగోటి గారు చెప్పినట్లుగా టోల్ అనే చరిత్రకారులు వ్రాశారు. రామ్‌భావ్ లంగోటి ఎప్పుడూ తాత్యామహారాజు యొక్క సేవలో ఉండేవారు. అందువల్ల పై విషయం పూర్తి సత్యమైనది. తాత్యామహారాజుల వారు ధైర్యంతో ఇహలోకం విడిచారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆ సమయంలో ఆయన యుక్త వయస్సులో ఉండేవారు. వయస్సులో ఉన్న పత్ని, ముగ్గురు చిన్న పిల్లలను వదిలి నిర్భయంగా దేహయాత్రను ముగించారు. వీరి నిర్యాణ సంవత్సరం 1862.

## 82. వెంకమ్మ

ఈ పరమ యోగిని గురించి ఇంతకు ముందు చాలాసార్లు వచ్చింది. మాణిక్‌నగర్‌లో వెంకమ్మ అందరికీ పూజనీయురాలై ఉండేది, అందరికీ ఆమెపై ప్రేమ ఉండేది. శుభ్రమైన వస్త్రాలు ధరించి ఎప్పుడూ ప్రభుస్మరణలో నిమగ్నమయి ఉండేది. ప్రభువు కంటే ముందు తను దేహత్యాగం చేయాలని ఆమె నిశ్చయించుకున్నది. కాళ్లకు గజ్జెలు కట్టుకున్నట్లుగా అహోరాత్రులు ప్రభు భజనలో గడిపిన తరువాత ఒకరోజు వెంకమ్మ నిశ్చేష్టురాలై పడిపోయింది. ఈమె కోమటి అని ఇంతకు ముందు తెలియజేయడం జరిగింది. కోమటివారి ధర్మానుసారంగా కోమటి మహిళలు ప్రేతయాత్రకు ఏర్పాట్లు ప్రారంభించారు. వెంకమ్మ దేహత్యాగం చేసింది అని అనుకొని శవం ఎత్తడానికి ప్రయత్నించసాగారు. అప్పుడు ఆమె నోటినుండి ఓంకార ధ్వని వెలువడింది. ఇది చూసి అందరూ ఆశ్చర్యపడుతూ ప్రభువద్దకు వచ్చి విషయం చెప్పారు.

ప్రభు సర్వజ్ఞులైనందువల్ల ఆమె అంతఃకరణను తెలుసుకొని ఇలా అన్నారు. ఆమె మనస్సులో బ్రాహ్మణులే సమాధి చేయాలని ఉంది. మరెవ్వరు ఆమెను తాకకండి. ఆ విధంగా ప్రభు ఆజ్ఞానుసారం బ్రాహ్మణులు వెంకమ్మకు స్నానం చేయించి పసుపు-కుంకుమ నొసట వ్రాసి కొత్త చీర, జాకెట్టు వేసి వొడి నింపి మారుతి దేవాలయానికి దగ్గరలోని మైదానంలోనికి తీసుకెళ్లి పెద్ద ఉత్సవంగా ఆమె సమాధి విధిని నిర్వహించారు. బ్రాహ్మణుల చేతి స్పర్శ తగలగానే ఓంకార నాదం వినిపించడం ఆగిపోయింది. మిగతా సంస్కారాలు వెంకమ్మ దేహానికి యథావిధిగా జరిగాయి.

ఈ ప్రసంగాన్ని రామచంద్రబువా ఇలా వ్రాశారు:

''వెంకమ్మ కోసం సేవకులు బ్రాహ్మణ సంఘం తరుపు నుండి సుశోభితమైన విమానం కట్టి తయారు చేశారు. తరువాత నేను మరియు బప్పాచార్యులు స్నానం చేయించి శుభ్రమైన కొత్త వస్త్రాలు కట్టించి పూర్తి శరీరానికి భస్మం రాసి, నొసటికి గంధంరాసి, అక్షింతలు వేసి మెడలో రుద్రాక్షమాల వేశాము. అప్పుడు వెంకమ్మ ఇంకోసారి లేచి ప్రభువుకు, విఠాబాయికి నమస్కరించి పద్మాసనం వేసుకొని కూర్చుని సమాధిలోకి వెళ్లింది. అప్పుడు 'అవదూత చింతన' అంటూ ఒకే ధ్వని వినిపిస్తూ వాద్యాలు మ్రోగసాగాయి. విమానం తీసుకువెళ్లడానికి తయారు చేసిన వాహనాన్ని లేపడానికి ఎనిమిది మంది బ్రాహ్మణ సేవకులు పట్టగా నాలుగు వైపుల నుండి కర్జూర పళ్ళు, కొబ్బరిగిటకలు, పోకలు, బత్తాసులు, గులాల్ బుక్కా, తులసీ, పువ్వులు, ఎంతోమంది రూపాయలను వెదజల్లసాగారు. వేలమంది సాధువులు, భైరాగులు భజన చేస్తూ ముందు నడుస్తుండగా అరబ్, రోహిలే, పరదేశీ మొదలైన వారి తుపాకీ కాల్పులతో పొగలాగా మబ్బు నిండిపోయింది. ఇలా ఊరేగింపులాగా వెంకమ్మ యొక్క విమానం టెహెళదాసు తల్లి సమాధి వద్దకు తెచ్చి దించారు. అక్కడ అరబ్, రోహిలే మొదలైన ముస్లిం వాళ్లు ముందుకు వచ్చి చేతిలో ఉన్న తుపాకులు క్రిందపెట్టి వెంకమ్మకు సంతాపం ప్రకటించారు. ఈ రోజు మా సోదరి మమ్మల్ని విడిచి దేవుడి వద్దకు వెళ్లింది, అంటూ ముస్లింలు అశ్రునివాళి అర్పించారు. దగ్గరలోని ఆరు కోసుల వరకు చిన్న గ్రామాల ప్రజలు వెంకమ్మ సమాధి యాత్రకు వచ్చారు. తరువాత స్వయంగా

ప్రభుమహారాజుల వారు వచ్చి వెంకమ్మకు యథాప్రకారం పూజ, ఆరతి మా చేతులతో చేయించి విమానం నుండి భూమిపై సమాధిస్థలంలో కూర్చోపెట్టారు. ఈ సమయంలో దత్తనామం వినిపించసాగింది. తరువాత పూర్తి సమాధి చేసి అక్కడున్నవారందరికి, ముస్లింలకు బత్తాసు, శక్కరి పుటాని, పేడా, బర్ఫీ మొదలైనవి ప్రసాదంగా పంచిన తరువాత వెంకమ్మ గుణాలను పొగుడుతూ జనులందరూ బాధాతప్తహృదయులై తమ ఇళ్ళకు వెళ్లారు.''

సోలాపుర్‌కర్ గారు ఇంకా ఇలా అన్నారు. ''వెంకమ్మ సామాన్యురాలు కాదు. ఆమె సిద్ధయోగిని. కేవలం పార్వతిదేవి అవతారం అయి ఉండెను. అక్కడున్నవారందరి నేత్రాలనుండి అశ్రుధార ప్రవహిస్తునే ఉండెను. వెంకమ్మ యొక్క దేహం ఏ ప్రదేశంలో అయితే ఉంచబడిందో ఆ ప్రదేశంలో దేవాలయం నిర్మించాలని భక్తులకు కోరికగా ఉండెను. కాని ప్రభు ఆజ్ఞ లేకుండా అది సాధ్యం కాదని తెలుసు. కొందరు ఈ విషయాన్ని ప్రభువుకు చెపితే ఆమెకు సామర్థ్యం ఉంటే తనే దేవాలయం నిర్మించుకుంటుంది, మనం ఆ విషయంలో ఆలోచించే అవసరం లేదు అన్నారు. ఇది విని అందరు నిరాశ చెందారు. కానీ, కొన్ని రోజుల తరువాత వెంకమ్మ సమాధిపై దేవాలయం నిర్మించబడి ఉదయం, సాయంత్రం వెంకమ్మకు పూజ, అర్చన చేయడం మొదలయినాయి. దేవాలయంలో నందాదీపం అఖండంగా వెలుగుతూ దేవీ పూజ జరిగేది. మాణిక్ నగర్‌లో ప్రభు మందిరానికి దిగువలో వెంకమ్మ యొక్క దేవాలయం ఉన్నది. ఆమె పరమ సాధ్వి. భక్తుల కోరికలను తీర్చడంలో సమర్థురాలై ఉండెను. నవరాత్రులు మొదలైన ఉత్సవాలు వెంకమ్మ దేవాలయంలో జరుగుతూ హోమ హవనాది కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరిగేవి. దేవీ మధుమతి భగవాన్ దత్తాత్రేయుని శక్తి. ఆమె వెంకమ్మ రూపంలో ప్రభు సన్నిధిలో వచ్చి ఉండెనని అందరూ నమ్మేవారు. దేవికి చేసినట్లుగా పూజ అభిషేకం, ఉత్సవం మొదలైనవి బ్రాహ్మణుల చేతుల మీదుగా జరుగుతూ, అనేక మంది మొక్కులు తీర్చుతూ, అందరికి ఆరాధ్యదైవం అయింది. తన దేవాలయ కట్టడం, పూజ వ్యవస్థ స్వతంత్రంగా ఆమెయే చేయించుకుంది. సంస్థానం పై ఏ రకమైన భారం ఉండేది కాదు.

## 83. ప్రభు సమాధి

ప్రభు తన పరివారంలోని ముఖ్యమైన నలుగురు వ్యక్తుల తరువాతనే తాను ఇహలోకం నుండి ప్రయాణం చేయాలనుకున్నారు. జననమరణరహితమైన వ్యక్తులు లోక కళ్యాణం కోసం ఈ జగత్తులో అవతరించి, నివసించి ఇక్కడి కార్యం నడపడానికి యోగ్యమైన అధికార పురుషుని నియమించి తాము నిజధామానికి చేరుకుంటారు. ఇది అందరికి తెలిసిన విషయమే. ప్రభు ఒక దివ్య సాంప్రదాయాన్ని స్థాపించి దానిని నడపడానికి అన్ని విధాలుగా సమర్థులైన వారిపై భారం మోపి తన దేహాన్ని తాత్కాలికంగా లోకుల దృష్టి నుండి తప్పించారు. ప్రభు యొక్క భౌతిక దేహం సమాధిగతం అయితే అందరికీ దుఃఖం కలగడంలో ఆశ్చర్యం లేదు. ప్రభు యొక్క సగుణ స్వరూప సహచర్యంతో జనులకు కష్టాలు తీరి స్వాంతన కలిగేది. అందువల్ల దేహవియోగంతో వారి ప్రియ భక్తులకు భరించలేని దుఃఖం కలిగింది.

అందుకని ఆ దేహ వియోగం ప్రియ భక్తులు భరించలేకపోయారు. ప్రభు తన సమాధి రోజును ముందే నిశ్చయించుకున్నారు. మార్గశిర శుక్ల ఏకాదశి, శకం 1787, మంగళవారం (29 నవంబర్ 1865) కానీ, ఈ విషయం ముందే తెలిస్తే అనర్థం జరుగుతుందని తన ప్రియమైన నలుగురు శిష్యులను మాత్రమే పిలిచి తరువాత ఏం చేయాలో ఆజ్ఞాపించారు. సమాధికి ఆరు నెలల ముందుగానే నిశ్చయించుకున్న ప్రకారం ఏర్పాట్లు ప్రారంభించారు. శిష్యులందరికి ప్రభువుపై అపరిమితమైన ప్రేమ ఉండేది. ఇలాంటి దివ్యమైన దేహం కనిపించకుండా పోతుందని వారికి దుఃఖం కలిగేది. కానీ ఈ విషయం ఎవరి దగ్గరా చెప్పడానికి వీలులేదు. శిష్యులలో బప్పాచార్యులు ప్రముఖులు. వారు చాలా ధైర్యంతో సంస్థానాన్ని నడిపారు. తాత్యామహారాజుల తరువాత సంస్థాన భారాన్ని తాము తీసుకొని అత్యంత చాతుర్యంతో నిర్వహించారు. ప్రభువు అవతారసమాప్తి సమయం దగ్గరికి వస్తున్నప్పుడు వారికి భరించలేని దుఃఖం కలిగింది. కానీ, దుఃఖాన్ని దిగమింగుకొని కార్యకలాపాలను నిర్వర్తించేవారు. అంతరంగంలో మండుతున్న జ్వాలను ఎవరి దగ్గర చెప్పుకోవడానికి లేదు. కనుక దూరంగా అడవిలోకి వెళ్లి విలపించి మనసును

తేలిక పరుచుకునేవారు. ఈ ప్రకారం ఆరు నెలలు గడిచిన తరువాత శక సంవత్సరం 1787 మార్గశిర మాసం మొదలయింది. ఎవరికైతే ప్రభు సమాధి యొక్క రహస్యం తెలుసో వారికి అన్నివైపులా ఉదాసీనత కనిపించసాగింది.

అన్ని ప్రదేశాలలో దుశ్శకునాలు కనిపించసాగాయి. ప్రభు యొక్క ఆరోగ్యంలో కొంచెం తేడా కనిపించసాగింది. ప్రభు చివరి రోజులలో ఏమీ తినేవారు కాదు. పండ్లు మాత్రం తినేవారు. పండ్లలో కూడా అంజీర్ (మేడిపండ్లు) ఇష్టంగా తినేవారు. వీపుపై ఒక పుండు కనిపించింది. అప్పుడు వారు అది రాచపుండు అని తన శిష్యులతో అన్నారు. ప్రభు ఎక్కడైతే ఉండేవారో అదే స్థలంలో గొయ్యి తవ్వి, సమాధికి కావలిసిన కట్టడాన్ని నలుగురు నమ్మకస్థులైన శిష్యులు తామే స్వయంగా నిర్మించారు. దత్తజయంతి నిమిత్తం కుటీరం బయట వేల మంది జనం ఉండిరి. ఎవరికీ సమాధి అయ్యే విషయం తెలియక కార్యకలాపాలన్నీ యథావిధిగా జరగసాగాయి. ఆ సంవత్సరం ముస్లింల గ్యారవి పండుగ అదే నెలలో వచ్చింది. ఈ గ్యారవి మన నెలలో సుమారు ద్వాదశి రోజు వస్తుంది. ప్రభు గ్యారవి యొక్క ఖైరాత్(దానసత్రం) ముందు చేసేవారు.

బహుశా అది దశమి రోజు రాత్రి. ప్రభు యొక్క ఆరోగ్యం క్షీణిస్తూ ఉంది. వీపుపై పుండు వ్యాపించసాగింది. ఈ స్థితిలో గ్యారవి యొక్క ఖైరాత్ (దానసత్రం) ఎలాగా అని శిష్యమండలికి దిగులు మొదలయింది. కాని ప్రభు ఖైరాత్ యొక్క దర్బార్ జరగడానికి ఆజ్ఞ ఇచ్చిన తరువాత ఏర్పాట్లు మొదలయ్యాయి. ఆ సంవత్సరం ముస్లిం జాతికి ఆ రోజు రాత్రి 'న భూతో న భవిష్యతి' అన్నట్లు జరిగింది. ఖైరాత్ కోసం ప్రభు దర్బార్‌లో గాదిపై వచ్చి కూర్చున్నప్పుడు ప్రభువుకి శారీరక వేదన ఉన్నట్లుగా ఎవరికీ అనిపించలేదు. ఇంకా ఎక్కువ ఆనందంగా ఉన్నట్లు అనిపించింది. ఈ ఖైరాత్ రాత్రంతా నడుస్తూ ప్రభు చేసే దానం అఖండంగా జరిగింది. సూర్యోదయం కాగానే ప్రభు విశ్రాంతి కోసం తన కుటీరంలోనికి వెళ్లారు. ఆనాడు ఏకాదశి పుణ్యదినం కావడం వల్ల ప్రభు సమాధి కోసం ముందే అనుకున్నట్లుగా చతుర్థాశ్రమం తీసుకొని, నిర్ణయించుకున్న సమయానికి సమాధిలో ఆసనంపై కూర్చున్నారు. శిష్యులందరి నుండి పూజను స్వీకరించి తాత్యామహారాజుల ఇద్దరు పుత్రులను

దగ్గరికి పిలుచుకొని కొద్దిసేపు తొడపై కూర్చోపెట్టుకున్నారు. తరువాత వారి నుండి పూజ మరియు అరతి స్వీకరించారు. పెద్ద కుమారుడు మనోహరునికి తన ఒంటిపై ఉన్న శాలువాను కప్పి హారాన్ని మెడలో వేసి మంత్రోపదేశం చేసి మహాప్రసాదం ఇచ్చారు. కనిష్ఠ పుత్రుడు ఖండేరావ్ (మార్తండప్రభు) మెడలో మాల వేసి ప్రసాదం ఇచ్చి ఇద్దరిని ఇంటికి తీసుకొని వెళ్లాల్సిందిగా శిష్యులకు ఆజ్ఞాపించారు. తరువాత తన ఆసనాన్ని సిద్ధం చేసుకొని సమాధి ముందు భాగాన్ని మూసి వేయవలసిందిగా శిష్యులకు ఆజ్ఞాపించారు. ఆజ్ఞ ప్రకారంగా శిష్యులు బాధాతప్తమైన హృదయంతో ద్వారాన్ని మూసివేశారు. పైకి కొద్ది భాగం తెరిచి ఉంచి దాంట్లోంచి చూస్తూ ఉండాల్సిందిగా రామ్‌భావ్ లంగోటికి చెప్పారు. ఆ విధంగా సాయంత్రం ఐదు గంటల వరకు చూస్తూ కూర్చుని ఉన్నారు. సుమారు ఐదు గంటల సమయంలో మస్తకబేధమైన తరువాత ఆ భాగం కూడా పూర్తిగా మూసివేయడం జరిగింది. ఇది పూర్తిగా రహస్యంగా జరిగింది. ప్రభు ఆజ్ఞ ప్రకారం శిష్యులు తమ దుఃఖాన్ని ఆపుకొని పౌర్ణమి వరకు సమాధి విషయం బయటకు తెలియనీయలేదు. దత్తజయంతి నిమిత్తం వేల మందికి భండారుఖనాలో అన్నదానం జరిగింది. పౌర్ణమి నాటి దత్తజయంతి ఉత్సవము అయిన తరవాత భోజన సమారంభము కూడా ముగిసిన తరువాత సమాధి విషయం తెలిసింది. ఆ సమయంలో ప్రభు యొక్క సగుణరూపం కనుమరుగై రాతి సమాధి కనిపించగానే సర్వత్రా అల్లకల్లోలం మొదలై ఎంతో మంది ప్రభు వియోగం భరించలేక తల భూమిపై కొట్టుకుంటూ ప్రాణాలర్పించడానికి సిద్ధపడ్డారు. ముస్లింలు కూడా ఎంతో మంది బాధతో సమాధి పెకిలించి ప్రభువు ఆఖరి దర్శనం చేసుకోవాలని పంతం పట్టారు. హిందు, ముస్లిం, సిఖ్, లింగాయత్ మొదలైన అనేక ధర్మాల వారికి ప్రభువుపై అమితమైన భక్తి ఉండడం వల్ల ప్రభు వియోగం బాధ కలిగింది. ఆ సమయంలో కలిగిన దుఃఖాన్ని వర్ణించ శక్యం కాదు. కొందరు చరిత్రకారులు ఆ సందర్భాన్ని ఇలా వివరించారు – కొంతమంది భక్తులు తమ దేహత్యాగం చేయడానికి కూడా వెనుకాడలేదు. ముస్లిం భక్తులను కూడా సముదాయించడం కష్టమయింది. అయినా బప్పాచార్యులు మొదలైన శిష్యులు అందరిని సమాధాన పరచి జరిగే అనర్థాన్ని ఆపగలిగారు. సమాధి తరువాత పరిస్థితి సోలాపుర్‌కర్ గారి మాటలలో చదివితే పాఠకులకు అక్కడి పరిస్థితి గురించి తెలుస్తుంది. ఆ విధంగా మూడు రోజులు చాలా దుఃఖంలో మరియు నిశ్శబ్ద స్థితిలో గడిచిన

తరువాత చతుర్దశి రోజు దత్త గాదీ (పీఠం) వద్ద దత్తాత్రేయుని జన్మోత్సవం జరుగుతున్నప్పుడు ప్రభు బయటికి రాలేదని అందరూ మాట్లాడుకుంటుండగా విషయం తెలిసి మరుసటి రోజు భండారు ఎలాగో జరిగింది. అప్పటి వరకు జనం సహనం వహించారు. కానీ, ఆ రోజు సాయంత్రం విషయం తెలిసి నగరంలో హాహాకారాలు మొదలై ద్వారం వద్ద గుంపుగా వేల మంది దర్శనం కోసం ఒకరిపై ఒకరు పడుతూ, తోసుకుంటూ ముందుకు వచ్చిన వారికి ప్రభు కనిపించకుండా సమాధి కనిపించింది. ఏమి చెప్పాలి? జనంలో దుఃఖ సముద్రం ఎగసిపడింది. ఎంతో మంది ప్రభూ!ప్రభూ! అంటూ తలను నేలకు కొట్టుకుంటూ, ఛాతిని కొట్టుకుంటూ ఎంతో మంది కడుపులో శూలాలను కుచ్చుకున్నారు. ఈ విధంగా హాహాకారాలు చుట్టుముట్టాయి. ముస్లిం అరబ్, రోహిలే మొదలైన వారు ఆత్మహత్య చేసుకున్నారు. ఎంతో మంది బావిలో దూకి, విషం తీసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. వేల మంది అరబ్, రోహిలేలు సమాధి ముందు తమ ఆయుధాలను ఉంచి ప్రాణాలు అర్పించారు. కొందరు ప్రభును సమాధి తెరిచి చూస్తామని పట్టుపట్టారు. అప్పుడు హిందూ, ముస్లింల మధ్య వివాదం వచ్చింది. పెద్ద పెద్ద సర్కారి వాళ్లు వచ్చి ఈ పరిస్థితిని యుక్తితో సమాధానపరిచారు. ప్రభు కోసం మొగలాయి ప్రాంతం పదిహేను రోజులు దుఃఖ సాగరంలో ఉండిపోయింది. ప్రభు వాడాలోని వారి మరియు ప్రభువుకి కావాలసిన వారి శోకం వర్ణించడం ఎవరి తరం కాలేదు.

ఈ విషయాన్ని టోల్ ఇలా వ్రాశారు :

ప్రభు నిజధామానికి చేరుకున్నారు. ఈ వార్త పౌర్ణమి మరుసటి రోజు (పాడ్యమి నాటి) ప్రాతఃకాల సమయంలో తెలియగానే హాహాకారాలు మిన్నంటాయి. ప్రభు లేని ఆ రోజు విహ్వాలులై జనం ఆక్రోశిస్తూ ప్రభు సమాధి వద్దకు రాసాగారు. నిజానంద స్థితులైన ఆ ప్రభు స్థలంలో అమితమైన జనం నిండడం వల్ల ఏం చేసినా శాంతం అవలేక పోయారు. వేల మంది స్త్రీ పురుషులకు తమ జీవితం తృణప్రాయంగా కనిపించసాగింది. ఎవరు ఎవరినీ గుర్తుపట్టలేకపోయారు. ఆ ఆక్రందనలు దశదిశలా వ్యాపించాయి. దాంట్లో కొందరు తలను భూమికి కొట్టుకొని మోక్షాన్ని పొందారు. కొందరు ఆ స్థలాన్ని చూసి శరీరాన్ని వదిలేశారు.

ప్రభువు జడపదార్థంగా కనిపించే నశ్వర దేహంపై జనానికి అమితమైన ఆసక్తి ఉండడం వల్ల పూర్తి సమాజం శోకతప్తులయ్యారు. ఆ సగుణ స్వరూపంపై జనం ప్రేమ కనపరచడానికి కారణం తెలిసినదే. తన అవతార సమయంలో ప్రభు వేలమంది జీవుల దుఃఖహరణ చేసి సుఖమందించారు. వారు దీనదయాళువు. మనసు కోమలమై ఉండి, ఔదార్యంలో కర్ణుణ్ణి మించిన వారై ఉండిరి. అత్యంత సమర్థులై ఉండి సంపూర్ణ ఐశ్వర్యం వారి పాదాల వద్ద ఉన్నా విరక్తులై ఉండిరి. వ్యవహార కుశలత పరాకాష్టతో లోక కళ్యాణం కోసం దీక్షాబద్ధులై ఉండిరి. అయన స్వరూపంలో, మాటలలో నడవడిలో అత్యంత మాధుర్యం ఉండడం వల్ల సర్వ మతాల వారిని తన సహజమైన ప్రేమాకర్షణతో తన వైపుకు తిప్పుకున్నారు. జ్ఞానులైనవారు వారి జ్ఞాన స్వరూపానికి ఆకర్షితులై ఉండవచ్చు కానీ, సామాన్య జనం ఆయన సగుణ రూపానికి ఆకర్షితులవడం వల్ల ఆ రూపం కనుమరుగవగానే జనసమూహమంతా శోకతప్తులవడంలో ఆశ్చర్యం ఏముంది? ప్రభు యొక్క చరిత్ర వారి జన్మతో మొదలై ఇక్కడ సమాప్తం అయింది. కానీ ప్రభు ప్రారంభించిన భక్తోద్ధరణ కార్యాలు, గాదీ మరియు సంప్రదాయం ఇప్పుడు కూడా కొనసాగుతూ ఉండడంవల్ల ఆ రూపంలో ప్రభు దర్శనం చేసుకొనే వాళ్లకు ప్రభు అస్తిత్వం అనుభవంలోకి వస్తుంది. వారి దివ్య సమాధి దర్శనం చేసుకున్నవారికి ప్రభు తమ 'భక్తకార్యకల్పద్రుమ' బ్రీదం యొక్క అర్థాన్ని సార్థకంచేస్తూ, కోరికలను తీరుస్తూ భక్తుల హృదయాలలో నిరంతరం వాసం చేస్తున్నారనే భావన దృఢమవుతుంది. అందువల్ల ఈ సమాప్తిలోనే ప్రభు కార్యోత్కర్ష బీజరూపంలో నిండి ఉందని మేము నమ్ముతున్నాం.

॥ శ్రీ దత్తాత్రేయార్పణమస్తు ॥ ॥ శ్రీ గురు మాణికార్పణమస్తు ॥

# ఏడవరోజు పారాయణము

## ప్రభు యొక్క ఉత్తరాధికారులు

### 84. శ్రీ మనోహర్ మాణిక్‌ప్రభు

ప్రభు మహారాజ్ సమాధి అయిన తరువాత ధర్మశాస్త్ర ప్రకారంగా కర్మ తాత్యా మహారాజ్ యొక్క జేష్ఠపుత్రులు అప్పాసాహెబ్ మహారాజ్ (శ్రీ మనోహర్ మాణిక్‌ప్రభువును ప్రజలు అప్పాసాహెబ్ అనేవారు) గారి ద్వారా యథా ప్రకారం చేయించి పదహారవ రోజు ఆయనను శాస్త్రోక్తంగా ప్రభుగాది(పీఠం) పై కూర్చోబెట్టారు. ఆ సమయంలో మనోహరుల వయస్సు ఏడు సంవత్సరాలు. ప్రభు యొక్క గాది నడిపించే సామర్థ్యంగల, సంప్రదాయక శిష్యులు దొరకక పోయేవారా? అనే అనుమానం కలుగుతుంది. అలాగే ఆ సమయంలో ప్రభు భక్తులకు కూడా ఈ అనుమానం కలిగి ప్రభు సంస్థాన వ్యవహార ఏర్పాటు ఎలా చేస్తారని ప్రభువుని అడిగేవారు. శిష్యులందరూ ఒకే అభిప్రాయం కలవాళ్లు కాదు. వారిలో ఈ విషయంపై అభిప్రాయభేదాలు ఉండేవి. ప్రభు అందరి మాటలు విని తనకు ఏది సరియైనది అనిపిస్తే అదే చేసేవారు. తాత్యా మహారాజ్ యొక్క ఇద్దరు పుత్రులు ప్రభు సమాధి సమయంలో చాలా చిన్నవారు. పెద్దవారికి (మనోహర ప్రభు) 7 సంవత్సరాలు. చిన్నవారు (మార్తండ ప్రభు) 3-4 సంవత్సరాలు కలవారిగా ఉండిరి. ఇలా చిన్న వయస్సుకల పిల్లల

చేత ప్రభు చేసిన మహాకార్యం ఎలా నిర్వహింపబడుతుందో అని ఆలోచన ఉండేది. అందువల్ల ప్రభు సమాధి అయ్యే సమయం దగ్గరికి వస్తున్న కొద్ది శిష్యుల మనస్సులో ఉత్సుకత కనపడసాగింది. అనేకరకాలుగా ఊహించసాగారు. భాల్కిలో మచ్ఛందర్‌రావ్ అనే ఒక యువకుడు ఉండేవారు. ఈయన ప్రభు తరువాత గాది నడిపించే సామర్థ్యం కల యోగ్యమైన వ్యక్తి అని అందరు ఊహించసాగారు. ప్రభువు కూడా ఆయనపై ప్రేమ చూపించేవారు. చిన్నప్పటినుండి ఆయనను గారాబం చేసేవారు. అందువల్ల సహజంగానే జనం ఆయన గాదిపై కూర్చుంటారనే ఊహించారు. ప్రభు ఆరోగ్యంలో తేడా కనిపించి అనారోగ్యంగా ఉండడం చూసి కొంతమంది మచ్ఛందరావును కావాలని భాల్కి నుండి తీసుకు వచ్చారు. ఆ సమయంలో ఆయనను మేనాలో కూర్చోపెట్టుకొని, బాజాభజంత్రీలతో తీసుకువచ్చారు. మచ్ఛందర్‌రావ్ కోసం ఒక గాది చేయించారు. ప్రభు సన్నిధికి తీసుకువచ్చిన తరువాత ఆయనను ఆ గాదిపై కూర్చోబెట్టారు. కానీ, మచ్ఛందర్ రావ్ యొక్క దురదృష్టం వల్ల ఆ రోజు రాత్రి కారణమేమిటో తెలియదు కానీ ఆయన గాది మంటలలో కాలి బూడిద అయింది. అప్పుడు ప్రభు శిష్యులలో మచ్ఛందర్‌రావ్ పక్షం వహించే వారు చాలా మంది ఉండేవారు.

అందరి కోరిక కూడా ప్రభు తరువాత ఆయనను కూర్చోపెట్టాలని ఉండేది. ప్రభువు వారి కోరికను ఎప్పుడూ తిరస్కరించ లేదు. మచ్ఛందర్‌రావ్‌తో ఇంకా ఎక్కువ ప్రేమగా ఉండేవారు. అందుకని ప్రభు తన గాది మచ్ఛందర్‌రావ్‌కి ఇస్తారనే నమ్మకంతో ఉండేవారు. ప్రభువు మచ్ఛందర్‌రావ్‌ని ఎప్పుడు అనుగ్రహిస్తారా అని అందరూ ఆత్రంగా ఎదురుచూసేవారు. ఈ ఉత్కంఠతలో ఉండగా ప్రభు మహరాజ్‌గారు నలభై వేల రూపాయలు బాకీ పడ్డారని ఒక పుకారు పుట్టింది. ప్రభు సంస్థానం చూస్తే జోళి తప్ప దానికి భూమిలేదు, జాగీరు లేదు. ఇలాంటి సంస్థానానికి నలభై వేల రూపాయల బాకీ. ఈ బాకీని ఎలా తీర్చాలనే పెద్ద ప్రశ్న మచ్ఛందర్‌కి ఉత్పన్నమై ఆయన భయపడిపోయారు. ముందు దొరికే వైభవం కోసం బాధ్యతలు స్వీకరించాలని ఉన్నా, ఆ వైభవంతో పాటు గౌరవం పోయే పరిస్థితి తనపైకి తెచ్చుకోవడానికి సాహసం చేయలేదు. నలభై వేల రూపాయల జవాబుదారి తీసుకోవడానికి ఆయనకు కావలిసిన వాళ్లు కూడా ఎవరూ సిద్ధంగా లేరు. ఆయన భయంతో మెల్లగా మాణిక్‌నగర్

నుండి జారుకున్నారు. చివరికి మార్గశిర శుద్ధ ఏకాదశి రోజు ఎప్పుడైతే ప్రభు సమాధిలో కూర్చున్నారోఅప్పుడు మచ్ఛందర్‌రావ్‌ని పిలుచుకు రమ్మని చెప్పారు. కానీ, వెతికితే చివరికి మచ్ఛిందర్‌రావ్ వర్గీయులు భాల్కికి వెళ్లిపోయారని తెలిసింది. ప్రభు నవ్వుకుంటూ ఇలా అన్నారు, 'అరె బాబా ప్రభు గాదీ నడిపించే పని కఠినమైనది. యోగ్య అధికారి లేకపోతే ఈ పని ఎవరి వల్ల సాధ్యం కాదు.' అప్పాసాహెబ్ యోగ్యత ప్రభువుకి తెలుసు. 'తను చాలా రోజులు ఉండరు అయినా కొంతకాలం మాణిక్‌ప్రభు అనిపించుకుంటారు' ఇలా ఒక సారి ప్రభు అనడం అందరూ విన్నారు. అప్పాసాహెబ్ ఐదుసంవత్సరాలు ఉన్నప్పుడు ఒక సారి దర్బార్‌లో ప్రభు రావడానికి ముందు ప్రభు గాదిపై వచ్చి కూర్చున్నారు. గంభీర స్వరూపధారణ కలిగి ఉండేవారు కనుక జనానికి కూడా అది ముచ్చటగా అనిపించి అందరి దృష్టి అతనిపై ఉండేది. ఇంతలో ప్రభు అక్కడికి వచ్చారు. తన గాదీపై మనోహరుడు కూర్చుండటం చూసి చిరునవ్వుతో ఇలా అన్నారు. బేటా మనోహరా, నా గాదీ నీకు కావాలా? కానీ, గాదిపై కూర్చుంటే శరీరంపై ఉన్న నగలను ఇతరులకు ఇచ్చి వేయాల్సి ఉంటుందని నీకు తెలుసా? అన్నారు. అది వినగానే ఆ ఏడు సంవత్సరాల బాలుడు అత్యంత ధీరోదాత్తతతో వెంటనే ఇలా సమాధానం ఇచ్చాడు - ఈ శరీరంపై ఉన్న నగలన్నీ మీరు ఎవరికి ఇవ్వమంటే వారికి ఇస్తాను, అంటూ మెడలోని కంఠహారం, కడియాలు మొదలైన నగలన్నీ తీసి ప్రభు ముందు పెట్టాడు. ఆ చిన్న బాలుని అపూర్వ గుణం చూసి ప్రభు సంతుష్టులై తన పక్కనే చిన్న గాది వేయించి దానిపై కూర్చోపెట్టుకున్నారు.

తన తరువాత సంస్థానం యొక్క పెద్దరికాన్ని, ప్రభు పరంపరను నడిపించే సామర్థ్యం, తాత్యామహారాజ్ పుత్రులు మనోహరులు చిన్నవయస్కులైనా అత్యంత సమర్థులని ప్రభు మహారాజులవారికి పూర్తి నమ్మకం ఉండేది అనడంలో ఆవగింజంత సంశయం కూడా లేదు. ఏడు సంవత్సరాల వయస్సులో ఉన్న అర్భకునికి బాధ్యతను అప్పగించి ప్రభు కనుమరుగుపడంలో మర్మం ఇదే. పూర్తి వైభవంతో వేగంగా నడిచే ఈ సంస్థాన రూపంలో ఉన్న పడవను కీర్తి సాగరంపైకి తీసుకువచ్చి వదిలి, సూత్రధారి అదృశ్యమయ్యారు. కానీ, ఆ పడవను ఒక ఏడు సంవత్సరాల బాలుడు చాలా చాతుర్యంతో ఒడ్డుకు అదేరూపంలో తీసుకువచ్చి విడిచి పెట్టారు. ఇది అద్భుతమైన చమత్కారం

కదా? గాదిపై కూర్చున్న తరువాత మనోహర ప్రభువుకు సంస్థానం నలభై వేల రూపాయలు బాకీ ఉన్న విషయం తెలిసి ఎవరెవరికి ఎంత ఇవ్వాల్సి ఉందో చిట్టా తయారు చేసి వారిని పిలిపించాలని బప్పాచార్యులకు చెప్పారు. దగ్గర నయాపైసా లేకున్నా షావుకారులను మహారాజుల వారు తమవద్దకు పిలవమని ఆజ్ఞాపించారని అందరికీ ఆశ్చర్యమయింది. కాని మహారాజుల వారి ఆజ్ఞను ధిక్కరించక బప్పాచార్యుల వారు అందరికీ లేఖ వ్రాశారు. పత్రం ఆధారంగా అందరూ క్రమంగా రాసాగారు. కళ్యాణ్ కి చెందిన కిషన్‌గిరి అనే ఒక గోసాయి ఉండెను. ఆయనకు పదివేల రూపాయలు ఇవ్వాల్సి ఉండెను. వారితో మీకు ఎంత ఇవ్వాల్సి ఉంది అని అడిగితే, మహారాజా ప్రభువుకి అప్పు ఇవ్వడానికి నాకు యోగ్యత ఎక్కడిది? ఇంకా నాకే ప్రభు కృపతో లక్షల రూపాయల లాభం వచ్చింది. మా దగ్గర డబ్బు ఉన్నా మా చేతుల నుండి దానధర్మాలు చేయలేము. ప్రభు వద్దకు ధనం వెళితే దానధర్మాలు అవుతాయని నేనే ఇచ్చాను. అది మీరు తిరిగి ఇవ్వాలని నాకు ఆశ కూడా లేదు. దాని గురించి మీరు ఎలాంటి ఆలోచన చేయనక్కర లేదు అన్నారు. తరువాత ఆ గోసాయికి మహారాజుల వారు సన్మానం చేసి ఆదరించి ఇతర షావుకారుల లెక్కలు తెలుసుకొని వారికి డబ్బులు ఇవ్వాల్సిందిగా చెప్పారు. వారందరిని అడిగి తెలిసుకొని అందరి లెక్కలు వేసి ఉంచారు. ఇది పూర్తయి ఎవరికి ఎంత ఇవ్వాల్సిందో నిర్ణయం అయిన తరువాత హైదరాబాద్ నుండి అకస్మాత్తుగా విఠల్‌రావు తాలూకుదారు ఒక బండినిండుగా ధనాన్ని తీసుకువచ్చి మహారాజ్‌కి సమర్పించారు. తరువాత బాకీ ఉన్న షావుకార్లందరికి వారి లెక్క ప్రకారం ధనం ఇచ్చి అందరికీ ప్రసాదం ఇచ్చి పంపించారు. ఆ సమయంలో బప్పాచార్యులవారు ముఖ్య బాధ్యతలు వహించేవారు. ఆయన చిన్న వయస్సులో ఉన్న మనోహర మహరాజు యొక్క ఈ అద్భుత కార్యకుశలతకు ఆశ్చర్యచకితులైరి.

మనోహర మహారాజు గారి కార్యభారం కేవలం 12 సంవత్సరాలు నడిచింది. చిన్నవయస్సులోనే అత్యంత మహత్వపూర్ణమైన కార్యకుశలత చూపించారు. ఈయనకు సంస్కృత బాషలో మంచి ప్రావీణ్యం ఉండేది. సాంప్రదాయ పూజా పద్ధతి ఈయనే తయారు చేసి సంప్రదాయానికి ఒక స్వరూపం తీసుకు వచ్చారు. ప్రభు సమాధిపై సుందర దేవాలయాన్ని ఈయన

తన కార్యభారంలో నిర్మింపజేశారు. వీరి స్వరూపం వలె స్వభావం కూడా చాలా సుందరంగా ఉండేది. వేలమంది భక్తులు ఈయన దివ్య తేజస్సు కల ముఖం చూస్తూ విస్మితులయ్యేవారు. వీరికి యోగాభ్యాసంపై మక్కువ ఎక్కువ. అన్ని వ్యవహారాలు యథాప్రకారంగా నియమితవేళలో జరగాలని అనేవారు. వీరి భాషణ మృదువై వినోదంతో కూడి ఉండేది. వీరు కోపగించడం ఎవరూ ఎప్పుడూ చూడలేదు. ఈయన ఆహారం సాత్వికంగా ఉండేది. విద్వాంసులపై చాలా ప్రేమ చూపేవారు. అలాగే యోగ్యులైన విద్వాంసులకు కానుకలు, వస్త్రాలు ఇచ్చి సంతృప్తులను చేసేవారు. వీరు వ్రాసిన చాలా పద్యాలు ముద్రించ బడ్డాయి. ఈయన పద్య రూపంలో ప్రభుచరిత్ర వ్రాశారు కానీ, అది పూర్తవలేదు. వీరికి మాతృభక్తి ఎక్కువ. తన జ్యేష్ఠసోదరిపై, కనిష్ఠసోదరుడైన ఖండేరావుపై అమితమైన ప్రేమ ఉండేది. వీరు చివరి వరకు కఠిన బ్రాహ్మచర్యాన్ని పాటించారు. ఈయన ఔదార్య గుణాన్ని ఇప్పటికీ ప్రజలు గానం చేస్తారు. ఈయనకు ఒకసారి అస్వస్థత కలిగింది. ఆ సమయంలో హైదరాబాద్‌కి చెందిన లోకాబాపు అనే వైద్యులు వీరి దర్శనానికి వచ్చారు. ఆయన చాలా శ్రమతో మహారాజుల వారికి ఔషధాలు ఇచ్చి నయం చేశారు. మహారాజుల వారు సంతుష్టులై లోకాబాపుకి నాణ్యమైన వస్త్రాలు, చాలాద్రవ్యం ఇచ్చి ఇంటికి వెళ్లడానికి ప్రసాదం ఇచ్చారు. మహారాజుల వారి మెడలో ప్రభు ఇచ్చిన ఏకముఖీ రుద్రాక్ష తనకు కావాలని ఆయనకు కోరికగా ఉండేది. కానీ, బిడియంతో అడగలేక పోయారు. ఏకముఖీ రుద్రాక్ష ప్రభు యొక్క ప్రసాదం అయి ఉండడం వల్ల ఎవ్వరికీ ఇవ్వవద్దని అందరూ చెప్పి ఉండిరి. కానీ, లోకాబాపుకి ఆ రుద్రాక్షపై కోరిక ఉండడం చూసి ఏదైనా కారణంతో వారికి అది అందించాలని, సంగము వరకు మహారాజుగారు స్వయంగా వెళ్లి లోకాబాపుగారిని ఒక పక్కకు పిలిచి తన మెడలోని ఏకముఖీ రుద్రాక్ష తీసి వారికి ఇచ్చారు. ఇతరుల అంతరంగాన్ని గ్రహించే ఈ సామర్థ్యం చూసి లోకాబాపు ఆశ్చర్యచకితులయి, తనకు కావలసిన వస్తువు దొరికిందన్న ఆనందంతో మహారాజుల వారికి సాష్టాంగ నమస్కారం చేశారు.

మనోహర మహరాజ్ యొక్క ఔదార్య విషయంలో ఇలా అసంఖ్యాకమైన విషయాలు కథలో వినిపిస్తాయి. సంస్థానం యొక్క పూర్తి భారం అత్యంత దక్షతతో నడిపి ప్రభు కీర్తిని ఇనుమడింపజేశారు. ప్రభు ప్రారంభించిన ఉత్సవాలు

యథాప్రకారం నడిపిస్తూ, ప్రభునామం ప్రజలు మరవకుండా చేశారు. ప్రభు లాగే భక్తులు ఈయనకు కూడా పూజ చేయసాగారు. ప్రభు సామర్థ్యం వీరిలో కనిపించి ఎవరికీ ప్రభు వియోగం గుర్తుకు రాలేదు. మహారాజు వివాహం చేసుకోవాలని మాతృశ్రీ విఠాబాయి అమ్మకు కోరికగా ఉండేది. వీరిని ప్రేమించే భక్తమండలికి కూడా ఈ విషయం నచ్చింది. కానీ, మహారాజుల వారికి ఈ విషయం చెప్పే ధైర్యం ఎవరికీ లేదు. అక్క ముక్తాబాయి యొక్క వివాహం వైభవంగా చేయించారు. యుక్తవయస్సులో ఉన్న తన గురు పుత్రుడు కేశవదీక్షిత్‌తో ముక్తాబాయిని సాలంకృత కన్యాదానం చేసి, తరువాత వారి జీవనభారం తానే వహించారు. శక సంవత్సరం 1795 జేష్ట మాసంలో మహారాజులవారి వయస్సు 15 సంవత్సరాలున్నప్పుడు వివాహ ఏర్పాట్లు పెద్ద ఎత్తున జరుగసాగాయి.పెళ్ళికి కావలిసిన వస్తువులన్నీ సమకూరాయి. పెళ్లి మండపాలతో మాణిక్‌నగర్ శోభాయమానమయింది. వివాహం ఎవరిదో ఎవరికీ తెలియలేదు. కొందరు మహరాజ్ స్వయంగా తావే వివాహం చేసుకుంటున్నారని ఊహించసాగారు. ఈ విషయం అందరికీ ఆనందం కలిగించినా, కన్య ఎవరో ఎవరికీ తెలియలేదు. ఏర్పాట్లు జరిగి ముహూర్తం నిర్ణయించబడింది. కానీ, పెళ్లికొడుకు- పెళ్లికూతురు ఎవరో తెలియలేదు. అందరూ సంశయంలో పడ్డారు. చివరికి మాతృశ్రీ, మహరాజ్‌ను ఈ విషయం గురించి అడిగారు. మనోహరులు వివాహం చేసుకొని గృహస్థాశ్రమం స్వీకరించాలని ఆమెకు కోరికగా ఉండడం వల్ల పెళ్ళి ఏర్పాట్లు చేయసాగారు. కానీ, మహారాజుగారు తాను వివాహం చేసుకోవడం లేదని ఖండీ (మార్తండ ప్రభు) వివాహం చేస్తున్నానని మాతృశ్రీకి చెప్పారు. అప్పుడు మాతృశ్రీకి ఇది నచ్చలేదు. కానీ, వారు సముదాయించి చెప్పిన తరువాత ఖండీదయితే ఏంటి? వివాహం కావడం ఆనందించాల్సిన విషయం. కన్య ఎవరు? అని మాతృశ్రీ అడిగితే మహారాజుల వారు బాప్పాచార్యుల కూతురును చూసి, నచ్చడం జరిగి వివాహ ముహుర్తం కూడా నిశ్చయించడం జరిగింది అని చెప్పారు.

ఈ విధంగా మహారాజుల వారు తమ కనిష్ఠసోదరుని వివాహం వైభవంగా చేశారు. ప్రభు వంశం విస్తరించడానికి మార్గం సుగమమయిందని అందరికీ ఆనందం కలిగింది. మహారాజు తన కనిష్ఠసోదరుని అన్ని బాధ్యతలు తీర్చడానికి ఏ మాత్రం వెనుకాడలేదు. వారి శిక్షణకు అనువైన ఏర్పాట్లు చేశారు. వివాహ

సమయంలో ఖండేరావు మహారాజు వయస్సు పన్నెండు సంవత్సరాలు. వివాహం తరువాత మూడు సంవత్సరాలు శిక్షణ సక్రమంగా జరిగి వివిధ విద్యలలో మరియు కళలలో ప్రగతి సాధించారు. మనోహర మహారాజుల వారికి సోదరుని సామర్థ్యం ఏ విధంగా ఉండాలనుకున్నారో అలాగే ఉందని అనుకొని తన తరువాత ప్రభు గాది నడిపించి, సంస్థానానికి కీర్తిని తీసుకురావడానికి ఖండీ అన్నివిధాలుగా సరియైనవారని వారు ముందే నిశ్చయించుకున్నారు. మహారాజుల వారు యోగాభ్యాసంలో ఆసక్తి ఉండి పరమయోగి అయి ఉండిరి. ప్రభు సమాధి యొక్క వెనక బాగంలోని స్థలంలో భూమిలోపల ఒక గుయ్యారం (తళఘర్) (కిందిభాగంలో చిన్నగది) తయారు చేయాల్సిందిగా ఆజ్ఞాపించారు. ఆయన చెప్పినట్లుగా అదే నమూనాలో క్రింద గది తయారయిన తరువాత చూడడానికి ఆ గది తయారు చేసిన వాళ్లతో పాటు అక్కడికి వెళ్లారు. ఆ గది మూడు కమానులతో ఉండెను. ఆ మూడు కమానులలో మధ్య కమానులో తాము స్వయంగా ఆసనం వేసి కూర్చున్నారు. ఆ సమయంలో వారి నోటినుండి సహజమైన సంతోషంతో 'ఆహా, ఈ స్థలం యోగ సమాధికి చాలా బావుంది' అనే మాటలు వెలువడ్డాయి.

పై సంఘటన జరిగిన ఆరు నెలల తరువాత మహారాజుల వారి ఆరోగ్యంలో తేడా కనిపించింది. అశ్వీజమాసం కృష్ణపక్షం సప్తమి శక 1899 సంవత్సరం ఆదివారం రోజున అకస్మాత్తుగా రెండు సార్లు వాంతి అయి, ఆరోగ్యం విషమించింది. జనమంతా భయపడిపోయారు. కానీ అందరికి ధైర్యం చెప్పి శాంతపరిచారు. తరువాత విధిపూర్వకంగా చతుర్థాశ్రమము తీసుకొని మాతృశ్రీకి నమస్కరించారు. కనిష్ఠ సోదరుడు ఖండేరావుకి ఉపదేశం ఇచ్చి ప్రసాదం ఇచ్చారు. భక్తమండలికి ప్రసాదం ఇచ్చిన తరువాత ఆసనం సిద్ధం చేసుకొని యోగసమాధిగతులయ్యారు. పూర్తి మాణిక్‌నగర్ దుఃఖసాగరమయింది. చూస్తుండగానే ఆ తేజోవంతమైన తార రాలిపోవడం చూసి అందరూ శోకతప్తులయ్యారు. మాతృశ్రీ దుఃఖానికి అంతులేకుండా పోయింది. ఈ దుఃఖ సమయంలో ఎవరు ఎవరిని సముదాయించాలో తెలియలేదు. కానీ కార్యకర్తలు దుఃఖాన్ని దిగమింగుకొని ముందు జరుగవలసిన విధిని శాస్త్రప్రకారంగా జరిపించారు. ఆసనం వేసుకొని పీటమీద కూర్చున్న మహారాజుల యొక్క దేహాన్ని ఎలా ఉందో అలాగే ఎత్తి, ప్రభు సమాధి వెనక

క్రింది గదిలోకి తెచ్చి ఏ కమానులో మహారాజుల వారు యోగసమాధికి అనువైనదని అన్నారో ఆ మధ్య కమానులో ఉంచి యధోచితంగా పూజా ద్రవ్యాలతో, సుగంధ ద్రవ్యాలతో ఆ కమాను నింపి దేహాన్ని కనుమరుగు చేశారు. ఇలా జరగడం హృదయ విదారకమైనా కూడా అది మనోహర ప్రభువుకు ఇష్టమవడం వల్ల ఎవరూ ఏమీ అనలేక పోయారు.

## 85. మార్తండ మాణిక్ ప్రభు

శ్రీ సద్గురు మాణిక్‌ప్రభు మహారాజుగారు సకలమతసంప్రదాయ స్థాపన చేసి ప్రపంచానికి సర్వధర్మాలు సమభావంతో చూడవలననే సందేశం ఇచ్చి భారతదేశం నడిబొడ్డులో నిజాం సంస్థానంలోని, ముసల్మానులు పరిపాలిస్తున్న ప్రదేశంలో హిందూ, ముస్లిం, సిఖ్, లింగాయత్ మొదలైన ధర్మాలలో సౌహార్ద్రం పెంపొందించారు. కానీ, ఈ తత్వజ్ఞానాన్ని విశదపరిచే కార్యం వీరి సోదరుని పుత్రులైన శ్రీ సద్గురు మార్తండ మాణిక్ ప్రభువులవారు చేశారు. అందుకోసం ఆయన విపులమైన గ్రంథరచన చేశారు. అప్పటి నిజాం సంస్థానము, ముంబాయి, మద్రాసు మొదలైన ప్రాంతాలలో పర్యటించి సకలమత సాంప్రదాయము యొక్క ప్రచారం చేశారు. వీరు సకలమత సంప్రదాయాన్ని మరియు మాణిక్‌ప్రభు యొక్క కీర్తిధ్వజాన్ని ఆసేతుహిమాచలంలో ఎగురవేశారు. శ్రీ మార్తండ మాణిక్‌ప్రభువు, శ్రీ నృసింహతాత్యా మరియు విఠాబాయి అమ్మగారి కనిష్ఠ పుత్రులు. వీరు మార్గశిర మాసం 28 డిసెంబర్ 1869న జన్మించారు. ఈయనకు పితృఛత్రం (తండ్రితో గడపడం) కొంతకాలమే లభించింది. వీరికి ప్రభు ప్రేమ కేవలం నాలుగుసంవత్సరాల కాలం లభించింది. వీరి జేష్ఠ సోదరులు శ్రీ మనోహర్ మాణిక్ ప్రభువులకు వీరిపై అమితమైన ప్రేమ ఉండేది. 'ఖండీ' (మార్తండ ప్రభువుల పేరు ఖండేరావు అవడం వల్ల వారిని ఇంట్లోనివారు ప్రేమతో ఖండీ అనేవారు) శిక్షణ కోసం అన్ని రకాలుగా ఏర్పాటు చేసి, స్వతహాగా బ్రహ్మచారియైనా మార్తండ ప్రభువుల వివాహం మాత్రం జరిపించారు. శ్రీ మార్తండ మాణిక్‌ప్రభువుని ఆ కాలంలో జనం ఖండేరావు అనేవారు. సంస్థానము యొక్క కార్యభారం చూడడానికి అన్నివిధాలుగా అర్హులని నమ్మకం కలిగిన తరువాత శ్రీ మనోహర్ మాణిక్‌ప్రభు తన అవతార

కార్యం ముగించారు. వీరికి కేవలం పన్నెండు సంవత్సరాలు మాత్రమే మనోహర మాణిక్‌ప్రభువుల సహవాసం లభించింది. ఈయన తన జేష్ఠ సోదరుడు శ్రీ మనోహర్ మాణిక్‌ప్రభు యొక్క నిర్యాణము తరువాత సకలమత సంప్రదాయము యొక్క తృతీయ ఆచార్యులుగా మాణిక్‌నగర్ సంస్థానము యొక్క గాదిపై కూర్చున్నారు.

వీరు గాదిపై కూర్చున్నప్పుడు కేవలం పదహారు సంవత్సరాలు. చిన్న వయస్సులోనే సంప్రదాయం మరియు సంస్థానము యొక్క బాధ్యతలు తీసుకోవడానికి సంశయించలేదు. తమ సామర్థ్యంపై వీరికి పూర్తివిశ్వాసం ఉండేది. సంస్థాన గాదిపై కూర్చున్న తరువాత 58 సంవత్సరాలు నిరంతరాయంగా, అవిశ్రాంత శ్రమతో సంస్థానాన్ని మరియు సంప్రదాయాన్ని స్వకర్తృత్వ బలంతో ఇప్పటి దివ్యమైన విశాల స్వరూపాన్నిచ్చి ఆసేతు హిమాచలం సంప్రదాయం యొక్క ప్రచారం చేశారు.

స్వతంత్రతత మరియు పూర్ణావస్థ ఇవి శ్రీజీ యొక్క జీవిత నిర్దేశకాలు అయి ఉండెను. అసంపూర్ణ స్థితిలో ఉన్న కార్యాలను పూర్తి చేశారు. ఇది ఈయనకు చిన్నతనం నుండి ఉన్న స్వభావం.

దేనికైనా చింతించడం లేదా ఇతరుల అదుపాజ్ఞల్లో ఉండడం వీరి స్వభావంలోనే లేదు. భోగం మరియు త్యాగంలో తేడా చూపించేవారు కాదు. పూవు పుట్టగానే పరిమళిస్తుంది అంటారు. అలా శ్రీజీ యొక్క మనోవృత్తి బాల్యం లోనే కనిపించేది. వీరు పొడుపైన బట్టలు ధరించి శరీరం పై నగలు వేసుకునేవారు. మరియు వాటిని ఎప్పుడు ఎవరికి ఇచ్చేవారో తెలిసేది కాదు. ఫకీరులకు బైరాగులకు తన శరీరంపై ఉన్న బట్టలు ఇచ్చేస్తూ వారి వాద్యాలు తీసుకొని వాయిస్తూ కూర్చునేవారు.

చిన్నప్పుడు శ్రీజీ కొంటె తనంగా ఉండేవారు. మైదానంలో ఆడే ఆటలంటే ఆయనకు చాలా ఇష్టంగా ఉండేది. ఈత, గుర్రంపై స్వారీచేయడం, గురిపెట్టి కొట్టడంలో ఆయన నైపుణ్యాన్ని సంపాదించారు. గంటలు గంటలు నీటి కొలను వద్ద కూర్చునేవారు. గుర్రపు స్వారీ కౌశల్యం చూసి సర్కసవాలేఛత్రే

అనే ఆయన తన స్వంతగుర్రాన్ని అర్పించారు. మల్లవిద్యలో కూడా ఆయన నైపుణ్యాన్ని సంపాదించారు. ఎవరి అదుపాజ్ఞలు లేకుండా స్వతంత్రంగా వ్యవహరించడం వల్ల వారి గురించి మాతృశ్రీకి దిగులుగా ఉండేది. మంచి మాటలతో సముదాయించేవారు. అందుకని శ్రీజీ రాత్రి తొమ్మిది గంటలకు పరిసరాలు నిశబ్దం అయిన తరువాత తన సామాగ్రితో బయటపడేవారు. రాత్రంతా మనసారా ఈత ఈది దశదిశలా తిరిగి తెల్లవారుజామున నాలుగు గంటలకు ఇంటికి వచ్చి పడుకునే వారు. వారికి రాత్రి వ్యవహారాలు చేయడం చిన్నప్పటి నుండే అలవాటయింది. పెద్దయిన తరువాత కూడా అన్ని కార్యక్రమాలు రాత్రి పూటే జరిగేవి. అందుకని ఖండేరావు మహారాజ్‌ల దర్బార్ అంటే 'రాత్రి దర్బార్' అని రూఢి అయింది.

చిన్న తనంలో క్రీడాప్రియత్వం వలె యుక్త వయస్సులో మరియు ప్రౌఢావస్థలో తమ కర్తవ్యాలను మనస్సు పెట్టి పూర్తి చేశారు. మరాఠీ, సంస్కృతం, ఉర్దూ, పార్సీ మొదలైన బాషలు కొద్ది కాలంలోనే నేర్చుకున్నారు. తరువాత ఆయన సంగీతము, జ్యోతిష్యం, మంత్ర విద్య మొదలైనవి అభ్యసించి నైపుణ్యాన్ని సంపాదించారు. ఈ విషయాలలో ఆయన వ్యాసంగం చివరి వరకు ఉండేది. ఆయన సంగీత జ్ఞానం కలిగిన వారై ఉండిరి. అందుకని ఆ కాలంలో హిందుస్థాన్‌లోని చాలా మంది గాయకులు, మాణిక్‌నగర్‌కు రావడం చాలా కష్టమైనా కూడా వచ్చి, శ్రీజీ ముందు తమ విద్యను ప్రదర్శించేవారు. ముంబాయిలో తాము బసచేసినప్పుడు శ్రీజీ అనేక సార్లు గంధర్వ మహా విద్యాలయంలో ఉండేవారు. దాని రహస్యం అదే కావచ్చు. గోవింద్‌బువా ఆఠవలే అనే పేరుగల సంగీత ప్రేమికుడు రత్నగిరి జిల్లాకు చెందిన వారు. సంగీతం నేర్చుకోవడానికి బెల్‌గావ్‌కి వెళ్లారు. అక్కడ సంగీత శాస్త్రంలో శ్రీజీ యొక్క కీర్తి విన్నారు. అప్పుడు తాను సంగీతం నేర్చుకోవడానికి శ్రీజీ వద్దకు వెళ్లాలని బలమైన కోరిక కలిగింది. కానీ, ఎలా వెళ్లాలి? అప్పుడు 1915 వ సంవత్సరం. అప్పుడు ఇప్పటిలాగా వాహన వ్యవస్థ లేదు. మాణిక్‌నగర్ చాలా దూరం. అంతేకాక ఆయన వద్ద ధనం కూడా లేదు. ఆయన మనస్సులోనే శ్రీజీని ప్రార్థించారు. ఇంతలో ఒక సన్యాసి ఆయన వద్దకు వచ్చారు. బాలా! నీకు మాణిక్‌నగర్‌కి వెళ్లాలని ఉందా? అని అడిగారు. గోవింద్‌బువాకి ఆయన దేవుడిలాగే కనిపించారు. ఆ సన్యాసి ఒక ఎద్దులబండి తెప్పించారు. దాంట్లో

ఇద్దరూ మాణిక్‌నగర్ కి వచ్చారు. గోవింద్‌బువాకి చాలా ఆనందం కలిగింది. బండి నుండి కిందకి దిగగానే ఆ సన్యాసి గోవింద్ బువాకి ఎదురుగా ఉన్న బావి చూపించి అక్కడకి వెళ్లి కాళ్లు చేతులు కడుక్కొని నీరు త్రాగి రావలసిందిగా చెప్పారు. అలా చేసి తిరిగి వచ్చేసరికి ఆ సన్యాసి అదృశ్యమయ్యారు. తన ప్రార్థనకు శ్రీజీనే ఈ ఏర్పాటు చేశారని భావించి భక్తితో నమస్కరించారు. గోవింద్‌బువా తన వృద్ధాప్యంలో మాణిక్‌నగర్‌లోనే నివసించారు. ఆ కాలంలో మనవైపు మంత్రశాస్త్రం ఉపయోగించడం తగ్గుతూ వస్తోంది. సూక్ష్మలోకాల్లో ఎల్లప్పుడు తిరిగే అనేక రకాలైన సామర్థ్యం కలిగిన దేవతలను వశం చేసుకుంటే వారు కోరికలను తీరుస్తారని మహారాజుల వారి దృఢవిశ్వాసం. శ్రీజీ దేవతలను తన తపోబలంతో వశం చేసుకొని వారి నుండి ఇష్టకార్యాన్ని సాధించుకునేవారు. ఈ తపశ్చర్య కోసం రాత్రింబవళ్ళు తేడా లేకుండా చాలా పరిశ్రమించారు. 'అఫలోదయకర్మ'(ఫలాపేక్ష లేకుండా చేసే కర్మ) ఇది శ్రీజీ యొక్క జీవన రహస్యం. శ్రీజీ యొక్క కాలంలో శ్రీజీయే అఖిలభారతంలో మంత్రశాస్త్రంలో సర్వజ్ఞులై ఉండేవారు.

మంత్రశాస్త్రం అగ్ని వంటిది. అగ్ని సహాయంతో జీవనానికి అవసరమైన అన్నాన్ని ఉడికించవచ్చు. కానీ కొందరు దుష్ట జనులు అగ్నితో ఇతరుల ఇళ్లను తగుల బెట్టనూవచ్చు. శ్రీజీ ఈ విధంగా దుష్ట జనులు తమ మంత్రశాస్త్ర సామర్థ్యంతో సజ్జనులను, బీదలను పీడించడం చూసి సహించలేక పోయారు. అందుకని కోమల స్వభావి అయిన శ్రీజీ మంత్రశాస్త్రాన్ని సాధన చేసి దుష్టులను భయకంపితులను చేసి వారి దుశ్చర్యలను ఆపారు. మంత్ర శాస్త్రాన్ని అతి పవిత్రమైన దైవకార్యం అనే దృష్టితో శ్రీజీ చూసేవారు. అందుకని అనధికారి వ్యక్తి చేయి ఆ వైపు వెళ్లకూడదని అతి దక్షత చూపేవారు. దత్తోపంత్ అనే పేరుగల గృహస్థు 1921 వ సంవత్సరం నుండి శ్రీజీవద్ద ఉండేవారు. శ్రీజీ వద్ద ఆయన నీడలాగా ఉంటూ శ్రీజీ నుండి ఎంత విద్య సంపాదించవచ్చో దానిని సంపాదించడానికి ప్రయత్నించేవారు. మధుమతి శక్తితో పాటు దత్తాత్రేయోపాసన కూడా దొరకాలని ఆయనకు కోరికగా ఉండేది. శక్తిసహితంగా దత్తోపాసన మధ్యలో శ్రీ ఉపాసన అంతర్భాగంగా ఉండేది. ఈ శ్రీచక్ర ఉపాసన సఫలమయితే ఉపాసకులు సర్వ శక్తిమంతులవుతారు. దత్తోపంత్ మహత్వ కాంక్షగల గృహస్థులై ఉండిరి. అందువల్ల శక్తిసహిత దత్తోపాసనయే కాకుండా

ఇతర ఏ మహత్తరమైన మంత్రాలు శ్రీజీ ఆయనకు ఇవ్వలేదు. దత్తోపంత్ మంత్రోపదేశం కోసం మరీ మరీ అడగగా ఆయనను శ్రీజీ శంకర మహరాజుల వద్దకు పంపించారు.

ఈ శంకర్ మహరాజ్ వారి సమాధి పూనాకు సమీపంలోని అరుణేశ్వర్ దగ్గర ఉన్నది. ఈయన దత్తోపాసకులై శాక్తపంథాలో ఉండిరి. వీరి శ్రీ ఉపాసన సఫలమై ఉండెను. ఈయన శక్తి ఉపాసన కోసం మధుపానం చేసి మత్తులో ఉండేవారు. శిష్యులు ఆ సమయంలో సేవ చేసేవారు. దత్తోపంత్ ఆయన నివాసానికి వెళ్లినప్పుడు ఆయన మత్తులోనే ఉన్నారు. అయినా ఆయన వచ్చినప్పుడు శంకరమహారాజ్ లేచి కూర్చుని ఆయనను లోపలికి పిలిచారు. దత్తోపంత్ తెచ్చిన కొబ్బరి కాయ, పేడా ముందు పెట్టి మెడలో హారం వేయాలనుకున్నారు. కానీ, శంకర మహారాజుల వారు ఆ హారాన్ని చేతిలోనికి తీసుకొని ఇలా అన్నారు. 'ఇలా చూడండి దత్తోపంత్‌గారు! మీరు మార్తండ మాణిక్‌ప్రభు వద్ద నుండి వచ్చారు. మిమ్మల్ని వారి ప్రతినిధిగా భావించి మీకు హారం వేస్తాను. మీకు శక్తిసహిత దత్తోపాసన కావాలి. నేను ఆ దేవి పుత్రుణ్ణి. నేను మీకు ఏమి ఇవ్వగలను. ఆ దేవత శ్రీ మార్తండ మాణిక్‌ప్రభు సేవకులపై కరుణిస్తుంది. మీరు వెళ్లి మార్తండ ప్రభు సేవ చేయండి.' దాంతో దత్తోపంత్‌కి తిరిగి చేతులు ఊపుకుంటూ వెనక్కి రావాల్సి వచ్చింది.

మాతృశ్రీ విఠమ్మా పాతకాలానికి చెందిన స్త్రీ అయి ఉండెను. హైదరాబాద్‌కి చెందిన ప్రసిద్ధ లేఖకులు, కవి అయిన శ్రీ యశ్వంత్‌రావు కురేకర్‌కి అత్తమ్మ. దానధర్మాలు, వ్రతాలు భక్తి శ్రద్ధలతో చేసేవారు. ఒక సారి ఆమె సముద్ర స్నానం చేయాలనే కోరికను శ్రీజీకి తెలిపారు. అమ్మా, మాణిక్‌నగర్‌లో సర్వ తీర్థాలు ఉన్నాయి. ఇక్కడే అందరు దేవతలు నివాసం చేస్తారు, ఎక్కడికి వెళ్ళే అవసరం లేదు అని సముదాయించే ప్రయత్నం చేశారు. కానీ, ఆమె ఒప్పుకోలేదు. అప్పుడు స్నానం కోసం తయారు చేసిన నీటిని నోటిలో పోసుకోమని చెప్పారు. అప్పుడు ఆ నీరు సముద్రం నీటివలె ఉప్పుగా అనిపించాయి. అప్పుడు ఆమె తన కోరికను శ్రీజీ మాటలపై విశ్వాసంతో విరమించుకున్నారు. తరువాత ఒకసారి నాందేడ్‌కి గోదావరి స్నానానికి వెళ్లినప్పుడు ఆరోగ్యం క్షీణించి స్వర్గస్థులయ్యారు.

శ్రీ మనోహర్ మాణిక్‌ప్రభు శ్రీజీ యొక్క వివాహం చేసినప్పుడు పన్నెండు సంవత్సరాల వయస్సులో ఉండిరి. సౌ. బయాబాయి సంస్థానము ముఖ్య కార్యనిర్వాహకులు బప్పాచార్యుల కుమార్తె. ఈమె అత్యంత శాంత మూర్తియై సాధారణ అమాయక స్త్రీ అయి ఉండెను. శ్రీజీ కంటే ముందే ఆమె స్వర్గస్తులయ్యారు.

శ్రీజీకి ఇద్దరు పుత్రులు, ఒక పుత్రిక ఉండిరి. పెద్ద కుమారుడు శ్రీ నృసింహ ఉరఫ్ బాబాసాహెబ్. ఈయన పుష్యశుక్ల అష్టమి రోజు జన్మించారు. శ్రీజీ యొక్క మొదటి సంతానము పుత్రుడు కావడం వల్ల మాణిక్‌నగర్ జనం సంతోషపడినారు. బాబాసాహెబ్‌గారు అత్యంత బద్ధిమంతులై, వ్యవహార దక్షులై కార్యక్రమ నిర్వాహకులై ఉండిరి. ఈయన వ్యవహార శైలి అత్యంత సమగ్రంగా ఉండేది. ప్రతీ విషయం వ్యవస్థాయుతంగా, సమయం ప్రకారం జరగాలని చూసేవారు. ఈయన గంభీర స్వభావులై అత్యంత మితభాషి అయి ఉండిరి. ఈయనకు సంస్కృతం, మరాఠీ, కన్నడ, ఇంగ్లీష్, ఉర్దూ మరియు పార్సీ భాషలలో మంచి ప్రావీణ్యం ఉండేది. ఈయనకు పఠనంలో ఆసక్తి ఎక్కువ. జ్యోతిష్యం మరియు వైదిక శాస్త్ర అధ్యయనం చేసారు. అయినా వీరికి ఇష్టమైన విషయం వేదాంతం. ఈయన స్వభావంలో ఏకాంతప్రియులు, ఆధ్యాత్మ చింతనా శీలురై ఉండిరి.

శ్రీజీపై మరియు తన మాతృశ్రీపై అంత్యంత భక్తితో ఉండేవారు. ఆయన తన సోదరునిపై మరియు మేనత్తకొడుకు శ్రీ శంకర్‌రావుపై అమితమైనప్రేమతో ఉండి, వారి శిక్షణపై అత్యంత శ్రద్ధ చూపేవారు. శ్రీజీకి సహాయం అవాలని సంస్థానము యొక్క కార్యభారం బాబాసాహెబ్ తన చేతుల్లోకి తీసుకున్నారు. శ్రీజీ కాలంలో జరిగిన కట్టడాలు, మందిర జీర్ణోద్ధరణ, కొత్త మందిర నిర్మాణపనులలో బాబాసాహెబ్‌దే సింహభాగం శ్రమ. శ్రీ సద్గురు మాణిక్ ప్రభు మరియు సంస్థానం వీటి వాంఙ్మయ సంశోధన, పరిశీలన మరియు ప్రచురింపజేసే కార్యం ఈయన ప్రారంభించారు. సహజంగా ఉండి ఉన్నతరీతిలో ఆలోచన చేయడంలో బాబాసాహెబ్ మూర్తీభవించిన ఉదాహరణ. ఈయన సాధారణంగా ఉంటూ బద్ధకాన్ని వ్యతిరేకించేవారు. తన చివరి సమయంలో జలోదరంతో బాధపడుతూ మందులు తీసుకునే వారు. కానీ,

ప్రభు యొక్క అంగారం (భస్మం), తీర్థం ఎప్పుడూ తప్పలేదు. ఈయన మరణించేనాటికి ఈయనకు సంతానం లేనందువల్ల అందరూ చాలా బాధపడ్డారు. శ్రీజీకి కూడా చాలా బాధ కలిగింది. కానీ, శ్రీజీ స్థితప్రజ్ఞులు కనుక ఇలా అన్నారు. బాబా తన కర్తవ్యాన్ని సరైన రీతిలో పూర్తిచేశారు. అందుకని మరణించినా కూడా వారు అమరులయ్యారు. శ్రీజీ యొక్క చిన్న కుమారుడు శ్రీ మహిపత్ ఉరఫ్ భావుసాహెబ్, వీరు బాబాసాహెబ్ కంటే ముందే మరణించారు. ఈయనకు సంతానం లేకుండెను. శ్రీజీ యొక్క చిన్న కుమార్తె మనుబాయిని కళ్యాణ్‌కి చెందిన మాణిక్‌రావుదేశ్‌పాండేకు ఇచ్చి వివాహం జరిపించారు. శ్రీ అప్పాసాహెబ్‌గారు వీరి పుత్రులు.

ఈ ముగ్గురు సంతానం వల్ల శ్రీజీ జీవితం పూలబాట అయింది. కానీ తరువాత ఇద్దరు పుత్రులు ఆయనకు దూరం అయ్యారు. శ్రీజీ తన మేనల్లుడైన శ్రీ శంకర్‌రావుని పుత్రునిగా తన వద్దనే ఉంచుకున్నారు. శ్రీజీ యొక్క ప్రసాదంతో జన్మించి ఈయన ప్రభు కార్యంలోనే ఉండిరి. బాబాసాహెబ్ యొక్క మృత్యువు తరువాత శంకర్‌రావు సంస్థానము యొక్క కార్యభారం వహించారు. విశాల హృదయం మరియు దూరదృష్టి ఉన్న శ్రీ సద్గురు మాణిక్‌ప్రభు మాణిక్‌నగర్ యొక్క రమణీయ స్థలంలో విశ్వబంధుత్వం అనే పీఠంపై సకలమత సంప్రదాయం యొక్క ప్రతిష్ఠాపన చేశారు. ఈ మాణిక్‌నగర్ యొక్క నిర్మాణానికి ఆయనకు ఇద్దరు సోదరుల సహాయమూ లభించింది. తరువాత శ్రీ మనోహర్ ప్రభు మాణిక్‌ప్రభు మందిరాన్ని నిర్మించారు. ఆ మందిరము సకలమత సంప్రదాయ అధిష్టదేవతా మందిరము. శ్రీజీ మాణిక్‌ప్రభు మందిరానికి ఆకర్షణీయమైన సభామండపం నిర్మించారు. అలాగే స్వయంసామర్థ్యం మరియు బుద్ధిబలంతో ప్రతిభ మరియు తపశ్శక్తి సహాయంతో సకలమత సాంప్రదాయ మందిరానికి భవ్యరూపం అందించారు. శ్రీజీ శ్రీ మాణిక్‌ప్రభు మందిరానికి నిర్మించిన సభామండపం చిన్నగా ఉన్నా కూడా అత్యంత రమణీయంగా ఉంది. ఆయన పని కేవలం చూడడానికే కాకుండా అభ్యసనీయము కూడా. దేవాలయంపై ఉన్న కళాకృతి చూసి చూసేవారు ఆనందానికి లోనవుతారు. ఈ సంపూర్ణ మందిరంలోని నేలపై పరిచిన పాలరాతి బండలు శ్రీజీ యొక్క సోదరి ముక్తక్క తనకు కొడుకు పుడితే కోరుకున్న మొక్కు తీర్చుకోవడాని కోసం వేయించారు. ఈ మందిరంలో చుట్టూ కట్టడం కూడా భవ్యమైనదిగా ఉంది.

## 86. కాలాగ్నిరుద్ర మరియు వెంకమ్మ మందిరములు

సర్వేశ్వర్ మహాదేవుడు ఇది మాణిక్‌నగర్ యొక్క అధి దేవత. ఈ మందిర జీర్ణోద్ధరణ శ్రీజీ కాలంలోనే జరిగింది. అన్నపూర్ణ గృహం యొక్క లోపాలను సరిచేసి పునర్నిర్మించి రేకులు వేయించారు. మూడు భోజన ప్రాంగణాలు కట్టించి వాటికి బండలు వేయడం కూడా శ్రీజీనే చేశారు. శ్రీజీ మాణిక్‌నగర్‌లో అనేక ధర్మశాలలు నిర్మించి యాత్రికులకు వసతులను కల్పించారు.

మాణిక్‌నగర్ యొక్క రూపశిల్పి శ్రీజీగారి తండ్రి నృసింహతాత్యాగారు. తరువాత శ్రీజీ తన పుత్రులైన శ్రీ నృసింహబాబా (బాబాసాహెబ్) సహాయంతో వాటిలో కావలిసిన సౌకర్యాలతోఆధునికంగా నిర్మించారు. ఈయన కాలంలో కొత్త నిర్మాణాలు అంటే శ్రీ దేవి వెంకమ్మ మందిరము మరియు శ్రీ కాలాగ్నిరుద్ర మారుతి మందిరము నిర్మించబడ్డాయి.

'ఆమె ఇష్టం ఉంటే తానే మందిరము నిర్మించుకోవడానికి సమర్థురాలు' అని ఒక భక్తునికి శ్రీ ప్రభు వెంకమ్మ మహా నిర్యాణము తరువాత చెప్పి ఉండిరి. అలాగే ఆ విషయం నిజమయింది. శ్రీ రావుజీబువా అనే భక్తుడు ముంబాయిలో ఉండేవారు. ఆయన ప్రభువు మరియు సకల మత సాంప్రదాయ ప్రచారం విస్తృతంగా చేసారు. ఆయన ముంబాయిలో శ్రీ ప్రభు భక్తుల నుండి సొమ్ము సేకరించి శ్రీ వెంకమ్మ యొక్క సమాధి మందిరము మాణిక్‌నగర్‌లో నిర్మించారు. మందిర ప్రాంగణంలో గదులు కూడా నిర్మించడం వల్ల యాత్రికులకు చాలా అనుకూలం అయింది. శ్రీజీ క్రమానుసారంగా, పద్ధతి ప్రకారంగా ఇచ్చిన ఉపాసన వల్ల శ్రీ దేవి వెంకమ్మకు, దేవి యొక్క సర్వ భోగాలు ఇవ్వబడుతాయి. ఆమెకు రోజూ పూజ– అర్చన, ఆరతి– ధూపారతి జరుగుతాయి. శ్రావణ త్రయోదశి రోజు వెంకమ్మ ఆరాధన జరుగుతుంది. ఆశ్వీయుజ శుద్ధ పంచమి నుండి పంచరాత్రోత్సవం మొదలై మహానవమి రోజు పూర్ణాహుతి అవుతుంది. ఈ దేవి మొక్కులు తీరుస్తుందనే నమ్మకం మరియు ఋజువులు కూడా ఉన్నాయి.

ఒకసారి శ్రీజీ దసరా అయిన పది రోజుల తరువాత శ్రీ దేవి వెంకమ్మ దర్శనానికి వెళ్లారు. దేవి దర్శనము అయిన తరువాత పూజారితో దసరా సమయంలో జరిగిన హోమకుండంలోని భస్మం తీసుకురావలసిందిగా చెప్పారు. భస్మం తేవడానికి పూజారి కుండములో చేతిని పెట్టగానే హోమం చేసిన రోజు శ్రీ దేవికి అర్పించిన సౌభాగ్య వస్తువులు రవిక బట్టలు, అద్దం, దువ్వెన, కుంకుమభరణి, గాజులు, మంగళసూత్రం మొదలైన వస్తువులు ఎలావేశారో అలాగే దొరికాయి. వాటికి ఏమి కాలేదు. ఆ దేవి ధన్యురాలు. ఉపాసన చేసినవారు కూడా ధన్యులు.

ఒక సారి శ్రీజీ తన అలవాటు ప్రకారంగా రాత్రి సమయంలో ప్రభుసమాధి మందిరంలోనికి పూజకు వెళ్లారు. పూజలో నిమగ్నం అయినపుడు వారికి సమాధిపై బయట నుండి ఒక వెలుగు పడినట్లుగా కనిపించింది. వెనకకు తిరిగి చూడగానే ఆ వెలుగు మందిరం ముందు సంగమములో ఉన్న స్మశానంలో జ్వాలగా వెలుగుతున్న చితిమంటలది అని తెలిసింది. అలా చితిమండల వెలుగు ఆలయంలో పడటం నిషిద్ధం. ఆయన వెంటనే తలుపుపై ఉన్న పరదాను వేశారు. శంకర రావును పిలిచి పరిస్థితి చూపించి దానిని ఏ విధంగానైనా నివారించవలసిందిగా చెప్పారు. తరువాత రోజు శంకరరావు సంస్థానము యొక్క ముఖ్య కార్యకర్త బాబాసాహెబ్‌గారికి శ్రీజీ యొక్క ఆజ్ఞ తెలియజేశారు. బాబాసాహెబ్ గారు ప్రభు సమాధి ముందు నది ప్రక్కన ఒక మందిరం నిర్మించడానికి నిశ్చయించారు. అప్పుడు శ్రీజీ ''భండారుఖానాలో వెతికితే మీకు ఒక మారుతి యొక్క రాతివిగ్రహం దొరుకుతుంది. దాని ప్రతిష్ఠాపన ఆ మందిరం మధ్యలో చేయండి'' అని అన్నారు.

మందిరం నిర్మించబడి భండారుఖానాలోని ఆ మారుతి యొక్క రాతివిగ్రహం ప్రతిష్ఠ చేయబడింది. మాణిక్‌నగర్ గ్రామంలో ప్రవేశించగానే ముందుగా కుడిచేయి వైపు మందిరం ఉంటుంది. శ్రీజీ మారుతిని స్థాపించిన రోజు ఈ కాలాగ్ని రుద్రుడు మాణిక్క్షేత్రానికి అభిమాన రక్షకుడై ఉంటారని చెప్పారు. 'మాణిక క్షేత్ర అభిమాన రక్షణ దక్ష'.

కాలాగ్ని రుద్ర మారుతి స్థాపనకు శ్రీజీ స్వయంగా హాజరయ్యారు. స్థాపన సమయంలో కాలాగ్నిరుద్రుని ముందు ఒక పరదా వేయబడి ఉండెను. ఆ పరదా లోపలి వైపు కాలాగ్నిరుద్రుని ముందు ఒక అద్దం కూడా పెట్టబడి ఉండెను. ఆ సమయంలో ఆ పరదా లోపల చూడడానికి ఎవరూ ప్రయత్నం చేయకూడదు అని శ్రీజీ చెప్పిఉండిరి. కానీ, ఒక ఉత్సాహవంతుడైన యువకుడు కుతూహలంతో లోపలికి తలపెట్టి చూశాడు. అప్పుడు లోపలి వెలుగుతో ఆయన చూపు పోయింది. అప్పుడు అతడు శ్రీజీని శరణు వేడుకున్నాడు. శ్రీజీ వాడిని కాలాగ్ని రుద్రుడి కాళ్లపై వేసి తరువాత వాడి కళ్లపై తన చేతిని తిప్పారు. ఆ అమృత స్పర్శతో అతని చూపు తిరిగివచ్చింది. పురోహితులైన శ్రీ దత్తదీక్షితుల కండువా పరదా లోపలికి వెళ్లి కాలిపోసాగింది. వెంటనే చూసి లాగేసుకున్నాడు. లాగుతున్నప్పుడు పరదా తెరుచుకోవడం వల్ల జరిగే అనర్థం ఆగిపోయింది. ఆ పవిత్ర సంఘటనకు గుర్తుగా దత్తోపంత్ ఆ పంచను దాచి ఉంచుకున్నారు.

## 87. ఉత్సవములు మరియు ఇతర లీలలు

శ్రీజీ యొక్క ప్రేరణతో కొత్తగా మొదలు పెట్టిన ఉత్సవాలు వేదాంత సప్తాహం మరియు శ్రీ దేవి వెంకమ్మ పంచరాత్రోత్సవాలు. వేదాంత సప్తాహాన్ని ఇప్పుడు శ్రీజీ అరాధన మరియు శ్రీశంకర్ మాణిక్‌ప్రభు ఆరాధన అంతర్భాగంగా చేసి పాల్గుణ మాసంలో చేయబడుతున్నది. శ్రీజీ వేదాంత సప్తాహ మహోత్సవాన్ని ఆషాఢ మాసంలో చేసేవారు. జ్ఞానమయ ఉపాసన ఈ సంప్రదాయము యొక్క ముఖ్యతత్వము. సహజంగానే ప్రత్యేక సమయంలో ప్రత్యేక స్థలంలో వేదాంతానికి అగ్రస్థానం దొరికేది. భక్తితో జ్ఞానం భాషిస్తుంది. అందుకని భక్తిని జ్ఞానంతో కలపడం అవసరం. భక్తి లేని ప్రాణి నిష్ఫలం అని ప్రభువు కూడా అనేవారు. జ్ఞానం మరియు ప్రేమ ఉపాసన వీటి మనోహర సామ్రాజ్యం మాణిక్‌నగర్‌లో ఈ ఏడురోజులలో రూపుదిద్దుకొని ఉండేది. ఏడురోజులు అహోరాత్రులు భజనలు, కీర్తనలు, భాగవత పారాయణం, అఖండవీణ, వ్యాఖ్యానాల కార్యక్రమాలు నడుస్తుండేవి. నగరం ఏడు రోజులు రాత్రి పగలు సందడిగా ఉండేది. అన్నదానం మాణిక్‌నగర్‌లోని ప్రతి ఒక

ఉత్సవంలోని భాగం. ఈ ఆనంద సమ్మేళనాన్ని ప్రత్యక్షంగా చూసిన వాళ్లు అదృష్టవంతులు. చివరిరోజు దిండి బయలుదేరేది. సంస్థాన హంగులతో ప్రతి దేవాలయానికి వెళ్తూ అక్కడక్కడ శ్రీజీ యొక్క పూజ-ఆరతి జరిగేది. అఖండ భజన, తాళాలు, వీణ, పఖవాజ్, తబలా మొదలైన వాటి మధుర ధ్వనితో వాతావరణం నిండిపోయేది. శ్రీజీ యొక్క పాటలు ఎవరికీ వినడానికి దొరకవు. కానీ, ఈ దిండి యొక్క పన్నెండు గంటల కార్యక్రమంలో వాళ్లు దేహాన్ని మరిచి అఖండంగా పాడుతూ ఉండేవారు. రసికులకు, భావికులకు ఇది ఒక అపురూప అవకాశం. 'మీ పూర్ణకామ సచ్చిదానంద జాహలో' ఇలాంటి వేదాంతంపై పదములు ఎప్పుడైతే శ్రీజీ తన్మయులై పాడుతారో అప్పుడు వాతావరణం బ్రహ్మమయం అయిపోతుంది.

నవరాత్రులు శ్రీ దేవి వెంకమ్మ మహోత్సవము. ఆ సమయంలో పూర్తి మందిరం అలంకరించబడి దేవికి కొత్త వస్త్రాలు కట్టబడతాయి. శ్రీజీ కాలంలో ఈ ఉత్సవం ఆశ్వీయుజ శుద్ధ అష్టమి నుండి పౌర్ణమి వరకు జరిగేది. ఇప్పుడు ఆశ్వీయుజ శుద్ధ పంచమి నుండి నవమి వరకు జరుపబడుతుంది. శ్రీజీ సుమారు పదకొండు గంటల సమయంలో శ్రీ వెంకమ్మ దేవి మందిరానికి వచ్చిన తరువాత సంకల్పం చేసి పుణ్యాహవచనం అయిన తరువాత పూజ ప్రారంభం అయ్యేది. పంచామృత స్నానం, మంగళాభిషేకం, నైవేద్యం, మంగళహారతి, మంత్రపుష్పం అయిన తరువాత ప్రదోషపూజ జరిగేది. తరువాత కుమారి పూజ, స్తోత్రపఠనం అయిన తరువాత తీర్థ ప్రసాదాలు ఇచ్చేవారు. పూజ మధ్యలో మహామండపంలో భజన-సంగీత కార్యక్రమాలు జరిగేవి. నవరాత్రులు జరిగిన మరునటి రోజు హోమం జరిపి పూర్ణాహుతిలో శ్రీ దేవికి కొబ్బరికాయ, రవికెబట్ట, మంగళసూత్రం, అద్దం, దువ్వెన, గాజులు మొదలైన సౌభాగ్య వస్తువులు అర్పించి దానిపై గంటకు పైగా నెయ్యి ధార అఖండంగా పోసేవారు.

శ్రీజీ కాలంలోనే శ్రీ మాణిక్‌ప్రభు మరియు సకలమత పీఠ ఆచార్యులు రచించిన సాహిత్యాన్ని (పద్యాలు, శ్లోకాలు) మరియు సమగ్ర ప్రభుచరిత్రను ముద్రణ చేసే ఏర్పాటు చేయడం జరిగింది.

'సకలమతాచార్య శ్రీ మాణిక్ ప్రభు' ఈ పేరుగల ఒక మాసపత్రిక ప్రచురించడం జరిగింది. 'జ్ఞానమయ ఉపాసన' సంప్రదాయం యొక్క ధ్యేయం అవడం వల్ల ఇలాంటి మాసపత్రిక అవసరం ఉండెను. సకలమత సంప్రదాయము యొక్క ధ్యేయం అజ్ఞానాంధ కారంలో ఉన్నవారికి జ్ఞాననేత్రాన్ని ఇచ్చి వారికి దుఃఖవియోగ మార్గం చూపించి వారిని ఆనంద సామ్రాజ్యానికి చేర్చడం. అందుకని జనానికి సంప్రదాయం యొక్క తత్వజ్ఞానం తెలియజెప్పే అవసరం ఉంది. కనుక అలాంటి మాసపత్రిక అవసరం ఉండేది. మాసపత్రిక ప్రచారానికి ఒక సాధనం అయి ఉంటుంది. దానినుండే శ్రీ ప్రభు మరియు సంస్థానం యొక్క ఇతర గ్రంథాల సంశోధన మరియు పరిశోధన సులభం అయింది.

ధర్మ చక్రప్రవర్తనార్థం శ్రీజీ అనేక యాత్రలు చేశారు. దాంట్లో ఆయన పూర్తి నిజామ్ ప్రదేశం, ముంబాయి, పూనా, సోలాపూర్, మద్రాసు మొదలైన పట్టణాలు మరియు అసంఖ్యాకమైన గ్రామాలు ఆయన తిరిగారు. ఏ విధంగా బీదవారికి ధర్మాన్ని రొట్టె వద్ద నుండి నేర్పించాల్సి ఉంటుందో ఆ విధంగా దుఃఖితులు, పీడితులు, ఆర్త జనులకు దుఃఖ బాధల నుండి బయటకు తీసుకురావాల్సి ఉంటుంది. శ్రీజీ వంటి సమర్థులు, సంత్ శిరోమణులకు దీని పూర్తి మర్మం తెలిసి ఉండేది. అలౌకిక చమత్కారాలు చేస్తూ అసంఖ్యాకుల దుఃఖాశ్రువులు తుడిచారు. శ్రీజీ కొందరిని ఋణముక్తులను చేశారు. కొందరికి తగ్గని రోగాన్ని తగ్గించారు. సంతతి లేనివాళ్ళకు సంతానం ఇచ్చారు. కొందరిని చావు నుండి వెనక్కి తెచ్చారు. ఎందరికో వారి పనులు అయ్యేట్లుగా చేసి సంతోషపరిచారు. ఆపదలో ఉన్నవారి ఆపదలను దూరం చేశారు. అసంఖ్యాక భక్తుల సంకటాలను నివారించారు. బీదలకు చేయూతనిచ్చి వారి జీవితంలో ఆశను చిగురింపచేశారు. శ్రీజీ దైవసామర్థ్యంతో లోక కళ్యాణార్థం చేసిన చమత్కారాల వల్ల అందరికి శ్రీజీపై అనన్య భక్తి ఉండేది. శ్రీజీ దుఃఖ నివారణ మరియు ఉపదేశం ద్వారా సామాన్య జనత యొక్క ధర్మభావనను జాగృతం చేసి వారిలో సత్ప్రవృత్తి కలుగ చేసి భక్తి మార్గం చూపించారు.

నిజామాబాద్ జిల్లాలోని రెంజల్ గ్రామానికి చెందిన నానాసాహెబ్ వారి తల్లికి ఒకడే కొడుకు. ఒకసారి ఈయన తల్లికి కలలో కొడుకు మరుసటి రోజు

పావుకాటుతో చనిపోతాడని కనిపించింది. తల్లి హృదయం భయపడిపోయింది. కానీ, శ్రీ మార్తాండ ప్రభువుపై ఆమెకు అద్వితీయమైన దృఢ భక్తి ఉండడం వల్ల కొడుకును తీసుకొని ఆమె మాణిక్‌నగర్ కి వచ్చి శ్రీజీ యొక్క కాళ్ళపై పడి ఏడుస్తూ స్వప్న దృష్టాంతం పూర్తిగా వివరించింది. శ్రీజీ అంతర్ దృష్టితో చూస్తే ఆ స్వప్న వృత్తాంతం నిజమని తెలిసింది. ఆ స్త్రీ కాళ్ళపై పడి వేడుకుంది కనుక ఆ స్త్రీకి అభయమిచ్చి వారిని మాణిక్‌నగర్‌లో ఉండమని చెప్పారు. భయకంపితురాలైన ఆ స్త్రీ తన కొడుకును తీసుకొని తమకు నీడలా ఉన్న శ్రీజీ వద్ద ఉండిపోయింది.

శ్రీజీ కాలాగ్నిరుద్రునికి అఖండంగా అభిషేకం మొదలుపెట్టారు. బ్రాహ్మణులందరూ కూర్చుని ఉండిరి. ముందు శ్రీ దేవి వెంకమ్మ నవరాత్రి ఉన్నా కూడా అభిషేకం జరుగుతూ ఉంది. చివరికి తెల్లవారింది. ఆ తల్లి హృదయం తల్లడిల్లసాగింది. దినం గడిచి రాత్రి అయింది. శ్రీజీ శ్రీ దేవి వెంకమ్మ మందిరానికి పూజకోసం వెళ్లడానికి బయలుదేరారు. ఆ తల్లి శ్రీజీ చరణాలపై సాష్టాంగ నమస్కారం చేసింది. శ్రీజీ ధైర్యం చెప్పారు. శ్రీజీ ఆమెను కొడుకుని తీసుకొని కాలాగ్ని రుద్ర మందిరములో కూర్చోమని చెప్పారు. ఆమె వెంట యువకులను కర్రలతో పంపించి అక్కడ వెలుగు ఉండేట్లుగా ఏర్పాటు చేశారు.

ఆ విధంగా ఆ స్త్రీ కేవలం శ్రీజీపై ఉన్న భక్తి, నమ్మకంతో కొడుకుతో కాలాగ్ని రుద్ర మందిరంలో కూర్చుంది. ఈ విషయం గ్రామంలో తెలిసి ముందు ఏం జరుగుతుందో చూద్దామని చాలామంది పోగయ్యారు. కొద్ది సేపటికి అంత మంది గస్తీ తిరుగుతూ ఉన్నా కూడా ఒక భయంకరమైన సర్పం వచ్చి కాలాగ్నిరుద్రుని గుడి మెట్లపై పడగ విప్పి కూర్చుంది. ఒకటి రెండు నిమిషాలు లోపలికి చూసి కోపంతో పడగను మెట్లపై కొట్టి ఎలా వచ్చిందో అలాగే తిరిగి వెళ్లిపోయింది. ఈ విషయం శ్రీజీకి తెలియగానే తనపై నమ్మకం ఉంచి వచ్చిన ఆమెకు 'ఇక ప్రాణభయం లేదు, గండం తప్పిపోయింది' అని చెప్పి పంపించారు.

ఒకసారి శ్రీజీ సోలాపూర్‌కి వెళ్లారు. అక్కడ రావు సాహెబ్ పాహె బంగళాలో బస చేశారు. ఆ రోజు ఏకాదశి అవడం వల్ల పండరి పురంలో శ్రీ విఠల్ మందిరంలో చాలా రద్దీగా ఉండెను. శ్రీ పడ్‌కే అనే అధికారి అక్కడ నిర్వహణ

వ్యవహారాలు చూసేవారు. ఆయనకు భక్త కార్యకల్పద్రుమ జయఘోష వినిపించింది. చూస్తే శ్రీజీ, హనుమంత్‌రావు, అంబాజీ మొదలైన వారి సహాయంతో విఠ్ఠలుని దర్శనం చేసుకుంటున్నారు. శ్రీ వడ్కే ఇతర అధికారులకు చెపితే వారు శ్రీజీకి విఠ్ఠలుని దర్శనం ఏర్పాటు చేయించారు. శ్రీ వడ్కే తన ఇంటికి రావలసిందిగా శ్రీజీని పిలిచారు. కానీ, ముందు ఇంకెప్పుడైనా చూద్దాం, ఇప్పుడు వీలు కాదు అని శ్రీజీ చెప్పి అక్కడి నుండి బయలుదేరారు. తరువాత శ్రీ వడ్కే రావుసాహెబ్ వారి బంగ్లాకు వచ్చినపుడు ఆయన పండరి పూర్ విషయం చెప్పగానే అందరికీ ఆశ్చర్యం కలిగింది. ఆ ఏకాదశి రోజు శ్రీజీ సోలాపూర్‌లో రావుసాహెబ్ పాగే వారి బంగ్లాలోనే గడిపారు.

చితాపూర్ అనే గ్రామం సెంట్రల్ రైల్వే హైదరాబాద్ – వాడి మార్గంలో ఒక చిన్న స్టేషన్. ఇక్కడి నుండి ఒక మైలు దూరంలో నాగావేలాంబ యొక్క ప్రసిద్ధ దేవస్థానం ఉంది. ఈ దేవిని జలదుర్గా అని కూడా అంటారు. అక్కడ ఒక చోట చిన్న చిన్న నీటికుండాలు రెండు ఉన్నాయి. ముఖ్యపూజ ఆ రెండు కుండాలకు చేస్తారు. ఒకసారి శ్రీజీ చితాపూర్‌కి వెళ్లి నాగావెలాంబ దర్శనం చేసుకొని పూజ చేశారు. పూజ సమయంలో కుండంలోని నీరు ఉబికి పైకి వచ్చి శ్రీజీ యొక్క చరణాలను తాకి వెనక్కి తిరిగి వెళ్లాయి. ఇది హిమకన్య తన పతి జ్ఞానశంకరుడు తనను కలవడానికి వచ్చినపుడు వారి చరణాలు స్పర్శించి స్త్రీ యొక్క సహజ సిగ్గుతో తిరిగి లోపలికి వెళ్లిపోయినట్లనిపిస్తుంది.

కొహీర్, ఇది బీదర్ జిల్లాలోని ఒక గ్రామం. శ్రీజీ కాలంలో ఒక సంవత్సరం ఆ ప్రదేశంలో భయంకరమైన కరువు వచ్చింది. మనుష్యులు అన్నం కోసం తిరగసాగారు. చాలామంది భార్యాపిల్లలను అమ్ముకోసాగారు. కొంతమంది తమకు పోషించే స్తోమత లేక పిల్లలను ఇతరులకు ఇవ్వ సాగారు. అటువంటి సమయంలో జనం మాణిక్‌నగర్‌కి రాసాగారు. ఏ జాగిర్‌దార్ సంస్థానానికి ధైర్యం కాలేదు కానీ, శ్రీజీ రోజూ రెండు పూటలా భండారుఖానాలో పెద్ద గిన్నె నిండా నూకలు మరియు మజ్జిగ పులుసు చేయించి అనావృష్టి ముగిసే వరకు ప్రతి ఒక్కరికి భోజనం పెట్టించారు. వేలమంది ఆ సహాయాన్ని ఉపయోగించుకొని తమ ప్రాణాలను కాపాడుకున్నారు. అనావృష్టి సమయంలో చాలా మంది పిల్లలకు మాణిక్‌నగర్‌లో ఆశ్రయం దొరికింది.

సదాశివరావు కుంటేగావ్‌కర్ మనోహర్ మాణిక్‌ప్రభు కాలం నుండే మాణిక్‌నగర్‌లో ఉండిరి. ఈయన కుమారుడు కిషన్‌రావు ఉన్నత విద్యాభ్యాసం చేశాడు. ఒకసారి ఆయన రోగగ్రస్తుడయ్యాడు. మందులు ఇచ్చినా కూడా బాగవకపోతే సదాశివరావును మాణిక్‌నగర్‌కు తీసుకొని వచ్చారు. ఆయన శ్రీజీకి అంతా చెప్పి తన కొడుకుకు ప్రాణదానం చేయాల్సిందిగా వేడుకున్నారు. అవి జయంతీ ఉత్సవాల రోజులు. ఆ రోజు శ్రీ ప్రభు ఆరాధన ఉండెను. శ్రీజీ సదాశివరావుకి బ్రాహ్మణుల ఉచ్ఛిష్ట ప్రసాదం వడ, బొండా, ముద్దకూర మొదలైనవి ఇచ్చి వాటిని వారి కొడుకును తినాల్సిందిగా చెప్పారు. పూర్తిశ్రద్ధతో సదాశివరావు ఆ విధంగానే చేశారు. కొంతసేపటికి కిషన్‌రావు శరీరం చల్లబడింది. దాంతో ఆయన దేహం విడిచి పెట్టారని తెలిసింది. సదాశివరావు శ్రీజీ వద్దకు తీసుకొని వెళ్లాలనుకుంటుండగా కిషన్‌రావులో కదలికలను గమనించారు. కొద్దిసేపటిలో కిషన్‌రావు లేచి కూర్చుని సదాశివరావుతో ఇప్పుడే నాకు శ్రీ మార్తండ ప్రభు దర్శనం అయింది. నీకు జీవించాలనే కోరిక ఉందా? అని నన్ను అడిగి, నీకు ముప్పై సంవత్సరాల ఆయుష్షు ఇస్తున్నాను అన్నారు. బాబా, ఇక ముందు ముప్పై సంవత్సరాలు నాకు ఏ భయం లేదు! అన్నాడు. సదాశివరావుకి ఎంత సంతోషం అయిందో చెప్పలేము. శ్రీజీపై కృతజ్ఞతతో ఆయన మనసు నిండిపోయింది.

ఆ సమయంలో హైదరాబాద్‌లో ఒక యువ హరిదాసు ఉండేవారు. ఆయన మాట కూడా ఎదుటివారిని ప్రభావితం చేసేదిగా ఉండేది. వీరు తన్మయులై కీర్తన చేస్తుంటే విన్నవారు మైమరిచిపోయేవారు. అప్పుడు అక్కడ ఒక విధవ బ్రాహ్మణ స్త్రీకి పదకొండు సంవత్సరాల కూతురు ఉండేది. ఇతర ఆప్తులు ఎవరూ లేక విధవ బ్రాహ్మణ స్త్రీ తన బిడ్డను ఆ హరిదాసుకి ఇచ్చి పెళ్ళి చేసి ఆమె కూడా అల్లుని వద్దనే ఉండసాగింది. కొన్ని రోజులకు తిరుగుతూ తిరుగుతూ హరిదాసు తన మండలితో సోలాపూర్ కి వెళ్లారు. అక్కడ ఆయనను కొందరు గుర్తు పట్టగా వారు కంసాలివారు (బంగారం పని చేసేవారు) అని తెలిసింది. అప్పుడు అతడు అక్కడ నుండి పారిపోయాడు. చివరికి ఆ తల్లి బిడ్డలే మిగిలారు. వారిని కంసాలి వారు తమ జాతిలోకి అనుమతించలేదు, బ్రాహ్మణ సమాజం వారిని తిరిగి తమ మధ్యకు రానీయలేదు. ఆ తల్లిబిడ్డల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్క అయింది. ఎవరో దయతలచి వారిని

మాణిక్‌నగర్‌లో శ్రీజీ వద్దకు తీసుకువచ్చి వదిలిపెట్టారు. వారి కథ విని శ్రీజీకి వారిపై దయకలిగింది.

శ్రీజీ విద్వాంసులైన బ్రాహ్మణులను పిలిచి పెద్ద సభ నిర్వహించి వారిముందు ఆ అనాథ తల్లిబిడ్డల శుద్ధీకరణ పెద్ద ఎత్తున నిర్వహించారు. అప్పుడు శ్రీజీ మాటను గౌరవించి సమస్త బ్రాహ్మణ బృందం ఆ తల్లి బిడ్డలకు సహాయం అందించారు. శుద్ధి అయిన తరువాత ఒక యువకుడితో ఆ అమ్మాయి వివాహం కూడా జరిపించారు.

ఆ కాలంలో మన సమాజం ప్రవృత్తి చూస్తే ఇలాంటి పరిస్థితి నుండి బయట పడవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉండేది. శ్రీ జగద్గురు శంకరాచార్యులకు ఈ విషయం చెడుగా అందించబడి సహాయం చేసిన బ్రాహ్మణులను గ్రామ బహిష్కరణ చేయవలసిందిగా చెప్పమన్నారు. కానీ ఆ విషయం జగద్గురువులకు చెప్పినవారు శ్రీజీ పేరు శంకరాచార్యులకు చెప్పలేదు. కానీ, జగద్గురువులు దర్యాప్తు చేసిన తరువాత ఈ విషయంలో శ్రీజీ స్వతాహాగా వారే నిర్ణయం తీసుకున్నారని విని ఆ విషయాన్ని వదిలి పెట్టేశారు.

నిజాం సర్కార్ యొక్క ప్రధానులు మహారాజా సర్ కిషన్ ప్రసాద్ బహాదూర్ వారికి శ్రీజీ పై అమితమైన భక్తి ఉండేది. ఆయన తన వారితో వచ్చి చాలారోజులు మాణిక్‌నగర్‌లో ఉండేవారు. ఆయనకు శ్రీజీతో చాలా అనుభవాలు ఉండేవి. వారు శ్రీజీ విషయంలో ఇలా అనేవారు-హజారో ఫైజ్ పాయే హై। లాఖో సర్ ఝుకాయే హై। హై కోయి కరమ్ మే ఐసా। తో మార్తండ మాణిక మేం। శ్రీజీ అజానుబాహులుగా, శ్యామవర్ణంతో దృఢంగా గంభీరంగా ఉండేవారు. ఆయన స్వభావం అత్యంత మృదువై, చిరునవ్వుతో ఉండేవారు. ఆయన కరుణాసముద్రులవడం వల్ల దుఃఖితుల దుఃఖ నివారణ చేసేవారు. సంపద ఆయనను వెతుక్కుంటూ వచ్చేది. ఆయన ఎప్పుడూ సంపద వెంట పడలేదు. దొరికిన సంపదంతా ఆయన దానధర్మాలకు ఖర్చు పెట్టేవారు. 'త్యాగాయ సంభృతార్థ' (ఈ జీవనం త్యాగం కోసమే) ఈయన బిరుదుగా ఉండేది.

శ్రీజీ గుణవంతులైన వారిని మరియు ప్రియమైన భక్తులను మాత్రమే చేరదీసేవారు. శ్రీజీ స్వభావం అత్యంత ప్రేమమయంగా ఉండేది. ప్రతి వ్యక్తిలోని విశిష్ట గుణాన్ని గుర్తించి మనసారా ప్రేమతో వారిని ప్రోత్సహించే విద్య శ్రీజీ వద్ద ఉండేది.

ఇలాంటి గుణాలు కలిగిన చాలామంది భక్తులలో శ్రీజీ సంప్రదాయాన్ని వ్యాపింపజేశారు. దీంట్లో శ్రీజీ శ్రీప్రభు యొక్క ఆదర్శాన్ని దృష్టిలో పెట్టుకొని సకలమత సంప్రదాయ బిరుదావళి (భక్తకార్య...) అనుసరించి ప్రేమను వారధిగా చేసుకొని జాతి-మత, ధర్మం- సంప్రదాయం, అశిక్షితం - సుశిక్షితం, ధనవంతులు -బీదవాళ్లు ఇలా ఏ భేధం చూపేవారు కాదు. లింగాయత్-సిఖ్ వారిలో కూడా ఈ సంప్రదాయాన్ని ప్రచారం చేశారు. ముసల్మాను సమాజంలో కూడా సంప్రదాయం ప్రత్యేకంగా అనిపించేది. పెద్ద పెద్ద ముస్లిం అధికారులు శ్రీజీ సేవచేసే అవకాశం తమకు ఎప్పుడు లభిస్తుందా అని ఎదురు చూస్తూ అవకాశం దొరకగానే సేవచేసి తమకు తామే ధన్యులుగా భావించే వారు. ఈ విధంగా శ్రీజీ జనులలోని సత్ప్రవృత్తి ని నిద్రలేపి రాష్ట్రీయ ఏకత్వం కలిగే విధంగా సహాయపడేవారు. ఆయనకు వేదాంత విషయాలు సాధన చేయడమంటే చాలా ఇష్టం. హిందుస్థాన్‌లో మహనీయులకు సంబంధించిన విషయాలు పుస్తకాలలో వివరంగా ఉండేవి. ఈ విషయంలో పాశ్చాత్యతత్వ జ్ఞాన గ్రంథాలను కూడా చదివేవారు. దీనివల్ల శ్రీజీకి జ్ఞాన లాలస ఎక్కువగా ఉండేదని తెలుస్తుంది.

ఆ కాలంలోని శాస్త్రీయ పరిశోధన ఆధారంగా మనస్తత్వ శాస్త్రంలో జరిగే ప్రగతి గురించి ఆలోచించేవారు. శ్రీజీ యొక్క వ్యాసాంగంలో పక్వానికి వచ్చిన ఫలం అంటే 'జ్ఞానమార్తండ' అనే గ్రంథము. ఈ గ్రంథము రసిక జిజ్ఞాసులకు అన్ని కోణాలలో అపూర్వంగా అనిపిస్తుంది. వేదాంత విషయంలో ఎన్నో గ్రంథాలు ఉన్నాయి. కానీ, అద్వైత తత్వజ్ఞానంపై సమగ్రంగా ఆలోచన చేసి వ్రాసిన గ్రంథం మాత్రం మరొకటి లేదు. దీంట్లో అద్వైత తత్వజ్ఞానం అత్యంత సులభంగా సామాన్య జనులకు కూడా అర్థమయ్యేట్లు వివరించడం జరిగింది. ఇంతే కాకుండా తమను తాము ఉద్ధరించుకోవాలనే ఆశ ఉన్న సాధకులకు సాధనలోని కఠినశ్రమ మరియు దానికంటే కఠినమైన భయం నుండి ముక్తులను చేసి కేవలం శ్రవణ, చింతన మరియు ధ్యానం వీటి యోగాలతో ముక్తి

లభిస్తుందనేటువంటి ఆత్మ విశ్వాసం వారి మనస్సులో ఈ గ్రంథం యొక్క నిత్యపఠనంతో కలుగుతుంది. అప్పుడు ఈ గ్రంథంలో వివరించిన సహజ ముక్తి యొక్క తత్వం ముముక్షువులకు కామధేనువులా అనిపిస్తుంది. ఈ గ్రంథంలో పూర్తిగా శ్రీజీ యొక్క స్వతంత్ర ఆలోచనా విధానం ప్రతి పాఠకునికి స్పష్టంగా కనిపిస్తుంది. ఈ గ్రంథాన్ని కాశీ పండితులు ముక్తకంఠంతో ప్రసంశించారు. దక్షిణ భారతంలోని పండితులు ఈ గ్రంథానికి ఆకర్షితులై శ్రీజీకి 'అభినవ శంకరాచార్య' అనే బిరుదును ఇచ్చారు.

శ్రీజీ యొక్క పద్య రచన అత్యంత రసమయంగా, చాలా వరకు వేదాంత విషయంపై ఉంటుంది. ప్రతి ఒక పదంలో వేదాంతంలోని సిద్ధాంతాల అర్థం విశదీకరించినట్లు తెలుస్తుంది. వేదాంతంపై ఆయన ప్రతిభ, శ్రీప్రభు మరియు వెంకమ్మలపై భక్తి ప్రకటంగా తెలుస్తుంది. శ్రీజీయే స్పష్టమైన పదాలతో సంప్రదాయం యొక్క తత్వజ్ఞానం వివరించారు. దైనందిన ఆచారాలనుండే సాధన మొదలుకావాలని, అలాగే భక్త జనులను ప్రగతి పథంలో నడిపించే యోగ్యమైన దైనందిన కార్యక్రమం శ్రీజీయే అందించారు. ఈ తత్వ జ్ఞానంలో ఎంత సుబోధత మరియు సుకర్తృత్వం ఆయన తెచ్చారంటే సామాన్య భక్తులు ఆకర్షితులై సాధనకు తయారయ్యేవారు. ఈ దైనందిన సాధనలో నుండి వారి ధ్యేయానికి అవసరమైన ప్రగతితో పాటు వారి ఆత్మవిశ్వాసం పెరగాలని నిరంతరం కృషి చేసేవారు.

శ్రీజీలో కర్మ, భక్తి మరియు జ్ఞానాల సంగమము ఉండేది. భోగాన్ని ఆయన త్యాగం చేయలేదు. (కానీ ఆయన కామదేవుని భస్మం చేసే భగవాన్ శంకరున్ని నిస్సంగ వృత్తితో స్వీకరించారు.) ఆయనకు ఇద్దరు పుత్రులు, ఒక పుత్రిక ఉండేవారు. ఆయన కళ్ల ముందే వారి పుత్రులు ఇహలోకాన్ని విడిచారు. సంతానం లేని వారికి ఆయన మూలంగా సంతానం కలిగింది. అంత సామర్థ్యం ఉన్నా కూడా సంతానాపేక్ష లేకుండా ఉండేవారు. ఐతే ఆయన మనస్సు ఎప్పుడూ నిశ్చింతగా ఉండేది. ఒక భక్తుడు ఈ విషయంలో శ్రీజీని ప్రశ్నించారు. అప్పుడు ఆ భక్తునితో ఆయన శ్రీ ప్రభు సమాధిపై ఏముందో చూసి రావలసిందిగా చెప్పారు. ఆయన చూసి వచ్చి 'మహారాజ్ ప్రభు సమాధిపై కేవలం నాలుగు గులాబి పువ్వులు మాత్రమే ఉన్నాయి అని చెప్పారు.

అది విని శ్రీజీ ఆయనకు అర్థమయేట్లుగా ఇలా చెప్పారు. ఆ నాలుగు పూలు అంటే ఆ-శీ-ర్వా-దం. ఈ నాలుగు అక్షరాలు శ్రీ ప్రభు యొక్క ఆశీర్వాదం. అందులో మన జీవన సర్వస్వం ఉంది. ఇతర విషయాల కోసం మనం ఎందుకు చింతించాలి? ఏదైనా ఆ ప్రభువే చూసుకుంటారన్నారు.

గురువారం 12 మార్చి 1936 సంవత్సరంలో శ్రీజీ తన సగుణ రూపం నుండి సర్వ వ్యాపకత్వాన్ని పొందారు. శ్రీజీ యొక్క మహాసమాధి వల్ల భక్తులందరికి అంతులేని దుఃఖం కలిగింది. సగుణరూపం నుండి శ్రీజీ దృష్టి మరుగైనా కూడా తమ అపూర్వ సామర్థ్య బలంతో ఇప్పటికీ భక్తకార్య కల్పద్రుమత్వం చూపిస్తూ ఉన్నారు. శ్రీజీ యొక్క శబ్దాలలో చెప్పాలంటే 'జ్ఞానమార్తండా ఉదయ నాహీ వా అస్త నాహీ'- అంటే జ్ఞాన స్వరూపులైన మార్తాండునికి (సూర్యుని వంటి మార్తండ ప్రభువులకు) ఉదయం లేదు మరియు అస్తమయం కూడా లేదు.

## ౪౪. శ్రీ శంకర మాణిక్‌ప్రభు

శ్రీ మార్తండ మాణిక్ ప్రభువుల కార్యనిర్వహణ చాలా ఉన్నతమైన రీతిలో ఉండేది. శ్రీ ప్రభు మరియు సకలమత సంప్రదాయం యొక్క కీర్తిపతాకం ఆసేతు హిమాచలం ఎగురవేశారు. ఆయన ఆధ్యాత్మిక శక్తి ముందు హైదరాబాద్ నిజాము కూడా లొంగిపోయారు. ఆయన మహాసమాధి సమయంలో ఆయన పుత్రులు జీవించిలేరు. అందువల్ల ఆయన వారసులు ఎవరన్న ప్రశ్న మొదలై ఆయన కీర్తి వల్ల అధిక చర్చ మరియు చింతా విషయం అయింది. కాని సూర్యుని అస్తమయం తరువాత పూర్ణిమనాటి వెన్నెల ఏ విధంగా ధవళవర్ణంతో సకల జగాన్ని అహ్లాద పరుస్తుందో ఆ విధంగా శ్రీ శంకర మాణిక్‌ప్రభువు గాదీ యొక్క చతుర్థ ఆచార్యులుగా అధికారం స్వీకరించి తమ మృదువైన, నిశ్చలమైన ప్రభు సేవాపరాయణతతో సంస్థానం మరియు సంప్రదాయాన్ని వృద్ధి చేశారు.

మార్తండ మాణిక్‌ప్రభువుల పెద్ద సోదరి సౌ. ముక్తక్క కొడుకే శ్రీ శంకరరావు. ఈయన మార్తండ మాణిక్‌ప్రభువుల ఆశీర్వాదంతో శ్రీ మాణిక్

ప్రభువుల ప్రసాదంతో మాణిక్‌నగర్‌లో సోమవారం 28 అక్టోబర్ 1895వ సంవత్సరంలో జన్మించారు. ఆరుగురు కుమార్తెల తరువాత కొడుకు పుట్టడం వల్ల తల్లి తండ్రులకే కాకుండా పూర్తి మాణిక్‌నగర వాసులకే చాలా ఆనందం కలిగించింది. మొక్కుతో పుట్టడం వల్ల బారసాల రోజు బాల శంకరుణ్ణి శ్రీ మార్తండ మాణిక్‌ప్రభు ఊయలలాగ ఉన్న ప్రభు యొక్క జోళిలో వేసి జోళి పూజ, నామకరణం చేసి సౌ. ముక్తక్కకు ఇస్తూ ఇలా అన్నారు. 'ముక్తక్కా' ప్రభుకార్యం కోసం ఇతను జన్మించాడు. నీవు వీడికి జన్మనిచ్చావు కానీ, ఆయా అనుకొని తల్లి ప్రేమతో పెంచు.

ఈయన శిక్షణ శ్రీ మార్తండ ప్రభువుల జ్యేష్ఠ పుత్రులు బాబాసాహెబ్ మహారాజుల వారి అదుపాజ్ఞలలో జరిగింది. సంస్థానానికి ఉపయోగపడాలని పెద్ద చదువులు చదివారు. ఉస్మానియా యూనివర్సిటీ డిగ్రీ పరీక్ష ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. హైదరాబాద్‌కి వెళ్లి వకీలు పట్టా స్వీకరించారు. మరాఠీ, ఇంగ్లీష్‌లాగే సంస్కృతం, కన్నడ, హిందీ, ఉర్దూ మరియు పార్సీ బాషలలో ప్రావీణ్యత కలిగి ఉండేవారు. డిగ్రీ తీసుకున్న తరువాత మాణిక్‌నగర్‌లోనే బాబాసాహెబ్ మహారాజుల వద్ద ఉండి సంస్థానం యొక్క కార్యభారము చూడసాగారు. బాబాసాహెబ్ తరువాత 1923వ సంవత్సరంలో సంస్థానము యొక్క ముఖ్య కార్యభారము స్వీకరించారు. వీరి వయస్సు 14 సంవత్సరాలు ఉన్నప్పుడు శ్రావణ శుక్ల ద్వాదశి 1909లో వీరి మాతృశ్రీ ముక్తక్క మరణించారు. జన్మించగానే శ్రీ కృష్ణున్ని దేవకి యశోద ఒడిలో వేసినట్లుగా శంకర రావుని ముక్తక్క ప్రభు జోళీలో వేశారు. అందుకని నిజమైన మాతృ సుఖాన్ని ఆ ఇద్దరు అనుభవించారు. ముక్తక్క చివరి కాలంలో తన వజ్రపు ముక్కుపుడకను శ్రీ మార్తండ మాణిక్‌ప్రభువులకు ఇచ్చి నేను ఉన్నంత వరకు శ్రీ ప్రభు మందిరం ముందు శుభ్ర పరుస్తూ వచ్చాను. నా తరువాత ఎవరు శుభ్రపరుస్తారు ? అందుకని ఈ ముక్కుపుడక విక్రయించి వచ్చిన రొక్కంతో ఈ సభామండపంలో (సంగ్‌మర్‌మర్) చలువరాతి బండలు వేయించమని చెప్పారు. ఆమె కోరిక మేరకు శ్రీజీ తన సోదరి మరణానంతరం సభామండపంలో ఇప్పుడు ఉన్న సుందరమైన పాలరాతి బండలు వేయించి ఆమెను చిరస్మరణీయురాలిని చేశారు. తరువాత నాలుగు సంవత్సరాలకు శ్రీ మార్తండ మాణిక్‌ప్రభువుగారు శ్రీ శంకరరావు వివాహం కళ్యాణ్‌కి చెందిన

వేదశాస్త్రసంపన్నులైన దిగంబర శాస్త్రి కుమార్తెతో వైశాఖ శుక్ల దశమి 1913న సుముహూర్తంలో జరిపించారు. నూతన దంపతుల గృహప్రవేశం, లక్ష్మీపూజ జరిగిన తరువాత వధువు పేరు పార్వతి అని పెట్టారు. పార్వతి శంకరుల అపురూప దాంపత్యం చాలా రోజులు మాణిక్‌నగర్‌లో ముఖ్య విషయంగా ఉండేది. ఈ దంపతులు శ్రీజీ యొక్క నీడలో పదిహేను సంవత్సరాలు సుఖంగా సంసారం చేశారు. ఆమె కడుపులో పుట్టే బిడ్డ కోసం అందరూ ఎదురుచూడ సాగారు కానీ, కాలం కలిసిరాక ఆశ్వయుజ శుక్ల సప్తమి (1928) రోజు గర్భవతిగా ఉన్నప్పుడే పార్వతి శంకరుని నుండి చివరి ఆజ్ఞ తీసుకుంది. అయినా ఈ దుఃఖాన్ని దిగమింగి శ్రీ సంస్థానం యొక్క కార్యభారంపై తన కర్తవ్యంలో శ్రీ శంకరరావు ఆవగింజంత తేడా కూడా చూపలేదు. ఆయన ఒక కర్తవ్య పరాయణులై ఉండిరి.

జ్యోతిష్యం మరియు వైదికము ఆయనకు ఇష్టమైన విషయాలు. మృదంగం మరియు సంగీత జ్ఞానం ఉండేది కాని ఆయన నిజమైన శ్రద్ధ మాత్రం తత్వజ్ఞానంపై ఉండి దానిపై చాలా సాధన చేసేవారు. తత్వజ్ఞానంపై సవివరమైన లేఖ వ్రాశారు. అది 'తత్వజ్ఞాన మందిరం' అనే మాస పత్రికలో ప్రచురితమై ప్రసిద్ధమైనది. ఆ లేఖ నుండి ఆయన శ్రీ మార్తండ ప్రభువు యొక్క జ్ఞానమార్తండ అనే గ్రంథంలో మహత్తరమైన పద్యాల వివరణ చేశారు.

శ్రీ శంకరప్రభు మంచి వక్త. శ్రీమార్తండ మాణిక్ ప్రభు కాలంలో దర్బార్‌లో తత్వచర్చ జరిగేది. శ్రీ శంకర్‌రావుగారు ఇలాంటి చర్చలో ఎప్పుడూ భాగం వహించి ఎదుటి వాళ్లను ఖండించేవారు. పద్యరచన వైపు మాత్రం ప్రత్యేక శ్రద్ధ చూపించలేదు. అయినా కూడా ఈయన చేసిన శ్రీ మార్తండ మాణిక్ ప్రభు యొక్క ఆరతి సంప్రదాయికులకు అత్యంత ప్రియమైనది. శ్రీమార్తండ మాణిక్ ప్రభువుకి తన మేనల్లునిపై అసామాన్యమైన ప్రేమ ఉండేది. వారి సుఖ దుఃఖాలపై శ్రద్ధ చూపేవారు. సౌ. పార్వతీ బాయి మృత్యువు తరువాత రెండు సంవత్సరాలకు ఆయన శ్రీ శంకర రావు యొక్క ద్వితీయ వివాహం సాంగ్లీ వైపు ఉగార్‌కి చెందిన ఇనామ్‌దార్ కుమార్తె సౌ. లక్ష్మీబాయితో 14-7-1930 న చేసి అల్లునికి కొత్త జీవితాన్ని ఇచ్చారు. సౌ. లక్ష్మీబాయి తన మంచి తనంతో అత్తగారింట్లో అందరి మనస్సు గెలుచుకున్నారు. అలాగే నౌకర్లు,

చాకర్లు, అనాథలు ఆశ్రితులను తన స్నేహభావంతో చూడడంలో తమ జీవితాన్ని అంకితం చేశారు. ఇంటికి వచ్చి వెళ్లే బంధువులకు మరియు భక్తులకు ఆతిథ్యమిచ్చి ఆదరంగా స్వాగత సత్కారాలు చేసి వారి ఆశీర్వాదాన్ని సంపాదించారు. ఆమె స్వభావం అందరూ మెచ్చి అందరికి ఆమె మామిసాహెబ్ అయ్యారు. మామిసాహెబ్ ఇంటి బాధ్యతలు తీసుకొని తమ పతి చేసే ధర్మకార్యంలో చేయి అందించేవారు. తరువాత వీరికి శ్రీ సిద్ధరాజ్ మహరాజుల వారు జన్మించారు

శ్రీమార్తండ మాణిక్ ప్రభువుల విషయంలో వీరి పూజ్య భావం అనన్య సామాన్యమైనది. ఒకసారి జ్వరం వచ్చినప్పుడు తీసుకున్న ఇంజక్షన్ వికటించి పూర్తి శరీరం కాలినట్లు అయి చర్మం ఒలిచినట్లు లోపలి మాంసం కనిపించసాగింది. శరీరం మండుతూ బ్రతకటం అసాధ్యమయింది. ఆయన శరీరంపై ప్రత్తిని, దానిపై వస్త్రం, దానిపై మైనం ఉంచి పడుకోబెట్టారు. వైద్యం కోసం సికింద్రాబాద్ వెళ్లాల్సి వచ్చింది. కాని శ్రీ మార్తండ మాణిక్ ప్రభువుల కృపలేకుండా తాను జీవించడం కల్ల అన్న విశ్వాసం ఉండడం వల్ల సికింద్రాబాద్ వెళ్లడానికి పూర్వం శ్రీ మార్తండ మాణిక్ ప్రభువుల దర్శనానికి వెళ్ళారు. శ్రీజీ రాగానే శంకరరావు 'నేను చాలా అపరాధాలు చేసాను. కానీ, మీరు కరుణాసముద్రులు మీ అమృత హస్తం నా మండుతున్న శరీరంపై రాస్తే ఈ దేహం శాంతిస్తుంది. మీ చరణతీర్థం యొక్క ఒక్క అమృత బిందువుతో నా జీవితం నాకు తిరిగి లభిస్తుంది. నా సర్వ అపరాధాలు మనసారా క్షమించి నాపై కృప చూపించండి అని అన్నారు.'

శ్రీ మార్తండ మాణిక్ ప్రభు వాత్సల్యంతో శరీరంపై చేతితో నిమిరి, వారికి తన పాదతీర్థం ఇచ్చి ఇలా అన్నారు. నా పని నేను చేసాను. ఇప్పుడు నీకు ఏమీకాదు ఔషధోపచారాలు చేయండి. ఈ బాణం (శివలింగం) తీసుకోండి. రోజూ దీనికి అభిషేకం చేసి ఆ తీర్థాన్ని తీసుకుంటూ ఉండండి. ఆ బాణాన్ని తీసుకొని పరమానందంతో శంకర్‌ప్రభు సికింద్రాబాద్‌కి వెళ్లి ఔషదోపచారాలు చేసుకొని ఆరోగ్యవంతులై తిరిగి వచ్చారు.

శ్రీ మార్తాండ మాణిక్ ప్రభు 12 మార్చి 1936న సమాధి తీసుకున్నారు. దీనికి పూర్వమే ఈయన ఇద్దరు పుత్రులు స్వర్గస్థులైరి. మరియు వారిద్దరికి పుత్రులు లేకపోవడం వల్ల గాదీకి వారసులు లేకుండెను. శ్రీ మార్తాండ మాణిక్ ప్రభు సమాధికి పూర్వం శ్రీ శంకర రావుకి ప్రసాదం ఇచ్చి వారిని ఉత్తరాధికారిగా నియమించారు. ఈ విధంగా శ్రీ శంకర్‌రావు 'శ్రీ శంకర్ మాణిక్ ప్రభు'గా శ్రీ ప్రభు యొక్క దివ్య పీఠంపై ఆసీనులయ్యారు. శ్రీ ప్రభువును సకలమత సంప్రదాయులు మరియు ప్రభుభక్తులు వీరిని అపరతేజస్విగా గుర్తిస్తారు. శ్రీ ప్రభువు ఇష్టప్రకారంగా వారు స్థాపించిన సంస్థానము యొక్క కార్యనిర్వహణ జరగాలని వారి భావనగా ఉండేది. అందుకని శ్రీ శంకర ప్రభువుకి అందరి అంగీకారం లభించింది. శ్రీ శంకర మాణిక్ ప్రభు చిన్నప్పటి నుండీ మాణిక్‌నగర్‌లోనే ఉండడం వల్ల చాలా మందితో పరిచయాలు ఉండేవి. శంకర్ మాణిక్‌ప్రభువును కొంతమంది విశేషంగా ఆదరించేవారు కాదు. సమాధి అయిన తరువాత కూడా వారిని శ్రీ మార్తాండ మాణిక్‌ప్రభు కనిపించి వారిని క్రింది విధంగా అనుభవమిచ్చి దారిలోకి తీసుకువచ్చారు.

హుమనాబాద్‌లో గోవింద్‌జాజి అనే పేరుగల ఒక గృహస్థు శ్రీ మార్తాండ మాణిక్ ప్రభువులకు అనన్య భక్తులై ఉండిరి. శ్రీ మార్తాండ ప్రభు తరువాత వందనీయులైన వ్యక్తి మాణిక్ నగర్‌లో లేరని వారికి అనిపించేది. ఆయన దృష్టిలో శంకర్‌మాణిక్ ప్రభు అంటే ఒక సామాన్య వ్యక్తి. అప్పటి వరకు వారు ఒకే దగ్గర కలిసి తిరుగుతూ నవ్వుతూ, ఆడుతూ ఉండేవారు. వారిని ప్రభు అనుకొని నమస్కారం చేయడం గోవిందప్పకి ఇష్టమువలేదు. ఇలాంటి ఆలోచనలతో ఆయన మాణిక్‌నగర్‌కి వెళ్లడం మానుకున్నారు. ఒకరోజు గోవిందప్పకు స్వప్నంలో కనిపించి మార్తాండ ప్రభు ఇలా అన్నారు. అరె నేను మాణిక్‌నగర్‌లో లేను అని అనుకోవడం మూర్ఖత్వం అవుతుంది. శంకరునిలో నన్ను చూడు. ఇంతకు మందులాగే వస్తూ పోతూ ఉండు. గోవిందప్ప దాన్ని లక్ష్యపెట్టలేదు. కానీ, 2–3 రోజులు ఇలాగే స్వప్నం రావడం వల్ల పుష్పహారం, పండ్లు తీసుకొని మాణిక్‌నగర్‌కి వచ్చి శ్రీ శంకర ప్రభు ముందు నిలబడినా కూడా వారికి నమస్కారం చేయడానికి సంకోచించసాగారు. ఇంతలో శ్రీ మార్తాండ ప్రభువులు చెప్పిన మాటలు వినిపించసాగాయి. ఆయన శంకర్ ప్రభు వైపు చూస్తే అక్కడ మార్తాండ ప్రభు కనిపించారు. అందుకని నమస్కారం చేయడానికి వంగగానే శ్రీ శంకరప్రభు

కనిపించారు. అందుకని ఆయన పుష్పహారం వేయకుండా వెనుదిరిగారు. నమస్కారం చేయడానికి వంగగానే శంకర్‌ప్రభు కనిపించే వారు వెనుదిరగగానే మార్తండ ప్రభు కనిపించేవారు. ఇలా 4–5 సార్లు జరగగానే శ్రీ మార్తండ ప్రభువుల ఉగ్రరూపం కనిపించి కఠిన స్వరంతో మూర్ఖా! నన్ను పరీక్ష చేస్తున్నావా ఏంటి? అని కోపంగా అన్నట్లు వినిపించింది. దాంతో గోవిందప్ప భయపడిపోయి, తప్పయింది నన్ను క్షమించండి అంటూ శ్రీ శంకర్ ప్రభువుకి పుష్పహారం వేసి నమస్కరించారు. శ్రీ శంకర ప్రభు ఆయనకు ధైర్యం చెప్పి సముదాయిస్తూ తన మధురశబ్దాలతో ఇలా ఉపదేశం చేశారు. మహత్వం వ్యక్తిదికాదు. శ్రీ ప్రభు గాదిది. భరతుడు శ్రీ రామచంద్రుడి పాదుకలు సింహాసనంపై ఉంచి అయోధ్యను పాలించాడు. భరతుడికి ఆ పాదుకల స్థానంలో శ్రీ రామచంద్రుడు కనిపించేవారు. క్షణకాలం మీరు అలాగే అనుకోండి. శ్రీ ప్రభుగాదిపై నేను కాకుండా ప్రభుపాదుకలు ఉన్నాయనుకొని నమస్కారం చేయడంలో తప్పులేదు కదా! కానీ, శ్రీశంకర ప్రభు అనుకొని నమస్కారం చేయాలనిపించకపోతే చేయకండి. ఈ విధంగా శంకరప్రభు తన మృదుమధుర మాటలతో, బుద్ధి చాతుర్యంతో, ఔదార్యంతో కొంతకాలంలోనే ప్రభు భక్తుల అంతఃకరణను జయించారు. ఏ పని అయితే శక్తికి మించినది అవుతుందో ఆ పనిని సులభంగా సహజంగా చేసేవారు. వీరికి ఇలాంటివి ఎన్నో ఘటనలు ఎదురైనా సునాయాసంగా తీర్చేవారు. లోకుల పనులతో అనుకోని కష్టాలు వచ్చేవి. కోర్టులో కేసు వేయడానికి వెళ్లిన వారిని శ్రీ మార్తండ మాణిక్ ప్రభు ఆశీర్వాదంతో కేసులను గెలిచేవారు. అలా ఒకసారి శ్రీ శంకర్ ప్రభువుకు విరుద్ధంగా కోర్టులో కేసు వేయబడింది. ఆ చమత్కార కథ ఇక్కడ వివరిస్తున్నాము.

భీమ్‌సేన్ రావు కులకర్ణీ వగ్దాల్ తాలూకా హుమనాబాద్‌కి చెందినవారు. భీమ్‌సేన్‌రావు మరియు ఆయన తల్లి తమ తరఫునుండి శ్రీ మాణిక్‌ప్రభు సమాధికి నిత్యం ఒక బ్రాహ్మణునితో అభిషేకం చేయించాలని మొక్కుకొని దాని కోసం కొంత బంగారం, 500 రూపాయలు శ్రీ మార్తండ ప్రభు వద్ద జమ చేసి ఉండిరి. శ్రీ మార్తండ ప్రభువుల నిర్యాణం తరువాత శ్రీ శంకర్‌ప్రభువుపై వారికి విశ్వాసం లేక అనండి, జన చిత్తం అనండి భీమసేన రావ్ శ్రీజీని కలవడానికి వచ్చినప్పుడు 'మేము శ్రీ మార్తండ ప్రభు వద్ద బంగారం మరియు రూపాయలు ఉంచమని చెప్పి మా అవసరం వస్తే దాంట్లోనుండి

తీసుకుంటామని చెప్పాము. ఇప్పుడు మాకు డబ్బు అవసరం ఉంది. మా సొమ్ము మాకు వాపసు ఇవ్వండి' అన్నారు. వారికి తాము ఏ ఉద్దేశంతో పెట్టామో అది శ్రీ శంకర్‌ప్రభువుకు తెలిసి ఉండదని అనుకున్నారు. కానీ, వారి ఆలోచనకు విరుద్ధంగా శ్రీజీ ఆశ్చర్యపడుతూ ఇలా అన్నారు. మీ సమృద్ధి కోసం శ్రీ మాణిక్ ప్రభు సమాధికి నిత్య అభిషేకం కావాలని మీరు ద్రవ్యాన్ని అర్పించారని మేము విన్నాము అన్నారు. తన రహస్యం బయటపడగానే భీమసేన్‌రావు కోర్టులో కేసు వేసి దాన్ని వసూలు చేస్తాను అంటూ గట్టిగా అరుస్తూ వెళ్లాడు. ఆయన నిజంగా కోర్టులో కేసు వేసినప్పుడు శ్రీ శంకర్‌ప్రభు మీరు అంటున్నది గనుక నిజం అయితే ఆ సొమ్ము మేము కోర్టులోనే కడతాము అన్నారు.

కోర్టులో కేసువేసి భీమ్‌సేన్‌రావు బయటకు రాగానే పోలీసులు వచ్చి మిమ్మల్ని అరెస్టు చేయాల్సిందిగా సమను వచ్చింది అంటూ ఆ పోలీసులు ఆయన చేతికి బేడీలు వేశారు. ఇంతలో భీమ్‌సేన్‌రావుకి ఎవరో తట్టినట్లుగా అనిపించింది. ఆయన భయంతో అటూ ఇటూ చూస్తే పోలీసులు ఎవరూ లేకుండిరి. జరిగింది నిజమో కాదో ఆయనకు తెలియలేదు. ఇలా ద్వంద్వ మనస్థితిలో ఇంటికి వెళ్లి ఎప్పటిలాగే కులకర్ణీ పనికి చెందిన సర్కారి పనులు చూస్తూ కూర్చున్నారు. 'శంకర్‌పై కేసు ఎందుకు వేశావు? 'అని హిందీలో శ్రీ మార్తాండ ప్రభువు అడిగినట్లుగా వినిపించింది. ఆయన భోజనానికి కూర్చున్నా కూడా అవే వాక్యాలు వినిపించసాగాయి. వాహనాల శబ్దం, ప్రపంచంలోని ఇతర శబ్దాలు, జనం మాట్లాడే మాటల్లో అన్నిట్లో అవే శబ్దాలు వినిపించసాగాయి. నాలుగుదిక్కులా 'శంకర్ పే దావా క్యు కియా?' ఇవే శబ్దాలు ఆయన చెవుల్లో గింగురుమనసాగాయి. భీమ్‌సేన్‌రావు భయపడిపోయారు. ఏం చేయాలో తోచలేదు. అదే సమయంలో మామ్‌లేదార్ సాహెబ్ కార్యాలయ కాగితాలు గణనకు వచ్చాయి. కులకర్ణీ పనికి చెందిన పుస్తకాల్లో ప్రతి ఒక పేజిపై సర్కారీ ముద్ర లేకుండా అన్ని పేజీల్లో అదే వాక్యం వ్రాసినట్లు కనిపించింది. భీమ్‌సేన్‌రావు పరిస్థితి ఎలా అయిందంటే ఎవరితో మాట్లాడినా అవే శబ్దాలు వచ్చేవి. మామ్‌లెదార్‌సాహెబ్‌తో మాట్లాడేటపుడు అలాగే జరిగింది. ఆయన అడిగిన అన్ని ప్రశ్నలకు జవాబు అవే శబ్దాల్లో చెప్పసాగారు. సాహెబ్ ఆయనను పిచ్చివాడి క్రింద లెక్కవేసి పనిలో నుండి తీసివేశారు. చాలా పశ్చాత్తాపం కలిగింది. చివరికి అనన్యభావంతో శ్రీజీని శరణువేడుకున్నారు. ఇక ముందు

ఇలా ఎప్పుడూ చేయను. తప్పయింది అంటూ క్షమించమని వేడుకున్నారు. శ్రీ ప్రభు కృపతో ఆ సంకట పరిస్థితి నుండి ముక్తులైన తరువాత భీమ్‌సేన్‌రావు చాలా ఆదరణతో శ్రీ శంకర్‌ప్రభు యొక్క పాదపూజ చేసి వెండిసామాన్లు మరియు యాభై రూపాయల దక్షిణ సమర్పించారు. అన్ని వ్యవహారాలు శ్రీ ప్రభు కృపతో పూర్వంలాగే జరిగాయి.

గాదిపై కూర్చున్న తరువాత శ్రీ శంకర్ మాణిక్ ప్రభువు ఉపాసన వైపు అధిక శ్రద్ధ చూపేవారు. ఆయన ప్రవర్తనలో శ్రీ మార్తండ ప్రభువుల ప్రవర్తన కనిపించసాగింది. స్నాన-సంధ్య, జపతపాలు, పూజ -అర్చనలు ఇవేకాకుండా మాట్లాడడం, నడవడం అన్ని విషయాలలో శ్రీ మార్తండ ప్రభువుల ప్రభావం పూర్తిగా కనిపించేది. శ్రీ మార్తండ ప్రభువుల వలెనే అనేక వ్యవహారాలు రాత్రివేళలో చేయసాగారు. అందుకని జనానికి వారిలో శ్రీ మార్తండ మాణిక్ ప్రభువుగారు కనిపించి శ్రీ మార్తండ మాణిక్ ప్రభు వియోగ దుఃఖాన్ని మరవసాగారు.

శ్రీ మార్తాండ ప్రభువు సంస్థానంలో జరిగే అనేక విషయాలు ఆధునీకరించారు. కొన్నింటిని స్వయంగా ప్రారంభించారు. వివిధ దేవతల జన్మదినం, భజన పూజా కార్యక్రమాలు, ఉత్సవాలు పుణ్యతిథి, దర్బార్, సంగీత కార్యక్రమాలు, నగర ప్రదక్షిణ మరియు దిండి వివిధ కళాకారుల కార్యక్రమాలు వీరి కాలంలోనే విశేషంగా జరిగేవి. శ్రీ శంకర్‌మాణిక్ ప్రభు ఈ అన్ని విషయాలపై దృష్టి పెట్టి ఎలాంటి వెలితి లేకుండా శ్రద్ధ తీసుకొనేవారు. అలాగే సంప్రదాయకుల, భక్తుల సౌకర్యాలు మరియు వ్యవహారిక, అంతరంగిక అభివృద్ధివైపు దృష్టి పెట్టేవారు. శ్రీ శంకర్ మాణిక్‌ప్రభు స్వయంగా విద్యావంతులై ఉండిరి. ఆయన జనానికి విద్య అవసరాన్ని పరిగణనలోకి తీసుకొని మాణిక్‌నగర్‌లో ఒక పాఠశాలను స్థాపించారు. ఈ రోజు దానిపైనే శ్రీ శంకర్ విద్యానగరం యొక్క స్థాపన జరిగింది.

మాణిక్‌నగర్ ఇది ఒక ధర్మసంస్థానము. శ్రీ శంకర్ మాణిక్‌ప్రభు ధర్మ భావన మరియు భక్తి వీటి ప్రచారం కోసం అనేక ధర్మయాత్రలు చేశారు. కాని ఆయనకు స్వంత ప్రాంతం విడిచి బయట యాత్ర చేయడానికి సమయం దొరకలేదు.

దురితాంచే తిమిర జావో। విశ్వస్వధర్మసూర్యే పాహో।
జో జే వాంఛీల తొ తే లాహో। ప్రాణిజాత॥

(జ్ఞానేశ్వరీ)

అంటే స్వధర్మము అనే సూర్యుని ప్రకాశంతో దురితుల అహంకారం పోయేట్లు చేసి వారు ఏది కోరుకుంటారో అది వారికి ఇవ్వడం అని అర్థం. ఇదే ధర్మయాత్రల ఉద్దేశం కావచ్చు.

సామాన్య జనం తమ సంసారిక దుఃఖాలు, కష్టాలు దూరమవడానికి ఇలాంటి సత్పురుషులను ఆశ్రయిస్తారు. ఈ దుఃఖాలు, కష్టాలు దూరమవగానే వారిపై శ్రద్ధ కలిగి భక్తిమార్గంలో పడతారు. శ్రీ శంకరమాణిక్ ప్రభు కూడా ఇలా అనేక భక్తుల దుఃఖాలను, కష్టాలను దూరం చేశారు.

శ్రీ శంకర మాణిక్ ప్రభు రాయచూర్‌కి వెళ్లినపుడు అక్కడ శ్రీ మాణిక్‌ప్రభు మార్కెట్‌లోని వ్యాపారులు అత్యంత ఉత్సాహంతో స్వాగతం పలికారు. తోరణాలు కట్టి తమ దుకాణాలు అలంకరించారు. దారి పొడుగునా కళ్ళాపి చల్లి ముగ్గులు వేశారు. చాలా చోట్ల పూలతో అలంకరించిన కమానులు నిలబెట్టారు. అక్కడి స్వాగత సమారంభాన్ని చెపుతూ శంకర్‌మాణిక్ ప్రభు ఇలా అన్నారు. ఈ వ్యాపారుల బజారులో వ్యవహారాలు చూస్తే వాటి నుండి విధాత విశ్వం యొక్క కార్యకలాపాలను సూక్ష్మంగా ఊహించవచ్చు. లోకహితం కాక్షించి స్వంత వ్యాపారం చేయడానికి మించి వేరే ధర్మం లేదు. ఇదే ప్రభుసేవ. ఏ ప్రభు పేరైతే మీరు మార్కెట్‌కి పెట్టారో వారిని స్మరిస్తూ వ్యాపారం చేస్తే మీ కోరికలు తీరుతాయి. అలాగే మీ వ్యాపారం వృద్ధి కావాలని నేను ప్రభు చరణాల వద్ద ప్రార్థిస్తాను. అంతేకాక జనతా జనార్దనుల ప్రసన్నతయే వేదాంతం యొక్క మర్మము. పరమేశ్వరునికి ఐదుముఖాలు అంటారు ఇక్కడ అయితే సహస్రముఖాలు మా ముందు ఉన్నాయి. ఇదే విరాట్‌రూప దర్శనము. నా ప్రభువు యొక్క విరాట్ రూపం చూసి నాకు చాలా సంతోషం కలిగింది. శ్రీ ప్రభు ఎల్లప్పుడు మీకు మంచి చేస్తారు. చివరికి కర్ణాటక యువ సంఘంవారికి ఉత్సాహం ఇవ్వడానికి ఒక వంద ఒక రూపాయలు ఇచ్చి ప్రసంగాన్ని ముగించారు. ఇక్కడ వీరి ఉపన్యాసం వల్ల వాచకులకు ఆయన

వక్తృత్వ శక్తి, వేదాంతం పై పట్టు, వారు జనం మనస్సును గెలిచే విధానం, వినమ్ర స్వభావాల ప్రత్యక్ష దర్శనం కలుగుతుంది.

ప్రభు పీఠంపై ఆసీనులైన తరువాత వారి మృదు స్వభావం వల్ల అందరికీ వారంటే అభిమానం కలిగేది. అందుకని జనం సర్వసమర్థులైన శ్రీ మార్తాండ ప్రభువుని చండ శాసనుడైన సూర్యుడితో పోల్చి, శ్రీ శంకర ప్రభువుని చల్లనైన చంద్రునిగా భావించేవారు. చిన్న పిల్లలపై ప్రేమ, బీదవాళ్లపై కరుణ చూపేవారు. ఒకసారి ఎవరినైనా తన వాళ్లుగా భావిస్తే వారితోఎప్పుడూ వేరే విధంగా నడుచుకోలేదు. వాళ్లలో మీరు–మేము అనే భేదాన్ని ఎప్పుడూ చూపలేదు. ఎవరితో ఎప్పుడూ అనుచితంగా ప్రవర్తించలేదు. సౌజన్యానికి మారు రూపులై ఉండిరి. స్వార్థం ఆయనను ఎప్పుడూ స్పృశించలేదు. ఎప్పుడూ ఇతరుల గురించి ఆలోచన చేసేవారు. గాదిపై వారు విధియుక్తంగా ఆసీనులయిన తరువాత ఒక సంవత్సరం ఆయన భరతుని వలె గాదిని సంరక్షించారు.

గాదిపై కూర్చున్న తరువాత సక్రమమైనపాలన, దేవ–ధర్మ కార్యక్రమాలలో అలస్యం చేయకపోవడం, ఉపాసన పద్ధతిలో దృఢమైన ఏకాగ్రత పెట్టే వారు. వీరి ఏకైక చిరంజీవి శ్రీ సిద్ధరాజ్‌కి చిన్నపుడు ఒకసారి అనారోగ్యం చేసింది. అన్ని రకాల ఔషధాలు వాడారు కానీ ఒకేసారి జ్వరం పెరిగింది. ఈ విషయం శంకర్‌మాణిక్‌ప్రభుకు తెలియజేసే సమయానికి వారు పూజలో కూర్చుని ఉన్నారు. ఈయన స్వయంగా వైద్యులై ఉండిరి. అయినా ఆయన 'ప్రభు ఏం చేస్తారో చేయని' అన్నారు. వెంటనే శ్రీ ప్రభు కృపతో శ్రీ సిద్ధరాజ్ యొక్క జ్వరం తగ్గిపోయింది.

కాలం గడుస్తుండగా శ్రీ శంకర్ మాణిక్‌ప్రభు యొక్క ఆరోగ్యం వికటించింది. చాలా ఔషధోపచారాలు జరిగాయి. జపహోమాదులు అనేకం జరిపించారు. కాని నొప్పులు తగ్గేవి కావు. శ్రీ శంకర్ మాణిక్‌ప్రభువుకి తన చివరి క్షణాలు కనిపించసాగాయి. కానీ, ఆయన అత్యంత ధైర్యంతో దానిని ఎదురించడానికి నిశ్చయించుకొని తనప్రాణం పోయిన తరవాత ఏం చేయాలో ఆ తయారీ స్వయంగా ఆయనే చేసి పెట్టుకున్నారు.

సమాధికి పూర్వం శ్రీ శంకర్ మాణిక్ ప్రభు సోలాపూర్‌కి చెందిన బాబురావు వైకుంఠ్ అనే పేరుగల ప్రభు భక్తునికి ఒక లేఖను స్వహస్తాలతో వ్రాశారు. దాంట్లో ఏమి వ్రాశారో శ్రీజీ యొక్క నిర్యాణం తరువాత తెలిసింది. నిర్యాణం తరువాత శ్రీజీ యొక్క పార్థివ దేహాన్ని సమాధి స్థానంలో పెట్టడానికి ముందు కట్టడానికి కావలిసిన పట్టువంచ, శాలువా వంటి నూతన వస్త్రాలు అందుబాటులో లేకుండెను. దగ్గరలోని గ్రామాల్లో, బజారులో వెతికినా దొరకలేదు. ముందు ఏం చేయాలి అనే ఆలోచనలో భక్త మండలి ఉండగా సోలాపూర్ నుండి బాబురావు వైకుంఠ్ వచ్చారు. పట్టువంచ, శాలువా, గులాల్ కర్మ కోసం పనికివచ్చే పూర్తి సామాగ్రి ఆయన తేవడం చూసి జనానికి ఆశ్చర్యం కలిగింది. అప్పుడు వైకుంఠ్ ఈ సామాగ్రినంతా తీసుకొని రావలసిందిగా శ్రీజీ స్వయంగా లేఖ ద్వారా నాకు తెలియజేశారని చెప్పారు. ఇలా చెప్పగానే వారి దుఃఖానికి అంతులేకుండా పోయింది. ఇలాంటి పరిస్థితి వస్తుందని ముందుగానే తెలుసు అందుకని లేఖ వ్రాసి ఏర్పాటు చేసి పెట్టుకున్న శ్రీ శంకర్ మాణిక్ ప్రభు యొక్క భవిష్యత్ జ్ఞానం మరియు మృత్యువును ఎదిరించే ధైర్యం చూసి అందరు స్తంభించిపోయారు.

ఇలా ఆ కర్మయోగి శ్రీ శంకర్ మాణిక్‌ప్రభు 28 ఫిబ్రవరి 1945న తన నశ్వరదేహాన్ని విడిచి తమ సద్గురువైన శ్రీ మార్తండ ప్రభువు చరణాలలో లీనమయ్యారు. ఆయన సమాధి కూడా శ్రీ మార్తండ ప్రభువుల సమాధి ప్రక్కనే చేసి దానిపై దివ్యమైన పాలరాతి దేవాలయం నిర్మించబడింది.

## ८९. శ్రీ సిద్ధరాజ్ మాణిక్ ప్రభు

చతుర్థ దత్తావతారులు శ్రీ మాణిక్ ప్రభు మహారాజ్ కృపాలాభం సంప్రదాయకులకు మాత్రమే కాకుండా సామాన్య మానవులకు కూడా అందాలనే కారణంతో శ్రీ ప్రభువు గాది యొక్క సామర్థ్యం నిలిచి ఉంది. గాదిపై ఆసీనులయ్యే ప్రతినిధి యొక్క అసమాన దివ్యత్వం సాక్షాత్కరిస్తుంది. శ్రీ శంకర మాణిక్‌ప్రభు యొక్క మహాప్రయాణం తరువాత వారి పుత్రులు శ్రీ సిద్ధరాజ్ మాణిక్ ప్రభు, ఈ సకలమత పీఠం యొక్క పంచమాధికారిగా శ్రీ ప్రభువు గాదీపై ఆసీనులయ్యారు.

శ్రీ సిద్ధరాజ్ మాణిక్ ప్రభు బుధవారం 1 ఫిబ్రవరి 1939న మాణిక్‌నగర్‌లో జన్మించారు. శ్రీ శంకర్ మాణిక్ ప్రభు జ్యోతిశాస్త్ర పారంగతులై ఉండడం వల్ల శ్రీ సిద్ధరాజ్‌గారి జాతకం చూశారు. వారికి ఈ బాలకుడు అత్యంత తేజస్వి మరియు దీర్ఘాయుష్మాలై ఉండి, రూపంలో ప్రత్యక్షంగా శ్రీ మార్తండ ప్రభువులు తిరిగి అవతరించినట్లుగా అనిపించింది.

చిన్నతనంలో శ్రీ సిద్ధరాజును 'రాజా' అని ప్రేమతో పిలిచేవారు. శ్రీజీ యొక్క అనమాన త్రికాలదర్శన సాక్ష్యాలు వారి బాల్యలీలల ద్వారా తెలిసేవి. వీరు జన్మతోనే సిద్ధపురుషులు. వారి బాల్య స్నేహితులలో అన్నిజాతుల, మతాల పిల్లల కలయిక ఉండేది. చిన్నప్పటినుండి వీరికి ఆటలంటే ఇష్టం. వీరి విద్యాభ్యాసం గ్వాలియర్‌లోని సుప్రసిద్ధ సింధియా స్కూల్‌లో జరిగింది. పాఠశాలలో ఉన్న సమయంలో సౌమ్యంగా, వినమ్రంగా నడుచుకొని చిన్నవారినుండి పెద్దవారి వరకు అందరి మనస్సులను ఆకర్షించారు. 1956 వ సంవత్సరంలో పదవతరగతి ఉత్తీర్ణులైన తరువాత శ్రీజీ గారి మాతృశ్రీ లక్ష్మీబాయి (మామి సాహెబ్) మాణిక్‌నగర్ సంస్థానం యొక్క కార్యభారము వహించడానికి పిలిపించుకున్నారు. 1956వ సంవత్సరం మార్గశిర మాసం దత్తజయంతి ఉత్సవాల ఆరంభంలో శుభముహూర్తంలో విధియుక్తంగా దివ్య సమారంభంతో శ్రీ సిద్ధరాజ్ ప్రభుగారిని శ్రీ ప్రభుగాదీపై ఆసీనులను చేయడం జరిగింది. ఆ సమయంలో శ్రీజీగారి వయస్సు 18 సంవత్సరాలు. అంత లేత వయస్సులో సంస్థానం యొక్క కార్యభారము వహిస్తున్నప్పటికీ ఎటువంటి ప్రతికూల పరిణామాలు ఎదురవనీయలేదు.

శ్రీ మాణిక్‌ప్రభు కృపాబలం ఉండడం వల్ల కొన్ని మంచిపనులు తమ చేతులనుండి జరుగుతాయని శ్రీజీగారి దృఢ నమ్మకం. శ్రీ మాణిక్‌ప్రభువు తమ నుండి లోకకల్యాణ కార్యాలు చేయించుకుంటారని నమ్మారు. ప్రభు కృపకు పాత్రులైన శ్రీ సిద్ధరాజ్ ప్రభువుగారు ఎంత అధికార సంపన్నులో దీనివల్ల ఊహించవచ్చు. శ్రీజీగారి వినమ్రమైన నడవడికవల్ల వారి అధికార దర్పం పెరిగింది. అభిజాత రసికత, బహుశ్రుతత, ప్రశాసనా కౌశల్యం, వ్యాపక విచారణ సరళి, వినమ్రవృత్తి, ధీరోదాత్త నడవడిక, అన్ని విషయాల్లో ఆసక్తి ఇవి వీరి వ్యక్తిత్వంలోని గొప్ప గుణాలు.

సంసారికులై ఉండి సంసారానికి అంటకుండా నడుచుకోవడంలో వీరు నిస్సంశయంగా యశస్వీయుతులయ్యారు. శ్రీజీగారి వివాహం 1 జులై 1957 రోజు శ్రీ క్షేత్రం హరిహర్ మఠాధిపతి పరమ పూజ్య శ్రీ సమర్థ నారాయణ మహారాజుగారి పుత్రిక సౌ. మీరాబాయితో జరిగింది. శ్రీజీకి ఇద్దరు పుత్రులు నలుగురు కుమార్తెలు.

**విద్యాలయాలు మరియు ఇతర సంస్థలు:**

సంప్రదాయం యొక్క కర్తవ్యము పూర్తిచేస్తూ సామాజిక మరియు సాంఘిక కార్యాలలో శ్రీజీ అత్యంత శ్రద్ధ చూపేవారు. వారు స్థాపించిన మరియు వారి మార్గదర్శకత్వంలో వివిధ శిక్షణ మరియు సాంస్కృతిక సంస్థల వల్ల ఈ రోజు సంస్థానం యొక్క కీర్తి భారతదేశంలోనే కాక విదేశాల్లో కూడా వ్యాపించింది.

శ్రీజీగారు అధ్యాత్మిక భావనను ప్రజలలో పెంచడంలో యశస్వీయుతులయ్యారు. దాంతో పాటే ఆరు దశాబ్దాల కంటే ఎక్కువకాలం వారి నేతృత్వంలో మాణిక్‌ప్రభు సంస్థానం ఒక ఆదర్శ సాంఘిక సంస్థగా రూపుదిద్దుకుంది. సామాజిక, శిక్షణ సంస్థలు అభివృద్ధి జరిగి జనులకు వీటివల్ల సరియైన మార్గదర్శకత్వం లభించి ఈ ప్రాంతంలో ఒక ఆదర్శ శైక్షణిక సంస్థలుగా గుర్తింపు పొందుతున్నాయి. వారి కాలంలో స్థాపన జరిగి ప్రస్తుతం విజయవంతంగా నడుపబడుతున్న విద్యాసంస్థలు :

శ్రీమాణిక్ ఎడ్యుకేషన్ సొసైటీ, మాణిక్ పబ్లిక్ స్కూల్, శ్రీమాణిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ, శ్రీ మాణిక్ ప్రభు శిక్షణ సమితి, శ్రీ మాణిక్ విద్యాలయం, శ్రీ మాణిక్ ప్రభు ప్రాథమిక పాఠశాల, శ్రీ మాణిక్ ప్రభు గ్రంథాలయం, శ్రీ మాణిక్ ప్రభు విద్యార్థి వసతీ గృహం, శ్రీ మాణిక్ ప్రభు అనాథాలయం, శ్రీ మాణిక్ ప్రభు స్కూల్ ఫర్ ది బ్లైండ్, మణిగిరి వెల్ఫేర్ ట్రస్ట్, శ్రీ మాణిక్ ప్రభు వేద పాఠశాల, సంస్కృత పాఠశాల, సంగీతవిద్యాలయం,సాంస్కృతికప్రతిష్ఠాన్, శ్రీ మాణిక్ ప్రభు క్రీడా మండలి.

సంగీత, కవిత్వాది విషయాలలో శ్రీజీగారి నైపుణ్యం అందరికీ విదితమే. వీరి కావ్యాలలో మార్తండ మాణిక్ ప్రభువు వలె వేదాంతం అంతర్లీనంగా ఉండి భక్తి ప్రతిపదానికి కనిపిస్తుంది. ప్రతికూల పరిస్థితులలో గాంభీర్యంగా, దృఢ శక్తితో ఉన్నట్లుగా వారు వ్రాసిన 'ప్రభు జవళీ అసతా అసతా మగ చింతా మజ కా? ఈ మరాఠీ పదాల వల్ల స్పష్టంగా తెలుస్తుంది. (అర్థం: ప్రభు మనవద్దనే ఉన్నప్పుడు చింత మనకేల?)

శ్రీజీగారి కార్యభారంలోనే 1960వ సంవత్సరంలో శ్రీ మార్తండ ప్రభు జన్మశతాబ్ది మహోత్సవం, 1965వ సంవత్సరంలో శ్రీప్రభు మహానిర్యాణ మహోత్సవం (శతాబ్ది), 1977వ సంవత్సరంలో శ్రీ మనోహర్ ప్రభు మహానిర్యాణ మహోత్సవం, 1981వ సంవత్సరంలో శ్రీ బాబాసాహెబ్ మహారాజ్ జన్మశతాబ్ది మహోత్సవం, 1986 వ సంవత్సరంలో శ్రీ మార్తండ మాణిక్ ప్రభు మహానిర్యాణ అర్ధశతాబ్ది మహోత్సవం, 1989 వ సంవత్సరంలో శ్రీ గాయిత్రి పురశ్చరణ మహాయజ్ఞం మరియు మాణిక్‌నగర్-గాణగాపూర్ పాదయాత్ర, 1995వ సంవత్సరంలో సార్ధశతసంవత్సరీక జయంతి మహోత్సవం, 1998వ సంవత్సరంలో శ్రీ ప్రభు మందిర మహాకుంభాభిషేకం ఇలా అనేక మహామహోత్సవాలను నిర్వహించి సంస్థానం యొక్క గౌరవాన్ని ఉన్నత స్థితికి తీసుకెళ్ళారు.

1969లో మరియు 1993వ సంవత్సరంలో శృంగేరి పీఠాధిపతులు జగద్గురు శంకరాచార్యులు శ్రీ సంస్థానాన్ని సందర్శించి శ్రీజీ గారి కార్యక్రమాలను చూసి ముక్తకంఠంతో ప్రశంసించి గౌరవించారు.

శ్రీజీగారు సంప్రదాయ వ్యాప్తి కోసం ముంబాయి, ఢిల్లీ, చెన్నై, పూనా, సోలాపూర్, హైదరాబాద్, నాగ్‌పుర్, జల్‌గావ్, బుసావల్, అహ్మదాబాద్, ఔరంగాబాద్, బీడ్, లాతూర్, కర్నూల్ మొదలైన పట్టణాలు నాందేడ్, గుల్బర్గా, బీదర్ వంటి చిన్న పట్టణాలు అలాగే మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ మొదలైన రాష్ట్రాలలోని చిన్న-పెద్ద గ్రామాలను సందర్శించారు. శ్రీజీగారు ఈ ప్రచార యాత్రలతో సంస్థానం కీర్తి ధ్వజాన్ని ఆసేతుహిమాచలం ఎగురవేశారు.

శ్రీజీగారి కార్యనిర్వహణలో సంస్థానం సర్వతోముఖాభివృద్ధి సాధించింది. భక్తజనుల సౌకర్యార్థం అనేక కొత్త వసతులు కల్పించబడ్డాయి. శ్రీ ప్రభు భక్తుల ప్రాపంచికమరియు పారలౌకిక కోరికలను తీర్చడం కోసం శ్రీజీగారు అహోరాత్రులుశ్రమించారు. అక్టోబర్ 6, 2009 రోజు శ్రీజీగారు తమ భౌతికస్వరూపాన్ని విడిచి ప్రభుస్వరూపంలో లీనమయ్యారు. ప్రభుభక్తులకు వీరి ఆశీర్వాదం మరియు మార్గదర్శనం చాలాకాలం లభించింది. వీరి సమాధి మందిరం శ్రీ మార్తండ మాణిక్ప్రభు మరియు శంకర మాణిక్ ప్రభు మందిరాల పరిసరాలలో నిర్మించబడింది.

## ౯౦. శ్రీ జ్ఞానరాజ్ మాణిక్ప్రభు

శ్రీ సిద్ధరాజ్ మాణిక్ ప్రభువుల మహానిర్యాణం తరువాత సకలమత ప్రభుపీఠంపై ఆరవ పీఠాధిపతిగా వారి జేష్ఠపుత్రులు శ్రీ జ్ఞానరాజ్ మాణిక్ప్రభు మహారాజుగారు ఆసీనులయ్యారు. వీరు 3 డిసెంబర్ 1958 సంవత్సరంలో జన్మించారు. వీరు విద్యావిభూషితులై మాస్టర్ డిగ్రీ (యమ్. ఏ) పొందారు. వీరు కూడా గ్వాలియర్లోని సింధియా స్కూల్లో విద్యను అభ్యసించి అర్థశాస్త్రంలో ప్రథమ స్థానంలో 1975–76 వ సంవత్సర సర్వోత్కృష్ట విద్యార్థిగా స్వర్ణపతకంతో భారత రాష్ట్రపతిచేత గౌరవించబడ్డారు. వీరికి సంస్కృతం, హిందీ, ఉర్దూ, మరాఠీ, ఇంగ్లీష్, కన్నడ మొదలైన భాషలలో ప్రావీణ్యం ఉంది. 'అధ్యాత్మవిద్యా విద్యానాం' – విద్యలలో కెల్ల ఆధ్యాత్మిక విద్య శ్రేష్ఠమైనదని భగవంతుడు అన్నట్లుగా దానిని అనుసరించి ఆధ్యాత్మికం, వేదాంతం, కావ్యశాస్త్రం వారికి ఇష్టమైన విషయాలు. తమ ఉన్నతమైన కల్పనాశక్తితో ఎన్నో కావ్యరచనలు చేశారు. వారి కావ్యరచనలు 'జ్ఞానలహరి' అనే హిందీ కవితా సంపుటిగా ప్రచురింపబడింది. వీరి కావ్యరచన చూసి సుప్రసిద్ధ రాష్ట్రహిందీ కవి పండిత్ దినకర్గారు అభినందించారు. వీరు తమ కావ్యరచన ఎక్కువగా ఆధ్యాత్మిక, సామాజిక విషయాలపై వ్రాస్తారు. మాణిక్ ప్రభు చరిత్ర, మార్తాండ ప్రబోధ–1, మార్తాండ ప్రబోధ–2, వీటిని హిందీలో రచించి సంస్థానం యొక్క గ్రంథసంపదను వృద్ధి పరిచారు. 1975వ సంవత్సరం నుండి 'మాణిక్ రత్న' అనే మాస పత్రికను ప్రచురింప జేస్తున్నారు. సంప్రదాయ ప్రచారానికి నిజమైన గుర్తింపు వారి ఆధ్యాత్మిక ప్రవచనం వల్ల లభించింది. సంస్కార్ టీ వీ ఛానల్లో

సంవత్సరకాలం ప్రతి గురువారం వీరి ప్రవచన కార్యక్రమ ప్రసారం జరిగింది. శ్రీజీ యొక్క అధ్యాత్మిక యోగ్యతను గౌరవించడానికి గుల్బర్గా విశ్వవిద్యాలయం వీరిని గౌరవడాక్టరేట్ అందించి సత్కరించింది. వీరు ముప్పై సంవత్సరాల కంటే ఎక్కువ కాలం సంస్థాన కార్యదర్శిగా కార్యభారం వహించడం వల్ల సంస్థానం మరియు సంప్రదాయాన్ని పరిపూర్ణంగా అభ్యసించడం వల్ల, జీవనంలో ఉదాత్తత మరియు భవ్యత మొదలైన వాటిపై నిశ్చయమైన కల్పన కలిగి ఉన్నారు. మాణిక్‌ప్రభు సంప్రదాయంలోని ప్రతి విషయం రాజయోగానికి తగినట్లుగా వైభవోపేతం కావాలని మాణిక్‌నగర్ అభివృద్ధి చెందడానికి కావలిసిన మార్పు తీసుకురావాలని వారు నిరంతరం శ్రమిస్తున్నారు. (భండార్‌ఖానా) భోజనశాల యొక్క నూతన నిర్మాణం మరియు ఆధునికీకరణ, మాణిక్ ప్రభు మందిర పరిసరాలలో సుశోభీకరణ, భక్తులకు ఆధునిక వసతులతో కూడిన నివాసవ్యవస్థ కొరకు నూతన కట్టడాలు, సంస్థానంలోని సిబ్బందిని కలుపుకొని వెళ్ళడం వంటి వాటిని ప్రముఖంగా చెప్పవలసిన అవసరం ఉంది. ఇలా సంస్థాన అభివృద్ధికి అనేక విధాలుగా కృషి చేస్తున్నారు. ఈ కార్యంలో శ్రీజీగారికి వారి సోదరులైన శ్రీ ఆనంద్‌రాజ్‌గారి విశేష సహకారం లభిస్తున్నది. శ్రీ ఆనంద్‌రాజ్‌గారు సంస్థానం యొక్క కార్యదర్శిగా కార్యభారం వహిస్తున్నారు. శ్రీజీ యొక్క వివాహం జహీరాబాద్‌కి చెందిన శ్రీ వెంకట్‌రావ్ కులకర్ణీ గారి కుమార్తె సౌ. శుభదతో జరిగింది. వీరికి ముగ్గురు పుత్రులు మరియు ఒక పుత్రిక ఉంది. వీరి జేష్ఠ పుత్రులు శ్రీ చైతన్యరాజ్ శ్రీ సంస్థానం యొక్క సహ కార్యదర్శిగా ప్రభు సేవ చేస్తున్నారు. అసాధారణ జ్ఞానం, ప్రచండ విద్వత్తత, వ్యాపక అనుభవం, విశాల కర్తృత్వం మరియు కుశల కార్యదక్షత వీటి బలంపై శ్రీజీ సకలమత సంప్రదాయానికి విశాల వైభవోపేత రూపం తీసుకువచ్చి మాణిక్ ప్రభు సంస్థానం యొక్క కీర్తి ధ్వజాన్ని ఆసేతుహిమాచలం ఎగురవేస్తారని అందరికి దృఢమైన నమ్మకం ఉంది. శ్రీజీ యొక్క కార్యనిర్వహణలో సంస్థానం యొక్క సర్వతోముఖాభివృద్ధి జరుగుతూంది. భక్తులకోసం అనేక కొత్త వసతులు కల్పించబడుతున్నాయి. శ్రీ ప్రభుభక్తుల ఐహిక, లౌకిక శ్రేయస్సు కోసం శ్రీజీ అహర్నిశలు శ్రమిస్తున్నారు. ప్రభు సంప్రదాయికులకు వీరి కృపాఛత్రంతో ప్రభు సంప్రదాయం మరియు ప్రభు సంస్థానం యొక్క ఉత్తరోత్తర అభివృద్ధి జరగాలని ప్రభు చరణాలవద్ద ప్రార్థిస్తున్నాము.

జై గురు మాణిక్!

॥ శ్రీ దత్తాత్రేయార్పణమస్తు ॥ ॥ శ్రీ గురు మాణికార్పణమస్తు ॥

# ఫలశ్రుతి

సాక్షాత్ దత్తాత్రేయ స్వరూపులైన శ్రీ మాణిక ప్రభు మహారాజుగారి ఈ దివ్య చరిత్రను ఎవరైతే శ్రద్ధ - భక్తితో పఠిస్తారో వారి మనస్సులోని అన్ని కోరికలు తీరి వారికి ప్రభు కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ లభిస్తాయి.

సకలమత సంప్రదాయంలో ప్రభువును మూడు పద్ధతులలో ఉపాసించవచ్చు. మొదటిదైన అధ్యాత్మిక ఉపాసనలో ప్రభువు పరబ్రహ్మ స్వరూపమై ఉందురు. నిష్కామ భావనతో ప్రభుచరితామృత పారాయణం చేయడం వల్ల ప్రభు యొక్క సచ్చిదానంద స్వరూప సాక్షాత్కారం కలుగుతుంది.

రెండవదైన అధిదైవిక ఉపాసన అనగా దత్తాత్రేయులే చతుర్థావతారంలో శ్రీ సద్గురు మాణికప్రభువు రూపంలో అవతరించారు. ఆదిదైవిక ఉపాసనా పద్ధతిలో మనం ఈ చరితామృత పారాయణం చేస్తే ప్రభు కృపతో ధర్మార్థ కామ మోక్షములు ప్రాప్తిస్తాయి.

ఇక మూడవది అధిభౌతిక రూపంలో మాణిక ప్రభువులు బయాదేవి మరియు మనోహరనాయిక్ దంపతులకు రామతీర్థ క్షేత్ర సమీపంలోని లాడవంతి గ్రామంలో జన్మించి భక్తుల కోరికలను తీర్చే కల్పవృక్షము వలె సిద్ధగురువు రూపంలో అవతరించారు. ఈ రూపంలో ప్రభువును ధ్యానించి ఈ చరిత్ర పారాయణం చేస్తే సంతానం కావాలనుకునే వారికి సంతాన ప్రాప్తి, ఐశ్వర్య ప్రాప్తి, ఆరోగ్య ప్రాప్తి, వ్యాపారవృద్ధి, సౌభాగ్య ప్రాప్తియే కాకుండా సర్వాభీష్టాలు నెరవేరి ప్రభు కృపాశీర్వాదాలు లభిస్తాయి. ఈ చరిత్ర చదివేవారికి మరియు వినేవారికి ప్రభు అఖండ కృపాశీర్వాదం ఎల్లప్పుడూ లభించుగాక !

॥ శ్రీ దత్తాత్రేయార్పణమస్తు ॥ ॥ శ్రీ గురు మాణికార్పణమస్తు ॥



శ్రీ కాలాగ్నిరుద్ర మారుతి



శ్రీ అన్నపూర్ణేశ్వరి



శ్రీ వెంకమ్మ దేవాలయము



ఔదుంబర్ వృక్షము



మహబూబ్ సుభాని ఛల్లా



శ్రీ మార్తండ ప్రభు మరియు శ్రీ శంకర ప్రభు దేవాలయము


శ్రీ మాణిక ప్రభు సంస్థానము

మాణికనగర్-585353, జి. బీదర్, కర్నాటక.

Phone: 08483-270042, 9448469913

₹200

BOK-MCT-29

MOHAN PUBLICATIONS
దేవుళ్ళు
Online Book Store
Devullu.com

భక్తి, జ్యోతిష, వాస్తు, వైదిక, మంత్ర, తంత్ర, యంత్ర, స్మార్త, ఆయుర్వేద, ధర్మ శాస్త్రాది గ్రంథములకు...
మోహన్‌పబ్లికేషన్స్ వారి గ్రంథాలు ఇప్పుడు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసుకొనవచ్చును
Devullu.com

## 1. వ్రతకథలు – పూజలు

| | |
|---|---|
| శ్రీ వినాయక వ్రతం | వెల రూ.10-00 |
| శ్రీ విఘ్నేశ్వరపూజా-పుణ్యాహవాచనం | 30-00 |
| శ్రీ విఘ్నేశ్వరపూజ (కాణిపాకక్షేత్రమాహాత్మ్యంతో) | 12-00 |
| సంకష్టహరచతుర్థి శ్రీమహాగణపతి వ్రతం | 30-00 |
| వరలక్ష్మీవ్రతం | 10-00 |
| కేదారేశ్వర వ్రతం | 10-00 |
| త్రినాధ వ్రతం(కలర్) | 10-00 |
| త్రినాధవ్రతం(సాదా) | 10-00 |
| క్షీరాబ్ధి వ్రతం | 12-00 |
| మంగళ గౌరీవ్రతం | 12-00 |
| వైభవలక్ష్మీవ్రతం ఫోటో యంత్రంతో | 25-00 |
| శ్రీలక్ష్మీకుబేర వ్రతం (ఫోటో యంత్రంతో) | 25-00 |
| కనకమహాలక్ష్మీవ్రతం (కామేశ్వరీపాటతో) | 25-00 |
| సంతోషీమాతా వ్రతం | 25-00 |
| ఏడు శనివారాల వ్రతం | 25-00 |
| సత్యనారాయణవ్రతం | 25-00 |
| శ్రీ సువర్చలాహనుమద్దీక్ష | 25-00 |
| శివదీక్ష | 12-00 |
| కాత్యాయనీ వ్రతం | 25-00 |
| సౌభాగ్య గౌరీవ్రతం | 25-00 |
| తిరుప్పావై (ధనుర్మాసవ్రతం) | 45-00 |
| స్త్రీల వ్రతకథలు | 36-00 |
| స్త్రీలవ్రతకథలుస్థూలాక్షరి (నేదునూరిగంగాధరరావుగారి) | 36-00 |
| పెళ్ళి పాటలు – స్త్రీలపాటలు (కామేశ్వరిపాటతో) | 40-00 |
| సర్వదేవతా పూజావిధానం | 25-00 |
| ఆరువ్రతాలు | 36-00 |
| రాహుకాలంలోదుర్గాదేవీపూజా | 20-00 |
| తులసి నిత్యపూజ, తులసీఉపయోగాలు | 20-00 |
| శ్రీ చక్ర రహస్య విజ్ఞానమ్ | 40-00 |
| శ్రీచక్ర పూజావిధానం(పెద్దది) | 40-00 |
| లక్ష్మీ – గౌరీ నిత్యపూజ | 12-00 |
| శ్రీ సరస్వతీ నిత్యపూజ | 20-00 |
| కాలభైరవ నిత్యపూజ | 20-00 |
| శివపూజ | 20-00 |
| వీరభద్ర పూజ | 20-00 |
| ఆంజనేయ నిత్యపూజ | 20-00 |
| నాగేంద్ర స్వామి పూజ | 12-00 |
| సుబ్రహ్మణ్య నిత్యపూజ | 20-00 |
| రామదేవుని కథ | 20-00 |
| శివదేవుని కథ | 20-00 |
| లక్ష్మీనరసింహపూజ | 12-00 |
| వేంకటేశ్వరపూజ | 20-00 |
| బ్రహ్మంగారి నిత్యపూజ | 12-00 |
| సూర్య నిత్యపూజ | 12-00 |
| నవగ్రహ నిత్యపూజ | 20-00 |
| రుక్మిణీ కల్యాణం | 25-00 |
| ఉమామహేశ్వర వ్రతం | 40-00 |
| శ్రీ కామేశ్వరీ వ్రతం | 25-00 |
| 16 సోమవారముల వ్రతము | 25-00 |
| పార్వతీకల్యాణం | 25-00 |
| సహస్రకమలవర్తి వ్రతము | 25-00 |
| పంచముఖ ఆంజనేయనిత్యపూజ | 25-00 |

| | |
|---|---|
| అష్టనాగపూజ | 40-00 |
| పూజలు ఎందుకుచేయాలి ? | 40-00 |
| ఏ దేవునికి ఏపుష్పాలతో పూజించాలి? | 40-00 |
| ఏ దేవునికి ఏప్రసాదం నైవేద్యం పెట్టాలి? | 40-00 |
| ఏదేవునికి ఏవిధముగాదీపారాధనచెయ్యాలి? | 40-00 |
| ఏదేవునికి ఎన్ని ప్రదక్షిణలుచేయాలి ? | 40-00 |
| హనుమద్ వ్రతం | 40-00 |
| పంచాయతన పూజ | 63-00 |
| 28 వ్రతములు | 120-00 |
| కలశపూజలు (9ఒకేసారి) | 150-00 |
| గోమాత | 45-00 |
| పుత్రగణపతి వ్రతం | 30-00 |
| శ్రీగణేష్‌దీక్ష | 30-00 |
| 18 దేవతల పూజాకల్పతరువు (పురుషదేవత) | 120-00 |
| 18 దేవతల పూజాకల్పతరువు ( స్త్రీ దేవత ) | 120-00 |
| మన గ్రామ దేవతలు | 63-00 |

## 2. స్తోత్రాలు-సుప్రభాతములు సహస్రనామములు

| | |
|---|---|
| శ్రీ లలితా విష్ణు సహస్రనామస్తోత్రాలు | 54-00 |
| పురాణపండ రాధాకృష్ణమూర్తిగారి సంకలనం | |
| లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (హిందీ) ,, | 54-00 |
| లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (ఇంగ్లీషు) ,, | 54-00 |
| స్థూలాక్షరిలలితావిష్ణుసహస్రనామస్తోత్రములు (పత్రికసైజ్) | 108-00 |
| లలితావిష్ణు (కేస్ బైండ్) 1/8 డెమ్మి | 72-00 |
| స్థూలాక్షరీ లలితావిష్ణు (క్రౌన్‌సైజు)కేస్‌బైండ్ | 126-00 |
| సర్వదేవతా స్తోత్రమంజరి | 120-00 |
| సకలదేవతా అష్టోత్తరశతనామావళిః (63) | 27-00 |
| విష్ణుసహస్రనామస్తోత్రమ్ (క్రౌన్) | 25-00 |
| లలితా సహస్రనామ స్తోత్రమ్ (క్రౌన్) | 40-00 |
| లలితా సహస్రనామములు | 27-00 |

| | |
|---|---|
| లక్ష్మీ సహస్రనామములు | 27-00 |
| దుర్గా సహస్రనామములు | 27-00 |
| ఆంజనేయ సహస్రనామములు | 27-00 |
| శివ సహస్రనామములు | 27-00 |
| విష్ణు సహస్రనామములు | 27-00 |
| గణపతి సహస్రనామములు | 27-00 |
| సుబ్రహ్మణ్య సహస్రనామములు | 27-00 |
| గాయత్రి సహస్రనామములు | 27-00 |
| లలితావిష్ణు సహస్రనామస్తోత్రాలు | 27-00 |
| లక్ష్మివిష్ణు,లలితా సహస్రనామ స్తోత్రాలు | 27-00 |
| శ్రీరామా సహస్రనామములు | 27-00 |
| సరస్వతి సహస్రనామములు | 27-00 |
| సూర్యసహస్రనామములు & ఆదిత్యహృదయం | 27-00 |
| శ్రీవేంకటేశ్వరసహస్రనామములు | 27-00 |
| లక్ష్మీనృసింహ సహస్రనామాలు | 27-00 |
| మణిద్వీపవర్ణన (పెద్దది) | 27-00 |
| సంధ్యావందనం | 27-00 |
| రుద్రం-నమకం, చమకం మంత్రపుష్పమ్ | 27-00 |
| కాలభైరవసహస్రనామం | 27-00 |
| త్రిభాషా హనుమాన్‌చాలీసా | 15-00 |
| హనుమాన్ చాలీసా | 12-00 |
| మణిద్వీపవర్ణన (పాకెట్) | 12-00 |
| శివారాధన (శివస్తోత్రాలు) | 12-00 |
| వేంకటేశ్వర సుప్రభాతం (పాకెట్) | 12-00 |
| ఆరుదండకాలు | 5-00 |
| వేంకటేశ్వర గోవిందనామములు | 5-00 |
| అష్టలక్ష్మీ స్తోత్రమ్ కనకధారాస్తోత్రమ్ | 12-00 |
| దేవీఖడ్గమాలాస్తోత్రమ్ (మహిషాసురమర్దనీస్తోత్రంతో) | 12-00 |
| సుందరకాండ (పాకెట్) | 12-00 |
| భగవద్గీత మూలం | 27-00 |
| భగవద్గీత వచనం | 27-00 |
| రామరక్షాస్తోత్రమ్ | 25-00 |
| స్తోత్ర రత్నావళి | 45-00 |
| పురాణపండలలితా-విష్ణు సహస్రనామస్తోత్రమ్(మినీ) | 12-00 |

పురాణపండ లలితా
సహస్రనామస్తోత్రమ్(మినీ) 12-00
పురాణపండ విష్ణు సహస్రనామస్తోత్రమ్12-00
పురాణపండ ఆదిత్య హృదయం 12-00
మంత్రపుష్పం (మినీ) 10-00
శివానందలహరి-సౌందర్యలహరి 40-00
కుజదోషం 12-00
కాలసర్ప దోషం 12-00
మీ అప్పులు తీరాలా? 20-00
దృష్టిదోషాలు నివారణ 20-00
పంచసూక్తములు 12-00
సంధ్యావందనం 12-00
రుద్రనమకమ్-చమకమ్ 12-00
గాయత్రీమంత్రాలు 12-00
హయగ్రీవ స్తోత్రమాల 12-00
దక్షిణామూర్తి స్తోత్రమాల 12-00
ద్వాదశ జ్యోతిర్లింగాలు -
పంచారామాలతో 12-00
శ్రీసూక్తం పురుష సూక్తం 12-00
నవగ్రహస్తోత్రమాల 40-00
మహాన్యాసమ్ 40-00
సుందరకాండ గానామృతం 40-00
గోమాతపూజావిధానము 10-00
ఆనందసిద్ధి - 1 శ్రీదేవీ స్తోత్రమాల 108-00
ఆనందసిద్ధి - 2 ఏ సమస్యకు ఏ స్తోత్రమ్
పారాయణచేయాలి 108-00
ఆనందసిద్ధి-3 మానసదేవీ స్తోత్రమాల108-00
శివ, శాక్తేయ, వైష్ణవ తంత్రాలు (ఆనందసిద్ధి-4)
వనదుర్గా పాశుపతతంత్రం (ఆనందసిద్ధి-5)
అర్చన 45-00
నిత్యదేవతార్చన 45-00
సర్వదేవతా స్తోత్ర నిధి 108-00
శ్రీచక్ర నవవరణార్చన 63-00
చండీ సప్తశతి పారాయణ క్రమం 120-00
శ్రీదేవి స్తోత్ర రత్నావళి 32 దేవి స్తోత్రాలకు
తాత్పర్యంతో 120-00
వనదుర్గా మంత్రానుష్ఠాన క్రమమ్ 63-00
శ్రీ కాలభైరవ వ్రతవిధానం 63-00
శ్రీ కాలభైరవ రక్షా కవచమ్ 27-00
శ్రీ కాలభైరవ దీక్ష 25-00
శ్రీ కాలభైరవ హెూమము, రెమిడీస్ .......
నాగదేవతా సర్వస్వం
-సుబ్రహ్మణ్యస్వామి చరిత్ర 120-00
108దేవతల అష్టోత్తరశతనామావళులు
54-00
స్థూలాక్షరి అష్టోత్తరము (పెద్దది) 54-00
పంచసూక్తములు 36-00
రుద్రాధ్యాయము 200-00
శ్రీ శివగీత (శ్లోకం) 63-00

## 3. శ్రీ సాయి దత్త గ్రంథములు

శ్రీ సాయిబాబా సచ్చరిత్ర 126-00
సంపూర్ణ శ్రీ గురు చరిత్ర 126-00
శ్రీ సాయిఆరాధన-షిర్డివైభవం 108-00
శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర (క్రౌన్) 63-00
శ్రీ గురుచరిత్ర (క్రౌన్) 63-00
నవనాధ చరిత్ర 120-00
శ్రీసాయిచరిత్ర(బైండు)
ప్రయాణపుపారాయణగ్రంథం 63-00
శ్రీగురుచరిత్ర (బైండు)
ప్రయాణపుపారాయణగ్రంథం 63-00
శ్రీ సాయి సచ్చరిత్ర సాదా (ఒకరోజు) 54-00
శ్రీ గురు చరిత్ర సాదా (ఒకరోజు) 54-00
సత్యదత్తవ్రతం దత్తాత్రేయపూజాకల్పం,
సహస్రంతో 30-00
అనఘాదేవీ వ్రతం 30-00
భక్తుల ప్రశ్నలకు బాబా జవాబులు 36-00
శ్రీ సాయిపూజాకల్పం (సహస్రంతో) 30-00
శ్రీ సాయిభజనమాల 30-00
శ్రీ సాయి భజన్స్ 30-00
శ్రీ సాయిభక్తి గీతాలు 30-00
శిరిడిహారతులు (భావంతో) 30-00
"శ్రీసాయి"కోటి 25-00
"శ్రీసాయిరామ్"కోటి 20-00
శ్రీ సాయినాథ స్తోత్రమంజరి 10-00
శ్రీ సాయివేయినామాలు 7-50

| | |
|---|---|
| శ్రీ సాయి హారతులు (పాకెట్) | 12-00 |
| శ్రీ సాయి స్తవనమంజరి | 12-00 |
| హిందీ శ్రీ సాయి హారతులు | 15-00 |
| శని సింగణాపూర్ క్షేత్రమాహాత్మ్యం | 63-00 |
| ఇంగ్లీషు శ్రీ సాయిహారతులు | 15-00 |
| షిరిడి దర్శనం-శ్రీసాయి వైభవం | 108-00 |
| సాయిసత్యవ్రతం | 30-00 |
| సాయి అనుగ్రహమ్ | 108-00 |
| నవగురువారాల వ్రతకల్పము | 15-00 |
| శ్రీదత్తలీలామృతము (చరిత్ర) | 108-00 |
| హృదయంలో సాయి | 15-00 |
| శ్రీషిరిడీసాయి లీలామృతం (శ్రీసచ్చరిత్ర) | 108-00 |
| గజాననమహరాజ్ చరిత్ర | 108-00 |

## 4. జ్యోతిషాలు

| | |
|---|---|
| గార్గేయం పంచాంగం | 54-00 |
| 'కాలచక్రం' గంటలపంచాంగం (గార్గేయ) | 6 3 - 00 |
| గ్రహభూమి పంచాంగము (గార్గేయ) | 108-00 |
| ఆనందసిద్ధి పంచాంగం (వై.వి.శాస్త్రి) | 63-00 |
| ములుగు వారి రాశిఫలితాలు (12రాశులువారికి) | 54-00 |
| కాలచక్రం జ్యోతిషక్యాలండర్ | 25-00 |
| సాదా క్యాలండర్ | 10-00 |
| పాకెట్ క్యాలండర్ | 15-00 |
| తాజకనీలకంఠీయమ్ | 100-00 |
| కేరళ జ్యోతిష రహస్యాలు | 180-00 |
| జ్యోతిష బ్రహ్మ రహస్యాలు | 180-00 |
| మానసాగరి జాతకపద్ధతి | 250-00 |
| వరాహమిహిర జాతకపద్ధతి | 200-00 |
| వధూవర వివాహమైత్రి ద్వాదశకూటములు | 120-00 |
| సింపుల్ రెమిడీస్ | 180-00 |
| శంభు హోరప్రకాశిక | 250-00 |
| పూర్వ పరాశరి | 150-00 |
| పరాశర జ్యోతిషవిజ్ఞాన సర్వస్వం | 200-00 |
| ప్రశ్న సింధు | 120-00 |
| నక్షత్ర విశేష ఫలితాలు | 63-00 |
| సూర్యసిద్ధాంతపంచాంగ గణితంచేయడంఎలా? | 180-00 |
| దృక్సిద్ధాంతపంచాంగ గణితం చేయడంఎలా? | 180-00 |
| ఆయుర్దాయ నిర్ణయం | 63-00 |
| జాతక గణిత ప్రవేశిక | 63-00 |
| జ్యోతిషమర్మబోధిని | 63-00 |
| జ్యోతిష ప్రశ్నోత్తరమాల | 63-00 |
| ముహూర్తం నిర్ణయించడంఎలా? | 63-00 |
| జాతక మకరందం | 63-00 |
| జ్యోతిష సరస్వతి | 63-00 |
| మీజననకాల విశేషాలు | 63-00 |
| ముహూర్త విజ్ఞాన భాస్కరం | 63-00 |
| జ్యోతిష స్వయంబోధిని | 63-00 |
| శుభముహూర్త శిరోమణి | 63-00 |
| నక్షత్ర ఫలమంజరి | 40-00 |
| పంచాంగం చూసే విధానం | 40-00 |
| సర్వార్థ జ్యోతిషం | 40-00 |
| ప్రాథమిక జ్యోతిషం | 40-00 |
| నవరత్నములు శుభయోగములు | 40-00 |
| శుభశకునాలు | 40-00 |
| హస్తరేఖాఫలితాలు | 40-00 |
| సంఖ్యల్లో భవిష్యత్ | 40-00 |
| ముహూర్త దీపిక | 108-00 |
| పుట్టుమచ్చలు ఫలితాలు | 30-00 |
| కలలు ఫలితాలు | 30-00 |
| జాతక చక్రం వేయడం ఎలా? | 40-00 |
| మానసాగరి(ప్రాచీనజ్యోతిషగ్రంథం) -పుచ్చా శ్రీనివాసరావు | 250-00 |
| జ్యోతిషశాస్త్ర చిట్కాలు | 120-00 |
| గుప్తా శతాబ్ది పంచాంగం (1940-2050) | 1116-00 |
| ప్రశ్నచండేశ్వరమ్ | 63-00 |
| ద్వాదశభావ ఫలచంద్రిక | 360-00 |
| జ్యోతిష శతయోగరత్నావళి (నూరుయోగాలఫలితాలు) | 120-00 |
| అంగసాముద్రికం | 40-00 |

| | |
|---|---|
| హస్త సాముద్రికం | 63-00 |
| లాల్ కితాబ్ | 120-00 |
| శకునశాస్త్రం | 63-00 |
| ఆధునికప్రశ్నశాస్త్రం | 120-00 |
| పరాశరజ్యోతిష ప్రశ్నజ్యోతిషం | 180-00 |
| అష్టకవర్గు (కొండపల్లి) | 63-00 |
| బృహత్‌జాతకం (ప్రాచీనప్రతికిపునర్ముద్రణ) | 250-00 |
| లగ్నరత్నాకరం | 63-00 |
| షట్పంచాశిక | 120-00 |
| 40 రోజుల్లో జ్యోతిషంనేర్చుకొనండి | 270-00 |
| 40 రోజుల్లో సాముద్రికంనేర్చుకొనండి | 180-00 |
| 40 రోజుల్లో సంఖ్యాశాస్త్రం | 180-00 |
| 40 రోజుల్లో నక్షత్ర (నాడీ) ఫలితములు | 270-00 |
| 40 రోజుల్లో వైద్యజ్యోతిషం నేర్చుకోండి | 250-00 |
| మీ పుట్టినతేదీ అద్భుతరహస్యాలు (సాయిగణపతిరెడ్డి) | 270-00 |
| కె.పి.జ్యోతిషం (పరిచయం) | 63-00 |
| ముహూర్తచింతామణి | 108-00 |
| సూర్యచంద్ర గ్రహణములు | 63-00 |
| ప్రసిద్ధవ్యక్తుల జాతకాలు (వేరేకొండప్ప) | 180-00 |
| అదృష్టరెమెడీస్ | 120-00 |
| గ్రహసంచార ఫలనిర్ణయదీపిక | 63-00 |
| జ్యోతిష రెమిడీస్ | 300-00 |
| జాతకమార్తాండం పాతప్రతికి యథాతథం (కొండపల్లి) | 250-00 |
| జ్యోతిషవిద్యాప్రకాశిక పాతప్రతికి యథాతథం (కొండపల్లి) | 250-00 |
| నాడీజ్యోతిషం | 63-00 |
| నక్షత్రపారిజాతం (గోరసవీరభద్రాచార్య) | 63-00 |
| లగ్నపారిజాతం (గోరసవీరభద్రాచార్య) | 63-00 |
| గౌతమసంహిత | 63-00 |
| హోరరత్నమాల | 63-00 |
| జాతకఫల మణిమంజరి | 200-00 |
| పుష్కర పంచాంగం (2013-14నుండి 2024-25) | 596-00 |
| దశాభుక్తిఫల నిర్ణయం | 250-00 |
| వింత జోష్యములు | 63-00 |
| షోడశవర్గులు | 200-00 |
| రవిగ్రహ సమస్త ప్రభావములు | 108-00 |
| చంద్ర గ్రహ సమస్త ప్రభావములు | 108-00 |
| కుజ గ్రహ సమస్త ప్రభావములు | 108-00 |
| బుధ గ్రహ సమస్త ప్రభావములు | 108-00 |
| గురు గ్రహ సమస్త ప్రభావములు | 108-00 |
| శుక్ర గ్రహ సమస్త ప్రభావములు | 108-00 |
| శని గ్రహ సమస్త ప్రభావములు | 108-00 |
| రాహు & కేతు గ్రహముల సమస్త ప్రభావములు | 108-00 |
| ఆధునిక గ్రహములు-ఉపగ్రహములు సమస్త ప్రభావములు | 108-00 |
| ముహూర్తమార్తాండం | 108-00 |
| లఘుజాతకం | 108-00 |
| జాతకాలంకారము | 108-00 |
| మేషలగ్న ఫలితములు | 108-00 |
| వృషభ లగ్న ఫలితములు | 108-00 |
| మిథున లగ్న ఫలితములు | 108-00 |
| కర్కాటక లగ్న ఫలితములు | 108-00 |
| సింహలగ్న ఫలితములు | 108-00 |
| కన్యలగ్న ఫలితములు | 108-00 |
| తుల లగ్న ఫలితములు | 108-00 |
| వృశ్చిక లగ్న ఫలితములు | 108-00 |
| ధనుస్సు లగ్న ఫలితములు | 108-00 |
| మకర లగ్న ఫలితములు | 108-00 |
| కుంభ లగ్న ఫలితములు | 108-00 |
| మీన లగ్న ఫలితములు | 108-00 |
| నారద సంహిత | 200-00 |
| పంచాంగపీఠికలేఖికాగణితం | 250-00 |
| తారాబలం - చంద్రబలం (వేరే కొండప్ప) | 108-00 |
| సులభలగ్న సాధన (చిత్రాలగురుమూర్తిగుప్తా) | 200-00 |
| రాహు కేతువుల యోగము | 108-00 |
| ఛాయాగ్రహములు | 108-00 |

జ్యోతిషవిజ్ఞాన దీపిక 63-00

**బి.వి.రామన్ గారి గ్రంథములు**

జ్యోతిష విద్యారంభం 50-00
గ్రహభావ బలములు 50-00
కాలచక్రదశ 50-00
అనుభవ ప్రశ్నాజ్యోతిషం 50-00
జ్యోతిషశాస్త్రంలో వాతావరణ భూకంపాలు 50-00
పురోగామి జాతకం 50-00
భావార్థరత్నాకరం 75-00
భారతీయజ్యోతిష సర్వస్వం 75-00
అష్టకవర్గ పద్ధతిః 75-00
జ్యోతిషశాస్త్రంలో సందేహాలు,సమాధానాలు 75-00
ప్రశ్నతంత్ర 75-00
ముహూర్తం 75-00
విశిష్ట జాతకములు 120-00
భారతీయఫలితజ్యోతిషం 120-00
300 ముఖ్యమైన యోగములు 120-00
జాతకంపరిశీలించడంఎలా ? 300-00

**రాష్ట్రపతి అవార్డుగ్రహీత, మహామహోపాధ్యాయ, వాచస్పతి శ్రీ మధురకృష్ణమూర్తిగారి గ్రంథములు**

బృహత్పరాశరహోరాశాస్త్రము-1 200-00
బృహత్పరాశరహోరాశాస్త్రము-2 200-00
బృహత్పరాశరహోరాశాస్త్రము-3 200-00
బృహత్పరాశరహోరాశాస్త్రము-4 200-00
భావార్థరత్నాకరము 100-00
ముహూర్త చింతామణి 100-00
ముహుర్త చింతామణి-పార్టు2 200-00
స్వప్న శాస్త్రము 36-00
శతయోగమంజరి 50-00
వ్రతనిర్ణయకల్పవల్లి 250-00
దైవజ్ఞవల్లభం 75-00
వసంతరాజశకునమ్ (బృహత్శకునశాస్త్రం) 250-00
వాస్తుశాస్త్రవివేకము-1 100-00
వాస్తుశాస్త్రవివేకము-2 200-00
వాస్తుశాస్త్రవివేకము-3 100-00
వాస్తుశాస్త్రవివేకము-4 200-00
అనుభవసులభవాస్తు - 1 54-00
అనుభవసులభవాస్తు - 2 100-00
పంచాంగ వివేకము 108-00
వశిష్ఠ సంహిత 450-00
పంచపక్షి శాస్త్రం (కేస్‌బైండ్) 200-00
సిద్ధాన్తసరళి 200-00
సిద్ధాన్త రహస్యమ్ 200-00
సూర్యసిద్ధాన్త చిన్తామణి 200-00
ధృవనాడీ జ్యోతిషం 63-00
జైమినీజాతకశికామణి 200-00
కాలసర్పయోగచంద్రిక 270-00
క్యాలండర్ రిఫార్మ్కమిటి .......
పంచాంగ గణిత సిద్ధాంతం- ఎదునోజు(సూర్యసిద్ధాతంతం) 350-00
జ్యోతిర్వాస్తు సర్వస్వం 300-00
జ్యోతిషసుధ 200-00
ధృవనాడి 200-00
జ్యోతిష రహస్యబోధిని 200-00
బృహజ్జాతకం భట్టోత్పలవ్యాఖ్య 300-00
బృహత్సంహిత 1,2 500-00
ముహూర్తవల్లరి 250-00
జ్యోతిషకల్పలత,జైమిని సూత్రభాష్యమ్250-00
110 సంవత్సరాల -బుట్టే శతాబ్దిపంచాంగం 999-00
జైమిని జాతకచంద్రిక 210-00
జైమిని సూత్రభాష్యమ్ 200-00
జైమిని సూత్రార్థదీపిక 360-00
దశమభావం 360-00
సువర్చల ఆంజనేయజ్యోతిషం 300-00
జాతక విశ్లేషణ 275-00
జాతక పారిజాతం 360-00
జాతకఫల నారాయణీయం 99-00
లగ్ననాడి -దివాకరుని వెంకటసుబ్బారావు324-00
ఫలదీపిక-ఉపద్రష్ట కామేశ్వరరావు 300-00
ఫలదీపిక-మల్లాది మణి 600-00
పురోహితదర్శిని 200-00

| | |
|---|---|
| సర్వార్థచంద్రిక 1వభాగం | 351-00 |
| 2వ భాగం | 452-00 |
| 3వ భాగం | 240-00 |
| 4వ భాగం | 225-00 |
| సర్వార్థచింతామణి | 300-00 |
| స్వరచింతామణి | 200-00 |
| పూర్వకాలామృతం | 45-00 |
| ఉత్తర కాలామృతం | 45-00 |
| ప్రాచీనప్రశ్న చింతామణి | 108-00 |

## 5. వాస్తులు

| | |
|---|---|
| 40 రోజుల్లో "వాస్తువిద్య" నేర్చుకొనండి | 200-00 |
| వాస్తుశాస్త్ర రహస్యములు | 200-00 |
| వాస్తునుబట్టి మీ ఇల్లు | 63-00 |
| మీరూ మీ వాస్తు | 63-00 |
| గృహవాస్తు చిట్కాలు | 63-00 |
| వాస్తు పూజ | 63-00 |
| వాస్తు సూత్రములు | 63-00 |
| వాస్తుశాస్త్ర రహస్యాలు | 63-00 |
| గృహవాస్తు వర్గులు | 108-00 |
| విశ్వకర్మవాస్తు శాస్త్రరీత్యా మీ ఇంటి ప్లానులు | 63-00 |
| విశ్వకర్మ వాస్తుశాస్త్రరీత్యా మీఇండ్ల ఆయములు | 108-00 |
| విశ్వకర్మ వాస్తు శాస్త్రం (చిత్రాలగురుమూర్తిగుప్తా) | 200-00 |
| ఆధునిక గృహవాస్తు | 108-00 |
| శుభవాస్తు | 270-00 |
| వాస్తుయంత్ర రత్నావళి | 120-00 |
| వాస్తుశాస్త్రం | 120-00 |
| హౌస్ ప్లాన్లు | 63-00 |
| గృహనిర్మాణ వాస్తు | 63-00 |
| వాస్తు రెమెడీస్ | 63-00 |
| గృహవాస్తు దర్పణం | 63-00 |
| జ్యోతిష-గృహవాస్తుచంద్రిక | 200-00 |
| వాస్తురత్నాకరం (కొండపల్లి) | 63-00 |
| వాస్తుసంగ్రహమ్ ,, | 63-00 |
| పంచవాస్తు పారిజాతం ,, | 120-00 |
| వాస్తుడిండిమమ్ ,, | 63-00 |
| వాస్తుదుందిభి ,, | 120-00 |
| విశ్వకర్మవాస్తుప్రకాశిక (కేస్‌బైండ్) | 250-00 |
| కృష్ణవాస్తుశాస్త్రము | 63-00 |
| జలవాస్తు,శల్యవాస్తు (దంతూరిపండరీనాథ్) | 108-00 |
| మయవాస్తు (గోరసవీరభద్రాచార్య) | 144-00 |
| వాస్తు జ్యోతి | 63-00 |
| మన ఇల్లు-మనవాస్తు | 108-00 |
| వాస్తవ వాస్తుపూజావిధానము (బిగ్) | 108-00 |
| వాస్తు దర్పణం | 200-00 |
| వేంకటేశ్వర వాస్తుశాస్త్రం | 108-00 |
| దేవాలయ వాస్తు | 120-00 |
| శాస్త్రీయ గాయత్రి గృహవాస్తు | 600-00 |
| వాస్తునిధి | 108-00 |
| గృహవాస్తు శిరోమణి | 60-00 |
| కామేశ్వరవాస్తు సుధాకరం | 150-00 |
| నేమాని గృహవాస్తు | 300-00 |
| శ్రీరామకృష్ణ వాస్తుశాస్త్రం | 200-00 |
| వాస్తుభూమి | 150-00 |
| వాస్తునిధి | 105-00 |
| వాస్తుశాస్త్ర వాస్తవాలు(గాలితిరుపతిరెడ్డి) | 200-00 |

## 6. మంత్రశాస్త్రాలు

| | |
|---|---|
| మంత్రసాధన | 63-00 |
| తంత్రజాలం | 63-00 |
| మంత్రశక్తి | 63-00 |
| దత్తాత్రేయ తంత్రవిద్య | 63-00 |
| దత్తాత్రేయ మూలికాతంత్రమ్ | 63-00 |
| తాంత్రిక పంచాంగం | 63-00 |
| యక్షిణీ తంత్రం | 63-00 |
| మంత్రానుష్ఠాన చంద్రిక | 63-00 |
| సర్వదేవతా మంత్రకవచములు | 63-00 |
| మంత్రాక్షరాలరహస్యం (బీజాక్షరనిఘంటువు) | 63-00 |
| సర్వదేవతా మంత్రరత్నావళి | 63-00 |
| సదాచార దీపిక | 63-00 |
| యోగినీ-వామకేశ్వరతంత్రం | 63-00 |
| ప్రపంచసారతంత్రం | 63-00 |
| బదనిక తంత్రమ్ | 63-00 |

| | |
|---|---|
| ఉచ్ఛిష్ట గణపతి తంత్రమ్ | 63-00 |
| గుప్త సాధన తంత్రం | 63-00 |
| గంధర్వ తంత్రమ్ | 63-00 |
| సౌందర్యలహరి (మంత్రయంత్రరత్నావళి) | 63-00 |
| యంత్ర మంత్ర తంత్ర | 63-00 |
| పాశుపత తంత్రం | 108-00 |
| పంచదశ మహాఖడ్గ తంత్రం | 108-00 |
| రుద్రాష్టాధ్యాయః | 108-00 |
| మంత్రసిద్ధి | 120-00 |
| పరశురామతంత్రమ్ | 108-00 |
| శ్రీలలితావిలోమ పంచదశీ | 120-00 |
| శ్రీ గురు తంత్రం | 108-00 |
| గాయత్రీ తంత్రమ్ | 200-00 |
| మహాశక్తి మంత్ర తంత్ర రహస్యాలు | 200-00 |
| శ్రీ దుర్గ తంత్రమ్ | 250-00 |
| మహామృత్యుంజయ అమృతపాశుపతమ్ | 300-00 |
| సర్ప (నాగ)తంత్రం | 360-00 |
| హవన తంత్రం | 250-00 |
| షోడశనిత్యతంత్రం | 250-00 |
| శాక్తేయతంత్రం | 250-00 |
| రుద్రయామళతంత్రం | 250-00 |
| లక్ష్మీప్రత్యంగిరా తంత్రమ్ | 360-00 |
| హిరణ్యశూలినీ తంత్రమ్ | 250-00 |
| మాయాప్రత్యంగిరా తంత్రమ్ | 250-00 |
| శ్రీ విశ్వరూప ప్రత్యంగిరా తంత్రమ్ | 250-00 |
| స్వర్ణాకర్షణభైరవతంత్రం | 250-00 |
| కాశీవిశాలాక్షి తంత్రం | 250-00 |
| శాంతితంత్రమ్ | 250-00 |
| యంత్రసిద్ధి | 450-00 |
| శ్రీ లక్ష్మీ తంత్రమ్ | 450-00 |
| మంత్రమహోదధి (స్త్రీదేవతాఃకల్పమ్) | 450-00 |
| మంత్రమహోదధి (పురుషదేవతాఃకల్పమ్) | 450-00 |
| మంత్రశాస్త్రం (గ్రంథము) | 450-00 |
| ప్రత్యంగిరాకృత్యాతంత్రం | 450-00 |
| కామధేనువు తంత్రం | 360-00 |
| శూలినీదుర్గాతంత్రం | 360-00 |
| శ్రీవిద్య రహస్యం | 300-00 |
| కులార్ణవ తంత్రమ్ | 180-00 |
| ఆచార్య సిద్ధ నాగార్జునతంత్రం (ఒరిజనల్) | 390-00 |
| సిద్ధమూలిక రహస్యం (మంత్ర,యంత్రసహితం) | 63-00 |
| ఆమ్నాయమందారం (మంత్రసాధనలు) | 108-00 |
| దశమహావిద్యా పూజా సర్వస్వం | 360-00 |
| గౌళికాంజలి తంత్రం | 63-00 |
| రహస్య దత్తాత్రేయ తంత్రం | 63-00 |
| వారాహి తంత్రం | 200-00 |
| కులార్ణవ తంత్రం | 300-00 |
| జ్ఞానార్ణవ తంత్రం | 400-00 |
| శాబర తంత్రం | 50-00 |
| శ్రీకార్తవీర్యార్జున తంత్రం | 90-00 |
| బృహత్‌యంత్ర రత్నాకరం | 400-00 |
| మంత్రసింధు-1వభాగం | 360-00 |
| మంత్రసింధు-2వభాగం | 360-00 |
| 777 మంత్రాలు,తంత్రాలు | 150-00 |
| శారదతిలక తంత్రం | 450-00 |
| శ్రీ భైరవ తంత్రం | 450-00 |
| మంత్రరత్నాకరం | 360-00 |
| అనుభవ యంత్రమంత్ర శిరోమణి | 60-00 |
| అనుభవ యంత్రమంత్ర చింతామణి | 60-00 |
| తాంత్రిక ప్రపంచం | 865-00 |
| తాంత్రిక నిధి | 665-00 |
| తాంత్రిక మర్మాలు | 665-00 |
| తాంత్రిక రహస్యాలు | 665-00 |
| మంత్రమాల | 365-00 |

## 7. గ్రంథాలు - ఆరాధనలు

| | |
|---|---|
| భగవద్గీత శ్లోక తాత్పర్య సహితం | 63-00 |
| భగవద్గీత (వచనం) | 108-00 |
| భగవద్గీత శ్లోకతాత్పర్యం-కేసుబైండింగ్ | 75-00 |
| గణేశ ఆరాధన 1 | 108-00 |

| | |
|---|---|
| గణేశోపాసన 2 | 108-00 |
| నవగ్రహవైభవం | 108-00 |
| నవగ్రహ రెమెడీస్ | 108-00 |
| నవగ్రహ వేదం | 108-00 |
| శనిగ్రహారాధన | 108-00 |
| ఆదిత్యారాధన | 108-00 |
| సుబ్రహ్మణ్యారాధన | 108-00 |
| శ్రీ శివ ఆరాధన | 108-00 |
| లక్ష్మిఆరాధన | 108-00 |
| హనుమదారాధన | 108-00 |
| లలితారాధన | 108-00 |
| శ్రీ చక్రారాధన | 108-00 |
| గాయత్రీ ఆరాధన | 108-00 |
| వీరభద్రారాధన | 108-00 |
| కుజగ్రహారాధన | 108-00 |
| భైరవారాధన | 108-00 |
| దైవారాధన | 108-00 |
| గీతారాధన (భగవద్గీత శ్లోక తాత్పర్యసహిత) | 108-00 |
| శ్రీవేంకటేశ్వరాధన | 108-00 |
| హయగ్రీవారాధన | 108-00 |
| లక్ష్మీనరసింహారాధన | 108-00 |
| శ్రీ బాలాత్రిపురసుందరీస్తోత్రకదంబం | 108-00 |
| దేవీ లీలామృతం | 108-00 |
| పురాణపండ సుందరకాండ వచనం | 108-00 |
| పురాణపండ రామాయణం | 108-00 |
| పురాణపండ భారతం | 108-00 |
| పురాణపండ భాగవతం | 108-00 |
| వాల్మీకి రామాయణం (సూరి) | 108-00 |
| కాలసర్ప యోగం | 108-00 |
| నిత్య జీవితములో రుద్రాక్షలు | 108-00 |
| నిత్య జీవితములో నవరత్నాలు | 108-00 |
| వేదసూక్తములు | 108-00 |
| వేమన పద్యసారామృతం | 108-00 |
| పండగలు పర్వదినాలు | 108-00 |
| సూక్తిరత్నాలు | 108-00 |
| హనుమచ్చరిత్ర | 108-00 |
| నవగ్రహ దర్శనమ్ | 108-00 |

| | |
|---|---|
| నిత్యజీవితంలో నవగ్రహాలు | 108-00 |
| సాలగ్రామములు | 108-00 |
| గురుశుక్ర ప్రభావము చంద్రకళానాడీ | 108-00 |
| శనిగ్రహరెమిడీస్ | 108-00 |
| జాతకసుధాసారము -జాతకమోక్షప్రదాయిని | 108-00 |
| వివాహజ్యోతిషమంజరి -మ్యారేజ్‌మ్యాచింగ్‌గైడ్ (సాయిగణపతిరెడ్డి) | 108-00 |
| మీపుట్టినతేదీనిబట్టి మీజీవితరహస్యాలు (న్యూమరాలజీ లైఫ్‌గైడ్) ,, | 108-00 |
| మీఅదృష్టానికి (పేరు) నేమ్‌కరక్షన్ ,, | 108-00 |
| న్యూమరాలజీ రెమిడీస్ | 108-00 |
| పుట్టినతేదీ బట్టి మీఅదృష్ట -ఉద్యోగ, వృత్తి వ్యాపారాభివృద్ధి | 200-00 |
| మూకపంచశతీ | 108-00 |
| శ్రీరామకర్ణామృతం | 108-00 |
| ఉపాసన విధానం | 108-00 |
| దేవుళ్ళు డాట్ కామ్ | 108-00 |
| గణపతిభాష్యం | 108-00 |
| యజుర్వేద ఉపనయన వివాహ ప్రయోగమంజరి | 108-00 |
| నవయోగులు | 108-00 |
| ఆంధ్రప్రదేశ్‌లోనిదర్శించవలసిన ప్రముఖదర్గాలు | 108-00 |
| సకలదేవతాఅష్టోత్తరాలు(పెద్దది)- (180అష్టోత్తరశతనామావళులతో) | 108-00 |
| సకలదేవతా అష్టోత్తరశతనామావళులు (కేస్‌బైండింగ్) | 216-00 |
| సకలదేవతా సహస్రనామ స్తోత్రాలు (15 దేవీదేవతలు) | 108-00 |
| సకలదేవతా సహస్రనామావళులు (20 దేవీదేవతలు) | 108-00 |
| ఆధ్యాత్మిక సూక్తి నిధి | 108-00 |
| బ్రాహ్మణులు గోత్రాలు,ప్రవరలు | 108-00 |
| సర్వదేవతాస్వరూపుడు | |

| | |
|---|---|
| -శ్రీ వేంకటేశ్వరుడు | 108-00 |
| శ్రీ లక్ష్మీసన్నిధి | 108-00 |
| మార్షల్ఆర్ట్స | |
| (కరాటే,కుంగ్‌ఫూనేర్చుకోండి) | 108-00 |
| మ్యాజిక్‌గైడ్ | 108-00 |
| చదరంగం | 108-00 |
| పంచముఖ హనుమత్ వైభవం | 63-00 |
| గరుడపురాణం | 54-00 |
| మాఘపురాణం | 36-00 |
| శివపురాణం | 36-00 |
| వైశాఖపురాణం | 36-00 |
| కార్తీక పురాణం | 36-00 |
| కార్తీక పురాణం (చిన్నది) | 36-00 |
| సర్వకార్యసిద్ధికి రామాయణపారాయణ | 81-00 |
| పెద్దబాలశిక్ష | 50-00 |
| వృక్షదేవతలు | 63-00 |
| యాజుష స్మార్త సంస్కార చంద్రిక | 200-00 |
| సనాతనవైదిక | |
| -బ్రాహ్మణస్మార్తాగమకల్పమ్ | 180-00 |
| చతుర్వేదములు | 144-00 |
| నవగ్రహారాధన | 180-00 |
| తాళపత్ర సమాహార గోపురం | 216-00 |
| మనుధర్మ శాస్త్రం (వచనంలో...) | |
| (కేస్‌బైండు) | 250-00 |
| మానవధర్మములు | 144-00 |
| వేదమంత్ర సంహిత | 144-00 |
| సహస్రలింగార్చన | 144-00 |
| శ్రీ శివగీత | 144-00 |
| ద్వాదశఉపనిషత్తులు | 144-00 |
| పురాణపండవారి సౌందర్యలహరి | |
| (కేస్‌బైండ్) | 250-00 |
| (శ్లోకతాత్పర్యసహిత విపులవ్యాఖ్యతో) | |
| బృహత్ శివ స్తోత్ర రత్నాకరము | 200-00 |
| బృహత్ దేవీ స్తోత్రరత్నాకరము | 200-00 |
| దక్షిణావృత శంఖములు | 63-00 |
| 108 దివ్యదేశాల విష్ణుక్షేత్రదర్శని | 40-00 |
| ధర్మసింధువు(కేస్‌బైండింగ్) | 270-00 |
| భారతీయ శైవక్షేత్రయాత్రాదర్శిని | 108-00 |
| భగవత్‌స్తుతి | ....... |
| సూర్యోపాసన | 40-00 |
| కాశీఖండం | 360-00 |
| దేవీభాగవతం | 360-00 |
| శ్రీ ఆంజనేయం | 216-00 |
| ధర్మసందేహాలు | 216-00 |
| ఆధ్యాత్మిక దైవిక వస్తువులు | 250-00 |
| రామాయణం | 600-00 |
| పోతన భాగవతం | 900-00 |
| శివమంత్రములు | 63-00 |
| స్వరజ్ఞానము | 63-00 |
| గరుడపురాణం (బిగ్) | 120-00 |
| శ్రీదేవీశరన్నవరాత్రి వ్రతకల్పం | 108-00 |
| సౌందర్యలహరి (భాష్యం) (నోరి) | 300-00 |
| గరుడపురాణం (నోరి) | 120-00 |
| వేంకటేశ్వర విశ్వరూపం | 108-00 |
| దేవీభాగవతం | 108-00 |
| కల్యాణోత్సవ గోత్రప్రవరలు | 200-00 |
| మీపుట్టిన పిల్లలకు అదృష్టనేమ్స్ | 108-00 |

## 8. వైద్య గ్రంథాలు

| | |
|---|---|
| ఆహారం ఆరోగ్యం | 40-00 |
| మూలికావైద్య చిట్కాలు | 40-00 |
| ఆయుర్వేద వైద్య చిట్కాలు | 30-00 |
| గృహవైద్య రహస్యాలు | 40-00 |
| గృహవైద్యసారం | 40-00 |
| హోమియోవైద్యం (ద్వాదశలవణచికిత్స) | 63-00 |
| ప్రకృతివైద్యం | 40-00 |
| ఆహారం-వైద్యం | 108-00 |
| సంపూర్ణ ఆయుర్వేద-చిట్కా వైద్యం | 108-00 |
| ఆయుర్వేదమ్ | 40-00 |
| ఆయుర్వేద మూలికావైద్యదీపిక | 108-00 |
| దుంపకూరలు, ఆకుకూరలు, కాయగూరలు | |
| (వాడకం - ఉపయోగాలు) | 108-00 |
| ఏకమూలికావైద్యం | 108-00 |
| అష్టాంగ హృదయం (4భాగాలు) | 1200-00 |
| రహస్యసిద్ధయోగవైద్యసారమ్ | 108-00 |
| ప్రాథమిక హోమియోవైద్యం | 108-00 |
| ఒబెసిటి | 108-00 |

| | |
|---|---|
| హెల్త్‌గైడ్ | 108-00 |
| ఆయుర్వేదం-జీవనవేదం | 108-00 |
| ఫుడ్‌థెరపి | 63-00 |
| న్యాచురల్‌థెరపి | 108-00 |
| సంపూర్ణఆరోగ్యానికి 20ని॥ | 63-00 |
| కీళ్ళనొప్పులు మీ సమస్యలైతే... | 108-00 |
| యోగామంత్ర | 63-00 |
| యోగా మండే టు సండే | 63-00 |
| హెర్బల్ మెడిసిన్-హెల్త్‌టుడే | 108-00 |
| హెల్త్‌ఫైల్ | 120-00 |
| వస్తుగుణపాఠం | 250-00 |
| రసాయన వాజీకరణ తంత్రం | 180-00 |
| వస్తుగుణ మకరందం | 400-00 |
| నాటువైద్యం -(కేస్‌బైండ్) (రామ్‌జీ) | 360-00 |
| నాటువైద్యం (చిన్నది) | 108-00 |
| బామ్మవైద్యం | 120-00 |
| ప్రాణాయామము-యోగ | 63-00 |
| అనుపానవైద్య సర్వస్వం (రామ్‌జీ) | 540-00 |
| రహస్యకుక్కుట శాస్త్రం (రామ్‌జీ) | 300-00 |
| హోమియోవైద్య సర్వస్వం | 666-00 |
| నాటువైద్యం చిన్నది | 45-00 |
| కుక్కుట శాస్త్రం చిన్నది | 36-00 |
| రసరత్నాకరం | 450-00 |
| వస్తుగుణప్రకాశిక | 750-00 |
| ఆయుర్వేదమూలిక ప్రయోగవళి | ..... |
| చరక సంహిత | 750-00 |
| బసవరాజీయం | 720-00 |
| భావప్రకాశసంహిత | 750-00 |
| వస్తుగుణదీపిక | 720-00 |
| చిరుధాన్యాలు-ఆరోగ్యం-రామ్‌జీ | 54-00 |
| సిరిధాన్యాలలో సంపూర్ణఆరోగ్యం -డా. ఖాదర్‌వలీ | 100-00 |

## 9. అయ్యప్ప - భవానీ రకాలు

| | |
|---|---|
| శ్రీ అయ్యప్ప లీలామృతం | 36-00 |
| శ్రీ అయ్యప్ప భజనపాటలు | 144-00 |
| శ్రీ అయ్యప్ప పూజాకల్పం | 30-00 |
| శ్రీ అయ్యప్ప భక్తి గీతాలు | 30-00 |
| హారతిగైకొనుమా | 45-00 |
| శ్రీ అయ్యప్ప దీక్ష F | 12-00 |
| శ్రీ అయ్యప్ప భజనమాల F | 12-00 |
| శ్రీ అయ్యప్ప నిత్యపూజ P | 12-00 |
| శ్రీ అయ్యప్ప నిత్యనియమావళి P | 10-00 |
| భవానీదీక్ష (శ్రీ భవానీ లీలామృతం) | 36-00 |
| దేవీలీలామృతం | 108-00 |
| శ్రీ దేవీ పూజాకల్పం | 30-00 |
| దేవీ భక్తిగీతాలు | 30-00 |
| భవానీదీక్ష P | 10-00 |
| దేవీ భక్తిమాల F | 12-00 |
| శ్రీ అయ్యప్ప భజనావళి | 144-00 |
| అయ్యప్పపూజావిధి (జేసుదాసుసాంగ్స్‌తో) | 45-00 |

## 10. భజనలు - కీర్తనలు

| | |
|---|---|
| అన్నమయ్య సంకీర్తనానిధి (1000కీర్తనలు) | 270-00 |
| అన్నమయ్య కీర్తనలు | 30-00 |
| శ్రీరామదాసు కీర్తనలు | 30-00 |
| సర్వదేవతా మంగళహారతులు | 25-00 |
| వసుంధర మంగళ హారతులు | 36-00 |
| సౌభాగ్య దేవతా మంగళహారతులు | 40-00 |
| సర్వదేవతా భజనలు | 40-00 |
| చిట్టి పొట్టి పాటలు | 12-00 |
| జాతీయ గీతాలు | 12-00 |
| దేశభక్తి గీతాలు | 40-00 |
| పండుగలు-పుణ్యక్షేత్రాలు భక్తిగీతాలు | 40-00 |
| గొబ్బిళ్ళపాటలు,లాలిపాటలు, కోలాటపాటలు | 40-00 |
| అన్నమయ్య సంకీర్తనలు | 108-00 |
| పెళ్ళిపాటలు-స్త్రీలపాటలు | 40-00 |
| భక్తానంద భజనకీర్తనలు(ఓల్డ్‌సినీస్టైల్) | 40-00 |
| సర్వదేవతాభక్తిమణిమాల | 40-00 |
| బతుకమ్మ ఉయ్యాల పాటలు | 40-00 |

## 11. హిట్స్ సాంగ్స్

| | |
|---|---|
| ఘంటసాల భక్తిగీతాలు-భగవద్గీత | 40-00 |
| ఎస్.పి.బాలు భక్తిగీతాలు | 40-00 |

| | |
|---|---|
| సుశీలభక్తిగీతాలు | 40-00 |
| ఘంటసాల సుమధురగీతాలు | 108-00 |
| పి. సుశీల సుమధురగీతాలు | 108-00 |
| ఎస్.పి. బాలు సుమధురగీతాలు | 108-00 |
| ఎస్.జానకి సుమధురగీతాలు | 108-00 |
| వేటూరి సుందరరామమూర్తిహిట్స్ | 108-00 |
| సర్వదేవతా సినీభక్తిగీతాలు | 108-00 |
| జేసుదాసు అయ్యప్పపూజావిధానం | 45-00 |
| సర్వదేవత భజనకీర్తనలు | 40-00 |

## 12. స్త్రీలకు ఉపయుక్త పుస్తకములు

| | |
|---|---|
| శ్రీకాంతామణి వంటలు (వెజ్) | 63-00 |
| శ్రీకాంతామణి వంటలు (నాన్‌వెజ్) | 63-00 |
| శాకాహార వంటలు | 30-00 |
| మాంసాహారవంటలు | 30-00 |
| చిట్టిచిట్కాలు | 30-00 |
| అందానికి చిట్కాలు | 30-00 |
| పిల్లల పేర్లు (పెద్దది) | 30-00 |
| పిల్లల పేర్లు (చిన్నది) | 10-00 |
| లేటెస్ట్ ఎంబ్రాయిడరీ శారీబోర్డర్స్ | 40-00 |
| లేటెస్ట్ ఎంబ్రాయిడరీ డిజైన్స్ | 40-00 |
| చిన్నారులకు చిరుతిళ్ళ | 30-00 |
| పసందైన ఫాస్ట్‌ఫుడ్ వంటలు | 30-00 |
| పలావ్‌లు, ఫ్రైడ్ రైస్‌లు, వెరైటీరైస్‌లు | 30-00 |
| వేపుళ్ళ-ఇగుర్లు | 30-00 |
| బ్రేక్‌ఫాస్ట్ వంటలు | 30-00 |
| పండుగలలో చేసుకొనే పిండివంటలు | 30-00 |
| మైక్రోవేవ్ వంటలు | 108-00 |
| సర్వదేవతాభక్తిమాల | 40-00 |
| పిల్లలపేర్లు (బాబు) | 40-00 |
| పిల్లలపేర్లు (పాప) | 40-00 |
| మోడ్రన్ మెహందీ (గోరింటాకు డిజైన్స్) | 40-00 |
| మోడ్రన్ పిల్లలపేర్లు | 108-00 |
| నోరూరించే నాన్‌వెజ్‌వంటలు | 108-00 |

## వివిధ రకాలు

| | |
|---|---|
| ఎందరోమహానుభావులు | 250-00 |
| యోగాసనాలు | 40-00 |
| సూర్యనమస్కారములు | 40-00 |
| పొడుపు కథలు (చిన్నవి) | 10-00 |
| హిందీ-తెలుగు-స్వబోధిని | 30-00 |
| ఇంగ్లీషు-తెలుగు-స్వబోధిని | 30-00 |
| బుల్లి బాలశిక్ష | 20-00 |
| జనరల్ నాలెడ్జ్ | 30-00 |
| నూరు ఎక్కాలు | 15-00 |
| 1-100 టేబుల్ బుక్ | 12-00 |
| 1-100 టేబుల్‌బుక్ (క్రౌన్‌సైజు) | 12-00 |
| శ్రీరామకోటి | 25-00 |
| శ్రీశివకోటి | 25-00 |
| శ్రీ సాయికోటి | 25-00 |
| మేజిక్ | 30-00 |
| అంకెలతో గారడీ | 30-00 |
| హృదయస్పందన (కవితలు) | 30-00 |
| వాత్స్యయన కామసూత్రాలు | 40-00 |
| ఎ.పి.టూరిస్ట్ గైడు | 40-00 |
| ఇంద్రజాల రహస్యాలు | 30-00 |
| మహేంద్రజాల రహస్యాలు | 30-00 |
| శరీరభాష (బాడీ లాంగ్వేజ్) | 108-00 |
| క్రియాయోగం | 40-00 |
| ఆనందంగా జీవిద్దాం | 108-00 |
| హరిశ్చంద్ర నాటకం | 50-00 |
| వాత్సాయనకామసూత్రాలు | 108-00 |
| పంచసాయకం | 108-00 |
| రతిరహస్యాలు | 108-00 |
| అనంగరంగం (కంభంపాటి స్వయంప్రకాష్) | 108-00 |
| శృంగారకేళి (కంభంపాటి స్వయంప్రకాష్) | 108-00 |
| గాయత్రీవిజ్ఞాన్ | 108-00 |
| సత్యహరిశ్చంద్రీయము | ....... |
| చింతామణి (నాటకం) | 50-00 |
| బాలనాగమ్మ | 50-00 |
| కాళహస్తి స్త్రీల వ్రతకథలు | 36-00 |
| కాళహస్తి గోవింద నామాల భగవద్గీత | 40-00 |
| కాళహస్తి గృహవాస్తు చింతామణి | 108-00 |
| కాళహస్తి గృహవాస్తు మర్మాలు (బైండు) | 63-00 |
| ఎం.ఎస్.ఆర్.హనుమాన్‌చాలీసా | 12-00 |

| | |
|---|---|
| ఎం.ఎస్.ఆర్.సుందరకాండ | 90-00 |
| బ్రహ్మంగారిజీవితచరిత్ర (జవంగుల) | 120-00 |
| శ్రీ ఆదిశంకరాచార్య దివ్యచరితామృతం | 40-00 |
| కాశీరామేశ్వర మజిలీ కథలు | 63-00 |
| పురోహిత దర్శని (గోరసవీరభద్రాచార్య) | 200-00 |
| మీరే న్యూమరాలజిస్ట్ (దావూద్) | 390-00 |

## ఇతర రకాలు

| | |
|---|---|
| కాళీ అర్ధ్యధాటీ | 100-00 |
| విశ్వబ్రాహ్మణవేదోక్తి విధిః | |
| వివాహ మనుసూత్ర ప్రయోగం | 199-00 |
| హిమాలయ యోగాలు-మోక్షసాధనలు | 200-00 |
| హిమాలయ యోగులతో -క్రియాయోగి అనుభవాలు | 300-00 |
| వాణిజ్య కల్పవృక్షము | 300-00 |
| ప్రార్థన తరంగిణి | 250-00 |
| ఒక యోగి ఆత్మకథ | 175-00 |
| పూర్వగాధలహరి | 295-00 |

## రామాయణం-భారత-భాగవతములు పురాణములు-కథలు

| | |
|---|---|
| రామాయణం | 250-00 |
| మహాభారతం | 425-00 |
| మహాభాగవతం | 360-00 |
| సుందరకాండ కేస్‌బైండ్ -( ఎస్‌టిపివి. కొనప్పాచార్యులు) | 300-00 |
| సుందరకాండ-కొంపెల్ల | ..... |
| కాశీమజిలీ కథలు (12భాగాలసెట్టు) | 950-00 |
| భట్టి విక్రమార్క కథలు-బైండ్ | 150-00 |
| అపూర్వచింతామణి | 150-00 |
| తెనాలి రామకృష్ణ నూతనవ్యాసకథలు | 150-00 |
| మర్యాదరామన్నతీర్పుకథలు | 150-00 |
| అక్బర్ బీర్బల్ కథలు | 150-00 |
| బొమ్మల రామాయణం | 60-00 |
| బొమ్మల భారతం | 60-00 |
| బొమ్మల భాగవతం | 60-00 |
| పంచతంత్రం | 60-00 |
| గరుడ పురాణం | 600-00 |
| అగ్నిపురాణం | 500-00 |
| భవిష్యపురాణం | 450-00 |
| బ్రహ్మపురాణం | 300-00 |
| బ్రహ్మవైవర్త మహాపురాణం | 750-00 |
| బ్రహ్మాండ పురాణం | 300-00 |
| కూర్మ పురాణం | 225-00 |
| లింగపురాణం | 500-00 |
| మార్కేండేయపురాణం | 300-00 |
| మత్స్యపురాణం | 500-00 |
| నారదపురాణం | 500-00 |
| పద్మపురాణం-సృష్టిఖండం | 500-00 |
| పద్మపురాణం భమిఖండం | 500-00 |
| స్కాందపురాణం-1 | 700-00 |
| స్కాందపురాణం-2 | 900-00 |
| వామనపురాణం | 225-00 |
| వరాహపురాణం | 400-00 |
| వాయుపురాణం | 500-00 |
| విష్ణుపురాణం | 250-00 |
| శివపురాణం | 400-00 |

## స్మార్త గ్రంథములు

| | |
|---|---|
| ప్రతిష్ఠకల్పః-సాగిననరసింహమూర్తి | 700-00 |
| శాంతికమలకర | 600-00 |
| సంస్కారచింతామణి (1,2,3,4,5 ఒక్కొక్కటి) | 320-00 |
| శ్రీవిద్యాఉపాసనకల్పధ్రువమ్ | 280-00 |
| నిర్ణయసింధు 1,2,3,భాగములుసెట్ | 640-00 |
| మూర్తి వేంకట్రామశర్మ | |
| యాజుష స్మార్తగ్రంథం1వభాగం | 100-00 |
| యాజుష స్మార్త గ్రంథం2వభాగం | 200-00 |
| సంస్కార మహోదధి | 200-00 |
| ఆబ్దిక సర్వస్వం | 250-00 |
| యాజుషస్మార్తగ్రంథం5వభాగం | 250-00 |
| శ్రీప్రతిష్ఠకల్ప ధ్రువమ్ | 280-00 |
| సూర్యనమస్కార కల్పః | 160-00 |
| పంచకాటకాలు | 120-00 |
| లక్షవర్తి | 260-00 |
| ఆర్షవివాహవైఖరి | 40-00 |
| రుద్రార్చన కల్పధ్రువమ్ | 280-00 |

అపరప్రయోగః 700-00
ఆపస్తంబీయ పంచదశ
దర్శనానుక్రమణిక
భాగవతులశేషావధునులు 650-00
సశాస్త్రీయ రుద్రాభిషేక విధి
- కంచి వీరభద్రశర్మ 300-00

**సుమారు 100 సం॥రాలునాటి ప్రాచీన ప్రతులు తిరిగి ఈ క్రింది గ్రంథములు ప్రచురించబడినవి.**

శ్రీరామ మంత్రానుష్ఠానము ..........
శ్రీరామనవరాత్రోత్సవకల్పః 300-00
శ్రాద్ధము ఎందుకు పెట్టాలి ?
-షోడశ సంస్కారములు 200-00
స్మార్త కాపర్ది కారికలు 200-00
నపుంసక సంజీవనము,
వైద్య శిరోమణి 200-00
విషవైద్య చింతామణి 200-00
హేమాద్రి సూరిణా ప్రాయశ్చిత్తాధ్యాయః 3 0 0 -
00
సర్వమూలికా గుణరత్నాకరం 300-00
ఆపస్థంబీయ ధర్మసూత్రాలు 300-00
సర్వశాంతి దర్పణం
- అపర ప్రయోగ దర్పణం 200-00
గణకరంజని 200-00
సంతాన దీపిక 200-00
తిథినిర్ణయ కాణ్డః 250-00
ముహూర్త దర్పణం 200-00
జ్యోతిష శాస్త్ర రత్నము
(శ్రీపతిజాతక పద్ధతి) 250-00
లఘుతాచకము 200-00
శ్రీ వైఖనస పైతృమేదిక ప్రయోగః 300-00
స్మృతి రత్నాకరము (ధర్మశాస్త్రం) 400-00
జాతకామృతతసారం 300-00
జాతక బోధిని 300-00
సంగీత విద్యాదర్పణం 300-00
సంగీత సర్వార్థసారసంగ్రహం 300-00
ముహూర్త మార్తాండం
(టీకతాత్పర్యం) 450-00
జాతకరహస్యం 200-00
రాజమార్తాండం 200-00
ఆయుర్దాయదీపిక 200-00
వైద్యామృతం 200-00
అనుపానమంజరీ 200-00
నవగ్రహశాంతి విధానం
-ఉదకశాంతి విధిః 200-00
చికిత్సరత్నము 200-00
స్వరచింతామణి 200-00
ద్వాదశలోహ భస్మవిధానం 200-00
దైవజ్ఞయశో విభూషణం 200-00
అనుపాన రత్నకరము 200-00
కాలామృతము 250-00
దైవజ్ఞకర్ణామృతము 300-00
రసేంద్ర చింతామణి 300-00
రసరత్న సముచ్చయం 300-00
వస్తుగుణరత్నాకరము 300-00
హోరానుభవదర్పణము 360-00
విశ్వకర్మ ప్రకాశిక వాస్తుశాస్త్రము 250-00
స్త్రీజన కల్పవల్లి 450-00
సంగీత సర్వార్థ సంగ్రహం 300-00
సంగీత సుధాసంగ్రహము 250-00
అర్క ప్రకాశము 200-00
సంగీత మార్తాండము 200-00
సంగీత ప్రథమబోధిని 200-00
వైద్యకల్పతరువు 200-00
రసప్రదీపిక 250-00
గణకానందము 250-00
శ్రీ లలితాసహస్రనామావళిః
-వివరణాత్మక భావంతో 200-00
నవచండీ వేదోక్త శ్రీ దేవీ పూజాకల్పం200-00
శ్రీ గాయత్రీ అనుష్ఠాన తత్త్వప్రకాశిక 360-00
సంగీతమార్తాండము 250-00
సారావళి 360-00
భేషజకల్పము 200-00
గురుశిష్యఆయుర్వేద
వైద్యచింతామణి 360-00

| | |
|---|---|
| జాతకమణి | 200-00 |
| సర్వశకున ప్రకాశిక | 200-00 |
| యాజుష ప్రయోగ చంద్రిక | 250-00 |
| శిక్షావల్లీ-ఆనందవల్లీ-భృగువల్లీ | 300-00 |
| వసంతరాజ శకునము | 250-00 |
| తొట్టి వైద్యం | 450-00 |
| జ్యోతిష సిద్ధాంత సంగ్రహము (పంచాంగ గణితం) | 300-00 |
| సహస్ర యోగప్రకాశిక | 300-00 |
| శ్రీవిద్యారహస్యం | 300-00 |
| వేంకట సోమయాజీయం అను ధర్మశాస్త్రకాండము | 250-00 |
| లక్ష్మీపతి సోమయాజీయం | 250-00 |
| యాజ్ఞవల్క స్మృతి | 540-00 |
| శ్రీఆంజనేయం | 216-00 |
| రాశితుల్యవత్సర ఫలితం | 200-00 |
| నాడి జ్యోతిష విశ్లేషణ | 400-00 |
| స్త్రీ ధర్మరత్న బాండాగారము | 200-00 |
| శైవోత్సవరత్నాకరం | 300-00 |
| యాజుషప్రయోగ చిన్తామణి | 300-00 |
| సుస్వర ఋగ్వేద ప్రయోగదర్శిని | 300-00 |
| ఆయుర్వేద వైద్య సంగ్రహం | 300-00 |
| వశిష్ఠ సంహిత | 450-00 |
| హోమియోపతి గృహవైద్యం | 200-00 |
| వ్రతచూడామణి | 300-00 |
| వైశ్యధర్మప్రకాశిక | 300-00 |
| ఆలయ నిత్యార్చన పద్ధతి | 200-00 |
| స్మృతిముక్తాఫలం | 300-00 |
| ఆపస్థంబయల్లాజీయమ్ | 300-00 |
| జ్యోతిషశాస్త్రసంగ్రహము | 200-00 |
| కర్మవిపాకాఖ్యయం | 360-00 |
| ముహుర్త రత్నావళి | 250-00 |
| సుదివిలోచనం | 300-00 |
| ఉత్తర కాలామృతం | 200-00 |
| సర్వవిషయ సర్వస్వసంగ్రహం | 200-00 |

## లలితాబుక్ డిపో వారి రకములు

| | |
|---|---|
| భగవద్గీత | 150-00 |
| శ్రీ లక్ష్మీనిధి (మైథలీ) | 216-00 |
| శివపురాణం | 261-00 |
| దేవిభాగవతం | 261-00 |
| కల్పవృక్షం | 216-00 |
| మహార్దశ | 216-00 |
| అష్టలక్ష్మీ సిద్ధి | 216-00 |
| మనఆచారాలలోని ధర్మసందేహాలకు- శాస్త్రీయసమాధానాలు | 50-00 |

## సిద్ధేశ్వర వారి రకములు

| | |
|---|---|
| సిద్ధనాగర్జున తంత్రం | 390-00 |
| సర్వయంత్ర భారతి | 201-00 |
| మంత్ర మహాజలధి | 201-00 |
| సకలదేవతా వశంకరీ-శ్రీమళయాళ భగవతి మహామంత్ర రహస్యాలు | 100-00 |
| వివాహ కల్పము | 40-00 |
| అష్టముఖ భేరుండ (పద్మవతి) | 150-00 |
| సిద్ధనాగార్జున తంత్రమ్ (పద్మవతి) | 175-00 |

## టాగూర్ పబ్లిషింగ్ హౌస్ - అన్ని రకములు లభించును.

| | |
|---|---|
| సౌందర్యలహరి | 330-00 |
| శివానందలహరి | 180-00 |
| మహాన్యసపూర్వక రుద్రాభిషేకవిధ్ధి | 100-00 |
| శ్రీదేవీ సప్తశతీ | 125-00 |
| చండీ సప్తశతీ | 45-00 |
| కార్తవీర్యార్జున తంత్రం | 72-00 |
| రెమెడిస్ 1,2,3, (శివల సుబ్రమణ్యం) | 150+200+200 |
| మంత్రసింధు 1,2 | 360+360-00 |
| శ్రీ దుర్గా సప్తశతీ (చండీ) - హెూమ విధానము | 400-00 |
| దేవి భాగవతం | 360-00 |
| సాయిదివ్య పూజ | 8-00 |
| వేదోక్త విధి వివాహదీపిక (ఉదయశ్రీ) | 199-00 |
| శ్రీ చండీ పూజ హెూమవిధానము | 249-00 |
| విష్ణు సేవా నందగిరి స్వామి (ఉదయశ్రీ) | |

## నేమాని వారి రకములు

| | |
|---|---|
| అనుభవ హస్తరేఖా సాముద్రికం | 360-00 |
| గృహవస్తు | 300-00 |
| ఉపాసనా పారిజాతం | 300-00 |
| నక్షత్రములు 27 ఒక్కొక్కపుస్తకం | 45-00 |
| అనుభవ హస్తరేఖ సాముద్రికం | 360-00 |
| నేమాని గృహవాస్తు | 300-00 |
| ముహుర్త సరస్వతీ | |
| సంఖ్యాశాస్త్రం | |
| జాతక మర్మబోధిని | |
| జాతక సరస్వతీ | |
| ఆచార్య సిద్ధనాగార్జునతంత్రం | 390-00 |
| మళయాళ భాగవతి | 100-00 |
| దేవీభాగవతం (బేతవోలు) | 480-00 |
| చాగంటి శ్రీమద్రామాయణం | 750-00 |
| చాగంటి భాగవతం | 500-00 |
| చాగంటి శివపురాణం | 500-00 |
| లలితాభాష్యం | 699-00 |
| శివవిష్ణు నిధి | 216-00 |
| శ్రీ భగవద్గీత | 150-00 |
| వేదోక్త వివాహదీపిక | 200-00 |
| గానకళాబోధిని | 1000-00 |
| దేవీభాగవతం | 360-00 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 360-00 |
| శ్రీదేవి సప్తశతి | 140-00 |
| సౌందర్యలహరి | 360-00 |
| శివానందలహరి | 170-00 |
| మహన్యాసపూర్వక రుద్రాభిషేకం | 125-00 |
| విష్ణుపురాణం | 150-00 |
| శివపురాణం | 150-00 |
| గుప్తా వైద్య ప్రకాశిక | 350-00 |
| గుప్తామంత్ర యంత్ర తంత్రం | 390-00 |
| నక్షత్రములు 27 ఒక్కొక్కపుస్తకం | 45-00 |
| జాతక మర్మబోధిని | 60-00 |
| జాతక సరస్వతీ | 60-00 |
| ఉపాసనా పారిజాతము | 300-00 |
| నేమాని సంఖ్యాశాస్త్రం | 60-00 |

మోహన్‌పబ్లికేషన్స్ ఆన్‌లైన్ వెబ్‌సైట్ Devullu.com లో
రూ.500/- పైగా గ్రంథములు కొనుగోలు చేసిన వారికి
పోస్టు / కొరియర్ చార్జీలు ఉచితం

1000/- పైగా గ్రంథములు కొనుగోలు చేసిన వారికి
10%* డిస్కౌంట్ కూడా ఇవ్వబడును.

mohan PUBLICATIONS
ఆధ్యాత్మిక గ్రంథనిలయం

మోహన్‌పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట,
రాజమహేంద్రరం - 533101. ఆం॥ప్ర॥, ఇండియా
ఫోన్ : 0883 - 246 2565 సెల్ : 903 246 2565

MOHAN PUBLICATIONS
దేవుళ్ళు
Online Book Store
Devullu.com

క్యాష్ ఆన్ డెలివరీ (COD),
ఆన్‌లైన్ పేమెంట
సదుపాయం కలదు

Devullu.com